# డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్

(D.El.Ed.)

## ద్వితీయ సంవత్సరం

## పేపరు – 6(బి)

# ఎలిమెంటరీ స్థాయిలో మాతృభాషాబోధన

# పాఠ్యపుస్తక అభివృద్ధి మండలి


**కె. సంధ్యారాణి, ఐ.పి.ఓ.ఎస్**
కమీషనర్
పాఠశాల విద్యాశాఖ, ఆంధ్రప్రదేశ్, అమరావతి

**శ్రీమతి ఎమ్.వి. రాజ్యలక్ష్మి**
సంచాలకులు, రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణాసంస్థ,
ఆంధ్రప్రదేశ్, అమరావతి

**డా ॥ ఎస్.కె. జిలానీభాష**

ప్రొఫసర్, టీచర్ ఎడ్యుకేషన్ విభాగం
రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణాసంస్థ, ఆంధ్రప్రదేశ్, అమరావతి.

**డా ॥ కె. పాండురంగ స్వామి**
ప్రొఫెసర్, టీచర్ ఎడ్యుకేషన్ విభాగం
రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణాసంస్థ, ఆంధ్రప్రదేశ్, అమరావతి


## సహకారం - సమన్వయం


**డా ॥ ఎస్.డి.వి.రమణ**
కో-ఆర్డినేటర్ కరికులం & పాఠ్యపుస్తక విభాగం
రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణాసంస్థ,
ఆంధ్రప్రదేశ్, అమరావతి

**శ్రీ ఎ.డి.వి. ప్రసాద్**
లెక్చరర్,
జిల్లా విద్యాశిక్షణ సంస్థ,
దూబచర్ల, ప.గో.జిల్లా.



**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రచురణ,అమరావతి**


చట్టాలను గౌరవించండి
హక్కులను పొందండి

విద్యవల్ల ఎదగాలి
వినయంతో మెలగాలి

# ఎలిమెంటరీ స్థాయిలో మాతృభాషాబోధన
## (6 నుండి 8 తరగతులు)
## పేపరు : 6 (బి)


**రచయితలు :**

1. **శ్రీ గూడపాటి నారాయణ, యం.ఏ., యం.ఇ.డి.**
   లెక్చరర్; జిల్లా విద్యా శిక్షణ సంస్థ, రాయచోటి, కడపజిల్లా

2. **శ్రీ ఎ.డి.వి. ప్రసాద్, యం.ఏ, యం.ఇడి., యం.ఫిల్**
   లెక్చరర్, జిల్లా విద్యాశిక్షణ సంస్థ, దూబచర్ల, ప.గో.జిల్లా.

3. **డా॥యం.వి.వి. సత్యనారాయణ, యం.ఏ., యం.ఇ.డి., పి.హెచ్.డి.**
   రిటైర్డ్ లెక్చరర్; సి.ఆర్.ఆర్. బి.ఇడి. కళాశాల, ఏలూరు

4. **శ్రీమతి యస్.యస్.యం.యల్. పేరమాంబ, యం.ఏ., యం.ఇడి.**
   అధ్యాపకురాలు (డిప్యుటేషన్) ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్వాన్స్‌డ్ స్టడీస్ ఇన్ ఎడ్యుకేషన్
   రాజమహేంద్రవరం

**సంపాదకులు :**

1. **డా॥ దహగాం సాంబమూర్తి**
   రిటైర్డ్ ప్రిన్సిపాల్
   ప్రభుత్వ ఉపాధ్యాయ కళాశాల; వరంగల్

2. **శ్రీ కుందా భాస్కరరావు, బి.యస్సీ; యం.ఏ. (తెలుగు), యం.ఏ. (ఇంగ్లీష్), యం.ఇడి**
   రిటైర్డ్ సీనియర్ లెక్చరర్; జిల్లా విద్యా శిక్షణ సంస్థ, బోయపాలెం, గుంటూరు జిల్లా.

# ముందుమాట

నాగరిక సమాజాన్ని సృష్టించాలంటే విద్యావంతులైన పౌరులు అవసరం. శిశువును ప్రయోజకుడైన పౌరునిగా తీర్చిదిద్దాలంటే ఒక గురుప్రదమైన మార్గనిర్దేశకుడు అవసరం. అతడు జ్ఞాన సంపన్నుడైయుండడమే కాకుండా ఆదర్శప్రాయునిగానూ, బహుముఖ ప్రజ్ఞాశీలిగానూ, సృజనశీలిగానూ, తాత్వికునిగానూ భవిష్యత్ దార్శనికునిగానూ ఉండాలి. కాలం ప్రాచీనమైనా, నవీనమైనా భారతీయ సమాజం ఎప్పుడూ ఉపాధ్యాయుడిని ఘనమైన వ్యక్తిగా గౌరవిస్తూ తమ సంతతి సంక్షేమంకోసం అతడి నుండి ఎంతో ఆశిస్తుంది. సమాజంలో అతడూ ఒక సభ్యుడే అయినప్పటికి అతడి మాటలు చేతలు అన్నీ ఆదర్శనీయంగా ఉండాలని భావిస్తుంది. ఇలాంటి మహోన్నతమైన అధ్యాపనాన్ని వృత్తిగా స్వీకరించాలని నిర్ణయించుకున్న వ్యక్తిని ఉత్తముడైన ఉపాధ్యాయునిగా రూపుదిద్దడానికి సర్వోన్నతమైన విద్యాక్షేత్రం కావాలి.

ఒక సగటు వ్యక్తిని ఉపాధ్యాయునిగా తీర్చిదిద్దాలంటే అకుంఠిత దీక్షాతత్పరత కలిగిన మహోపాధ్యాయులు కావాలి. అందుకే పాఠశాల విద్యలో ఉపాధ్యాయవిద్య అత్యంత ప్రాధాన్యతాంశంగా గుర్తింపుపొందింది. ఉపాధ్యాయుని ద్వారా సామాజికాభ్యున్నతిని ఆశిస్తున్నప్పుడు ఉపాధ్యాయుడిని రూపొందించే సందర్భంలో అత్యంత జాగరూకత ఆవశ్యకం. ఉపాధ్యాయ విద్యార్థికి కేవలం విషయజ్ఞానం అందించడం, బోధనా పరిజ్ఞానం పెంపొందించడం మాత్రమే సరిపోదు. విద్యార్థుల ద్వారా భవిష్యత్తును వీక్షించగల శక్తియుక్తులను నేర్పాలి. సజీవమూ నిత్యచైతన్యశీలమూ అయిన విద్యార్థులలో జ్ఞానకాంక్షను పెంపొందింపజేసే మెళకువలను అభ్యసింపజేసే నైపుణ్యాలను అవగతం చేయించాలి. మానవీయత గుబాళించే ఆత్మీయతా ప్రవర్తనను అనువర్తింపజేయాలి. భారతీయ విద్యాతత్వాన్ని, విద్యయొక్క పరమావధిని అర్థం చేసుకుని వ్యవహరించడాన్ని ఆకళింపు చేయించాలి.

ప్రాథమిక పాఠశాల స్థాయి ఉపాధ్యాయునిగా రూపొందడమంటే బహుముఖ ప్రజ్ఞాపాటవాలను పుణికిపుచ్చుకోవడం అన్నమాట. అంటే ఉపాధ్యాయుడు చక్కని కథకుడుగా, గాయకుడుగా, నటుడుగా, చిత్రకారుడుగా, క్రీడాకారుడుగా, వైద్యునిగా, ఆధునిక సాంకేతిక నిపుణుడుగా వ్యవహరించగలగాలి. ఇలా బహుళ అంశాలలో ప్రవేశము, ప్రావీణ్యము కలిగి ఉండాలి. వీటిని సాధింపజేయాలి అంటే ఉపాధ్యాయుడు విద్య ఆయా అంశాలన్నింటినీ మమేకం చేసుకున్నదై ఉండాలి. ఉపాధ్యాయలపై రూపొందిన జాతీయ విద్యాప్రణాళిక చట్రం – 2009 ఉపాధ్యాయుడు విద్యార్థుల సాంఘిక, సాంస్కృతిక నేపథ్యాలను సంపూర్ణంగా అవగాహనచేసుకొని వారి వికాసానికి కృషిచేయాలని ఇందుకోసం సమాచార సాంకేతిక పరిజ్ఞానం, స్థానిక కళలు సంస్కృతులను బోధనా ప్రణాళికతో మమేకం చేసుకోవాలి. ఆ సందర్భంలో ఉపాధ్యాయుడు మననశీల అభ్యాసకుడు (Reflective Practitioner) గా ఉండాలని సూచించింది. కాబట్టి ఉపాధ్యాయ విద్యలో బాలలను వారి బాల్యాన్ని అర్థంచేసుకోవడం, నేర్చుకోవడం ఎలాగో నేర్పే పద్ధతులలో ప్రావీణ్యం పొందడం అత్యంత ఆవశ్యకం. సమకాలీన అంశాలను మేళవించుకుంటూ తన బోధనను సుసంపన్నం చేసుకోవడం. ఎంతో కీలకం. కాబట్టి ఉపాధ్యాయ శిక్షణ దశలోనే ఆయా అంశాలలో ఉపాధ్యాయ / విద్యార్థులకు సంపూర్ణ శిక్షణనివ్వాలి. వ్యవస్థకు యోగ్యమైన ఉపాధ్యాయుని అందించడంలో శిక్షణ సంస్థలే పూర్తిబాధ్యత వహించాలి. ఏ చిన్నపాటి అలసత్వం జరిగినా అది పటిష్టమైన శిక్షణ ద్వారానే పరమోన్నతమైన ఉపాధ్యాయులను రూపొందించగలం. నూతనంగా రూపొందించిన ఈ పాఠ్యపుస్తకాలు జ్ఞాననిర్మాణాత్మక అభ్యసన సిద్ధాంతాలు, పరస్పరాశ్రిత విద్యాతత్వం, సమ్మిళితబోధనా విధానాలు మొదలయిన నవీన భావనలతో నిర్మితమైనాయి. వీటన్నింటిని అర్థంచేసుకొని తమ ఆదర్శవంతమైన బోధనల ద్వారా అత్యంత ప్రజ్ఞాపాటవాలు కలిగిన ఉపాధ్యాయులను తీర్చిదిద్దడంలో అధ్యాపకులందరూ విశేషంగా కృషిచేస్తారనీ, ఉపాధ్యాయ విద్యార్థులు కూడా బోధనా సిద్ధాంతాలను విద్యయొక్క పరమావధిని అర్థంచేసుకొని విద్యా లక్ష్యాలను సాధించేందుకు తమ జీవిత అనుభవాలను అన్వయించుకుంటూ ఆదర్శ ఉపాధ్యాయులుగా రూపొందుతారని ఆశిస్తూ...

**సంచాలకులు**
రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ
అమరావతి, ఆంధ్రప్రదేశ్

# అధ్యాపకులకు సూచనలు....

ఉపాధ్యాయ విద్య పై రూపొందిన జాతీయ విద్య చట్రం – 2009 ఉపాధ్యాయ విద్య ప్రాధాన్యతను వివరిస్తూ పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలంటే ఉపాధ్యాయులను రూపొందిస్తున్న దశలోనే అత్యంత జాగరూకతతో వ్యవహరించాలని సూచించింది. బాధ్యతాయుతమైన ఉపాధ్యాయులు ద్వారానే బాలల బాల్యానికి భరోసా ఇవ్వగలమని అలాంటి వారిని తయారుచేయడంలో ఉపాధ్యాయ శిక్షణ సంస్థలు నూతన దృక్పథంతో పనిచేయాలని తెలిపింది. అందులోని మౌలిక సూత్రాలను ఆధారంగా చేసుకుని ఈ పాఠ్యపుస్తకాలు రూపొందాయి. వీటిని అర్థవంతంగా ఉపయోగించడంలో అధ్యాపకులు కొన్ని మెళకువలు అనుసరించాలి.

- ఉపాధ్యాయ విద్య – జాతీయ విద్యా చట్రం – 2009 ని క్షుణ్ణంగా చదవాలి.
- ఆయా అంశాలకు చెంది విద్యాప్రణాళికలో పేర్కొన్న కీలక భావనలను వాటి తాత్వికతను అర్థంచేసుకోవాలి. (ఇందుకోసం సిలబస్‌లో పేర్కొన్న ముందుమాటలను పరిశీలించండి).
- జాతీయ విద్యా ప్రణాళిక చట్రం–2005లోని మౌలిక అంశాలయిన – జ్ఞాన నిర్మాణ విద్యా తత్వం – నిర్మాణాత్మక అభ్యసన సన్నివేశాల కల్పన మొదలైన భావనలను అర్థంచేసుకుని వాటిని ఉపాధ్యాయ విద్యకు మిళితంచేసి బోధన జరపాలి.
- ఆంధ్రప్రదేశ్ విద్యాప్రణాళికా పత్రం – 2010లో పేర్కొన్న 'పరస్పరాశ్రిత విద్యావిధానం' భావనను అధ్యాపకులు తమ తరగతిగది బోధనకు అన్వయించాలి.
- విద్యాహక్కుచట్టం – 2005 సూచించిన మార్గదర్శకాలను ఉపాధ్యాయవిద్యకు గల సంబంధాన్ని గుర్తించి బోధన జరపాలి.
- పాఠశాలలోని భావనల బోధనతోపాటుగా ఆయా సందర్భాలలో సూచించిన రచనలను తప్పనిసరిగా ఉపాధ్యాయుడు విద్యార్థులతో చదివించి చర్చించాలి.
- బోధనాంశాలకు అవసరమైన అనుబంధ అంశాలను చదివించి ఆయా విద్యావేత్తల దార్శనికతలు పేర్కొన్న విద్య తాత్వికతను పరమావధిని ఉపాధ్యాయ విద్యార్థులు గుర్తించేలా కృషిచేయాలి.
- పాఠశాల విద్య ద్వారా అమలవుతున్న విద్యాప్రణాళిక, పాఠ్యపుస్తకాలు క్షుణ్ణంగా పరిశీలించి బోధనా శాస్త్రానికి పాఠ్యపుస్తకంకు గల సంబంధాన్ని ఆవిష్కరింపజేయాలో ఉపాధ్యాయుడు విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించాలి.
- ఉపాధ్యాయ విద్యలోని ప్రతి బోధనాంశానికి తనదైన 'ఆత్మ' వుంటుంది. అధ్యాపకులు మూలసూత్రాలను పరిశీలించి విశ్లేషించుకోగలిగినపుడే దానిని గుర్తించగలరు. కాబట్టి అయా అంశాలకు చెందిన ఇతర రచనలు తప్పనిసరిగా చదవాలి. వాటిని ఉటంకిస్తూ ఉపాధ్యాయ విద్యార్థులను 'నిత్య అభ్యాసకులుగా' మారేందుకు శిక్షణనివ్వాలి.
- ప్రాథమిక పాఠశాల స్థాయి విద్యార్థుల స్వభావం, కుటుంబ నేపథ్యం, సామాజిక సందర్భం మొదలైనవన్నీ పరిగణనలోకి తీసుకొంటూ పాఠశాలను విశ్లేషించాలి.

# విషయసూచిక


| | |
|---|---|
| 1. భాష గురించి | 1-41 |
| 2. భాష - సమాజం | 42-72 |
| 3. సాహిత్యాధ్యయం - ఆవశ్యకత - అవగాహన | 73-116 |
| 4. పిల్లలు - భాష - అభ్యసనం | 117-126 |
| 5. భాషాసామర్థ్యాలను అభివృద్ధిపరచడం | 127-157 |
| 6. భాషా వనరులు వాటి వినియోగం, భాషాభివృద్ధి కార్యక్రమాలు | 158-189 |
| 7.భాషాభ్యసనం - ఆశించిన ఫలితాలు - వ్యూహాలు | 190-212 |
| 8.భాష - బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణ ప్రణాళికలు ఎలిమెంటరీస్థాయి | 213-252 |
| 9. భాషా మూల్యాంకనం | 253-277 |
| 10.భాషోపాధ్యాయుల వృత్తిపరమైన అభివృద్ధి | 278-288 |

# 1. భాష గురించి

అమరావతీ పట్టణమున బౌద్ధులు విశ్వ
విద్యాలయములు స్థాపించునాడు
ఓరుగల్లున రాజ వీర లాంఛనముగా
పలు శస్త్రశాలలు నిలుపునాడు
విద్యానగర రాజ వీధులన్ కవితకు
పెండ్లి పందిళ్లు కల్పించునాడు
పొన్నూరికి సమీపమున ఆంధ్ర సామ్రాజ్య
దిగ్జయ స్తంభ మెత్తించునాడు
ఆంధ్ర సంతతికే మహితాభిమాన
దివ్య దీక్షా ముఖస్ఫూర్తి తీవరించె
ఆ మహావేశ మర్ధించి ఆంధ్రులార!
చల్లుడాంధ్ర లోకమున నక్షతలు నేడు!

* * * * * * * * * * * *

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అవతరణకు నాలుగు దశాబ్దాల ముందే పై రీతిగా కవివాణి ప్రబోధించింది. ఈ ప్రబోధం ఆనాడు ఎంత సార్థకమో పది జిల్లాలతో కొత్త రాష్ట్రం అవతరించిన ఈనాడు కూడా అంతే సార్థకం!

అమరావతి! ఈ పేరు వింటేనే ఆంధ్రులందరికీ ఓ కమ్మటి అనుభూతి! ఆ పట్టణం చుట్టూ పరిమళించిన వసివాడని పారిజాత సౌరభం; ఇప్పటికీ ఒడలు పులకరింప చేస్తూనే వుంది. ఒక్క అమరావతే కాదు, తెలుగుతల్లి గజ్జె కదలించి ఘల్లుమనిపించిన ఓరుగల్లు; తెలుగు భాషా సుందరికి పెళ్లిపందిళ్లు వేసిన విజయనగర రాజవీధులు, భాషాలలామకు కులుకు పలుకులు నేర్పిన రాయలసీమ; పలుకులమ్మ పసిడి మాగాణి పలనాడు; కండగల తెలుగు భాష గుండె చప్పుడు కొండవీడు; చిన్నారి పొన్నారి తెలుగు కైతల సిరికి నారు పోసి నీరు పోసిన గోదావరి; వేడుక గొలిపే వాడుక భాషకు వేదికగా నిలిచి ఊపిరిలూదిన ఉత్తరాంధ్ర; కోటిరతనాల వీణలు మ్రోగించిన తెలంగాణ – ఇవన్నీ తెలుగు వాడి మదిలో ఎప్పటికీ మెదిలే తీపి జ్ఞాపికలు! తెలుగు భాషకు కరదీపికలు!

ఇంతటి ఘనకీర్తి కల్గిన తెలుగు భాష చరిత్రకు ; సాహిత్య సాంస్కృతిక వారసత్వ సంపదకు చెయ్యెత్తి జై కొడదాం! ఎలుగెత్తి పాడదాం! చక్కటి తెలుగు నేర్పే ఛాత్రోపాధ్యాయులుగా 'భాష గురించి' ముందుగా తెలుసుకుందాం!!

× × × × × ×

**పరిచయం :-**

భాష కేవలం మానవులకే ఉన్న ప్రత్యేక లక్షణం. మనిషి సంఘ జీవి. సంఘంలో పరస్పర భావ వినిమయసాధనం భాష. సృష్టిలోని ప్రాణులన్నింటిలో మానవుడు ప్రజ్ఞావంతుడు. భాష అనంతమైనది. మానవ నిర్మితమైనది. విద్యలో విజ్ఞానార్జనలో భాషకున్న ప్రాధాన్యత చాలా గొప్పది. భాష వ్యవస్థీకృతం. ప్రతి భాషకూ ఒక నిర్మాణ సూత్రం ఉంటుంది. భాష వల్ల మానవుడు భావ వ్యక్తీకరణ భావ స్వీకరణ ప్రయోజనాలు నెరవేర్చుకుంటున్నాడు. పశుపక్ష్యాదులు కూడా భావ ప్రకటన చేస్తాయి. కానీ మనిషి మాత్రమే భాషను భావ ప్రసారానికీ వర్తమాన, భూత, భవిష్యత్ కాలాలలో వినియోగిస్తాడు. ప్రపంచంలోని భాషలన్నింటినీ భాషా శాస్త్రజ్ఞులు కొన్ని కుటుంబాలుగా వర్గీకరించారు. ప్రపంచంలో వాడుకలో ఉన్న భాషల స్వభావాలు, స్వరూపాలు పరిశీలించిన

భాషా శాస్త్రజ్ఞులు భాషల పుట్టుకల గురించి పరిశీలనలు, ప్రయోగాలు చేసి కొన్ని భాషోత్పత్తి వాదాలను ప్రకటించారు. మానవ సమాజం భావ వినిమయ సాధనంగా భాషను సృష్టించుకుంటే ప్రతి మానవ సమాజం మాతృభాషను సృష్టించుకుంది. నేర్చుకోవడంలో మాతృభాషది ప్రధాన పాత్ర. భాషలు ఆర్జించే విధానం గురించి అనేక అనుమానాలున్నాయి. విద్యార్థులు వివిధ భాషేతర అంశాలు అభ్యసించడంలో భాషది ప్రధాన పాత్ర. భాషా నిర్మాణం ప్రతి భాషకూ విలక్షణంగా ఉంటుంది. భాష పరిణామశీలి అని ప్రాచీన సాహిత్యమున్న ఏ భాషను పరిశీలించినా స్పష్టమవుతుంది. భాష కాలక్రమేణా మారే స్వభావం కలది కాబట్టి కాలక్రమాన వర్ణాలు, వ్యాకరణ నిర్మాణం మారినట్టుగానే పదాల అర్థాలు కూడా మారతాయి. కొత్త నీటిని కలుపుకొని గలగల పారే నదిలా భాష కాలంతో పాటు మారుతున్న సరికొత్త పదజాలాన్ని; మారే పలుకుబడినీ కలుపుకుంటూ నిరంతరం ప్రవహిస్తేనే అది సజీవ భాషగా కళకళలాడుతుంది. ప్రజల నాల్కలపై నాట్యమాడుతుంది!

**లక్ష్యాలు :-**

ఈ అధ్యాయం చదివిన తర్వాత ఛాత్రోపాధ్యాయులు

- భాష యొక్క స్వభావ, స్వరూపాలు, దాని అవశ్యకత, అవసరం, భాషా నిర్మాణం గురించి అవగాహన పొందుతారు.
- భాషకు పలు ప్రయోజనాలు ఉన్నాయని గ్రహిస్తారు.
- మన మాటల ప్రభావం మనపై ఇతరులపై ఎలా ఉంటుందో తెలుసుకుంటారు.
- మానవ, జంతు భాషలకు మధ్య గల తేడాలు గుర్తిస్తారు.
- ప్రపంచంలో పలు భాషా కుటుంబాలు ఉన్నాయని గ్రహిస్తారు.
- భాషా నిర్మాణం గురించి సమగ్ర జ్ఞానం పొందుతారు.
- మాతృభాష ప్రాధాన్యతను, ఆవశ్యకతను గుర్తిస్తారు.
- మాతృభాష ద్వారా అవగాహన సులభమని గ్రహిస్తారు.
- భాషను గురించిన అనుమానాలపై చర్చించి అవగాహన పొందుతారు.
- భాషేతరాంశాల బోధన, అభ్యసనంలో భాష పాత్రను అవగాహన చేసుకుంటారు.
- విద్యా ప్రణాళిక అంతటా భాష ప్రాధాన్యతను అవగాహన చేసుకుంటారు.
- భాషా వికాసమే అన్ని వికాసాలకు మూలం అని తెలుసుకుంటారు.
- తెలుగు భాషా నిర్మాణం, ధ్వని, అర్థపరిణామం గురించి సమగ్ర అవగాహన పొందుతారు.

## 1.1. భాష యొక్క భాషా స్వభావం, నిర్మాణం

### 1.1.1. భాష – అవశ్యకత

విద్యలో విజ్ఞానార్జనలో భాషకున్న స్థానం చాలా గొప్పది. ఏ విషయానికైనా బోధనా మాధ్యమం భాషే! విద్యార్థి వివిధ అంశాలను విని, చదివి అర్థం చేసుకొని తిరిగి ప్రకటించడానికి కూడ భాషే సాధనం. అందువల్ల అందరు ఉపాధ్యాయులు, ఛాత్రోపాధ్యాయులు భాష అవశ్యకతను, ప్రాధాన్యతను అవగాహన చేసుకోవాలి.

మానవుని ప్రత్యేకతకు, ప్రజ్ఞకు మూలకారణం అతనికి గల భాషా సంపద. భావ వ్యక్తీకరణకు, భావ గ్రహణానికీ ఉపయోగపడే అర్థవంతమైన పదాల కూర్పు భాష. ఇలాంటి ప్రత్యేకత గల భాష వల్లనే మానవుడు తరతరాల వైజ్ఞానిక, సాంస్కృతిక వారసత్వ సంపద పొందగలుగుతున్నాడు. భాష మూలంగానే అతడు తన ఆనందాన్ని, అనుభూతులను, ఆలోచనలను ఉద్వేగాలను భావనల రూపంగా వ్యక్తీకరించగలుగుతున్నాడు. భాష లేకపోతే మానవ చరిత్ర గురించి మనకు ఇంత తెలిసేది కాదు. భాష వల్ల మానవజాతి ఔన్నత్యం, సంస్కృతి,

సభ్యత, నాగరికతలు తెలుస్తాయి. భాష మూలంగానే మానవుడి జ్ఞాన సంపద అభివృద్ధి చెంది ఆధునికత సంతరించుకొని ప్రపంచంలో ముందడుగు వేస్తున్నాడు. సాంఘిక జీవనాన్ని సులభతరం, సుఖమయం చేసుకోగలుగుతున్నాడు. పరిసరాలకు అనుగుణంగా ప్రవర్తిస్తూనే, పరిసరాలను తనకు అనుకూలంగా మలచుకోగలుగుతున్నాడు. పంచభూతాలను తన ఆధీనంలోనికి తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. అసాధ్యాలను సుసాధ్యం చేసుకొంటున్నాడు. అన్ని విషయాల్లోనూ అజేయుడుగా మారుతున్నాడు.

**1.1.2. భాష–స్వభావం**

మానవుడికి ఉన్న అమూల్యమైన శక్తి భాష! మాట్లాడగలగడం! భాష మాట్లాడలేని మానవుడు లేనట్లే భాష మాట్లాడ గలిగిన మానవేతర ప్రాణి ఏదీ లేదు. మెదడులో గానీ ముఖ యంత్రంలో గానీ లోపాలున్న కొద్ది మందికి తప్ప మిగిలిన మానవులందరికీ మాట్లాడే శక్తి ఉంది. మానవుడు తన మనస్సులోని అభిప్రాయాలను బహిర్గతం చేయడానికి నోటి ద్వారా వచ్చే ధ్వనులే భాష. మనకు తెలియని భాష ఒకరు వ్యవహరిస్తున్నప్పుడు మనం వినేవి ఆ వ్యక్తి నోటి ద్వారా చేసే రకరకాల ధ్వనులే. ఆ భాష తెలిసిన వారికి ఆ ధ్వనుల అర్థం బోధపడుతుంది. తెలియని వారికి వాటి అర్థం బోధపడదు. కాబట్టి భాష అంటే కొన్ని ధ్వనుల సముదాయమే అని దీని వల్ల తెలుస్తుంది. కోతులు, పశుపక్ష్యాదులు కూడా భయం, ప్రేమ, ఆకలి మొదలైన భావాలను సూచించడానికి అరుపులు అరుస్తాయి. అయితే మానవ భాషకి, పశుపక్ష్యాదుల అరుపులకీ మధ్య ఎంతో భేదం ఉంది.

మానవులను జంతు ప్రపంచం నుండి వేరు జేసి చూపేది భాష. భాష వలననే మనిషి ప్రత్యేకతను సంతరించుకున్నాడు. ప్రపంచంలో ఉన్న ప్రతి భాష కాలానుగుణంగా సామాజిక అవసరాలకు తగినట్లుగా మార్పుకు లోనవుతుంది. ఈ మార్పుల వల్ల భాషల్లో బహురూపత, వైవిధ్యం ఏర్పడతాయి. సందర్భాన్ని ప్రయోగాన్ని, పరిసరాల్ని బట్టి ఒక మాటకు పలు అర్థాలు ఆపాదించుకోవలసి వస్తుంది. రాజకీయ, ఆర్థిక, భౌగోళికాది కారణాల వల్ల మతాలు, ఆచారాల వల్ల, ఇతర భాషల ప్రభావాల వల్ల సమకాలీన పరిస్థితుల వల్ల కూడ అర్థాలు మారుతుంటాయి.

భాష స్వభావాన్ని బట్టి భాషా శాస్త్రవేత్తలు కొన్ని భాషా భేదాలను చెప్పారు. అవేమంటే 1. ఉద్దేశ పూర్వక ఉచ్చారణ (Intentional Utterance) 2. ఉత్పాదకత (Productivity) 3. స్వచ్ఛందత (Voluntary) 4. పరస్పర వినిమయం (Inter Change ability) 5. ప్రత్యేకత 6. కాలాంతర ప్రాప్తి 7. దేశాంతర ప్రాప్తి 8. సాంస్కృతిక ప్రసరణం 9. ద్వివిధ నిర్మాణం 10. సృజనాత్మకత.

**ఉద్దేశ పూర్వక ఉచ్చారణ :**

ప్రతి భాష విశిష్టములైన కొన్ని వర్ణాలుగా, విశిష్టమైన పదాంశాలుగా వింగళించడానికి వీలుగా ఉంటుంది. ఈ వర్ణాల యొక్క కూడిక చేతనే మానవ భాష ఏర్పడింది. ఉదా॥ చిలుకలు, గోరువంకలు కొన్ని మాటలను పలుకుతాయి. అవి అభ్యాసవశం చేతనే గానీ, ఉద్దేశపూర్వకంగా కాదు. చిలుకల నమ్మేవాడు చిలుకతో దీని ధర 'ఇంత ఉండునా' అని అడిగితే దానికి చిలుక అందుకు 'సందేహమా?' అని అంటుంది. దీనిని బట్టి చిలుకకు తాను పలికే మాటకు అర్థం తెలియదని తెలుస్తుంది. చిలుక "సందేహమా?" అనే పదాన్ని యాంత్రికంగా వల్లె వేసిందే కాని వర్ణాల పదాల అర్థం దానికి తెలియదు. మొత్తం వాక్యం ఉచ్చరించడం కూడా ఇట్లానే చేస్తుంది. మానవ భాషలో ఉద్దేశ పూర్వక ఉచ్చారణ ఉంటుంది కాని పశుపక్ష్యాదులలో ఇది కనిపించదు.

**ఉత్పాదకత** (Productivity)**:**

భాషలోని నిర్మాణాంశాలను కలిసి కొత్త రూపాన్ని ఉత్పన్నం చేయవచ్చు. శిశువులు పెద్దలు మాట్లాడిన వాటినే తిరిగి పలుకుతారు. కొంతకాలమైన తర్వాత తామే స్వయంగా కొత్త నిర్మాణాన్ని చేయగలుగుతారు. ఉదా॥ నాన్న వస్తున్నాడు – పిలుస్తున్నాడు. నాన్నను చూడు, నాన్నను పిలు' మొదలైన వాక్యాలలో ఉన్న 'నాన్న' అన్న పదం విశిష్టంగా గుర్తించి తనక్కావల్సిన పద్ధతిలో అన్న వస్తున్నాడు, అన్న పిలుస్తున్నాడు, అన్నను చూడు, అన్నను

పిలు' మొదలైన విధంగా ఉపయోగించుకొంటాడు. ఈ ఉత్పాదకత మూలంగా, మానవ వ్యవహారంలో కొత్త నిర్మాణం సాధ్యమవుతుంది. చిలుక పలుకులకు ఈ రకమైన ఉత్పాదకత లేదు. చిలుకలకు నేర్పిస్తే "చుట్టాలొచ్చారు" అని అనగలవు గాని, ఎవరు వచ్చినప్పటికీ వాటి ప్రకటన విధానంలో మార్పు ఉండదు. చుట్టాలు అనటానికి బదులుగా మిత్రుడు, శత్రువు, దొంగలు మొదలైన మాటలను వాడటం వాటికి సాధ్యం కాదు. యాంత్రికంగా వల్లె వేయడమే కాని నూతన పదజాలంతో వాక్య నిర్మాణం చేయడం చిలుకలకు సాధ్యం కాదు.

**స్వచ్ఛందత** (Valuntary) **:**

నిజంగా వాచికమైన శబ్దానికీ, వాచ్యమైన వస్తువుకీ సంబంధం ఎంత మాత్రమూ లేదు. ఆంగిక ముద్రలు, చిత్రాలు, ఇతర విధములైన సంకేతాలు, సాధారణంగా వస్తువు యొక్క స్వరూపాన్నో, స్వభావాన్నో ప్రకటిస్తాయి. ఉదా॥ తేనెటీగలు, చింపాంజీలు ధ్వని చేయడంతో పాటు దిశను దూరాన్ని ఉద్దేశిస్తూ అనుకరిస్తాయి. ఎర్రదీపాన్ని చూపితే వాహనాలను ఆపాలనీ, ఆకుపచ్చ దీపాన్ని చూపితే వాహనాలను ముందుకు పోనియ్యాలనేవి సంకేతాలు. ఇవి కొన్ని నిబంధనలను బట్టి ఏర్పడ్డవి. టెలిఫోన్‌లో వాడేవి కూడా సంకేతాలే! ఇట్లా అనేక విధాలయిన సంకేతాలు ఉన్నాయి. పెక్కు సంకేతాలు భాషా సంబంధమయిన సంకేతాల వలె స్వచ్ఛంధాలై ఉంటాయి.

**పరస్పర వినిమయం** (Inter Change ability) **:**

వక్త ఉచ్చరించిన మాటల వల్ల ధ్వని తరంగాలేర్పడతాయి. ఆ ధ్వనుల వల్ల శ్రోత ప్రచోదనం / ప్రేరణ పొందుతాడు. అంటే ప్రతి క్రియ ఉంటుందని అర్థం. అది క్రియారూపంలో ఉండవచ్చు. వాగ్రూపంలో ఉండవచ్చు. ఎట్లాగంటే ఒకడు "అదుగో పాము" అనగానే ఒకడు పరుగెత్తుకెళ్లి కర్రనో, రాతినో పట్టుకురావడాన్ని 'క్రియా రూప ప్రతిక్రియ' అంటారు. మరొకడు "ఎక్కడ" అని ప్రశ్నిస్తాడు. దాన్ని 'వాగ్రూప ప్రతిక్రియ' అంటారు. ఒకే ప్రచోదనానికి ఉభయ విధ ప్రక్రియలు ఒకే కాలంలో ఉండటంలో ఆశ్చర్యం లేదు. వాచిక సంకేతాలకి మాత్రమే వాచ్యత, శ్రావ్యత అనే రెండు ధర్మాలున్నాయి.

**ప్రత్యేకత** (Specialisation) **:**

ప్రతి భాషకూ ఒక ప్రత్యేకమైన వ్యవస్థ ఉంటుంది. కొందరికి తమ భాష మాత్రమే తెలిసి ఉండడం చేత అన్యభాషలు భాషావాచ్యాలు కావనీ, వానికి ఒక పద్ధతి లేదనే అంటారు. ఉదా॥ బాలుడు వస్తున్నాడు – బాలిక వస్తోంది. దీనినే హిందీలో లడకా ఆతాహై, లడకీ ఆతీహై. అదే ఆంగ్లంలో A boy Comes, A Girl Comes. ఆంగ్లేయునికి తెలుగు, ఇంగ్లీషు భాషల వాక్య నిర్మాణ వైఖరి అలజడిని కలిగిస్తుంది. అది వాని నిర్మాణ క్రమాన్ని బట్టి, అర్థస్ఫురణను బట్టి అభివ్యక్తమవుతుంది.

**కాలాంతర ప్రాప్తి :**

మానవభాష కాలాలతో సంబంధం లేకుండా వాడటానికి / వినియోగించడానికి వీలు కలిగి ఉంటుంది. మానవుడు వేదయుగాన్ని గురించి, వర్తమాన యుగాన్ని గురించి, భవిష్యత్ యుగాన్ని గురించి సమానంగానే మాట్లాడగలడు. శ్రోతగూడ దానిని అవగాహన చేసుకోగలడు.

**దేశాంతర ప్రాప్తి :**

మానవ భాష దేశాంతర మందునూ వ్యవహృతం కాగలదు. యాత్ర సహాయం వల్ల టేప్‌రికార్డర్ నిర్మించి దేశంతరానికీ తీసుకొని వెళ్ళవచ్చు. ఆ రికార్డర్ నుంచి వచ్చే శబ్దాన్ని భాష అనవచ్చా? అని ప్రశ్న. ఔపచారికంగా భాష అని అనవచ్చేమో గాని శాస్త్ర దృష్టితో అట్లా అనడానికి వీల్లేదు. వక్తముఖ నిర్గత ధ్వనులకే భాషా సంకేతయోగ్యత ఉంది. కాని విద్యుదయస్కాంత తరంగాలుగా మారిన ధ్వనులకు ఆ యోగ్యత లేదు. ఒక పుస్తకం భాష కానట్లే యాంత్రిక సాధన కూడ భాష అని వాదించవచ్చు. కాని భాష యొక్క బహిస్స్వరూపమైన ధ్వని సముదాయము నిలిచి ఉన్నది కాబట్టి దీనిని కూడ భాషగా పరిగణించవచ్చు.

**సాంస్కృతిక ప్రసరణం :**

భాష ఒకరి నుంచి వేరొకరికి ప్రసరిస్తుంది. భాష ఒక తరం నుంచి తరువాత తరాలకు ప్రసరిస్తుంది. సంస్కృతి వలెనే భాష కూడ తరతరాలకు ప్రసరిస్తుంది. It is the transmitter from one generation to other generation.

పై లక్షణాలను పరిశీలిస్తే భాష సాంకేతికమనీ, యాదృచ్ఛికమనీ, సామాజికమనీ, అర్థవంతం అనీ, అనుకరణ సాధ్యమనీ, నిర్మాణాత్మకమనీ, పరిణామశీలి అని మనం గ్రహిస్తాం.

**1.1.3. భాష – నిర్మాణం :**

భాష అనంతమైనది. మానవ నిర్మితమైనది. అది ధ్వని సంబంధితం. వాక్య నిర్మితం. కట్టుబాట్లు నియమాలు కలది. వివిధ ప్రక్రియల సృష్టి వల్ల, భాషా రూపాల సృజన వల్ల భాష క్రమ వికాసం పొందుతుంది. భాష సార్వత్రికం, సార్వజనీనం! భాషకున్న ప్రాథమిక నియమాలు, నిబంధలన్నీ సార్వత్రికాలు, అన్ని భాషలకూ సమానంగా వర్తించేవి. ప్రతి భాషలోనూ హల్లు – అచ్చు – హల్లు – అచ్చు (CVCV) పద్ధతే ఉంటుంది. హల్లులను అచ్చులేకుండా పలకలేము. ఒక వేళ పలికినా రెండు మూడు హల్లులకు మించి ఒకటిగా పలకలేము. మూడు హల్లులు సంయుక్తాక్షరాలు గల పదాలు ఏ భాషలోనైనా పది కూడా ఉండవు. స్త్రీ, శాస్త్రం, Street, Structure ఎంత వెదికినా STR ధ్వనులతో తప్ప ఇతర ధ్వనులు (హల్లులు) గల సంయుక్తక్షరాలు ఎక్కడా కన్పించవు. నాలుగు హల్లులు గల సంయుక్తాక్షర పదాలు అసాధ్యం.

ప్రపంచంలోని ఏ భాష అయినా ఒకే రకమైన మౌలిక నియమాలను పాటిస్తుంది. పదాలను ఉచ్చరించడంలో శబ్దానికి / ధ్వనికి ప్రాధాన్యతనిస్తారు. అందువల్ల ఏ పదాన్ని ఎలా పలకాలో ఏఏ సందర్భాలలో ఎలాంటి మార్పులకు అన్వయించుకోవాలో పిల్లలు నిర్ణయించుకోగలరు. సాధారణంగా ప్రతి పదంలో అచ్చు, హల్లు శబ్దాలు ఏకాంతరంగా కొనసాగుతూ ఉంటాయి. అయితే ఒక పదంలోని అక్షరాల సంఖ్య శబ్దాల / ధ్వనుల సంఖ్యకు సమానంగా ఉండకపోవచ్చు. ఉదా :– Psychology. ఈ పదంలో అక్షరాలు పది. శబ్దాలు 9. వాటిలో 5 అచ్చులు, నాలుగు హల్లులు ఉన్నాయి. ప్రపంచంలో ఏ భాషనైనా ఏ లిపిలోనైనా రాయవచ్చు. ఇందుకోసం శబ్దాలను అక్షర రూపంలో వ్యక్తపరిచే ప్రయత్నం జరుగుతుంది. అయితే కొన్ని రకాల ఉచ్చారణలకు సమానమైన అక్షర రూపాలు ఉండకపోవచ్చు. ఒక పదాన్ని అందులో గల శబ్ధాలను బట్టి ఉచ్చరించడంలో అన్ని సందర్భాలలోనూ ఒకే రకమైన ఉచ్చారణ ఉండదు. సందర్భానుసారంగా ఉచ్చారణ మారుతుంది.

ఉదా :– Sound of 'e' is differ from 'elephant' to 'make'. ప్రతి పదాన్ని మానవుడు తనకు సౌలభ్యమైన క్రమంలోనే ఉచ్చరించే ప్రయత్నం చేస్తాడు. అందుకోసం 'అచ్చు' తర్వాత 'హల్లు' రావడం, హల్లు తర్వాత 'అచ్చు' రావడం రెండు లేదా మూడు హల్లులు తర్వాత 'అచ్చు' రావడం అదే క్రమంలో మాత్రమే పద ఉచ్చారణ ఉ ంటుంది. (ఉదా:– రోమన్ లిపిలో సులభంగా అర్ధం చేసుకోవచ్చు)

పలక (ప్ + అ + ల్ + అ + క్ + అ)

PALAKA - రోమన్ లిపి

cv cv cv

సాధారణంగా పదాల నిర్మాణం క్రింది క్రమాలలో ఉంటుంది.

C V C V

C C V

C C C V

ఇదే భాష యొక్క మూలరూపం C V C V నిర్మాణ ప్రక్రియ.

(C. Consonets, V. Vowels)

| | | | |
|---|---|---|---|
| ఉదా :– | బడి | తలుపు | పలక |
| | BADI | TALUPU | PALAKA |
| | CVCV | CVCVCV | CVCVCV |

ఎక్కువ సేపు పలికే ధ్వని రూపాలే అచ్చులు (C) తక్కువ సమయంలో పలికే ధ్వని రూపాలే హల్లులు (V). రెండు లేదా మూడు హల్లు ధ్వనులు కలిపి అక్షరం ఏర్పడవచ్చు. కాని నాలుగు హల్లు ధ్వనులు వరుసగా వచ్చే పదాలు ఏ భాషలోనూ ఉండవు. కారణం వాటిని ఏక మొత్తంగా పలక లేక పోవడమే. కొన్ని సందర్భాలలో మనం పలికే శబ్దాలు అచ్చుల నుండి హల్లుల రూపంలోకి మారుతుంటాయి. పిల్లలు నిద్రపోయినప్పుడు తప్ప అన్ని సందర్భాలలోను భాషను వినియోగిస్తూ ఉంటారు.

మూడు సంవత్సరాల పిల్లలు Papa, baba, mama మొదలైన పదాలను సులభంగా పలకడానికి కారణం వాటి మధ్య ఒకే రకమైన ఉచ్ఛారణ ఉండడం (Bilebid). పిల్లలు ప, బ, మ శబ్దాలను ఏ సందర్భంలో ఎలా పలకాలో అలాగే పలుకుతారు.

- 'క' వర్గ శబ్దాలు '0' పూర్ణ బిందువుతో / అనుస్వారం కూడినపుడు 'ఙ' శబ్దంతోనూ..
- 'చ' వర్గ శబ్దాలు '0' పూర్ణ బిందువుతో / అనుస్వారం కూడినపుడు 'ఞ' శబ్ధంతోనూ....
- 'ట' వర్గ శబ్దాలు '0' పూర్ణ బిందువుతో / అనుస్వారం కూడినపుడు 'ణ' శబ్ధంతోనూ....
- 'త' వర్గ శబ్దాలు '0' పూర్ణ బిందువుతో / అనుస్వారం కూడినపుడు 'న' శబ్ధంతోనూ....
- 'ప' వర్గ శబ్దాలు '0' పూర్ణ బిందువుతో / అనుస్వారం కూడినపుడు 'మ' శబ్ధంతోనూ....

శరీరంలో మాట్లాడడానికి పనికొచ్చే అవయవాలు జంతువులలోను, మానవులలోను ఉన్నాయి. కానీ జంతువులు మాట్లాడలేవు. కానీ మానవులు మాట్లాడడానికి కారణం భాషను మాట్లాడే శక్తితో మానవుడు పుట్టడమే.

**1.1.4. భాష – లిపి :**

అక్షరం అంటే క్షరం లేనిది. అంటే నాశనం లేనిది అని అర్థం. అక్షరం శాశ్వతంగా ఉంటుంది. ధ్వని లేఖన రూపం పొంది లిపిగా పిలవబడుతుంది. అక్షరాల ధ్వని సంకేతాన్ని 'లిపి' అంటారు. భాష ప్రాథమిక వ్యవహారం, లిపి. భాషణాన్ని అక్షరబద్ధం చేయడం ద్వారా 'లిపి' ఏర్పడుతుంది. ఒక బాషకు దాని లిపికి మధ్య అంతర్గత సంబంధమంటూ ఏదీ లేదు. ఒక లిపి ఆ భాషా వ్యక్తీకరణకు ఉపయోగపడుతుంది. వాస్తవానికి ప్రపంచ భాషలన్నింటినీ ఏదో ఒక లిపిలో రాయవచ్చు. అట్లే ఒక భాషను ఎన్నో లిపులలో మార్పులు, చేర్పులకు లోబడి రాయవచ్చు. లిపి కన్నా ముందు నుండే భాష ఉంది. లిపి కాని, భాషకానీ భాషా సాహిత్యాల అభివృద్ధిలో ఎలాంటి పాత్రను పోషించవు. సమాజంలోని వ్యక్తులు, పెద్దలు రాజకీయ వర్గాల వారి ఉపయోగంపై ఆ భాషా లిపి ఆధారపడుతుంది. ఈ భావనలతో అధికారంలోకి వచ్చిన వారిని బట్టి లిపులు మారుతాయని అర్థం చేసుకోవచ్చు. ఒక కాలంలో Persian, Arabic Scriptలో ఉన్న భాషలు ఈనాడు దేవనాగరి, గురుముఖి లేదా రోమన్ లిపిలో రాయబడుతున్నాయి. ఈనాటి కాలంలోని ఉర్దూ పద్య సంపద (Perso - Arabic) లిపిలోను, దేవనాగరి మరియు రోమన్ లిపులలోనూ లభిస్తోంది. సంబాలీ భాష ఐదు రకాల లిపుల్లో రాస్తున్నారు.

**లిపి పరిణామక్రమం :**

భాష ముఖ్యంగా ధ్వన్యాత్మకమైనది. ధ్వనులను సూచించేది లిపి. భాషలు పుట్టిన తర్వాత చాలా ఏళ్ళకు లిపులు పుట్టాయి. ఇప్పటికీ లిపి లేని ఆటవిక భాషలు వేలకొలది ఉన్నాయి. ఇప్పటి విద్యావిధానంలో లిపి నేర్చుకోవడం ఎంతటి ప్రధానస్థానాన్ని ఆక్రమించినా భాషకి లిపి కన్నా ధ్వని ముఖ్యమని గ్రహించాలి. ఏ భాషకైనా లిపి అసమగ్రమైనది. భాషకీ దానిని రాయడానికి ఉపయోగించే లిపికి సహజ సంబంధం లేదు.

లిపి చిత్రాల నుంచి పుట్టింది. చిత్రలిపి మొదట పదలిపిగా మారింది. పదలిపి చాలా భాషలలో అక్షర లిపిగా మారింది. అక్షర లిపినించి అచ్చులకూ, హల్లులకూ ప్రత్యేకమైన గుర్తులు ఏర్పాటు చేసి ధ్వని లిపిని మొదట గ్రీకులు సాధించారు. రాతలోనూ, చదవడంలోనూ సౌలభ్యానికి ధ్వని లిపి పరాకాష్ఠ.

**తెలుగు లిపి పరిణామక్రమం :**

శాతవాహనుల కాలంలో గుహలలో, కొండల మీద, స్తంభాల మీద చెక్కించిన శాసనాల ద్వారా ఉన్న లిపిని బ్రాహ్మలిపిగా పిలిచారు. తెలుగునాడును పాలించిన శాతవాహనులు ప్రాకృత భాషలో శాసనాలు వేయించారు. ఆ శాసనాలలో తెలుగు పదాలు కన్పిస్తాయి. ఇవి 'బ్రాహ్మీలిపి'లోనే ఉన్నాయి. శాలంకాయనులు బ్రాహ్మ లిపిలో మార్పులు తెచ్చారు. ఇప్పుడు మనం వాడుతున్న తలకట్టు వీళ్ళకాలంలో అడ్డగీతగా ఉండేది. విష్ణుకుండినులు చేసిన మార్పుల వల్ల బ్రాహ్మీ లిపి రూపం చాలా మారింది. విష్ణుకుండినుల కాలంలో అక్షరాలపై అడ్డగీతలు అధికంగా కనిపిస్తాయి. వీళ్ళ కాలంలోనే ద్రావిడ భాషకు సంబంధించిన 'ఱ' అనే విచిత్రమైన ధ్వని గల అక్షరం శాసనాల్లో కనిపిస్తుంది. ఈ అక్షరం తరవాత డ, ర, ల, ఱ మొదలయిన రూపాలు పొందింది.

ఏడవ శతాబ్దిలో ఆంధ్రదేశాన్ని పాలించిన చాళుక్యులు తెలుగుభాషలో శాసనాలు వేయించారు. వీళ్ల కాలం నాటి లిపి తెలుగు – కన్నడ భాషల కలగలుపులా ఉంటుంది. పశ్చిమాంధ్ర ప్రాంతాన్ని పాలించిన చోళులు సైతం తెలుగు లిపిలో శాసనాలు వేయించారు. ఈ రాజవంశానికి చెందిన ఏరికల్ ముత్తరాజు అనే పాలకుడు వేయించిన శాసనం ఎర్రగుడిపాడులో లభించింది. ఇదే మనకు లభించిన తొలి తెలుగు శాసనం.

నన్నయ్య వేంగీ చాళుక్య లిపిలో భారతం రాశాడు. నన్నయ తర్వాత తెలుగు కన్నడ లిపులు వేర్వేరుగా ఏర్పడ్డాయి. తెలుగు లిపి గుండ్రంగా మారింది. కాకతీయుల కాలం నాటికి తెలుగు లిపికి తనదైన రూపం ఏర్పడింది. క్రమ పరిణామంలో భాగంగా అక్షరాల రూపు రేఖలు మారడం, అక్షరాలు రాయడంలో మార్పులు కన్పిస్తున్నాయి. శ్రీనాథుడి కాలం నాటి లిపి, నేటి తెలుగు లిపికి కొంత సన్నిహితంగా ఉంది.

విజయనగర రాజులు తెలుగు లిపిలో శాసనాలు వేయించారు. వీళ్లు తెలుగు లిపికి ప్రాధాన్యం ఇచ్చారు. వీళ్ల కాలం నాటి లిపి ఇప్పటి మన లిపితో సరిపోతుంది. చ, జ అక్షరాలలో దంత్యోచ్చారణ కోసం ఉంచిన 'ౘ' గుర్తు బ్రౌన్ చేర్పించినట్లు గుర్తించారు. ప్రాచీనకాలంలో ఉన్న అరసున్న 16వ శతాబ్దానికి ముందు లేదు. ఆ తర్వాత పండితులు తేల్చి పలకబడే అనుస్వారానికి బదులు అర్థానుస్వారం (ఁ) చేర్చి ఉండవచ్చు.

**1.2.1. భాష – ప్రయోజనాలు :**

మానవుడు ఈ ప్రపంచంలో ప్రాణులన్నింటిలో ఉన్నతుడిగా, ప్రజ్ఞావంతుడిగా రూపొందడానికి మూలకారణం అతని భాష. మనిషి మనుగడలో సామాజికాభివృద్ధిలో భాష ప్రముఖ పాత్ర నిర్వహిస్తుంది. భాష వల్ల మనిషికి కలిగే ప్రయోజనాలు అనేకం.

భాష మౌలిక ప్రయోజనం భావ వినిమయం. పరస్పర భావ వినిమయానికి ఉపకరించే సాధనమే భాష. భావ వినిమయ ప్రయోజనాలను రెండు విధాలుగా విభజించవచ్చు.

1. భావ వ్యక్తీకరణ లేదా అభివ్యక్తి 2. భావ గ్రహణం లేదా స్వీకరణ

మొదట మౌఖిక రూపంలో ఉత్పన్నమైన భాష కాలక్రమేణా లిఖితరూపం కూడ సంతరించుకొంది. ముఖ యంత్రం ఆధారంగా అర్థవంతమైన ధ్వని సంకేతాల ద్వారా జరిగే భావవ్యక్తీకరణ మౌఖిక భాష (భాషణం) ధ్వని సంకేతాలకు భౌతిక ఆకృతి కల్పించి, అక్షర రూపంలో వ్యక్తీకరించడం లేఖనం లేదా లిఖిత భాష. ఇదే విధంగా భావ గ్రహణం కూడ రెండు రకాలు. శ్రవణం, పఠనం. మౌఖిక అభివ్యక్తిని శ్రవణం ద్వారా, లిఖిత రూప అభివ్యక్తిని పఠనం ద్వారా గ్రహించడం జరుగుతుంది.

మౌఖిక భాష కేవలం ఎదుటి వ్యక్తులకు భావ వ్యక్తీకరణ చేయడానికి ఉపకరిస్తుంది. లిఖిత భాష

పరోక్షంగా ప్రస్తుత కాలంలో ఉన్న వారికి భవిష్యత్ తరాల వారికి కూడా ఉపయోగపడుతుంది. అయితే ఆధునిక సాంకేతికాభివృద్ధి వల్ల మౌఖిక భాష కూడ, లిఖిత భాష కాగా రికార్డుల రూపంలో భద్రపరచడానికి వీలవుతుంది.

ఈ భావ వినిమయ ప్రయోజనాలను ప్రకాశం, ఆత్మగతం అని రెండు విధాలుగా చూడవచ్చు. ఎదుటి వారితో బహిర్గతంగా మాట్లాడటం; వాగ్రూప ప్రకాశ వ్యక్తీకరణ; వ్యక్తి ఒంటరిగా ఉన్నప్పుడు, భావస్పష్టత లేనప్పుడు తనలో తాను మాట్లాడుకోవడం ఆత్మగతం.

లిఖిత భాషను కూడా ఆత్మగతం, ప్రకాశం అని రెండు రకాలుగా విభజించవచ్చు. దినచర్య, అంతరంగిక లేఖలు మొదలయినవి ఆత్మగతాలు. పుస్తకాలలో, పత్రికలలో ప్రచురితమయ్యే భాష ప్రకాశం. అలాగే తనంతట తాను మనసులో చదువుకొనే మౌనపఠనం ఆత్మగత గ్రహణం. ఇతరులకు వినబడేటట్లు చదవడం ప్రకాశపఠనం.

భాష భావ వినిమయ ప్రయోజనాల ద్వారా వ్యక్తి నిజజీవితంలోనే కాకుండా సమాజ ప్రగతిలో కూడ ప్రముఖపాత్ర వహిస్తుంది. విస్తృతమైన ప్రయోజనాలు కలుగజేస్తుంది. ఈ ధృక్కోణంలో భాషా ప్రయోజనాలు రెండు విధాలుగా చూడవచ్చు.

1. వ్యక్తిగత ప్రయోజనాలు　　　2. సామాజిక ప్రయోజనాలు


భావ వినిమయ ప్రయోజనాలు
వ్యక్తికరణ (అభివ్యక్తి)
గ్రహణం (స్వీకరణ)
భాషణం (మౌఖికం)
లేఖనం (లిఖితం)
శ్రవణం
పఠనం
ఆత్మగతం
ప్రకాశం
ఆత్మగతం
ప్రకాశం
ఆత్మగతం
ప్రకాశం
ఆత్మగతం
ప్రకాశం


భాష – విస్తృత ప్రయోజనాలు
వ్యక్తిగత ప్రయోజనాలు
సాంకేతిక ప్రయోజనాలు
– దైనందన వ్యవహారాల నిర్వహణ
– సుఖజీవనం
– మూర్తిమత్వ వికాసం
– జ్ఞాన సముపార్జన
– సాహిత్య పరిజ్ఞానం
– స్నేహ సంబంధాలు
– విదేశాలలో మనుగడ
ఉద్దీపన ప్రయోజనాలు
– రసానుభూతి
– ఆలోచనా శక్తి
– సృజనాత్మకత
– సాహిత్యాభిరుచి
– సాహిత్య పరిజ్ఞానం
– విజ్ఞానాభిరుచి
– ఇతర భాషలు నేర్చుకోవడంలో ఆసక్తి
– ఆధ్యాత్మక చింతన
వ్యక్తిగత ప్రయోజనాలు
– నాగరికత పెంపొందడం
– విజ్ఞాన సాంకేతిక రంగాల పురోగతి
– విద్యాభివృద్ధి
– సమాజాభివృద్ధి
– సుహృద్భావం
– వాణిజ్యాభివృద్ధి
– సాంస్కృతికాభివృద్ధి
– సంస్కృతి వ్యాప్తి
– పరిశోధనలు
– ఆవిష్కరణలు

**వ్యక్తిగత ప్రయోజనాలు :**

మనిషి మనుగడకు, అభివృద్ధికి భాష ఆధారం. వ్యక్తి సంపూర్ణ మూర్తిమత్వ వికాసానికి భాష తోడ్పడుతుంది. జీవనోపాధికి, దైనందిన కార్యకలాపాలు నిర్వహించుకోవడానికి చక్కని జ్ఞాన సముపార్జనకు, సృజనాత్మకత పెంపొందడానికి, ఆనందానుభూతికి, ఆధ్యాత్మిక చింతనకు – వీటన్నింటికి భాష ఎంతో అవసరం.

వ్యక్తిగత భాషా ప్రయోజనాలను సాంకేతిక ప్రయోజనాలు, ఉద్దీపన ప్రయోజనాలు అని రెండు విధాలుగా పేర్కొనవచ్చు.

సాంకేతిక ప్రయోజనాలు బుద్ధిగమ్యాలు. భాషా సంకేతాల ద్వారా జరిగే సాధారణ భావ వ్యక్తీకరణ, భావ గ్రహణం సాంకేతిక ప్రయోజనాలుగా చెప్పుకోవచ్చు. వీటి వల్ల జ్ఞానం కలుగుతుంది. కానీ ఆనందం, రసావిర్భావం కలగదు. జీవనోపాధికి, జ్ఞాన సముపార్జనకు అధ్యయనానికి ఈ భాషా ప్రయోజనాలను సాంకేతిక ప్రయోజనాలుగా పేర్కొనవచ్చు.

భాష ద్వారా జరిగే భావ వ్యక్తీకరణ ఎదుటి వారిలో భావోద్దీపన కల్గిస్తుంది. తదనుగుణంగా వారిని ప్రతిస్పందింపజేస్తుంది. శ్రోతకు, పఠితకు రసానుభూతి కల్గించడం, వ్యక్తిలో రసావిర్భావం కలిగి దాన్ని కళల రూపంలో వ్యక్తీకరించేటట్లు సృజనాత్మకత పెంపొందించడం – ఇవన్నీ వ్యక్తిగత ఉద్దీపన ప్రయోజనాలకు ఉదాహరణలు.

**సామాజిక ప్రయోజనాలు :**

భాష – సమాజం ఈ రెండూ పరస్పరాశ్రితాలు! భాష లేకపోతే సమాజం లేదని చెప్పవచ్చు. భాష లేకుండా సమాజ వ్యవహారాలేవీ నిర్వహించలేము. సాహిత్య, శాస్త్రీయ, సాంకేతిక, పారిశ్రామిక రంగాలలో ప్రగతికి భాష మూలాధారం అవుతుంది. విద్యావ్యాప్తికి భాష అత్యంత అవశ్యకం. సమాజ సంస్కృతి, చరిత్ర, సంప్రదాయాలను ముందు తరాలకు అందజేయడంలో భాష ప్రముఖపాత్ర వహిస్తుంది. వివిధ వర్గాల మధ్య సమైక్యత సాధించడానికి భాష ప్రముఖ పాత్ర వహిస్తుంది.

- వ్యక్తి తన భావాలను, ఉద్వేగాలను, కోరికలను సంకేతాల ద్వారా వ్యక్తం చేయడానికి ఉపయోగించే సాధనం భాష.
- భాష అనంత వాక్యాల సముదాయం.
- భాషాపరమైన ప్రవర్తనను అలవరచుకోవడానికి సహకరించే మేధాశక్తి ప్రత్యేక నియమాల ఆధారంగా నిర్మించబడిన ప్రత్యేక వాక్యాల సముదాయం భాష.
- యాదృచ్ఛికత, సామాజికత, పరిణామశీలత, సృజనాత్మకత, అనుకరణీయత భాష ప్రధాన లక్షణాలు.
- భావ వ్యక్తీకరణ, భావగ్రహణం భాష ప్రధాన ప్రయోజనాలు.
- భాషా ప్రయోజనాలను వ్యక్తిగత ప్రయోజనాలు – సామాజిక ప్రయోజనాలుగా విభజించవచ్చు.
- వ్యక్తిగత ప్రయోజనాలను సాంకేతిక – ఉద్దీపన ప్రయోజనాలుగా చూడవచ్చు.
- మానవుడి మనోభావ రూపకల్పనకు భాష సాధనం.
- భాష వల్ల మనోభావాలను వ్యక్తపరచడం సులభం.

### 1.2.2. భాష – ఆలోచన :

భాష ముందా? ఆలోచన ముందా? అను ప్రశ్న వాస్తవానికి కఠినమైనది. భాష మరియు ఆలోచనలు ఓ విధంగా వైయక్తికాలు మరియు ఒక దానిని ఒకటి ప్రభావితం చేస్తాయి. భాష లేని ఆలోచనను మనం

ఊహించగలమా? శిశువుల ఉద్వేగ పార్శ్వాలను భాష స్పర్శిస్తుంది. వాటిని క్రియాశీలం (activate) చేస్తుంది. అలా వ్యక్తి ఆలోచించడానికి, దానికి అనుగుణంగా ఏదో ఒకటి చేయడానికి, సామాజిక సందర్భంలో జీవితాన్ని గడపడానికి భాష తోడ్పడుతుంది. ఆలోచన భాషను చైతన్య శీలిగా చేస్తుంది.

- భాష మరియు ఆలోచన విడదీయరానివి.
- మన ఆలోచనా ప్రక్రియలకు భాష రూపాన్ని ఇస్తుంది. ఇంతకు ముందు అన్వేషణకు నోచుకోని ఎన్నో జ్ఞాన తీరాలకు, ఊహాతీరాలకు మనల్ని భాష చేరుస్తుంది.
- ఒక తరం నుండి మరో తరానికి సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు భాష ద్వారానే సంక్రమిస్తాయి.
- భాష ఆలోచనను రేకెత్తిస్తుంది. వైవిధ్యభరితమైన తార్కిక ఆలోచన, సృజనాత్మకతకు దారి తీస్తుంది.

భాషా తరగతిలో విద్యార్థులు తమ ఆలోచనలను సృజనాత్మకతను పెంపొందించుకోవడానికి అవకాలుండాలి. తరగతి గది నియమాలు మరియు ఉపాధ్యాయుల సంబంధాలు పిల్లల ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించి వారి భాషా సామర్థ్యాలను అభివృద్ధి పరుస్తాయి.

**భాష – వినియోగం :**

మానవులకు భాషకు విడదీయరాని సంబంధముందని మనం గ్రహించాం. మనిషిని ఇతర జంతువుల నుండి వేరు చేసి అతణ్ని ఉన్నతునిగా చేసేది భాషే! ఇది వ్యక్తికి సమాజానికి తోడ్పడుతుంది. వ్యక్తిత్వ వికాసానికి భాష తోడ్పడుతుంది. సమాజాభివృద్ధికి, సంస్కారానికి భాష సాధనమని మనకు తెలుసు. అలాగే వ్యక్తిని, వ్యక్తుల ద్వారా సమాజాన్ని వికసింపజేసే శక్తి భాషకు ఉంది. కాబట్టి అటువంటి భాషాబోధన, అభ్యసనాలపై దృష్టి పెట్టవలసి ఉంటుంది.

శిశువులు బడికి వచ్చేటప్పటికీ శ్రవణ, భాషణ నైపుణ్యాలు కొంతమేర కలిగి ఉంటారు. కాని బడిలో ఆ రెండు నైపుణ్యాలలో తగిన తర్ఫీదు ఇచ్చి మిగిలిన పఠన లేఖణ నైపుణ్యాలు నేర్పుతారు. ఈనాటి బాలలే రేపటి పౌరులు. నేటి విద్యార్థులు రేపటి సంఘ నిర్మాతలు; దేశ భావి నిర్ణేతలు! కనక విద్యార్థులకు ఇచ్చే భాషా శిక్షణ ఇప్పటి అవసరాలకే పరిమితం కాకూడదు. అది వారి భావి జీవిత సాఫల్యానికి దారి తీయాలి. అందుకు తగిన భాషా నైపుణ్యాలకు తగిన బీజాలు ఇప్పుడే వేయాలి!

నేటి విద్యార్థి వయోజనుడయిన తరువాత ఏ వృత్తిని చేపట్టినా దానిలో రాణించడానికి తగిన భాషా సామర్థ్యాలు అతనికి ఇప్పుడే లభించాలి. అంటే బడిలో వేసిన భాషా పునాదులు అతని భావి జీవితానికి తోడ్పడాలి. భాషా సామర్థ్యాలు, భాషా వినియోగం ద్వారానే సిద్ధిస్తాయి. విద్యార్థులు బడిలో విరివిగా వివిధ సన్నివేశాలలో భాషా నైపుణ్యాలను వినియోగిస్తూ ఉంటే ముమ్మందు నుంచి భాషా సామర్థ్యాలు అలవడతాయి.

ఇప్పుడు శాస్త్ర, సాంకేతిక, యాంత్రికాభివృద్ధి వేగంగా సాగుతోంది. బోధనలో వాటి వల్ల విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా కంప్యూటర్, ఇంటర్‌నెట్, డిజిటల్ తరగతి గదులు, సి.డి.లు, బడిలో, విద్యాలో ప్రవేశించాయి. అయినప్పటికీ భాషా వినియోగం తగ్గలేదు. ఆధునిక యాంత్రిక అవసరాలకు తగిన భాషా సామర్థ్యాలు అవసరం అవుతున్నాయి. అటువంటి సాంకేతిక పరిజ్ఞానం భాష ద్వారా లభించాలి.

సమాజం, దాని అవసరాలు త్వరత్వరగా మారుతున్నాయి. అందువల్ల దానికి అనువుగా భాషావసరాలు మారుతున్నాయి. ఉపాధ్యాయులు ఈ ఆధునిక మార్పులు గమనించి, రాబోయే సమాజంలో పౌరులకు ఎటువంటి భాషా నైపుణ్యాలు అవసరం అవుతాయో గ్రహించి, తదనుగుణంగా తమ బోధనాంశాలను, బోధన విధానాలను రూపొందించుకోవలసి ఉంటుంది.

విద్యార్థులు భావి జీవితాలలో ఎటువంటి పరిసరాల్లోనైనా, ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోగల భాషా సామర్థ్యాలు కలిగి ఉండాలి. వాటిని అలవరచుకోవాలి. అలాంటి భాషా వినియోగంలో శిక్షితులు కావాలి. అంటే ఎటువంటి వృత్తులు చేపట్టినా, విజయవంతంగా వాటిని నిర్వహించే భాషా సామర్థ్యాలు వాళ్ళకు అలవడాలి.

పై అంశాలను నేటి ఉపాధ్యాయులు దృష్టిలో ఉంచుకొని, విద్యార్థుల భవిష్యత్తును ఊహించి విద్యార్థులకు ఆయా వృత్తులకు, రంగాలకు, ఘట్టాలకు పనికి వచ్చే భాషా వినియోగ సామర్థ్యాలు అందించాలి.

ముఖ్యంగా బోధనాంశాలను వాటికి తగినట్లుగా మలచుకోవాలి. తరగతి గదిని ఒక చిన్న మోతాదు సమాజం (Miniature Society)గా భావించి, సహజ అభ్యసన సన్నివేశాలు సృష్టించి వాటిలో విద్యార్థులు పాలుపంచుకొనేట్లు చేసి, వాళ్లకు అనుభవ పూర్వకమైన భాషా వినియోగం కలిగించాలి.

ఉదాహరణకు :– రైతు, కార్మికుడు, కవి, ఉపాధ్యాయుడు, డాక్టరు, బస్సు కండక్టరు, ఉద్యోగి, న్యాయాధిపతి, కిరాణా షాపు నిర్వాహకుడు మొదలైన పాత్రలతో నాటకీయ సన్నివేశాలు తరగతి గదిలో నిర్వహించాలి.

# మన మాటల ప్రభావం - మనపై - ఇతరులపై

1.3.1

రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ పాఠ్యపుస్తక రచయిత అవార్డు గ్రహీత కుందా భాస్కరరావు తన "కొత్త భాస్కర శతకం"లోని ఓ పద్యంలో ఇలా అంటాడు.

భాష అనగనేమి? పలుకుల పూదోట
మాటలనగనేమి? మల్లెమూట!
మాట లేని చోట; మనిషికర్ధము లేదు!
భాస్కరార్యుమాట! ప్రగతి బాట!

మాటల ప్రభావం మనపైన ఇతరులపైన అంతా ఇంతా కాదు. మాటలే మనకు దేవుడిచ్చిన బహుమానం! మాటలే మనిషి ఆలోచనకు వివేచనకు కొలమానం! మాటలు మనలను వెలిగిస్తాయి. ఇతరులను వెలిగిస్తాయి. ఉల్లాసం కలిగిస్తాయి. ఉత్సాహం నింపుతాయి. చక్రాల్లో చక్రాలున్నట్లు మాటల్లో మర్మాలుంటాయి. మరెన్నో ధర్మాలుంటాయి. చమత్కారాలుంటాయి, చీత్కారాలుంటాయి.

కొందరి మాటలు తేనెల ఊటలు. ప్రగతికి బాటలు. మాటలు మనిషిని కవ్విస్తాయి. మనసారా నవ్విస్తాయి. సరికొత్త ఆలోచనలను రేకెత్తిస్తాయి. నన్నయ భట్టారకుడు తన కవిత్వంలో "నానారుచిరార్ధ సూక్తినిధిత్వం" ఉందన్నాడు. సూక్తి అంటే ఏమిటి? ఒక మంచి మాట. ఒక సుభాషితం. సు+ఉక్తి = సూక్తి. కొందరి మాటల్లో ఉక్తివైచిత్రం ఉంటుంది. అంటే చమత్కారంగా, సందర్భోచితంగా మాట్లాడడం అని అర్థం.

"In the Begining There is 'Word'. It is with God" అంటుంది హోలీబైబిల్. 'ఓం'కారంలోనే సృష్టి రహస్యమంతా ఇమిడి వుందని అంటుంది హైందవ సంస్కృతి. ఇవి అందరికీ అర్థం కాని అమూర్త విషయాలు.

'మహాప్రస్థానం'లో మాటలను మంత్రంగా మోగించాడు మహాకవి శ్రీశ్రీ. "నా మాటలు వెన్నెల్లో ఆడుకునే అందమైన ఆడపిల్లలు" అన్నాడు తిలక్.

నిజమే! మాటలంటే మాటలా!

భానుకిరణ్ ఏదో పని మీద బజారుకు వెళ్లడానికి తయారవుతున్నాడు. నాలుగేళ్ల కూతురు జాబిలి "నాన్నా" అంది గోముగా.

పరధ్యానంగా వినిపించుకోకుండా అద్దం ముందు తల దువ్వుకుంటున్నాడు భాను.

మళ్లీ "నాన్నా" అంది జాబిలి.

"ఏమిటి తల్లీ"

"మరే మరే కుర్‌కురే..." జాబిలి.

"నోర్ముయ్! ఎన్ని సార్లు చెప్పాను. కుర్‌కురేలాంటి ఫాస్ట్‌ఫుడ్స్ తినవద్దని" భాను కోప్పడ్డాడు.

"అదే నాన్నా! కుర్‌కురే తేవద్దంటున్నాను" చిటెకెలో మాట మార్చేసింది జాబిలి. బిడ్డ తెలివికి నవ్వుకోకుండా వుండగలడా ఏ తండ్రయినా! పిల్లలు వాళ్లు ! తెలివితేటల పువ్వుల జల్లులు!

తన ఉక్తివైచిత్ర్యంతో ఎన్టీఆర్ కేవలం తొమ్మిది నెలల్లో ముఖ్యమంత్రి పీఠాన్ని అలంకరించడమే కాకుండా తెలుగువాడి హృదయపీఠాన్ని కూడా అధిష్టించాడు.

నాలుగైదు తరగతులకే పరిమితమైన హీరో అక్కినేని ఆ తర్వాత కాలంలో ప్రపంచం అనే పాఠశాలలో సహజ అభ్యసన సన్నివేశాల ద్వారా; తాను సినిమాల్లో ధరించిన అపురూపమైన వేషాల ద్వారా గొప్ప 'మాటకారి'గా మారాడు. వివిధ రంగాల్లో డాక్టరేట్లు చేసినవాళ్లు సైతం ఆయన 'పలుకుబడి' ముందు దిగదుడుపే!

నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుందని సామెత. "కొండ అద్దమందు కొంచెమై ఉండదా?" అని

మహాకవి వేమన అన్నట్లు చిన్న మాటలోనే కొండంత భావం దాగి వుంటుంది. "చిన్న మిరియంబున చెడునె కారమ్ము" అన్నాడు కవి సార్వభౌముడు శ్రీనాథుడు తన పల్నాటి వీరచరిత్ర కావ్యంలో.

"అల్పుడెప్పుడు పల్కు ఆడంబరముగాను
సజ్జనుండు పల్కు చల్లగాను
కంచు మోగునట్లు కనకంబు మోగునా?
విశ్వదాభిరామ! వినురవేమ!!"

ఇది వేమన పద్యం అని చెప్పనక్కరలేదు కదూ! ఏమనిషికైనా "Economy of Words and economy of Thoughts" ఉండాలంటాడు. – సాహిత్యంలో మాటల్ని ఈటెలుగా, మలిచి తెలుగు మాటలకు జవాన్ని; జీవాన్ని కలిగించిన గుడిపాటి వెంకటాచలం – మహాప్రస్థానానికి తాను రాసిన 'ముందు మాట'లో

అక్షరాస్యులే కాదు; అక్షరం ముక్క రాని వాళ్లు సైతం "కవితామయంగా" మాట్లాడగలరు. మనం బళ్లో నేర్చుకునే చిలకపలుకుల చదువొక్కటే చదువు కాదు కదా!

ప్రకృతి సౌందర్యాన్ని చూచి పరివశించే భాస్కరరావు మాష్టారు ఓ సాయంత్రం వేళ పట్టణానికి దగ్గర్లో వున్న పంట పొలాల వైపు షికారుగా వెళ్లాడు – కాసింత పైరగాలి పీల్చుకొని; భూమి తల్లి సోయగాలు తనివిదీరా తిలకించాలని; పులకించి పోవాలని!

పగలంతా చేలో కాయకష్టం చేసి మట్టి అంటిన బట్టలతో; చేతిలో చెలకపారతో; పక్కన చిలకలాంటి పడుచు ఇల్లాలుతో ఎదురయ్యాడు వాళ్ల బాబాయి "దుడ్డు కోటేశం".

"ఏడికి పోతుండావు బాసికరావ్? సేను సూడ్డానికా?" అతడు భాస్కరరావు అనలేదు కదా! అయితే 'బాసికరావు' అనే మాటలో వున్న పల్లెదనం; తీయదనం "భాస్కరరావు" అనడంలో ఉండదేమో!

"ఔను బాబాయ్; వరిచేను ఎలా వుంది?"

"వరిసేనా? పచ్చగా ఆనందమాడతందయ్యా" దుడ్డు కోటేశం మాటల్లో అంతో ఇంతో కవితావేశం లేదనగలరా? "Every Man is a poet" అంటాడు కార్‌లైల్ అనే ఆంగ్ల మహాశయుడు.

సముద్ర తీరాన చేపలు పట్టే జాలరులను చూచి "నా వెంట రండి. మిమ్మల్ని మనుషుల్ని పట్టే జాలరులుగా మారుస్తాను" అంటాడు క్రీస్తు. తాను చూపిన మహిమల సంగతి ఏమో కాని ఆ మాటల్లో ఎంతటి మధురిమ! వెంటనే తాము పట్టిన చేపల్నీ; వలల్నీ అలాగే వదిలేసి ఆ మహనీయుని వెంట పరుగెట్టారు మత్స్యకారులు.

మనపైన; ఇతరుల పైన ఉన్న మాటల ప్రభావాన్ని కొలవడానికి కొలమానం లేదేమో! – మహాకవి పోతన భాగవతంలో వర్ణించిన వామనమూర్తి విశ్వరూపాన్ని కొలవడానికి సరైన సాధనాలు లేనట్లు! మాటల ప్రభావం మనపైన; ఇతరులపైన గుభాళిస్తుంది!

### 1.3.2 మానవ భాషలు – జంతు భాషలు :

మానవుడికి ఉన్న అమూల్యమైన శక్తి మాట్లాడగలగడం, మాట్లాడలేని మానవుడు లేనట్లే మాట్లాడగలిగిన మానవేతర ప్రాణి ఏదీ లేదు. కోతులు, పశుపక్ష్యాదులు కూడా భయం, ప్రేమ, కోపం, ఆకలి మొదలైన భావాలను సూచించడానికి అరుపులు అరుస్తాయి. అయితే మానవ భాషకీ పశు పక్ష్యాదుల అరుపులకీ మధ్య ఎంతో భేదం ఉంది. జంతువుల అరుపులలో ఏడెనిమిది లేక పది కన్న ఎక్కువ రకాలు ఉండవు. మానవ భాషలో రకరకాల ధ్వనులు కలిపి మాటలుగా ఏర్పడడం, రకరకాల మాటలు కలిసి, రకరకాల వాక్యాలు ఏర్పడడం ఉంది. అందువల్ల జంతువులలో అరుపుల కన్న మానవ భాషలో వైవిధ్యం చాలా ఎక్కువగా ఉంది.

పశు కీటకాదులలో కూడా వార్తాప్రసారం జరుగుతుంది. ఒక రకం ఎంద్రకాయలలో ఒకటి ఇంకొకదాన్ని

భయపెట్టడానికి ముందు కాలు గాని, వెనుక కాలు గాని ఎత్తుతుంది. ముందు కాలు ఎత్తడమే వెనుక కాలు ఎత్తడం కన్న శత్రువుని పారదోలడానికి ఎక్కువ సమర్థమయిందని పరిశోధన వల్ల తేలింది.

Stickle Backs అనే రకం చేపలు వసంతకాలంలో తమ ప్రాంతంలోకి, ఇతర ప్రాంతాలలోని చేపలు రాకుండా రక్షించుకుంటాయి. పై ప్రాంతం నించి చేప రావడం, దాని పొట్టా, గొంతుకలలో ఎర్రరంగుని చూసి ఈ చేపలు గ్రహించి వెంటనే దానిని నిరోధిస్తాయి. ఒక ప్రాంతంలో దొరికే ఆహారం అక్కడ ఉన్న వాటికీ, వాటి పిల్లలకూ సరిపోయేటట్లు చూడడానికి అవి ఇలా చేస్తాయి.

పక్షులూ, కోతులూ, భయం, అనురాగమూ కలిగినపుడు అరుపులు అరుస్తాయి. భయం కలిగినపుడు అరుపులు పెద్ద ధ్వనితో ఉంటాయి. అనురాగ ప్రదర్శన సమయంలో అరుపులు శ్రుతి మార్పులు కలిగి ఉంటాయి. ఇవి విన్న ఆయా జాతి పక్షులూ, కోతులూ పరిస్థితిని గ్రహించి దూరంగా పారిపోవడమో, దగ్గరగా చేరడమో చేస్తాయి. కోతులలో Vervat Monkeys అనే తెగ అధమ పక్షం ఆరు రకాల అరుపులు అరుస్తాయి. వీటికి అపాయం కలిగించే చిరుతపులులు, పాములు, గద్దలు వంటి ఒక్కొక్క రకం జంతువును చూసినపుడు ఒక్కొక్క రకం జంతువుని చూసినప్పుడు ఒక్కొక్క రకం అరుపు ఇవి అరుస్తాయి. ఈ అరుపులలో రకాన్ని బట్టి మిగిలిన కోతులు వచ్చిన ప్రమాదకరమైన జంతువు ఏదో తెలుసుకొని తదనుగుణంగా ప్రవర్తిస్తాయి. అయితే అరుపులు అరిచే కోతి తన దగ్గరకు వచ్చిన జంతువు కలిగించిన భయం స్థాయి వల్ల రకరకాలుగా అరుస్తూ ఉండవచ్చు. కాబట్టి ఆ కోతి మిగిలిన కోతులకి ఫలానా జంతువు వచ్చింది అనే వార్త చెప్పే ఉద్దేశంతో రకరకాలుగా అరుస్తుంది అని చెప్పలేము. అది ఉత్పత్తి చేసే ధ్వని దాని మనస్సులో ఏర్పడిన భయానికి ప్రతిఫలం మాత్రమే.

చీమలలో రసాయనిక సంకేతాలు ఉన్నాయి. చీమలు ఆహారం ఉన్నచోటు కనుక్కొని పుట్టకు తిరిగి వచ్చేటప్పుడు వాసన వేసే రసాయన పదార్థాన్ని దోవ పొడుగునా వదులుతాయి. మిగిలిన చీమలు ఈ పదార్థం ఉన్న దోవలో వెళ్ళి ఆహారాన్ని చేరుకుంటాయి.

తేనెటీగలలో స్పర్శ సంకేతం ఉంది. మధువును చూసిన తేనెటీగలు పట్టుకు తిరిగి వచ్చి నాట్యం చేస్తాయి. మిగిలిన తేనెటీగలు వీటిని రాసుకుంటూ నాట్యంలో చేరి, మధువు ఉన్న దిక్కూ, దూరం తెలుసుకొంటాయి. నాట్యం చేసే తేనెటీగ తోక ఉన్న వైపు మధ్య ఉన్న దిక్కు ; అది నిర్ణీత కాలంలో చేసే భ్రమణాల సంఖ్య వల్ల దూరం తెలుస్తుంది. కాని కొందరు ఇది స్పర్శ సంకేతం కాదనీ, మొదటి తేనెటీగ చేసే ధ్వని వల్లా, వాసన వల్లా మిగిలిన తేనెటీగలకి విషయం తెలుస్తుందనీ అంటారు.

పై ఉదాహరణల వల్ల మానవేతర ప్రాణులలో సంకేతాలు ఉన్నాయని తెలుస్తుంది. వీటిపై ఇంకా పరిశోధన ప్రాథమికావస్థలో ఉంది. ఈ సంకేతాలు ఒక విషయాన్ని తోటి జీవులకు తెలిపే ఉద్దేశంతో చేసేవి అనుకోలేం. అవి వాటిలో ఏర్పడిన మనోవస్థలకు అనుగుణంగా అప్పటికప్పుడు బయటికొచ్చిన సూచకాలు మాత్రమే. మానవ భాషకీ వీటికి హస్తిమ శకాంతరం ఉంది కాబట్టి మానవ భాష ఉత్పత్తిని గురించిన పరిశోధనకు ఇవి సహాయపడవు. మానవ భాషలో కొన్ని ధ్వనులు కలిసి పదాలు గానూ, కొన్ని పదాలు కలిపి వాక్యాలు గానూ ఏర్పడతాయి. ఏ జంతువుకీ రెండు మూడుఅరుపులు కలిసి పెద్ద అరుపుగా ఏర్పడడం అనేది లేదు.

మానవ భాషకు తత్క్షణ ప్రేరణ అక్కరలేదు. పులి రాకుండానే 'పులి వస్తోంది' అనవచ్చు. ఇటువంటి సామర్థ్యం జంతువులకి లేదు. మానవులు భాష ద్వారా విషయ నివేదన చెయ్యడమూ, ప్రశ్నించడమూ ఆజ్ఞాపించడమో, అర్థించడమూ మొదలైనవి చెయ్యగలరు. జంతు సంకేతాలకు ఇంతటి శక్తి లేదు.

బుద్ధి కుశలత గల మానవజాతి తన పరిసరాలను పరిశీలిస్తూ, తన ఊహాలతో జీవితానికి అవసరమైన అనేక సౌకర్యాలను సమకూర్చుకుంటుంది. ఆ సౌకర్యాలలో మొదట చెప్పదగినది భాష. అయితే జంతువులు, పక్షులు వాటి ఆహార వ్యవహారాల కొరకై వివిధ ధ్వనులు, చేష్టల ద్వారా భావ వినిమయం జరుపుతాయి.

అనేక ప్రేరణాత్మక మరియు సహజత ధ్వనులను జంతు జాలం చేస్తున్నప్పటికీ ఆ ధ్వనులన్నీ ప్రధానంగా మూడు అవసరాల దృష్ట్యానేనని పరిశీలకులు భావిస్తున్నారు. అవి ప్రమాద సంకేతాలు, సహజీవన అభిలాష మరియు ప్రాదేశిక హక్కుల రక్షణ.

**ప్రమాద సంకేతాలుగా జంతువులు చేసే శబ్దాలు.**

జింకలు వంటి జంతుజాలం ఏదేని తోటి జింక తన తోకను ఎత్తినట్లు కనిపించగానే దానిని ప్రమాదసూచికగా గ్రహించి, తామున్న ప్రదేశాన్ని వదిలి వేగంగా పరుగులు తీస్తాయి. కొన్ని రకాల పక్షిజాతులలో అవి చేసే విజిల్ వంటి శబ్దమే ప్రమాద సూచిక. పరిశీలకులు ఈ రెండు రకాల హెచ్చరిక రీతులను పక్షి జాతులలో గమనించారు. శత్రువు దగ్గరగా ఉన్నప్పుడు దాని చుట్టూ జట్లుగా పరిభ్రమిస్తూ సన్నని ధ్వనితో చాలా దూరం వినిపించేట్లు పక్షులు శబ్దం చేయడం ఒక విధానం. శత్రువు ఎగురుతున్నప్పుడు 'సీఎఎఎట్' అనే ధ్వని చేస్తూ ఉచ్ఛస్వరంతో ప్రమాదాన్ని హెచ్చరించటం రెండో విధానం. ఇలా తమ జాతికి చెందిన ఇతర పక్షులకు ప్రమాద సమాచారాన్ని అందించడం థార్ప్ (Thorpe, 1956) వంటి వారి పరిశీలనలో తేలింది.

గబ్బిలాల వంటి పక్షులలో శత్రువును గమనించినప్పుడు తమ సమూహానికి ప్రమాద సంకేతాలను ఇవ్వడం గమనింపబడింది. ఆహారం కనబడినప్పుడు ఉచ్ఛస్థాయిలో కిచకిచ వంటి ధ్వనులు చేస్తూ తమ సమూహానికి సమాచారం చేరవేయుడం రోయిడర్ (Roeder, 1960) ప్రభృతులు గమనించారు. ఎక్కడైనా ఆహారం కనిపించేసరికి తమ జాతికి సమాచారం అందించడం కాకులలోనూ మనం గమనించవచ్చు.

**జత కూడటం కోసం జంతువులు చేసే ధ్వనులు :**

కొన్ని రకాల చేపలు, బాతులు మొదలుగు వానిలో నాట్యం చేయుట, వంకర టింకరగా ఈదుట, కప్పలు గొల్లభామలలో తమ జత జీవులను ఆకర్షించుట కొరకు చిత్ర, విచిత్రమైన ధ్వనులు చేయుట క్లైడ్స్‌లే థాంప్సన్ (1960) వంటి వారు గుర్తించారు. పెంపుడు జంతువులైన కుక్కలు, పిల్లులు కూడా ఇట్టి విధానాలే అనుసరిస్తాయి. నెమళ్ళు నాట్యంతో జతను ఆకర్షించే విషయం మనకందరికీ తెలిసిందే.

**ప్రాదేశిక ఆధిపత్యాన్ని సూచించే శబ్దాలు :**

కోతులు, గొల్లభామలు వంటి జీవుల హెచ్చరికల వంటి శబ్దాలతో ఇతర జీవులు తమ ప్రదేశాలకు రాకుండా నిలువరిస్తాయి. ఇవి హెచ్చరికలు చేయడమే కాకుండా తమ ఆధిపత్యం కొరకు ఘర్షణలకు కూడా తలపడతాయి. కుక్కలలో కూడ ఇలాంటి లక్షణాన్ని గమనించవచ్చు.

ఇలా జీవజాలంలో భావ వినిమయం ఉన్నా అది అసమగ్రమై కొన్ని కొన్ని విన్యాలకు మాత్రమే పరిమితమై వినియోగించబడుతుందని పరిశోధనలు నిరూపిస్తున్నాయి. కొన్ని జీవులు ముఖ్యంగా తేనెటీగలు నృత్యం చేయడమే ఒక రకమైన భావ వ్యక్తీకరణ. తేనెటీగలు తమ కొండి ద్వారా పూదేనెను తీసుకొని వచ్చే విధానం అది ఏ పుష్పం నుంచి తేనెను సేకరించినదీ తెలుపుతుంది. అట్లే తేనెటీగలు పరిగిడుతూ తిరిగే విధానం ఆహారం ఎక్కడుందో తెలియజేస్తుంది. ఒక్కొక్క ప్రాంతంలోని తేనెటీగల భావ ప్రకటన ఒక్కొక్క రకంగా ఉండుట వల్ల పరిశోధకుల విస్తృత అధ్యయనాలకు వీలు కలుగుతోంది.

**జంతువులకు మానవ భాషా శిక్షణ :**

నర్తించటమో రకరకాలుగా ధ్వనించడమో తప్ప జంతువులు మానవ భాషను నేర్వగలవా? మానవుని

వలె భావ వ్యక్తీకరణ చేయగలవా? అనే అంశాల పైన కూడా మనస్తత్వ శాస్త్రవేత్తలు కొన్ని పరిశోధనలు చేశారు. ఈ రకమైన పరిశోధనల కొరకు మానవునిలో దగ్గరి పోలికలు గల చింపాంజీలను ఎంపిక చేసుకున్నారు. గార్డ్‌నర్ అతని అనుయాయులు అమెరికా దేశంలో అంధులకు నేర్పే సాంకేతిక భాష అయిన "అమెల్సన్"ను 'ఉషూ' అనే చింపాంజికీ నేర్పారు. నాలుగేళ్ళ సుశిక్షణలో "ఉషూ" కొన్ని వందల సంకేతాలను స్పర్శించి అర్థం చేసుకోగలిగింది. అలాగే 130 సంకేతాలు వివిధ అర్థవంతమైన రీతుల్లో ప్రకటించడాన్ని కూడ నేర్చుకున్నది.

ప్రియాక్ (1970) అను పరిశోధకుడు 'సారా' అనే చింపాంజీకి భాషను నేర్పే ప్రయత్నం చేశాడు. ఫలితంగా రంగురంగుల ప్లాస్టిక్ ఆకృతులను ఉపయోగిస్తూ తన భావాలను వ్యక్తీకరించడం 'సారా' చేయగలిగింది. పరిశోధకులిచ్చే సూచనలను అర్థం చేసుకోవడం నిర్దేశాలను అనుసరించడమే కాదు తాను ఉపయోగించే సంకేతాలతో వాక్య నిర్మాణాన్ని చేయగల సామర్థ్యాన్ని కూడ సారా ప్రదర్శించగలిగింది. ఈ రకంగా కనీస ప్రాథమిక స్థాయిలోనైనా భాషా వ్యాకరణాలను వినియోగించగల సామర్థ్యం చింపాంజీలకు ఉందని సారా నిరూపించింది.

"ఫ్రాన్సిస్ పాటర్‌సన్" మరియు ఆమె అనుయాయులు (1972) "కోకో" అనే ఒక సంవత్సరం వయస్సున్న చింపాంజీకి "అమెల్సన్" నేర్పారు. ఆరేళ్ళ శిక్షణ తర్వాత ఆ చింపాంజీ 600 సంకేతాలను అర్థం చేసుకొని స్వతంత్రంగా వినియోగించే స్థితికి చేరింది. తన భావాలను వ్యక్తీకరించడం, హాస్యోక్తులు చెప్పడం, తప్పు చేసినపుడు శిక్షను తప్పించుకునేందుకు అబద్ధాలు చెప్పటం, మైఖేల్ అనే తోటి చిన్న గొరిల్లాతో మాట్లాడడం, అతనికి సంకేతాలను ఉపయోగించే రీతిలో బోధించడం వంటి పనులు 'కోకో' చేసింది. "ఆల్ ఫ్రెడ్‌బినె" ప్రజ్ఞా మావనితో పరిశీలించినపుడు ఈ చింపాంజీలు తన వయస్సు గల మానవ శిశువుల కన్నా కొంచెం తక్కువ స్థాయిలో తన ప్రజ్ఞను నిరూపించుకున్నదని పరిశోధకులు నిర్ధారించారు. ఇట్టి పరిశోధనలు మానవేతర జీవజాలంపై ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.

పై పరిశోధనల ఫలితాలను సునిశితంగా పరిశీలించినపుడు మనకు కొన్ని విషయాలు ప్రస్ఫుటమవుతాయి. వివిధ జీవులు తమ పరిసరాలలో పరిమిత పరిధుల్లో వివిధ ధ్వనులు విన్యాసాలు, సంకేతాల ద్వారా భావ ప్రకటన చేయగలవనీ కానీ మానవునికి గల విస్తృత భావ వినిమయం, ధ్వనులు పలికి భాషించగల సామర్థ్యం ఇతర ప్రాంతాలలో కన్పించదని తేలింది. సమగ్ర భాషణం మానవ జీవికి మాత్రమే పరిమితం అని కూడా చెప్పవచ్చు.

### 1.3.4 ప్రపంచ భాషలు – వర్గీకరణ – విభజన :

ప్రపంచంలో మూడువేల భాషలకి పైన ఉన్నాయని అంచనా. కొన్ని భాషల విషయంలో అవి ప్రత్యేక భాషలా లేక మరొక భాషలోని మాండలికాలా అనే విషయం తేల్చడం సాధ్యం కాదు; కాబట్టి భాషల సంఖ్య ఇంత అని నిర్దుష్టంగా చెప్పడం కష్టమైన పని. మానవులు మాట్లాడే ప్రతి భాషా ఇంకొక భాష కన్నా విలక్షణమైనదే అయినా అన్ని భాషలకూ వర్తించే సామాన్య లక్షణాలు గురించి ఈ అధ్యాయం ప్రారంభంలోనే మనం చర్చించాం.

మూడు వంతులు సముద్రం ; ఒక వంతు మాత్రమే భూమి వున్న ఈ ప్రపంచంలో ఇన్ని వేల భాషలు పరిఢవిల్లడం ఒక మహాఅద్భుతం! ప్రారంభంలో విద్వాంసులు భాషలన్నీ ఒక మూల భాష నుంచి పుట్టాయని అభిప్రాయపడినా పరిశోదన వృద్ధి చెందిన కొద్దీ ఈ అభిప్రాయాన్ని పక్కా రుజువులతో నిరూపించడం సాధ్యం కాదని స్పష్టమయింది. అయినా ప్రపంచ భాషలను భాషా శాస్త్రజ్ఞులు పది కుటుంబాలుగా విభజించారు.

1. ఇండో యూరోపియన్ భాషా కుటుంబం – సుమారు 150 కోట్లు
2. సైనో టిబెటన్ భాషా కుటుంబం – 75 కోట్లు
3. యూరల్ – ఆల్టాయిక్ – 20 కోట్లు

| | | |
|---|---|---|
| 4. సెమిటో – హెమెటిక్ | – | 20 కోట్లు |
| 5. ఆస్ట్రిల్ – భాషా కుటుంబం | – | 15 కోట్లు |
| 6. బంటూ భాషా కుటుంబం | – | 20 కోట్లు |
| 7. ద్రావిడ భాషా కుటుంబం | – | 20 కోట్లు |
| 8. జపనీస్ భాషా కుటుంబం | – | 12 కోట్లు |
| 9. అమెరికన్, ఇండియన్ | – | 1 కోటి |
| 10. బాస్కు భాషా కుటుంబం | – | 0.5 కోటి |

ఈ పది కుటుంబాలలో వాని విశిష్ట లక్షణాలను బట్టి ఎన్నో ఉప కుటుంబాలుంటాయి. ఉప కుటుంబంలో శాఖలు; శాఖలకు ఉపశాఖలు, ఉపశాఖలకు వర్గాలు, వర్గాలకు ఉపవర్గాలుంటాయి.

ప్రపంచంలో పెద్ద భాషా కుటుంబాలలో ద్రావిడ భాషా కుటుంబం ఒకటి. ద్రావిడ భాషలు మాట్లాడే వారి సంఖ్య సుమారు ఇరవై కోట్లు. ద్రావిడ భాషా కుటుంబంలో ఇప్పటి వరకు తేలిన లెక్క ప్రకారం ఇరవై యొక్క భాషలు ఉన్నాయి. 1. తమిళం 2. మళయాళం 3. కొడగు 4. కోత 5. తొద 6. కన్నడం (బడగ కన్నడ మాండలికం) 7. తుళు 8. తెలుగు 9. గోండీ (కోయగోండీ మాండలికం) 10. కొండ 11. పెంగొ 12.మండ 13.కూయి 14. కువి 15. కొలామా (నాయక్ కొలామా మాండలికం) 16. నాయక 17.పర్జీ 18.గదల 19. కూడుఖ్ 20. మాల్తో 21. బ్రాహుయీ

ఇటీవల కొందరు పరిశోధకులు దక్షిణ భారత దేశంలోని మరికొన్ని ఆటవిక జాతుల భాషలను ప్రత్యేక భాషలుగా పరిగణిస్తున్నారు. వాటిలో ముఖ్యమైనవి నీలగిరి కొండలలో ఉన్న ఇరుళ; కుఱుంబ (పాలు కుఱుంబ, ఆలుకుఱుంబ, జేను కుఱుంబ, బెట్ట కురుబ అనేవి దీని మాండలికాలు). క్రీస్తుకి మూడు నాలుగు వేల ఏళ్లకి పూర్వం మూల ద్రావిడ భాష (Profo dravidian) ఒకే భాషగా ఉండేదని అది కాలక్రమాన ఇప్పటి ద్రావిడ భాషలుగా విడిపోయిందని పండితులు తులనాత్మక పద్ధతి ద్వారా నిర్ణయించారు.

ద్రావిడ భాషలలో తమిళం, మళయాళం, కన్నడం, తెలుగు అనే నాలుగు మాత్రమే సాహిత్యవంతమైన భాషలు (Literary Languages), మిగిలిన భాషలలో ప్రాచీన లిఖిత సాహిత్యం లేనందు వల్ల వాటిని సాహిత్య రహిత భాషలు (Now, literary Languages) అంటారు. వీటిలో తుళు, కొడగు తప్ప మిగిలిన ఆటవికుల భాషలు అవడం వల్ల వీటిని ఆటవిక భాషలు (Tribal Languages) అని కూడ అంటారు. సాహిత్య రహిత భాషలకి ప్రత్యేకమైన లిపులు లేకపోయినా వాటికి కూడా ప్రాచీనకాలం నుంచి పరంపరగా వచ్చే కథలూ, గేయాలూ మొదలైన సాహిత్య సంపద పుష్కలంగానే ఉందనే విషయం మనం గుర్తుంచుకోవాలి.

ద్రావిడ భాషలు ముఖ్యంగా దక్షిణ భారతదేశమంతటా వ్యాపించి ఉన్నాయి. శ్రీలంక ఉత్తరార్ధంలో తమిళులు ఉండటం వల్ల అది కూడా ద్రావిడ భాషా స్థానంగానే పరిగణించాలి. ఉత్తర భారతదేశంలో కూడ మధ్యప్రదేశ్, ఒరిస్సా, బీహార్ రాష్ట్రాలలో కొన్ని ఆటవిక జాతుల వారు ఇప్పటికీ ద్రావిడ భాషలని మాట్లాడుతున్నారు. పాకిస్తాన్‌లో బలూచిస్తాన్ రాష్ట్రంలో ఉండే బ్రాహుయీ జాతి వారి భాష కూడ ద్రావిడ భాషే.

ద్రావిడ భాషలన్నింటినీ మూడు పెద్ద ఉపకుటుంబాలుగా విభజించవచ్చు. అవి. 1. దక్షిణ ద్రావిడ భాషలు 2. మధ్య ద్రావిడ భాషలు 3. ఉత్తర ద్రావిడ భాషలు

**దక్షిణ ద్రావిడ భాషలు :** 1.తమిళం 2. మళయాళం 3. కొడగు 4. కోత 5.తొద 6. కన్నడం (బడగ కన్నడ మాండలికం) 7.తుళు

**మధ్య ద్రావిడ భాషలు :** 1. తెలుగు 2. గోండీ (కోయగోండీ మాండలికం) 3. కొండ 4.పెంగొ 5. మండ 6. కూయి 7.కువి

**ఉత్తర ద్రావిడ భాషలు :** 1. కూడుఖ్ 2. మాల్తో 3. బ్రాహుయీ

### 1.3.5 భాష – నిర్మాణం :

ప్రతి మానవుడికి భాష మాట్లాడి అర్థం చేసుకోగలిగే శక్తి పుట్టుకతో వస్తుంది కాని పరభాష మాత్రం పుట్టుకతో రాదు. పుట్టిన శిశువు మొదట అవ్యక్త ధ్వనులు చేస్తూ పెరుగుతున్న కొద్దీ తన చుట్టూ ఉన్న వ్యక్తులు చేసే ధ్వనులు వింటూ అవి సూచించే అర్థాలు తెలుసుకుంటూ భాష మాట్లాడడమూ అర్థం చేసుకోవడమూ అలవాటు చేసుకుంటాడు. ఇలా అయిదారు ఏళ్లు వచ్చేటప్పటికి ప్రతి వ్యక్తి ఒకటి లేక అంతకన్న ఎక్కువ భాషలు దైనందిన వ్యవహారానికి సరిపోయేటంత వరకూ నేర్చుకుంటాడు.

మానవ భాషలో రెండు రకాల నిర్మాణం ఉంది. కొన్ని ధ్వనులు కలిసి ఒక పదంగా ఏర్పడడమూ, కొన్ని పదాలు కలిపి ఒక వాక్యంగా ఏర్పడడమూ అన్ని భాషలలోను ఉన్నాయి.

ఏ భాషకైనా గాని ముఖ్యరూపం ధ్వన్యాత్మకంగానే ఉంటుంది. భాష మాట్లాడేటప్పుడు మనం వినేది ధ్వనుల సముదాయమే కాబట్టి భాష ముఖ్యరూపం ధ్వనులని మనకు స్పష్టమవుతుంది.

ఒక భాషని వ్యవహర్తలు మాట్లాడేటప్పుడు ఉచ్చరించిన ధ్వనులని భిన్న వాక్యాలుగా విడగొట్టవచ్చు. వాక్యాన్ని కూడ మనం చిన్న చిన్న ముక్కలుగా అందులో ఉన్న మాటలు / పదాలుగా విడగొట్టవచ్చు. ఆధునిక భాషా శాస్త్రజ్ఞులు ఉచ్ఛారణంలో రెండు విరామాల మధ్య ఉండే ధ్వని సముదాయం వాక్యం అని నిర్వచించినారు.

**మానవ భాష – బాషోత్పత్తి :**

భాష పుట్టుక ఒక పరమాద్భుతం! మన ఊహకు అందని విషయం. ముందుగా మౌఖిక భాష ఏర్పడిందని మాత్రం నిస్సందేహంగా చెప్పవచ్చు. తర్వాత లిఖిత భాష రూపాన్ని సంతరించుకొంది. ఇటీవల మానవుడి పరిణామక్రమానికి సంబంధించిన ఎన్నో ఆధారాలు లభించాయి. కానీ అతని భాషకు సంబంధించిన భౌతిక సాక్ష్యాలేవీ కానరావు. భాషోత్పత్తని గురించిన కొన్ని సిద్ధాంతాలు తెలుసుకుందాం.

### 1.3.6 భాషోత్పత్తి – సిద్ధాంతాలు :

**1. భగవద్దత్తవాదం :** భాష దైవదత్తమని అనేక మతాలు విశ్వసిస్తాయి. మానవుడిని సృష్టించిన భగవంతుడే భాషను సృష్టించాడని వీరి అభిప్రాయం. ఒక స్వీడన్ భాషావేత్త దేవుడు ఏర్పరిచిన ఈడెన్ తోటలో ఆడం (Adam) స్వీడిష్ భాషను, సాటన్ (సర్పం) డేనిష్ భాషను, ఈవ్ (Eve) – ఫ్రెంచ్ భాషను మాట్లాడారని విశ్వసించాడు. ఈ వాదం ప్రకారం హిందువులకు సంస్కృత భాష, మహమ్మదీయులకు అరబిక్ భాష, క్రైస్తవులకు హిబ్రూ భాషలు దైవభాషలు.

భగవంతుడు ఒక్కడే అయినప్పుడు ఒకే రకమైన భాష ఉండాలి. కాబట్టి ఈ వాదనకు హేతుబద్ధత లేదు. అంటే కార్యకారణ సంబంధం (Relation between Cause & Effect) లేదు. ఈ వాదం తాడూ బంగారం లేని పుక్కిటి పురాణం.

**2. స్వభావ వాదం :** పైథాగరస్, ప్లేటో వంటి స్వభావవాదులు భాష ఆవశ్యకతను బట్టి స్వాభావికంగా ఉత్పన్నమైందని భావించారు.

**3. సాంకేతిక వాదం :** సంకేత వాదులలో డెమిట్రియస్, అరిస్టాటిల్ ముఖ్యులు. వీరు భాష సంకేతాల ద్వారా ఏర్పడుతుందని భావించారు.

**4. సహజ ధ్వని ఆధారవాదం :** సహజ ధ్వనుల ద్వారా భాష ఉద్భవించిందని కొన్ని వాదాలు ప్రతిపాదించాయి. వాటిలో ముఖ్యమైవని కొన్ని..

**(ఎ) బౌబౌ వాదం :**

ఆదిమానవుడు తన పరిసరాల్లో ఉన్న సహజ ధ్వనులను అనుకరించడం ద్వారా భాషను నిర్మించుకొన్నాడని ఈ వాదం తెలియజేస్తుంది. కాకా, భౌబౌ, మేమే లాంటి జంతువుల ధ్వనులను ఆయా జంతువులని సూచించే పదాలుగా ఏర్పరచుకొన్నారు. (ఉదా : కాకి, మేక)

కొన్ని పదాల ఉచ్చారణలు సహజ ధ్వనులకు దగ్గరగా ఉండటం ఈ వాదానికి ఆధారం కానీ ఈ సిద్ధాంతం ధ్వనులతో ఏ సంబంధమూ లేని ఎన్నో పదాలు ఎలా పుట్టాయో వివరించలేదు. ఈ వాదం భాషా నిర్మాణం గురించి కూడ పేర్కొనలేదు. పైగా ఈ ధ్వనులు చేసే జంతువులను వేరు వేరు భాషల్లో వేరు వేరు విధాలుగా పిలుస్తారు. తెలుగులో కాకి ఇంగ్లీషులో 'క్రో' అవుతుంది. తెలుగు 'మేక' ఇంగ్లీష్ 'గోట్'గా మారుతుంది. హిందీలో 'బకరా' – అన్ని భాషల్లోనూ ఈ పేర్లు ఒకలాగే వుండాలి కదా!

**(బి) పూ పూ లేదా టట్ టట్ వాదం :**

బాధ, భయం, సంతోషం, విస్మయం మొదలయిన మనోభావాలు వ్యక్తం చేయడానికి మానవుడు అప్రయత్నంగా వెలవరించిన ఓహో, ఆహా, ఫ్చ్ లాంటి ధ్వనుల నుంచి భాష పుట్టిందని కొండికల్ అనే భాషావేత్త ప్రతిపాదించాడు. డార్విన్ వంటి శాస్త్రజ్ఞులు ఈ ధ్వనులు కొన్ని శారీరక కారణాల వల్ల ఏర్పడతాయని తెలిపారు.

**(సి) యో – హీ – హో వాదం :**

మరొక సహజ ధ్వనుల వాదాన్ని యో హీ హో సిద్ధాంతంగా పిలుస్తారు. ఒక వ్యక్తి శారీరక శ్రమ చేసేటప్పుడు, ముఖ్యంగా అలాంటి పనిలో కొంతమంది వ్యక్తులతో కలిసికట్టుగా శ్రమించవలసి వచ్చినపుడు తమ శ్రమను మరిచిపోడానికి చేసే ధ్వనులు భాషోత్పత్తికి మూలం అని 'నోయిర్' అనే భాషావేత్త అభిప్రాయపడ్డాడు. పడవలను నడిపేటప్పుడు నావికులు చేసే యో–హీ–హో ధ్వనులను బట్టి దీనికి ఈ పేరు ఏర్పడింది. నావ నడిపేటప్పుడు తెలుగువాళ్లు 'హైలెస్సా' అంటూ పడవ పాట పాడతారు కనుక; దీనిని 'హైలెస్సా' వాదం అన్నా తప్పులేదేమో!

**(డి) డింగ్ – డాంగ్ వాదం :**

ఈ వాదం ప్రకారం ధ్వనికీ భావానికి అవినాభావ సంబంధముంది. ఆదిమానవుడు ప్రకృతి నుంచి గ్రహించిన ధ్వనులను కొన్ని అతీంద్రియ సంబంధాల ప్రభావం వల్ల వాగ్రూపంగా మార్చుకొన్నాడు. ఆ వాగ్రూపాలే భాషగా రూపొందాయని ఈ వాదం తెలియజేస్తుంది. ఈ వాదాన్ని మాక్స్ ముల్లర్ ప్రతిపాదించాడు. ఉదా : డింగ్ డాంగ్ బెల్, గంట 'గణ గణ' మోగింది, గుండె 'దడ దడ' లాడింది.

**మౌఖిక అభినయవాదం :**

శారీరక అభినయానికి మౌఖిక ధ్వనులకు మధ్య దగ్గర సంబంధముంటుంది. ముఖ కవళికలు, హస్త విక్షేపణ విన్యాసాలను మనుషులు అప్రయత్నంగా అనుకరించడానికి యత్నిస్తారని, ఈ అనుకరణానికి ఫలితంగా భాష ఏర్పడిందని డార్విన్ శాస్త్రజ్ఞుడు భావించాడు.

ఆధునిక మానవుడు కూడా శరీరం, చేతులు, ముఖ కవళికలు అభినయాల ద్వారా భాషను వ్యక్తీకరిస్తున్నాడు. డార్విన్ ప్రతిపాదించిన ఈ సిద్ధాంతం ప్రకారం ఆది మానవుడు మొదటగా శారీరక హావభావాలు పెంపొందించుకొన్నాడు. తరవాత వాటికి అనుగుణంగా నాలుక, పెదవులు మొదలయిన ముఖ యంత్రంలోని చేతల ద్వారా కదలికలు ఏర్పడి ఎన్నో శబ్దాలు ధ్వనులుగా ఏర్పడ్డాయి. ఈ ధ్వనుల నుంచి భాష ఏర్పడిందని ఈ వాదన సూచిస్తుంది.

అభినయం ద్వారా ఎన్నో భావాలను వ్యక్తం చేయగలిగినప్పటికీ భాషలోని అన్ని శబ్దాలు, పదాలు అభినయానికి అందవు అనేది ఈ వాదంపై ఉన్న విమర్శ.

**ధాతు వాదం :**

సంస్కృత భాషావేత్తలు ఈ వాదాన్ని ప్రతిపాదించారు. ఈ వాదాన్ని మొదట ప్రతిపాదించినవాడు ప్రాచీన భారత శాస్త్రజ్ఞులలో ప్రముఖుడైన యాస్కాచార్యులు. ఈయన ధ్వన్యనుకరణం వల్ల ఏర్పడిన శబ్దాలు కూడ ధాతువుల నుంచి ఉత్పన్నమవుతాయని సూచించాడు. యాస్కునికి పూర్వమే ధాతువాదానికి బీజాలు ఏర్పడినా దానిని స్పష్టంగా నిరూపించింది యాస్కుడే. ధాతువుల నుంచి భాష ఆవిర్భవించిందని; ప్రతి పదానికి ఒక ధాతువు ఉంటుందని ఈ వాదన తెలియజేస్తుంది. మొదట క్రియాపదాలు ఉత్పన్నం అయ్యాయని ఆ తరవాత మిగిలిన పదాలు ఏర్పడ్డాయని ఈయన అభిప్రాయం. ఈ వాదన పూర్తిగా కాకపోయినా కొంతమేరకు హేతుబద్ధమైనది.

**నైయాకరణ; వైయాకరణల వాదాలు :**

భారతదేశంలో భాషోత్పత్తి ప్రవర్తకులను నైయాకరణలు, వైయాకరణులుగా గుర్తించవచ్చు. నైయాకరణ పదానికి ఈశ్వర సంకేత రూపమైన శక్తి ఉందని, ఆ శక్తి వల్లనే పదానికి అర్థం నిర్ణయించబడుతుందని భావించారు.

వైయాకరణులు దీనిని అంగీకరించకుండా పదానికి అర్థానికి గల సంబంధం మానవ సంకేత జనితమే అని భావించారు. లోకంలోని వ్యవహారాలను బట్టే పదాలకు అర్థాలు ఏర్పడతాయని వీరి అభిప్రాయం.

వీరి వాదం ప్రకారం ఆదిదంపతులైన పార్వతీ పరమేశ్వరుల్లా; శబ్దాన్ని ఆశ్రయించి అర్థం; అర్థాన్ని ఆశ్రయించి శబ్దం ఉంటాయి. అందుకే శబ్దార్థాలు శివపార్వతుల ప్రతిరూపాలు!

**సహజ పరిణామ వాదం :**

జీవపరిణామ సిద్ధాంతం ప్రకారం మానవుడుప ప్రాచీన జీవజాలం నుండి పరిణామ క్రమంలో అత్యున్నతస్థానం అందుకున్నాడు. డార్విన్ జీవపరిణామ సిద్ధాంతం ఎంత సత్యమో; భాషల క్రమపరిణామం కూడా అంతే సత్యం! ఈ పరిణామక్రమంలో పక్షులు, క్షీరదాలు లాంటి కొన్ని జీవులకు ధ్వని వెలువరించే శక్తి ఉంది. కానీ మాట్లాడలేవు. మానవుడికి దంతాలు, పెదవులు, స్వరపేటిక మొదలయిన శరీర భాగాలు ఎంతో పరిణతి చెంది మాటలు వెలువరించడానికి అనువుగా రూపొందాయి. ఈ విధంగా సహజ సిద్ధ క్రమ వికాస పరిణామ ఫలితంగా భాష ఉత్పన్నమైందని చాలా ఎక్కువమంది భావిస్తారు. ఇది చాలా శాస్త్రీయమైన; హేతుబద్ధమైన వాదం.

**చర్చకు నిలబడే వాదం :**

ఏకకణ జీవుల నుండి బహుకణజీవులు ఎలా ఉద్భవించాయో; కోటానుకోట్ల సంవత్సరాల కాలగమనంలో చేపలు; సరీసృపాలుగా; క్షీరదాలుగా; క్రమక్రమంగా కోతులుగా ఎలా పరిణామం చెందాయో; కోతి నుండి ఎలా మానవుడు రూపొందాడో జీవపరిణామ స్ధింతం ఆధారాలతో సహ రుజువు చేస్తుంది. అలాగే వివిధ కాలాలలో తన అవసరం కోసం మానవుడు చేసిన అనేక ధ్వనులే భాషగా రూపాంతరం చెందాయి. ఒకే భాష నుండి అనేక భాషలు పుట్టుకొచ్చాయి. అయితే ఈ సిద్ధాంతాన్ని అర్థం చేసుకోడానికి భాషోపాధ్యాయుడికి కొంత జీవశాస్త్ర పరిజ్ఞానం అవసరం!

**సంపాదన (అనుభవ) వాదం :**

తత్వశాస్త్రంలోని అనుభవ వాదం ప్రాతిపదికగా ఇది రూపొందినది. నిజం, జన్మతః సిద్ధించదని, అనుభవం ద్వారా మాత్రమే సమకూరుతుందని ఈ వాదం తెలియజేస్తుంది. శిశువులు పెద్దల మాటలను అనుకరించడం

ద్వారా భాషను అభ్యసించడం ఈ వాదనకు ఆధారం. బి.ఎఫ్.స్కిన్నర్ వంటి మనస్తత్వ శాస్త్రజ్ఞులు ఈ వాదనను బలపరుస్తారు.

**స్వతః సిద్ధ వాదం :**

హేతువాదం ఆధారంగా 'చామ్‌స్కీ' ప్రతిపాదించిన అత్యంత ఆధునిక సిద్ధాంతం ఇది. ఈ వాదం అనుభవ పూర్వక సంపాదనావాదాన్ని ఖండిస్తుంది. దీని ప్రకారం మానవుడికి భాష స్వతః సిద్ధంగా అలవడుతుందనీ అనుభవాలు కేవలం ఉద్దీపనాన్ని కలిగిస్తాయని ఈయన అభిప్రాయం. ఏ భాషలోనైనా శిశువులు అయిదారేళ్లకే మాట్లాడటం నేర్చుకోవడం ఈ వాదానికి ఆధారం. స్వతః సిద్ధంగా కాకపోతే అంత చిన్నవయస్సులో భాషాదక్షత అందరికీ అలవడదని వీరి అభిప్రాయం. పిల్లలు పెరిగి పెద్దవారైన తరవాత, వారి అనుభవాలలో తేడాల వల్ల వారి భాషాభివృద్ధిలో తారతమ్యాలు ఉత్పన్నమవుతాయి. కాబట్టి భాష జన్మతః అలవడుతుందని 'చామ్‌స్కీ' భావించాడు.

చిన్న పిల్లల మెదడులో "సార్వత్రిక భాషా వికాసం" (Universal Linguistic Faculty) వుంటుందని, శైశవ దశ నుండే వారు పరిసరాల నుండి విన్న పదాలు గ్రహించిన శబ్దాలు ఆ విభాగంలో ఎప్పటికప్పడు చేరి; వారికి ఒక వయస్సు వచ్చేటప్పటికి ఎవరూ నేర్పకుండా స్వతసిద్ధంగానే వారు మాట్లాడతారని; అందుకే నాలుగైదేండ్ల లోపు పిల్లలు అందుకు తగిన పరిసరాలు తోడైతే మూడు నాలుగు భాషలైనా సులువుగా మాట్లాడగలరని సాక్ష్యాధారాలతో నిరూపించారు. భాషోత్పత్తి వాదాల్లో చామ్‌స్కీ సిద్ధాంతం గొప్ప విప్లవం.

పై వాదాలలో ఏ ఒక్కటి కూడా భాషోత్పత్తిని సమగ్రంగా వివరించకపోయినా కొన్ని మాత్రం శాస్త్రబద్ధమైనవి.

ఈ వాదాలన్నీ భాష యొక్క ఏదో ఒక మధ్య స్థితినే తెలుపుతున్నాయి. కానీ ఆరంభ స్థితిని తెలిపేవి కావు. నిజమైన ఆ ఆరంభం అనిర్వచనీయమైనది.

**ముఖ్యాంశాలు :**

- భాషను భగవంతుడే సృష్టించాడని భగవద్దత్తవాదం అంటుంది. పరిసరాల్లోని ధ్వనుల ప్రభావం వల్ల, మనోభావాల వ్యక్తీకరణలో వెలువడిన ధ్వనుల ద్వారా భాష ఏర్పడిందని సహజ ధ్వని ఆధారవాదాలు పేర్కొంటాయి.
- శారీరక అభినయం. మౌఖిక ధ్వనులకు మధ్య గల సంబంధం నుంచి భాష ఉద్భవించిందని మౌఖికాభినయవాదుల అభిప్రాయం. ధాతువుల నుంచి భాష ఆవిర్భవించిందని ధాతువాదం అంటుంది. డార్విన్ పరిణామ సిద్ధాంతం నేపథ్యంలో భాష ఉత్పన్నమైందని ఎక్కువమంది ఆలోచనాపరుల అభిప్రాయం.
- మానవుడు స్వతస్సిద్ధంగా భావాలను కలిగి ఉన్నట్లే భాష కూడ స్వతసిద్ధంగా అలవడుతుంది అని చామ్‌స్కీ అభిప్రాయం. ఇది జన్యువుల ప్రభావానికి సంబంధించిన విషయం.
- ఈ వాదాలు భాష పుట్టుకపై భాషావేత్తల అభిప్రాయాలను తెలియజేస్తున్నాయి. ఇవేవీ సమగ్రమైనవి కానప్పటికీ భాషోత్పత్తికి సంబంధించిన కొంత సమాచారాన్ని ఇస్తాయి.
- భాషోత్పత్తి సిద్ధాంతాలో చామ్‌స్కీ సిద్ధాంతం గొప్ప విప్లవం.

# భాష - మాతృభాష నేర్చుకోవడంలో మాతృభాష ప్రాధాన్యత - మాతృభాషలో అభివ్యక్తి

1.4.1

భావ వ్యక్తీకరణకు భావ గ్రహణానికి ఉపయోగపడే అర్థవంతమైన పదాల కూర్పు భాష. సామాన్య వ్యవహారం నుంచి ఆధ్యాత్మిక చింతన వరకు అన్ని రకాలైన వ్యవహారాలకు భాష తోడ్పడుతుంది. భావనామయమయిన మానవ జీవితానికి భాష విశిష్ట సాధనం.

**భాష - నిర్వచనాలు :**

భాష మొదట మౌఖికంగా కొనసాగే సంకేత ప్రక్రియ. 'భాష' అనే శబ్దం 'భాష్' అనే సంస్కృత ధాతువు నుంచి ఏర్పడింది. భావ వ్యక్తీకరణకు ఉపయోగపడే అర్థవంతమయిన శబ్ద సముదాయమే భాష అని పలువురు భాషావేత్తల అభిప్రాయం.

Language is a purely human, non instimative method of communicating ideas, emotions and desires by means of a system of Valuntarily Produced symbols - Saphire.

భావ వినిమయంలో తమ భావాలను, ఉద్వేగాలను కోరికలను స్వతహాగా వెలువడిన సంకేతాల ద్వారా వ్యక్తం చేయడానికి రూపొందించుకొన్న సాధనం భాష. ఈ నిర్వచనం ప్రకారం భాష అంటే ప్రత్యేక సంకేతాలకు ప్రత్యేక అర్థాలను ఆపాదించే సూత్రాలు కలిగిన నిర్మాణ వ్యవస్థ.

ఎమ్మెన్, బాక్ (Emman Bach) అనే భాషావేత్త.

'Language is an infinite set of sentences'

'భాష అనంత వాక్యాల సముదాయం' - అని నిర్వచించారు.

స్టర్ట్‌వర్ట్ (Sturtvert) తన గ్రంథంలో Linguist Change లో "Language is system of arbitary vocal symbols through which members of a social group interact, co-operate and transmit their culture"

యాధృచ్ఛికమైన నిర్మాణ సౌష్ఠవంతో మానవ సమాజంతో భావ వినిమయానికి, పరస్పర సహకారానికి సంస్కృతీ పరివ్యాప్తికి ఉపకరించే వాగ్రూప ధ్వని సంకేత సముదాయం భాష అని అర్థం.

Simon Pottor అనే భాషావేత్త

"A Language may be difined as a system of arbitary vowel sounds by means of which human beings communicate and Co-operate with one another"

"మానవులు ఒకరికొకరు తమ అభిప్రాయాలను తెలియజేసుకోవడానికి, పరస్పరం సహకరించుకోవడానికి ఉపయోగించే అర్థవంతమైన యాధృచ్ఛిక ధ్వనుల సమూహమే భాష".

Hacket అనే భాషావేత్త

"A Language is a complex system of speech habits".

"వివిధ భాషణ అలవాట్లతో కూడిన సంక్లిష్ట వ్యవస్థే భాష".

వ్యాకరణకారుల ప్రకారం 'ప్రకృతి ప్రత్యయ పద నిరూపణమే భాష'.

ప్రకృతి అంటే పదమూలం లేదా ప్రాతిపదిక. ప్రాతిపదిక మీద చేరే రూపం ప్రత్యయం. ఈ రెండు కలిసి పదం ఏర్పడుతుంది.

Noam Chomsky భాషను ఈక్రింది విధంగా నిర్వచించాడు.

"Language is particuler set of sentences that can be generated from a particular set of rules"

"భాష అనేది ప్రత్యేక నియమాల సముదాయం ఆధారంగా నిర్మించిన ప్రత్యేక వాక్యాల సముదాయం." చామ్‌స్కీ దృష్టిలో ఈ నియమాలు మానవ మేధస్సులో సహజంగా ఉండి భాషతత్వాన్ని తెలియజేస్తాయి.

ప్రఖ్యాత హిందీ భాషా వేత్త రామచంద్ర వర్మ అభిప్రాయంలో మనస్సులోని భావ పరంపరను ఏ పదాల ద్వారా ఏ వాక్యాల ద్వారా ఎదుటి వారికి అందిస్తాయో అదే భాష.

"ప్రజలు మాట్లాడుకునే తీరే భాష" – అని మరో ఆధునిక నిర్వచనం.

పై నిర్వచనాలన్నీ భాషను వివిధ ధృక్కోణాలలో దర్శిస్తున్నాయి. ఈ నిర్వచనాలన్నీ భాష స్వరూపాన్ని స్వభావాన్ని లక్షణాలను కొంత మేరకు వివరించగలుగుతున్నాయి. వీటిలో ఏ ఒక్క నిర్వచనం సమగ్రంగా అనిపించకపోవచ్చు. కాని అన్ని నిర్వచనాలు భాష అంటే ఏమిటో తెలుసుకోవడానికి కొంత వరకు సహకరిస్తున్నాయి.

**మాతృభాష :–**

తల్లి నుంచి నేర్చుకొనే మొట్టమొదటి భాష మాతృభాష. అప్రయత్నంగా నేర్చుకొని జీవితాంతం ఉపయోగించే భాష. శైశవ దశలో వ్యక్తిగత మనోభావాలను వ్యక్తం చేయడానికి ఉపయోగించే భాష. తల్లిదండ్రులు, పోషకులు ఏ భాషా పరిసరాలలో నివసిస్తారో ఏ భాషను శిశువు, స్వతహాగా సులువుగా గ్రహిస్తే అదే అతని మాతృభాష. అసంకల్పితంగా వ్యక్తీకరించే భాషా ధ్వనుల రూపమే మాతృభాష. భావ వ్యక్తీకరణ, భావగ్రహణ, సులభంగా జరిగే భాష మాతృభాష.

**నేర్చుకోవడంలో మాతృభాష ప్రాధాన్యత :**

మన మాతృభాష తెలుగు. అది సహజంగా అలవడుతుంది. అప్రయత్నంగా సునాయాసంగా వచ్చేది మాతృభాష. ఏ భాషను శిశువు అసంకల్పితంగా మాట్లాడతాడో, ఏ భాష ఇతర భాషల అభ్యసనంపై ప్రభావం చూపుతుందో ఆ భాషనే మాతృభాష అంటారు.

భాషేతర విషయాలైన గణితం, సామాన్యశాస్త్రం, సాంఘికశాస్త్రాల అభ్యసనంలో కూడ మాతృభాషకే ప్రాధాన్యత ఎక్కువ. మాతృభాషలో అభ్యసించిన విషయాలు ఎక్కువకాలం గుర్తుంటాయి. ఇతర భాషల్లో కన్నా మాతృభాష అభ్యసనం సులభంగా ఉంటుంది. వేగవంతమవుతుంది.

**1.4.2 మాతృభాషలో అభివ్యక్తి :**

సూర్యరాయాంధ్ర నిఘంటువు ప్రకారం 'అభివ్యక్తం' అంటే స్పష్టపరచడం, తేటతెల్లం చేయడం. 'అభివ్యంజనం' అంటే బయటకు ప్రకటించడం. అభివ్యక్తి అంటే బయటకు వెల్లడించడం, ప్రతిబింబించడం.

మాతృభాషలో అభివ్యక్తి అంటే తన తల్లిభాషలో తన భావాలను వెల్లడించడం. ఏ భాషకైనా ప్రధాన లక్ష్యం ఇదే! భావ వ్యక్తీకరణ మాతృభాషలో వున్నంత సౌలభ్యం ఇతర భాషలలో రాదు.

స్త్రీ మూర్తులందరిలో తల్లికి ఒక విశిష్ట స్థానం ఉంది. అలాగే భాషలన్నింటిలో మాతృభాషకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. తల్లి కేవలం పిల్లల అవసరాలను తీర్చడం వల్లనే గొప్ప వ్యక్తి కావడం లేదు. వాళ్ల మామూలు అవసరాలను చూడడంతో పాటు మమత, మాధుర్యం పంచిపెట్టడం వల్లనే తల్లి గొప్పదిగా పరిగణింపబడుతోంది. అలాగే మాతృభాష కూడా మానసికమైన ఆనందాన్ని; భావ సౌందర్యాన్ని అద్భుతంగా పంచిపెడ్తుంది. అందుకే భాషలన్నింటిలోనూ మాతృభాషకు విశిష్టమైన స్థానం వుంది. మానసిక వికాసానికి; ప్రస్ఫుటమైన భావ అభివ్యక్తికి మాతృభాషే తొలిమెట్టు.

"ఎంత చదువు చదివి; ఎంత సాధించినా
మాతృమూర్తినెపుడు మరువరాదు!
అమ్మ లేని జన్మ చిమ్మచీకటి కదా!
భాస్కరార్యుమాట! ప్రగతి బాట!! – కుందా

పరిపూర్ణ మానవుడిగా; ఉత్తమ పౌరుడిగా; చక్కని భావప్రకటనల గల ఉపాధ్యాయుడిగా; వక్తగా; కవిగా; రచయితగా; సామాజిక నాయకుడిగా మారాలంటే; సమాజంలో పాత విలువల స్థానంలో కొత్త విలువలు ప్రతిష్టించాలంటే మాతృభాషపై ఎంత పట్టు వుంటే అంతమంచిది. అందుకే ఛాత్రోపాధ్యాయులకు మాతృభాషాధ్యయనం తప్పనిసరి! దానిపైనే మనందరి గురి!

**1.4.3 భాష గురించి అనుమానాలు / అపోహలు :**

ఆధునికయుగం ప్రారంభం నుంచీ భాషను గురించి కొన్ని అనుమానాలు లేక అపోహలు ఉన్నాయి. మనం వాటిని తొలగించుకొని వాస్తవాలు తెలుసుకుందాం.

ఇంగ్లీషులో ఏ విషయమైనా బాగా చెప్పగలం కానీ; మాతృభాషలో అలా చెప్పలేమనేవారున్నారు. అందుకు నిజమైన కారణం వాళ్లు తెలుగులో సరైన ఆసక్తి కనబరచకపోవడమే! తెలుగులో సహజంగా మాట్లాడగలిగే నైపుణ్యాన్ని, అలవాటును కావాలని దూరం చేసుకోవడం వల్ల ఈ సమస్య వస్తున్నది.

ఇంగ్లీషు నుండి విజ్ఞాన శాస్త్ర గ్రంథాలను తెలుగులోనికి అనువదించలేమనేది మరొక అపోహ. పారిభాషిక పదాలన్నింటినీ ; తెలుగులోకి అనువదించి తీరాలనేది లేదు. వీలైన వాటిని అనువదించి ; వీలు లేని పదాలను అలాగే తెలుగులో వాడుకుంటే మంచిది. అలా చేస్తే తెలుగు భాష మరింత సుసంపన్నం అవుతుంది కూడా. ఆనాటి అధికార భాషాసంఘం అధ్యక్షుడు డా॥సి.నారాయణరెడ్డి అభిప్రాయం కూడా ఇదే!

ఇతర భాషా ప్రాంతాలకు వెళ్లి ఉద్యోగాలు చేయాలంటే తెలుగు బోధనా భాషగా నేర్చుకున్న విద్యార్థులకు కుదరదనే అభిప్రాయం కూడా ఉంది. ఇలా ఇతర ప్రాంతాలకు వెళ్లే విద్యార్థులు తమకు కావలసిన ఇంగ్లీషు; హిందీ భాషలను శ్రద్ధగా నేర్చుకున్నట్లయితే తమ మాతృభాషలో నేర్చుకున్న విషయ పరిజ్ఞానాన్ని ఆయా భాషలలో అవసరమైనపుడు బాగానే వ్యక్తీకరించగలరు. బాగానే రాణించగలరు.

పోటీ పరీక్షలలో ఇంగ్లీషు భాషలో చదివిన విద్యార్థులే ఎక్కువగా విజయం సాధిస్తున్నారనేది ఒక అభిప్రాయం. మాతృభాషలో విషయాలు నేర్చుకున్న విద్యార్థులు పోటీ పరీక్షలలో రాణించలేరని అనుకోవడం పొరపాటు. విషయాలు బాగా అర్థం అయ్యేది మాతృభాషలో చదివిన వారికే! అయితే వాటిని ఇంగ్లీషులో రాయడంలో కూడా వారికి తగినపట్టు ఉండాలి. ఎందరో భాషావేత్తలు ; పరిశోధించి తేల్చి చెప్పిన నగ్న సత్యాలివి!

**1.4.4 భాష సబ్జక్టులతో సంబంధం / అభ్యసనంలో భాష పాత్ర**

అభ్యసనంలో భాషపాత్ర 'అపారం'. భాష లేని అభ్యసనం పాత్ర లేని మధుపానం. బోధన; అభ్యసనం – ఈ రెండూ జమిలి కల నేత వంటివి. అయితే శిశుకేంద్రీకృత విద్యలో అభ్యసనానికే ఎక్కువ ప్రాధాన్యత వుంది. ఏ సబ్జెక్టు బోధించే ఉపాధ్యాయుడైనా భాషలో తగిన పట్టు వుండి; సృజనాత్మకత అందుకు తోడైతే విద్యార్థుల అభ్యసనాన్ని సులభతరం చేయగలడు.

"Every subject Subjest Teacher is basically a language Teacher" అన్నారు అందుకే! సబ్జక్టు బోధనలో సృజనాత్మకతకు; తద్వారా భాషకు ఎంత ప్రాధాన్యత ఉందో ఇటీవల కుందా భాస్కరావు రాసిన "మనసు వాకిళ్లు" కథా సంపుటి చదవండి. అందులోని 'మనసు వాకిళ్లు' కథ ఆనందకరమైన అభ్యసనం (Joyful Learning) మరియు కృత్యాధార బోధనకు అద్దం పడుతుంది. బోధనా విధానం పై కథ రాయడం సాహిత్యంలో సరికొత్త ప్రయోగం. ఈ కథ ద్వారా పాఠంలోని ఒక అమూర్తభావనను తన సృజనాత్మక భాషా పాటవం ద్వారా 'జ్ఞానేశ్వరి' అనే ఉపాధ్యాయురాలు ఎలా తరగతి గదిలో ఆవిష్కరిస్తుందో మనకు అర్థమైపోతుంది. జ్ఞానేశ్వరి వంటి టీచర్లుగా మారాలి మీరు! సైన్సులో ఒక 'కిరణజన్య సంయోగ క్రియ'ను చెప్పినా, సాంఘిక శాస్త్రంలో ఒక "అశోకుడి కళింగయుద్ధం" గురించి చెప్పినా, గణితంలో 'భాగాహారం – గుణకారం' నేర్పినా బాష తోడ్పాటు

లేకుండా; భాషపై పట్టు లేకుండా అర్ధవంతంగా బోధించడం కష్టం. పువ్వులు విరబూయడానికి; ఫలదీకరణకు సూర్యరశ్మి ఎంత అవసరమో సబ్జక్టుపరమైన వివరణకు భాష అంత అవసరం! సబ్జక్టుతో అనేక ఇతర విషయాలు సహ సంబంధపరచ వలసి వుంది. ఇతర అంశాలతో సహ సంబంధం లేని పాఠం దీపం లేని చీకటి గది లాంటిది.

## 1.4.5 తెలుగు భాష – ధ్వని – వర్ణం – అక్షరం – పదం, తెలుగు వర్ణ నిర్మాణ క్రమం – వాక్య నిర్మాణం – తెలుగు వాక్యం, ధ్వని పరిణామం, అర్ధపరిణామం.

**ధ్వని :**

మానవుడి వాగేంద్రియాల నుంచి ఉత్పన్నమైన భాషా విజ్ఞానానికి ఉపయోగపడే ప్రతి శబ్దాన్ని 'ధ్వని' అంటారు. ఏ భాషకైనా దాని ముఖ్య రూపం ధ్వన్యాత్మకం గానే ఉంటుంది. మానవులు మాట్లాడేటప్పుడు రకరకాల ధ్వనులు ఎలా ఉత్పత్తి చేయగలుగుతున్నారో వివరించేది ధ్వని శాస్త్రం (Phonetics).

**వర్ణం :**

అర్ధభేదక శక్తి కలిగిన కనిష్ఠ ధ్వని రూపాన్ని 'వర్ణం' అంటారు. సంస్కృత వైయాకరణులెవ్వరూ వర్ణ నిర్ణయం చేయడానికి ప్రయత్నించలేదు. ఇది ఆధునిక భాషా శాస్త్రం వివరిస్తుంది. ఉదా :– మామిడి – మావిఁడి ; చీమ – చీవఁ ; మామ – మావఁ ఈ ఉదాహరణల్లో ధ్వని భేదమే కాని అర్ధభేధం లేదు.

ప్రతి భాషలోనూ కొన్ని మాటలలో ఒకే ఒక స్థలంలో స్వల్పమైన భేదం ఉన్నా రెండు విచ్ఛిన్నమైన ధ్వనులను పొందటం వల్ల ఆ మాటలకర్ధం మారిపోతుందని మనందరికి తెలుసు. ఈక్రింది జంటలను పరిశీలించండి.

| | |
|---|---|
| కోడలు – గోడలు | తడి – దడి |
| చుట్టు – జుట్టు | పుట్ట – బుట్ట |
| పేట – పేడ | కల – కళ |

పై ఉదారహరణలలో క, చ, ట, త, ప లు శ్వాస స్పర్శాలు. గ, జ, డ, ద, బ లు నాద స్పర్శాలు. ఒక్కొక్క జంటలో ఈ ధ్వనులలో శ్వాసనాధ భేదమే తప్ప వేరే భేదం లేదు. అలాగే చివరి ఉదాహరణలలో 'ల' దంత మూలీయ పార్శ్వికం. 'ళ' మూర్ధన్య పార్శ్వికం. క–గ మొదలైన జంటల మధ్య భేదం అతి స్వల్పమే అయినా ఈ భేదం వల్ల రెండు మాటలలో అర్ధభేదం కలుగుతోంది. కాని ఒకే భాషలో ఉన్న అన్ని ధ్వనుల్లో అవి ఉన్న మాటలలో ఇలా అర్ధభేదం కలుగుతోంది.

**అక్షరం :**

ఒక అచ్చు తప్పకుండా ఉండే ధ్వనిని 'అక్షరం' అంటారు. ఉదా : 'బిడ్డ' అనే మాటలో (బ్+ఇ+డ్+డ్+అ) ధ్వనులు ఐదు. అక్షరాలు మాత్రం రెండే.

**పదం :**

విడి ధ్వనులకు అర్ధం లేకపోయినా అవి కొన్ని విధాలుగా పరస్పరం కలియడం వల్ల ఏర్పడిన మాటలకి అర్ధాలు ఉంటాయి. వాక్యాన్ని చిన్న చిన్న ముక్కలుగా అంటే అందులో ఉన్న మాటలు పదాలుగా విడగొట్టవచ్చు. సాధారణంగా 'పదం' అనే దాన్ని జనులు ఏ అర్ధంలో వాడతారో ఆ అర్ధంలోనే వాడుతూ, దీన్ని ఇంకా చిన్న ముక్కలుగా చేయడానికి అవకాశం ఉందా? అనే విషయం పరిశీలిద్దాం. ఉదా : ఇల్లు, ఊరు, పని, చొక్కా – ఇవి మాటలు / పదాలు. వీటిని భాగాలుగా విడగొడితే ఇ, ల్, ల్, ఉ; ఊ, ర్, ఉ; ప్, అ, న్, ఇ – ఇలా వాటిలో ఉన్న ధ్వనులు ప్రత్యేకంగా తెలుస్తాయి. కాని ఈ ధ్వనులకి అర్ధాలు లేవు. ఇవి కలియడం వల్ల ఏర్పడిన మాటలకి అర్ధాలు ఉన్నాయి.

ఒక ధ్వనే కొన్ని సందర్భాలలో మాటగా ఉండవచ్చు. ఆ చెట్టు, ఈ చెట్టు, ఏ చెట్టు అనే వాటిలో ఆ, ఈ, ఏ లకి అర్థాలు ఉన్నాయి. కాబట్టి ఇవి మాటలుగా పరిగణించాలి. కాని ఆకలి, ఈగ, ఏనుగులలో ఆ, ఈ, ఏలకి అర్థం లేకపోవడం వల్ల అవి మాటలు కావు. అర్థాలు లేని కొన్ని ధ్వనులు కొన్ని కలిపి అర్థవంతమైన మాటలను ఏర్పరచడం విడివిడిగా ప్రయాణ యోగ్యం కాని చక్రం, కాడి మొదలైనవి కలిపి ప్రయాణయోగ్యమైన బండిగా ఏర్పడడం వంటిదని పతంజలి మహర్షి చెప్పారు.

1.4.6. తెలుగు వర్ణ నిర్మాణ క్రమం

వేల వేలవత్సరాల కాలగమనంలో, మానవుడు ప్రాక్తన దశ నుండి పరిణామం చెందుతున్న శుభవేళలో భాష కళ్లు తెరిచి, చిలిపి బొమ్మల లిపి నుండి ఈనాటి లిపికి రాత మార్పు చెందుతున్న క్రమంలో అర్థవంతమైన ధ్వనులకు కొన్ని సంకేతాలు ఏర్పరుచుకున్నాడు. ఆ సంకేతాలు ప్రస్ఫుటత కోసం ఏవో రంగులు పూసారు. రంగు (వర్ణం) పూయబడింది కాబట్టి అది వర్ణమయింది. ఆ వర్ణమే యుగాలు గడిచే కొద్దీ కొత్త అర్థాలు; అందాలు సంతరించుకుంటూ 'సువర్ణం' అయింది. సువర్ణాల సమాహారమే అర్థవంతమైన వాక్యంగా మారింది.

రంగులు పూయడాన్ని లేపనం అంటారు. చందన లేపనం, బంగారు లేపనం – ఇలా! లేపనం నుంచి వచ్చిన పదమే 'లిపి'. కనుక భాషలో వర్ణాలు ఎలా సృష్టింపబడతాయి? వాటి శాస్త్రీయ నిర్మాణ క్రమం ఏమిటి? వర్ణాలు వాక్యాలుగా ఎలా మారతాయి? వాక్య నిర్మాణంలోని విన్యాసాలు ఏమిటి? భాషకు వాక్యమే ప్రమాణం కాబట్టి వాక్యాలను అర్థవంతంగా ఎలా రాయాలి? వాక్యం ఎలా ఎన్నెచిన్నెలు సంతరించుకుంటుంది? ఎలా గుభాళిస్తుంది? అర్థవంతమైన పరిమళాలు ఎలా వెదజల్లుతుంది? వీటికి సంబంధించిన ప్రాథమిక పరిజ్ఞానం భాషోపాధ్యాయులకు కొంతవరకైనా అవసరం! మరి తెలుగు భాషలోని వర్ణ నిర్మాణం, వాక్య నిర్మాణంలోని విశేషాలు మరీ లోతుల్లో కాకపోయినా కొంత విశదంగానైనా తెలుసుకుందామా?

మానవ ముఖ యంత్రం అనేక ధ్వనులను పుట్టిస్తుంది. అయినా ఒకొక్క భాషలో కొన్ని రకాల ధ్వనులే వాడుకలో వుంటాయి. ప్రతి భాషలోనూ ఒకే ఒక స్థాయిలో స్వల్పమైన భేదం వున్నా రెండు విభిన్నమైన ధ్వనులు వాడడం వల్ల ఆ మాట అర్థం పూర్తిగా మారిపోతుంది.

ఉదా : కోడలు – గోడలు
చుట్టు – జుట్టు
పేట – పేద
తడి – దడి
పుట్ట – బుట్ట
కల – కళ

| జీవితం 'కల' కాదు | – | ఒక 'కళ' |
|---|---|---|

పై ఉదాహరణలతో కచటతపలు శ్వాస స్పర్శాలు, గజడదబలు నాద స్పర్శాలు. ఒకొక్క జంటలోని ఈ ధ్వనులలో శ్వాసనాద భేదం తప్ప వేరే భేదం లేదు. అవి ఉన్న మాటల్లో అర్థభేదం కలుగుతోంది.

**వర్ణం – సువర్ణం**

ఒకే భాషలో అర్థభేదంతో ఉన్న ధ్వనులు వర్ణాలు. అర్థభేదం లేని ధ్వనులు ప్రత్యేక వర్ణాలు కావు. తెలుగులో క–గ, ట–డ, త–ద, ప–బ, ప్రత్యేక వర్ణాలు. చ,చ అర్ధ భేదం లేదు. కాబట్టి ఇవి ప్రత్యేక వర్ణాలు కావు. వీటిని ఒకే వర్ణం యొక్క సవర్ణాలుగా గ్రహించాలి. వర్ణ నిర్ణయం అన్ని భాషల్లో ఒకే రీతిగా వుండదు. ఒక్కో భాషలో ధ్వనుల మధ్య భేదం ఒక్కొక్క విధంగా వుండడమే దీనికి కారణం. తెలుగులో కచటతపలకు గజడదబలకు

మధ్య భేదం వుంది. కాబట్టి ఇవి ప్రత్యేక వర్ణాలు. తమిళంలో వీటి మధ్య భేదం లేదు. తమిళంలో (క,గ) ఒకే వర్ణానికి సవర్ణాలు. అదే విధంగా (చ–జ), (ట–డ), (త–ద), (ప–బ)ల విషయంలోనూ అంతే!

రెండు ధ్వనుల మధ్య భేదం లేకపోతే వాటి మధ్య భేదం చెవులకు వినబడుతున్నా గుర్తించలేదు. అటువంటి రెండు ధ్వనులు ఒకటిగానే పరిగణిస్తారు. భేదం లేని ధ్వనుల మధ్య ఉచ్చారణ భేదాన్ని గుర్తించడం, మాట్లాడే వ్యక్తికి ధ్వని శాస్త్రంలో ప్రావీణ్యముంటేనే సాధ్యమవుతుంది. ఆంగ్లభాషను మాట్లాడే వ్యక్తి, అల్పప్రాణ మహా ప్రాణ భేదాన్ని ఆ ధ్వనులను ఉచ్చరిస్తున్నప్పటికీ గుర్తించలేడు. కాని హిందీ మాట్లాడే వ్యక్తి ఈ భేదాన్ని సులభంగా గుర్తిస్తాడు. అలాగే తెలుగు వారికి చే; చ మధ్య ఉచ్చారణ భేదం గుర్తించడం కష్టం. కాబట్టి ప్రతి వ్యక్తి ఇతర భాషను నేర్చుకునేటప్పుడు తన భాషలో వున్న వర్ణ విభజన సంప్రదాయం ప్రకారం కొత్త భాషలోని మాటల్ని ఉచ్చరిస్తాడు. ఇది ఆ కొత్త భాష మాట్లాడే వారికి వింతగా ఉంటుంది.

ఉదా : తమిళ భాష మాట్లాడేవాడు తన అలవాటు ప్రకారం తెలుగులో 'పంతులు గారు' అనే మాటను 'పందులు గారు' అని ఉచ్చరిస్తే హాస్యపాత్రుడవుతాడు. ఇలా స్వభాషా ప్రభావాన్ని అన్యభాష మీద పడకుండా చేసుకోవడం సుశిక్షితులైన వారికే సాధ్యం.

**వర్ణప్రవృత్తి** (Distribution of Phonemes) **:** వర్ణప్రవృత్తి అంటే వర్ణాలు ఒక పదంలో ప్రవర్తించే విధానం. ఒక భాషలో వర్ణాలు సంయోగం పొందే విధానంలో కూడా కొన్ని నియమాలు ఉంటాయి. ఉదాహరణకు తెలుగులో ణ–ళ లు పదాదినరావు. పదాంతంలో మ, యలు తప్ప మిగిలిన హల్లులు ఉండవు.

ఉదా : మంచం; చెయ్, ఇరవై (ఇరవయ్), వర్ణప్రవృత్తిలో ప్రాచీన భాషకు, ఆధునిక భాషకూ మధ్య భేదాలు ఉండవచ్చు. ప్రాచీన తెలుగు భాషలో క్రొత్తప్రాత; మ్రాను; వంటి పదాలలో పదాదిన రేఫతో కూడిన సంయుక్తాక్షరాలు ఉన్నాయి. ఆధునికభాషలో రేఫలోపించి కొత్త; పాత; మానుగా మారాయి.

ఈ మధ్య ఒకావిడ ఏదో పేరంటంలో "నేను 'క్రొత్త' చీర కట్టుకొచ్చాను" అన్నదట! – ఈనాడు వినే వాళ్లకు వింతగానే వుంటుంది. ఎందుకంటే క్రొత్త చీర అననక్కరలేదు. కొత్త చీర అంటే చాలు!

**ఉత్పాదక వర్ణ నిర్మాణం** (Generatine Phonology) **:**

చామ్‌స్కీ స్థాపించిన ఉత్పాదక వ్యాకరణం సిద్ధాంతం ప్రకారం ధ్వని నిర్మాణానికి; వర్ణ నిర్మాణానికి భాషలో సమ ప్రాధాన్యం ఉంది. భాషకు ముఖ్యమైన అంశాలు రెండు. మొదటిది మానవుడు వ్యక్తీకరించవలసిన భావసముదాయం. దీన్ని ఆర్థికాంగం అనవచ్చు (Sematic Component). రెండవది భావాన్ని వ్యక్తీకరించడానికి మానవుడు ఉపయోగించే ధ్వనులు. ఈ భాగాన్ని 'ధ్వన్యంగం' (Phonetive Component) అనవచ్చు. వర్ణ నిర్మాణంలో వ్యారణం చేసే పని ఆర్థికాంగానికి, దానికి సంబంధించిన ధ్వన్యంగానికి గల పరస్పర సంబంధాన్ని సూత్రాల ద్వారా వ్యక్తపరచడమే! కాబట్టి ధ్వన్యంగం కూడా వర్ణ నిర్మాణ వ్యాకరణంలో ప్రధానపాత్ర వహిస్తుంది.

**1.4.7. వాక్య నిర్మాణం – తెలుగు వాక్యం**

అర్ధవంతమైన ధ్వనులు అక్షరాలు. అక్షరాల కలయిక పదం. అర్ధవంతమైన పదాల సమన్వయం వాక్యం – వాక్యాల సమాహారం భాష!

ఒక వాక్యంలో పదాలు ఏ విధంగా కలిసి ఆ వాక్యం ఏర్పడింది? అని చర్చించేది వాక్య నిర్మాణం.

**వాక్యాలు – రకాలు :** వాక్యాలు బహు రకాలు.

నిర్దేశక వాక్యాలు (Declarative Sentences) ఒక విషయాన్ని ప్రకటిస్తాయి.

ఉదా : లావణ్య నిన్న వచ్చింది.

పోతన భాగవతం రాశాడు.

అపర్ణ చెట్టు నాటింది.

ప్రశ్నావాక్యాలు (Interragatine Sentences) ఒక విషయాన్ని ప్రశ్నిస్తాయి. ఒక వ్యక్తిని 'ఇంటరాగేషన్" చేయడమంటే రకరకాలుగా ప్రశ్నించడమే!

ఉదా : క్రీడాభిరామం శ్రీనాధుడే రాశాడా?

అందుకు తగిన ఆధారాలున్నాయా?

మాచర్ల నుండి నువ్వు ఎప్పుడు వచ్చావు?

నువ్వు నిజంగా మాచర్ల నుండే వచ్చావా?

విధి వాక్యాలు (Imperative Sentences) శ్రోతను ఆదేశిస్తాయి. – ఈ పని చేయడం నీ 'విధి' అన్నట్లుగా!

"ఈ సాయంత్రం టివిలో మాయాబజార్‌లో సినిమా చూడు!"

"ఈ కథకు పేరు మార్చు!"

"నన్నయ భట్టారకా! మహాభారత అనువాదానికి మీరు రేపే శ్రీకారం చుట్టండి!"

"రేపు తొమ్మిది గంటలకే కాలేజీకి రండి!"

**వాక్యం – నిర్వచనం :**

పదాన్ని నిర్వచించడం లాగే వాక్యాన్ని నిర్వచించడంలో కూడా కొంత కష్టం వుంది.

"సంపూర్ణమైన అర్ధాన్ని ఇచ్చేవి వాక్యాలు" అని ప్రాచీన పాశ్చాత్య వ్యాకరణాలు నిర్వచించాయి. ఈ అర్ధం పైన ఆధారపడిన నిర్వచనాలు అంత సంతృప్తికరమైనవి కావేమో! ఒక వాక్యంలోని పదాలు కూడా సందర్భాన్ని బట్టి సంపూర్ణార్ధం కలిగి వుంటాయి కదా! అందువల్ల ఒక వాక్యంలోని పదాలన్నీ ప్రత్యేక వాక్యాలు అనలేం. ఎందుకంటే ఒక పదం కూడా కొన్ని సందర్భాల్లో వాక్యంగా మారుతుంది.

పూర్తి అర్ధాన్నిచ్చే ప్రతి పదం వాక్యమే!

"అక్కా! బావ ఎప్పుడు వస్తాడు" అడిగింది ఉష.

"రేపు" అంది ప్రత్యూష.

ఇక్కడ రేపు అనేది ఒక వాక్యం. ఎందుకంటే అది పూర్తి అర్ధాన్ని ఇస్తుంది. "బావ రేపు వస్తాడు" అనవలసిన అవసరం లేదు. "రేపు" అనడంతోనే అడిగిన వ్యక్తికి పూర్తి సమాధానం వచ్చేసింది.

"తిక్కన మహాభారతాన్ని ఏ పర్వం నుండి మొదలెట్టాడు?" అడిగాడు ఒక తెలుగు అధ్యాపకుడు తన డి.ఈ.డీ. ఛాత్రోపాధ్యాయుణ్ని.

"విరాట పర్వం" అన్నాడు శిష్యుడు.

ఇది ఒక్క పదమే అయినా సంపూర్ణార్ధం ఇచ్చింది. అయితే దానంతట అది అన్ని సందర్భాల్లోనూ ఈ అర్ధాన్ని ఇవ్వదు. అందువల్ల పై నిర్వచనం అసమగ్రం అని చెప్పాలి.

ఆధునిక భాషా శాస్త్రజ్ఞుల నిర్వచనం ప్రకారం "ఉచ్చారణలో రెండు విరామాల మధ్య వుండే ధ్వని సముదాయమే" వాక్యం.

**పరివర్తనా వ్యాకరణం :**

ఎందువల్లో వాక్య నిర్మాణంపై పాశ్చాత్య దేశాల్లో సైతం ఈ మధ్యకాలం వరకు ఎక్కువ పరిశోధనలు జరగలేదు. అయితే ఇటీవల భాషా విప్లవకారుడు చామ్‌స్కీ ఆవిష్కరించిన 'పరివర్తన వ్యాకరణం' (Transformational Grammar) భాషలో వాక్య నిర్మాణ పరిశోధనకి ఎంతో ప్రాముఖ్యం ఇచ్చింది.

పరివర్తన వ్యాకరణం అనే వ్యాకరణ ప్రక్రియ "నోమ్ చామ్‌స్కీ" రచించిన "Symtaetie Structures" అనే గ్రంథంతో ఆరంభమైంది. ఇతడు రష్యా దేశస్థుడు. అయితే ఈ వ్యాకరణానికి సంబంధించిన మూలసూత్రాలు బీజరూపంలో కొన్ని పాశ్చాత్య వ్యాకరణాలలోనూ, పాణిని 'అష్టాధ్యాయి"లోనూ అనుసరించబడ్డాయి. కాని ఆ గ్రంథాల్లో ఈ సూత్రాలు అర్థవంతంగా వ్యక్తం చేయలేదు. అంచేత పరివర్తన వ్యాకరణమాల సూత్రాలని నిర్వచించి ఉదాహరణ ప్రత్యుదహారణలతో విపులంగా మొదట చర్చించిన ఘనత 'చామ్‌స్కీ'కే దక్కింది.

చామ్‌స్కీ వాక్య నిర్మాణ ప్రక్రియలో చాలా మంది భాషావేత్తలు అంగీకరించే మౌలిక విషయాలు కొన్ని ఉన్నాయి.

**పరివర్తన వ్యాకరణం – ప్రాముఖ్యత :**

పరివర్తన వ్యాకరణం ముఖ్యంగా ఒక భాషలో వాక్య నిర్మాణాన్ని; ఒకరకం వాక్యానికీ; మరో రకం వాక్యానికీ గల పరస్పర సంబంధాన్ని వర్ణించడానికి ఉద్దేశింపబడింది. పరివర్తన వ్యాకరణం మొత్తం భాషా నిర్మాణాన్ని, భాషా స్వరూప స్వభావాన్ని సూక్ష్మదృష్టితో గ్రహించడానికి ఉపకరిస్తుందని తెలియజేయడంతో ఈ ప్రక్రియ భాషాధ్యయనంలో ఒక కొత్త సంచలనాన్ని రేకెత్తించింది.

అంతకు ముందు భాషా శాస్త్రజ్ఞులు చిన్న చూపు చూసిన అర్ధనిర్మాణ వాక్య నిర్మాణాలే భాషకు ముఖ్యాంగాలనీ, అందువల్ల భాషావేత్తలు వీటిని సూక్ష్మంగా పరిశీలించాలని చామ్‌స్కీ విప్లవాత్మక ప్రతిపాదన చేశాడు.

భాష అంటే మానవుని నోటి నుండి వచ్చే అర్థవంతమైన ధ్వనులని మనకు స్పష్టమవుతుంది. మానవులు ఈ ధ్వనులు ఎందుకు ఉచ్ఛరిస్తారు? – వారి మనస్సులో వున్న అభిప్రాయాన్ని దాని అంతరర్థాన్ని ఇతరులకు వ్యక్తీకరించడానికి!

**ఏది ప్రామాణికం? ఏది అప్రమాణికం?**

భాషలో ఏ రూపం ప్రామాణికం; ఏ రూపం అప్రమాణికం అని నిర్ణయించడం వ్యాకరణం పని కాదు. ఉదాహరణకి ఇంటి కాడ; ఒత్తాది; సేత్తాది; పోతాది – వంటి రూపాలు సంఘంలో అప్రమాణికాలు. అందుచేత వాటిని సభల్లోనూ; వ్రాతలోనూ వాడకూడదు అని చెప్పడం వ్యాకరణం పని కాదు. అటువంటి రూపాలు వాడే వారి వ్యవహారంలో కూడా కొన్ని నియమాలు ఉంటాయనీ, ఒక కాలంలో అప్రమాణికమైనవి కాలక్రమేణా ప్రామాణికమౌతాయని గుర్తించడం ముఖ్యం.

మనదైనందిన వ్యవహారంలో ఇంతకుముందు విన్న వాక్యాలే కాకుండా; కొత్త వాక్యాలు కూడా సృష్టించి వ్యవహరిస్తూ వుంటాం. ప్రతి వ్యవహర్తకీ భాషా నిర్మాణం, వ్యాకరణం ఎవ్వరూ నేర్పకుండానే సహజాతంగానే తెలిసి వుండడం వల్ల ఇటువంటి కొత్త వాక్యాలను సృష్టించడంలోనూ, వాటిని ఇతరులు వాడినిప్పుడు అర్థం చేసుకోవడంలోనూ ఏ విధమైన కష్టమూ వుండదు.

ఉదాహరణకు ఈకింది వాక్యాలు ఆయా సంఘటనలు జరగడానికి ముందు ఎవరూ ఉచ్ఛరించి వుండరు. అయినా వాటిని సృష్టించి వాడడంలోనూ, అర్థం చేసుకోవడంలోనూ ఎవరికీ కష్టం లేదు.

1. సినిమా నటి సౌందర్య విమాన ప్రమాదంలో చనిపోయింది.

2. అంగారక గ్రహాన్ని నివాసయోగ్యం చేయడానికి అమెరికా వాళ్లు అంతరిక్ష పరిశోధనలు చేస్తున్నారు.

**చిన్నపిల్లలు – వాక్య నిర్మాణం :**

మనం ప్రతిరోజూ ఇతరుల సంభాషణల్లోనో, సినిమాల్లోనో, టివి వార్తల్లోనో ఇటువంటి కొత్త వాక్యాలు వాడడం, వినడం మనకు తెలియకుండానే జరుగుతూ ఉంటుంది. సరిగ్గా చిన్నపిల్లలు భాష నేర్చుకోవడం, తగిన వయస్సు వచ్చాక వాళ్లంతట వాళ్లే వ్యాకరణయుక్తమైన వాక్యాలు మాట్లాడటం ఇలానే జరుగుతోంది.

ఏడాది పాప ఇంట్లో మబ్బుల నడుమ కదిలే చందమామలా దోగాడుతూ ఆడుకుంటోంది. అమ్మ అక్కయ్యకు పూలజడ వేస్తోంది. నాన్న పేపర్ చదువుకుంటున్నాడు. అమ్మకూ, నాన్నకూ, అక్కయ్యకూ మధ్య సంభాషణ జరుగుతోంది. పదేండ్లపాప ఒక వైపు ఆడుకుంటూనే ఆ సంభాషణాధ్వనులు వింటూనే వుంది. మాట్లాడలేకపోవచ్చు గాని పాపకు అర్ధమవుతూనే వుంది. ఇదంతా ఎలా జరుగుతోంది? చామ్‌స్కీ సిద్ధాంతంలోని కీలకం అంతా ఇందులోనే వుంది.

తన కళ్ల ముందు అప్పుడప్పుడూ ఇంట్లో జరిగే సన్నివేశమే కనుక పాపకు అవి అర్ధవంతమైన ధ్వనులే!

"కదలకమ్మా సిరీ! పూలు రాలిపోతున్నాయ్. జడ బాగా కుదరొద్దూ!"

"అబ్బా! ఎంత సేపమ్మా బొమ్మలా కదలకుండా కూర్చోడం. నాకు విసుగేస్తోంది."

"అంత తొందరపడితే ఎలా తల్లీ, నీ జడ కాస్త వుందా? బారెడు జడ! పువ్వుల జడ వేయించుకోగానే సరా? చూసేవాళ్లకు బాగుండొద్దూ?"

"ఔనులే! స్కూలుకు వెళ్తున్నప్పుడు రోడ్డు మీద అందరి చూపులూ ఈ వేళ మన అమ్మాయి జడ మీదనే" అందుకున్నాడు నాన్న నవ్వుతూ.

"నాన్న చూడవే ఏమంటున్నాడో! అలా అందరూ చూస్తే నాకు మహాసిగ్గు" – సిరి చెంపలు కెంపులయ్యాయి.

దోగాడుతున్న పాప ఈ మాటలన్నీ విన్నది. ఆ తర్వాత మాట్లాడే వయస్సు వచ్చిన తర్వాత తాను విన్న వాక్యాలే కాక; వినని మాటలు కూడా జోడించి కొత్త వాక్యాలు సృష్టించి మాట్లాడుతోంది.

"ఇన్ని మాటలు వీళ్లు ఎక్కడ నేర్చారబ్బా?" అని విస్తుపోవడం మన వంతవుతుంది. దీనికి చామ్‌స్కీ సిద్ధాంతమే మనకు సమాధానం. పరిసరాల్లో వాళ్లు విన్న మాటలన్నీ పిల్లల మానసంలో ఎక్కడో దాగి వుంటాయి. దాన్నే "Universal Linguistic Faculity" అన్నాడు చామ్‌స్కీ! వాళ్లు వాక్యనిర్మాణం కోసం ప్రత్యేకంగా వ్యాకరణం నేర్చుకోవలసిన పని లేదు. అది సహజాతం.

**సాధు వాక్యాలు – అసాధు వాక్యాలు**

వాక్యాల్లో సాధు వాక్యాలు, అసాధు వాక్యాలు ఉంటాయి. వీటికి మధ్య తేడా చిన్నల నుండి పెద్దల వరకు అందరికీ తెలిసి పోతూనే వుంటుంది. సాధు వాక్యాలంటే అర్ధవంతమైన వాక్యాలు.

**అసాధు వాక్యాలు :** అర్ధవంతం కాని అవకతవకల వాక్యాలు

ఉదా : 1. సంధ్య చీర కొత్త కట్టుకుంది.

2. మా అక్క వచ్చాడు

3. కోటీశ్వరుడు మేం ప్రోగ్రాం టి.వి. రేపు చూశాం.

4. కుక్క మాట్లాడింది.

వాక్య నిర్మాణంలో ఒక విలువ వుంది. అదేమంటే సరైన స్థానంలో సరైన పదాలు ఉపయోగించడం (Using Correct Words at Correct Place). అలా కాకుంటే మన వాక్యం పిచ్చివాడి ప్రేలాపనలా ఇతరులను ఇబ్బంది పెడుతుంది.

**వాక్య నిర్మాణం సరిగా ఉండకపోవడానికి కారణాలు :**

1. మాట్లాడేటప్పుడు వ్యర్ధ పదాలు ఉపయోగించడం.
2. అర్థానికి, సందర్భానికి సరిపోని మాటలు వాడడం.
3. మాటలను సరైన క్రమంలో వాడకపోవడం
4. వాక్యాన్ని మధ్యలో దిగమింగి వేరొక వాక్యాన్ని ప్రారంభించడం.
5. మాటల్లో భావోద్వేగ సమతుల్యత లోపించడం.
6. జ్ఞాపకశక్తి తక్కువ కావడం
7. పరిసరాల ప్రభావం
8. మత్తు పానీయాల సేవనం

పై కారణాల వల్ల రూపొందే అసాధు వాక్యాల సంగతేమో గాని; పరివర్తన వ్యాకరణం భాషలోని ఏ సాధు వాక్యాన్ని అయినా సూత్రాల ద్వారా ఉత్పత్తి చెయ్యగలదు. కాబట్టి దీనిని "ఉత్పాదక వ్యాకరణం" (Generative Grammar) అని కూడా అంటారు.

**సాధు వాక్యాల లక్షణాలు :**

1. కర్త; కర్మ; క్రియతో కూడి వుంటాయి.
2. నామవాచకాలు; సర్వనామాలు, విశేషాలు, విభక్తి ప్రత్యయాలు సరైన స్థానంలో గోచరిస్తాయి.
3. ప్రతి వాక్యంలోనూ ఇవన్నీ లేకపోయినా కొన్ని అయినా వుంటాయి.

ఉదా :- 1. చందమామ మబ్బుల నడుమ వుంది.
2. వీరన్న వంద కిలోల బస్తా మోస్తాడు.
3. నక్షత్రాలు ఆకాశంలో మెరుస్తున్నాయి.
4. మా అన్నయ్య గ్రూప్-1 ఉద్యోగానికి ఎంపిక కావడం నాకు సంతోషం కలిగించింది.
5. శ్రీశ్రీ 'మహాప్రస్థానం' తెలుగు సాహిత్యాన్ని కొత్త మలుపు తిప్పింది.

**వాక్యం - అంగీకార యోగ్యం**

**ఈ వాక్యం చదవండి.**

"కె.విశ్వనాధ్ 'సాగరసంగమం' లాంటి మంచి సినిమాలు తీయడం వల్ల ఈ సంవత్సరం కేంద్ర ప్రభుత్వం ఆయనకు దాదా సాహెబ్‌ఫాల్కే అవార్డు ప్రకటించింది".

పై వాక్యంలో "సాగర సంగమం" లాంటి మంచి సినిమాలు తీయడం కారణాన్ని, 'ఈ సంవత్సరం' అనడం కాలాన్ని; 'కేంద్రప్రభుత్వం' నామవాచకాన్ని, 'ఆయనకు' సర్వనామాన్ని 'దాదాసాహెబ్ అవార్డు' ఫలితాన్ని, 'ప్రకటించింది' క్రియను తెలియపరుస్తాయి.

దీని వల్ల మనకు ఏమి తెలిసింది? క్రియతో పాటు మరికొన్ని అంశాలు ఉంటే కాని వాక్యం అంగీకారం యోగ్యం కాదు.

**వాక్యం - అవగాహనా పూరకం**

క్రియతో పాటు వాక్య అవగాహనకు వుండవలసిన మరో లక్షణం 'పూరకం'.

ఉదా : నేను తిన్నాను.

నేను పకోడీలు తిన్నాను.

ఊరికే నేను తిన్నాను అంటే ఆ వాక్యంలో పూరకం లేదు.

ఏం తిన్నాను? పకోడీలు తిన్నాను.

మరో ఉదాహరణ :

నేను వెళ్లాను

నేను అమరావతి వెళ్లాను.

**వాక్య ప్రయోగం – యోగ్యత**

వాక్య ప్రయోగంలో యోగ్యత లోపించకూడదు.

ఈక్రింది వాక్యాల్లో యోగ్యత లోపించింది.

అమ్మ కాపీ వండుతోంది.

నాన్న కుర్చీ మింగాడు.

ఆ అబ్బాయి మా కోడలు

ఆ అమ్మాయి మా అల్లుడు

**పద క్రమంలో మార్పు**

పదాల క్రమాన్ని మార్చి కొత్త వాక్యాలు తయారు చేయవచ్చు.

భాస్కరరావు 'బంతిపువ్వు' కథరాశాడు.

బంతి పువ్వు కథ భాస్కరరావు రాశాడు.

క్రియాత్మక ప్రశ్నార్థకం

ప్రశ్నార్థక శబ్దం క్రియకు దగ్గరగా ఉండటమే వాక్యానికి సహజలక్షణం.

'గబ్బిలం' కావ్యం ఎవరు రాశారు?

ఎవరు 'గబ్బిలం' కావ్యం రాశారు?

వాక్య నిర్మాణంలో మనం తెలుసుకోవలసినది ఇంకా ఎంతో వుంది. భాషా నిర్మాణమంతా వాక్య నిర్మాణం పైనే ఆధారపడి వుంది. ఏ భాషకైనా అందమైన; అర్థవంతమైన వాక్యమే ప్రమాణం. అందుకే అన్నారు అలంకారికులు – "వాక్యం రసాత్మకమ్ కావ్యమ్".

**1.4.8 ధ్వని పరిణామం :**

భాషా పరిణామంలో చాలా ముఖ్యమైంది ధ్వని పరిణామం. భాషలోని ధ్వని మార్పులను మొట్టమొదటిసారి వివరించిన వారు – టాలెమీ (ఇటలీ).

**ధ్వని పరిణామం – నిర్వచనం :**

ధ్వనుల స్థాన కరణ ప్రయత్నాన్ని ఉచ్చారణ విధానాన్ని తెలిపేది ధ్వని విజ్ఞానం. ఒక భాషలో ఉన్న ధ్వనులు తర్వాత కాలంలో మార్పు చెందడాన్ని 'ధ్వని పరిణామం' అంటారు. భాషలోని పదాల్లోని అర్థం స్థిరంగా ఉండి శబ్దం మారడాన్ని శబ్ద పరిణామం లేదా ధ్వని పరిణామం అంటారు. ధ్వని పరిణామాన్ని ఆంగ్లంలో Phonetic Change అంటారు.

**ధ్వని పరిణామం – భేదాలు :**

**1. వర్ణ సమీకరణం :** సమీకరణం అంటే కూడిక రెండు భిన్న వర్ణాలు కలిసి ఏకవర్ణంగా మారడాన్ని వర్ణ సమీకరణం అంటారు. ఇది రెండు రకాలు. అవి :

(1) పూర్వ వర్ణ సమీకరణం

| | | |
|---|---|---|
| ఉదా : | గది + లు | = గదులు |
| | పది + లు | = పదులు |
| | ములికి + లు | = ములుకులు |
| | పలికి + లు | = పలుకులు |

(2) పరవర్ణ సమీకరణం

ఉదా : గది + కు = గదికి

మది + కు = మదికి

వాని + కు = వానికి

నది + కు = నదికి

**2. వర్ణ విభేధం :** ఒకే ధ్వనిని గాబరా, తడబాటు వల్ల రెండు సార్లు ఉచ్ఛరించినపుడు ఒక ధ్వని స్థానంలో వేరొక ధ్వని రావడాన్ని వర్ణ విభేధం అంటారు. ఇది వర్ణ సమీకరణానికి వ్యతిరేకమైనది.

ఉదా : వచించు + ఇంచు = వచింపించు

ఆవులించు + ఇంచు = ఆవులింపించు

చూచు + ఇంచు = చూపించు

**3. వర్ణ సమ్మేళనం :** అనేక వర్ణాలు కలిసి ఏకవర్ణంగా రూపొందడమే వర్ణ సమ్మేళనం. దీనినే వర్ణ సంయోగం, వర్ణ సంయోజనం అని కూడ అంటారు.

**4. వర్ణ వ్యత్యయం :** ఒక పదంలోని వర్ణాలు తారుమారు చెందడమే వర్ణ వ్యత్యయం. దీన్నే స్థాన పరివర్తనం, అక్షర విపర్యయం అని కూడా అంటారు.

ఉదా : నవ్వులాట – నవ్వుటాల

వారణాసి – వాసిణార

శతకం – తశకం

తమాషా – షాతమా

గజదొంగ – జగదొంగ

పున్నాగపూలు – పూగపున్నాలు

మోటతోలాలి – తోటమోలాలి.

**5. వర్ణాగమం :** సామ్యం వల్ల ప్రామాణికం కాదనే భావంతో కొత్త వర్ణాలు, పదాలలో చేరడాన్ని వర్ణాగమం అంటారు. దీన్నే 'వర్ణాధిక్యం' అని కూడ అంటారు. ఉచ్చారణలో ఏదో కొరత ఉన్నట్లు భావించడం వల్ల ఇలాంటి ఆధిక్యత ఏర్పడుతుంది.

ఉదా : కోలాటం – కోలాటకం

దొంగాటం – దొంగాటకం

నడిరేయి – నడికి రేయి

వేగుచుక్క – వేగురుచుక్క

నేను కూడ – నేను కూడక

**6. వర్ణలోపం :** ఒక పదం చివర వచ్చిన హల్లు మరోక పదం మొదట వచ్చినప్పుడు మొదటిది లోపించడాన్ని వర్ణ లోపం అంటారు. దీనినే సవర్ణ లోపం, అక్షర లోపం, వర్ణ నాశనం, హల్లోపం అంటారు.

ఉదా : నిప్పు + పుల్ల = నిప్పుల్ల

రెప్ప + పాటు = రెప్పాటు

కంచు + చెంబు = కంచెంబు

రెప్ప + పోటు = రెప్పోటు

**7. అజాదిత్వం :** కొన్ని హల్లులకు ముందు ఉచ్చారణలో అచ్చు చేర్చి పలకడాన్ని అజాధిత్వం అంటారు. దీన్నే

'స్వర ప్రారంభం' అని కూడ పిలుస్తారు.

ఉదా : రథం - అరదం

స్కేలు - ఇస్కేలు

స్కూలు - ఇస్కూలు

స్కూటరు - ఇస్కూటరు

హోళిగ - ఒళిగ

**8. స్వర భక్తి :** భిన్న హల్లుల మధ్య మరో వర్ణం చేరడాన్ని 'స్వర భక్తి' అంటారు. దీన్ని విప్రకర్ష, వికర్ష అని కూడ వ్యవహరిస్తారు.

ఉదా : తర్వాత - తరువాత

మర్యాద - మరియాద

రాత్రి - రాతిరి

పర్వము - పరువము

పల్చన - పలుచన

అల్పము - అలుపము

నిద్ర - నిద్దుర/నిదర

**9. తాలవ్యీకరణం :** మూలద్రావిడ భాషలోని పదాది కకారానికి తాల వ్యాచ్చులు పరమైనపుడు 'చ' వర్ణంగా మారుతుంది. ఇలా 'క' కారం 'చ'కారంగా మారడాన్ని 'తాలవ్యీకరణం' అంటారు.

ఉదా : కివి - చెవి

కిళి - చిలుక

కెంపు - చెంపు

కై - చేయి

కెందొవ - చెందొవ

కెఱయ్ - చెఱయ్

**10. లోపదీర్ఘం :** ఉచ్చారణలో ఒక వర్ణం లోపించేటప్పుడు ఏర్పడిన లోపాన్ని పూరించడానికి పూర్వస్వరం దీర్ఘమవుతుంది. దీనినే లోప దీర్ఘం, లోప దీర్ఘత అంటారు.

ఉదా : గుర్రములు - గుర్రాలు

చివుకు - చీకు

కంచములు - కంచాలు

వజ్రములు - వజ్రాలు

ముత్యములు - ముత్యాలు

బలపములు - బలపాలు

**11. అనుచిత విభాగం :** పదాలను తప్పుగా విరిచి వ్యవహరించడాన్ని అనుచిత విభాగం అంటారు.

ఉదా : కిళి + కళ్ = చిలుకలు (చిలుక + లు)

ఎళి + కళ్ = ఎలికలు (ఎలుక + లు)

**12. ద్విత్వ కల్పనం :** కొన్ని పదాలలో ద్విత్వం లేకపోయినా కల్పించి చెప్పడాన్ని ద్విత్వ కల్పనం అంటారు.

ఉదా : తలక్రిందులు - తల్ల క్రిందులు, పడిన - పద్డ, తెలవారు - తెల్లవారు, వలదు - వద్దు.

# అర్ధ విపరిణామం
**(Semantic Change)**

**1.4.9 అర్ధ విపరిణామం – నిర్వచనం :**

1. పదజాలానికి సంబంధించి అర్థంలో కలిగే మార్పునే 'అర్థవిపరిణామం' అంటారు. – ఆచార్య జి.యన్.రెడ్డి.

2. ఒక కాలక్రమాన వర్ణాలు ; వ్యాకరణ నిర్మాణం మారినట్లుగానే పదాల అర్థాలు కూడా మారతాయి. ఈ మార్పునే అర్ధ విపరిణామం అంటారు – ఆచార్య పి.యస్.సుబ్రమణ్యం

పరిణామం అంటే మార్పు. భాష కాలం గడిచే కొద్దీ మారే స్వభావం కలది కాబట్టి ఆయా కాలాలలో వర్ణాలు ; వ్యాకరణ నిర్మాణమూ మారినట్లు గానే పదాల అర్థాలు కూడా మారతాయి. ఒక భాషలో పదాలకు గల అర్థాలలో వచ్చిన మార్పుని అర్ధ విపరిణామం అంటారు.

ఉదాహరణ : 'లావు' – 'లావు' అంటే అడ్డంగా బలిసి లావుగా వుండడమని ఒకనాటి అర్థం. పోతన కాలంలోని 'లావు' 'బలం' అనే కొత్త అర్థాన్ని సంతరించుకుంది.

గజేంద్రుడు భగవంతుని ఇలా ప్రార్థిస్తాడు "లావొక్కింతయు లేదు ధైర్యమ్మువిలోలంబయ్యె ; ప్రాణముల్ ఠావుల్ తప్పె"

"ప్రాణముల్ ఠావుల్ తప్పటమంటే" ప్రాణాలు వుండాల్సిన స్థానంలో లేవు అని అర్థం. 'ఠావులు' అనే పదానికి ఇప్పటి అర్థం తెల్లకాగితాల ఠావులు.

"మనసు వాకిళ్లు" కథ మొత్తం చేతిరాతలో పదిహేను 'ఠావు'లుంది. ఒకప్పుడు రణగొణ ధ్వని అసలు రూపం – "రణగణ ధ్వని" అంటే యుద్ధంలో వింటితాళ్ల చప్పుడు – ఇప్పటి అర్థం 'గోల గోల'గా వుండడం.

"తరగతి గది రణగొణ ధ్వనితో నిండివుంది".

Understand అంటే అసలు అర్థం "మధ్య నిలబడు!" అని. ప్రస్తుతం దీని అర్థం "అర్థమయ్యిందా?". వెనుకటికో మాష్టారు పాఠం చెప్పడం పూర్తి చేసి పిల్లల్ని ఉద్దేశించి "Understand" అన్నాడట. ఒక విద్యార్థి దాని అసలు అర్థం తెలియక బెంచీ మీద నుండి లేచి కింద నిలబడ్డాడట! మాష్టారితో పాటు తరగతి గదిలో నవ్వులే నవ్వులు!

'పులిహోరం' ఇష్టపడని తెలుగువాళ్లు వుంటారా? అసలు పులిహోరకూ పులికీ సంబంధం ఏమిటి? పులిహోరం మనకు తమిళం నుండి దిగుమతి అయ్యింది. తమిళంలో చింతపండును "పుళి" అంటారు. తెలుగులో "పులుపు"; 'పులియు' ఇందుకు సంబంధించినవే. కాబట్టి 'పులిహోర' అంటే 'చింతపండు రసం కలిపిన అన్నం' అని అర్థం. అంతేగాని ఇప్పుడు ఆధునికుల పరిభాష ప్రకారం "Tiger Food" కాదు.

"పెళ్లి చేసుకోడానికి నీకు ఆ "కర్రోడే" దొరికాడా?" అంది ఉదయశ్రీ కొద్దికాలం క్రితమే పెళ్లయిన తన స్నేహితురాలు కరుణశ్రీతో.

కర్రోడు అంటే నల్లనివాడు. మన శ్రీకృష్ణుడు కర్రోడే! అలాగే 'కర్రి ఆవు'. కర్రి అంటే తమిళంలో నలుపు అని అర్థం. కరు = నల్లని ; కరిమబ్బు అంటే నల్లని మబ్బు.

"శరీర కష్టం స్ఫురింపచేసే

గొడ్డలి; రంపం; కొడవలి; నాగలి" అన్నాడు శ్రీశ్రీ.

ఇందులో 'కొడవలి' తెలుగు పదం మూలరూపం తమిళంలోని కొటువాళ్. 'కొటా' అంటే వంకరగా, వాళ్ అంటే 'కత్తి'. 'కొటువాళ్' అంటే 'వంకర కత్తి', అదే కొడవలిగా రూపాంతరం చెందింది. కొడవలి నెలవంకలా

వంకరగానే వుంటుంది. పల్లె పడుచులు గడ్డి కోసుకురావడానికి కోత కోయడానికి ఉపయోగిస్తారు దీన్ని.

"కొడవలితో లేత గడ్డి కోసుకొస్తివి

కోర చూపుతో గుండె దూసుకుంటివి" అని పాడతాడు ఏదో వెనుకటి సినిమాలో హీరో నాగేశ్వరరావు. ఎప్పుడైనా విన్నారా?

పదాల అర్థాలకీ ; ఆ భాషలను వాడే ప్రజల సంస్కృతికీ, సంప్రదాయాలకీ మధ్య చాలా సన్నిహిత సంబంధాలు వుంటాయి. పదాల అర్థ విపరిణామం ఆ దేశ సంస్కృతి పై ఆధారపడి వుంటుంది.

'ఇల్లు' అన్నా 'కొంప' అన్నా వాస్తవానికి ఒక్కటే. అయితే ప్రస్తుతం 'ఇల్లు'కు ఉన్నంత గౌరవం 'కొంప'కు లేదు. ఈ పదాన్ని న్యూనతార్థంలో వాడతారు.

"నీ ఇల్లు ఎక్కడ?" అనడానికి 'నీ కొంప ఎక్కడ?' అనడానికి తేడా లేదూ? వెనుకటికెవడో "మీ నాన్న ఎవరు?" అని అడగటానికి బదులు "మీ అమ్మ మొగుడెవరు?" అని అడిగి పళ్లు రాలగొట్టించుకున్నాడట!

**అర్థ విపరిణామానికి హేతువులు :**

**1. నాగరిక కారణాలు :**

నాగరికతలో మార్పు రావడం అర్థ విపరిణామానికి దోహదం చేస్తుంది. 'పెన్' (Pen) అంటే అసలు అర్థం 'ఈక'. ఈకలను సిరాలో ముంచి రాసే కాలం అది! ఇప్పుడది లేఖన సాధనం.

**2. చారిత్రక కారణాలు :**

ఉదాహరణకు 'బోయ్‌కాట్ చేయడం'. ఇది నిరసన వ్యక్తం చేయడం కోసం చేసే పని. ప్రస్తుతం చేయవలసిన పని చేయకుండా ఎగగొట్టడం అనే అర్థంలో వాడుతున్నాం.

దీని మూలం ఎక్కడ వుంది? పూర్వం ఐర్లండ్ దేశంలో Charlas C. Boycott (చార్లెస్.సి.బాయ్‌కాట్) అనే ఒక పెద్ద భూస్వామి వుండేవాడు. ఆయన 'శిస్తు' తగ్గించడానికి అంగీకరించకపోవడం వల్ల ఆయన భూములను సాగు చేసే రైతులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. అప్పటి నుంచీ ఆయన పేరు పైన చెప్పిన అర్థంలో రూఢమైంది.

అలాగే 'బంగనపల్లి' – అనే ఊరు కన్నా చరిత్రలో ఆ వూళ్లో పుట్టిన మామిడికాయ రకం సర్వత్రా ప్రసిద్ధమైంది. ఇప్పుడు ఏ వూరి మామిడికాయ అయినా 'బంగినపల్లి' మామిడి కాయే!

**3.పదసృష్టి – పదనాశనం :**

నాగరికత పెరిగిన కొద్దీ కొత్త వస్తువులు తయారు కావడం వాటికి కొత్త పేర్లు పెట్టడం అవసరమవుతుంది. అంతకు ముందున్న వస్తువుల పేర్లను కొత్త వస్తువులకు వ్యాపించేయడం జరుగుతుంది.

ఉదాహరణకు 'బండి' అంటే ఒకప్పుడు 'ఎడ్లబండి' మాత్రమే! ప్రస్తుతం బండి అనే పదం ఎడ్లబండికే కాకుండా 'సైకిలు'; మోటారు సైకిలు; 'కారు', 'రైలు' మొదలైనవాటికి వాడుతున్నాం.

మోటారుసైకిలు వున్న వాడు ఎప్పుడైనా రోడ్డుపైన నడుస్తూ కనబడితే "బండి ఏమైందిరా? నడిచొస్తున్నావు" అంటారు. ఏదో ఉదాహరణకు అంటున్నామే కానీ ప్రస్తుత ఆధునిక యుగంలో నడిచే వాడెవడున్నాడు. నడిస్తే ఈ మాయదారి జబ్బులూ; ఊబకాయాలూ; మోకాళ్ల నొప్పులూ; ముప్పయేళ్లకే బీపీలు; షుగర్లూ ఇవన్నీ ఎందుకు తగలబడతాయి? ఇప్పుడిది చెప్పడం అప్రస్తుతమైనా ప్రస్తుత యువతరం గుర్తించాల్సిన విషయం. కాబోయే ఉపాధ్యాయులు తమ పాఠ్యాంశానికే మాత్రమే పరిమితం కాకూడదు – అనేక అంశాలు దానితో సహ సంబంధ పరచాలి మరి!

**4. మరో భాషలోంచి వచ్చి స్థిరరూపం దాల్చడం :**

ఎక్కడ వస్తూత్పత్తి జరుగుతుందో అక్కడ భాషోత్పత్తి జరుగుతుంది. మనం రాసే 'పెన్'ను ఏ దేశస్థుదు

కనిపెట్టాడో కాని దానిని వాడు 'Pen' అనే అన్నాడు. ఆ తర్వాత ఏ దేశంలోనైనా ఎవరి భాషలో వాళ్ళు ఎన్ని పేర్లు పెట్టినా ఆ పేర్లు నిలవవు. ఉదా : రేడియో, బస్, రైలు, ఫోన్, కంప్యూటర్, రాకెట్ మొదలైనవి.

5. కొత్త పదాలు సృష్టించడం :

వెనకటి "మాయాబజార్" సినిమా మన టి.వి.లో అప్పుడప్పుడూ వస్తూనే వుంటుంది. చూసే వుంటారు కదూ! తెలుగువాళ్లు గర్వించదగ్గ గొప్ప సినిమా అది! అందులోని "ఘటోత్కచుడి" పాత్ర అంటే మీకు ఇష్టమే కదూ!

ఒక సన్నివేశంలో "అస్మదీయులు అనే పదానికి వ్యతిరేక పదం ఏమిటో చెప్పండి" అని గురువు అడిగితే శిష్యులు తడుముకోకుండా తమాషాగా 'తస్మదీయులు' అంటారు గుర్తుంది కదూ! అస్మదీయులు అంటే మన వాళ్లు, అలాగే 'తస్మదీయులు' అంటే అవతలి వాళ్లు. నిజానికి 'తస్మదీయులు' అనే పదం లేదు. కాని ఆ పదం 'మాయాబజార్' సినిమా ద్వారా పైన చెప్పిన అర్థంలో రూఢమైంది.

వికటాట్టహాసం చేస్తూ అంటాడు ఘటోత్కచుడు "తస్మదీయులు అనడం తప్పెలా అవుతుందయ్యా; ఎవరూ పుట్టించకుంటే అసలు పదాలు ఎలా పుడతాయి?" ఎంతో అర్థవంతమైన వ్యాఖ్య ఇది! కొందరు మహాకవులు; రచయితలు; సినిమాలు మాత్రమే కాదు – అట్టడుగు వర్గాల ప్రజలు కూడా సందర్భాన్ని బట్టి కొత్తపదాలు పుట్టిస్తారు. అవి తర్వాత కాలంలో నిఘంటువుకు కూడా ఎక్కుతాయి.

ఇంగ్లీషులో Bus అనే పదం "Omni Bus" అనే లాటిన్ పదం సంగ్రహరూపం. లాటిన్ భాషలో "Omni Bus" అంటే అర్థం "అందరి కోసం". నిజమే! బస్సు మాత్రమే కాదు; భాషకూడా అందరి కోసమే కదూ!

**6. వస్తువుల వాడకం తగ్గడం :**

లామార్క్ సిద్ధాంతంలోని ఉపయోగ, నిరూపయోగ సూత్రం (Law of Use & Disuse) లాగా వస్తువుల వాడకం తగ్గే కొద్దీ ఆ పదాలు భాషలో లోపిస్తాయి. ఉదాహరణకు – ఈటె; డాలు; గద; బల్లెం; ఒర మొదలైన యుద్ధపరికరాలు ప్రస్తుతం వాడుకలో లేవు – పాత పౌరాణిక సినిమాలు, నాటకాలు, కథలూ; ఆటవికుల దగ్గర తప్ప!

"సంక్రాంతికి అరిసెలు చేయరాదే" అన్నాడు తాతయ్య; వాళ్ల నాయనమ్మతో. "అరిసెలంటే ఏమిటి నాయనమ్మా" అని అడిగింది చాకెలెట్ నములుతూ మనవరాలు వెన్నెల.

ఇంతెందుకు? ప్రస్తుతం మన యువతరానికి రోలు, రోకలి, గిన్నె, చెంబు, మరచెంబు అనే పదాలు తెలుసా? 'జాబు' అంటే ఏమిటో తెలుసా? ఎలా తెలుస్తుంది? అసలు 'జాబు' రాసే అలవాటు వుంటేగా? – సెల్‌ఫోనులో సొల్లు కబుర్లు తప్ప! జాబు అంటే వాళ్ల దృష్టిలో ఉద్యోగమే మరి!

అర్థవిపరిణామం – రకాలు :

ఏడు రంగుల ఇంద్రధనస్సులా అర్థ విపరిణామం ఏడు రకాలు.

1. అర్థవ్యాకోచం (Sematic Extension)
2. అర్థసంకోచం (Sematic Narrowing)
3. ఆలంకారిక ప్రయోగం (Figurative use)
4. అర్థగౌరవం (Elevaling Meaning)
5. అర్థాప్రకర్ష (Degradation of Meaning)
6. సభ్యోక్తి (Ecephemism)
7. వస్తు పరిణామం (Subreption)

అర్థ విపరిణామంలోని ఈ ఏడు రకాలను గురించి అర్థవంతంగా తెలుసుకుందాం.

**1. అర్థవ్యాకోచం :–** ఒక పదం అర్థం పాతకాలంలో కన్నా తరువాత కాలంలో విస్తృతమైతే అది అర్థ వ్యాకోచం.

ఉదా : చెంబు – దీని మూలధాతువు చెమ్ > కెమ్ అంటే ఎరుపు; ఎర్రని అని అర్థం. పాతకాలంలో రాగి చెంబే అసలైన చెంబు. అయితే ఇప్పుడు దీని అర్థం ఇత్తడి చెంబు. వెండి చెంబు; స్టీలు చెంబు – వీటికి కూడా విస్తరించింది.

అలాగే 'వ్యవసాయం' అంటే కేవలం పంటలు పండించడం మాత్రమే. ఈ పదం ఇప్పుడు అన్ని రంగాలకు విస్తరించింది. సాహిత్య వ్యవసాయం; రాజకీయ వ్యవసాయం; విద్యా వ్యవసాయం ఇలా!

ఉదా : గుర్రం జాషువా సాహితీ వ్యవసాయం చేసి 'గబ్బిలం' 'పిరదౌసి' అనే కావ్యాలు పండించాడు.

**2. అర్థ సంకోచం :** పాతకాలం నాటి అర్థం కన్నా అర్వాచీనకాలంలో దాని అర్థం సంకుచితమైతే అది అర్థ సంకోచం అవుతుంది. ప్రాచీనకాలంలో 'చీర' అంటే స్త్రీ పురుషులందరూ ధరించే వస్త్రం. ఆ తర్వాత కాలంలో ఇది స్త్రీలు ధరించే వస్త్రానికే పరిమితమైంది. 'కంపు' అంటే నన్నయ కాలం నాటి అర్థం సువాసన. అయితే ప్రస్తుతం అది సువాసన పోగొట్టుకొని 'దుర్వాసన' అనే అర్థంతో సంకోచించింది.

**3. ఆలంకారిక ప్రయోగం :** ఉపమానానికి ఉపమేయార్థం సంక్రమించడం. "నీ కోడలు సాక్షాత్తు లక్ష్మి వదినా।" అంది జానకమ్మతో పక్కింటి పార్వతమ్మ. ఇక్కడ లక్ష్మి ఎవరో కాదు జానకమ్మ కోడలే.

అలాంటివే కొన్ని : "మీ మనవడు ప్రణయ్ చదువులో కత్తి సార్!" అంటే ప్రణయ్ చదువులో కత్తిలా పదునైన వాడని అర్థం.

"అక్కినేని నడిచే విజ్ఞాన సర్వస్వం"

"నందివర్ధనం పువ్వా? కాదది – దేవుడి చిరునవ్వు"

" పిల్ల ఎంత బాగుంది! బుగ్గలు చిదిమి దీపం ముట్టించవచ్చు"

"ఎండ నిప్పులు చెరుగుతోంది"

**4. అర్థగౌరవం లేక అర్థోత్కర్ష :** పాతకాలంలో అర్థం కన్నా తర్వాత కాలంలో అర్థం ప్రశస్తమైనదైతే అర్థగౌరవం లేక అర్థోత్కర్ష అంటారు.

పాతకాలంలోని ఒక జన నానుడి – "ఆడది తిరిగి చెడింది. మగాడు తిరక్క చెడ్డాడు". ఇది ఒక రకంగా స్త్రీ గౌరవాన్ని కించపరిచి; ఆమె స్వేచ్ఛను తగ్గించి; పురుషాధిక్యతను ప్రోత్సహించడమే!

అయితే ఇప్పటి ఆధునిక సైకాలజీ భావజాలం ప్రకారం "ఆడదైనా మగాడైనా తిరక్కనే చెడతారు". అంటే దీని అర్థం సమాజంలో స్త్రీ పురుషులు సాంఘికంగా కలిసి మెలిసి తిరుగుతూ తమ వ్యక్తిత్వాన్ని; భావాలను విశాలం చేసుకోవాలని అర్థం.

గాలిబ్ గీతాల్లో దాశరథి అంటాడు –

"తప్పు చేయనివాడు లేడు లేడు
తప్పు చేయనినాడు మనిషి మనిషి కాదు"

**5. అర్థాపకర్ష :** పాత కాలంలో అర్థం కన్నా తర్వాత కాలంలో అర్థం నీచమైనదైతే 'అర్థాపకర్ష' అంటారు. ఒకనాడు ఛాందసుడు అంటే చందస్సు తెలిసిన పండితుడు; వేదవేత్త అని అర్థం. మరి ఇప్పుడో – లోకజ్ఞానం లేని వాడు, వట్టి చాదస్తుడు అని అర్థం. 'సన్యాసి' అనేపదం ఒకనాడు అంతులేని గౌరవం సంతరించుకున్న పదం. ఇహలోక సంబంధాలు విడిచిపెట్టిన త్యాగిని సన్యాని అంటారు. మరి నేడో? ఎందుకూ పనికిరానివాడని అర్థం "పోరా సన్నాసీ!"

**6. సభ్యోక్తి :** పెద్దల సమక్షంలో కాని; సభలో కాని ఉచ్చరించ కూడని పదాలకు గౌరవ సూచకమైన సభ్యోక్తులు అన్ని భాషల్లోనూ వుంటాయి. అలాంటి పదాలు వాడడం సభ్యత కాదు. అలాంటి పదాలకు కొన్ని ప్రత్యామ్నాలు వాడడమే సభ్యోక్తి. అశ్లీల పదాలను నివారించడానికి సభ్యోక్తులు ఏర్పడతాయి.

ఉదా : "ఒకటికి వెళ్లాడు", "రెంటికి వెళ్లాడు" "దొడ్డికి వెళ్లాడు" "చెంబు పట్టుకుపోయాడు" (సెప్టిక్ టాంక్, లెట్రిన్ సౌకర్యాలు లేని కాలంలో)

"సత్యం మాష్టారు పోయారు" అనడం కన్నా గౌరవ సూచకంగా "దివంగతులయ్యారు", "కాలధర్మం చెందారు" అనడం బాగుంటుంది.

అలాగే క్రైస్తవులు సమాధి మీద "అబ్రహాం 1985 జనవరి 2వ తేదీన చనిపోయాడు" అని రాయరు. గౌరవ సూచకంగా "ప్రభువు నందు నిద్రించాడు" అని రాస్తారు.

**7. వస్తు పరిణామం :** పూర్వకాలం నుండీ వాడుతున్న ఒక పదం భాషలో ఇప్పటికీ మిగిలివున్నా అది సూచించే వస్తువు రూపం; నిర్మాణం; స్థాయి మొదలైని వాటిలో కాలక్రమేణా చాలా భేదం వస్తుంది! దీనినే వస్తు పరిణామం అంటారు.

ఉదా : అప్పటికీ ఇప్పటికీ 'ఇల్లు' అనే పదం నిత్య వ్యవహారంలోనే వుంది. ఒకప్పుడు పాకలు; పూరిళ్లు; పెంకుటిళ్లూ, మిద్దెలు; మేడలు – ఇవన్నీ ఇళ్లే!

మరి ఇప్పుడో! 'ఇల్లు' అనేక రకాలుగా పరిణామం చెందింది. డాబా; పాలెస్; ప్లాజా; అపార్ట్‌మెంట్; ఫ్లాట్స్ – ఇవన్నీ ఇళ్లే!

**మూల్యాంకనం :**

1. మన మాటల ప్రభావం మనపై ఇతరులపై ఎలా వుంటుంది ఉదాహరణలతో వివరించండి.
2. భాషోత్పత్తివాదాలో స్వతఃసిద్ధవాదాన్ని; సహజ పరిణామవాదాన్ని విశ్లేషించండి.
3. ఏవైనా మూడు భాషా నిర్వచనాలు రాయండి.
4. మాతృభాష ప్రాధాన్యతను సంగ్రహంగా తెలపండి.
5. మాతృభాషలో అభివ్యక్తిని గురించి సంగ్రహంగా రాయండి.
6. అభ్యసనంలో భాష పాత్రను వివరించండి.
7. ధ్వని పరిణామం అంటే ఏమిటి? ధ్వని పరిణామంలోని భేదాలు తెలపండి.
8. అర్థ విపరిణామం గురించి సమగ్రంగా చర్చించండి.
9. తెలుగు వాక్య నిర్మాణాన్ని గురించి తెలపండి.
10. ధ్వని, వర్ణం, అక్షరం, పదం – ఒక్కొక్క దానిని గురించి మూడు వాక్యాలు రాయండి.
11. తెలుగు వర్ణ నిర్మాణ క్రమాన్ని గురించి సంగ్రహంగా రాయండి.
12. చిన్న పిల్లలు వాక్య నిర్మాణం ఎలా చేస్తారు?
13. పరివర్తన వ్యాకరణం అంటే ఏమిటి? దాని ప్రాముఖ్యతను తెలపండి.
14. 'వాక్యం' అంటే ఏమిటో నిర్వచించండి. వాక్య నిర్మాణం సరిగా ఉండకపోవడానికి కారణాలు ఏవి?

**ఆధార గ్రంధాలు :**


1. ఆంధ్ర భాషా వికాసం – ఆచార్య గంటిజోగి సోమయాజి
2. ఆధునిక తెలుగు భాషా శాస్త్ర విజ్ఞానం – ఆచార్య నేతి అనంతరామశాస్త్రి
3. భాషా శాస్త్రం – భాషా బోధన – డా॥ కె.వి.వి.యల్.నరసింహారావు
4. ఆధునిక భాషా శాస్త్ర సిద్ధాంతాలు – డా॥ పి.ఎస్.సుబ్రహ్మణ్యం
5. తెలుగు భాషా చరిత్ర – డా॥ భద్రిరాజు కృష్ణమూర్తి
6. చేరాతలు – డా॥ చేకూరి రామారావు
7. Hand Book for Teacher Educators for D.E.Ed., A.P. SCERT - Co-ordinators Y.రాఘవరెడ్డి, ప్రిన్సిపాల్, DIET కర్నూలు G. నారాయణ లెక్చరర్
8. భాషా బోధన ఆధారపత్రం A.P. SCERT 2011 – A.P. SCERT
9. పిల్లలు భాషను ఎలా నేర్చుకుంటారు – వి.బాలసుబ్రహ్మణ్యం MLC.,
10. భాష – సమాజం – సంస్కృతి – డా॥ భద్రిరాజు కృష్ణమూర్తి

# భాష - సమాజం
## అధ్యాయం- 2

### సమాజానికి దూరంగా భాష అభివృద్ధి కాదు - అరోరిన్

**పరిచయం :**

భాష మానవునికి గల ప్రత్యేక లక్షణమని పదే పదే చెప్పవలసిన పని లేదు. మనుషుల భావవ్యక్తీకరణకు భాష తప్పనిసరి. మనిషికి చక్కటి వ్యక్తిత్వంతో పాటు అభివ్యక్తిత్వం కూడా అవసరం. అభివ్యక్తిత్వం అంటే తన అభిప్రాయాలను వెల్లడించడం. భాష సమాజంలోని అందరినీ అనుసంధానం చేస్తుంది. మన మనస్సులలో రూపొందే సామాజిక విషయాలు, పరిసర ప్రభావాలు భాష ద్వారానే వ్యక్తమవుతాయి. భాషకు సమాజానికి అవినాభావ సంబంధముంది. సమాజం లేకుండా భాష లేదు. కాలంలాగానే సమాజం కూడా నిరంతరం పరిణామశీలం. మారే సమాజాన్ని బట్టి; సామాజిక అవసరాలను బట్టి భాష కూడా మారుతూనే వుంటుంది. అలా మారడమే ప్రగతికి మూలం! పిల్లల్లో దాగివున్న అంతర్గత శక్తియుక్తులను వెలికితీసి సామాజిక పరిసరాల మధ్య జరిగే పరస్పర సంక్లిష్ట చర్యలను వాళ్లు అర్థం చేసుకునేందుకు భాష ఉపయోగపడుతుంది. భాష సామాజిక గుర్తింపుకు చక్కటి సాధనం. మనిషికి గల గుర్తింపులో బహుభాషా పరిజ్ఞానం (Multi Linguistic ability) ఒక అంతర్భాగం. గ్రామీణ ప్రాంతాలలో ఒకే భాష మాట్లాడేవాడైనా ఎక్కువసార్లు నూతన సందర్భాలను ఎదుర్కోవలసి వచ్చినపుడు ఆయా భాషలకు చెందిన పదజాలాన్ని సులభంగా అర్థం చేసుకోగలుగుతాడు.

భాషా ప్రణాళిక రచనలో బహుభాషిత్వం (Multi Linguity) కీలకం. భారతదేశంలోని తరగతి గదులు సహజంగానే బహుభాషలకు నెలవు. అందువల్ల తరగతిగదిలోని బహు భాషిత్వ లక్షణాన్ని బోధనకు, అభ్యసనకు ఆటంకంగా భావించకుండా ఈ లక్షణాన్ని ఒక వనరుగా గుర్తించి దీనిని ఒక బోధనా వ్యూహంగా ఉపయోగించుకోవాలి. తద్వారా పిల్లలు తమ జ్ఞాన నైపుణ్యాలకు పదును పెట్టుకొని ఆశించిన భాషా నైపుణ్యాలను సంపాదిస్తారు. అందువల్ల భాషా ప్రణాళికా రచనలో బహు భాషా కృషీవలత్వం కేంద్రబిందువు కావాలి. తరగతి గదిలో పిల్లలు మాట్లాడే ఏ ఇంటి భాషనైనా గౌరవించాలి. మన తరగతిగదిలో మన పిల్లల ఇంటి భాషను మనం గౌరవించకపోతే వారు వెలివేసినట్లుగా భావించి బడి బయట పిల్లలుగా మారే ప్రమాదముంది. మహాకవి డాక్టర్ సి.నా.రె చెప్పినట్లు “ప్రాంతాలు వేరైనా మన అంతరంగమొకటేనన్నా; యాసలు వేరే అయినా; మన తెలుగు భాష ఒకటేనన్నా; వచ్చిండన్నా వచ్చాడన్నా వరాల తెలుగు ఒకటే అన్నా”.

బహుభాషలు బహుళ సంస్కృతులు గల దేశం మనది. “భిన్నత్వంలో ఏకత్వం”. మహత్తర భారత సంస్కృతి! భాషా విషయంలో కూడ అదే వైవిధ్యం కన్పిస్తుంది. భారతీయ భాషలలో భావైక్యతతో పాటు భాషాసామ్యం కూడ కన్పిస్తుంది.

ఈనాడు సాంకేతిక, విజ్ఞాన రంగాలు అభివృద్ధి వల్ల వివిధ ప్రాంతాల మధ్య సాంఘిక, వాణిజ్య సంబంధాలు బాగా విస్తరించాయి. కాబట్టి నేటి మానవుడు ఇంటి భాషతో పాటు ఇతర భాషలను కూడా నేర్చుకోవలసిన అవసరం ఏర్పడింది. అయితే భారతదేశంలాంటి భాషా వైవిధ్యం గల దేశంలో ఏయే భాషలు నేర్చుకోవాలనేది, ఏది జాతీయ భాషగా ఉండాలనేది ఒక సమస్యగా మారింది. ఈ సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వం త్రిభాషా సూత్రం రూపొందించింది.

**లక్ష్యాలు :**

ఈ అధ్యాయం చదివిన తర్వాత ఛాత్రోపాధ్యాయులు

l బహుభాషలు మాట్లాడే సమాజాల గురించి అవగాహన చేసుకుంటారు.

- మనిషికి భాష గుర్తింపు చిహ్నమనీ, అన్ని భాషలు సమానమేనని అర్థం చేసుకుంటారు.
- భారత సమాజంలో భాషకు సంబంధించిన అంశాలను గురించి త్రిభాషా సూత్రం గురించి అవగాహన పొందుతారు.
- మాతృభాష, ఇతర భాషల గురించి, ప్రథమ, ద్వితీయ, తృతీయ భాషల గురించి అవగాహన పొందుతారు.
- భాషా సాహిత్య వికాసాల సమగ్ర అవగాహన పొందుతారు.
- భాష-సంస్కృతి పరస్పరాశ్రితాలు అని గుర్తిస్తారు.
- భాష ఒక మాధ్యమం, ఒక సజ్జక్టు అని తెలుసుకుంటారు.
- గ్రాంధిక, వ్యావహారిక, మాండలిక భేదాలను గుర్తిస్తారు.
- భాషా వికాసం అన్ని వికాసాలకు పట్టుగొమ్మ అని అర్థం చేసుకుంటారు.
- ప్రాంతాల వారీ మాండలికాలు, వర్గ, కుల మాండలికాల గురించి అవగాహన పొందుతారు.
- ప్రామాణిక భాష, అధికారిక భాష, మాధ్యమ భాషలను గురించిన పరిజ్ఞానం పొందుతారు.
- తెలుగు భాషపై సంస్కృత, పారశీక, ఉర్దూ, ఆంగ్ల ప్రభావం గురించి తెలుసుకుంటారు.
- తెలుగు భాష పూర్వ వైభవ స్థితి గురించి సమగ్రంగా అర్థం చేసుకుంటారు.
- అనువాద ప్రక్రియ అవశ్యకతను గుర్తిస్తారు.

## 2.1 మానవ సమాజాలు - బహుళ భాషలు - భాష - గుర్తింపు

### 2.1.1. మానవ సమాజాలు - బహుళ భాషలు

ప్రపంచ వ్యాప్తంగా అనేక వేల భాషలు సంస్కృతులు కొనసాగుతున్నాయి. ప్రపంచపర్యావ్యాప్తంగా దాదాపు ఏడు వేలకు పైగా విభిన్న భాషలుంటాయని భాషా వేత్తల అంచనా. వీటిని కాపాడుకోవడం ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుంది. ఆయా భాషలలో ఉండే సాహిత్యాన్ని సంస్కృతినీ కాపాడితే మానవ నాగరికత పురోగమిస్తుంది. భారతదేశంలోని ప్రాచీన బ్రాహ్మి, పాళి భాషలలో మన చరిత్ర దాగి ఉంది. ఆ భాషలు వాడుకలో లేవు. వీటిని రక్షించుకోవడం అవసరం. వేదకాలానికి ముందు వెలసిన సింధూ నాగరికతకు చెందిన భాషను నేటికీ చదవలేకపోవడంతో ఆ నాగరికత విషయంలో స్పష్టమైన అవగాహన ఏర్పడడానికి పరిమితులేర్పడ్డాయి. అంచేత మాతృభాషలను రక్షించుకోవడం అత్యంత ప్రాముఖ్యత సంతరించుకుంది.

ప్రపంచ వ్యాప్తంగా కొనసాగుతున్న వేల భాషలను వాటిలోని భాషాంశాల సారూప్యతల ఆధారంగా భాషా కుటుంబాలుగా విభజించారు. ప్రపంచమంతటిలోనూ అత్యధిక సంఖ్యాకుల చేత మాట్లాడబడే భాషలు ఇండో-యూరోపియన్ భాషా కుటుంబానికి చెందినవి.

### 2.1.2. భారతదేశంలోని భాషా కుటుంబం :

భారతదేశంలో వ్యవహృతమవుతున్న భాషల్ని గ్రియర్‌సన్ పండితుడు పరిశోధించి Linguistic Survey of India అని పది సంపుటాలుగా ప్రచురించాడు.

భారతదేశం పలు విధాల పలుకుబడులకు, జంతు సంతతులకు, సంస్కృతులకు ఏ విధంగా ప్రదర్శనశాలగా పేరు మోసిందో అదే విధంగా వివిధ భాషా కుటుంబాలకు కొండంత ఖ్యాతి గాంచింది. గ్రియర్‌సన్ చేసిన సర్వే ప్రకారం మన దేశంలో 175 భాషలు, 544 మాండలికాలు ఉన్నాయి.

భారతదేశంలో రెండు భాషా కుటుంబాలు ముఖ్యమైనవి. అందులో పెద్దది హిందార్య భాషా కుటుంబం.

**హిందార్య భాషా కుటుంబం : (ఇండో-ఆర్యన్ భాషా కుటుంబం)**

ఉత్తర హిందూస్థానంలో వ్యవహరింపబడుతున్న నూతన ఆర్యభాషలన్నీ ఈ కుటుంబానికి చెందినవే.

అవన్నీ ఈక్రింద సూచించిన విధంగా వివిధ ప్రాకృత అపభ్రంశ భాషల నుండి ఏర్పడ్డాయి.

| | | |
|---|---|---|
| 1. మహారాష్ట్ర ప్రాకృతం | – | మరాఠీ |
| 2. మాగధ్య ప్రాకృతం | – | అస్సామీ, బెంగాలీ, ఒరియా |
| 3. శౌరసేని ప్రాకృతం | – | రాజస్థానీ, వ్రజ, అవధి |
| 4. అపభ్రంశ ప్రాకృతం | – | గుజరాతీ |
| 5. పైశాచీ ప్రాకృతం | – | కాశ్మీరీ, పంజాబీ, దరద భాషలు |

ఇందులో బెంగాలి, మరాఠి భాషలకు క్రీ.శ. 12వ శతాబ్ధి నుండి తక్కిన వాటికి 16వ శతాబ్ధి నుండి సారస్వతమేర్పడింది.

నేడు హిందీగా పరిగణింపబడుతున్న భాష అనేక మాండలికాల సమాహారం. ఇందులో ప్రధానంగా రెండు విభాగాలున్నాయి.

**1. పడమటి విభాగం :** రాజస్తానీ, వ్రజ, బుందేలి, మాలవి, భోజ్‌పురి, మేవారి మున్నగునవి. వ్రజ భాషలో సూరదాస్ కీర్తనలు రచించాడు.

**2. తూర్పు విభాగం :** అవధి, మైథిలీ మొదలైనవి. మైథిలీకి ప్రాచీన సాహిత్యముంది. ఇది దర్భాంగ ప్రాంతంలో కోటి మంది ప్రజలచే వ్యవహృతమవుతున్నది. దీనిని ప్రత్యేక భాషగా గుర్తించాలనే ఆందోళన ఉంది. ప్రాచీన సాహిత్యమున్నంత మాత్రాన ఒక మాండలికాన్ని ప్రత్యేకభాషగా గుర్తించ రాదంటారు కొంతమంది శాస్త్రజ్ఞులు.

అవధిలో తులసీదాసు రామచరిత మానసాన్ని రచించాడు. ఈ భాషలో పద్మావతి, మృగావతి, ఇంద్రావతి వంటి రచయిత్రులు ప్రసిద్ధులు.

ఖడీబోలిలో కబీరు సూక్తులున్నాయి. విశ్వకవి రవీంద్రుడు వీటిని ఆంగ్లీకరించి విశ్వవ్యాప్తం చేశాడు.

హిందీ, ఉర్దూ భాషా మిశ్రమం చేత హిందూస్తానీ ఏర్పడ్డది. ఉర్దూ అంటే మజలీ, సైనిక విన్యాసం. పాదుషాల సేనల్లో పలు తెగల ప్రజలు మాట్లాడే భాష ఇది. అరబ్బీ, పారశీక భాషల ప్రభావం ఈ భాష మీద అత్యధికంగా ఉంది. ఇది రాష్ట్రం లేని భాష (Stateless Language) కావటం చేత దీని ప్రాముఖ్యం పోతున్నది. (సంస్కృతం, సింధీ కూడ రాష్ట్రం లేని భాషలే). పాకిస్తాన్ నుండి భారతదేశానికి వచ్చిన సింధు దేశస్థులే సింధి భాష మాట్లాడుతున్నారు.

**1. మరాఠీ :** 10వ శతాబ్ది నుండి శాసనాలు, 13వ శతాబ్ది నుండి సాహిత్యం లభ్యమౌతున్నది. వివేక సింధు, భావర్థ దీపిక, శిశుపాలవధ, లీలాచరిత్రలు ప్రసిద్ధాలు. 1991 జనాభా లెక్కల ప్రకారం జనాభా 5 కోట్ల 35 లక్షలు. తెలుగు భాషతో సన్నిహితమైన ఆర్యభాష, ఓనమాటి, కట్టు, కాలువ, కావడి మొదలైన తెలుగు పదాలిందులో ఉన్నాయి. తెలుగుదేశాన్ని పీష్వాలు పరిపాలించేటప్పుడు రావు, పంతు వంటి బిరుద వాచకాలు కొన్ని తెలుగువాళ్ల పేర్ల చివరలో చేరాయి.

ఉదా : భాస్కరరావు, నాగేశ్వరరావు, వీరేశలింగం పంతులు మొదలైనవి.

**2.బెంగాలి :** ఇండియాలో 4.8 కోట్ల మంది ఉన్నారు. బంగ్లాదేశ్‌లో 7.8 కోట్ల మంది ఈ భాషను మాట్లాడుతున్నారు. 12వ శతాబ్దం నుండి సాహిత్యం ఉంది. చండీదాసు, గోస్వామి మున్నగు వారి రచనలు ప్రాచీనం. శరత్‌చంద్ర రాసిన 'దేవదాసు', 'బడదీది' మొదలైన నవలలు; టాగూరు 'గీతాంజలి' కావ్యం. జాతీయ ప్రార్ధనా గీతంగా మనం పాడుకునే బకించంద్ర ఛటర్జీ "వందేమాతం" గేయం సుప్రసిద్ధాలు.

**3.గుజరాతీ :** 3 కోట్ల 25 లక్షలు. 15వ శతాబ్ధి నుండి సాహిత్యం ఉంది.

**4. అస్సామి :** 1 కోటి 1 లక్ష. 16వ శతాబ్ధి నుండి సాహిత్యం ఉంది.

**5. పంజాబి :** 2 కోట్లు

**6. ఒరియా :** 2 కోట్ల 5 లక్షలు

**7. సింధి :** 25 లక్షలు

**8. కాశ్మీరీ :** 45 లక్షలు

భీమ్సు దొర ఈ నవీన ఉత్తర దేశ భాషలకు తులనాత్మక వ్యాకరణం రాశారు. మాక్స్‌ముల్లర్, భండార్కర్, ఆచార్య బరో మొదలైన వారీ భాషలపై పరిశోధనలు చేశారు.

**ద్రావిడ భాషా కుటుంబం :**

తులనాత్మక పరిశీలన చేయటం వల్ల తేలిన తారతమ్య సహజాత సంబంధాలను బట్టి ఈ భాషలను మూడు ప్రధాన ఉప కుటుంబాలుగా విభజించవచ్చు. అవి దక్షిణ, మధ్య, ఉత్తర ఉపకుటుంబాలు.

**దక్షిణ ద్రావిడ భాషలు :**

1.తమిళం 2.మళయాళం 3.కన్నడం 4.తుళు 5.కొడగు 6.తొద 7.కోట(త) 8.బడగ

**మధ్య ద్రావిడ భాషలు :**

9. తెలుగు 10.కుయి/కూయి 11.కువి 12.కొండ 13.గోండి 14. కోలామి 15.నాయికీ 16. పర్జీ 17. బల్లారి 18. గదబ 19.పెంగో 20.కోయ

**ఉత్తర ద్రావిడ భాషలు :**

21.కురుఖ్/కూడుఖ్ 22.మాల్తో 23.బ్రాహుయీ

ఎరుకల (70వేలు), ఎరన (15వేలు), కురులు, కైకాడి లేదా బెట్ట కురుంబ (9వేలు), కొరవ (6వేలు), ఇరుల/ఇరుళ (4వేలు), బార్గండి (2వేలు)

భాషా వ్యవహర్తలు నీలగిరి కొండల పరిసర ప్రాంతాలలో ఉన్నట్లు ఆండ్రోనోవ్ తెలిపారు. కాని ఎరుకల, కైకాడి, కొరవ, బుర్గండిలు తమిళ భాషా మాండలికాలుగాను, కురులు కన్నడ భాషా మాండలికంగాను పేర్కొనబడ్డాయి. బడగ కన్నడ భాషకూ, కోయ, గోండ భాషకు మాండలికాలని కొందరి అభిప్రాయం.

క్రీస్తుకి మూడు నాలుగు వేల ఏండ్లకు పూర్వం ఆదిమ ద్రావిడ భాష పేరుతో ఒకే ఒక భాష ఉండేదని, అది కాలక్రమేన ఇప్పటి ద్రావిడ భాషలుగా విడిపోయిందనీ పండితులు తులనాత్మక పద్ధతి (Comparitive Method) ద్వారా నిర్ణయించారు.

ప్రపంచమంతటా ప్రాక్తన మానవుడి కాలంలో వేళ్ల పైన లెక్కించదగ్గ భాషలు మాత్రమే ఉంటే ఆ భాషల్లో నుండే వారసత్వ లక్షణాలను సంతరించుకుంటూ ఈ నాటికి ఇన్ని వందల భాషా కుటుంబాలు వేల వేల భాషలు తామరతంపరగా పుట్టుకొచ్చాయంటే మనకు ఆశ్చర్యంగానే వుంటుంది. కానీ – చార్లెస్ డార్విన్ పరిణామ సిద్ధాంతాన్ని అర్థం చేసుకుంటే ఈ చిక్కు ముడులన్నీ చిటికలో విడిపోతాయి. వందల కోట్ల సంవత్సరాల నాటి ఏకకణ జీవి 'అమిబా' ఆ తరువాత బహుకణ జీవిగా, రానురాను క్షీరదంగా కొంతకాలం అనంతరం కోతిగా రూపాంతరం చెందడం, వానరుడు నరుడుగా పరిణామం చెందడం – ఇవన్నీ డార్విన్ తన పరిణామ సిద్ధాంతం ద్వారా సాక్ష్యాధారాలతో సహా నిరూపించాడు. ఇంతెందుకు? మన కళ్లముందే భాషలు ఎలా మారుతున్నాయో గమనించండి. మార్పును అడ్డగిస్తే మానవుడికి మనుగడే లేదు.

ద్రావిడ భాషలలో తమిళ, కన్నడ, తెలుగు, మళయాళ భాషలకు ప్రాచీనమైన లిఖిత సాహిత్యం, వ్యాకరణ రచనా సంప్రదాయం ఉన్నాయి. ఇవి నాగరిక భాషలు. మిగిలిన భాషలలో ప్రాచీన లిఖిత సాహిత్యం లేనందు వల్ల వాటిని అనాగరిక లేక సాహిత్య రహిత భాషలు అంటారు. వీటిలో తుళు, కొడగు తప్ప మిగిలినవి ఆటవికుల భాషలు (Tribal Languages) అని కూడ అంటారు.

ద్రావిడ భాషలు ముఖ్యంగా దక్షిణ భారత దేశమంతటా వ్యాపించి ఉన్నాయి. శ్రీలంక దేశ ఉత్తరార్ధంలో

తమిళ భాషా వ్యవహర్తలుండటం వల్ల దీన్ని కూడ ద్రావిడ భాషా స్థానంగానే పరిగణించాలి. భారతదేశంలో కూడ మధ్యప్రదేశ్, బీహార్, ఒరిస్సా రాష్ట్రాలలోని కొన్ని ఆటవిక జాతులు వారు ద్రావిడ భాషలను మాట్లాడుతున్నారు. పాకిస్తాన్‌లోని బెలూచిస్తాన్ రాష్ట్రంలో ఉండి; బ్రాహుయీ జాతి వారి భాష కూడ ద్రావిడ భాషే.

**2.1.3. భాష – గుర్తింపు :**

ఒక వ్యక్తి కాని; సంస్థ కాని; సంస్కృతి కాని, తనకంటూ ఒక గుర్తింపును కోరుకుంటాయి. గుర్తింపు పొందిన భాషలు మరింత అభివృద్ధి పొందుతాయి. ప్రత్యేకతను చాటుకుంటాయి.

ఈ మధ్యకాలంలో 'తెలుగుభాష'ను ప్రాచీన భాషగా గుర్తించాలని, దానికి ప్రాచీనతా హోదా ఇవ్వాలని మన రాష్ట్రం ఆందోళన చేసింది. అందుకు కారణం ఉంది. మన పక్క రాష్ట్రాల్లో వున్న కొన్ని భాషలు ప్రాచీన భాషలుగా గుర్తింపబడ్డాయి. అందువల్ల పలు ప్రయోజనాలున్నాయి. భాషను అభివృద్ధి చేసుకునే ఆర్థిక వనరులు లభిస్తాయి. మన భాషలోని కవుల గ్రంథాలు ఇతర భాషల్లోకి అనువదింపబడతాయి. తెలుగు భాషా సుందరి ప్రపంచాన్ని ఆకర్షిస్తుంది.

అయితే మాతృభాష పట్ల మనకు అంతటి అభిమానం వుండడం మంచిదే కానీ; అది ఇతర భాషల ద్వేషానికి దారితీయకూడదు. నిజమైన భాషాభిమానం వున్నవాడు అన్ని భాషలనూ గుర్తిస్తాడు. సమానంగా గౌరవిస్తాడు. ఆయా భాషాల్లోని అందచందాలను ఆస్వాదిస్తాడు. "Great Poets are friends to entire man kind".

షేక్స్‌పియర్ ఇంగ్లీషు నాటకకర్త కాబట్టి మనం గుర్తించకుండా వుంటామా? అలాగే మన వేమన, తిక్కన, గురజాడ, శ్రీశ్రీ, జాషువా తెలుగు కవులే అయినా ప్రపంచ ప్రజల గుర్తింపు పొందారు.

అంతర్జాతీయ అవగాహన దృష్ట్యా అన్ని భాషలూ సమానమే! ఏ భాష సౌందర్యం ఆ భాషదే! ఉర్దూ భాష ఎంత అందమైన భాష! అర్థం కావాలే కాని గిరిజనులు మాట్లాడే ఆటవిక భాషలో సైతం ఎంత తీయదనం దాగి వుంది! ఏ భాషలో మంచి వున్నా మనం గుర్తించవలసినదే! ప్రపంచ భాషల్లోని అనంత వైవిధ్యాన్ని గుర్తించినపుడే మన భాష సైతం "ప్రపంచాబ్జపు తెల్ల రేకై పల్లనిస్తుంది".

ఏ భాషకైనా గొప్ప గుర్తింపు లభించిందంటే అది ఆ భాషలోని కవుల ద్వారానే! కవికి గల గుర్తింపు; రాజుకు కూడా లేదేమో! అందుకే మహాకవి జాషువా ఓ పద్యంలో కవిని ఇలా ప్రస్తుతిస్తాడు.

"రాజు చేతికత్తి రక్తమ్ము వర్షించు
సుకవి చేతికలము సుధలు గురియు
రాజు జీవించు రాతి విగ్రహములందు
సుకవి జీవించు ప్రజలనాల్కలందు"

## 2.0 భారత రాజ్యాంగంలో భాషకు సంబంధించిన అంశాలు, భాషా విధానాలు, త్రిభాషా సిద్ధాంతం.

### 2.2.1. భారత రాజ్యాంగంలో భాషకు సంబంధించిన అంశాలు :

భారతదేశంలో వివిధ ప్రాంతాల ప్రజలు అనేక భాషలు మాట్లాడతారు. కనీసం 800 భాషలు, 2000 యాసలు/మాండలికాలు గుర్తించబడ్డాయి. కేంద్ర ప్రభుత్వ వ్యవహారాలకు గాను హిందీ, ఇంగ్లీషు భాషలను వాడాలని భారత రాజ్యాంగం నిర్దేశించింది. వివిధ రాష్ట్రాలు తమ తమ రాష్ట్రాలలో అధికార భాషలు వాడతాయి. కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించేందుకు రాష్ట్రాలు ఆంగ్ల భాషను వాడతాయి.

ఉదాహరణకు కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి హిందీ, ఇంగ్లీషులలో ఉత్తరాలు రాస్తే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలుగు, ఇంగ్లీషులలో రాస్తుంది. హిందీ, ఇంగ్లీషులతో కలిసి భారతదేశంలో 24 అధికార భాషలున్నాయి. అధికార భాషా కమీషన్ వద్ద ఈ భాషలకు ప్రాతినిధ్యం ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే పరీక్షలలో అభ్యర్థులు పై భాషల్లో దేనిలోనైనా రాయవచ్చు.

భారత రాజ్యాంగంలోని 343 అధికరణం దేవనాగరలిపిలోని హిందీని అధికార భాషగా గుర్తించింది. 1950లో రాజ్యాంగంలో పొందుపరచినట్లుగానే, 1965లో ఇంగ్లీషు అధికార భాష హోదాను (హిందీతో సమానంగా) కోల్పోయింది. ఆ తర్వాత దీనిని అదనపు అధికార భాషగా కొన్నాళ్ల పాటు కొనసాగించి హిందీని పూర్తిస్థాయిలో అమలు పరచాలనేది ప్రభుత్వ ఉద్దేశంగా ఉండేది. అయితే హిందీని అంతగా జీర్ణించుకోలేని దక్షిణాది రాష్ట్రాలు వ్యతిరేకించడంతో జంట భాషల పద్ధతి ఇంకా కొనసాగుతూ వస్తూనే ఉంది. శీఘ్ర పారిశ్రామికీకరణ, ఆర్థిక వ్యవస్థపై బహుళ జాతి సంస్థల ప్రభావం మొదలైన వాటి కారణంగా ప్రభుత్వంలోనూ బయట కూడ దైనందిన కార్యకలాపాలలో ఇంగ్లీషు ప్రాధాన్యత పెరుగుతూ వచ్చింది. దీనిని తొలగించాలన్న ప్రతిపాదన అటకెక్కక తప్పలేదు. ఎందుకంటే ఆధునిక ప్రపంచంలో మనం ముందడుగు వేయాలంటే ఇంగ్లీషు భాషా ప్రాధాన్యతను శిరసా వహించక తప్పదు. "English is the window to see the entire world" అంటాడు మన భారతదేశ తొలి ప్రధాని, మహాజ్ఞాని జవహర్‌లాల్ నెహ్రూ.

**అధికార భాషలు – కేంద్ర ప్రభుత్వం :**

కేంద్ర ప్రభుత్వం రెండు భాషలను ఉపయోగిస్తుంది.

**1. హిందీ :–** హిందీ రాష్ట్రాలతో వ్యవహరించేటప్పుడు హిందీ భాషను వాడుతుంది. అరుణాచల్‌ప్రదేశ్, అండమాన్ నికోబార్‌దీవులు, బీహార్, చండీగఢ్, చత్తీస్‌గఢ్, ఢిల్లీ, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాంచల్ రాష్ట్రాలలో కూడా హిందీయే అధికారభాష.

**2. ఇంగ్లీషు :–** ఇతర రాష్ట్రాలతో వ్యవహరించేటప్పుడు కేంద్రం ఇంగ్లీషు వాడుతుంది.

**భారతదేశ అధికార భాషలు :**

హిందీ, ఇంగ్లీషులు కాకుండా 22 ఇతర భాషలను అధికార భాషలుగా భారత రాజ్యాంగం గుర్తించింది. వివిధ రాష్ట్రాల అధికార భాషలు :

| | | |
|---|---|---|
| 1. అస్సామీ | : | అసోం |
| 2. బెంగాలీ | : | త్రిపుర, పశ్చిమబెంగాల్ |
| 3. బోడో భాష | : | అసోం |
| 4. డోగ్రి | : | జమ్మూ, కాశ్మీరు |
| 5. గోండి | : | గోండ్వానా పీఠభూమిలోని గోండుల భాష |

6. గుజరాతీ : దాద్రా నాగరు హవేల, డామన్ దయ్యూ, గుజరాత్ రాష్ట్రాలు

7. కన్నడ : కర్ణాటక

8. కాశ్మీరీ : జమ్మూ, కాశ్మీరు

9. కొంక : గోవా

10. మళయాళం : కేరళ రాష్ట్రం, లక్షద్వీపాల కేంద్ర పాలిత ప్రాంతాలు

11. మైధిలి : బీహార్

12. మణిపురి లేక మైతె : మణిపూర్

13. మరాఠి : మహారాష్ట్ర

14. నేపాలీ : సిక్కిం

15. ఒరియా : ఒడిషా

16. పంజాబీ : పంజాబ్, చండీగడ్‌లో అధికార భాష. ఢిల్లీ, హర్యానాల రెండో అధికార భాష

17. సంస్కృతం : ఉత్తరాఖండ్‌లో రెండో అధికార భాష

18. సంతాలీ : చోటా నాగపూర్ పీఠభూమి (జార్ఖండ్, బీహార్, ఒడిషా, చత్తీస్‌గడ్) రాష్ట్రాలలోని సంతాలు తెగ గిరిజన భాష

19. సింధీ : సింధీల మాతృభాష

20. తమిళం : తమిళనాడు, పుదుచ్చేరి

21. తెలుగు : ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, యానం

22. ఉర్దూ : జమ్మూ, కాశ్వీర్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలలో రెండో అధికార భాష.

**ముఖ్యమైన ఇతర రాష్ట్ర స్థాయి భాషలు :**

జాతీయస్థాయిలో అధికార భాషలుగా గుర్తింపు పొందనప్పటికీ రాష్ట్ర స్థాయిలో అధికార భాషలుగా గుర్తింపు పొందిన భాషలు ఇవి.

1. కోక్ బోరోక్ : త్రిపుర అధికార భాష

2. మిడో : మిజోరం అధికార భాష

3. ఖాసీ : మేఘాలయ అధికార భాష

4. గారో : మేఘాలయ అధికార భాష

**ప్రజాదరణ పొందిన ఇతర భాషలు :**

50 లక్షలకు పైగా ప్రజలు మాట్లాడుతున్నప్పటికి అధికార హోదా లేని భాషలు ఇవి. వీటిని హిందీలోని వివిధ రకాలుగా స్థానికులు భావిస్తారు.

**బీహార్ భాషలు :**

కింది మూడు బీహారీ భాషలకు 50లక్షల మంది కంటే ఎక్కువ మాట్లాడే వారు ఉన్నప్పటికీ అధికార హోదా లేదు. ఒకప్పుడు వీటిని హిందీ యొక్క వేరు వేరు మాండలికాలుగా భావించారు. కానీ బెంగాలీ, అస్సామీ, ఒరియా లాగానే ఇవి కూడా ఇండిక్ భాషల నుండి వచ్చినవేనని ఇటీవలే తెలిసింది.

**1.ఆంగిక :** బీహార్‌లోని ఉత్తర, దక్షిణ ప్రాంతాలు, జార్ఖండ్, పశ్చిమబెంగాల్‌లోని మాల్దా జిల్లాలో మాట్లాడుతారు.

**2. భోజ్‌పురి :** బీహార్

**3. మాగధి :** దక్షిణ బీహార్‌లో మాట్లాడతారు.

**4. రాజస్థానీ :** రాజస్థాన్ రాష్ట్రంలో 50 లక్షల మందికి పైగా రాజస్థానీ మాట్లాడుతారు. ప్రాంతం నుండి ప్రాంతానికి రాజస్థాన్ యాస మారుతూ ఉన్నప్పటికీ ప్రజలు ఈ భాషలో సంభాషించ గలుగుతారు. చాల మంది హిందీ కూడ మాట్లాడగలరు. రాజస్థానీ, హిందీ ఒకటే అని చాలా మంది అనుకుంటారు.

**రాజస్థానీలోని ప్రధాన రకాలివి.**

**1. మార్వారీ :** మార్వార్ (జోధ్‌పూర్, నాగౌర్, బికనీర్) ప్రాంతపు భాష

**2. మేవారీ :** మేవార్ (ఉదయపూర్, చిత్తూరు, కోట బుందీ) ప్రాంతపు భాష

**3. షెకావతి :** షేకావతి (సీకర్, చురు, ఝుంఝును) ప్రాంతపు భాష

**ఇతర భాషలు :**

1. హర్యానవీ : హర్యానాకు చెందిన మాండలికం
2. ఖిలి (ఖిల్లు తెగవారు)
3. గోండి (గోండు తెగవారు)
4. కొడవ, కర్ణాటకలోని కొడగు జిల్లాలో మాట్లాడతారు.
5. కచ్చి – గుజరాత్‌లోని కచ్ ప్రాంతంలో మాట్లాడతారు.
6. తుళు – కర్ణాటక, కేరళలోని తుళు ప్రజలు మాట్లాడతారు.
7. సంకేత : కర్ణాటక, కేరళ, తమిలనాడులలోని సంకేతి ప్రజల మాట్లాడతారు.

### 2.2.3. భాషా విధానాలు – త్రిభాషా సూత్రం

ప్రపంచంలోని బహు భాషలు మాట్లాడే దేశాలలో భారతదేశం ప్రధానమైనదని మళ్లీ మళ్లీ చెప్పవలసిన పని లేదు. "భిన్నత్వంలో ఏకత్వం" మన సంస్కృతి. భాషా విషయంలో కూడ అదే వైవిధ్యం కన్పిస్తుంది. భారతీయ భాషల్లో అంతర్వాహినిగా కన్పించే భావైక్యతతో పాటు భాషాసామ్యం కూడ కనబడుతుంది.

ఈనాడు సాంకేతిక విజ్ఞాన రంగాల అభివృద్ధి వల్ల వివిధ ప్రాంతాల మధ్య, సాంఘిక, ఆర్థిక, వాణిజ్య సంబంధాలు పెరిగాయి. కాబట్టి నేటి మానవుడు మాతృభాషతో పాటు ఎన్నో ఇతర భాషలను కూడ నేర్చుకోవలసిన అవసరం ఉంది. అయితే భారతదేశం వంటి బహుభాషా దేశాలలో ఏఏ భాషలు నేర్చుకోవాలనేది, ఏది జాతీయ భాషగా ఉండాలనేది ఒక సమస్యగా రూపొందింది. ఈ సమస్యకు పరిష్కారమే 'త్రిభాషా సూత్రం'!

**భారతదేశంలో భాషా సమస్య :**

భారతదేశంలో 200లకు పైగా భాషలున్నాయి. మన రాజ్యాంగంలో 24 భాషలను అధికార భాషలుగా గుర్తించారు. స్వాతంత్ర్యం తర్వాత రాష్ట్ర పునర్వ్యస్థీకరణ, భాషా ప్రాతిపదికగా జరిగింది. ప్రతి రాష్ట్రంలో అత్యధిక సంఖ్యాకులు మాట్లాడే భాషను ప్రాంతీయభాషగా, వివిధ ప్రాంతాల మధ్య అనుసంధాన భాషగా హిందీని, అంతర్జాతీయ కార్యకలాపాలకు అనువైన అంతర్జాతీయ భాషగా ఆంగ్లాన్ని గుర్తించడం జరిగింది.

అయితే కొన్ని రాష్ట్రాలలో ఒకటి కంటే ఎక్కువ భాషలు కూడ మాట్లాడతారు. ఆంధ్రప్రదేశ్ నైరుతి సరిహద్దులో కన్నడ – తెలుగు, దక్షిణ ప్రాంతంలో తమిళం – తెలుగు వాడుకలో ఉన్నాయి. పూర్వం నిజాం పరిపాలనలో ఉన్న హైదరాబాదు రాష్ట్రంలో తెలుగు, మరాఠీ, కన్నడ ప్రాంతాలు ఉండటం వల్ల, ఉర్దూ అధికార భాష కావడం వల్ల తెలంగాణా ప్రాంతంలో ఈ భాషలన్నీ వాడుకలో ఉన్నాయి. ఆంగ్లేయుల పరిపాలనలో ఇంగ్లీషు అధికార భాషగా, బోధన భాషగా ఉండటం వల్ల దేశ భాషల కంటే అధికంగా అభివృద్ధి చెందింది. దేశంలో ముఖ్యమైన వ్యవహారభాషగా గుర్తింపు పొందింది. మరో వైపు సంస్కృతం మన దేశ ప్రాచీన సంస్కృతికి ఆధారభూతమైంది. కాబట్టి దానిని కూడ అధికార భాషగా గుర్తించారు. ఈ విధంగా ప్రపంచంలో ఎక్కడా లేనంత బహుభాషాతత్వం మన దేశంలో ఏర్పడింది. దేశానికంతా ఏది అధికార భాషగా, జాతీయ భాషగా, బోధన

భాషగా ఉండాలనే అంశం జటిలమైన భాషా సమస్యగా తలెత్తింది.

**స్వాతంత్ర్యానికి పూర్వం భాషా విధానం :**

భాషా సమస్య ఈనాటిది కాదు. బ్రిటీష్ పరిపాలనలో పాశ్చాత్య విద్యను ప్రవేశపెట్టినప్పుడే ఈ సమస్య మొదలైంది. బోధనా అధ్యయంగా ఆంగ్లం ఉండాలా, దేశ భాషలైన సంస్కృతం, అరబిక్ ఉండాలా అనే వివాదం దాదాపు రెండు దశాబ్దాల పాటు ఎంతో ఉధృతంగా చెలరేగింది. చివరకు మెకాలే ప్రతిపాదనల ద్వారా ఇంగ్లీషు అధికార భాషగా, బోధన భాషగా స్థిరపడి జాతీయ భాషా స్థానాన్ని ఆక్రమించింది.

ఇరవయ్యో శతాబ్దిలో రెండు, మూడు దశాబ్దాల వరకు అన్ని రాష్ట్రాలలో ఆంగ్లాన్ని ప్రథమ భాషగా, మాతృభాషను లేదా ప్రాంతీయ భాషను ద్వితీయ భాషగా బోధించేవారు. ఆనాడు ద్విభాషా సూత్రం అమలులో ఉండేది. కానీ ఆంగ్లానికే అధిక ప్రాధాన్యత ఉండేది.

స్వాతంత్ర్యోదమ కాలంలో ఆంగ్లం వివిధ ప్రాంతాల ప్రజల మధ్య, జాతీయోద్యమ నాయకులకు, ఆంగ్ల ప్రభుత్వానికి మధ్య అనుసంధాన భాషగా ఉపయోగపడింది. అయినా దేశం మొత్తంలో ఆంగ్లం తెలిసిన వారి సంఖ్య చాలా తక్కువ కావడం వల్ల, ఆంగ్లం విదేశీభాష అయినందువల్ల, ఏదైనా స్వదేశీ భాష జాతీయ భాషగా; అధికార భాషగా అభివృద్ధి చెందాలని నిర్ణయించారు. దేశంలో అత్యధిక సంఖ్యాకుల మాతృభాష హిందీ భాషే కాబట్టి అందుకు హిందీ భాషే తగినదని గుర్తించారు.

1937లో దేశంలోని చాలా రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. స్వతంత్ర భారతదేశంలో హిందీకి అధికార భాషా ప్రతిపత్తి ఉంటుందనే భావనతో పాఠశాలల్లో హిందీని తృతీయ భాషగా ప్రవేశపెట్టారు. మన రాష్ట్రంలో వారానికి హిందీకి మూడు పీరియడ్లు కేటాయించారు. ఈ విధంగా హిందీయేతర రాష్ట్రాలలో హిందీ భాష కాలు మోపింది.

**స్వాతంత్ర్యానంతరం భాషా విధానం :**

మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరవాత రాజ్యాంగంలో హిందీని అధికార భాషగా, జాతీయ భాషగా నిర్ణయించారు. దేశమంతటా హిందీని అధికారభాషగా వెంటనే అమలు చేయాలని, పాఠశాలల్లో హిందీని తప్పనిసరిగా నేర్పించాలన్న అభిప్రాయాలను హిందీయేతర ప్రాంతాల్లోని ప్రజలు వ్యతిరేకించారు. దేశ ప్రజలలో ఐక్యతాభావం కలిగించి స్వాతంత్ర్య సాధనకు దోహదం చేసిన భాష ఇంగ్లీషేనని, అంతర్జాతీయ ప్రతిపత్తి కలిగిన ఆ భాషనే అధికార భాషగా, బోధనా భాషగా కొనసాగించాలని అభిప్రాయపడ్డారు. 1965 నాటికి హిందీ అధికారభాష కావాలి అనే తీర్మానం ఒక్క ఓటుతో నెగ్గింది. దీనికి వ్యతిరేకంగా దక్షిణ రాష్ట్రాల నుంచి, ముఖ్యంగా తమిళనాడు నుంచి ప్రతిఘటన ఎక్కువై, హిందీ వ్యతిరేక ఉద్యమాలు తీవ్రస్థాయిలో చెలరేగాయి. హిందీ భాషావాదుల బలం ఎక్కువ ఉన్నప్పటికీ హిందీని ఇతర భాషా రాష్ట్రాలపై రుద్దడానికి కేంద్ర ప్రభుత్వం ఒప్పుకోలేదు.

**త్రిభాషా సూత్రం – ఆవిర్భావం :**

ఇలా ఏర్పడిన భాషా సమస్యను పరిష్కరించడానికి అందరికీ ఆమోదయోగ్యమైన ఒక రాజీ సూత్రాన్ని ప్రతిపాదించారు. అదే త్రిభాషా సూత్రం. కేంద్ర విద్యా విషయక సలహా సంఘం (CABE) ఈ సూత్రాన్ని రూపొందించింది.

త్రిభాషా సూత్రం ప్రకారం, అన్ని రాష్ట్రాల విద్యార్థులు తప్పనిసరిగా మూడు భాషలు నేర్చుకోవాలి. హిందీయేతర రాష్ట్రాల్లో నేర్చుకోవలసిన మూడు భాషలు :

1. మాతృభాష లేదా ప్రాంతీయ భాష
2. జాతీయ భాష – హిందీ
3. అంతర్జాతీయ భాష – ఇంగ్లీషు

ఈ విధంగా దేశంలోని అన్ని ప్రాంతాల వారు నేర్చుకోవలసిన భాషల సంఖ్య సిద్ధాంతపరంగా సమానం చేశారు. నాటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ హిందీయేతర రాష్ట్రాలలోని వారు తమంతట తాముగా కోరే వరకు ఇంగ్లీషు బదులుగా హిందీని అధికార భాషగా చేయబోమని అంతవరకు హిందీతో పాటు ఇంగ్లీషు కూడా సమాంతర అధికార భాషగా కొనసాగుతుందని హామీ ఇచ్చారు. ఇది మన తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ విశాల భావాలకు; దూరదృష్టికీ తార్కాణం! ఆయన గొప్ప రచయిత కూడా! "గ్లింప్లెసెస్ ఆఫ్ వరల్డ్ హిస్టరీ" "డిస్కవరీ ఆఫ్ ఇండియా", "లెటర్స్ ఆఫ్ ఎ ఫాదర్ టు హీజ్ డాటర్" ఆయన ప్రసిద్ధ రచనలు.

1964లో కొఠారి కమీషన్, ప్రతి విద్యార్థి ప్రాంతీయభాషతో పాటు, విధిగా హిందీ, ఇంగ్లీషు భాషలను అభ్యసించాలని ప్రతిపాదించింది. 1978లో ఎన్‌సిఇఆర్‌టి (NCERT) వారు రూపొందించిన 10+2+3 విద్యా ప్రణాళికలో కూడ త్రిభాషా సూత్రాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని నిర్ణయించారు. 1986 జాతీయ విద్యావిధానం (NPE 1986) సైతం త్రిభాషా సూత్రానికి ఆమోదం తెలిపింది.

**త్రిభాషా సూత్రం – జాతీయ సమైక్యత :**

సువిశాలమైన భారతదేశంలో ఎన్నో భాషలు ఉన్నాయి. జాతులు, మతాలు, ప్రాంతాలు ఎన్ని ఉన్నా భారతీయులకు తమలో తమకు సత్సంబంధాలు ఉండటం అవసరం. భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించవలసిన అవసరం ఉంది. జాతీయ పండుగలు, పర్వదినాలు, ఉత్సవాలు ఇవన్నీ దేశీయులందరినీ ఒకే బంధంతో ముడి వేస్తున్నాయి. ఈ సమైక్యతా భావనకు ముఖ్యమైన కారణం త్రిభాషా సూత్రం. ఏ రాష్ట్ర ప్రజలు ఆ రాష్ట్రంలో కూపస్థమాండూక్యాలుగా ఉంటే దేశం ఛిన్నాభిన్నమైపోతుంది. త్రిభాషాసూత్రం జాతీయ స్ఫూర్తిని, జాతీయ భావనను పెంపొందింపజేయడంలో ప్రముఖ పాత్ర వహిస్తుంది.

"ఎన్ని మతములున్న; ఎన్ని భాషలున్న
'భారతీయత' మన భాగ్యమన్న!
మరువబోకు మీ మధుర భావననెపుడు
భాస్కరార్యుమాట! ప్రగతి బాట!"

– కుందా

**త్రిభాషా సూత్రం – ప్రయోజనాలు :**

విద్యార్థి ఒకటే భాషను నేర్చుకోవడం కంటే రెండు భాషలను నేర్చుకోవడం మేలైనది. అంతకంటే శ్రేయస్కరం త్రిభాషా విధానం. డాక్టర్ విలియన్ అభిప్రాయం ప్రకారం బహు భాషాభ్యసనం విద్యార్థి బుద్ధిని వికసింపజేసి వాక్చాతుర్యాన్ని మెరుగుపరచి, జ్ఞానాన్ని అభివృద్ధి చేసి, సహృదయతను పెంపొందింపజేస్తుంది. పాల్మర్; జోడ్ అనే భాషావేత్తలు ఇతర భాషలను శైశవం నుంచే అభ్యసిస్తే పరిపూర్ణ ప్రయోజనం కలుగుతుందని అభిప్రాయపడ్డారు.

త్రిభాషా సూత్రం అమలు చేయడం వల్ల సమాజానికి, దేశానికి ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయి.

- దేశంలోని వివిధ రాష్ట్రాలతో, ప్రాంతాలతో సంబంధాలు పెరుగుతాయి.
- మన దేశమంతా ఒక్కటే; మనమంతా భారతీయులం అన్న స్పృహ ప్రతి పౌరునిలో కలుగుతుంది.
- దేశంలోని ఒక భాష నుంచి ఇంకొక భాషలోనికి అనువాద సాహిత్యం పెరిగి రాష్ట్రాల మధ్య సుహృద్భావ సంబంధాలు పెరుగుతాయి.
- ఆధునిక శాస్త్రీయ, సాంకేతిక రంగాలలో ప్రవేశానికి అనుకూల వాతావరణం ఏర్పడుతుంది.
- ప్రాంతీయ భాషలు అభివృద్ధి చెంది మాతృభాషలకు ప్రాముఖ్యత పెరుగుతుంది.
- ప్రజల్లో జాతీయతా భావం ప్రవర్ధమానమవుతుంది.

- దేశంలోని ఇతర భాషలు, అంతర్జాతీయ భాషల్లో ఉన్న మూల గ్రంథాలను పరిశీలించడానికి త్రిభాషాసూత్రం ఎంతో తోడ్పడుతుంది.

త్రిభాషా సూత్రం జాతీయ, అంతర్జాతీయ అవగాహన దృష్ట్యా ముందు తరాల వారికి మేలు చేస్తుంది. ఎన్ని ఎక్కువ భాషలు నేర్చుకొంటే అంత విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చు అన్న భావన ఒక భారతీయుడిలో కలగడం అవసరం. బహుళ భాషాభ్యసనం ప్రజ్ఞావికాసానికి ప్రముఖ సోపానం! త్రిభాషా సూత్రాన్ని భారతీయులందరూ త్రికరణశుద్ధితో అమలుపరిస్తే దేశానికి ఎంతో మేలు చేకూరుతుంది.

**ముఖ్యాంశాలు :**

- బహు భాషా దేశమైన భారతదేశంలో జాతీయభాషగా బోధనాభాషగా ఏ భాష ఉండాలనేది ఒక సమస్య అయింది.
- స్వాతంత్ర్యానికి పూర్వం – ఆంగ్లం – మాతృభాషలతో ద్విభాషాసూత్రం అమలులో ఉండేది.
- స్వాతంత్ర్యానంతరం హిందీని జాతీయభాషగా గుర్తించారు.
- హిందీ మాతృభాష కాని రాష్ట్రాల నించి వ్యతిరేకత చోటు చేసుకోవడం వల్ల దేశంలో భాషా భేదాలు ఏర్పడ్డాయి.
- ఈ సమస్యకు పరిష్కారంగా త్రిభాషా సూత్రం రూపొందింది.

## మాతృభాష – ఇతర భాషలు – ప్రథమ, ద్వితీయ, తృతీయ భాషలు :

**మాతృభాష (ప్రథమభాష) :**

భారతదేశంలో భాషకు ప్రత్యేక స్థానం ఉంది. భాషల ఆధారంగానే రాష్ట్రాలు ఏర్పడ్డాయి. ఆయా మాతృభాషా వ్యవహర్తలు అత్యధికంగా ఉన్న భాషల పేరు మీదగానే భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఆవిర్భవించాయి. సహజంగానే ఆ రాష్ట్రాల ప్రజల మాతృభాష ప్రథమభాషగా గుర్తింపు పొందుతుంది. ఉదాహరణకు తెలంగాణలో తెలుగు, తమిళనాడులో తమిళం, కర్ణాటకలో కన్నడం ప్రాంతీయభాషలే కాదు ఆ రాష్ట్రాల ప్రజల మాతృభాషలు కూడా! ఏ రాష్ట్రంలోనైనా మాతృభాషను ప్రథమభాషగా గుర్తిస్తారు. అక్షరాభ్యసం నుంచే మన పిల్లలకు మాతృభాషలోనే విద్యాబోధనకు శ్రీకారం చుడతారు. బోధనా మాధ్యమంగా కూడ మాతృభాషే ఉంటుంది. తెలుగు రాష్ట్రాలు రెండింటిలోనూ ప్రథమ భాష లేదా మాతృభాష అయిన తెలుగులోనే విద్యాభ్యాసం ప్రారంభమవుతుంది.

మనిషి జీవితంలో మాతృమూర్తికి ఎంత ప్రాధాన్యం ఉందో మాతృభాషకు అంతే ప్రాధాన్యం ఉంది. మాతృభాషలోనే మనిషికి సంపూర్ణ వికాసం కలుగుతుంది. మౌలిక జ్ఞానం దొరుకుతుంది. అందుకే తన 'కొత్త భాస్కర శతకం'లోని ఒక పద్యంలో కుందా భాస్కరరావు ఇలా అన్నారు.

"ఎంత చదువు చదివి ఎన్ని సాధించినా
మాతృమూర్తినెపుడు మరువరాదు!
అమ్మ లేని జన్మ చిమ్మచీకటి కదా!
భాస్కరార్యుమాట! ప్రగతి బాట!"

"మానవుడు శైశవాస్థ నుంచి తన హావభావాలను, హాస క్రోధానురాగాలను; ఆలోచనలు, ఆచరణలను ఏ భాషాముఖంగా వ్యక్తం చేస్తున్నాడో ఆ భాషే అతని మాతృభాషగా చెప్పవచ్చుని" గొడవర్తి సూర్యనారాయణ మాతృభాషను నిర్వచించాడు.

"శిశువు తన సౌందర్య దృష్టిని, ఆనందానుభూతిని వ్యక్తం చేయడానికి ఉపయోపగడేది మాతృభాష"

అని గాంధీజి భాషించారు.

"శైశవం మొదలుకొని జీవితాన్ని తీర్చిదిద్ది, ఆత్మవికాసాన్ని కలిగించి, జాతి అభివృద్ధికి, దేశాభ్యుదయానికి, లోకోద్ధరణకు కూడా సమర్థునిగా చేసే శక్తి మాతృభాషకు ఉంది" – రైబర్న్

"శిశువు తన జాగ్రదావస్థలో ఏ భాషలో ఆలోచిస్తాడో, నిద్రావస్థలో ఏ భాషలో కల గంటాడో అదే అతని మాతృభాషగా భావించడం సమంజసం" – బల్లార్డ్

జ్ఞానార్జనకు మాతృభాష ఉత్తమమైన మాధ్యమమని విద్యావేత్తలు "పరభాష ద్వారా నేర్చే విద్య సోపానాలు లేని సౌధం" వంటిదని విశ్వకవి రవీంద్రులు అన్న మాటలు మాతృభాష ఔన్నత్యాన్ని ఆవిష్కరిస్తాయి.

మన మాతృభాష తెలుగు. తెలుగులోనే అన్ని శాస్త్రాలు సులభంగా అర్థమవుతాయి. ప్రత్యేకంగా శిక్షణ అభ్యాసం లేకపోయినా భాషా సామర్థ్యాలు అలవడేది మాతృభాషలోనే! మాతృభాషలోని వ్యక్తీకరణలు, వాద ప్రతివాదనలు పదునుగా ఉంటాయి. ఇతర భాషలలో కన్నా మాతృభాషలలో అధ్యయనం చేయడం సులభంగా ఉంటుంది. మాతృభాషలో అభ్యసించిన విషయాలు చిరకాలం గుర్తుంటాయి. మాతృభాషలో ఎవరైతే అభినివేశం కలిగి ఉంటారో వారికే అన్య భాషలు నేర్చుకునే నైపుణ్యం ఎక్కువగా అలవడుతుంది. మాతృభాష పైన ఎంత పట్టు వుంటే, అది అంత ఉద్వేగ వికాసానికి; తద్వారా వ్యక్తిత్వ వికాసానికి దారి తీస్తుంది. కాబట్టి మాతృభాషను ప్రథమభాషగా స్వీకరించి అధ్యయనం చేయడం మన భవిష్యత్తును మనం నిర్మించుకోవడం లాంటిది. జీవిత సౌధానికి పునాది వంటిది.

**ద్వితీయ, తృతీయ భాషలు :**

విద్యార్థి వివిధ విద్యాదశలలో సమగ్రమైన విద్య గడించడానికి కేవలం ఒక భాష చాలదు. రెండు మూడు భాషలను నేర్వాల్సిన అవసరముంది. ఈ రెండు మూడు ఏవి? అనే ప్రశ్నకు సమాధానంగా కేంద్రప్రభుత్వం అంతర్జాతీయ అవగాహనను, జాతీయ సమైక్యతను దృష్టిలో ఉంచుకొని త్రిభాషా సూత్ర రూపంలో ఒక భాషా విధానాన్ని రూపొందించింది.

దీనిలో మొదటిది ప్రాంతీయ భాష (మాతృభాష – ప్రథమ భాష), రెండవది జాతీయ భాష హిందీ (ద్వితీయభాష), మూడవది ఆధునిక భాష లేదా అంతర్జాతీయ భాష ఆంగ్లం (తృతీయ భాష). ఈ మూడు భాషలతో కూడినదే త్రిభాషా సూత్రం. జాతిపిత మహాత్మాగాంధీ సూచించిన ప్రాతిపదిక విద్యావిధానంలో కూడ మాతృభాషకు ప్రథమ స్థానం, హిందీకి ద్వితీయ స్థానం ఇచ్చారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు తర్వాత 1956లో కేంద్ర ప్రభుత్వ విద్యా సలహా సంఘం (CABE) త్రిభాషా సూత్రాన్ని ప్రతిపాదించింది. 1961లో రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో త్రిభాషా సూత్రాన్ని అన్ని రాష్ట్రాలు అమలు చేయాలని అంగీకరించడం జరిగింది. 1964–66 సంవత్సరాలలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొఠారి విద్యా కమీషన్ కూడ త్రిభాషా సూత్రాన్ని గట్టిగా అమలు చేయాలని సూచించింది.

ఏ రాష్ట్రానికి చెందిన వారైనా విధిగా మూడు భాషలు నేర్చుకోవాలన్నప్పుడు హిందీ ప్రాంత రాష్ట్రాలు మాతృభాషగా హిందీని (జాతీయ భాష కూడ హిందీ కాబట్టి) మరొకటి ఇంగ్లీషు నేర్చుకుంటే రెండు భాషలు మాత్రమే నేర్చుకున్నట్లు ఉంటుంది. అయితే హిందీని మాతృభాషగా (ప్రథమభాష)గా అభ్యసించేవారు. విధిగా ఒక దక్షిణాది భాషను అభ్యసించాలని నిర్దేశించడం జరిగింది. దక్షిణాది రాష్ట్రాల వారు మాతృభాష, జాతీయ భాష ఇంగ్లీషు మొత్తం మూడు భాషలు నేర్చుకోవలసి వస్తుంది. ఈ అసమానతలు తొలగించడానికి అన్ని ప్రాంతాల వారు విధిగా మూడు భాషలు నేర్చుకోవాలనే దృక్పథంతో రూపొందించిందే త్రిభాషా సూత్రం.

ఈ త్రిభాషా విధానం ప్రకారం ప్రథమ భాషగా మాతృభాష, ద్వితీయ భాషగా జాతీయ భాష హిందీ, తృతీయ భాషగా ఆంగ్లం అభ్యసించాలి. హిందీ మాతృభాషగా కలవారు ఒక దేశీయ (దక్షిణాది) భాషలలో తమకు

నచ్చిన దానిని ఒకటి నేర్చుకోవాలి.

ఈ త్రిభాషాసూత్రాన్ని అన్ని రాష్ట్రాల వారు సంపూర్ణంగా అమలు చేయలేదు. ఈ దృష్ట్యా అమలు చేయడానికి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. త్రిభాషా సూత్రం అమలు విద్యార్థులకు బహుళ ప్రయోజనాలను కలిగిస్తుంది. అంతేకాదు వారిలో జాతీయ సమైక్యతను, అంతర్జాతీయ అవగాహనను పెంపొందిస్తుంది.

**భాష సాహిత్యం :**

తెలుగు జాతి వైభవం, విశిష్టత వారసత్వాలను తెలుసుకోవడానికి తెలుగు భాషా సాహిత్యాల అధ్యయనం తెలుగు భాషోపాధ్యాయులకు ఎంతో అవసరం.

తెలుగు ద్రావిడ భాషా కుటుంబానికి చెందింది. తెలుగు భాషకు ఆంధ్రము, తెనుగు, తెలుగు అనే మూడు పేర్లు వ్యవహారంలో ఉన్నాయి. ఆంధ్ర అనే పదం మొదట జాతి పరంగాను, తరువాత దేశ పరంగాను, ఆ తరువాత భాషాపరంగాను ప్రాచీనకాలం నుంచి ప్రయోగాల్లో కనిపిస్తోంది. తెనుగు, తెలుగు పదాలు రూపాంతరాలే కాని భిన్న ధాతుజాలు కావు. తెనుగు, తెలుగు పదాలు రెండూ ప్రాచీన కాలం నుంచీ తెలుగు ప్రాంతాలలో వ్యవహారంలో ఉన్నాయని చెప్పవచ్చు.

"హితేన సహితమ్ సాహిత్యం" అంటే సమాజానికి హితాన్ని చేకూర్చేది సాహిత్యం అని అర్థం. ఏది హితం? ఎవరికి హితం? అనే ప్రశ్నలకు సమాధానం కాలాన్ని బట్టి; సమాజాన్ని బట్టి, సంస్కృతిని బట్టి, దేశాన్ని బట్టి మారుతూ ఉంటాయి.

"విశ్వ శ్రేయః కావ్యమ్' అనే నిర్వచనం ఉంది. అంటే విశ్వ శ్రేయస్సును కూర్చే రచనలను సాహిత్యం అంటారు. సాహిత్యం అన్నప్పుడు అది మౌఖిక సాహిత్యం కావచ్చు, లిఖిత సాహిత్యం కావచ్చు.

తెలుగు భాషకు సుసంపన్నమైన సాహిత్యం ఉంది. వివిధ దశలలో సాగిన తెలుగు సాహిత్య చరిత్రను పలువురు విమర్శకులు అనేక విధాలుగా యుగ విభజన చేశారు. కొన్ని విశిష్టమైన, సమాన ధర్మాలు గల కాలాన్ని 'యుగం' అని అంటారు. అంటే ఒక కాలంలోని సాహిత్యంలో సమానమైన లేదా విలక్షణమైన అంశాలున్నప్పుడు గొప్ప ప్రభావం చూపిన కవులున్నప్పుడు ఆ కాలాన్ని ఒక యుగంగా పరిగణిస్తారు. కొందరు మహాకవులను బట్టి; కొందరు ప్రక్రియా భేదాలను బట్టి, కొందరు వాఙ్మయ లక్షణాలను బట్టి, కొందరు పోషించిన రాజులను బట్టి రకరకాలుగా వర్గీకరణ చేశారు. ఈ వర్గీకరణను గురించి మీరు తరువాత అధ్యాయంలో విశదంగా తెలుసుకుంటారు.

సాహిత్యాభివృద్ధిని పోషించిన వారిని దృష్టిలో ఉంచుకొని ఆరుద్ర "సమగ్రాంధ్ర సాహిత్యం"లో యుగ విభజన చేశారు.

1. చాళుక్యయుగం 2. కాకతీయ యుగం 3. పద్మనాయక యుగం 4. రెడ్డిరాజుల యుగం 5. తొలిరాయల యుగం 6. మలిరాయల యుగం 7. నవాబుల యుగం 8. నాయక రాజుల యుగం 9. కడపటిరాజుల యుగం 10. కుంపిణీయుగం 11. జమీందారీ యుగం 12. ఆధునిక యుగం

ఆచార్య పింగళి లక్ష్మీకాంతం మహాకవులకు ప్రాధాన్యత ఇచ్చి యుగ విభజన చేశారు. ఎక్కువ మంది దీనినే పాటిస్తున్నారు. ఎక్కువ మంది దీన్నే పాటిస్తున్నారు.

1. ప్రాఙ్నన్నయ యుగం - క్రీ.పూ. 200 నుంచి క్రీ.శ. 1000 వరకు
2. నన్నయ యుగం - 11వ శతాబ్ది
3. శివకవి యుగం - 12వ శతాబ్ది
4. తిక్కన యుగం - 13వ శతాబ్ది
5. ఎఱ్ఱన యుగం - 1300-1350

6. శ్రీనాథ్ యుగం - 1350–1500

7. రాయల యుగం లేదా ప్రబంధ యుగం : 1500–1600

8. దక్షిణాంధ్ర యుగం లేదా నాయక రాజుల యుగం : 1600–1775

9. క్షీణ యుగం - 1775–1875

10. ఆధునిక యుగం - 1875 నుంచి నేటి వరకు

ఇటీవల కొందరు ఆధునిక యుగం ముగిసి, అత్యాధునిక యుగం అవతరించిందని కూడ అంటున్నారు.

తెలుగు సాహిత్యంలో మహాభారతాన్ని చక్కటి తెలుగులో అనువదించి మన తెలుగు జాతికి అందించిన ముప్పురు కవులు ఆదికవి నన్నయ్య, కవిబ్రహ్మ తిక్కన, ప్రబంధ పరమేశ్వరుడు ఎఱ్ఱన 'కవిత్రయం'గా చరిత్రలో నిలిచిపోయారు. అయితే ఏ విషయాన్నయినా ఒక కొత్త కోణంలో చేసే శ్రీశ్రీ దృష్టిలో మాత్రం కవిత్రయం అంటే ప్రాచీనకాలంలో తిక్కన; మధ్యయుగంలో వేమన; ఆధునిక కాలంలో గురజాడ; తెలుగు సాహిత్యాన్ని సరికొత్త మలుపులు తిప్పిన అసలైన మహాకవులుగా వీరిని ఆయన అభివర్ణిస్తారు. పద్య ప్రక్రియలో శ్రీనాథుడు, అల్లసాని పెద్దన, బమ్మెర పోతన, నంది తిమ్మన, పాల్కురికి సోమన, ధూర్జటి, తెనాలి రామకృష్ణుడు, భట్టుమూర్తి, చేమకూర, కవయిత్రి మొల్ల, ముద్దు పళని, గుఱ్ఱం జాషువా; గేయ ప్రక్రియలో గురజాడ, శ్రీశ్రీ, దేవులపల్లి కృష్ణశాస్త్రి, రాయప్రోలు, సి.నారాయణరెడ్డి, దాశరథి, ఆరుద్ర, తిలక్, చెరబండరాజు, గద్దర్, కాళోజీ; వంగపండు, గోరేటి వెంకన్న, గద్య ప్రక్రియలో చలం, కొడవటిగంటి రావిశాస్త్రి, గోపీచంద్, బుచ్చిబాబు, కాళీపట్నం రామారావు, రంగనాయకమ్మ, ముళ్లపూడి వెంకటరమణ, నండూరి రామమోహనరావు, గణేశ్‌పాత్రో, ప్రపంచ సాహిత్య సుందరికీ అందించిన కానుకలు మరువలేనివి. పాలగుమ్మి పద్మరాజు 'గాలివాన' కథ ప్రపంచ కథల పోటీలో బహుమతి పొంది కీర్తి పతాకం ఎగరేసింది.

విశ్వనాథ సత్యనారాయణ (శ్రీమన్నారాయణ మహా కల్పవృక్షం), సి.నారాయణరెడ్డి (విశ్వంభర), రావూరి భరద్వాజ (పాకుడురాళ్లు), జ్ఞానపీఠం పురస్కారాలు పొందాయి. గురజాడ 'కన్యాశుల్కం' నాటకం ఎప్పటికీ మరుపురాని మధుపర్కం. నన్నయ శ్రీకారం చుట్టిన తెలుగు కవిత్వానికి మరో 'శ్రీ' కారం చేర్చి వెయ్యేళ్ల సాహిత్యాన్ని కొత్తదారి పట్టించి అత్యాధునికయుగానికి వాకిళ్లు తెరిచాడు మహాకవి శ్రీశ్రీ.

**భాష – సంస్కృతి**

"భాషా పదకోశం చూడు – అటుపై దేశం చూడు" అని ఒక సామెత. ఏకాలంలోనయినా ఒక భాష మాట్లాడే ప్రజల సంస్కృతి వాళ్ల పదజాలంలోనే ఇమిడి ఉంటుంది. తెలుగు దేశ్య పదాల్లోనే తొలినాళ్లు సంస్కృతి స్వరూపం తెలుస్తుంది. ఇతర సంస్కృతులతో ఏర్పడ్డ సంపర్కం అన్యదేశ్యాలలో ప్రతిబింబిస్తుంది. మొదట అన్య భాషలైన సంస్కృత ప్రాకృత పదాలు, తర్వాత పర్షియన్, అరబిక్ భాషా పదాలు ఆపైన క్రమంగా పోర్చుగీసు, ఫ్రెంచి, డచ్, ఇంగ్లీషు భాషా పదాలు వేరువేరు కాలాల్లో ఆయా సంస్కృతుల సాహచర్యం వల్ల తెలుగులో చేరాయి.

ఇటికె, రోజు, కాయితం, బాతు, రొట్టె, కుర్చీ అనే మాటలు అచ్చ తెలుగువి అనిపిస్తున్నా అవి దేశ్యాలు కాదు; క్రమంగా ప్రాకృతం పర్షియన్, ఉర్దూ, పోర్చుగీస్, హిందీ భాషల నించి ఎరువు తెచ్చుకొన్నవి. కొన్ని వేల మాటలు ఈ రకంగా దేశ్య పద విభాగంలో కలిసిపోయాయి.

అన్య భాషా వ్యవహారంలో ప్రభావితం కాని కాలంలో ఉన్న అచ్చ తెలుగు మాటల్లో మూడు వేల ఏళ్ల నాటి తెలుగు సంస్కృతి స్వరూపం మనకు గోచరిస్తుంది. అప్పటి మాటల అర్థాలు తులనాత్మక దృష్టితో నిరూపించుకోవాలి. బరో, ఎమెనో అనే ఇద్దరు పండితులు 1961లో ద్రావిడ భాషల వ్యుత్పత్తి నిఘంటువు ప్రచురించారు. ఆనాటి శాసనాల్లోని 'దుగరాజు' ఈనాటి 'యువరాజు'.

సంస్కృతి మారినపుడు, దేశ్యపదాల అర్థాలు కూడ మారతాయి. 'నెయ్యి' అంటే అసలు అర్థం 'నూనె' అని. ఇప్పుడు తెలుగులో 'ఘృతం' అనే అర్థంలో రూఢమయింది. ప్రాథమికార్థం అన్ని భాషలలోనూ కన్పిస్తుంది. తర్వాత వచ్చిన అర్థం కొన్నింటిలో ఉంది. మౌలిక భావాలు చిన్న చిన్న మాటలలో నిలచి ఉంటాయి. విశేషార్థాలకు సమాసాలేర్పడవచ్చు. ఒక జాతి ప్రాక్తన సంస్కృతి ప్రాథమిక పదాల్లోనే కనిపిస్తుంది. తెలుగు పూర్వ సంస్కృతిని అలాంటి శబ్దాలతో పునర్నిర్మించి ఇంకా ఈ భావాలు మనలో అర్థవంతంగా ఉన్నాయో లేదో పరిశీలించుకోవచ్చు.

సంస్కృతంతో సంబంధం ఏర్పడక ముందున్న తెలుగు సంస్కృతి స్థూల స్వరూపం క్రీ.పూ. 5వ శతాబ్దినుంచి క్రీ.శ. 5వ శతాబ్ది దాకా సంస్కృత ప్రాకృత భాషల సంపర్కం వల్ల ఆర్య సంస్కృతి తెలుగు నేలను ముంచెత్తింది. శాసనాధారాలను బట్టి కుందూరి ఈశ్వర దత్తు ఆనాటి నుంచి తెలుగుదేశంలో సాంఘిక రాజకీయ చరిత్రలో వచ్చిన మార్పులను విశ్లేషించి చూపారు. శాతవాహనుల కాలంలో పరిపాలనా విభాగాలకున్న పేర్లు, హార, ఆహార, రట్టు, పథ, మర్గాల, రాష్ట్ర, విషయ, రాజ్య, సీమ, భోగ అనేవి – అన్నీ సంస్కృత ప్రాకృత జన్యాలే. నాడు, పడి అనే దేశ్య శబ్దాలు తరువాతి శాసనాల్లో కనిపిస్తాయి. మన రాష్ట్రాన్ని 'ఆంధ్రప్రదేశ్' అనడం కన్నా 'తెలుగునాడు' అనడంలోనే వెలుగుదనం వుంది. ఎందుకంటే 'ఆంధ్రప్రదేశ్' పదంలో ఆర్య భాషా వాసన ఉంది. ఇది మన ప్రభుత్వం ఆలోచించవలసిన విషయం.

రాజ పురుషుల పేర్లు, గుళ్లకు, వ్యక్తులకు చేసిన దానాలు (ధర్మాదాయ దేవదాయ) విధానాన్ని సూచించే మాటలన్నీ దేశ్యాలు కాదు. కొన్ని రకాల పన్నులకు సూచించే మాటలన్నీ దేశ్యాలు కాదు. కొన్ని రకాల పన్నులకు దేశ్య శబ్దాలు తరవాత కల్పించుకొన్నారు. ఉదా:– పెండ్లితెఱ, అమ్ము, బడి సుంకం, బహమనీరాజులు, గోల్కొండ సుల్తానుల కాలంలో భూమి శిస్తువు, పరిపాలనకు మతానికి సంబంధించిన మాటలు ఎన్నో పర్షియన్, అరబిక్ భాషల నుంచి వచ్చి చేరాయి. ఆ తర్వాత వచ్చిన పాశ్చాత్య భాషా ప్రభావం ప్రపంచమంతటా ఒక ప్రభంజనం. అయితే పర భాషా సాంస్కృతిక సమ్మేళనం వల్ల తెలుగు భాష ఎంతో సుసంపన్నమైందని అందరూ గుర్తించాలి. ప్రతిభాషలోనూ ఇది సహజ సాంస్కృతిక పరిణామం.

క్రీ.పూ. వేయి సంవత్సరాల కిందటే తెలుగు సంస్కృతి ఒక వెలుగు వెలిగిందని ఆనాటి పదజాలం వల్ల మనం సులువుగా గ్రహించవచ్చు.

**భాష ఒక సబ్జక్టు – ఒక మాధ్యమం అక్షరాస్యత :**

ఒక సబ్జక్టుగా భాషలోని ముఖ్యమైన అంశాలు రెండు 1.భావప్రకటన 2.భావ గ్రహణం

పిల్లల అవసరాలతో మొదలైన తర్వాత సమాచారం, వివరణలుగా మార్పు చెంది ఎదిగే కొద్దీ ఆలోచనలు, విశ్లేషణలుగా మనకు తెలిసిన ప్రపంచాన్ని అర్థం చేసుకున్న జ్ఞానాన్ని తెలియజెప్పే విధానాలను భావ ప్రకటన అంటాం. ఇది ఒక సహజ ప్రక్రియ. చుట్టూ ఉన్న భౌతిక, సామాజిక కుటుంబ పరిస్థితుల మాధ్యమంగా ఈ భావ ప్రకటన పుట్టుకొస్తుంది.

**మాతృభాష – భావ ప్రకటన :**

సహజ వాతావరణం కల్పించిన భావ ప్రకటన ఖచ్చితంగా ఆ వాతావరణంలో వాడబడే భాషలో ఉంటుంది. దాన్నే మాతృభాష అంటాం. అంతే తప్ప అమ్మ భాషో, నాన్న భాషో కాదు. ఉదాహరణకు నేను తెలుగు, మా ఆవిడ బెంగాలీ అయినా నా కొడుకు ప్రణయ్ మాతృభాష మాత్రం హిందీ అన్నమాట. భవిష్యత్తులో ఉత్తరప్రదేశ్‌లో వుంటూ బెంగాలీ, తెలుగు, ఆంగ్లాలు నేర్చుకున్నాన మాతృభాష మాత్రం హిందీగానే ఉంటుంది.

**మాధ్యమంగా భాష :**

మాతృభాషలో విషయాన్ని వ్యక్తం చేయడం, బోధించడం, అభ్యసించడం సులభం. బోధన మాధ్యమం బోధన వాహిక అనేవి 'Medium of instruction' అనే ఆంగ్ల పదానికి సమానార్థకాలు. భావ వ్యక్తీకరణకు భావ

గ్రహణకు భాషే మాధ్యమంగా పని చేస్తుంది. తొలి భావనలకు రూపమిచ్చిన భాషే మాధ్యమంగా పని చేస్తుంది. తొలి భావనలకు రూపమిచ్చిన మాతృభాష బాహ్య ప్రపంచావగాహనకు తొలి మాధ్యమం. మానవుడి మూర్తిమత్వాభివృద్ధిలో మాతృభాషదే ప్రధానపాత్ర. ఎవరైనా మాతృభాష ద్వారానే అనేక విషయాలను సులభంగా నేర్చుకుంటారన్నది జగమెరిగిన సత్యం. "తల్లి పాలు తాగి పెరిగిన వాడికి దాది పాలు తాగి పెరిగినవాడికి ఎంత తేడా ఉంటుందో మాతృభాషలో విషయం నేర్చుకున్న వాడికి, పరభాషలో నేర్చుకొన్న వాడికి అంత తేడా ఉంటుందని" కొమర్రాజు వేంకట లక్ష్మణరావు అభిప్రాయం. శిశువుకు తల్లి పాలే పౌష్టికాహారం. తల్లి వాత్సల్యం సహజమైంది. అదే విధంగా మాతృభాసలో చాలా సులువుగా, ఉత్సాహంగా, సహజంగా, ఆనందంగా విషయాలు నేర్చుకోవచ్చు. అందువల్ల బోధనామాధ్యమంగా మాతృభాషే అత్యుత్తమని పలువురి అభిప్రాయం.

మానవుల ఆలోచనకు భాష వాహిక, భాషా రూపంలోనే మానవులు తమ ఆలోచనలను ఎదుటి వారికి అందిస్తారు. ఆలోచనలతో పాటు భాష కూడ ఎదుగుతుంది. మానవులు తాము మొదట నేర్చిన భాషలోనే ఆలోచనలకు ఒక స్పష్టమైన రూపమీయగలుగుతారు. తర్వాత నేర్చిన ఇతర భాషల్లో అంత సులువుగా భావ ప్రకటన చేయలేరు. అందువల్ల మనో వైజ్ఞానికులు కూడ వ్యక్తుల జీవన విధానంలో మాతృభాషకు అత్యంత ప్రాధాన్యత ఉందని చెప్తారు.

మనకు స్వాతంత్ర్యం రాక పూర్వం 1835లో లార్డ్ మెకాలే మన విద్యాలయాల్లో ఆంగ్లాన్ని బోధన భాషగా ప్రవేశపెట్టారు. ఈ పరిణామాన్ని పలువురు ఆంగ్లో మేధావులు కూడ వ్యతిరేకించారు. దేశాల అభివృద్ధికి ఆయా దేశ భాషలే బోదన మాధ్యమంగా ఉండాలన్నారు. రష్యా, జర్మనీ దేశాలు వైజ్ఞానికంగా అభివృద్ధి చెందటానికి వారి మాతృభాషలు బోధన భాషలుగా ఉండటమే ప్రధాన కారణమని వారు పార్లమెంటులో వాదించినప్పటికీ వారి మాట చెల్లలేదు. సాంకేతిక పరిజ్ఞానంలో సాటి లేని మేటి దేశంగా ముందంజ వేసిన జపాన్‌లో బోధన భాష జపనీస్. 1906లో కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన "నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్"లో సభ్యులైన గురురాజ్ బెనర్జీ, రాస్ బిహారీ బోస్, రవీంద్రనాథ్ రాగూర్, బిపిన్ చంద్రపాల్, చిత్తరంజన్‌దాస్ మొదలైన వారు బోధన భాషలుగా భారతీయ భాషలకే ప్రాధాన్యమియాలని సిఫార్సు చేశారు.

వాస్తవానికి విద్యార్ధి మాతృభాషలో బోధన, అభ్యసనం వల్ల విద్యా సామర్థ్యాలు అభివృద్ధి చెందుతాయి. సృజనాత్మక శక్తి, జీవన నైపుణ్యాలు మెరుగవుతాయి. ప్రపంచంలోని అభివృద్ధి చెందని దేశాలు, అగ్రరాజ్యాలలోని ప్రజలు మాతృభాషా మాధ్యమంలోనే చదువుతున్నారు. ఆయా దేశాల ప్రగతికి ఇదే మూలకారణం. పరభాషా మాధ్యమం ద్వారా విద్యనభ్యసించడంలో విద్యార్థులు సహజ శక్తి సామర్థ్యాలు వెల్లడి కావు. మాతృభాషా బోధన వల్ల ఒక తరం మానవీయ సాంస్కృతిక మూలాలను మరచిపోకుండా కాపాడుకోగలుగుతుంది. కాబట్టి మాతృభూషా మాధ్యమంలో విద్య జాతికి దేశాభివృద్ధికి పునాది లాంటిది.

**అక్షరాస్యత :**

సాంప్రదాయికంగా భాష ఉపయోగించడానికి చదవడం, రాయడం, మరియు మాట్లాడడం వంటి నైపుణ్యాలను నేర్చుకోవడం, నవీన ధృక్పధంలో సమాచారం (Communication) కొరకు కావలసిన నాలుగు మూల వస్తువులైనటువంటి నైపుణ్యాలు చదవడం, వ్రాయడం, వినడం, మరియు మాట్లాడడం నేర్చుకునే విధానమే 'అక్షరాస్యత'.

యునెస్కో వారి నిర్వచనం : గుర్తించడం (Identity), అర్థం చేసుకోవడం (Understand), సృష్టించడం (Create), వార్తాలాపన (Communicate), లెక్కించడం (Compute) మరియు ముద్రించిన, వ్రాయబడిన అనేక విషయాలను గ్రహించే నైపుణ్యాలు కలిగి ఉండడం అక్షరాస్యత.

ఒక ఇంటిలో నూతన సభ్యుడుగా జన్మించిన శిశువు తన పరిసరాల్లో జరిగే ధ్వనిరూపమైన భావ

వినిమయాన్ని యాధృచ్ఛికంగానే గమనిస్తూ ఉంటాడు. భాష రాని మొదటి సంవత్సర కాలమంతా వివిధ ధ్వనులను, పదాలను, వాక్యాలను వింటూ తనకు తోచిన శబ్దాలతో తానూ భావ వినిమయం చేస్తాడు. మనస్తత్వశాస్త్ర పరిశోధనలననుసరించి 18 నెలల వయస్సు నుండి నాలుగు లేక ఐదేళ్ళ ప్రాయం వరకు కుటుంబ పరిసరాల్లోని పదాలన్నింటినీ అర్థం చేసుకొని వాటిని వినియోగించే ప్రయత్నం చేస్తాడు. ఇలా ధ్వని రూపంలో శిశువు నేర్చుకునే అక్షరాస్యత పాఠశాలలో చేరిన తర్వాత పఠన లేఖన రూపాల్లో సంపన్నమవుతుంది.

ప్రతి ధ్వనికి ఒక లిపి సంకేత రూపముంది. ఆ రూపం విద్యార్థికి అర్థం కాకపోతే రాయబడిన విషయమంతా అర్థరహితమైన రేఖలే. కాబట్టి లిపి సంకేతాలను పాఠశాల పరిచయం చేస్తుంది. విద్యార్థి ఆ లిపిని విసంకేతిస్తూ, ధ్వనికీ, లిపికి ఉన్న సంబంధాలను గుర్తిస్తూ స్థిరపరచుకుంటూ విషయ గ్రహణ చేస్తాడు. తానూ లిపి సంకేతాల వినియోగంతో భావ ప్రకటన చేస్తాడు. ఇలా సంకేత, విసంకేతాలు ముద్రితాంశాల భావ గ్రహణ, భావ ప్రకటనలకు దోహదం చేస్తాయి. ఇలాంటి సంకేత అక్షరాస్యతలు భాష, గణితం, కంప్యూటర్, భౌగోళికం వంటి అంశాలలో విస్తృతరూపాలను సంతరించుకున్నాయి. ఆయా అంశాలను ఈ ఉపశీర్షికలో పరిశీలిద్దాం.

ఒక అర్థాన్ని ప్రతిబింబించే చిహ్నాలకు సంకేతాలని పేరు. వాగ్ వ్యవహారం ఒక సంకేత వ్యవస్థ ధ్వని ప్రతిరూపాల అర్థాల కలయికతో సంకేతాలు ఏర్పడతాయి. సంకేత భాగాలు రెండూ (సంకేతం, విసంకేతం) మానసికాలు, భాషా సంకేతాలు. ప్రాథమికంగా మానసికాలైన అమూర్తాలు కావు. వాటికి లిపి రూపం ఉంది. వ్యక్తి అంతరంగంలోని భావజాలాన్ని అభివ్యక్తీకరించే సంకేతాల వ్యవస్థ భాష. కాబట్టి అది లేఖన వ్యవస్థతోను, బధిరుల అక్షరమాలతోనూ, ప్రతీకాత్మక కర్మలూ, నాగరిక నియమాలు, సైనిక సంకేతాలు మొదలైన వాటితో పోల్చదగ్గది. ఈ విధానానల్నింటిలో భాష ముఖ్యమైంది. ధ్వనిని గానీ, లిపిని గానీ ఒక వ్యక్తి మరొక వ్యక్తికి అందించడం సంకేత రూపంలో జరుగుతుంది. మరొక వ్యక్తి దానిని విసంకేతం చేసుకుంటూ గ్రహిస్తాడు.

అయితే కవేలం ధ్వని రూప గ్రహింపు మాత్రమే అక్షరాస్యత అంటారు. పాఠశాల స్థాయిలో దానిని అధిగమించి లిపి రూప భాషను విద్యార్థి సొంతం చేసుకోవలసి ఉంటుంది. లిపి రూప భాష పఠన, లేఖన నైపుణ్యాల ద్వారా విద్యార్థికి అందుతుంది. ఒకటో తరగతి నుండి పఠన లేఖనాల అభ్యాసం విద్యార్థికి ప్రారంభ మౌతుంది. పఠనం కానీ, లేఖనం కానీ అలవాటు కావాలంటే పుస్తకాలు విస్తారంగా అందుబాటులో ఉండాలి.

ఈ నైపుణ్యాలను బలవంతంగా అభ్యాసం చేయించడం కన్నా పిల్లలే సొంతంగా అభ్యసించేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి. అందుకోసం పుస్తకాలు సులభంగా, ఆసక్తికరంగా, ఆకర్షణీయంగా ఉండాలి. పిల్లలకు పరిచితమైన పదాలతో పుస్తకాలు రూపొందాలి. ఇలాపరిచిత అంశాలతో, చిత్రాలతో, రంగులతో రూపొందించిన పుస్తక సామాగ్రి శిశువును ఆకర్షిస్తుంది. దానిని తాను చేతిలోకి తీసుకోవాలనే కోరిక శిశువులో గలుగుతుంది. పుస్తకాన్ని అటూ ఇటూ తిప్పుతాడు. రంగు రంగుల చిత్రాలను ఏకాగ్రతతో పరిశీలిస్తాడు. ఉపాధ్యాయుడు ఆ పుస్తకాలను చదువుతుంటే తాను చదవాలనే కోరిక శిశువులో కలుగుతుంది. ఇలాంటి మానసిక వాతావరణం ఏర్పడిన తర్వాత తరగతిలో పఠన లేఖనాల అభ్యాసం చురుకుగా సాగుతుంది.

ఇలాంటి వాతావరణంలో పఠనం కొనసాగించే శిశును చదివేటప్పుడు ధ్వనులకు లిపి సంకేతాలకు మధ్య గల సంబంధాన్ని స్థిరంగా గుర్తిస్తాడు. వాక్యంలోని పదాల పైన ఉన్న అవగాహన వలన తరవాత పదాలను ఊహిస్తాడు. సందర్భాన్ని బట్టి పదాలకు అర్థాలను ఊహించి చెప్పగలుగుతాడు. పద్యాలలోను వచన రూపాల్లోను స్థూల భావాన్ని గ్రహించ గలుగుతాడు. తద్వారా పఠనంలో ఆనందాన్ని పొందుతాడు. పాఠశాల వ్యాసంగంలో భాషా బోధనలో కలగవలసిన ప్రధానమైన ప్రవర్తనా మార్పులలో ఇది ఒకటి.

ఈ విధమైన అభ్యాసం కొరకు ఉపాధ్యాయుడు ఆకర్షణీయమైన కథల పుస్తకాలు, గేయాల పుస్తకాలు, చిత్ర కథల పుస్తకాలు, చిత్రాలు కలిగిన అట్టముక్కలూ సేకరించుకోవాలి. కథను రెండు మూడుసార్లు తరగతి

గదిలో చదివి వినిపించాలి. ఇలా చదివేటప్పుడు కథాకథనంలో అనుసరించవలసిన ఆంగిక, వాచిక, మౌఖిక అభినయాలను పాటించాలి. గేయాలు చెప్పేటప్పుడు, శిశువులతో అభ్యాసం చేయించేటప్పుడు లయను అనుసరించాలి. ఆ తరువాత అక్షర పద్ధతి, పద పద్ధతి, చూచి చెప్పు పద్ధతి, వాక్య పద్ధతి, కథా పద్ధతులను అనుసరిస్తూ క్రమ పద్ధతిలో పఠన బోధన జరగాలి. అప్పుడు మాత్రమే శిశువు ఉత్సాహంగా పఠనాభ్యసనంలో పాల్గొనగలడు. ఉచ్చారణ దోషాలు లేని తగిన విరామ చిహ్నములతో ధారాళమైన ప్రకాశ పఠనాన్ని తక్కువ సమయంలో ఎక్కువ విషయాన్ని ఒక్క చూపుతో గ్రహించగలిగిన మౌనపఠనాన్ని విద్యార్థి అలవరచుకోగలడు.

లేఖన అభ్యాసానికై ఉపాధ్యాయుడు అభ్యాస పుస్తకాలను చిత్రాలు కలిగి వాటి కింద వాటి పేర్లను రాయటానికి వసతి గల అట్టముక్కలను జంట పంక్తుల రాత పుస్తకాలను వినియోగించాలి. తగిన అభ్యాసంతో గుండ్రని దస్తూరీని పదగుచ్చాలు, వాక్య గుచ్చాలు కలిగిన పేరాలను రాయటాన్ని విద్యార్థి అభ్యాసం చేస్తాడు. రచనలో వేగాన్ని, సౌష్ఠవాన్ని అనుసరిస్తాడు. డైరీరచన, కథా పూరణ, గేయ పూరణ వంటి అభ్యాసాల ద్వారా సొంతంగా అభిప్రాయ వ్యక్తీకరణ చేయగలిగిన స్థితిని పొందుతాడు. తరువాతి కాలంలో భాషా సహ పాఠ్య కార్యక్రమాలన్నింటిలో చురుకుగా పాల్గొనే మానసిక వైఖరులు విద్యార్థిలో పెంపొందుతాయి.

**అక్షరాస్యత – రకాలు :**

గత కాలంలో అక్షరాలను గుర్తించి చదువగలిగిన స్థితిని అక్షరాస్యతగా భావించేవారు. కానీ నేడు భాషను బహుళ విస్తృతితో అనేక రంగాలలో అనేక రీతులుగా వినియోగిస్తున్నారు. గణిత పరిభాష, శాస్త్ర పరిభాష, వినియోగం గతంలో మనకు పరిచితమైనదే. అదే విధంగా మాండలిక పరిభాష, భౌగోళిక అవరోధాలు, వలసలు, వృత్తులు మొదలగు వాని వల్ల పారిశ్రామికీకరణం వల్ల మాండలికాలు ఏర్పడతాయి. విద్యాసంస్కారం అందిన వాళ్లు, అందని వాళ్ల భాషలో వైవిధ్యం ఉంటుంది.

గత కాలంలో గ్రాంథిక, శిష్ట వ్యవహారిక, గ్రామ్య రూపాలుగా భాషను మనం పరిశీలించాం. మాండలిక స్వరూపాలనూ గమనించాం. ఈ బాషా రూపాలే కాక పత్రికా పరిభాష, వినియోగదారుల పరిభాష, కంప్యూటర్ పరిభాష ఇలా భాషా స్వరూపం విస్తృతమవుతోంది. సమర్థమైన, సమగ్రమైన జీవితం కొరకు శిశువు సంసిద్ధతను పొందాలంటే కేవలం ధ్వనిరూప, లిఖిత రూప అక్షరాస్యతతో పాటు కింది అక్షరాస్యతలను కూడ సంపాదించాల్సినన అవసరం ఉంది.

1. సంఖ్యాత్మక / అంకాత్మక అక్షరాస్యత (Numbering Literacy)
2. గణిత అక్షరాస్యత (Arthamatic Literacy)
3. కంప్యూటర్ అక్షరాస్యత (Computer Literacy)
4. ఆర్థిక అక్షరాస్యత (Economical Literacy)
5. భౌగోళిక అక్షరాస్యత (Geographical Literacy)
6. ప్రజాస్వామ్య అక్షరాస్యత (Democratic Literacy)

**1. అంకాత్మక అక్షరాస్యత / గణిత అక్షరాస్యత :**

సంఖ్యా సంకేతాలను గుర్తించుట, సాధారణ సంఖ్యా భావనలను, హేతువులను గ్రహించుట, ప్రాథమిక నైపుణ్యాలైన సంకలన, వ్యవకలన, గుణకార, భాగహారాలను సమర్థవంతంగా నిర్వహించుట ఈ అక్షరాస్యతలో చేరుతుంది. సాధారణ సంఖ్యాభావన, వ్యవహార భావన, కొలతలు, రేఖా గణిత సంకేతాలు, సంఖ్యావ్యతలు, సాంఖ్యకశాస్త్రం వరకు ఈ అక్షరాస్యత కొనసాగుతుంది.

**2. ఆర్థిక అక్షరాస్యత :**

ప్రపంచంలో ధనం వ్యవహరించే రీతిని గ్రహించే సామర్థ్యమే ఆర్థిక అక్షరాస్యతగా పిలవబడుతుంది.

తన దగ్గర డబ్బు నిలువలు, దానిని పెంచే రీతులు, వెచ్చించే రీతులు మొదలైనవి ఇందులో అంశాలు. ఆస్ట్రేలియా, కెనడా, జపాన్, అమెరికా, ఇంగ్లాండ్ వంటి దేశాలు వ్యక్తిగతంగా, దేశపరంగా ఆర్థికస్థితిని మెరుగుపరచే కార్యక్రమాలూ చేపట్టాయి. "ఆర్థిక విద్య" వికాస మార్గాలను పరిపుష్టం చేసే లక్ష్యం కలిగిన For Economic co-operation and Development (FECD) వంటి సంస్థలు అంతర్ ప్రభుత్వ ప్రాజెక్టులను 2003లోనే ప్రారంభించినవి.

**3. కంప్యూటర్ అక్షరాస్యత :**

కంప్యూటర్ నుపయోగించే సమర్థమైన సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలు, ప్రోగ్రాం రూపకల్పన అత్యాధునిక సమస్యా పరిష్కారం మొదలగునవన్నీ కంప్యూటర్ అక్షరాస్యతగా చెప్పవచ్చు. కంప్యూటర్ ఎలా పని చేస్తుంది? దానిని ఎలా పని చేయించాలి వంటి అంశాలన్నీ ఇందులోని అంతర్భాగాలు.

**4. భౌగోళిక అక్షరాస్యత :**

ఇదొక నూతన సిద్ధాంతం. భూమిపై జరిగే రకరకాల చర్యలను తెలుసుకోవడానికి నివసించే ప్రదేశాలను నిర్ణయించుకోవడానికి ఇది సహకరిస్తుంది. ప్రతిచర్యలు, అంతస్సంబంధాలు, అన్వయాలు అనే మూడు సామర్థ్యాల నిర్వహణ, ఈ అక్షరాస్యత వల్ల సాధ్యం.

**5. ప్రజాస్వామిక అక్షరాస్యత :**

శిశువులో ప్రజాస్వామిక జీవన రీతులను, విలువలను స్వీయ అవగాహనలను పెంపొందించి సమర్థవంతమైనన ప్రజాస్వామిక జీవనానికి సంసిద్ధులను చేస్తుంది. న్యాయం, గౌరవం, నమ్మకం వంటి విలువలను లక్షణాలుగా శిశువులో పెంపొందిస్తుంది.

ఇలా కేవలం భాష కోసమే పఠన లేఖనాలు అన్న స్థితిని దాటి అక్షరాస్యత ఒక విస్తృత రూపాన్ని సంతరించుకుంది. సమర్థమైన జీవన నిర్వహణ కొరకు అన్ని రకాలైన అక్షరాస్యతలు విద్యార్థికి పరిచయం కావలసి ఉంది.

**2.7. గ్రాంథిక భాష, వ్యవహారిక భాష, మాండలిక భాష ప్రాంతాల వారి మాండలికాలు, వర్గ, కులమాండలికాలు, ప్రామాణిక భాష, అధికారిక భాష, మాధ్యమ భాష, తెలుగు భాష పూర్వ వైభవ స్థితి.**

ప్రపంచంలో దాదాపు 2500లకు పైగా భాషలు ఉన్నాయి. ఆయా సమాజాల నాగరికత, సంస్కృతి చరిత్రలకు అనుగుణంగా ఈ భాషలు వివిధ స్థాయిలలో అభివృద్ధి చెంది ఉన్నాయి. ఇంకా లిపి కూడా లేని భాషలు ఎన్నో ఉంటే, కొన్ని భాషలు ఎంతో పురోగతి చెంది మౌఖిక, లిఖిత రూపాలలో విశేషంగా అభివృద్ధి చెంది, ఉన్నత స్థాయి సాహిత్యాన్ని, వాఙ్మయాన్ని కలిగి ఉన్నాయి.

ఏ భాష అయినా అది పుట్టిన నాటి నుంచి నేటి వరకూ ఒకే స్థితిలో స్థిరంగా లేదని చెప్పవచ్చు. భాష ఒకటే అయినా వివిధ ప్రాంతాలలో ఉచ్చారణ భేదాలు ఉంటాయి. ఒకే సమాజంలో వేరువేరు కాలాల్లో వేరు వేరు రూపాల్లో, వేరు వేరు స్థాయిల్లో భాష రూపొందవచ్చు. పల్లె ప్రాంతాల వారు మాట్లాడే భాషకు, పట్టణ వాసులు మాట్లాడే భాషకు తేడాలు ఉంటాయి. గ్రంథాలలో ఉపయోగించే భాష, ప్రజలు తమ నిత్యజీవితంలో మాట్లాడే భాషకు భిన్నంగా ఉండవచ్చు.

ఈ విధంగా ఒకే భాష వివిధ రూపాలలో కనిపిస్తుంది. ఉపాధ్యాయుడికి విద్యాబోధనలో తనకు ఉపకరించే వివిధ భాషా రూపాల గురించి స్పష్టమైన అవగాహన అవసరం.

**2.7.1. గ్రాంథిక భాష :**

భాష వాగ్రూపం లిఖిత రూపం అని ఇంతకు ముందే మనకు తెలుసు. లిఖితమై, గ్రంథస్థమైన భాషను 'గ్రాంథిక భాష' అంటారు. ప్రాచీక కావ్య రచనలన్నీ గ్రాంథికంలో ఉన్నాయి. ప్రాచీన సాహిత్యంలోని గ్రంథాలలో ఉపయోగించిన కొన్ని ప్రత్యేక నియమ నిబంధనల ఆధారంగా నిర్మించిన భాషను గ్రాంథికభాషగా చెప్పవచ్చు.

నన్నయ కాలం నుంచీ సుమారుగా 19వ శతాబ్ది వరకు తెలుగు భాషలో వెలువడిన ప్రబంధాలు, కావ్యాలు, నాటకాలు ఇతర రచనలు ఇవన్నీ గ్రాంధిక భాషలో రచించినవే. పూర్వకాలంలో పండితులు, కవులు మాత్రమే వాడిన ఈ బాషను పండిత భాష అని కూడా వ్యవహరిస్తారు. ప్రాచీన రచనలు ఇప్పటి వాళ్లు చదివి అర్థం చేసుకోవాలంటే చాలా కష్టపడాలి. కారణం ఆ సాహిత్య భాష నేటి విద్యావంతుల వాడుకకు దూరం కావడమే.

సంప్రదాయ సిద్ధమైన కొన్ని నియమనిబంధనలకు లోబడి రాసే భాషా రూపాన్ని 'గ్రాంథికభాష' అంటారు. భాషలో ఆధునికత్వం చోటు చేసుకోకముందు దాదాపు ఒక శతాబ్ధికి పూర్వం వరకు రచయితలందరూ తమ రచనల్లో ఈ భాషనే వాడారు. ఆ రోజుల్లో గ్రంధాలో విరివిగా వాడబడిన భాష కాబట్టి దీన్ని గ్రాంథిక భాష అన్నారు. అయితే ప్రస్తుత పరిణామక్రమంలో ఈ రకమైన భాష క్రమక్రమంగా కనుమరుగైపోతుంది. ఆధునికకాలంలో వ్యవహారిక భాషే గ్రంధాల్లో చోటు చేసుకొని మూడు పువ్వులు – ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. అందుకు ముఖ్యకారకుడు; ప్రాతఃస్మరణీయుడు గిడుగు రామ్మూర్తి పంతులు గారు. ఆ మహానుభావుని జయంతిని మనం మాతృభాషా దినోత్సవంగా జరుపుకుంటున్నాం. అయితే ఈనాటి విద్యార్థులకు ప్రాచీన భాషా స్వరూపం కూడా తెలియాలి. అందుకు గాను గ్రాంథిక భాషలో రాయబడిన పాఠ్యాంశాలను కూడా పాఠ్యపుస్తకాల్లో మచ్చుకు కొన్ని ప్రవేశపెడుతున్నాం. లేకుండే ప్రాచీన భాషా సంపదను పోగొట్టుకున్నవాళ్లం అవుతాం.


గిడుగు రామ్మూర్తి పంతులు

**గ్రాంథిక భాష లక్షణాలు :**

- గ్రంథస్థమై మార్పులకు లోను కాకుండా ఉండటం. (Regidity)
- సమగ్రమైన వ్యాకరణం ఉండటం
- పదాల వాక్యాల నిర్మాణం నిర్దిష్టమైన సూత్రాలకు కట్టుబడి ఉండి ఏ మాత్రం సడలింపుకు ఆస్కారం లేకపోవడం.
- సంస్కృత భాషా ప్రభావానికి లోనై దీర్ఘ సమాసాలు కలిగి ఉండటం.
- మాట్లాడే భాషతో పొంతన లేకపోవడం.
- పండితుల ఆదరణ కలిగి ఉండటం.
- సామాన్య ప్రజలకు రాను రాను దూరమైపోవడం.

ఈనాడు గ్రాంథిక భాష విలువ తగ్గినా మన ప్రాచీన సాహిత్యాన్ని అవగాహన చేసుకోవాలంటే గ్రాంథిక భాషా పరిచయం ఎంతో అవసరం.

**గ్రాంథిక భాష ప్రయోజనాలు :**

- ప్రాచీన సాహిత్యాన్ని చదవడం గ్రాంథిక భాష ద్వారానే సాధ్యమవుతుంది.
- వివిధ కవుల లోకజ్ఞతను, వారి కవిత్వ వ్యూహాలను గ్రహించవచ్చు.
- లాలిత్యం, మాధుర్యం, గాంభీర్యం, సౌకుమార్యం లాంటి భావ రీతులను ప్రదర్శించడానికి పూర్వకవులకు గ్రాంథికభాషే శరణ్యం. శైలీ వైవిధ్యాన్ని గ్రాంథిక భాష ద్వారానే ప్రభావవంతంగా వ్యక్తం చేశారు.
- మన పూర్వులు సృజించి ఇచ్చిన భాషా సంపదను గ్రాంథికభాష ద్వారా అనేక ఆధునిక అవసరాలకు వినియోగించుకోవచ్చు.

**2.7.2 వ్యావహారిక భాష :**

ఇది వ్యావహారిక భాషాయుగం. రచనల్లో వ్యవహారానికి దూరంగా ఉన్న కృతకమైన భాషను ఉపయోగించడం కంటే మనం మాట్లాడే భాషకు దగ్గరగా వుండే భాషను ఉపయోగించడం వల్ల సహజత్వం వస్తుంది. భాష సరళంగా, సహజంగా, సామన్య ప్రజానీకానికి సైతం అందుబాటులో ఉండాలన్నది ఈనాటి ప్రజాస్వామ్యయుగంలోని

ఆధునిక దృక్పథం. మాటకు, రాతకు సన్నిహితంగా ఉండి మాట్లాడే వాళ్ల, రాసే వాళ్ల భావాలను వినేవాళ్లు సులభంగా స్పష్టంగా గ్రహించడానికి వీలు పడే భాషా విశేషమే వ్యవహారిక భాష. దీనిలో కాలం చెల్లిపోయిన


గురజాడ అప్పారావు

పాత మాటలకు, పాత పద్ధతులకు తావు లేదు. ఆధునిక పద్ధతులకు, నేటి ఆలోచనలకు, అవసరాలకు అనుగుణమైన శబ్దజాలం, వాక్య రచనా పద్ధతి వ్యవహారిక భాషకు ప్రధాన లక్షణాలు. వ్యవహారిక భాషను పాఠ్యగ్రంథాలలోకి తీసుకురావడానికి శ్రీ గిడుగు రామ్మూర్తి పంతులు, శ్రీ గురజాడ ఎంతో కృషి చేశారు. ఈనాటి పాఠ్య పుస్తకాల్లో, కవుల రచనల్లో, సాహితీ గ్రంథాల్లో, పరిశోధనా వ్యాసాల్లో ఇంకా పలు విధాలైన ప్రక్రియల్లో వ్యావహారిక భాష విశ్వరూపం ధరించిందంటే – అవి వారి అవిరళ కృషి ఫలితమే! రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన భాషా పాఠ్య నిర్మాణ సంఘాలన్నీ వ్యవహారిక భాషనే ఆధునిక ప్రామాణిక భాషగా స్వీకరించాలని సిఫారసు చేశాయి. మాట్లాడే భాషకూ రాసే భాషకూ మధ్య ఎక్కువ అంతరం వుండకూడదని భావించాయి. ఈనాడు పత్రికలలో వస్తున్న వ్యవహారిక భాషను ఆధునిక ప్రామాణిక వ్యవహారిక భాష లేక శిష్ట వ్యావహారిక భాషగా పరిగణించవచ్చు.

ప్రజలు తమ దైనందిన వ్యవహారాల్లో ఉపయోగించే భాష వ్యావహారిక భాష. ప్రాచీన గ్రంథాల్లో వాడే భాషకు భిన్నంగా ఉండటం వల్ల పండితులు దీనిని గ్రామ్య భాషగా పిలిచేవారు. ఈనాడు వెలువడుతున్న పుస్తకాలు అన్నీ దాదాపు వ్యవహారిక భాషలో రచించినవే.

భాష పరిణామశీలం, మార్పు దానికి సహజం. సమాజం మారే కొద్దీ భాష కూడ మారుతుంది. కాలక్రమంలో భాషలో జరిగే సామాజిక పరిణామాలు భాషపై ప్రభావం చూపుతాయి. జనం వ్యవహరించే లేదా మాట్లాడే భాషే వ్యవహారిక (వాడుక) భాష. దీన్లో ప్రాంతీయత, వర్గ బేధాలుంటాయి. నివాస ప్రాంతం, వర్గం వాడుక భాషపై ప్రభావం చూపుతాయి. అలాగే ఇతర భాషలు కూడ సమాజంలోకి చొచ్చుకొని వచ్చి వాడుక భాషలో చేరతాయి. వ్యవహారిక భాషలో మనం మాట్లాడే భాషకు రాసే భాషకూ తేడా కొద్దిగా మాత్రమే ఉంటుంది. అదే గ్రాంధిక భాషకూ, మాట్లాడే భాషకు మధ్య దూరం ఎక్కువగా ఉంటుంది. ఈ తేడా ఎక్కువకావడం భాషా వికాసానికి అంత మంచిది కాదు.

మనం రాసేటప్పుడు పూర్తిగా రాస్తాం. కానీ మాట్లాడేటప్పుడు తొందరగా మాట్లాడడానికి తగినట్లు ధ్వనులు మాటలు తగ్గించి మాట్లాడతాం. ఉదా : మామ అని రాసినా పలికేది మాత్రం మావఁ.

విద్యాలయాల్లో వాడే భాష గ్రాంధిక రూపంలో ఉండి, అది విద్యార్థుల నిత్యవ్యవహారంలో పనికి రాకుండా


శ్రీ శ్రీ

ఉండేది. బడిలో నేర్పే భాష బజారులో పనికి రాకుండా పోయేది. ఇది గమనించిన పెద్దలు వ్యావహారిక భాష పాఠశాలల్లో ఉండాలి అని వాదించారు.

గిడుగు రామమూర్తి పంతులు ఈ వ్యవహారిక భాష కోసం ఉద్యమం చేపట్టారు. వారి అడుగుజాడల్లో గురజాడ, చలం, శ్రీశ్రీ, వార్ల, కొడవటి గంటి వంటి రచయితులు నడిచారు. గ్రాంధికమా? వ్యవహారికమా? అనే చర్చలు జరిగాయి.


చలం

ఆధునిక రచనలు, కవితా రీతులు, పాశ్చాత్య సాహిత్య పోకడలు తెలుగు రచయితలపై ప్రభావం చూపాయి. తత్ఫలితంగా వ్యావహారిక భాష వ్యాప్తిలోకొచ్చింది.

ఇప్పుడు మనం చెప్పుకొనే వ్యావహారిక భాష శిష్ట వ్యావహారికం. అంటే విద్యావంతుల భాష. నేటి ప్రసార మాధ్యమాలలో ఉన్న భాషకూడ ఇదే. పాత పదాలు వ్యాకరణాంశాలు వదిలి ఆధునిక పదాలు, వాక్యాలు వాడడం జరుగుతోంది. దీన్నే పాఠ్యగ్రంథాల్లో, పాఠశాలల్లో

బోధనకు కూడ వినియోగిస్తున్నారు. ప్రస్తుతం పత్రికలలో వస్తున్న భాష, కథా రచయితలు, నవలా, నాటక రచయితలు రాస్తున్న భాష శిష్ట వ్యావహారికమే!

పాఠ్యగ్రంథాలు రాయడానికి వాడుక భాషను సంస్కరించి అన్ని ప్రాంతాలకు అర్థం అయ్యేటట్లు ఒక ప్రామాణిక భాషను రూపొందించారు.

భాషలో ఏకరూపత సాధించి సమన్వాయం అందించి తెలుగు భాషను నేర్చే ప్రతి ఒక్కరికి అర్థం అయ్యేటట్లు ఐక్యత సాధించడానికి ప్రాంతీయ భాషా భేదాలు లేని ప్రామాణిక భాషను రూపొందించి పాఠ్యగ్రంథాలు రాస్తున్నారు. ఈ ప్రామాణిక భాషనే శిష్ట వ్యావహారికం అంటున్నారు. ఇది జన వ్యవహారానికి దరిదాపుగా ఉండి సరళ వ్యాకరణ లక్షణాలు కలిగి సమగ్రంగా ఉండి బోధన మాధ్యమంగా, అధికార భాషగా ఉపయోగించగలిగి అన్నిరంగాలకు అందుబాటులో ఉంటుంది. గ్రాంధిక భాష కన్నా వాడుక భాషే సజీవ భాష. నిరంతరం మార్పులకు లోనవుతూ, కొత్తదనాన్ని స్వాగతిస్తూ గలగల పారే జీవన నదిలాంటిది వాడుక భాష!

అయితే ప్రాచీన గ్రాంధిక భాషను కూడ దూరం చేయకుండా ఉన్నత తరగతులలో, కళాశాలల్లో ప్రాచీన రచనలు, కావ్యాలు, ఆలంకారిక, వ్యాకరణ గ్రంథాంశాలను పాఠ్యాంశాలుగా బోధిస్తున్నారు.

### గ్రాంధిక భాషకు – వ్యవహారిక భాషకు తేడాలు – కొన్నిఉదాహరణలు

| గ్రాంధిక భాష | వ్యవహారిక భాష |
|---|---|
| 1. రాధ కన్నులు కమలముల వలె అందముగానున్నవి. | 1. రాధ కళ్లు కమలాల్లా అందంగా ఉన్నాయి. |
| 2. సంక్రాంతి సెలవులలో నేను మాయూరికి వెళ్లెదను | 2. సంక్రాంతి సెలవల్లో నేను మా ఊరికి వెళ్తాను. |
| 3. అమరావతి రాజధానీ నగరమును భువన మనోహరముగా నిర్మించుటకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము అవిరళ కృషి చేయుచున్నది. | 3. అమరావతి రాజధాని నగరాన్ని భువన మనోహరంగా నిర్మించడానికి ఆం.ప్ర. ప్రభుత్వం అవిరళ కృషి చేస్తోంది. |
| 4. జాషువా కవి గబ్బిలము కావ్యమును బహు బాగుగా రచించినాడు. | 4. జాషువా కవి 'గబ్బిలం' కావ్యాన్ని చాలా బాగా రచించాడు. |

ప్రాథమిక, మాధ్యమిక స్థాయిలలో మాత్రం ఆధునిక ప్రామాణిక వాడుక భాషలో పాఠ్యగ్రంథాలు రాసి వాటినే బోధిస్తున్నారు. ఉపాధ్యాయులు ప్రాచీన, ఆధునిక భాషలను సాహిత్యాలను ఆకళింపు చేసుకొని తమ విద్యార్థుల స్థాయి, అవసరాలు, ఆసక్తి గమనించి తగిన బోధనాంశాలను గ్రహించి తమ విద్యార్థులకు తగిన భాషా సామర్థ్యాలు అందించాలి. ఈనాటి, రేపటి భాషావసరాలు తీర్చే భాషా సామర్థ్యాలు విద్యార్థులకు అందించాలి. ఇది ఉపాధ్యాయుల కర్తవ్యం అని మరువకూడదు.

**2.7.8 మాండలిక భాష :**

ఒక పరిమిత భౌగోళిక ప్రాంతాన్ని 'మండలం' అంటారు. ఆ ప్రాంతంలో జనం మాట్లాడే భాషకు కొన్ని ప్రత్యేక లక్షణాలుంటే దాన్ని 'మాండలిక భాష' అనవచ్చు. పద ప్రయోగంలో, ఉచ్చారణలో ప్రత్యేకత కలిగి ఒక ప్రాంతానికో, వర్గానికో సంబంధించిన భాషే మాండలిక భాష. వృత్తి, వర్గ మాండలికాలు కూడ ఉన్నాయి. ఒక ప్రధాన భాషలో భాగంగా ఉంటూ ఒక ప్రాంతానికి చెందిన ప్రజలు మాట్లాడుకునే విలక్షణ భాషే మాండలికం. ఆంగ్లంలో 'డయెలెక్ట్' అనే పదం ఈ మాండలికానికి సమానార్థకం. మాండలికాన్ని ఉప భాష, ప్రాదేశిక భాష అని కూడా పిలుస్తారు.

**మాండలికాల సమాహారమే భాష**

ప్రతి భాషలోనూ మాండలికాలు ఉంటాయి. మరి కొంత హేయబద్ధంగా చెప్పాలంటే ప్రతి వ్యక్తి మాట్లాడేది మాండలికమే! కాని భాష కాదు. మాండలికమే భాష సహజ స్థితి.

మాండలిక భాషకు కింది లక్షణాలుంటాయి.

- పరిమిత ప్రాంతంలో జను వ్యవహారంలో ఉండటం.
- ప్రత్యేకమైన ఉచ్చారణ, పలుకుబడి పద ప్రయోగం మొదలైనవి ఉండటం.
- భాష సహజస్థితి మాండలికమే.
- ప్రాంతీయతాముద్ర, తనదైన ప్రత్యేకత కలిగి ఉండటం.
- మూలభాషలో అంతర్భాగంగానే కొనసాగటం.
- ఎన్ని విలక్షణలతలున్నా భాషా వ్యవహర్తల మధ్య అవగాహన కలిగిస్తూ ఉండటం మొదలైనవి.

**మాండలిక భాషలు ఏర్పడడానికి పలు కారణాలు :**

- భౌగోళిక అవరోధాలైన అడవులు, కొండలు, నదులు అడ్డుకోవడం వల్ల జనుల రాకపోకలు, ఇతర ప్రాంతాలతో సంబంధాలు లేకపోవడం వల్ల.
- ఒక భాషను మాట్లాడే జనం వేరే భాషా ప్రాంతాలకు వలసలు పోయి అక్కడే స్థిరపడటం.
  ఉదా : ముంబయి, కర్ణాటకలలోని ఆంధ్రులు.
- సరిహద్దుల్లోని ఇతర భాషల ప్రభావం వల్ల, ఆ భాషా పదాలు చేరడం వల్ల
  ఉదా : ఒరియా, కన్నడం, తమిళం, మరాఠి భాషల వల్ల మన రాష్ట్ర సరిహద్దుల్లో మాండలికాలు ఏర్పడ్డాయి.
- వివిధ వృత్తులు నిర్వహించే వాళ్లు ఆ ప్రాంతానికే పరిమితమై తమదైన భాషను వినియోగించడం వల్ల
- సామాజిక కారణాల వల్ల – కొన్ని సామాజిక వర్గాలు తమదైన భాషా సంప్రదాయాలను కలిగి ఉంటాయి. ఉదా : వర్గ మాండలికాలు
- విద్యాసంస్కారం అందిన; అందని వాళ్లలో అంతరాల వల్ల
- భౌగోళిక, శీతోష్ణ పరిస్థితుల వల్ల పదాల ఉచ్చారణలో ప్రత్యేకత ఉంటుంది. ఉదా : అడవులలో నివసించే వాళ్లకు అడవులకు సంబంధించిన చెట్లు, పక్షులు, జంతువులు వాటి పేర్లు ఎన్నో తెలుస్తాయి. వేడి, చలి వంటి శీతోష్ణస్థితుల వల్ల ఉచ్చారణల్లో, ధరించే వస్త్రాలలో, నివసించే గృహాలలో ఆహార సంపాదనలో, అలవాట్లలో తేడాలుంటాయి. తదనుగుణంగా భాషలో కూడ మార్పులు ఉంటాయి. అందువల్ల ప్రాంతీయమైన మాండలికాలు ఏర్పడతాయి.
- రాజకీయ సాంస్కృతిక కారణాల వల్ల ఒక భాష ఇతర భాషలపై ప్రభావం చూపుతుంది. ఉదా : తెలంగాణా ప్రాంతంలో ఉర్దూ ప్రభావం, సర్కారు జిల్లాల్లో ఆంగ్ల ప్రభావం, ప్రాచీన తెలుగు సాహిత్యంపై సంస్కృత ప్రభావం దీనికి సాక్ష్యాలు. సంస్కృతం గొప్పదని దాన్ననుసరించినట్లే ఆంగ్ల భాషను కూడా స్వీకరించారు.

పైన పేర్కొన్న సామాజిక, ఆర్థిక, వ్యాపార, పారిశ్రామిక, సాంస్కృతిక విద్యా కారణాల వల్ల మాండలిక భాషలు ఏర్పడతాయి.

తెలుగు భాషలో ఎన్నో ప్రాంతీయ భేదాలున్నాయి. నిజానికి ఒకే జిల్లాలో కూడ మాండలిక భేదాలున్నాయి. అయినప్పటికీ భాషా శాస్త్రజ్ఞులు తెలుగును స్థూలంగా నాలుగు ప్రధాన భాషా మాండలికాలుగా గుర్తించారు.

అ. పూర్వమండలం : శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలు

ఆ. మధ్య మండలం : ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలు

ఇ. దక్షిణ మండలం : రాయలసీమ ప్రాంతంలోని నాలుగు జిల్లాలు, నెల్లూరు, ప్రకాశం జిల్లాలు.

ఈ. ఉత్తర మండలం : తెలంగాణా రాష్ట్రంలోని పది జిల్లాలు.

తెలుగు మాండలికాలు ధ్వనుల్లో, అర్థాల్లో, ఉచ్చారణలో తేడాలుంటాయి.

ఉదా : పగలు – పకలు, రేగడి, రేవడి, జడివాన, దడివాన, చమురు–సమురు మొదలయినవి.

క్రియా పదాల్లో వచ్చిన మార్పులు : వచ్చాడు – వచ్చిండు–వచ్చినాడు–ఒచ్చిండు–వొచ్చిండు–అచ్చిండు మొదలైనవి.

**అర్థభేదక పదాలు :** పూర్వ మండలంలో సొమ్ములు అంటే ఆవులు. ఇతర ప్రాంతాలలో 'సొమ్ములు' అంటే 'ఆభరణాలు' 'ధనం' అని అర్థం. రాచకొండ విశ్వనాథశాస్త్రి పూర్తి శ్రీకాకుళం మాండలికంలో "సొమ్ములొస్తున్నాయి" అనే కథ కూడా రాశాడు. గోదావరి జిల్లాల్లో గేదె, ఇతర ప్రాంతాలలో 'బర్రె' అంటారు.


రావి శాస్త్రి

వివిధ భాషా సంస్థలు, విశ్వవిద్యాలయాలు తెలుగు మాండలకాలపై పలు పరిశోధనలు నిర్వహించి, వృత్తి పదకోశాలు వెలువరించాయి.

**మాండలికాల – ప్రయోజనాలు :**

1. మాండలికాలు భాషకు సౌందర్యాన్ని, వైవిధ్యాన్ని కల్గిస్తాయి.
2. భాష పరిణామం చెందడానికి తోడ్పడతాయి.
3. ఒక ప్రాంత చరిత్రను దాని పుట్టు పూర్వోత్తరాలను తెలుసుకోవచ్చు.
4. రచయిత ఏ ప్రాంతానికి చెందినవాడో గ్రహించవచ్చు.
5. ఆయా ప్రాంతాల సాంఘిక రాజకీయ పరిస్థితులను ఊహించవచ్చు.
6. మాండలికాన్ని పాత్రోచితంగా వినియోగించడం వల్ల సంభాషణలు హృదయానికి హత్తుకుంటాయి.

మాండలిక భాషా భేదాలు గ్రహించడం వల్ల ఉపాధ్యాయులకు పలు ప్రయోజనాలున్నాయి.

l ప్రామాణిక, అప్రామాణిక, మాండలిక భాషా పరిణామాలు తెలుస్తాయి. అందువల్ల విద్యార్థులను సరిగా అర్థం చేసుకోవచ్చు.

l మాండలిక భాషలోని రచనలు చదివి అర్థం చేసుకోవచ్చు.

l ప్రాంతాల సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితులు గ్రహించవచ్చు.

l పరిసరాల భాష, పాలకుల భాష, పాలితుల భాష వీటి ప్రభావం తెలుసుకోవచ్చు.

ఉదా : రాయలసీమలో కన్నడ భాష ప్రభావం.

తెలంగాణాలో ఉర్దూ, పార్శ భాషల ప్రభావాలు, ఆయా పదాలు, వాటి మార్పులు, అర్థాలు ప్రకృతి వికృతి పదాలు తెలుసుకోవచ్చు. ఉదా : ద్రస్సు, దిరుసు, సమర్థాయించు – సముదాయించు మొ॥నవి.

ఉపాధ్యాయులు విద్యార్థులు భాషను గమనించి దాని అభివృద్ధికి కృషి చేయడానికి ఈ మాండలిక భాషా జ్ఞానం పనికి వస్తుంది.

**మాండలిక వినియోగం :**

సృజనాత్మక రచనా ప్రక్రియలైన కథానిక, నవం నాటకాల్లో కొంత వరకు కవితలో కూడా మాండలికభాష విరివిగా వాడబడతోంది. రాచకొండ విశ్వనాథశాస్త్రి గారు శ్రీకాకుళం, విశాఖ మాండలికాల్లో అద్భుతమైన కథలు, నవలలు రాశాడు. తెలంగాణా, రాయలసీమ మాండలికంలో ఈనాడు మంచి కథలు వస్తున్నాయి. మాండలికం వినియోగం వల్ల రచనకు సహజత్వం వస్తుంది. 'జట్కావాలా' లాంటి కవితల్లో శ్రీశ్రీ కూడా మాండలికం ఉపయోగించాడు.

"తాను సాలీసాలని గడ్డితిని
రోజూ నాకింత వన్నం యెట్టేదండీ నా గుర్రం
మొన్న సనిపోనాది
ఇవండి కవిగోరూ
ఇశదంగా నాగోదు'' – ఇలా సాగుతుంది ఆయన కవిత.

**2.7.4. ప్రామాణిక భాష :**

అందరికీ ఆమోదయోగ్యంగా పదికాలాల పాటు నిలబడేదే ప్రామాణికత. ఇలాంటి స్థిరత్వాన్ని పొందిన భాషే ప్రామాణిక భాష. భాషలో మాండలిక భేదాలు ఎక్కువగా ఉన్నప్పుడు ఆయా ప్రాంతాల ప్రజల మధ్య పరస్పర భావ వినిమయం కష్టతరమవుతుంది. సామాజికపరమైన కొన్ని వ్యవహారాలలో మాండలిక భేదాలు అసౌకర్యాన్ని సృష్టిస్తాయి. అందువల్ల వివిధ సామాజిక అవసరాల కోసం ఏకరూపత గల ప్రామాణిక భాష అవసరమవుతుంది. సాధారణంగా పట్టణాలలోని ఉన్నత వర్గాల మాండలిక భాష ప్రామాణికభాషగా మారుతుంది. వ్యావహారిక భాషను ప్రామాణికరిస్తే ఏర్పడేది ప్రామాణిక భాష. శిష్టర్యావహారికాన్నే ప్రామాణిక భాషగా భావించవచ్చు.

సామాన్యంగా ప్రతి భాషలోను మాండలికాలు ఎన్ని ఉన్నా శిష్టజన వ్యవహారంలో ఉన్న భాష ఆ కాలానికి సంబంధించిన ప్రామాణిక భాషగా సిద్ధపడుతుంది. దాదాపుగా 50ఏళ్ళుగా వస్తున్న కథ; నవల మొదలైనవి వచన రచనలలోనూ, పత్రికా వ్యాసాల్లోనూ, రేడియోలలోను, సినిమాలలోనూ, టివీల్లోనూ వాడుకలో ఉన్న భాష శిష్ట వ్యావహారికమే. ఒక రకంగా చెప్పాలంటే నేటి దినపత్రికల్లో ఏ భాషనైతే వాడుతున్నారో అదే ప్రామాణిక వ్యవహారిక భాష అనవచ్చు.

శిష్ట వ్యావహారికం అనే పేరు అపార్థాలకు అపోహలకు గురి అయ్యే అవకాశం ఉంది కాబట్టి భద్రిరాజు కృష్ణమూర్తిగారు దానికి 'ఆధునిక ప్రామాణిక భాష' అని పేరు పెట్టి వ్యాప్తిలోనికి తెచ్చారు. దిన, వార, మాస పత్రికలు, రేడియోలు, సినిమాలు, ఇతర ప్రసార సాధనాలు శిష్ట వ్యావహారిక భాషకు ప్రామాణికతను తెచ్చాయి.

పాఠ్య గ్రంధాలలో, పరీక్షల్లో ఇంత వరకు ఉన్న నిషేధం ఇప్పుడు తొలగిపోయింది. 1986 నుండి తెలుగు వాచకాన్ని కూడ ఆధునిక ప్రామాణిక భాషలో రాయిస్తున్నారు.

ప్రామాణిక భాష ప్రభావం మాండలికాల మీద మాండలిక భాషల ప్రభావం ప్రామాణిక భాషల మీద ఎప్పుడూ ప్రసరిస్తూ ఉంటుంది. మాండలికాలే ప్రామాణిక భాషకు పుష్టిని చేకూరుస్తాయి. అవి భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రదర్శిస్తాయని భాషావేత్తల అభిప్రాయం. భాషకు అనంతమైన సౌందర్యాన్ని కూర్చేది మాండలికాలే. గురజాడ తన కన్యాశుల్కంలో మాండలిక భాష వాడారు.

ప్రామాణిక భాష లక్షణాలను, ప్రయోజనాలను ఈవిధంగా పేర్కొన్నారు.

- ప్రామాణిక భాష ఎక్కువ మంది ప్రజలకు సమ్మతంగా ఉంటుంది.
- విద్యాబోధన ప్రామాణిక భాషలో జరుగుతుంది.
- మాండలికాల కంటే, ప్రామాణిక భాషా ప్రయోగానికి వ్యాప్తి ఎక్కువ. ఉపన్యాసాలు, వచన రచనలైన కథలు, నవలలు, నాటకాలు, వార్తా పత్రికలు, సినిమాలు, రేడియో, టెలివిజన్ మొదలైన విజ్ఞాన వ్యాపక సాధనాలన్నీ ప్రామాణిక భాషనే వాడతాయి.
- వ్యవహర్తల సాంస్కృతిక వైజ్ఞానానిక ఐకమత్యానికి ప్రామాణిక భాష ఒక సంకేతం అవుతుంది. ప్రాంతీయ, వర్గ మాండలికాలు వాటి ఏర్పాటుకు గుర్తులవుతాయి.
- ప్రామాణిక భాష ప్రాధమికంగా ఏదో ఒక ప్రాంతంలో చదువుకొన్న వారి వాడుక ఆధారంగా ఏర్పడి మాండలిక ప్రయోగాలను కలుపుకొంటూ పర్యా వ్యాప్తమవుతుంది.

- కొన్ని భాషల్లో ప్రాచీన కావ్య భాషనే వ్యవహర్తలు గుర్తిస్తారు. అప్పుడు మాండలిక ప్రభావం ప్రామాణిక భాషపై అంతగా ఉండదు. ఉదా : అరబిక్, తమిళం.

**ప్రామాణిక భాష లక్షణాలు :**

ప్రామాణిక భాషకు కింది లక్షణాలు ఉంటాయని భాషావేత్తల అభిప్రాయం.

- సరళమైన వ్యాకరణం ఉండటం.
- నమ్రతతో కూడిన స్థిరత్వం ఉండటం (Flexible Stability) అంటే మార్పు చేర్పులు సమ్మేళనం చేసుకుంటూ స్థిరంగా ఉండటం.
- మాండలిక వైవిధ్యాలను తగ్గించి, మాండలిక భాషలను ఒకే బాటలో నడపగలగటం.
- ప్రాంతీయ భేదాలు ఉండకపోవడం (బ్లూమ్ ఫీల్డ్ Bloom Field)
- ఆధునికుల గ్రంధ రచనకు అనువుగా ఉండటం.
- మేధావీకరణానికి అనువుగా ఉండటం.
- విజ్ఞాన సాంకేతిక రంగాల అభివృద్ధి వల్ల ప్రపంచీకరణ వల్ల వస్తున్న మార్పులకు అనుగుణంగా పరభాషా పదాలను సులువుగా స్వీకరించడానికి అనువుగా ఉండటం. అవసరమయితే వాటిని సమ్మిళితం చేసుకోవడం.

**ప్రామాణిక భాష ప్రయోజనాలు :**

- సమైక్యతా సాధనం : వివిధ మాండలిక ప్రజల మధ్య భాషా సమైక్యతను, భావ సమైక్యతను సాధించి, జాతీయ సమైక్యతకు తోడ్పడుతుంది.
- పత్రికలు, రేడియోలు, సినిమాలు, టివిలు లాంటి ప్రసార సాధనాలలో ఉపయోగించడం.
- అధికారిక కార్యకలాపాలలో ఉపయోగపడటం.
- ప్రతిష్ఠాసాధనం : ప్రామాణిక భాష మాట్లాడే వారికి ఉన్నత సామాజిక స్థాయి ప్రతిష్ఠ ఏర్పరచడం.
- అనుసంధాన సాధనం : వివిధ సామాజిక సన్నివేశాలలో అనుసంధాన భాషగా ఉపయోగించడం.

**2.7.5 అధికారిక భాష :**

ఒక ప్రాంతంలో అధిక శాతం ప్రజలు మాట్లాడే భాషను అనుసరించి ప్రభుత్వాలు ఆ భాషను ఆ ప్రాంతానికి అధికార భాషగా నిర్ణయిస్తాయి. అంటే మనదేశానికి హిందీ అధికార భాష. మన రాష్ట్రానికి తెలుగు అధికారభాష. ఒక భాషని అధికార భాషగా నిర్ణయించిన తర్వాత ఆయా ప్రభుత్వాలు అన్ని విధాలా ఆ భాషను అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. అన్ని ప్రభుత్వ కార్యకలాపాల్లో సాధ్యమైనంత వరకూ ఆ భాషనే ఉపయోగించాలి. అధికార భాషగా తెలుగు అమలుకు జరిగిన కృషి పరిణామ క్రమం.

భారత రాజ్యాంగంలోని 345వ అధికరణం తమ తమ ప్రాంతీయ భాషలకు అధికార భాషలుగా స్వీకరించడానికి రాష్ట్రాలకు అధికారమిచ్చింది. దాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ శాసన విభాగం 1966లో అధికార భాషా శాసనాన్ని తయారు చేసింది.

సెలెక్ట్ కమిటీ స్థాయిలో ఆనాటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి, నాటి విద్యామంత్రి పి.వి.నరసింహారావు అధ్యక్షతన 1967లో ఒక సమీక్షా సంఘాన్ని నియమించింది. ఆ సంఘం 1970–71లో శాసనంలోని నిబంధన మేరకు అధికార భాషగా తెలుగు అమలుకు వెంటనే భాషా కమీషన్ ఏర్పాటు చేయాలని సూచించింది.

ఈ చట్టాన్ని ఐదు సంవత్సరాల కాలంలో నూరు పాళ్లు అమలు జరిపి తరవాత నుంచి కేవలం తెలుగు భాషలోనే ప్రభుత్వ వ్యవహారాలు జరపాలని, కార్యనిర్వహణ, శాసన, న్యాయ వ్యవస్థలు తదనుగుణమైన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అందుకు విశేష కృషి చేయాలని అధికార భాషా చట్టంలో నిబంధన విధించారు. పరిపాలన

భాషగా తెలుగు భాషా స్వరూపం నిర్ణయించడానికి పింగళి లక్ష్మీకాంతం అధ్యక్షులుగా ఒక సంఘం ఏర్పాటయింది. రాష్ట్రంలో అన్ని కార్యాలయాల్లో తెలుగు అధికార భాషగా వాడాలని 1968లో ఉత్తర్వు వెలువడినా, భాషా చట్టంలో నిబంధనలున్నా ప్రయోజనం కన్పించలేదని 1974; 5వ తేదీన సాధారణ పరిపాలన శాఖలో అధికార భాషా విభాగాన్ని ఏర్పాటు చేశారు. మార్చి 19వ తేదీన వావిలాల గోపాలకృష్ణయ్య అధ్యక్షులుగా అధికార భాషా సంఘం అనే పేరుతో ఒక సంస్థకు ప్రభుత్వశాఖగా ఏర్పాటు చేశారు.

1974 మార్చి 24వ తేదీ నుంచి (ఆనంద నామ సంవత్సరం ఉగాది) రాష్ట్రమంతటా, తాలూకా స్థాయిలోనూ, శాసనేతర ఉత్తర ప్రత్యుత్తరాలన్నింటినీ అన్ని శాఖలలోను తప్పనిసరిగా తెలుగు వాడాలని ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది.

**2.7.6 మాధ్యమ భాష** (Medium of Instruction)

భావ వ్యక్తీకరణకు, భావ గ్రహణకు భాషే మాధ్యమంగా పనిచేస్తుంది. తొలి భావనలకు రూపమిచ్చిన మాతృభాష బాహ్యప్రపంచావగాహనకు తొలి మాధ్యమం. మానవుడి మూర్తిమత్వాభివృద్ధిలో మాతృభాషదే ప్రధానపాత్ర. మాతృభాషలో చాలా సులువుగా, ఉత్సాహంగా, సహజంగా, ఆనందంగా విషయాలు నేర్చుకోవచ్చు.

మనకు స్వాతంత్ర్యం రాక పూర్వం 1835లో లార్డ్ మెకాలే మన విద్యాలయాల్లో ఆంగ్లాన్ని బోధనా భాషగా ప్రవేశపెట్టాడు. ఈ పరిణామాన్ని పలువురు ఆంగ్ల మేధావులు కూడ వ్యతిరేకించారు. దేశాల అభివృద్ధికి ఆ దేశ భాషలే బోధన మాధ్యమంగా ఉండాలని రష్యా, జర్మనీ దేశాలు వైజ్ఞానికంగా అభివృద్ధి చెందటానికి వారి మాతృభాషలు బోధన భాషలుగా ఉండటమే ప్రధాన కారణమని వారు పార్లమెంటులో వాదించినప్పటికీ, వారి మాట చెల్లలేదు. సాంకేతిక పరిజ్ఞానంలో సాటి లేని మేటి దేశంగా ముందంజ వేసిన జపాన్‌లో బోధన భాష జపనీస్.

విద్యా లక్ష్యాలు నెరవేరాలంటే ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు బాగా విద్యార్థులకు అర్థమవ్వాలంటే మాతృభాసలో విద్యాబోధన జరిగినపుడే నెరవేరుతుంది. “శిశువుకు తల్లిపాలు ఎలాంటిదో విద్యార్థికి మాతృభాషలో బోధన అలాంటిది”. ఈ సందర్భంలో “పరభాష ద్వారా నేర్పే విద్య సోపానాలు లేని సౌధం వంటిదని” విశ్వకవి రవీంద్రుడన్న మాటలు గమనించదగినవి. పరభాషలో విద్యాబోధన వల్ల విషయం అర్థం కాని విద్యార్థులు కంఠస్థం చేయడానికి అలవాటు పడతారు. దీని వల్ల వారిలోని స్వతంత్ర ఆలోచన శక్తి, భావప్రకటన సామర్థ్యం సన్నగిల్లుతాయి. భాషాదాస్యం, భావ దాస్యానికి దారి తీస్తుంది. ఒక జాతి చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, నాగరికత, ఆచార వ్యవహారాలు భావ వికాసం, మాతృభాష ద్వారానే ప్రకటితమవుతాయి. భావ వికాసం జరగడమంటే సృజనాత్మకత పెంపొందించడమే. అలా కాక పరభాషలో విద్యాబోధన జరిగితే విదేశీ సంస్కృతి విషతుల్యమయ్యే ప్రమాదముంది. అందువల్ల మాతృభాషలో విద్యాబోధన అందున ప్రాథమిక స్థాయిలో మరింత మేలు. ఆంగ్లమాధ్యమంలో ప్రాథమిక విద్య ఇసుకపై నిర్మించిన పునాది వంటిది.

**2.7.8. తెలుగు భాష పూర్వ వైభవ స్థితి :**

తెలుగదేలయన్న, దేశంబు తెలుగేను
తెలుగు వల్లభుండ, తెలుగొకండ
ఎల్లనృపుల గొలువ నెరుగనేబాసాడి
దేశ భాషలందు తెలుగులెస్స

సాహితీ సమరాంగణ సార్వభౌముడైన శ్రీకృష్ణదేవరాయులు దేశభాషల్లో తెలుగు వైభవాన్ని కీర్తించారు. తెలుగును "Italian of the East" అని పాశ్చాత్యులే కొనియాడారు. ఎందుకో తెలుసుకోండి.

ప్రాచీన కాలం నుండి తెలుగు భాష స్వతంత్రమైన భాష. ఈ భాషలో కన్పించే ద్రావిడ శబ్దాలను బట్టి ఇది ద్రావిడ భాషా జన్యమని, సంస్కృత శబ్దాలను బట్టి సంస్కృత భాషా జన్యమని భాషా తత్వజ్ఞుల అభిప్రాయం.

ఏ భాషా సంబంధం లేని మూల శబ్దాలను బట్టి ఇది స్వతంత్ర భాష అని గమనించవచ్చు.

తెలుగు లిపిలోని శాసనాలను బట్టి ఈ భాష ప్రాచీనత రెండు వేల ఏండ్ల నాటిదని నిశ్చయముగా చెప్పవచ్చు. తెలుగు వారు మొదటి నుంచి రాత విషయంలో చాల పట్టింపుతో 'ఆణిముత్యాల'లాగ, 'ముత్యాల కోవ' లాగా రాసే అలవాటు చేసుకొన్నట్లు మన సాహిత్యంలో నిదర్శనాలున్నాయి.

తెలుగు భాషకు ఏ భాషకు లేనంత పెద్ద వర్ణమాల ఉంది. ఈ భాషను నేర్చుకోవడం కష్టంగా తోచినా ఈ వర్ణమాల వల్ల కలిగే ప్రయోజనం తెలిస్తే దీనిని శ్రమగా భావించరు.

తెలుగు భాషా మాధుర్యం మన దేశీయులనే కాకుండా విదేశీయులను కూడా ఆకర్షించగలగడం విశేషం. దీనికి సి.పి.బ్రౌన్ తెలుగు భాషను గురించి చేసిన ప్రశంసే తార్కాణం.

ఆనాటి రాయల చేతనే కాకుండా తెలుగు భాష ప్రాచ్య భాషలలో మాధురభరితమై మకుటాయమాన మవుతోందని పాశ్చాత్యులూ ప్రస్తుతించారు. భారతదేశాన్ని మాతృదేశంగా భావించి తన పరిశోధనలను కొనసాగించిన J.B.S. Haldane భారతీయులకు జాతీయ భాషగా నిజమైన ప్రయోజనకారిగా ఉండవలసి వస్తే ఆ గౌరవం పొందడానికి తెలుగు భాషకు గల అర్హత మరి ఏ ఇతర భారతీయ భాషకూ లేదని, ముఖ్యంగా విజ్ఞాన సాంకేతిక పదజాలానికిది పుట్టినిల్లు కాగలదని తెలిపారు. ఇదే విషయాన్ని శ్రీశ్రీ కూడా సమర్థించాడు. భారతదేశం మొత్తం మీద ఎక్కువ మంది మాట్లాడే భాష తెలుగే అని ఒక అభిప్రాయం కూడా వుంది.

సి.పి.బ్రౌన్

**2.8.0. తెలుగుభాషపై సంస్కృత ప్రభావం, పారశీక భాష ప్రభావం, ఉర్దూ ప్రభావం, ఆంగ్ల ప్రభావం – అనువాదం**

ఏ భాషలోనైనా పదాలు దేశ్యాలు (digeneous), అన్యదేశ్యాలు (Foreign) అని రెండు రకాలుగా ఉంటాయి. మూలభాష నుంచి సంక్రమించినవి దేశ్యాలు. తదితరాలు అన్యదేశ్యాలు. భాషలో కొత్త పదాలు చేరడానికి ముఖ్యకారణం ఆదానం (Borrowing). సాధారణంగా ఒక భాషను మాట్లాడే ప్రజలు భౌగోళికంగా సమీపవర్తి భాషలనించి గాని, సాంఘిక, రాజకీయ, మత, సాంస్కృతిక, వాణిజ్య సంబంధాల వల్ల దూరవర్తి భాషల నుంచి గాని కొత్త పదజాలాన్ని గ్రహిస్తారు.

ద్రావిడ భాషా కుటుంబానికి చెందిన తెలుగును చారిత్రకంగా పరిశీలిస్తే ప్రాచీన దశలో తత్సమ తద్భవ పదజాలం ఎక్కువగా చేరినట్లు చెప్పవచ్చు. మహమ్మదీయుల పరిపాలనా కాలంలో అరబిక్ పర్షియన్ భాషాపదాలు తెలుగు వారి రాజకీయ సాంఘిక రంగాలలో వ్యవహారంలోకి వచ్చాయి. ఆ తరువాత వరుసగా పోర్చుగీసు, ఇంగ్లీషు మొదలైన యూరోపియన్ భాషల ప్రభావం తెలుగుపైన ఎక్కువగా కనిపిస్తుంది.

**2.8.1. తెలుగు భాషపై సంస్కృత ప్రభావం**

తెలుగుతో సంసరం పొందిన మొదటి భాషల్లో సంస్కృతం, ప్రాకృతం. ఆర్యభాషా వ్యవహర్తల రాజకీయాధికారమూ, వైదిక, జైన, బౌద్ధ మతాల సంసర్గమూ, ఆర్యభాషా సంస్కృతులూ కారణాలుగా సంస్కృత ప్రాకృత భాషల ప్రభావం తెలుగుపై చాలా ఎక్కువ పడింది.

| సంస్కృతం | తెలుగు |
|---|---|
| అల్ప | అలుపము |
| చంద్ర | చందురుడు |
| అక్షర | అక్కరం |
| అప్సరాః | అప్సర |

### 2.8.2. తెలుగుభాషపై పారశీక భాష ప్రభావం

పర్షియన్, అరబిక్ భాషల నించి తెలుగులో ప్రవేశించిన పదాలలో కొన్నిచాలా సహజ ధ్వని పరిణామ పద్ధతులకు భిన్నంగా మార్పులు పొందినట్లు కనిపిస్తుంది. ఉదా :

| **తెలుగు** | **పర్షియన్** | **అర్థం** |
|---|---|---|
| ఎకిమీడు | హకీమ్ | యజమాని |
| హస్తి భారం | ఉస్తువార్ | పునాది |
| సిరినామా | సర్‌నామా | చిరునామా |

పై మాటల్ని చూస్తే సాధారణంగా తెలుగులో జరిగే ధ్వని పరిణామాలకు భిన్నమైన ధ్వని పరిణామాలు కనిపిస్తాయి. తెలుగులో సాధారణంగా పదాది 'హ' కారలోపం కనిపిస్తుంది. ఉదా : ఉషారు (< హుషార్) కాని దానిపైన అచ్చులో మార్పు రాదు. కాని ఎకిమీడు (< హకీమ్)లో 'అ' 'ఏ' కావడం కన్పిస్తుంది. అలాగే తక్కిన ఉ దాహరణలు కూడ సాధారణ జనంలో ఉన్న పద్ధతిలో గాక ఛందస్సు కోసమో, రచనానుకూలంగానో మార్పులు చేసి కవులు కావ్యాలలో ప్రయోగించి ఉంటారు.

ప్రాచీనకావ్యాలలో సుమారు 900 అన్యదేశ్యాలు ముఖ్యంగా పర్షియన్ అరబిక్ భాషలకు సంబంధించినవి కన్పిస్తాయి. రాజకీయ సంబంధమైన సుల్తాను, పాదుషా, ఫర్మానా, హుజూరు, కితాబు మొ.వి. వ్యాపార సంబంధమైన దుకాణం, త్రాసు మొ॥నవి. సైనికపరమైన సిపాయీ, తుపాకీ, బందుకు, ఫిరాయించు, ఫౌజు, బందోబస్తు మొ.నవి.

### 2.8.3. తెలుగుభాషపై ఉర్దూ ప్రభావం

ఉర్దూ ప్రభావం ఎక్కువగా కనిపించే తెలంగాణా ప్రాంతపు భాషలో వాక్య నిర్మాణంలో కూడ మార్పు కనిపిస్తుంది. ఉర్దూలో గమ్యార్థ పదానికి చతుర్థీ విభక్తి ప్రత్యయం వాడనవసరం లేదు. కనుక తెలుగులో కూడ అలాంటి ప్రత్యయ లోపమే కనిపిస్తుంది. ఉదా : తెలుగు : నేను బయటకుపోయిన, ఉర్దూ : మైం బాహర్ గయా

తెలుగులో ఎక్కువగా వాడుకలో ఉన్న ఉర్దూ పదాలు కింద ఇవ్వబడ్డాయి.

| **ఉర్దూ** | **తెలుగు** | **అర్థం** |
|---|---|---|
| దర్యాప్త్ | దర్యాప్తు | పరిశోధన |
| ఫిరానా | ఫిరాయించు | తిప్పు |
| తుక్‌డా | తుకుడా | ముక్క |
| తకరార్ | తకరారు | వివాదం |
| జమానా | జమచేయు | కూడబెట్టడం |

### 2.8.4. తెలుగు భాషపై ఆంగ్ల ప్రభావం

పోర్చుగీసుల తర్వాత భారతదేశానికి వచ్చి సుస్థిర ప్రభుత్వాన్ని నెలకొల్పి ఇక్కడ భాషలపై ప్రభావం చూపిన యూరోపియనులు ఆంగ్లేయులు. దాని ఫలితంగా ఇంగ్లీషు పదాలు అనేకం తెలుగులో ప్రవేశించాయి.

నిత్యావసరాలకు సంబంధించిన లైటు, స్విచ్చి, కాఫీ, రోడ్డు, బస్సు, కారు, పెన్ను మొదలైనవి.

అసలు ఆంగ్ల భాషా ప్రభావం పడని భాష ప్రపంచంలో ఏదీ లేదు. ఎందుకంటే ఆధునికతకు తొలివాకిలి తెరించింది 'ఆంగ్ల భాషే'!

పరిపాలనా సంబంధమైన కోర్టు, ఆఫీసు, ఆర్డరు, ఫైలు మొదలైనవి. సాంస్కృతిక సంబంధమైన ఫ్యాషను, సినిమా, ఫ్యాను, రేడియో, క్లబ్బు, టికెట్, బస్, రైలు మొ॥ పదాలు తెలుగులోకి ఇబ్బడిముబ్బడిగా వచ్చాయి.

ఇంగ్లీషు పదాలు తెలుగులోకి వచ్చేటప్పుడు పద స్వరూపాలలో ధ్వనులలో కొన్ని మార్పులు వస్తాయి.

1. తెలుగు స్వరాంత భాష కావడం వల్ల వ్యంజనాంతాలైన ఇంగ్లీషు పదాలపైన అచ్చుచేరి, చివరి వ్యజనం/ హల్లు స్పర్శమైతే ద్విరుక్తమవుతుంది. ఉదా : రోడ్ > రోడ్డు
2. స్వరేతర వ్యంజనం పదాంతంలో అది హ్రస్వాచ్చూర్వకమైతేనే ద్విరుక్తమవుతుంది. ఉదా. పెన్ > పెన్ను; బస్ > బస్సు; ఫ్యాన్ > ఫ్యాను; రైల్ > రైలు
3. అవిద్యావంతుల భాషలో పదాది సంయుక్తాక్షరాలు స్వరభక్తితో విడివడి ఉచ్చారణలో కనిపిస్తాయి.
   ఉదా : క్లాసు > కిలాసు
   గ్లాసు > గిలాసు
4. పదమద్యంలో కూడ స్వరభక్తి కనిపిస్తుంది.
   ఉదా : డాక్టర్ > డాకటరు
   కలక్టర్ > కలకటరు
5. స్వర భక్తి సాధ్యం కాని చోట సంయుక్తాతరంలోని మొదటి వర్ణం లోపిస్తుంది.
   ఉదా : స్టేషన్ > టేషన్
   "నాంపల్లి టేషను కాడ సామీరంగో" పాట మీరు వినే వుంటారు కదూ!

### 2.8.5. అనువాదం

ఒక భాషలో ఉన్న ఆలోచనలను భావాలను మరొక భాషలో ప్రకటించే (రాసే) పద్ధతిని అనువాదం అంటారు. అనువాదాన్నే భాషాంతరీకరణం, తర్జుమా అని కూడ అంటారు. ఏ భాషలోని అంశాలు తెలుగులోకి మార్చాలి (అనువదించాలి) అని అనుకుంటామో దాన్ని మూలభాష (Souree Language) అంటారు. తెలుగులోకి అనువదిస్తున్నాం కనుక తెలుగు లక్ష్యభాష (Target Language) అవుతుంది. తెలుగు భాషలోని అంశాలు ఆంగ్లంలోకి మార్చాలంటే ఇక్కడ తెలుగు మూలభాష. ఆంగ్లం లక్ష్యభాష మూలభాష నుంచి లక్ష్య భాషలోకి భాషాంతరీకరణం చేసే నేర్పునే భాషాంతరీకరణ సామర్థ్యం అంటారు.

ఒక భాషలో ఉన్న విషయ సారాన్ని మరో భాషలోకి సమానార్ధకంగా మార్చే ప్రక్రియను 'అనువాదం' అనవచ్చు.

విజ్ఞానాది శాస్త్రాలకు సంబంధించిన పరిశోధన ఫలాలు అందరికీ అందాలంటే అనువాదమే మార్గం.

**అనువాదాల్లో రకాలు :** అనువాదాంశాలు లేక విషయాన్ని బట్టి సమాచారనువాదం, సాహిత్యానువాదం, వైజ్ఞానిక సాంకేతిక అనువాదాలున్నాయి.

**సమాచారానువాదం :** అధికారలేఖలు, సమాచారం, పరిపాలన వ్యవహారపత్రాల అనువాదం.

**సాహిత్యానువాదం :** సృజనాత్మక రచనలను అనువదించడం. ఉదా : కథ, నవల, విమర్శ మొ॥నవి.

వైజ్ఞానిక, సాంకేతిక శాస్త్ర గ్రంథాలు, వ్యాసాల అనువాదాలు.

అనువాద విధానాన్ని బట్టి దీనిని రెండు రకాలుగా చెప్పవచ్చు.

**మూలవిధేయానువాదం :** మూలానికి కట్టుబడి చేసే అనువాదం. ఈ అనువాదం చదివినా మూలం చదివినట్లే ఉంటుంది. మూలంలోని రచనా విధానమే అనువాదంలో ఉంటుంది. మూలం వెలువడిన నాటి పరిస్థితులే అనువాదంలో కనిపిస్తాయి. మూల భాషా రచనాశైలి లక్ష్యభాషలో ఉంటుంది.

**స్వేచ్ఛానువాదం :** లక్ష్యభాషలోని అనువాద రచన స్వతంత్ర రచనగా ఉండటం. మూలంలోని ప్రధానాంశాలను స్వీకరించి అనువాదకుడు స్వతంత్రించి లక్ష్యభాషలో రాయడం. అనువాదరచనల్లో ఇది ఉత్తమ విభాగం.

ఉదా : ఆంగ్లం, బెంగాలీ, హిందీ రచనలు తెలుగులోకి అనువదించినప్పుడు అనువాదకుడు స్థానిక తెలుగుదనాన్ని వాతావరణాన్ని, ప్రాంతాల్ని సృష్టిస్తాడు. మన తెలుగు మహాభారత రచన స్వతంత్ర అనువాదమే! అందుకే ఆ గ్రంథానికి అంతరసాత్మకత చేకూరింది.

**అనువాదంలో తీసుకోవలసిన జాగ్రత్తలు :**

l మూల లక్ష్య భాషలు బాగా తెలిసి ఉండాలి.

l అనువాదాంశాన్ని క్షుణ్ణంగా అవగాహన చేసుకోవాలి.

l మూలభాషలోని భావాలను లక్ష్యభాషలోనికి తేవడానికి ఆలోచించి తగిన, పదాలు, వాక్యాలు వాడాలి.

తెలుగు సాహిత్యం; సంస్కృత మహాభారత అనువాదంతోనే శ్రీకారం చుట్టుకుంది. వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు, తత్త్వ గ్రంధాలు తెలుగులోకి అనువదించారు. సంస్కృత భాషా ప్రభావం వల్ల, సాంస్కృతిక ఆకర్షణ వల్ల ఇది జరిగింది. ఆంగ్లేయుల ప్రభావం వల్ల వాళ్ల ప్రసిద్ధ గ్రంధాలు, రచనలు, విమర్శలు తెలుగులోకి ప్రవేశించాయి.

విద్యార్థులకు అనువాద కౌశలాలు అవసరం. తద్వారా ఇతర దేశాలు ప్రాంతాలపై అభిమానం కలుగుతుంది. విశాల దృక్పథం కలుగుతుంది. విశ్వమానవులుగా రూపొందుతారు. కనుక ఉపాధ్యాయులు అనువాదాలు చదివి, విద్యార్థులకు వినిపించి ఈ కళలో ప్రవేశం కల్పించి అనువాద ఫలాలు విద్యార్థులకు అందించాలి!

**మూల్యాంకనం :**

1. "సమాజానికి దూరంగా భాష అభివృద్ధి కాదు" – ఎందువల్ల?
2. త్రిభాషా సూత్రాన్ని వివరించండి. అది జాతీయ సమైక్యతకు ఎలా దారి తీస్తుంది?
3. మాతృభాష విశిష్టతను వివరించండి.
4. భాషపై సంస్కృతి ప్రభావాన్ని తెలపండి.
5. బోధనా మాధ్యమంగా మాతృభాష ప్రాముఖ్యత ఏమిటి?
6. గ్రాంధికభాష అంటే ఏమిటి? గ్రాంధిక భాష లక్షణాలు ఏవి?
7. ఆధునికయుగంలో వ్యవహారిక భాష ప్రాధాన్యతను వివరించండి.
8. గ్రాంధిక భాషకు, వ్యవహారిక భాషకు భేధాలు తెల్పండి?
9. మాండలిక భాష అంటే ఏమిటి? మాండలికాలు ఏర్పడడానికి కారణాలు ఏవి?
10. మాండలికాల ప్రయోజనాలు తెలపండి.
11. ప్రామాణిక వాడుక భాష అంటే ఏమిటి? దాని లక్షణాలు తెలపండి?
12. తెలుగుభాషపై ఇతర భాషల ప్రభావాన్ని చర్చించండి.

**ఉపయుక్త గ్రంధ సూచిక :**


1. ఆంధ్ర భాషా వికాసం – ఆచార్య గంటిజోగి సోమయాజి
2. ఆధునిక తెలుగు భాషా శాస్త్ర విజ్ఞానం – ఆచార్య నేతి అనంతరామశాస్త్రి
3. భాషా శాస్త్రం – భాషా బోధన – డా॥ కె.వి.వి.యల్.నరసింహారావు
4. ఆధునిక భాషా సిద్ధాంతాలు – డా॥ పి.ఎస్.సుబ్రహ్మణ్యం
5. చేరాతలు – డా॥ చేకూరి రామారావు
6. Hand Book for Teacher Educators for D.E.Ed., A.P. SCERT - Co-ordinators Y.రాఘవరెడ్డి, ప్రిన్సిపాల్, DIET కర్నూలు G. నారాయణ లెక్చరర్
7. భాషా బోధన ఆధారపత్రం A.P. SCERT 2011 – A.P. SCERT
8. తెలుగు భాషా చరిత్ర – డా॥ భద్రిరాజు కృష్ణమూర్తి
9. భాష – సమాజం – సంస్కృతి – డా॥ భద్రిరాజు కృష్ణమూర్తి
10. ఆధునిక భాషా శాస్త్ర సిద్ధాంతాలు – ఆచార్య పి.ఎస్.సుబ్రహ్మణ్యం
11. తెలుగు భాషా సిద్ధాంతం, అనువర్తనం – మందలపు వి.రమణయ్య, కర్నాటి తోమాసయ్య
12. ప్రాథమిక స్థాయిలో భాష – భాషాభివృద్ధి – అవగాహన – డా॥ దహగం సాంబమూర్తిద

# యూనిట్ - 3 (అధ్యాయం- 3)
# సాహిత్యాధ్యయం - ఆవశ్యకత - అవగాహన

జుంటి తేనె కన్న; జున్ను మీగడ కన్న
తియ్యనైనదన్న తెలుగు భాష।
పదులు వందలేండ్ల పరిణామము గ్రహించు!
ప్రగతి తెలుగు బాట పరిమళించు !!

– కుందా

**పరిచయం :**

ప్రతి భాషలోనూ తనదంటూ ప్రత్యేకమైన సాహిత్యం ఉంటుంది. ఆ సాహిత్యం కాలానుగుణమైన మార్పులకూ, చేర్పులకూలోనై ఆధునికతను సంతరించుకుంటూ సజీవ స్రవంతిలా సాగిపోతూ ఉంటుంది. "హితేన సహితం సాహిత్యం". హితంతో కూడుకున్నది సాహిత్యం. సాహిత్యం సమాజానికి హితాన్ని చేకూర్చాలి. సాహిత్య లక్షణం ఏమిటో మహాకవి శ్రీశ్రీ నాలుగు మాటల్లో ఈ విధంగా చెప్పాడు.

"కదిలేదీ కదిలించేదీ
పాడేదీ పాడించేదీ
మారేదీ మార్పించేదీ
పెను నిద్దుర వదిలించేదీ
మునుముందుకు నడిపించేదీ
పరిపూర్ణమైన బ్రతుకిచ్చేది"

తెలుగు సాహిత్యంలో సుసంపన్నమైన సాహిత్యం ఉంది. ఉన్నతమైన సాహిత్య విలువలతో ప్రాచీన కాలం నుండి ఈనాటి వరకు కవులు, రచయితలు, చక్కని సాహిత్యాన్ని సృష్టిస్తూనే ఉన్నారు. తెలుగు సాహిత్యానికి గొప్ప చరిత్ర ఉంది. అభ్యుదయకరమైన పరిణామం ఉంది.

ప్రాచీన కవులు సాంప్రదాయబద్ధంగా రాసిన కావ్యాలు మన భాషకు పెన్నిధి వంటివి. అలాంటి కావ్యాలను గురించి, కవుల కవితారీతులను గురించి తెలుసుకొని మన విద్యార్థులకు సాహిత్య సాంస్కృతిక వారసత్వాన్ని అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులందరిపై ఉంది. ముఖ్యంగా తెలుగు అధ్యాపకులపై మరీ మరీ!

ఈ విశాల విశ్వంలో మారందంటూ ఏదీ లేదు. మార్పు జీవిత గమనంలో ఒక మలుపు. కాలానుగుణంగా వచ్చిన మార్పుకు అనుగుణంగా భాష, సాహిత్యం మాత్రమే కాదు – సమాస్తం మారేదే. ఉపాధ్యాయుడు కాలానుగుణమైన మార్పులకు స్పందించాలి, స్వాగతించాలి! లేకుంటే భాషకు మనుగడ లేదు.

"కాలం సవాల్ వంటిది
సాహసవంతుడు అందుకొని ముందుకు సాగిపోతాడు
సాగలేని పెద్దన్నయ్య చతికిలబడతాడు."

అంటాడు తన "అమృతం కురిసిన రాత్రి" కావ్యంలో దేవరకొండ బాలగంగాధర తిలక్. మరి కాబోయే ఉపాధ్యాయులుగా మీరు ఏ వర్గానికి చెందుతారో ఆలోచించుకోండి.

కవులు, రచయితలు తమ భావాలను, ఊహలను వ్యక్తం చేయడానికి, తద్వారా సమాజాన్ని వెలిగించడానికి ప్రజల ఆలోచనా సరళిలో మార్పు తేవడానికి రచనా వ్యాసంగంలో రకరకాల ధోరణులను అనుసరిస్తారు. వాటినే

సాహిత్య ప్రక్రియలు అంటారు. నన్నయ ఎంతటి 'ఆదికవి' అయినా ఆయన రాసినట్లే ఈ కాలంలో మనం రాయవలసిన అవసరం లేదు. అలా రాస్తే భాషకు, సాహిత్యానికి ప్రగతి ఉండదు. వైవిధ్యం ఉండదు. సాహిత్య సృష్టి కూడా ఎప్పుడూ ఒకే విధంగా ఉండాలని అనుకోవడం కూడా సరైన దృక్పథం కాదు. సృజనాత్మకమైన సాహిత్య సృష్టితోనే సమాజం మారుతుంది.

సృజనాత్మకత అంటేనే నూతనత్వాన్ని సంతరించుకున్న చైతన్యవంతమైన ఆలోచన! తెలుగు సాహిత్యంలో పద్యం వెయేళ్లపంట. పద్యరచనతో వెయ్యేళ్లపాటు విరాజల్లిన ఛందోబద్ధమైన తెలుగు సాహిత్యంలో ఆధునిక భావనలు చోటు చేసుకొని వైవిధ్యభరితమైన సరికొత్త సాహితీ ప్రక్రియల సృష్టికి దోహదం చేశాయి. ఇతర భాషా సాహిత్యాల ప్రభావంతో మన భాషలో కూడా సరికొత్త సాహిత్య ప్రక్రియలు ప్రవేశించాయి. మరీ ముఖ్యంగా ఆంగ్ల భాషా ప్రభావం వల్ల ఆధునీకీకరణ చెందని భాష లేదు. ఒక రకంగా చెప్పాలంటే సంస్కృతి లాగానే ప్రపంచ భాషలన్నీ పరస్పర ప్రభావితాయి. భాష సజీవంగా ఉండాలంటే వాగులూ, వంకలూ కలుపుకొనిపోయే జీవనదిలా నిరంతరం ప్రవహిస్తూనే ఉండాలి.

రోజులు మారాయి. రాజులు పోయారు. ప్రజా ప్రభుత్వాలు వచ్చాయి. ప్రపంచమంతా ప్రజాస్వామ్యానికి, సమసమాజానికి స్వాగతం పలుకుతున్న యుగమిది. మనం ఏ సమాజాన్నయితే కోరుకుంటున్నామో ఆ సామాజిక భావాలు సాహిత్యంపై ప్రభావం చూపుతాయి. మానవత్వం, స్వేచ్ఛ, సమసమాజం, అణగారిన ప్రజల పట్ల, స్త్రీల పట్ల, కష్టజీవుల పట్ల, ప్రత్యేకమైన స్పందన ఈనాటి కవితా వస్తువులు. మూఢనమ్మకాల పట్ల నిరసన, హేతుబద్ధమైన ఆలోచన, విశ్వజనీన విలువలు, వసుధైక కుటుంబ భావన – ప్రగతిశీల సమాజం ఇవన్నీ సాహిత్యపరంగా మనం చేరుకోవలసిన గమ్యాలు!

ఈ నేపథ్యంలో వెయ్యేళ్ల తెలుగు సాహిత్య చరిత్ర కొత్త దారులు తొక్కింది. సాహిత్యానికి ప్రాథమిక రూపం పాటే! జాతికి జీవననాళిక జానపద గీతిక. కష్టజీవులు తమ శ్రమను మరచిపోవడానికి పాట పాడుకున్నారు. పాటే రాను రాను గేయమై, పద్యమై, యక్షగానమై, వచనమై కథలుగా, నవలలుగా, నాటకాలుగా అనేక రూపాలు పొంది ఆధునికతను సంతరించుకుంటూ వివిధ సాహిత్య ప్రక్రియల సృష్టికి దోహదపడింది. సాహితీ వృక్షానికి కాసిన ఫలాలు సామాన్యుడికి కూడా అందాలి. ఈ ధ్యేయంతో వాడుక భాషలో మన కవులు, రచయితలు, అద్భుతమైన రచనలు చేస్తున్నారు.

కొన్ని వందల సంవత్సరాల పాటు సాంప్రదాయ కవిత్వం రాజ్యమేలినా తరువాతి కాలంలో కవుల భావుకత అభ్యుదయం కవిత్వం, దిగంబర కవిత్వం, విప్లవకవిత్వం, దళితవాద కవిత్వం, స్త్రీవాద కవిత్వం, మినీ కవితలుగా పరిణామం చెందుతూ వచ్చింది. గేయ కవిత్వం, వచన కవిత్వం, కథానికా ప్రక్రియ, నవలా ప్రక్రియ, పత్రికా రచన, వ్యాస ప్రక్రియ ఎన్నో కొత్త పుంతలు తొక్కాయి. ఉపాధ్యాయులు తెలుగు సాహిత్యంలో వచ్చిన ఈ నూతన ప్రక్రియలను కూడా ఆధునిక దృక్పథంతో అవగాహన చేసుకొని ఆస్వాదించవలసిన అవసరం ఉంది.

**లక్ష్యాలు :**

ఈ యూనిట్ చదవటం వలన

- సాహిత్య ప్రయోజనం తెలుసుకుంటారు.
- తెలుగు సాహిత్య ఆవిర్భావాన్నీ, ప్రాచీన సాహిత్య ఔన్నత్యాన్ని తెలుసుకుంటారు.
- సాహిత్య పరిణామ దశలను అర్థం చేసుకుంటారు.
- సాహిత్య చరిత్రలోని యుగాలను గురించి ఒక అవగాహనకు వస్తారు.
- తెలుగు భాషలోని సాహిత్య, సాంస్కృతిక వారసత్వాన్ని అర్థం చేసుకొని ప్రశంసిస్తారు.
- తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లోని వైవిధ్యాన్ని గ్రహిస్తారు.

- ప్రాచీన, ఆధునిక కవులు, రచయితల పట్ల గౌరవాభిమానాలను పెంపొందించుకుంటారు.
- విశ్వజనీన సాహిత్య దృక్పధాన్ని పెంపొందించుకుంటారు.
- వివిధ కవుల విభిన్న శైలులలోని అందచందాలను ఆస్వాదిస్తారు.
- ప్రాచీన, ఆధునిక, ఆంధ్ర తెలంగాణా ప్రాంత కవుల సాహిత్య ప్రతిభాపాటవాలను గౌరవిస్తారు.
- సాహిత్య రచనలు చేయడం పట్ల అభిరుచినీ, ఆసక్తినీ పెంపొందించుకుంటారు.
- ఉపాధ్యాయుడికి తెలుగు సాహిత్య చరిత్ర తెలియవలసిన అవసరాన్ని గుర్తిస్తారు.
- విద్యార్థులకు తెలుగు సాహిత్యం పట్ల అభిమానం పెంచడానికి కృషి చేస్తారు.
- సాహిత్యాన్ని; కవులను ఆరాధిస్తారు. తద్వారా సౌందర్యారాధనను ఆస్వాదిస్తూ మనిషిలోని మానవత్వాన్ని ప్రేమిస్తారు.
- విస్తార పుస్తక పఠనం విజ్ఞానానికి సోపానమని గ్రహిస్తారు.

**3.1 తెలుగు సాహిత్య చరిత్ర - యుగ విభజన :**

తెలుగు సాహిత్య చరిత్రను అనేక మంది విమర్శకులు అనేక విధాలుగా వర్గీకరించారు. ఒక కాలం నాటి సాహిత్య లక్షణాలను బట్టి; కవులను, వారి రచనలను ఆదరించిన రాజులను బట్టి, సాహిత్యంలో సరికొత్త ప్రయోగాలు చేసిన మహాకవుల ప్రాధాన్యతను బట్టి, ఆయా కాలాల్లో విలసిల్లిన ప్రక్రియా భేదాలను బట్టి రకరకాలుగా విభజించారు.

ఆధునిక సాహిత్యవేత్త "త్వమేవాహమ్" గ్రంథకర్త, తెలుగు చలన చిత్ర కళామతల్లిని తన అద్భుతమైన పాటల, మాటల పల్లకీలో ఊరేగించిన ప్రసిద్ధ రచయిత ఆరుద్ర "సమగ్ర ఆంధ్ర సాహిత్య చరిత్ర" అనే పేరుతో పంద్రెండు సంపుటాల గ్రంథ రచన చేసి సాహిత్యయుగ విభజన చేశారు. ఈయన తన తెలుగు సాహిత్య యుగ విభజనలో ఆయా కాలాలలో తెలుగు కవులను పోషించిన రాజుల కాలాన్ని ప్రామాణికంగా తీసుకొని "ఆదిమ చాళుక్యయుగం" నుండి ఆధునిక యుగం వరకు పన్నెండు యుగాలుగా విభజించారు.

అయితే ఆయాకాలాల్లో సాహిత్యాన్ని కొత్తదారులు తొక్కించి; తెలుగు సారస్వత సుందరిని నవనవోన్మేషంగా అలంకరించిన మహాకవులను బట్టి యుగ విభజన చేసిన పింగళి లక్ష్మీకాంతం గారి యుగవిభజననే ఎక్కువమంది విమర్శకులు ప్రామాణికంగా తీసుకున్నారు. మహాకవులంటే ఎవరు? తాము జీవించిన కాలంలో తమ అద్భుతమైన కవిత్వం ద్వారా ఏ కవులైతే సాహిత్య రథాన్ని కొత్త మార్గంలో నడిపించి తమ సమకాలికులైన ఇతర కవులపై తమ ప్రభావాన్ని చూపారో వారే మహాకవులు! ఆయా మహాకవుల సాహిత్య జీవన సరళిని బట్టి లక్ష్మీకాంతంగారు యుగ విభజన చేశారు. ఎక్కువమంది సాహిత్యకారులు ఆమోదించినది ఈ యుగవిభజనే మనం కూడా అనుసరిద్దాం.

తెలుగు సాహిత్యచరిత్ర - యుగాలు :

1. ప్రాఙ్నన్నయ యుగం - క్రీ.శ. 1000 వరకు
2. నన్నయ యుగం - క్రీ.శ. 1000 - 1100
3. శివకవి యుగం - క్రీ.శ. 1100 - 1125
4. తిక్కన యుగం - క్రీ.శ. 1225 - 1320
5. ఎర్రన యుగం - క్రీ.శ. 1320 -1400
6. శ్రీనాథ యుగం - క్రీ.శ. 1400-1500
7. రాయల యుగం - క్రీ.శ. 1500-1600
8. దక్షిణాంధ్ర లేదా నాయక రాజుల యుగం : క్రీ.శ. 1600-1775
9. క్షీణ యుగం - క్రీ.శ. 1775-1875
10. ఆధునిక యుగం - క్రీ.శ. 1875 నుంచి నేటి వరకు

పై యుగాలతో పాటు మనం మరో యుగాన్ని కూడా చేర్చుకోవాలి. అదే అత్యాధునిక యుగం! దీనినే "ప్రపంచీకరణ యుగం"గా కూడా పేర్కొనవచ్చు.

**3.2 తెలుగు సాహిత్య ఆవిర్భావం – వికాసం :**

తెలుగుదేశాన్ని మొట్టమొదట శాతవాహన రాజులు క్రీ॥శ. 225 వరకు పాలించారు. వీరి కాలంలో రాజ భాష ప్రాకృతం. పండితుల భాష సంస్కృతం. రాజులు; రాజోద్యోగులు, పండితులు, మతాచార్యులు తమ రాజకీయ వ్యవహారాలకు మత ప్రచారానికి సంస్కృత ప్రాకృత భాషలనే ఉపయోగించేవారు. శాతవాహనుల కాలంలో శాసనాలన్నీ ప్రాకృత భాషలోనే ఉండేవి. శాతవాహనుల తరువాత ఇక్ష్వాకులు, బృహత్పాలాయనులు, ఆనందగోత్రికులు, విష్ణుకుండినులు, శాలంకాయనులు, పల్లవులు, చాళుక్యులు తెలుగు దేశాన్ని పాలించారు. వీరి కాలంలో శాసనాలు కొన్ని ప్రాకృతంలోను మరి కొన్ని సంస్కృతంలోను ఉన్నాయి. వీటిలో ఊరిపేర్లు, వ్యక్తుల పేర్లు తెలుగుభాషలో ఉన్నాయి. నాటి శాసనాల్లో కనబడిన తెలుగు పదాలను బట్టి తెలుగు భాష జనుల వ్యవహారంలో ఉండేదని చెప్పవచ్చు.

నేడు మనకు కనిపించే అన్ని జాతుల ప్రజలకు వాగ్రూపమైన భాష ఉంది. వారి భాషల్లో లిపి లేకపోయినా వివిధ గేయాలు ప్రజలనోళ్లలో పలికాయి. ఏ భాషలోనైనా సాహిత్య పరిణామంలో గేయమే (పాట) ప్రాథమిక దశ. ఆ గేయంలోనే కవిత్వం యొక్క బీజాలుంటాయి. తెలుగులో కూడా ప్రాచీన కాలంలో గేయ కవిత్వం (పాట) సామాన్య ప్రజలనోళ్లలో పరవళ్లు తొక్కిందని భావించవచ్చు. కాబట్టి శాతవాహనుల కాలం నాటికే తెలుగు భాష ఉండేదని అందులో పాటలు ఉండేవని హాలుని గాథాసప్తశతి ఆధారంగా తెలుస్తుంది.

"చక్కగా దంచిన సన్న బియ్యపు వన్నెలాంటి వెన్నెల, తాను కోరుకున్న దాని కన్నా కొల్లగా పండిన పైరును పల్లె రైతు చూశాడు, ఆనందంలో ఇచ్చవచ్చినట్లు పాడుకొన్నాడని గాథాసప్తశతి" ఏడవ వందలోని 89వ గాథలో ఉంది. అలాగే 42వ గాథలో "పెళ్ళికూతురికి పెళ్ళి కడియాలు తొడిగించి పుని స్త్రీలు మంగళ గీతాలు పాడుతున్నారు". ఆ పాటలలో తనకు కాబోయే మగని పేరు అతని వంశం తీరు వర్ణిస్తూ ఉంటే వింటున్న పెళ్ళి కూతురికి ఒళ్ళు పులకరించిందట"! ఇలా ఆనాటి సాహిత్యం ప్రజలు పాడుకునే పాట రూపంలో ఉంది.

ఆనాటి ప్రజల వాడుకలో ఊయట పాటలు, జోలపాటలు, తుమ్మెద పదాలు, పడవ పాటలు, వెన్నెల పదాలు, దంపుళ్ల పాటలు, పెళ్లిళ్లకు సంబంధించిన నలుగు పాటలు, పెళ్లికొడుకు తరపున – పెళ్లి కుమార్తె తరపున వరసైన ఆడవాళ్లు ఒకళ్లనొకళ్లు ఎగతాళి చేసుకుంటూ పాడుకునే వరస పాటలు – ఇలా ఎన్నెన్నో ఉన్నాయి. ఆనాటి పాటలు ఛాయలు పక్కా పల్లెటూళ్లలో ఇప్పటికీ మనం చూడవచ్చు. ముఖ్యంగా అట్టడుగు వర్గాల్లో! ఆనాడు వివిధ కాలాల్లో వేయించిన శాసనాల్లో పద్యాలు, గద్యాలు (వచనం) మనకు ఆధారాలుగా నిలిచాయి. ఉదా: పండరంగని అద్దంకి శాసనం, కామసాని గూడూరు శాసనం మొదలైనవి. ఆనాటి పాటలు / పదాలు గ్రంథస్థం కాకపోయినా ప్రజల నోళ్లలో నానాయి. నేటికి నిలిచి ఉన్నాయి.

ఆనాటి శాసనాల్లో కనబడ్డ మొట్టమొదటి తెలుగు మాట "నాగబు". ఇది రమణీయ రాజధానిగా ఈనాడు మనం కొత్తగా రూపొందించుకుంటున్న అమరావతి నగరంలోని ఒక స్థూపం పైన రాయబడి ఉంది. ఇది క్రీ॥శ. 575 నాటి తెలుగు భాషలోని మొదటి శాసనం. అయితే మన తొలి తెలుగు పదం "నాగబు" ఉన్న స్థూపం అమరావతిలో లభించినా తెలుగు లిపిలో ఉన్న మొట్టమొదటి తెలుగు శాసనాలన్నీ రతనాల సీమ రాయలసీమలోనే దొరికాయి. క్రీ.శ. 6వ శతాబ్దం నాటికి దాని పేరు 'రేనాడు'. నేటి రాయలసీమలోని కర్నూలు, కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాలలోని కొన్ని ప్రాంతాలు. క్రీ.శ. 6,7,8 శతాబ్దాల్లో తెలుగులో గద్యంతో ఉన్న శాసనాలు కనిపిస్తాయి. చాళుక్య రాజైన గుణగ విజయాదిత్యుని కాలం క్రీ.శ. 848. ఈతని కాలం నుండి ఛందోబద్ధ శాసనాలు కనిపిస్తాయి. తెలుగు కవిత్వం శాసనాల ద్వారా శిలాక్షరమై నేటి దాకా నిలిచి ఉంది.

గుణగ విజయాదిత్యుని సేనాని పండరంగడు చేసిన దానాన్ని తెలిపే శిలాశాసనం అద్దంకి గ్రామ సమీపంలో ఒక పొలంలో లభించింది. దీనిని పండరంగని అద్దంకి శాసనం అంటారు. ఈ శాసనంలో 'తరువోజ' పద్యం ఉంది. దీనిని పద్యశాసనంగా భావించవచ్చు. విన్నకోట పెద్దన్న తన "కావ్యాలంకార చూడామణి"లో దంపుళ్ల పాటను ఉదహరించారు. ఆ పాటల్లో తరువోజ పద్యం ఉందన్నాడు. తరువాతి కాలంలో తరువోజ నుండి పుట్టిందే ద్విపద పద్యం. తరువోజ కంటే ద్విపదే ముందు పుట్టిందనే ఒక వాదం కూడా ఉంది. ప్రస్తుతం మనం అలాంటి వాదాలకు వెళ్లవలసిన అవసరం లేదు.

యుద్ధ మల్లుని బెజవాడ శాసనంలో ఐదు మధ్యాక్కరలు, కామసాని గూడూరు శాసనంలో మూడు చంపకమాలలు, రెండు ఉత్పలమాలలు లభించాయి. వీటన్నిటి ఆధారంగా నన్నయకు పూర్వమే తెలుగు సాహిత్య రచన జరిగి ఉంటుందని ఊహించవచ్చు. యుద్ధమల్లుని బెజవాడ శాసనం ద్వారా మనం తెలుసుకోవలసిన మరో విషయం ఏమంటే విజయవాడ అసలు పేరు బెజవాడ! విజయవాడ అనేది ఆధునికకాలంలో మనం పెట్టుకున్న పేరు. ఏది ఏమైనా ప్రాచీనత సంతరించుకున్న తెలుగు ఊళ్ల పేర్లను మనం మార్చకుండా ఉండడమే మంచిదేమో! ఇటీవల రాజమండ్రి పేరును దాని అసలు రూపమైన రాజమహేంద్రవరంగా మార్చడం ప్రశంసనీయమైన విషయం.

ఆనాటి కవితా రచనలో రెండు ప్రధాన పద్ధతులు ఉన్నాయి. 1. దేశి కవిత 2. మార్గ కవిత. సామాన్య ప్రజానీకానికి, జననానుడికి దగ్గరలో ఉండేది దేశి కవిత. ముఖ్యంగా పండితులను రంజింపచేయడం కోసం, వాళ్ల మెప్పు కోసం ప్రౌఢ విధానంలో రాయబడింది మార్గ కవిత. నన్నయ అనుసరించింది మార్గ కవితా పద్ధతి. ఆ తరువాత కాలంలో దేశికవితకు పట్టం కట్టింది శైవకవులు. ముఖ్యంగా పాల్కురికి సోమనాధుడు. ద్విపద కవిత్వం దేశి కవిత్వమే! ఉత్పల, చంపకమాలలు, శార్దూల మత్తేభాలు, మహాస్రగ్ధర లాంటి పద్యాలు మార్గకవిత్వానికి చెందినవి.

ఏది ఏమైనా మన తెలుగు వాళ్లు ఏటేటా పండుగ చేసుకోవలసిన రోజు మహాభారతం పుట్టినరోజు! అది నన్నయ భట్టారకుడు మహాకవిత్వ రచనకు శ్రీకారం చుట్టిన రోజు. రాజరాజ నరేంద్రుని కలలు ఫలించిన రోజు!

**3.3. సాహిత్యాన్ని ఎందుకు చదవాలి?**

- దేశ సంస్కృతీ, సాంప్రదాయాలను తెలుసుకోవడానికి, భావితరాలకు అందించడానికి.
- సాహిత్య ఆవిర్భావం, వికాసాలను హేతుబద్ధంగా అవగాహన చేసుకోడానికి
- ధర్మచింతన, ఆధ్యాత్మిక, నైతిక విలువలు పెంపొందించుకోడానికి
- భాష అంత సౌందర్యాన్ని ఆస్వాదించడానికి
- సమాజాన్ని జాగృతం చేయడానికి, సామాజిక విలువలు పెంపొందించడానికి
- మానసిక; రసాత్మక ఆనందాన్ని పొందడానికి
- వైవిధ్య భరితమైన ఆధునిక సాహిత్య ప్రక్రియలు సృష్టించడానికి
- సహృదయత కలిగిన సమాజాన్ని రూపొందించడానికి
- జాతికి హితం కలిగించడానికి, సాంస్కృతిక పరిరక్షణకు
- జ్ఞాన సముపార్జన ద్వారా, జ్ఞానపరిధిని విస్తరించడానికి
- వ్యక్తిత్వ వికాసానికి, మానవతా విలువలు రంగరించడానికి
- విశాలమైన ప్రాపంచిక దృక్పథాన్ని అలవర్చడానికి
- సృజనాత్మకతను ఆవిష్కరించడానికి

సాహిత్యాన్ని చదవాలి.

**3.4. తెలుగు భాషా సాహిత్యం – వివిధ ప్రక్రియలు :**

తెలుగు భాషా సాహిత్యాలకు క్రీ.శ 6వ శతాబ్దం ప్రారంభదశగా చెప్పవచ్చు. 6వ శతాబ్దం నుండి కనిపించిన శాసనాలలో తరువోజ, సీసం వంటి పద్యాలు, కొన్ని గద్య భాగాలు కనిపించాయి. నన్నయకు పూర్వం సామాన్య ప్రజలు చెప్పుకునే కథాసాహిత్యం, ఆనందోత్సాహాలతో పాడుకునే గేయ సాహిత్యం ఎక్కువగా ఉందని స్పష్టంగా చెప్పవచ్చు. ఆనాటి సాహిత్యంలో

"పాండవులు – పాండవులు తుమ్మెదా

పంచ పాండవు లోయమ్మ తుమ్మెదా" వంటి తుమ్మెద పదాలు, "ఎన్నియలో – ఎన్నియలో" వంటి వెన్నెల పదాలు, "గొబ్బియల్లో గొబ్బియల్లో దుక్కి దుక్కి దున్నారంట" వంటి గొబ్బి పదాలు, ఇంకా "రోకట వడ్లను దంచుతుండగా, చెమట నుదుటను తుమ్మెద లాడెను గోపాలా!" వంటి దంపుళ్లపాటలు, "పడవతోసే విధము కనరండీ హైలెస్సో, హైలెస్స" వంటి పడవ పాటలు, ఊయల పాటలు ఉండేవి. "ఏమి సంతమ్మా। ఇదేమి వింతమ్మా? ఈ కోమలాంగి కుందోల్లింట్లో కొత్తలు వింతలు జరిగిన వంట" పెళ్లిళ్ల నలుగు సందర్భంగా సరసాలాడుతూ పల్లెపడుచులు ఎగతాళిగా పాడుకునే వరుస పాటలు లాంటివి కూడా ఉండేవి. వీటి ఆధారంగా నన్నయకు పూర్వం తెలుగు భాషా సాహిత్యం గేయ రూపంలోనే ఉన్నట్లు తెలుస్తుంది. నన్నయ నాటి నుండి లిఖిత సాహిత్యం లభించింది. నాటి నుండి తెలుగు సాహిత్యంలో ముఖ్యమైన సాహిత్య ప్రక్రియలు గురించి తెలుసుకుందాం.

**3.4.1. జానపద సాహిత్యం :**

జనపదం అంటే పల్లెటూరు. జనపదాలలోని ప్రజలు తీరిక వేళల్లో, పండుగ సమయాల్లో, సంతోషం కలిగినప్పుడు; పనులు చేసే సందర్భాలలో పాడుకునే పాటలే జానపద సాహిత్యం. అప్రయత్నంగా ఆశువుగా పుట్టే ఈ పాటలకు కర్త ఎవరో తెలియదు. జానపద సాహిత్యం చాలా వరకు మౌఖిక సాహిత్యమే. కాలానికి కట్టుబడదు. మౌఖిక ప్రచారంతో జీవిస్తుంది. ఆనోట ఈ నోట పడి అనేక రూపాంతరాలు చెంది జనం నాల్కలపై నాట్యమాడుతుంది. జానపద సాహిత్యం లయబద్ధమైంది. జానపదులకు చదువు సంధ్యలుండవు. కలం; కాగితాల ప్రసక్తి లేదు. ఒక నోటి నుండి మరియొక నోటికెక్కుతుంది. ఒక చెవి నుండి మరియొక చెవికి సోకుతుంది. ఇది గేయరూపంలో ఉంటుంది. పాడుకోడానికి వీలుగా ఉంటుంది. జీవితానుభవాలు, పేదల బాధలు, వారి కష్టాలు, కడగండ్లు ఈ గేయాల్లో అంతర్లీనంగా ఉంటాయి. "ఏటికేతామెత్తి వెయిపుట్లు పండించి, ఎన్నడూ మెతుకెరగనన్నా, నేను గంజిలో మెతుకెరుగనన్నా" – తన బాధను మరిచిపోడానికి ఏ కష్టజీవి పాడుకున్నాడో! అందుకే శ్రీశ్రీ "జాతికి జీవననాళిక, జానపద గీతిక" అంటాడు. ఆచార్య బిరుదురాజు రామరాజు, నేదునూరి గంగాధరం, నాయని కృష్ణకుమారి, ఎల్లోరా వంటి వారు ఈ జానపద సాహిత్యంపై విశేష పరిశోధనలు చేశారు.

**3.4.2 యక్షగానం :**

యక్షులంటే జక్కులు. పండుగదినాల్లో జక్కుల్ని పిలిపించుకొని సంతానం కోసం పాటల్ని పాడించుకునే వారని ప్రతీతి. జక్కు జాతి వారు యక్షగానమే ప్రధాన వృత్తిగా జీవించేవారు. యక్షులు చేసే గానాన్ని యక్షగానం అంటారు. యక్షగానం స్వతంత్ర సాహిత్య ప్రక్రియ. యక్షగాన ప్రస్తావనను పాల్కురికి సోమన తన పండితారాధ్య చరిత్రలో చేశాడు. తాళ ప్రధానమైన రగడ బంధాలు; ద్విపదలు, అర్థచంద్రికలు, ధవళ శోభనాలు యక్షగాన ప్రక్రియకు చెందినవి. కాళీయమర్దనం, విప్రనారాయణ, రఘునాథాభ్యుదయం వంటి యక్షగానాలు విజయరాఘవ నాయకునిచే రచింపబడ్డాయి. యక్షగానం జనరంజకమైన దృశ్యకళ. తెలంగాణా రాష్ట్రానికి చెందిన ఆధునిక కవి చెర్విరాల భాగయ్య గారు చాలా యక్షగానాలు రాశారు. యక్షగానాలపై పరిశోధన చేసిన పండితుడు డాక్టర్ యస్వీ.జోగారావు.

### 3.4.3. పద్య ప్రక్రియలు :

ఛందోబద్ధమైన రచన పద్యం. తెలుగు సాహిత్యంలో పద్యం వెయ్యేళ్ల పంట. కవిత్వంలో పద్యం ఒక భాగమే కాని పద్యం రాయడమే కవిత్వం కాదు. చక్కని భావుకత, రామణీయత, ఉద్వేగాత్మకత కలిగిన ప్రతి రచన కవిత్వమే! నన్నయ, తిక్కన యుగానికి చెందిన ప్రాచీన కవులు పద్య రచనలకే ప్రాధాన్యమిచ్చారు. సంస్కృత పదభూయిష్టమైన మార్గకవిత్వ పద్ధతిని అనుసరించారు. ఈ పద్య ప్రక్రియలకు చెందిన వాటిలో ఇతిహాసాలు, కావ్యాలు, ప్రబంధాలు, శతకాలు, ఉదాహరణలు ప్రధానమైనవి. వీటిని గురించి తెలుసుకుందాం.

**ఇతిహాసాలు :** 'ఇలా జరిగింది' అని చెప్పేది ఇతిహాసం. ఇతి – హ – అస్తీతి, ఇతిహాసం. ఇతిహాసాల్లోని పాత్రలు మానవ జీవితాలను, వ్యక్తిత్వాలను ప్రతిబింబింపచేస్తాయి. రామాయణ, మహాభారతాలు ఇతిహాసాలు, సురాసురుల యుద్ధం, పారంపర్య ఉపదేశం, కళానుభవం గురించి చెప్పేది ఇతిహాసం. ఇవి ఎక్కువగా ప్రాచీన భావజాలానికి, పౌరాణిక కథనానికి పట్టం కడతాయి. భారత రామాయణ భాగవత ఇతిహాసాలు భారతీయ సంస్కృతికి దర్పణాలు!

**ప్రబంధాలు; పద్య కావ్యాలు :** "వాక్యం రసాత్మకం కావ్యం" అని విశ్వనాధుడు నిర్వచించాడు. రసాత్మకమైన వాక్యమే కావ్యమని అతని అభిప్రాయం. "రమణీయార్థ ప్రతిపాదక శబ్దం కావ్యం" అని జగన్నాధ పండిత రాయలు అన్నాడు. భారతీయ అలంకారికులు ఛందస్సును ప్రమాణంగా తీసుకొని సాహిత్యాన్ని పద్యకావ్యాలు, గద్యకావ్యాలు, చంపూ కావ్యాలుగా విభజించారు. ప్రదర్శన యోగ్యమైన వాటిని దృశ్యకావ్యాలనీ, శ్రవణ యోగ్యమైన వాటిని శ్రవ్య కావ్యాలనీ వేరొక విభజన ఉంది. పద్యకావ్యాలు పద్య ప్రక్రియకు చెందినవి. పద్య గద్యములతో కూడినవి చంపూ కావ్యాలు. రామాయణం, మహాభారతం చంపూ కావ్యాలకు ఉదాహరణ. దాదాపు మన ప్రాచీన పద్యకావ్యాలన్నీ చంపూ కావ్యాలే! పద్య కావ్యాలు నిబద్ధములు, అనిబద్ధములు అని రెండు విధాలు. ప్రకృష్టమైన బంధము కలిగి, విస్తృత, ఉదాత్తమైన ఇతివృత్తం గల కావ్యమే నిబద్ధ కావ్యం. దీనినే ప్రబంధం అని వ్యవహరిస్తారు. ప్రబంధం అంటే రచనా విధానంలోనూ, కథా వస్తువులోనూ, పాత్ర చిత్రణలోనూ, రసపోషణలోనూ, కొత్త రీతులు సంతరించుకున్న కావ్య ప్రక్రియ. ఏకనాయకాశ్రయం, వస్త్వైక్యం, నాటకీయత, అలంకారాలతో, అష్టాదశ వర్ణనలతో కూడి ఉంటుంది. ప్రబంధంలోని పద్యాలన్నీ పూలదండ సూత్రంలో బంధించబడి పువ్వుల్లా ఉంటాయి. ఆముక్తమాల్యద, మనుచరిత్ర, పాండురంగ మహాత్మ్యము, శృంగార నైషదము, వసు చరిత్ర మొదలగునవి ప్రబంధాలు. వీటిని పంచమహాకావ్యాలు అంటారు. ఈ కావ్యాల వైశిష్ట్యాన్ని మీ తెలుగు అధ్యాపకుని అడిగి తెలుసుకోండి.

**శతకములు :** అనిబద్ధ కావ్యాల్లో శతకాలు ప్రధానమైనవి. శతకం అంటే నూరు పద్యాల గ్రంథం. శతకంలో నూట ఆరుకాని, నూట ఎనిమిది కాని పద్యాలుంటాయి. భక్తి, నీతి, వైరాగ్యం, సాంఘిక దురాచారాలు, వ్యాజస్తుతి లాంటి అంశాలను తీసుకొని పద్యరచన చేస్తారు. ప్రతి పద్యానికి చివరి పదంగాని, చివరి పాదం గాని మకుటంగా ఉంటుంది. ఏ పద్యానికి ఆ పద్యం స్వతంత్ర భావం కలిగి ఉంటుంది. శ్రీకాళహస్తీశ్వర శతకం, కుమార శతకం, భాస్కర శతకం, సుమతీ శతకం, దాశరధి శతకం మొదలైనవి శతక సాహిత్యంలో పేరు గాంచినవి. మకుట నియమం, సంఖ్యా నిమయం కలిగిన తొలి తెలుగు శతకం వృషాధిప శతకం. ఆధునిక ఖండ కావ్యాలన్నీ అనిబద్ధ కావ్యాలే.

**ఉదాహరణ :** పద్య ప్రక్రియలో మరొక ప్రక్రియ ఉదాహరణ రచన. ఇది స్తోత్ర రూపమైన చిన్న కృతి. ఉదాహరణలో 26 పద్యాలుంటాయి. ఎనిమిది విభక్తులను వరుసగా గ్రహించి ఒక్కొక్క విభక్తితో ఒక వృత్తం, ఒక కళిక, ఒక ఉత్కళిక చొప్పున రచించాలి. ఇలా ఎనిమిది విభక్తులకు 24 పద్యాలు, సార్వ విభక్తిక పద్యం ఒకటి, కవినామాంకితాలతో ఉన్న పద్యం కలసి ఉదాహరణలో ఉంటాయి. ఉదాహరణలో పద్యాలు రాగతాళ ప్రధానాలు. పాల్కురికి సోమనాధుడు రచించిన "బసవోదాహరణం" మొదటి ఉదాహరణ రచన. రావిపాటి త్రిపురాంతకుని త్రిపురాంతకోదాహరణం, పెదతిరుమలార్యుని వేంకటేశ్వరోదాహరణం మొదలైనవి ఉదాహరణ ప్రక్రియలో పేరెన్నికగన్నవి.

**3.4.4. గద్య–ప్రక్రియలు :**

ఛందస్సుతో పనిలేకుండా స్వేచ్ఛగా కొనసాగే రచన గద్యరచన. గద్యాన్ని వచనమని కూడా అంటారు. పద్యరచనకున్న నిబంధనలు లేకపోవడం వలన గద్యరచనలో భావ ప్రకటన సులభం. అయినప్పటికీ పఠితలకు ఆనందాన్నీ, సంతృప్తినీ కలిగించే విధంగా గద్యరచన చేయడం చాలా కష్టం. "గద్యం కవీనాం నికషం వదన్తి" అని ఆర్యోక్తి! అంటే కవిప్రతిభకు గద్యమే అసలైన గీటురాయి. కాబట్టి గద్యరచనను సైతం పద్యంలాగా వినడానికి ఇంపుగా ఉండే విధంగా రాయడమే రచయిత ప్రతిభకు తార్కాణం! పాశ్చాత్య ప్రభావం వలన ఆధునిక యుగంలో గద్యానికే ఎక్కువ ప్రాచుర్యం లభించింది. గిడుగు రామమూర్తి వ్యవహారిక భాషా ఉద్యమం వలన గ్రాంధిక భాష అంతరించి వాడుక భాష అందలమెక్కింది. విమర్శ, నాటకం, నాటిక, నవల కథ, కథానిక, వ్యాసం, జీవిత చరిత్ర, స్వీయ చరిత్ర వంటి గద్య ప్రక్రియలతో వచన సాహిత్యం విస్తరించింది. ప్రస్తుత యుగంలో పద్య ప్రక్రియ కంటే వచన ప్రక్రియకు చదివించే తత్వం (Readability) ఎక్కువ. అందువల్ల నేటి దిన, వార, మాసపత్రిక లన్నింటిలోనూ కథలు, నవలలే ఎక్కువగా ప్రచురింపబడుతున్నాయి. వచన ప్రక్రియాలో ప్రధానమైన వాటిని గురించి తెలుసుకుందాం.

**విమర్శ :** విమర్శ అనగా ఒకరు చేసిన పనిలోని మంచి, చెడులను ఇంకొకరు వివేచించి తెలపడం. కావ్యాలలోని మంచి చెడ్డలను ఎత్తి చూపేది సాహిత్య విమర్శ. కవి లేక రచయిత ఆత్మను విమర్శకుడు గుర్తించగలగాలి. కట్టమంచి రామలింగారెడ్డి రాసిన 'కవిత్వ తత్త్వ విచారము' తెలుగు తొలి విమర్శ గ్రంథంగా చెప్పవచ్చు. కవిత్వానికి భావనా శక్తి ముఖ్యమవని వర్ణనలకు కథతో సంబంధం ఉండాలని, సామాజిక స్పృహతో ఉండాలని సి.ఆర్.రెడ్డి తన గ్రంథంలో చెప్పారు. కవిత్వాన్ని సమీక్షించేటప్పుడు కవి జీవితాన్ని కూడా పరిగణనలోనికి తీసుకోవాలని మరికొందరు అభిప్రాయపడ్డారు. అక్కిరాజు ఉమాకాంతం భావకవిత్వాన్ని విమర్శిస్తూ "నేటి కాలపు కవిత్వం" అనే గ్రంథాన్ని రాశాడు. మాచిరాజు దేవీప్రసాద్ పేరడీ కవిత్వంపై "వికట కవిత్వం" అనే వ్యాసం రాశాడు. విశ్వనాథ సత్యనారాయణ "నన్నయ కథా కవితార్థ యుక్తి", "అల్లసాని అల్లిక జిగిబిగి", "నాచన సోముని సంవిధాన శిల్పము"లను గురించిన రాసిన వ్యాసాలు ఎన్నో రహస్యాలను వెలికితీశాయి. ఎమెస్కో వారు ప్రచురించిన అనేక ప్రాచీన కావ్యాలకు విశ్వనాథ వారు రాసిన 'పీఠిక'లు సాహిత్య ప్రియులకు కరదీపికలు! జె.వి.సుబ్రహ్మణ్యం రససిద్ధాంతం ప్రాతిపదికగా అనేక వ్యాసాలు రాశాడు. డా.సి.నారాయణరెడ్డి "ఆధునికాంధ్ర కవిత్వం – సంప్రదాయములు – ప్రయోగములు" అనే సిద్ధాంత గ్రంథం రాశాడు. ఆధునిక కవిత్వానికి ఆద్యుడైన గురజాడ కవిత్వాన్ని, ఆయన నాటకం కన్యాశుల్కాన్ని సరికొత్త కోణంలో ఆవిష్కరించి "అడుగు జాడ గురజాడది" అనే పేరుతో శ్రీశ్రీ రాసిన గ్రంథం విమర్శనాత్మక రచనలో ఓ మైలురాయిగా గుర్తింపవచ్చు. తెలుగు సాహిత్యంలో విమర్శపుట్టి వంద సంవత్సరాలైనప్పటికి కవిత్వంపై జరిగినంత పరిశీలన ఆధునిక సాహిత్య ప్రక్రియలైన నవల, కథానిక వంటి వాటిపై అంతగా జరగలేదు. అయితే వివిధ దిన, వార, పత్రికల్లో వస్తున్న పుస్తక సమీక్షలు ఆ లోపాన్ని చాలా వరకు పరిష్కరిస్తున్నాయి.

**నాటకం :**

పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో రూపుదిద్దుకుందే ఆధునిక నాటకం. "నాటకాంతం – హి సాహిత్యమ్" అనడం వలన పూర్వులు నాటకానికి ఇచ్చిన ప్రాధాన్యత అర్థమవుతుంది. ఈ వ్యాఖ్యకు అర్థం ఏమంటే అన్ని ప్రక్రియల్లోనూ ఆరితేరిన తదుపరి నాటకరచన చేపట్టాలి. నాటక రచనా శిల్పం సాహిత్యానికి పరాకాష్ఠ అనవచ్చు. ఈ నాటకం దశవిధ రూపకాలలో ప్రధానమైనది. ప్రప్రథమంగా లెక్కించదగింది. వీర, శృంగార రసాలలో ఏదో ఒకటి ప్రధానంగా ఉండి, అయిదు అంకముల నుండి పది అంకముల వరకు గల దానిని నాటకంగా భావిస్తారు. దీనికి దృశ్య కావ్యమనీ, రూపకమనీ నామాంతరాలున్నాయి. ప్రారంభంలో తెలుగు నాటకాలలో ఎక్కువ అనువాదాలే

వచ్చాయి. ఆ తరువాత అనేక మార్పులు జరిగి నాటక రచయితలు అంకాలను వదిలేసి నాటకాన్ని రంగాలుగా విభజిస్తున్నారు. ఆంగ్ల నాటక కర్తలలో "షేక్స్పియర్" ప్రపంచ ఖ్యాతి నొందినవాడు. సంస్కృతంలోని విశాఖ దత్తుని 'ముద్రారాక్షసం' శూద్రకుని 'మృచ్ఛకటికం'లను తిరుపతి వేంకట కవులు తెలుగులోకి అనువదించారు. వీరు "పాండవోద్యోగ విజయాలు" అనే నాటకాన్ని కూడా రాశారు.

కోరాడ రామచంద్రశాస్త్రి రాసిన "మంజరీ మధుకరీయం" తెలుగు నాటకాలలో మొట్టమొదటి నాటకం కావచ్చునేమో కాని గురజాడ అప్పారావు రాసిన సాంఘికనాటకం "కన్యాశుల్కం" సజీవమైన వాడుకభాషలో, సామాజిక స్పృహతో సంఘ సంస్కరణ నేపథ్యంలో వచ్చిన మొట్టమొదటి ఆధునిక నాటకం.

సంఘ సంస్కరణ ఉద్యమంతో వెలువడిన నాటకాలలో ముఖ్యమైనవి కాళ్లకూరి నారాయణరావు 'వర విక్రయం', 'చింతామణి' పాలగుమ్మి పద్యరాజు 'రక్తకన్నీరు', కొప్పరపు సుబ్బారావు 'రోషనార', బలిజేపల్లి లక్ష్మీకాంతకవి 'సత్యహరిశ్చంద్ర', కందుకూరి వారి అనువాద నాటకం 'అభిజ్ఞాన శాకుంతలం', 'బ్రహ్మవివాహం', 'రత్నావళి' పేరుగాంచినవి. ఆధునికకాలంలో ఆత్రేయ రాసిన 'ఎన్.జి.ఓ.', 'కప్పలు', మోదుకూరి జాన్సన్ 'నటనాలయం', పి.వి.రమణ రాసిన 'చలిచీమలు', 'వెంటాడే నీడలు' పేర్కొనదగినవి. ఏదిఏమైనా తెలుగు నాటకానికి వాడుక భాషను అలవర్చినవాడు గురజాడ అయితే ఆధునికతను పరాకాష్ఠకు తీసుకువెళ్లినవాడు ఆచార్య ఆత్రేయ. సినిమా రచనలో ఆత్రేయ చూపిన నాటకీయశిల్పం, చాలా ప్రశంసనీయం. అయితే సంస్కృతంలో 'మృచ్ఛకటికం', తెలుగులో 'కన్యాశుల్కం' తర్వాత అంత గొప్ప నాటకాలు రాలేదని సాహిత్యకారుల అభిప్రాయం.


ఆచార్య ఆత్రేయ

**నాటిక :**

నాటక లక్షణాలే కలిగి రెండు లేదా మూడు అంకాలు కలిగింది నాటిక. ఇది నాటకం కంటే చిన్నది. మనిషి సంఘంలో ఎదుర్కొనే అనేక సమస్యలు వివరించడానికి నాటిక ఉపయోగపడుతుంది. రచయిత చెప్పదలచుకున్న విషయం సూటిగా, క్లుప్తంగా చెప్పడానికి నాటిక దోహదపడుతుంది. అందులోనూ సంఘర్షణలమయమైన ఈ ఉరుకుల పరుగుల జీవితంలో నాలుగైదు గంటల నాటకాన్నిచూసి ఆనందించే సమయం ఈనాటి మానవుడికి లేదు. అందుకు ప్రత్యామ్నాయంగా స్వల్ప వ్యవధిలో ప్రదర్శించేదే నాటిక అని చెప్పవచ్చు. నేడు ఏకాంకిను నాటికగా కూడా పిలుస్తున్నారు. గుడిపాటి వెంకటచలం రాసిన 'భానుమతి', జి.వి.కృష్ణారావు 'భిక్షాపాత్రిక', ముద్దుకృష్ణ రాసిన 'టీ కప్పులో తుఫాను', 'అనార్కలి', గణేష్‌పాత్రో 'పావలా', ఆదివిష్ణు, జంధ్యాల, గొల్లపూడి మారుతీరావు రాసిన అసంఖ్యాక నాటికలు తెలుగు ప్రేక్షకులను రంజింపచేశాయి. నాటకమైనా, నాటికైనా గిలిగింతలు పెట్టే హాస్యంతో, ఆలోచింపచేసే సంభాషణలతో, ఏదైనా సందేశం అంతర్లీనంగా ఉంటే ప్రేక్షకులు కలకాలం గుర్తు పెట్టుకుంటారు.

**నవల :**

ఆంగ్ల సాహిత్య ప్రభావం వలన తెలుగు సాహిత్యంలో ప్రవేశించిన వినూత్న ప్రక్రియల్లో ప్రధానంగా చెప్పదగింది నవల. కథానిక పరిమిత రూపమైతే నవల విస్తృతరూపం. వర్ణనా చమత్కారం, వైవిధ్యంతో కూడిన బహుపాత్రల చిత్రణ, ఆసక్తి దాయకమైన సన్నివేశ కల్పన, అద్భుత కథాసంవిధానం, సంభాషణచాతుర్యం నవలలో కనిపించే విషయాలు. నవలకు ఇతివృత్తం సాంఘికమైనా, చారిత్రకమైనా కావచ్చు. ప్రధానంగా సాంఘిక నవలల్లో ఒక ప్రాంతంలోని జీవన విధానాన్ని విపులంగా వివరించే సౌలభ్యం ఉంటుంది. పాత్రలు, సంఘటనలు, సమాజ స్థితిగతులు అన్ని కోణాల నుంచి చిత్రించే అవకాశం ఉంటుంది. మానవ సంబంధాలు ప్రత్యక్షంగా అనుభవించే విధంగా ఉంటాయి. కందుకూరి వీరేశలింగం గారి రాజశేఖరచరిత్రను మొట్టమొదటి నవలగా ఎక్కువ మంది సాహితీకారులు పేర్కొంటారు. ఇంగ్లీషు రచయిత ఆలివర్ గోల్డ్ స్మిత్ రాసిన "వికార్ ఆఫ్ వేక్‌ఫీల్డ్" నవలకు ఇది

తెలుగు స్వేచ్ఛానువాదం. విశ్వనాథ వారి "వేయిపడగలు", ఉన్నవ లక్ష్మీనారాయణ "మాలపల్లి", త్రిపురనేని గోపీచంద్ "అసమర్థుని జీవయాత్ర", బుచ్చిబాబు "చివరకు మిగిలేది", చలం "మైదానం", రావి శాస్త్రి "అల్పజీవి", కొడవటిగంటి కుటుంబరావు "చదువు", రావూరి భరద్వాజ "పాకుడురాళ్లు", రంగనాయకమ్మ "బలిపీఠం", వాసిరెడ్డి సీతాదేవి "మట్టి మనిషి" తెలుగులో వచ్చిన మంచి నవలలు. మొక్కపాటి వారి "బారిష్టరు పార్వతీశం", చిలకమర్తి గణపతి హాస్యనవలలు. అడవి బాపిరాజు "హిమబిందు", విశ్వనాథ వారి "ఏకవీర", తెన్నేటి వారి "చెంఘిజ్‌ఖాన్" మొదలైనవి చారిత్రక నవలలు. 1960–70 ప్రాంతంలో పురుషుల్ని అధిగమించి స్త్రీలు సాహిత్యవనంలో నవలల పంట పండించారు. వీరి నవలలు ఎక్కువగా సంసారినికి, ప్రణయానికి మాత్రమే పరిమితమైనా యుగయుగాలుగా స్తబ్ధంగా వున్న కాంతామణులు కలం పట్టడం ఒక శుభపరిణామమే! వీరు నవలలు రాయడం వల్ల పాఠకుల్లో పుస్తకాలు చదివే అలవాటు పెరిగింది. రచనా ప్రక్రియలో రచయిత్రులు సాధించిన ఘనత ఇది!

**కథ – కథానిక :**

ప్రాచీన సాహిత్యంలో నవల తరువాత పుట్టినవి కథ – కథానిక. ఇంగ్లీషులో "Short Story" కి సమానార్థకంగా వాడబడుతుంది.

కథలు మానవ జీవిత సంఘటనలను, సంబంధాలను, నీతి నియమాలకు ప్రతిబింబిస్తాయి. పంచతంత్ర కథలు, విక్రమార్క కథలు, జాతక కథలు లాంటివి ప్రాచీన కాలం నుండి ఉన్నాయి. ఇవి మానవ జీవితానికి అద్దం పడుతూ జీవిత విలువలను విశదపరుస్తాయి. కథ అనేది "మనకి జీవితంతో, జీవిత రహస్యంతో, జీవిత వైచిత్రితో కొంత కొత్త పరిచయం కలగజెయ్యాలి" అని బాలగంగాధర్‌తిలక్ అన్నాడు. శ్రీపాద సుబ్రమ్మణ్యశాస్త్రిని తెలుగు కథకుల్లో ప్రముఖులుగా చెప్పవచ్చు. వీరి 'వడ్ల గింజలు' చాలా గొప్ప కథ. 'మనుషులు చేసిన దేవుళ్లారా! మీ పేరేమిటి', 'మతము–విమతము', 'మెటిల్డా', 'సంస్కర్త హృదయం', గురజాడ వ్రాసిన గొప్ప కథలు. వేలూరి శివరామశాస్త్రి 'డిప్రెషన్ చెంబు' విలక్షణమైన కథ. విశ్వనాథ సత్యనారాయణ శాస్త్రి "ముగ్గురు బిచ్చగాళ్లు, మాక్సీ దుర్గంలో కుక్క" కథలు ప్రసిద్ధి చెందినవి. చలం రాసిన కథల్లో 'పాపం కళ్యాణి', 'ఓ పువ్వు పూసింది', 'కర్మమిట్లా కాలింది', 'కన్నీటి కాలువ' ముఖ్యమైనవి. కథల్లో చలం వాక్య నిర్మాణం, వచనంలోని పదజాలం చాలా పదునుగా వుంటాయి. బుచ్చిబాబు, రాచకొండ విశ్వనాథశాస్త్రి, కొడవిటిగంటి కుటుంబరావు, మధురాంతకం రాజారాం, గోపిచంద్ కథారచనలో చెయ్యి తిరిగినవారు. మునిమాణిక్యం నరసింహారావు 'కాంతం కథలు' తెలుగుదనం వెల్లివిరిసిననవ్వుల హరివిల్లు.

కథ కంటే చిన్నది 'కథానిక'. కథానిక అనే మాటను మొదట ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి ప్రయోగించాడు. కథానికకు సన్నివేశ చమత్కారం ప్రాణం. కథానికలలో సంఘటనలు ప్రధానమై ఉంటాయి. సంక్షిప్తత (Brevity) కథానికకు వుండవలసిన ముఖ్య లక్షణం. కథారచనలో శిల్పం ప్రధానం. అందుకే నవల రాయడం కంటే మంచి కథ రాయడమే కష్టం అంటారు విమర్శకులు. పాఠకుని హృదయంపై సంఘటనలు నిలిచిపోతాయి. క్లుప్తత, అనుభూతి, ఐక్యత, సంఘర్షణ, కొసమెరుపు కథానిక లక్షణాలుగా చెప్పవచ్చు. గురజాడ అప్పారావు రచించిన "దిద్దుబాటు"లో తెలుగు సాహిత్యంలో మొట్టమొదటి ఆధునిక కథ. రా.వి.శాస్త్రి, చాగంటి సోమయాజులు, పాటగుమ్మి పద్మరాజు తెలుగు కథను ప్రపంచస్థాయికి తీసుకువెళ్లారు.

**వ్యాసం :** 'వ్యాస' శబ్దానికి విస్తరించడం, విభజించడం అనే రెండు అర్థాలున్నాయి. ఇది కూడా ఆంగ్ల సాహిత్య ప్రభావంతో వెలసిన వచన ప్రక్రియ. ఆంగ్లభాషలోని "Essay" అనే మాటకు తెలుగులో "వ్యాసం" అనే పేరుతో పిలుస్తున్నారు. ఒక వక్త సభలో మాట్లాడిన ప్రసంగాన్ని తు.చ తప్పకుండా సమర్థవంతంగా ఉన్నది ఉన్నట్లు రాస్తే దానిని "వ్యాసం"గా పేర్కొనవచ్చు. అయితే వ్యాసాలన్నీ ఉపన్యాసాలు కావు సుమా! వ్యాసానికి మొదట్లో ప్రమేయం, ఉపన్యాసమనే పేర్లుండేవి.

సామినేని ముద్దు నరసింహం తన వ్యాసాన్ని 'ప్రమేయం' అనే పేరుతో పిలిచాడు. 'హితవాది' అనే పత్రికలో తన ప్రమేయాలు ప్రచురించాడు. గురజాడ అప్పారావు తన రచనలను వ్యాసాలన్నాడు. గురజాడ నుంచే వ్యాసం అన్న పేరు స్థిరపడింది. వ్యాసం సంగ్రహంగా ఉంటుంది. సూక్ష్మంలో మోక్షాన్ని చూపుతుంది. వ్యాస రచయితకు ప్రత్యేకమైన శైలి, అతని ముద్ర కనిపించాలి. వ్యాసం ప్రధానంగా ప్రారంభం, విషయ వివరణం, కొనసాగింపు; ముగింపు అనే భాగాలతో విస్తరించి ఉంటుంది. వర్ణనాత్మక వ్యాసాలు, ప్రబోధ వ్యాసాలు, విమర్శ వ్యాసములు, వైజ్ఞానిక వ్యాసాలు, తాత్త్విక వ్యాసాలు, పత్రికావ్యాసాలు, సాహిత్య వ్యాసాలు, చారిత్రక వ్యాసాలుగా "వ్యాసం" కనిపిస్తుంది. వివేకవర్ధిని, తత్త్వబోధిని, సత్యసంవర్ధిని, చింతామణి వంటి పత్రికలు అనేక వ్యాసాలు ప్రచురించి ప్రోత్సహించాయి. తెలుగులో పానుగంటి లక్ష్మీనరసింహం రాసిన 'సాక్షి' వ్యాసాలు చాలా ప్రసిద్ధి చెందాయి. లత, మాలతీచందూర్, నార్ల వెంకటేశ్వరరావు, నాయని కృష్ణకుమారి, రంగనాయకమ్మ, చేకూరి రామారావు, గొల్లపూడి మారుతీరావు, రావూరి భరద్వాజ వ్యాసాలు; చలం మ్యూజింగ్స్ భిన్నమైన పద్ధతిలో సాగిన వ్యాసాలుగా చెప్పవచ్చు. 'వ్యాసక్రీడలు' పేరుతో శ్రీశ్రీ రాసిన వ్యాసాలు సాహిత్యంలో గొప్ప విన్యాసాలు!

**జీవిత చరిత్రలు :**

ఒక మహా పురుషుని జీవితాన్ని ఇతరులకు తెలపడానికి రాసేది జీవిత చరిత్ర. ఇది కూడా పాశ్చాత్య సాహిత్య ప్రభావం వలన తెలుగులో వెలసిన సాహిత్య ప్రక్రియ. ఏ వ్యక్తి జీవిత చరిత్రను రాయడానికి సిద్ధపడతామో; ఆ వ్యక్తి యొక్క జీవన శైలి; ఆలోచనా సరళిలను, అతడు చేసిన గొప్ప కార్యాలను, చదివిన వారిలో ప్రేరణ కలిగించే విధంగా రాయడం జీవిత చరిత్ర రచనలోని ప్రధాన ఉద్దేశం. ఉదా : అంబేద్కర్ జీవిత చరిత్ర.

జీవిత చరిత్రల్లో సాహిత్యానికి, సాహిత్య చరిత్రకు ఉపయోగపడేవి కవుల చరిత్రలు. వీటితో పాటు సమాజాన్ని చైతన్యపరిచిన వ్యక్తుల జీవితాలను, రాజకీయనాయకుల, విప్లవ వీరుల చరిత్రలు జీవిత చరిత్రలుగా రాయడం జరుగుతుంది. జీవిత చరిత్రలు రాసిన వారిలో గొర్రెపాటి వెంకటసుబ్బయ్య, పురాణం సుబ్రహ్మణ్యం శర్మ మొదలైన వారు ప్రముఖులు. కేంద్ర సాహిత్య అకాడమి వారు ప్రసిద్ధ వ్యక్తుల మోనోగ్రాఫ్‌లు వెలువరించారు. అందులో గురజాడ, గిడుగు రామమూర్తి, శ్రీశ్రీ, చలం మొదలైన వారి జీవితచరిత్రలు వెలువడ్డాయి. ఇటీవల కాలంలో "మహానటి సావిత్రి" జీవిత చరిత్రను ఆమె జీవితంలోని అన్ని కోణాలను ఆవిష్కరిస్తూ ఒక రచయిత్రి నవలలా రాసిన జీవిత కథనం తెలుగు జీవిత చరిత్రా సాహిత్యంలో ఒక సంచలనం!

**స్వీయ చరిత్రలు :**

వ్యక్తి తన జీవితంలోని అనుభవాలు, జ్ఞాపకాలూ, సంభవించిన సామాజిక పరిణామాలు, మానవ సంబంధాలు, ప్రేరేణలు, సంఘర్షణలు తన జీవన దృక్పథాన్ని వివరిస్తూ తనకు తానుగా రచన చేయడాన్ని 'స్వీయచరిత్ర' అనవచ్చు. స్వీయచరిత్రను 'ఆత్మకథ' అని కూడా అంటారు. తెలుగులో స్వీయచరిత్రకు నేనే ఆద్యుడ్ని అని కందుకూరి వీరేశలింగం గారు ప్రకటించుకొన్నారు. కందుకూరి స్వీయచరిత్ర రెండు సంపుటాల్లో ఉంది. వారి స్వీయచరిత్ర ఆనాటి సాంఘిక వ్యవస్థను తెలుసుకోవడానికి ఉపకరిస్తుంది. తెలుగు ప్రజలు తమలోని దురాచారాలను, మూఢనమ్మకాలను తొలగించుకోవాలని, స్వాతంత్ర్యాన్ని ప్రయోజనవంతంగా అనుభవించే అర్హతను సంపాదించుకోవాలని, స్త్రీలు పరదాల నుండి బయటకు రావాలని, అందుకోసం సామాజిక సంస్కరణల్లో అందరూ భాగస్వాములు కావాలని ఆయన విన్నవించారు.

ఆయన మాటలు నేటికీ అనుసరణీయాలే! చిలకమర్తి లక్ష్మీనరసింహం స్వీయచరిత్ర ద్వారా 'తిలక్' మరణం నుండి స్వాతంత్ర్యం వచ్చే వరకు ఆంధ్ర దేశంలోని సామాజిక స్థితిగతులు తెలుసుకోవచ్చు. శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి "శ్రీ కృష్ణ స్వీయ చరిత్రం", శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి "అనుభవాలు – జ్ఞాపకాలు", దేవులపల్లి రామానుజరావు "ఏభై సంవత్సరాల జ్ఞాపకాలు", దాశరథి కృష్ణమాచార్యుల "యాత్రాస్మృతి" మొదలైనవి కొన్ని

ప్రముఖ స్వీయచరిత్రలుగా పేర్కొనవచ్చు. "నా కథ" పేరుతో పద్య కవితలో రాసుకున్న గుర్రం జాషువా స్వీయచరిత్ర; "అనంతం" పేరుతో ఎలాంటి దాపరికం లేకుండా రాసుకున్న శ్రీశ్రీ ఆత్మ చరిత్ర సాహితీచరిత్రలో కొత్త ప్రయోగాలు!

**యాత్రా చరిత్ర :**

ఒక వ్యక్తి తాను చేసిన యాత్రల అనుభవాలను ఆయా ప్రాంతాల విశేషాలను, వివరాలను కళ్ళకు కట్టినట్లు పఠిత హృదయాలను ఆకట్టుకొనేలా రచించడాన్ని యాత్రా చరిత్ర అంటారు. ఏనుగు వీరాస్వామి 'కాశీయాత్ర చరిత్ర', నాయని కృష్ణకుమారి 'కాశ్మీర దీపకళిక', ఎన్.గోపీ 'అమెరికా యాత్ర', హీరో అక్కినేని "నేను చూచిన అమెరికా" యాత్రాచరిత్రల్లో చెప్పుకోదగ్గవి.

### 3.4.5 సమకాలీన తెలుగు సాహిత్యం – ఆధునిక ప్రక్రియలు

పాశ్చాత్య దేశాలలోని సాహిత్య ధోరణులైన కాల్పనిక వాదం, మానవతా వాదం, ప్రతీకవాదం ప్రభావంతో తెలుగు కవులలో కావ్య రచనలలో నూతనత్వం సంతరించుకుంది. కొత్త పోకడలకు దారి తీసింది.

ఈ దారి రెండు మార్గాలుగా చీలింది. ఒక మార్గం రాయప్రోలు సుబ్బారావుదైతే; మరో మార్గం గురజాడ వారిది; రాయప్రోలు నడిచిన మార్గం భావ కవిత్వానికి బాటలు వేస్తే; గురజాడ వారి అడుగుజాడ అభ్యుదయ విప్లవ కవిత్వాలకు వెలుగుజాడగా మారింది. అందువల్ల ఆధునిక కవిత్వానికి గురుతుల్యుడు గురజాడ వారే. ప్రముఖంగా శ్రీ రాయప్రోలు సుబ్బారావు గారు ప్రారంభించిన కవిత్వాన్ని భావకవిత్వం అన్నారు.

**భావకవిత్వం :** "ఖండ కావ్యములు భావ ప్రధానములు" అని చెప్పిన శ్రీ విశ్వనాథ సత్యనారాయణ గారి అభిప్రాయం ప్రకారం "ఖండ కావ్యాలు ప్రధానంగా ఒక భావాన్ని ఆశ్రయించి ఉంటాయి" కనుక అలాంటి కవిత్వాన్ని భావ కవిత్వం అనవచ్చు. ఇంగ్లీషు కవుల ప్రభావంతో ప్రకృతి కవిత్వం; ప్రణయ కవిత్వం; అమలిన శృంగారం అనే భావనలను రాయప్రోలు సుబ్బారావు తెలుగులో ప్రారంభించారు. భావ కవిత్వ ఉద్యమానికి శ్రీ రాయప్రోలు ఆద్యుడుగా చెప్పవచ్చు. భావ కవిత్వంలో ప్రకృతి చిత్రణ, దేశ భక్తి, ప్రణయం; కవిత్వ వస్తువులుగా ఉంటాయి. అయితే భావకవిత్వాన్ని ఉన్నతస్థాయికి తీసుకువెళ్ళినవాడు దేవులపల్లి కృష్ణశాస్త్రి. ఈయన రాసిన కృష్ణపక్షం కావ్యం భావకవిత్వానికి మైలురాయి. దేవులపల్లి కృష్ణశాస్త్రి, నాయని సుబ్బారావు, అడవి బాపిరాజు, బసవరాజు అప్పారావులు, విశ్వనాథ సత్యనారాయణ, అబ్బూరి రామకృష్ణారావు, నండూరి సుబ్బారావు మొదలైనవారు భావ కవిత్వంలో మంచి కావ్యాలు రాశారు. 1940 వరకూ భావ కవిత్వం కొనసాగింది. నండూరి 'ఎంకి పాటలు'; నాయని సౌభద్రుని 'ప్రణయ యాత్ర'; విశ్వనాథ 'కిన్నెరసాని పాటలు'; రాయప్రోలు 'తృణకంకణం'; 'లలిత' భావ కవిత్వంలో చెప్పుకోదగ్గ కావ్యాలు. అయితే వీరి కవిత్వమంతా ప్రేమ; ప్రేయసి; విరహం; ప్రకృతి, స్వేచ్ఛ – వీటి చుట్టు మాత్రమే పరిభ్రమిస్తాయి.

**అభ్యుదయ కవిత్వం :** భావ కవిత్వం మీద తిరుగుబాటుగా అభ్యుదయ కవిత్వం వచ్చింది. తెలుగు కవులు, రచయితలు మార్క్సిజంను అవగాహన చేసుకోవడం ద్వారా అభ్యుదయ కవిత్వానికి బీజం పడిందని చెప్పవచ్చు. 1935లో ప్రపంచ రచయితల మహాసభ జరిగింది. అనేక దేశాల నుండి విభిన్న దృక్పథం గల రచయితలు పాల్గొన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో తెలుగు రచయితల్లో మార్క్సిస్టు భావాలు రచయితల హృదయంలో ముద్రపడ్డాయి. ఫలితంగా అభ్యుదయ రచయితల సంఘం ఏర్పడింది. సమ సమాజ సిద్ధాంతం ఈ కవిత్వానికి మూలం.

ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, సమానత్వం, పేదప్రజల పక్షాన నిలబడడం, మూఢనమ్మకాల నిరసన, స్త్రీల పట్ల, స్త్రీ విద్య పట్ల గౌరవ భావం అభ్యుదయ కవిత్వంలోని భావ జాలం. జమీందారీ వ్యవస్థలో కర్షకుల బాధలు, వారిని ప్రబోధించే గేయాలు, కార్మికుల దోపిడీని వర్ణించే రచనలు వెలువడ్డాయి. పట్టాభి "ఫిడీలు రాగాల డజన్" అనే కవితా సంపుటిని వచన పద్యాల రూపంలో రాశాడు. "నా ఈ వచన పద్యాలనే దుడ్డు కర్రల్తో పద్యాల

నడుములు విరగదంతాను" అంటూ తెలుగు ఛందస్సుపై దాడి చేశాడు. 1934లో వెలువడిన "మహాప్రస్థానం" గేయంతో అభ్యుదయ కవితా ఉద్యమం మొదలైందని చెప్పవచ్చు. ఈ గేయం అభ్యుదయ కవిత్వానికి భగవద్గీత లాంటిది. వస్తువుకు ప్రాధాన్యతనిస్తూ సరళత, స్పష్టత, ప్రబోధం, స్ఫూర్తిదాయకం, అభ్యుదయ కవితా ఉద్యమ లక్ష్యం. "మహా ప్రస్థానం" రచనతో సాహిత్యంలో కొత్త వరవడికి వాకిలి తెరిచాడు శ్రీశ్రీ. ఆయన తెరిచిన వాకిలి ఆ తరువాత కాలంలో ఆధునిక కవిత్వానికి 'సింహద్వారం'గా మారింది.

**దిగంబర కవిత్వం :** మసిపూసి మారేడుకాయ చేయడం కాకుండా సమాజాన్ని ఉన్నది ఉన్నట్లుగా నగ్నంగా చిత్రించాలనే సంకల్పంతో కొందరు అభ్యుదయ కవులు దిగంబర కవిత్వాన్ని ప్రారంభించారు. సామాజిక, సాహిత్య రంగాల్లో ఏర్పడ్డ స్తబ్ధతను తొలగించడానికి "షాక్ ట్రీట్‌మెంట్" పద్ధతిలో కనిపించే కవితలే దిగంబర కవిత్వం. జీవచ్ఛవాలుగా బతుకుతున్న ప్రజలను కోపగించుకుని, జుగుప్సాకరంగా తిట్టి, భయపెట్టి, బుజ్జగించి; మందలించే కవిత్వం దిగంబర కవిత్వం. ఆరుగురు రచయితలు కలిసి విచిత్రమైన కలం పేర్లతో దిగంబర కవిత్వాన్ని రాశారు. సమాజంలోని కుళ్లును విప్పి చెప్పాలనేది ఈ కవుల ఆలోచన. చెరబండరాజు, నగ్నముని, నిఖిలేశ్వర్, జ్వాలాముఖి దిగంబర కవుల్లో ముఖ్యులు. వీరిలో చెరబండరాజు సామాజిక స్పృహ వున్న గొప్ప కవి. ప్రజల కన్నీరు తెలిసిన కవి. బ్రతికుంటే ప్రజాకవిగా మాత్రమే కాదు, మహాకవిగా నిలిచేవాడు. "Angry Young Man of England"అను ఆంగ్ల కవుల ప్రభావము దిగంబర కవులపై ఉంది.


చెరబండరాజు

**విప్లవ కవిత్వం :** అభ్యుదయం, దిగంబర కవిత్వాల వల్ల ఫలితం లేదనీ, ఈ ఉద్యమాలు పేదప్రజలకు అందని గుంట పూలు పూస్తున్నాయనీ, సామాన్య ప్రజానీకానికి సూటిగా విప్లవం గురించి చెప్పాలనీ, అవసరం అయితే సాయుధ పోరాటమైనా చేపట్టాలనే లక్ష్యంతో విప్లవ కవిత్వం ప్రారంభమైంది. శ్రీశ్రీ దీనిని చాలా ఉన్నతస్థాయికి తీసుకెళ్ళారు. 1970 శ్రీశ్రీ షష్ఠి పూర్తి సన్మాన సభ రోజున విప్లవ రచయితల సంఘం (విరసం) ఏర్పడింది. విప్లవ రాజకీయాలను ప్రజల్లోకి సులువుగా తీసుకువెళ్లగలిగిన ప్రక్రియగా 'పాట'కున్న శక్తి వెల్లడైంది. తాము ఏ జనం మధ్య తిరుగుతున్నారో, వాళ్ల బాకీలను; నిర్మాణాలను; భాషా సంస్కృతులను పట్టుకొని రచయితలు పాటలు రాయడం; స్వయంగా పాడడం ప్రారంభించారు. వీరిలో ముఖ్యులు చెరబండరాజు, శివసాగర్, గద్దర్, వంగపండు ప్రసాద్ తదితరులు. విప్లవ రాజకీయం కథకు, నవలకు కూడా వస్తువైంది. రాచకొండ విశ్వనాథశాస్త్రి, కాళీపట్నం రామారావు, భూషణం, అల్లం రాజయ్య విప్లవాన్ని భూమికి చేసుకోని అద్భుతమైన కథలు రాశారు. సాహిత్యాన్ని విప్లవ సాహిత్యంతో సహా కలిపి మొత్తంగా చూడకపోతే (Gesta ttoview) తెలుగు సాహిత్యానికి సంపూర్ణత, సమగ్రత లేదు.

**దళిత వాద కవిత్వం :**

ప్రజాస్వామ్య ప్రభుత్వంలో కూడా దళితులు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారు. వారి సమస్యలను ప్రతిబింబిస్తూ దళితులలో చైతన్యాన్ని కలిగించడానికి వెలువడిన సాహిత్యమే దళితసాహిత్యం. 1969 నుండి దళిత సాహిత్యం అనే పదం విస్తృత వ్యవహారంలోకి వచ్చిందని చెప్పవచ్చు. దళిత సాహిత్యం వచనంలో, పద్య గేయ కవిత్వంలో కనిపిస్తుంది. దళితుల సమస్యను చిత్రించిన తొలి భారతీయ నవల "అన్‌టచ్‌బుల్". దళితుల సమస్యలను కవిత్వంలో ప్రతిబింబింప చేసిన తొలి తెలుగు దళిత కవి "గుర్రం జాషువా". దళిత తాత్వికతకు అంబేద్కర్ ఆలోచనా విధానమే ప్రాతిపదిక! దళితుల జీవితానుభవాల నుండి, అది సృజింపబడడం దళిత సాహిత్యానికి గీటురాయి. దళితవాద కవిత్వానికి ప్రాతినిధ్యం వహించగల కవులు సతీష్‌చంద్ర (పంచమవేదం), ఎండ్లూరి సుధాకర్ (వర్తమానం), బొజ్జా తారకం, కత్తి పద్మారావు, మద్దూరి నగేష్‌బాబు, కొలకలూరి ఇనాక్ (ఆకలి), చల్లపల్లి స్వరూపరాణి, 1980లోనే కుందా భాస్కరరావు రాసిన 'సువర్ణం' కథ కుల సమస్య పైన ఎక్కుపెట్టిన బాణం! సవర్ణాన్ని 'సువర్ణం' మార్చిన ఈ కథ పాఠకులను ఆలోచింపచేసింది.

**స్త్రీ వాద కవిత్వం :**

ఫ్రెంచి విప్లవం కారణంగా మానవహక్కుల చైతన్యం ప్రారంభమై స్త్రీల హక్కుల ఉద్యమం ప్రబలింది. స్త్రీ వాదం ఒక క్రమపరిణామంలో ఎదుగుతూ స్త్రీ వాద కవిత్వం ఆవిర్భవించడానికి కారణమైంది. స్త్రీ వాద కవిత్వం ప్రధాన లక్ష్యం పురుషాధిక్యతను ప్రశ్నించడం. పురుషులతో పాటు సమానమైన అవకాశాలు, నైపుణ్యాలు ఎందుకు అందుబాటులో లేవో స్త్రీలు తెలుసుకోగలిగారు. తెలుగు సాహిత్యంలో 1960 నాటికి స్త్రీ వాద సాహిత్యానికి ఒక స్పష్టమైన రూపం ఏర్పడింది. కవిత్వ రూపంలో ప్రారంభమై కథానిక, నవలల వరకు విస్తరించింది. స్త్రీల వైపు నుండి ఆలోచిస్తూ ముందుగా నవలలూ; కథలూ రాసిన రచయిత్రి రంగనాయకమ్మ. 'జానకి విముక్తి', 'అమ్మకు ఆదివారం లేదా?' ఈమె రచనలు. జయప్రభ, కొండేపూడి నిర్మల, విమల, జయ, ఈశ్వరి, సావిత్రి, ఓల్గా, మందరపు హైమావతి, గీత, పాటిబండ్ల రజని, కుప్పిలి పద్మ, రేవతి మొదలైనవారి రచనలు మహిళా వాదానికి మణిదర్పణాలు!

**మినీ కవిత :**

వచన కవిత్వంలో అస్పష్టత, అనవసరమైన పొడగింపు లేకుండా 1978-1985 మధ్యకాలంలో మినీ కవిత ఎక్కువగా యువకుల్ని ఆకర్షించింది. అద్దేపల్లి గారి అభిప్రాయం ప్రకారం వచన కవిత యవ్వన రూపం "మినీ కవిత". "వచన కవితకు సంక్షిప్త రూపమే మినీ కవిత" అంటారు టి.ఎల్.కాంతారావు. తక్కువ మాటల్లో ఎక్కువ భావం వచ్చేలా రాయడమే మినీ కవిత ప్రత్యేకత.

మినీ కవితకు ప్రాథమిక రూపం శ్రీశ్రీ 'మహాప్రస్థానం'లో కన్పిస్తుంది.

ఆః అనే శీర్షిక గల గేయంలో -

నిప్పులుకక్కుతూ నింగికి నేనెగిరిపోతే
నిబిడాశ్చర్యంతో వీరు!
నెత్తురు కక్కుతూ నేలకు నే రాలిపోతే
నిర్దాక్షిణ్యంగా వీరే!
- అంటాడు శ్రీశ్రీ.

"కాళ్ళు తడవకుండా
సముద్రాన్ని దాటగల మేధావియైనా
కళ్ళు తడవకుండా
జీవితాన్ని దాటలేడు" వసీరా రాసిన మినీ కవిత తాత్విక చింతనను వెల్లడిస్తుంది.

**అక్షర నక్షత్రాలు**

ఆకాశం పలక మీద ఆదిదేవుడు దిద్దిన
అందమైన అక్షరాలు - నక్షత్రాలు!
నక్షత్రాలకు మల్లే అక్షరాలు స్వయం ప్రకాశకాలు!
అవి వెల్గుతాయి! అందరినీ వెల్గిస్తాయి.
- కుందా భాస్కరరావు రాసిన మినీ కవిత అక్షర దీపాలు వెలుగిస్తుంది.

హైకూలు, నానీలు మినీ కవితకు మరో రూపాలు. హైకూకి మూలం జపాన్‌లోని జెన్ సిద్ధాంతం. తెలుగు హైకూ సుమారు 17 అక్షరాలు; మూడు పాదాలు కలిగి ఉంటుంది.

"బియ్యం చల్లడం కూడా / పాపమే / కోళ్ళు తన్నుకుంటున్నాయి. హైకూల తరువాత వచ్చిన కొత్తరూపం నానీలు. మినీ కవితలకి కొన్ని కొత్త లక్షణాలను పెట్టి నానీలకు ప్రతిపాదించారు ఆరాచ్య ఎన్.గోపి. ప్రధానంగా

20–25 అక్షరాలతో నాలుగు పాదాలతో ఉంటుంది. సాధారణంగా నానీలలో చాలా వరకు రెండేసి పాదాలు ఒక భావాంశంగా ఉంటుంది. మొదటి రెండు పాదాలలో భావానికి తరువాతి రెండు పాదాలు సమర్ధపూరకంగా లేదా దృష్టాంతంగా ఉంటాయి. నానీలను మొదట రాసిన వారు గోపీ హైకూల కన్నా సమర్ధంగా ఉండాలనే లక్ష్యంతో గోపి నానీలను సృష్టించారు.

"రొయ్య మడమల కింద
భూమాత కళేబరం
వల వేస్తే
డాలర్లే పడ్డాయి"
"కుండ ముక్కలైందా
కుమిలిపోకు
మట్టి మరో రూపం కోసం
సిద్ధమవుతుంది" వంటి గోపి నానీలు ఎందర్నో ఆకర్షించాయి. ఎన్.రఘు, వెంకటేశ్వరరెడ్డి, శిరీష, నల్లా నరసింహమూర్తి మొదలైన వారు నానీలను సృష్టిస్తున్నారు.

**మైనారిటీ కవిత్వం :**

ఆధునిక కవిత్వ ప్రక్రియల్లో మరో కొత్త రూపం మైనారిటీ కవిత్వం. 2001లో వెనుకబడిన వర్గాల కవిత్వంగా ఒక కవితా సంకలనం వెలువడింది. ఈ కవితా సంకలనంలో ఇరవై ముగ్గురు బిసి కవుల కవితలున్నాయి. "స్పృహ" అనే సాహితీ సంస్థ ఆధ్వర్యంలో 'వెంటాడే కలాలు' అనే మరో కవితా సంకలనం వెలువడింది. ఈ కవితా సంకలనంలో కవితలు వ్రాసిన వారిలో ఎన్.గోపి, నాళేశ్వరం శంకరం, సీతారం వంటి కవులున్నారు.

# 3.5. ప్రాచీన తెలుగు సాహిత్య కవులు - రచనలు - శైలులు
## (ఆంధ్ర, తెలంగాణ ప్రాంత కవులు / రచయితలు)

**అ) నన్నయ :** 11 వ శతాబ్ధి నాటికి కీకారణ్యంలా వున్న తెలుగు భాషకు ఒక చక్కని దారి యేర్పరిచాడు నన్నయ. ఆ రోజుల్లో రాజమహేంద్రవరం రాజధానిగా చేసుకొని తెలుగుదేశాన్ని పరిపాలిస్తున్న రాజరాజనరేంద్రునికి ఒక చక్కని ఆలోచన వచ్చింది. తెలుగు సాహిత్య వికాసానికి అది శుభఘడియ అనవచ్చు. సంస్కృతంలో ఉన్న మహాభారతాన్ని తెలుగులో రాయించి సామాన్య ప్రజానీకానికి కూడా మహాభారత కావ్యాన్ని చదివే అవకాశం కలిగించాలని ఆయన భావించాడు. సంస్కృత మహాకావ్యాన్ని తెలుగులో అనువదింపచేయడమంటే మాటలా? అందుకు సమర్థుడైన కవికావద్దూ? అప్పుడు రాజరాజనరేంద్రుని మనస్సులో తళుక్కున మెరిశాడు నన్నయభట్టారకుడు! మరునాడే నిండు సభలో తన మనస్సులోని కోరికను వెల్లడించి నన్నయకు చందన తాంబూలాలు సమర్పించాడు. నన్నయ మహాభారత రచనకు పూనుకునేటప్పటికి తెలుగుభాషలో సరైన పదజాలం లేదు. అందుకే ఆయన 'ఆంధ్ర శబ్ద చింతామణి' అనే వ్యాకరణ గ్రంథాన్ని రాశాడు. తెలుగులో మొట్టమొదటి వ్యాకరణ గ్రంథం అదే! ఆ కారణం వలన ఆయనను మనం వాగనుశాసనుడు (శబ్ధశాసనుడు) అంటాము. 'వందేవాగనుశాసనం' అని అంజలి ఘటిస్తాము. ఆయన కవిత్వంలో 80శాతం సంస్కృత పదాలు, కేవలం స్వల్ప శాతం మాత్రమే తెలుగు పదాలు కనపడతాయి. నన్నయశైలిని 'కథనశైలి' అంటారు. కథను చాలా అందంగా చెబుతాడు నన్నయ. మహాభారతంలో ఆయన రాసిన పర్వాలు ఆదిపర్వం, సభాపర్వం, అరణ్యపర్వంలోని సగభాగం.

'ఆదికవి' బిరుదు ఆయనకు సార్థకం. పద్యరచనలో ఆయన ఒరవడి ఆ తర్వాత కవులకు మార్గదర్శకమైంది. "సారమతింగవీంద్రులు" పద్యం ద్వారా నన్నయ "ప్రసన్న కథాకలితార్థయుక్తి", "అక్షర రమ్యత", "నానారుచిరార్థసూక్తి నిధిత్వం", తన కవితా లక్షణాలుగా పేర్కొన్నాడు. నన్నయది ఆఖ్యానశైలి. "ప్రసన్న కథాకవితార్థయుక్తి" అనగా ప్రసన్నములైన కథల యందు గూర్చబడిన అర్థముతో కూడినది. అలాగే అక్కడక్కడ అలంకారాలతో; అప్రధానంగా వృత్యానుప్రాసాలంకరాలతో వర్ణించి అక్షర రమ్యతను చాటుకున్నాడు.

**ఆ) పాల్కురికి సోమనాథుడు :**

12వ శతాబ్ధంలో మతోన్మాదం రాజ్యం చేసింది. హైందవ మతంలో వైష్ణవం, శైవం అనే రెండు చీలికలు వచ్చాయి. విష్ణువు తప్ప వేరే దైవం లేదు, హరియే సర్వస్వం అనేవారు వైష్ణవులు. శివుడే సమస్తం, ఆయన కంటే అధికుడు లేడు అని ప్రగాఢంగా విశ్వసించేవారు శైవులు. ఆకాలంలో శైవులకు, వైష్ణవులకు మధ్య మతపరమైన విభేధాలు పరాకాష్టకు చేరాయి. శివుడు తప్ప ఇతర దైవం గిట్టని వారిని వీరశైవులు అంటారు. ఈ వీరశైవాన్ని ప్రచారం చేయడంలో సాహిత్యం కూడా ప్రధానపాత్ర వహించింది. ఈ ధోరణి మంచిది కాకపోయినా కొందరు మహాకవుల అనితరసాధ్యమైన భావనాశక్తి వలన కొత్త సాహిత్యానికి అది దారి తీసింది. వీరశైవ మత ప్రచారానికి కవిత్వాన్ని మొట్టమొదట ఆయుధంగా వాడిన కవి "పాల్కురికి సోమనాథుడు".

పాల్కురికి సోమన (క్రీ.శ. 1160-1230) ప్రాంతం వాడు. సంస్కృతం, ఆంధ్రం, కన్నడ భాషలలో గొప్ప పండితుడు. ప్రస్తుత తెలంగాణా రాష్ట్రంలోని వరంగల్ సమీపంలోని పాల్కురికి అనే గ్రామానికి చెందినవాడు. పాల్కురికి సోమన వీర శైవ కవి.

బసవ పురాణం, వృషాధిపశతకం, చతుర్వేద సారం, పండితారాధ్య చరిత్ర, ఉదాహరణలు, పంచకాలు, అష్టకాలు మొదలగునవి సోమన రచనలు. అచ్చ తెలుగు పదాలను, తన కవిత్వంలో చొప్పించి అచ్చమైన తెలుగు ఛందస్సుకు పట్టం కట్టాడు. 'బసవరగడ' తెలుగు ఛందోరీతిని ప్రారంభించాడు.

నన్నయ తెచ్చిన మార్గ కవితావిధానం ప్రక్క దారి పట్టింది. దేశికవిత పూలు పూచింది. శైవ మతభావాలు

ప్రజల్లోకి సూటిగా వెళ్లాలనే సంకల్పంతో పాల్కురికి సోమనాధుడు ద్విపద కవితాబాణిలో, ప్రజల వాణిలో మహాదేవుడు శివుడి పట్ల వీరారాధనతో జాను తెనుగులో జామపండు లాంటి దేశికవిత్వాన్ని అనుసరించాడు. జనసామాన్యంలో శైవమతాన్ని పరవళ్లు తొక్కించాడు. శైవ కవితాయుగానికి కర్తగా మారాడు. తాను నమ్మిన శివుని పట్ల ఆయన ఆరాధనాభావం, బావుకత, చిన్న చిన్న పదాలతో గుండెలు పులకరించేలా ఆయన చేసిన ప్రయోగాలు ఆ కాలంలోని కవులను ఎంతో ప్రభావితం చేసాయి. సోమనాధుడు పాత్ర చిత్రణలో అందెవేసిన చెయ్యి. సామాన్య ప్రజానీకానికి అత్యంత సన్నిహితంగా ఉంటాయి. బసవ పురాణంలోని గొడగూచి, బెజ్జమహాదేవి, కన్నప్ప, సిరియాళుని కధలలోని పాత్రలే ఇందుకు ఉదాహరణలు. "అల్పాక్షరములలో అనల్పార్థ రచన" ఇతని మరో కవితా గుణం. ఆనాటి కవితా ప్రక్రియల్లో చాలా వాటికి ఆయనే ఆద్యుడు. అంతులేని కవితావేశం ఈయన సొత్తు. ఈ కవితావేశమే శైవారాధన వైపు ప్రజలను ఉరుకులు పెట్టించింది. అందుకే ఆయన పాల్కురికి!!

**ఇ) నన్నెచోడుడు :**

నన్నెచోడుడు వస్తు కవితా వన్నెచోడుడు! వస్తు కవితను గురించి ప్రస్తుతించిన తొలికవి. క్రీ.శ.1160 ప్రాంతమునకు చెందినవాడు. కావ్యగుణముచే వాఙ్మయమునకు అలంకారము కాదగిన ప్రబంధమును రాసి శైవులకి, ఇతరులకు కూడా కవిగా ఆదర్శపాత్రుడయ్యాడు. ఈయన శివకవియుగానికి చెందినవాడైనా హరిహరభేదం పాటించిన కవి. విష్ణు, మహేశ్వరులు ఇరువురికీ సమప్రాధాన్యం ఇచ్చాడు. మత ప్రచారానికి చోటివ్వని మహాకవి. ఇతని ప్రబంధం "కుమార సంభవము" మొదటి ప్రబంధమని కొందరి అభిప్రాయం. నన్నెచోడుడు నన్నయకు ముందవాడని కొందరు, తరువాతి వాడని కొందరు అభిప్రాయపడుతున్నారు. నన్నయ, తిక్కనలకు నడిమి కాలము వాడని చెప్పవచ్చు. ప్రబంధ రచనకు నన్నెచోడుడు ప్రధముడని కూడా అంటారు. కేవలం శైవులకే కాకుండా అన్ని వర్గాల వారికి ఆదర్శప్రాయుడయ్యాడు. ఈయన జాను తెనుగు పద ప్రయోగకర్త. జాను తెనుగు అంటే "జన సామాన్యంలో వ్యవహారంలో ఉన్న తెలుగుభాషలోని స్వభావ సిద్ధంగా వాడే సంస్కృత సమాసాలు, దేశీపదాలతో కూడిన మనోహరమైన, సరళమైన, ప్రసన్నమైన తెలుగు".

నన్నెచోడుడు వన్నెచిన్నెలు చిందు వస్తు కవీశ్వరుడుగా కుమారసంభవ ప్రబంధ రచనతో "కవిరాజ శిఖామణి"గా ప్రస్తుతింపబడ్డాడు. వస్తు కవిత అంటే మంచి కథావస్తువు కలిగి రసబంధురంగా చేసే రచన. ప్రబంధ లక్షణాలు ఏమిటో తొట్టతొలుత చెప్పిన కవి నన్నెచోడుడే!

కుమార సంభవం 12 ఆశ్వాశాల ప్రబంధం. తిక్కనాది కవుల రచనల్లో తర్వాత కానవచ్చే, షష్ఠ్యంతములను తెలుగులో మొదట వ్రాసిన కవి ఇతడే. నన్నెచోడుడు ప్రయోగించిన సామెతలు, పలుకుబళ్లు, తెలుగు జాతీయతకు; దేశీయతకు అద్దం పడతాయి.

అష్టాదశ వర్ణనలకు కుమారసంభవం మేలిబంతి. వర్ణనలపై నన్నెచోడునికి మక్కువ ఎక్కువ. తిక్కన మహాభారత యుద్ధ వర్ణనలకు ఇతని కావ్యమే మూలం! ఆనాటి సాంఘికాచారాలు కూడా ఇతని సాహిత్యంలో ఎడనెడ దర్శనమిస్తాయి.

దేశీకవిత, మార్గకవిత, వస్తు కవిత, పదాలను తెలుగు కవితాకన్యకు మొదట పరిచయం చేసినవాడు నన్నెచోడుడు! ఇతడు అర్ధశబ్దాలంకార ప్రియుడు. నన్నెచోడుని కవితలో మన ప్రాచీన తల్లి భాషయైన ద్రావిడ భాషలోని ఎన్నో పదాలను చూడవచ్చు. ఏది ఏమైనా తెలుగు సాహిత్యంలో నన్నెచోడుడు "కుమార సంభవం" ఎప్పటికీ వసివాడని పరిమళభరితమైన పచ్చని మరువం! దానిని ఎలా మరువం?

**ఈ) తిక్కన :**

నన్నయ తర్వాత సుమారు రెండు వందల ఏండ్లకు (13వ శతాబ్దం) ఆంధ్ర మహాభారత రచన తిక్కన చేతిలో పడడం తెలుగు జాతి చేసుకున్న పుణ్యం! ఎందుకంటే తిక్కన అసలు సిసలైన తెలుగు కవి.

తిక్కన కవిత్రయంలో రెండోవాడు. నెల్లూరు పాలించిన మనుమసిద్ధి ఆస్థాన కవి. తిక్కన యజ్ఞం చేసి సోమయాజి అయ్యాడు. మానవ స్వభావాలను చిత్రించడంలో అపారమైన ప్రజ్ఞ గలవాడు. నిర్వచనోత్తర రామాయణంతో పాటు మహాభారతంలోని విరాట పర్వం మొదలుకొని స్వర్గారోహణ పర్వం వరకు 15 పర్వాలు ఆంధ్రీకరించాడు. తిక్కన తన భారతాన్ని హరిహరనాధునికి అంకితమిచ్చాడు. తిక్కన శైలి నాటకీయతతో ఉంటుంది. కాబట్టి ఈయన శైలిని నాటకీయశైలి అంటారు. ఈయన కవిత్వం కథ చెప్తున్నట్లు కాకుండా మన కళ్ల ముందు ఏదో అద్భుతమైన నాటకం జరుగుతున్నట్లుగా ఉంటుంది. తిక్కన కవిత్వం తెలుగు నుడికారంతో, రసాభ్యుచిత బంధంతో, అర్థగాంభీర్యంతో ఉంటుంది. తిక్కన తన కవిత్వాన్ని గురించి పేర్కొంటూ "లలిత పద హృద్య పద్యంబులన కథార్థంబు ఘటిత పూర్వాపరమై అలతియలతి తునియల కాహళి సంధించిన విధంబు సమరగ జేతున్" అని అన్నాడు. తన కవిత్వంలో లలిత పదాలుంటాయని, నాదమాధుర్యంతో రచిస్తానని పేర్కొన్నాడు. తిక్కన అధికశాతం తెలుగు పదాలు అల్పశాతం మాత్రమే సంస్కృత పదాలు వాడాడు. తిక్కన తన పాత్రలను సజీవంగా ప్రాణం పోసుకున్నట్లు సృష్టించాడు. కనుక ఆయనను "కవిబ్రహ్మ" అంటారు. ఆ రోజుల్లో అటు సంస్కృత కవులకు, ఇటు తెలుగు కవులకు ఇరు వర్గాలకు కావలసినవాడు కనుక "ఉభయకవి మిత్రుడు" అని కూడా ఆయనకు బిరుదు ఉంది.

శైవ మతస్థులు, వైష్ణవ మతస్థుల మధ్య మతబేధాలు ఉన్న ఆ కాలంలో తిక్కన అందరినీ ఏకం చేసే హరిహరనాధతత్వాన్ని సృష్టించి తన మహాభారతాన్ని హరిహరనాధస్వామికే అంకితం చేసాడు. నిజం చెప్పాలంటే "హరిహరనాధదేవుడు" కేవలం తిక్కన మహాకవి మానస సృష్టి! కవి తలచుకుంటే చేయలేనిది ఏముంది? అందుకే ఏ కవికీ లేని "కవిబ్రహ్మ" బిరుదు ఆయనకే స్వంతం! శివుడైనా, విష్ణువైనా ఒకటే అని చాటి చెప్పి ఆనాడే లౌకిక సిద్ధాంతానికి బీజాలు వేసాడు. అందుకే సాహిత్యంలో తిక్కనను మొట్టమొదటి లౌకికవాది (Seeularist) అనవచ్చు.

తిక్కన సమకాలికులలో మొదటగా పేర్కొనదగినవాడు మూలఘటిక కేతన. వేంగీదేశంలోని వెంటిరాల గ్రామానికి చెందినవాడు. కేతన "దశకుమారచరిత్ర" అనే గ్రంథాన్ని రచించి తిక్కనకు అంకితమిచ్చాడు. ఈ కావ్యంలోని అంకిత పద్యాలు తిక్కన మూర్తిమత్వానికి, వ్యక్తిత్వానికి అద్దం పడతాయి. "అభినవ దండి" అని కేతనకు బిరుదు. ఇతడు తిక్కనకు ప్రియశిష్యుడు. ఆంధ్రభాషాభూషణం కేతన ఇతర గ్రంథం.

ఈ కాలానికి చెందిన మరో కవి మంచన. ఈయన 'కేయూర బాహుచరిత్ర' గ్రంథాన్ని రచించి నండూరి గుండయామాత్యునికి అంకితం ఇచ్చాడు. తిక్కన శిష్యుడైన మారన "మార్కండేయ పురాణము"ను రచించి నాగయగన్న మంత్రికి అంకితం ఇచ్చాడు. ఈ కాలానికి చెందిన యథావాక్కుల అన్నమయ్య సర్వేశ్వర శతకమును, కృష్ణమాచార్యుడు "సింహగిరి; నరహరి వచనాలు" రాశారు. కృష్ణమాచార్యుడు రచించిన సింహగిరి, నరహరివచనాలు వచన సాహిత్యంలో మొదటి ప్రామాణిక రచనలు. ఈ కాలంలోని మరో రచన 'రంగనాథ రామాయణం'. దీనిని గోన బుద్ధారెడ్డి రచించాడు. ఇది ద్విపద కావ్యం.

ద్విపదలో రాసిన ఈ సుమధుర కావ్యం తెలుగు వారిని అలరించిన రమణీయ రామాయణ కావ్యాల్లో ఒకటి. బద్దెన 'సుమతీ శతకము'ను రచించాడు. ఇందులోని శతక పద్యాలు సతతహరితాలు.

**ఉ) ఎఱ్ఱన :**

తిక్కన తర్వాత సుమారు 100 సంవత్సరాల వరకు నన్నయ విడిచిపెట్టిన అరణ్యపర్వంలోని సగభాగం అలాగే ఉండిపోయింది. ఎఱ్ఱన కవి కేవలం మహాభారత కావ్యంలోని అరణ్యపర్వం పూర్తి చేసి కవిత్రయంలో స్థానం సంపాదించుకున్నాడు.

ఎఱ్ఱన (ఎఱ్ఱాప్రగడ) ప్రోలయ వేమారెడ్డి ఆస్థాన కవి. ఇతడు క్రీ.శ. 1280 నుండి 1360 ప్రాంతమునకు చెందినవాడు. రామాయణం, హరివంశం, భారత అరణ్యపర్వశేషం, నృసింహ పురాణం ఇతని రచనలు. వేమారెడ్డి

మొదట రామయాణాన్ని రాయించుకొని అంకింతం తీసుకొని దానితో తృప్తి చెందక హరివంశమును రాయమని కోరాడు. అందుకోసం ఎఱ్ఱన హరివంశమును రచించినట్లు తెలుస్తున్నది. భారతములోని అరణ్యపర్వ భాగమును రాసిన తరువాత నృసింహ పురాణాన్ని రాశాడు. ఈయనది వర్ణనాత్మక శైలి. ఆ తర్వాతి కాలంలో మూడు పువ్వులు, ఆరుకాయలుగా విరాజల్లిన ప్రబంధ సాహిత్యానికి ఈయనే మార్గదర్శకుడు. అందుకే ఎఱ్ఱనను "ప్రబంధ పరమేశ్వరుడు" అంటారు. నృసింహ పురాణాన్ని ప్రబంధ లక్షణములతో రచించడం చేత ప్రబంధ పరమేశ్వర బిరుదునకు అర్హత సాధించాడు. ఈయన రచనలో శబ్ద వైచిత్రికి చెందిన వర్ణనలు చెప్పుకోదగినవి. ఆంధ్ర మహాభారత రచనలో తిక్కనకూ నన్నయకూ మధ్య రచనలో అతుకు కనబడకుండా అరణ్య పర్వం పూర్తి చేసాడు.

నన్నయలా అధికశాతం సంస్కృతపదాలు, అల్పశాతం తెలుగుపదాలతో ప్రారంభించి రాను రాను ఆ నిష్పత్తిని సగం సంస్కృతం, సగం తెలుగుగా చేసి చివర్లో తిక్కనలా అధికశాతం తెలుగు, అల్పశాతం సంస్కృతపదాలతో ముగించాడు.,

ఎర్రన కాలంలో ముఖ్యమైన ఇతర కవులు వారి రచనలు

నాచన సోముడు – ఉత్తర హరివంశం
భాస్కరుడు – భాస్కర రామాయణం
రావిపాటి త్రిపురాంతకుడు – త్రిపురాంతకోదాహరణం

**ఊ) నాచన సోమన :**

ఎర్రన కాలానికి చెందిన కవుల్లో నాచన సోమన చిరస్మరణీయుడు. విజయనగర ఆస్థానానికి చెందిన ప్రథమ కవి. ఉత్తర హరివంశం, వసంత విలాసం ఈయన రచనలు. సకల భాషా భూషణ, సాహిత్య రసపోషణ, కథా సంవిధాన చక్రవర్తి, నవీన గుణసనాథుడుగా కీర్తించబడ్డాడు. నాచన సోమన హరివంశమును రసవత్తరమైన కావ్యంగా తీర్చిదిద్దాడు. ఇందులోని ఇతివృత్తం, అద్భుత వర్ణన, అలంకార శోభితంగా, చక్కని రసపోషణతో పాఠకులను అలరిస్తాయి. పురాణ సంబంధమైన సరికొత్త కథా వస్తువుతో, కథాభాగాన్ని వినూత్న విధానంలో రాయడంతో సోమనాథుడు నవీన గుణసనాథుడుగా మారాడు. ఈయన కాలం నాటిదే భాస్కర రామాయణం. ఇప్పటి వరకూ వచ్చిన రామయణల కావ్యాలలో భాస్కర రామాయణం కూడా ప్రామాణిక కావ్యంగా గుర్తింపబడింది.

**ఋ) శ్రీనాథుడు : (క్రీ.శ. 1350–1500)**

తెలుగు సాహిత్యంలో 'కవిసార్వభౌముడు'గా కీర్తి గడించిన కవి 'శ్రీనాథుడు'. అటు భూనాథుల చేత ఇటు భూజనుల చేత సన్మాన సత్కారాలకు శ్రీకారం చుట్టించుకున్న మొట్టమొదటి కవి శ్రీనాథుడు! తెలుగు ప్రాంతమంతటా సకల జనుల నీరాజనాలు అందుకున్న మహాకవి ఈయన శ్రీనాథుడు పెదకోమటి వేమారెడ్డి ఆస్థానకవి. కవిత్రయం తరువాత అంతటి ప్రతిభావంతుడైన కవి.ఇతడు 1380–1470 నాటి వాడని పలువురి అభిప్రాయం. శృంగార నైషధం, హరవిలాసం, క్రీడాభిరామం, భీమఖండం, కాశీఖండం, పల్నాటి వీరచరిత్ర, మరుత్తరాట్చరిత్ర, శాలివాహన సప్తశతి, శివరాత్రి మహాత్మ్యం ఇతని రచనలు. శృంగార నైషధాన్ని మామిడి సింగనామాత్యునికి అంకితమిచ్చాడు.

"కస్తూరికా బిక్షాదానము సేయరా! సుకవిరాట్ బృందారక శ్రేణిపై" అని కవుల గొప్పతనాన్ని ఉగ్గడించి చక్రవర్తులను సైతం శాసించిన కవిశాసనుడు శ్రీనాథుడు. తెలుగునాట కవిత్వానికి పర్యాయపంగా నిలిచింది శ్రీనాథుని పేరు. కవిత్వంలో ఈయనది ఆకట్టుకునే ప్రౌఢశైలి! చక్కని అలంకారాలతో, సరసోక్తులతో, పదబంధాలతో మృదు గంభీరంగా సాగిపోతుంది. సీస పద్యం శ్రీనాథుని సొత్తు. అందుకే

"వృత్తం నన్నయ్యది
సీసం శ్రీనాథుడిది

ముత్యాల సరంగురజాడది

ఆటవెలది వేమనది" అంటూ కొనియాడాడు విప్లవ మహాకవి శ్రీశ్రీ. దేశమంతటా విద్యారంగాన్ని పర్యవేక్షిస్తూ, తన భావాలను చాటు పద్యాల రూపంలో చాటి చెప్పి ప్రజలను అలరిస్తూ పర్యటించిన మొట్టమొదటి 'విద్యాధికారి' కూడా ఆయనే! శ్రీనాథుడు లాంటి గొప్ప కవి ఆంధ్రుల మొట్టమొదటి విద్యాధికారి కావడం ఉపాధ్యాయ విద్యార్థిలోకానికి గర్వకారణం!

శ్రీనాథుడు కాలు మోపిన చోట కనకాభిషేకాలు! భక్తితో ఆయన కైమోడ్పు చేసిన పార్వతీపతికి పాదాభిషేకాలు! ఆయన పద్యాల పుష్పాంజలులు పొందిన శ్రీహరికి కుంభాభిషేకాలు! కవిత్వంలో అటు భక్తినీ, ఇటు రక్తినీ సమానంగా పోషించినట్లే అటు హరిహరులిద్దరూ శ్రీనాథునికి ఆరాధ్య దైవాలే!

శ్రీనాథుడు తెలుగు నాట పర్యటిస్తూ అలవోకగా చెప్పిన చాటుపద్యాలు ప్రజల నోట పరవళ్లు తొక్కాయి.

అలాంటిదే ఒక పద్యం – పల్నాటి ప్రాంతంలో పర్యటిస్తూ

"చిన్ని చిన్ని రాళ్లు చిల్లర దేవుళ్లు
నాగులేటి నీళ్లు నాపరాళ్లు
సజ్జజొన్న కూళ్లు సర్పంబులును తేళ్లు
పల్లవాటి సీమ పల్లెటూళ్లు"

పల్నాటి ప్రాంతంలోనే వానలు లేక తాగడానికి నీళ్లు లేక సాక్షాత్తు పరమేశ్వరుడ్నే ప్రశ్నిస్తాడు శ్రీనాథుడు.

"సిరిగలవాడికి చెల్లును
తరుణులు పదియారువేలు తగ పెండ్లాడన్
తిరిపెమునకిద్దరాంఢ్రా (ఇద్దరు భార్యలా?)
పరమేశా! గంగ విడువు! పార్వతీ చాలున్!"

"బిక్షమెత్తుకునేవాడివి – నీకు ఇద్దరు భార్యలెందుకయ్యా! పరమేశ్వరా! గంగను నాకు వదులు! నీకు పార్వతి చాలులే" అంటూ పరమశివునితో పరిహాసమాడిన సాహసి, రసపిపాసి! ఇందులోని అంతరార్థం "నా దాహం తీర్చు దేవా!" అని! అంతటి గొప్ప చతురుడు, కవితారసజ్ఞుడు, మహాకవి శ్రీనాథుడు!

శృంగార నైషధం, హరవిలాసం, పలనాటి వీరచరిత్ర, కాశీఖండం, భీమఖండం, క్రీడాభిరామల శ్రీనాథుని మహత్తర కృతులు! క్రీడాభిరామం సమకాలీన జీవితాన్ని చిత్రించిన విభిన్న కావ్యం; పల్నాటి వీరచరిత్ర ద్విపద కావ్యం. ఇందులో పలనాటి వీరరసం నాగులేటి వాగై ప్రవహించింది.

**పోతన :**

పోతన ప్రస్తుత తెలంగాణా రాష్ట్రంలోని వరంగల్ జిల్లా బమ్మెర గ్రామానికి చెందినవాడు. 1450–1510 ప్రాంతంలోనే జీవించినట్లు తెలుస్తున్నది. మహాకవి భాగవతాన్ని తెలుగులోకి అనువదించడంతో పాటు భోగినీ దండకం, వీరభద్ర విజయం, నారాయణ శతకాన్ని రచించాడు.

ప్రాచీన తెలుగు సాహిత్యంలో 'సహజకవి'గా ప్రజల చేత గుర్తింపబడిన ఏకైక తెలుగు కవి పోతన! తన భాగవత గ్రంథాన్ని మానవాధములైన రాజులకు అంకితమీయనని శ్రీరామునికే అంకితమిచ్చిన పరమ భాగవతోత్తముడు పోతన! ధనమదాంధులైన ఆనాటి రాజులను సైతం లెక్కచేయక ఒక చేత్తో కలం, మరో చేత్తో హలం పట్టి పొలం దున్నుతూ కష్టజీవిగా బ్రతుకుతూ తాను నమ్మిన రామభద్రుని నామస్మరణమే; తన కవితాభరణంగా మలుచుకొని 'శ్రీమదాంధ్ర మహాభాగవతం' రచించిన పోతనామాత్యుని గుండె ధైర్యం చూచి ప్రభువులు, ప్రజలు మాత్రమే కాదు; ఆయనను కడుపారగన్న బమ్మెర గ్రామం సైతం దిమ్మెర పోయింది! అలాంటి వరాలకవిని కన్నందుకు పులకించిపోయింది!

శ్రీనాధుడు రాజభోగాలతో తేలియాడితే దాదాపు ఆయనకు సమకాలీనుడిగా చెప్పబడే ఈ కవి రాజపూజలకు దూరంగా సామాన్య జీవితం గడిపాడు. తన ఆంధ్ర మహాభాగవత కావ్యాన్ని రాజులకు అంకితం ఇవ్వకుండా శ్రీరామ చంద్రునికి అంకితం చేసి తన జీవితాన్ని పునీతం చేసుకున్నాడు.

"పలికెడిది భాగవతమట
పలికించెడి వాడు రామభద్రుడట
నేపలికిన భవహరమగునట
పలికెద వేరొండుగాథ పలకగనేల?" – అంటూ భగవంతుడి పట్ల తన భక్తినీ, రక్తినీ వినమ్రుడై ప్రకటించాడు.

"కారే రాజులు? రాజ్యముల్ గల్గవే? గర్వోన్నతిన్ పొందరే వారేరీ? సిరి మూటల్ గట్టుకొని పోవం జాలిరే? భూమిపైన పేరైనన్ కలదే?"

ఈ మాటలు ఎంత అక్షరసత్యాలు! మాటలా? ఇవి కావు. సౌశీల్యంతో కైవల్యం పొందడానికి ఆ మహాకవి చూపిన బాటలు!

రైతులేనిదే మనకు బ్రతుకు లేదు; మెతుకు లేదు – నిజమే కదా! అలాంటి అన్నదాతను మనం ఎంత గౌరవించాలి! అందుకే పోతన కలంతో పాటు హలం పట్టాడు. కృషీవలుడై వ్యవసాయంతో పాటు సాహిత్య వ్యవసాయం కూడా చేశాడు. తన స్వేదంతో భూమాతను అభిషేకించాడు. ధాన్యపు సిరులతో పాటు సాహిత్య సిరులు కూడా పండించాడు.

"సత్కవుల్ హాలికులైన నేమి!" – అంటూ శ్రమైక జీవన సౌందర్యంలోని ఔన్నత్యాన్ని చాటి చెప్పాడు.

పోతన కవిత్వం లలిత పదబంధురం. మధురసాల పల్లవ సుందరం.

"మందార మకరంద మాధుర్యమున దేలు
మధు పంబుపోవునే మదనములకు?
నిర్మలమందాకినీ వీచికల దూగు
రాయంచ చనునె? తరంగిణులకు"

ఎంత హాయి గొలిపే భావనలు! ఎంత హృద్యమైన పద్యాలు! ఇలాంటి పోతన పద్యాలు కొల్లలు! తెలుగు వారమై పుట్టి, ఇట్టి మధురమైన పద్యాలు కనీసం పదుల సంఖ్యలోనైనా మదిలో పదిలపరచుకొని ఆనందించలేని జన్మ ఎందుకు?

పోతన కవిత్వంలోని భావుకత ఉన్నతమైనది. మహాకవుల ఉన్నతమైన ఊహలకు నిజమైన కొలమానం సహృదయుల రసాస్వాదనమే!

భాగవతంలోని 'గజేంద్ర మోక్షం' పద్యాలు –

"సిరికింజెప్పుడు శంకచక్రయుగముం జేదోయి సంధింపబడు";

"లావొక్కింతయు లేదు ధైర్యమ్ము విలోలంబయ్యె"; బలి చక్రవర్తి ముందు

"ఇంతింతైవటుడింతింతై మరియు దానింతైనభో వీధిపై నంతై"

త్రివిక్రముడై ఎదిగిన వామనమూర్తి వర్ణన; శ్రీకృష్ణుని బాల్యక్రీడలు; స్నేహితులతో సరసోక్తులాడుతూ చల్ది ఆరగించడం–పోతనామాత్యుని కవితాశక్తికి గీటురాళ్లు! కావ్యజగత్తులో ఆమహాకవి ప్రతిష్ఠించిన మైలురాళ్లు!

పోతన పద్యాలలో చక్కని ధారాశుద్ధి ; సహజమనోహరమైన వర్ణన ఉంటుంది. ఆయన కవిత్వంలో ప్రకృతి నాట్యం చేస్తుంది. ప్రకృతితో పాటు పాఠకుని హృదయం కూడా నాట్యం చేస్తుంది. పోతన భాగవతం చదివి మందార మకరందంలాంటి ఆయన పద్యాల మాధుర్యాన్ని తప్పక ఆస్వాదిస్తారు కదూ!

పోతన కాలానికి కొంచెం అటు ఇటుగా ఉన్న కవులు పిల్లలమర్రి పినవీరభద్రుడు. అనంతామాత్యుడు; జక్కన, గౌరన, కొరవి గోపరాజు; దగ్గుపల్లి దుగ్గన; తెలుగు సాహిత్య చరిత్రలో తొలి జంట కవులైన నంది మల్లయ్య; ఘంట సింగన; దూబగుంట నారాయణకవి; వెన్నెలకంటి సూరన కవి మొదలైనవారు.

పైన చెప్పబడిన కవుల్లో అతి ముఖ్యులైన కవులుగా పిల్లలమర్రి పినవీరభద్రుడు ; గౌరన, కొరవి గోపరాజు – వీరిని గుర్తించవచ్చు. వీరి గురించి స్థాలీపులాకంగా చెప్పుకుందాం.

**పిల్లల మర్రి పినవీరభద్రకవి :**

ఈయన పేరును బట్టి సాహితీ క్షేత్రంలో ఊడలు దిగిన మర్రిచెట్టు అని చెప్పవచ్చు. తెలుగు సాహిత్య చరిత్రలో "వాణి నారాణి" అని చెప్పుకున్న చేవ కలిగిన కవి! తన కవిత్వ బాణిపై అతనికి ఎంత నమ్మకం ఉంటే 'వాణి నా రాణి' అని చెప్పుకోవాలి? అలా చెప్పుకున్న దమ్ము ఉన్న కవి తెలుగు సాహిత్యంలో అతడొక్కడే!

పిల్లలమర్రి రాసిన 'శృంగార శాకుంతలం' కావ్యం తన రాణిగా పిలుచుకున్న వాణికి అతడు ప్రియమార అలంకరించిన శృంగార ఆభరణం. మధుర వర్ణనల తోరణం. శృంగార శాకుంతలంతో పాటు ఇతడు తన రాణికి కైసేసిన మరో మణిమయ మరకతం 'జైమినీ భారతం'.

**ఏ. గౌరన :**

'హరిశ్చంద్రోపాఖ్యానం' అనే పేరు గల మధుర కావ్యం రాసి తెలుగు సాహిత్య చరిత్రలో గౌరవస్థానం పొందాడు గౌరన! చక్కటి కథనం ఈయన కవితా ఇంధనం. ప్రకృతి పరిశీలన; ఆహ్లాదకరమైన వర్ణన; ఉన్నతమైన ఉత్ప్రేక్ష గౌరన తన కవితాసుందరికి అలంకరించిన సొమ్ములు.

అందమైన అడవి మధ్యలో వున్న కొలనును వర్ణిస్తూ ఒక పద్యంలో అంటాడాయన – "వనదేవతాకర స్ఫటిక మణిదర్పణము వోలె తనరుకాసారము."

నిశ్చలంగా వున్న నీటితో నిండిన ఆ కొలను ఎలా వుందంటే – వన దేవత తన అందాన్ని చూసుకోడానికి తన చేత్తో పట్టుకున్న మణిదర్పణంలా వుందట!

ఉన్నతమైన ఊహతో నిండిన గౌరన కవి వర్ణనకు ఈ ఒక్క పద్యం చాలదూ?

**శ్రీకృష్ణ దేవరాయల కాలం నాటి అష్టదిగ్గజ కవులు :**

ఆంధ్రభోజుడుగా పేర్కొనబడిన కృష్ణదేవరాయల కాలాన్ని సాహిత్యానికి స్వర్ణయుగంగా ప్రస్తుతిస్తారు. అందుకు కారణం విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన శ్రీకృష్ణ దేవరాయలు సైతం కవిరాజుగా వెలుగొందారు. ఆ కాలంలోని ప్రజలు కవిత్వమే ఊపిరిగా బ్రతికారు. రాయల వారు అమందానంద సాహితీ ప్రియుడు. ఆయనకు సాహితీ సమరాంగణ సార్వభౌముడు, ఆంధ్రభోజుడు అనే బిరుదులు ఉన్నాయి. తన ఆస్థానంలో రాయలవారు నిర్మించిన "భువన విజయం" అనే పేరు గల సభాభవనంలో నవరసాలు నాట్యమాడాయి. కవితా సుందరి కన్నుల పండుగ చేసింది. ఈ సభాభవనంలో కవితాగోష్ఠులు, సదస్సులు, విద్యావినోదాలు నిర్వహించేవారు. రాయల ఆస్థానంలో ఎనిమిది మంది మహాకవులు ఉండేవారు.

జగత్తును అష్టదిక్పాలకులు ఎలా పాలిస్తున్నారో కవితా ప్రపంచాన్ని "అష్టదిగ్గజకవులు" పాలిస్తారని వీరికి ఆ పేరు వచ్చింది.

అష్టదిగ్గజాలుగా ప్రసిద్ధి చెందిన ఈ కవులను తన ఇష్టకవులుగా అక్కున చేర్చుకున్నాడు శ్రీకృష్ణదేవరాయలు. సాహిత్యాన్నీ, దానిని సృష్టించే సాహితీమూర్తులను ఇంతగా ప్రేమించిన కవి బహుశా దేశ చరిత్రలోనే లేదేమో! కవులను తన ప్రియమిత్రులుగా భావించాడు.

'ఎదురైనచో తన మదకరీంద్రము డిగ్గి కేలూత నొసగి పెద్దనను ఎక్కించుకున్నాడు".

తాను మెచ్చిన కవుల పద్యాలకు పరవశించి తన సింహాసనం మీద కొంచెం పక్కకు జరిగి భుజం మీద

చేయి వేసి, తనతో పాటు కూర్చోపెట్టుకున్నారు.

స్వహస్తాలతో కవుల చేతికి స్వర్ణకంకణాలు, కాలికి గండపెండేరాలు తొడిగాడు. రత్నహారాలు, మణిమాణిక్యాలు, అగ్రహారాలు సైతం కవులకు కానుక చేశాడు.

“భళిరా! సత్కవీ!” అంటూ వారిని కొనియాడాడు. “స్తుతిమతియైన ధూర్జటి పల్కులకేల గల్గె ఈ అతులిత మాధురీ మహిమ”? అంటూ పేరు పేరునా కవులను మెచ్చుకున్నాడు.

తెలుగు సాహితీ చరిత్రలో ఇది కవితామతల్లి సంబరపడిన సమయం! పసందైన సారస్వతానికి పట్టం గట్టిన మధురఘట్టం!

రాయలవారికి ఈ విషయాలపై ఎందుకింత ఆవేశం! అందుకు కారణం కవితారంగంలో అతనికున్న అద్భుత అభినివేశం! స్వయంగా అతడు కవి చూడామణి! నభూతో న భవిష్యత్ అనిపించిన సాహితీ నభోమణి!

“ఆయన రాసిందే ఆముక్త మాల్యద!

**ఆముక్త మాల్యద :**

శ్రీకృష్ణదేవరాయల “ఆముక్త మాల్యద” కావ్యం ఒక అద్భుత సృష్టి. నారికేళపాకం అనదగిన ఇట్టి కావ్య రచనలో ఆయనకు ఆయనే సాటి.

ఆముక్త మాల్యద ముఖ్యంగా భక్తిరస ప్రధాన కావ్యం. రాయలవారు వైష్ణవభక్తుడు. ఆముక్తమాల్యదకు “విష్ణు చిత్తీయం”అనే మరో పేరు ఉంది. విష్ణువును ప్రేమించిన నాయిక తన హృదయాన్నే పూలమాలగా చేసి అనుదినం లోకనాయకుడైన తన ప్రియనాయకునికి ధరింప చేస్తుంది.

ఆముక్త మాల్యద ఉన్నత స్థాయి కావ్యాల్లో ఒకటైనా అవగాహన విషయంలో మాత్రం నారికేళ పాకం. రాయలవారు ప్రజాపరిపాలనలో, యుద్ధాలతో మునిగి తేలుతున్నా సాహిత్య విషయాల్లో తన దృష్టి మరల్చి చక్కని సౌందర్యాభిరుచి వర్ణనాశక్తితో ఒక మహాకావ్యం రాయడం ఆశ్చర్యకరం! ఆనందదాయకం!

ప్రకృతిలోని చిన్నచిన్న విషయాలను సైతం కొత్తకోణంలో పరిశీలించే నైపుణ్యం ఆయన సొత్తు! ఆయనకవితలో ఋతువర్ణన అద్భుతం! అర్థం చేసుకొంటే పాఠకుడికి గొప్ప అనుభూతిని కలిగిస్తుంది. అన్ని ఋతువుల్లోనూ వర్షఋతువంటే ఆయనకు అత్యంత ఇష్టమేమో – ఆయన వర్ష ఋతు వర్ణనలో అందాల ఇంద్రధనస్సు వెల్లివిరుస్తుంది.

ఆముక్త మాల్యద కావ్యంలో “మాల దాసరి కథ”లో రాయల వారి కథన నైపుణ్యం, సునిశిత పరిశీలనాశక్తి, కథా పరిసరాల వర్ణన; బ్రహ్మరాక్షసితో సంవాదం భీభత్స రసానికి పరాకాష్ఠ. జుగుప్స కలిగించే విషయాలను సైతం కవితామయం చేసిన ఆయన కథా సంవిధానం ప్రశంసనీయం. ప్రజల జీవనవిధానాన్ని నిరంతరం పరిశీలించిన వ్యక్తికే మాలదాసరి లాంటి కథ పండించడం సాధ్యం.

గోదాదేవి పాత్ర, ఆమెకు విష్ణుమూర్తి పట్ల గల మధుర భక్తితో కూడిన ప్రేమ, దేవదేవుడు ఆమె అమలిన ప్రణయానికి పులకితుడైన వైనం ఆముక్త మాల్యద కావ్యరచనకు పరాకాష్ఠ.

రాయలవారు పదజాలంలో ప్రాచీనమైన వాడుకలో లేని పదాలు, ద్రావిడ భాషా పలుకుబడి కన్పిస్తుంది. కొంత కన్నడ భాషా సుగంధం కూడా తోడై సరికొత్త అందం చిందిస్తుంది. ఆముక్తమాల్యద ఆంధ్ర సాహిత్యంలో ప్రామాణికమైన కావ్యాల్లో ఒకటి అనడంలో ఏ మాత్రం సందేహం లేదు.

ఇక సాహిత్యరీత్యా అష్టదిక్కులకు విస్తరించిన మహత్తర కవులు అష్టదిగ్గజాలను గురించి తెలుసుకుందాం. అయితే ఈ విషయాలకు సంబంధించి మనం గుర్తించవలసిన ఒక విమర్శ ఉంది. రాయలకాలం నాటి వారని రూఢిగా చెప్పబడుతున్న అష్టదిగ్గజ కవుల్లో కొందరు ఆయన కాలం నాటి వారు కాదని ఒకరిద్దరు కవులకు అసలు రాయల వారితోనే సంబంధం లేదని విమర్శకులు తేల్చి చెప్పారు. అయినా జనశృతి మాత్రం అష్టదిగ్గజాలు

రాయలకాలం నాటి వారేనని!

మనం కూడా జన నానుడినే అనుసరిద్దాం.

**అష్టదిగ్గజ కవులు :**

1. అల్లసాని పెద్దన
2. ముక్కు తిమ్మన
3. ధూర్జటి
4. పింగళి సూరన
5. రామరాజు భూషణుడు (భట్టుమూర్తి)
6. తెనాలి రామకృష్ణుడు
7. మాదయ గారి మల్లన
8. అయ్యలరాజు రామభద్రకవి

వీరి రచనలన్నీ ఇంచుమించు స్వతంత్ర కావ్యాలై ప్రబంధాలుగా ప్రసిద్ధి చెందాయి. జనరంజకమైన కమ్మని కవిత్వం రాసిన ఈ కవుల సాహితీ విహారాన్ని విహంగవీక్షణంగా వీక్షిద్దాం.

**అల్లసాని పెద్దన :**

పేరుకు తగినట్టే రాయల స్వర్ణయుగంలో అల్లసాని వారి పాత్ర పెద్దదే! అల్లసాని వారి కావ్యరచనా శిల్పంలోని "జిగిబిగి" కొనియాడదగినది. వీరు రాసిన అందమైన ప్రబంధం మను చరిత్ర. కావ్యరచనకు కావలసిన జిగి అంటే కాంతి, బిగి అంటే పదజాలాన్ని అందంగా కూర్చే నేర్పు. ఈ రెండు లక్షణాల సమన్వితం అల్లసాని కవిత్వం.

"మను చరిత్ర" కావ్యాన్ని మొట్టమొదటి ప్రబంధంగా వ్యవహరిస్తారు. ప్రబంధ లక్షణాలను పుణికి పుచ్చుకున్న అచ్చమైన తెలుగు ప్రబంధం ఇది. ఈ మనుచరిత్రకే "స్వారోచిషమను సంభవం" అని మరో పేరుంది. "మను చరిత్ర" గ్రంథాన్ని తన పద్యాలను ఎంతో ప్రేమించే రాయల వారికే అంకితమిచ్చారు. మనుచరిత్ర ప్రబంధంలో కవితా సౌందర్యానికి మురిసిపోయిన శ్రీకృష్ణదేవరాయులు స్వయంగా అల్లసాని వారి కాలికి గండపెండేరం తొడిగారు. "ఆంధ్ర కవితా పితామహుడు"గా వీరు ప్రసిద్ధి చెందారు.

మను చరిత్రలో జన బాహుళ్యంలో ప్రసిద్ధి చెందిన మధురఘట్టం వరూధినీ ప్రవరాఖ్యుల కథ. ప్రవరాఖ్యుని నిష్ఠాగరిష్ఠత; ఆయన జపహోమ తత్పరత, సిద్ధుని రాక, కాలికి పసరు పూయడం దాని ప్రభావంతో శ్రోత్రియుడైన ప్రవరుడు ఏ కాశీ, గయ, ప్రయాగ కాకుండా హిమాలయ పర్వతాలు చేరడం, అంబరచుంచితమైన మంచుకొండల అందాలు, మంచుకు పసరు కరిగిపోయి ప్రవరుడు దారి తప్పడం, వరూధిని లాంటి అందాల రాశి అతనిని తనంత తానుగా వలచి రావడం, ఏకపత్నీవ్రతుడైన ప్రవరుడు వ్రతభంగం కాకుండా ఆమెను తిరస్కరించడం, చివరకు తన తపోబలంతో ప్రవరుడు ఇల్లు చేరడం – మాయా ప్రవరుని కథ ఇవన్నీ అల్లసాని వారి అల్లిక జిగిబిగితో పాఠకులను కట్టిపడేస్తాయి.

పెద్దన వారి వర్ణనలు అనితర సాధ్యాలు. పద్యాలా అవి? కావురసగుళికలు!

"అలుజనికాంచె భూమిసురుడంబరచుంబి........

.....................................................

.....................................................

............ కటక చరత్కరేణు కరకంపిత సాలము శీతశైలమున్".

"అనినన్ కన్నులు జేపురింప నధరం బల్లాడ

....................................................

....................................................

....................... నయనక్ష్వేలా కరాళధ్వనిన్"

"ఇంతయు కన్నులుండ తెరువెవ్వరి వేడెదు భూసురేంద్ర

.................................... ఏకాంతంబు నందున్న

జవరాంద్ర పల్కరించు లాగింతియ కాని"

ఇట్టి మధుర పద్యాలు పెద్దన కవితలో కోకొల్లలు. మను చరిత్రలో విరిసిన మరుమల్లెలు.

అలాగే మన జీవితంలో ఉపయోగించే తెలుగు పలుకుబళ్లు పెద్దన కలంలో విందు చేస్తాయి.

"గుంద్రా డాచిన పెళ్లి ఏమిటికి చిక్కున్"

వెనుకటికెవడో గిట్టనివాడు జరుగుతున్న పెళ్లి ఆపడానికి గుండ్రాయి దాచిపెట్టాడట. గుండ్రాయి దాచి పెట్టినంత మాత్రాన పెళ్లి ఆగుతుందా? ఎంత చక్కటి జాతీయం!

తెలుగు కవిత్వానికి జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చిన గొప్ప కవుల్లో అల్లసాని ఒకరు.

కాబోయే ఉపాధ్యాయులైన మీరు పెద్దన పద్యాలు ఎన్నయినా వద్దనకుండా నేర్చుకొని ఆనందిస్తారు కదూ!

**ముక్కు తిమ్మన :**

"ముక్కు తిమ్మనార్యు ముద్దు పలుకు" అన్నారు. ఈ మాట అక్షరసత్యం. "పారిజాతాపహరణం" కావ్యం ముక్కు తిమ్మనార్యుని ముద్దు పలుకులకు పట్టిన ముచ్చటైన ముకురం. ముక్కు తిమ్మన అసలు పేరు నంది తిమ్మన. తన కావ్యంలో చక్కటి అమ్మాయి ముక్కుపైన అందమైన పద్యం రాసి ముక్కు తిమ్మనగా ప్రసిద్ధి చెందాడు.

ఆ పద్యం ఇదే –

"నానాసూన వితాన సారంగమే ఎలా నన్ను వల్లదంచు

పలుకాకన్ ...............................................

............................................................

................... మధుకరీంపుజంబులిర్వంకలన్."

ఈ పద్యం సందర్భానాన్ని భావాన్ని మీ అధ్యాపకుని అడిగి తెలుసుకోండి. ముక్కు మీద రాసిన ఈ కమ్మటి పద్యాన్ని కేవలం బట్టీపట్టి ముక్కున పెట్టుకోకుండా పద్య మాధుర్యాన్ని ఆస్వాదించి హృదయంలో పదిల పరచుకుంటారు కదూ!

పారిజాతాపహరణం రసరమ్యసత్కథ! శ్రీకృష్ణుడు – సత్యభామ నడుమ చెలరేగిన ప్రణయకలహం. నారదుడు దేవలోకం నుండి వస్తూ వస్తూ వీరిద్దరి మధ్య ఆజ్యం పోయడానికే అన్నట్లు పారిజాత పుష్పం తేవడం, కృష్ణ పరమాత్మునికి కానుక ఇవ్వడం, ఆ పువ్వు మహిమను గురించి చిలువలు పలువలుగా వర్ణించడం, సమయానికి తనకు దగ్గరలో నున్న రుక్మిణీదేవి జడలో ఆ పరిమళభరిత పారిజాతాన్ని కృష్ణుడు తురమడం, ఇదంతా గమనించిన సత్యభామ చెలికత్తె పరిగెత్తుతూ వెళ్లి ఈ వార్త సత్యభామకు ముట్టించడం; ఆమె అలక పాన్పు చేరం, శ్రీకృష్ణుడు ఆవిడ అలక తీర్చడానికి కాళ్లు పట్టుకోపోవడం, చివరకు లతాంతాయుదు కన్నతండ్రి శిరస్సును సత్యభామ తన వామపాదంతో నెట్టివేయడం, చివరకు తన ప్రియమైన నెచ్చెలి సత్యాసమేతంగా బయలుదేరి పారిజాత వృక్షాన్ని పెల్లగించి అపహరించుకొని భూలోకానికి తెచ్చి తన ప్రియ వధూటి సత్య పెరటిచెట్టుగా నాటడం – ఇదంతా ఒక రమణీయ దృశ్యనాటికలా – కళ్లకు కట్టినట్లు చిత్రించారు నంది తిమ్మన ఉరఫ్ ముక్కు తిమ్మన!

ముక్కు తిమ్మన ముద్దు పలుకులకు; అలకపూనిన సత్యభామ కులుకు పలుకులకు ఆనందించని ఆంధ్రుడెవ్వడు?

అనవిని వేటువడ్డ ఉరంగాంగన వలె

నేయి బోయ భగ్గున ................................

చెలికత్తె మాట విని వేటుపడ్డ ఆడత్రాచులా నేయి పోస్తే భగ్గున మండిన అగ్నికీలలా కోపంతో ఎగిసిపడిన సత్యభామ వ్యక్తిత్వాన్ని; ఆవిడ స్వాభిమానాన్ని భర్తపైన తనకున్న సాధికారాన్ని ప్రదర్శించిన సత్యభామ పాత్రను తిమ్మన చిత్రించిన తీరు తెలుగు సాహిత్య చరిత్రలో అజరామరం.

"పారిజాతాపహరణం" వాగ్దేవి మెడలో రాయలయుగం అలంకరించిన అపూర్వ ఆభరణం.

**ధూర్జటి :**

"స్తుతిమతియైన ధూర్జటి పల్కులకేల కలిగె అతులిత మాధురీ మహిమ"! అని ఆంధ్రభోజుడు శ్రీకృష్ణదేవరాయలచే కొనయాడబడిన మేటి కవి ధూర్జటి. ఈయన కవిత్వం ఎంతో లోతైనది. అర్థవంతమైనది. వీరు శ్రీకాళహస్తీశ్వర శతకం, శ్రీ కాళహస్తీశ్వర మహాత్మ్యం రచించారు. ఈయన పద్యాలు కృష్ణదేవరాయలు చెప్పినట్లుగానే అతులిత మాధురీమహిమతో రసగుళికలుగా ఉంటాయి. అట్టి ధూర్జటి పలుకులను ఈనాటి ఉపాధ్యాయలోకం తెలుసుకొని అందలి మాధురీ–మహిమ ఏమిటో ఆస్వాదించాలి.

**పింగళి సూరన :**

తెలుగు సాహిత్యంలోని కాల్పనిక కావ్యాల్లో పింగళి సూరన కళాపూర్ణోదయం సుప్రసిద్ధమైనది. ఇందులోని కథనం ఈనాటి ఒక మహారచయిత నవలలా అనుకోని మలుపులు తిరుగుతుంది. పాఠకులకు ఉత్కంఠను కలిగిస్తూ, అసంఖ్యాకమైన పాత్రలతో కావ్యాన్ని నడిపిన నైపుణ్యం మనల్ని ఆశ్చర్యచకితుల్ని చేస్తుంది. ఈ కావ్యంలోని సుగాత్రీశాలీనుల కథ, కలభాషిణి పాత్ర, రంభానల కూబరుల కామరూప ప్రేమకలాపం పాఠకులను ఊహాలోకాలలో విహరింపజేస్తాయి. రాఘవ పాండవీయం అనే ద్వ్యర్థి కావ్యాన్ని (రామాయణం, మహాభారతం : ఈ రెండు కావ్యాలను అర్థాలలో అన్వయింపజేసుకునే కావ్యం), 'ప్రభావతీ ప్రద్యుమ్నం' అనే మరో కావ్యాన్ని రచించాడు పింగళి సూరన. ఈ మహాకవి ఈ యుగంలో పుట్టి వుంటే మహా నవలాకారుడుగా కీర్తి గడించేవాడేమో! అద్భుత కల్పనాశక్తి సూరన సొత్తు!

**రామరాజ భూషణుడు :**

సంగీత సాహిత్యాలు రెంటినీ మేళవిస్తూ వసుచరిత్ర అనే మహాకావ్యాన్ని రచించాడు. కావ్యాలంకార సంగ్రహం (నరసభూపాలేయం) అనే లక్షణ గ్రంథాన్ని రచించాడు. రామరాజ భూషణునికి "సంగీత రహస్య కళానిధి" అనే బిరుదు ఉంది. వీరి వసుచరిత్ర పంచమహాకావ్యాల్లో ఒకటి!

**తెనాలి రామకృష్ణుడు :**

ప్రతిభా సంపన్నుడైన కవి. పాండురంగ మహాత్మ్యం అనే కావ్యం వీరికి గొప్ప పేరు తెచ్చిపెట్టింది. పాండురంగ మహాత్మ్యంలో 'నిగమశర్మఅక్క' పాత్రను ఈయన చిత్రించిన తీరు సుందరం, సుమనోహరం. ఆ పాత్రలో అచ్చు పదహారణాల తెలుగింటి ఆడపడుచు తమ్ముడి పట్ల ఎలాంటి మమకారం కలిగి ఉంటుందో, తెలుగింటి ఆచార వ్యవహారాలు ఎలా ఉంటాయో కళ్ళకు కట్టినట్లుగా చూపించాడు. నిగమశర్మఅక్క పేరేమిటో చెప్పకపోవడం నిగమశర్మోపాఖ్యానంలోని అద్భుత కవితా శిల్పం. నిజానికి నిగమశర్మఅక్క పేరు చెప్పవలసిన అవసరం లేదు కదా! కందర్పకేతు విలాసం, ఘటికాచల మహాత్మ్యం, హరలీలావిలాసం, ఉద్భటారాధ్య చరిత్ర అనేవి ఇతని ఇతర గ్రంథాలు.

**మాదయ గారి మల్లన :** రాజశేఖర చరిత్రను రచించారు.

**అయ్యల రాజు రామభద్రుడు :**

రామాభ్యుదయం అనే కావ్యాన్ని రచించారు. కావ్యం పేరుకు తగినట్లే ఈయన కవిత్వం కూడా భక్తి

రసబంధురం.

**రాయలయుగంలోని ఇతర కవుల రచనలు :**

| | | |
|---|---|---|
| కందుకూరి రుద్రకవి | – | నిరంకుశోపాఖ్యానం, సుగ్రీవ విజయం అనే యక్షగానాన్ని రాశాడు. తెలుగులో లభించిన మొదటి యక్షగానం. |
| చింతలపూడి ఎల్లనార్యుడు | – | రాధామాధవీయం |
| సంకుసాల నృసింహకవి | – | కవికర్ణ రసాయనం |
| ఆతుకూరి మొల్ల | – | రామాయణం |
| తాళ్ళపాక అన్నమాచార్యులు | – | భక్తి శృంగారమయ కీర్తనలు 32వేలు రచించి పద కవితా పితామహుడని బిరుదు పొందాడు. |
| తాళ్ళపాక తిమ్మక్క | – | సుభద్రా కళ్యాణం అనే ద్విపద కావ్యాన్ని రాసింది. ఈ కావ్యం పరిమాణంలో చిన్నదైనా గొప్ప రసవత్తర కావ్యం. ఈమె పేరుకు తిమ్మక్క. అయినా కవిత్వానికి పెద్దక్క! |
| పొన్నగంటి తెలగన్న | – | యయాతి చరిత్ర (మొట్టమొదటి అచ్చ తెలుగు కావ్యం) |
| సారంగు తమ్మయ్య | – | వైజయంతీ విలాసం |

**'మొల్ల' కవయిత్రి**

"సుడిగీని రామపాదములు సోకిన ధూళి వహించి; ఱాయి యే
ర్పడనొక కాంతయయ్యెనట! పన్నుగ నీతని పాదరేణువి
య్యెడవడి నోడ సోక నిది యెట్లగు నోయని సంశయాత్ముడై
కడిగె గుహుండు రాముపదకంజ యుగంబు భయంబు పెంపునన్"

– మొల్ల రామాయణం

రామభద్రుని పాదధూళి సోకిన రాయి అహల్యగా మారిన వృత్తాంతాన్ని గుహుడికి వచ్చిన ధర్మసందేహంగా మొల్ల ఎంత చక్కగా అభివర్ణించింది! ఆమె వర్ణనలో ఎంత ఉద్వేగాత్మకత!! ఈ ఒక్క పద్యం చాలు తెలుగు సాహిత్య చరిత్రలో మొల్లను మహా రచయిత్రిగా నిలబెట్టడానికి!

ఛాత్రోపాధ్యాయులూ! మొల్ల ఊహా వైచిత్రి కోసం రాయలకాలంలో ఆమె రాసిన రమణీయ కావ్యం "రామాయణం" చదవండి.

మొల్ల అసలు పేరు ఆతుకూరి మొల. తెలుగులో 'రామాయణం' రాసి పేరెన్నికగన్న కవుల్లో ఈమెది అగ్రస్థానం. కవిత్వం అంటే ఎవ్వరికీ అర్థం కాని రీతిలో దుర్బోధములైన సంస్కృత సమాసాలతో నిండి వుండడం కాకుండా ధ్వని ప్రధానంగా వుండాలని; నాలుకను తాకిన వెంటనే తేనెలాగా నోరు తియ్యనయ్యేలా వుండాలని ఈమె చెప్పింది. చెప్పడమే కాదు – తన కావ్యాన్ని అలాగే రాసింది.

విన్న వెంటనే అర్థం కాకుండా గూఢ శబ్దాలతో కూర్చిన కావ్యం మూగ చెవిటి వారి ముచ్చటలా వుంటుందని ఆరోజుల్లోనే ఆధునిక భావాలు వెలువరించిన గొప్ప రచయిత్రి. ప్రకృతి వర్ణనలో ఈమెది అందె వేసిన చేయి! తన రామాయణ కావ్యాన్ని గొప్ప శిల్పంతో కూడిన చలనచిత్రంలలా మధుర సన్నివేశాల కల్పనతో అత్యంత వేగంగా నడిపించింది.

స్త్రీ మూర్తిగా సీత హృదయాన్ని పంచుకుంది. పసందైన కవిత్వం రాసి పాఠకుల అభిమానాన్ని పంచుకుంది.

**నాయక రాజుల యుగం నాటి కవిత్వం – తీరు తెన్నులు :**

క్రీ.శ. 1600–1775 (దక్షిణాంధ్ర యుగం) నాయకరాజుల యుగాన్ని కూడా ఆంధ్ర సాహిత్య చరిత్రలో

స్వర్ణయుగంగా భావిస్తారు. రాయలయుగం నాటి సాహిత్య వాతావరణం నాయకరాజుల యుగం వరకు కొనసాగింది.

భారత భాగవత రామాయణాలు ఈ యుగంలో ద్విపదకావ్యాలుగా రూపొందాయి. యక్షగానాలు, నాటకాలు, శృంగార పద్యాలు మొదలైన దేశిరచనలు విస్తారంగా వెలువడ్డాయి. నాయకరాజులలో ముఖ్యులైన రఘునాధనాయకుడు, విజయరాఘవ నాయకుడు, సంస్కృతంలోను, తెలుగులోను అనేక గ్రంథాలను రచించారు.

**చేమకూర వెంకటకవి :**

"ఇంటి పేరు నస అయినా కవిత్వంలో పస" అని ఈ కవి శిఖామణిపై విమర్శకులు విసిరిన ఛలోక్తిలో అతిశయోక్తి లేదు. నాయక రాజులలో ప్రసిద్ధి గాంచిన కవి చేమకూర వెంకటకవి.

"విజయ విలాసం" అనే అద్భుత కావ్యాన్ని రాశాడు. అద్భుత వర్ణనలతో, శృంగార రసప్రాధాన్యం కలిగిన ప్రబంధమిది. అర్జున సుభద్రల అందమైన ప్రణయ పరిణయ గాథ ఈ కావ్యంలోని ప్రధాన కథా వస్తువు. శ్లేష కవితా రచనకు చేమకూర పెట్టింది పేరు. ప్రతి పద్యంలోను ఏదో ఒక చమత్కారం చూపడం ఈయన ప్రత్యేకత. ప్రతి పద్యంలోను హృద్యమైన చమత్కారం చూపిన చేమకూర "విజయ విలాసం" పైన "విజయ విలాసం – హృదయోల్లాస వ్యాఖ్య" అనే పేరుతో తాపీ ధర్మారావు గొప్ప పరిశోదనా గ్రంథం రాశారు.

**నాయకరాజుల యుగంలో ప్రసిద్ధి గాంచిన ఇతర కవులు మరియు కవయిత్రులు :**

కంకటి పాపరాజు ఉత్తరరామాయాణాన్ని, పుష్పగిరి తిమ్మన సమీర కుమార విజయం, క్షేత్రయ్య రాసిన 4500 మువ్వ గోపాల పదాలు ఈ కాలంలోనివే. నాయక రాజులు తమ ఆస్థానంలోని కవులనే కాక కవయిత్రులను కూడా గౌరవించారు. రంగాజమ్మ "ఉషా పరిణయం, మన్నారుదాస విలాసం" అనే నాటకాన్ని రాసింది. ముద్దు పళని "రాధికా సాంత్వనం" అనే కావ్యాన్ని, తరిగొండ వెంగమాంబ 'వేంకటాచల మహత్యం' అనే పద్యకావ్యాన్ని, 'కృష్ణమంజరి' అనే ద్విపద కావ్యాన్ని రచించింది. ఏనుగు లక్ష్మణకవి "భర్తృహరి సుభాషిత త్రిశతి"ని తెలుగులోకి అనువదించాడు. దాశరథీ శతకాన్ని రాసిన కంచర్ల గోపన్న, ప్రజాకవి వేమన ఈ కాలం వారే.

**ప్రజాకవి వేమన :**

తెలుగు సాహిత్యంలో మొట్టమొదటి ప్రజాకవిగా పిలిపించుకున్న ఘనత వేమనదే! ఆయన కవిత్వం ప్రజల భాషలో, ప్రజాసమస్యలపై సాగింది. ఆయన రాసింది 'వేమన శతకం'. సుమారు 140 పద్యాల వరకు రాసాడు. సూటిగా, వ్యంగ్యంగా, హాస్యంగా, లోకోక్తిగా, పెద్ద విషయాన్ని చిన్న సూక్తిలో ఆటవెలది, పద్యాలతో రాసాడు. పండిత పామర జనులను తన పద్యాల ద్వారా మేలుకొలిపి ప్రజాకవిగా పేరు పొందాడు. ఆయన 'ఆటవెలది' నిత్యచేతనత్వానికి పర్యాయపదం. సాహిత్యాన్ని సామాజిక సంస్కరణకు, అభ్యుదయ భావ ప్రచారానికి పదునైన ఆయుధంగా వాడిన మొదటి ప్రజాకవి కూడా ఆయనే!

**క్షీణదశకు చేరిన ప్రాచీన సాహిత్యం :**

ఈ యుగంలో సాహిత్యం క్షీణదశకు చేరుకుంది. ఉదాత్తమైన కావ్యరచనకు రోజులు చెల్లిపోయాయి. హిమాలయోత్తుంగ శిఖరాల నుంచి జాలు వారిన గంగా ప్రవాహంలాంటి కమ్మని కవితా స్రవంతి చిలువల పలవల చీలికలుగా మారి సైదు కాలువల వెంట ప్రవహించింది. సృజనాత్మకమైన గొప్పరచనలు వెలువడలేదు. అందువల్లనే దీనిని 'క్షీణయగుం' అంటారు. అయితే కారుచీకటిలో కాంతిరేఖల్లా కాసుల పురుషోత్తమ కవి 'ఆంధ్ర నాయక శతకం', ఏనుగుల వీరస్వామి 'కాశీయాత్రా చరిత్ర' ఈ కాలంలో చెప్పుకోదగిన కావ్యాలని పేర్కొనవచ్చు.

క్షీణయుగంలో సైదుకాలువల వెంట ప్రవహించిన హీన కవిత్వాన్ని గురజాడ, శ్రీశ్రీ వంటి మహాకవులు తమ భీకర కవితా తపోగ్ని జ్వాలలతో నవ్యమార్గాన్ని పట్టించారు.

అంతటితో సరికొత్త భావాలతో ఆధునిక యుగం ప్రారంభమైంది.

# 3.6. ఆధునిక తెలుగు సాహిత్యం - కవులు - రచనలు - శైలులు
## (ఆంధ్ర, తెలంగాణ ప్రాంత కవులు / రచయితలు)

19, 20 శతాబ్దాలను ఆధునిక యుగంగా పేర్కొనవచ్చు. రాజారామమోహనరాయ్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్ వంటి సంఘ సంస్కర్తల వలన ఆంగ్ల విద్యావ్యాప్తి జరిగింది. భారతీయ సంస్కృతిలో మార్పు అవసరాన్ని నొక్కి చెప్పారు. దేశంలో సాంస్కృతిక పునరుజ్జీవనం మొదలయ్యింది. దీని వల్ల భారతీయుల్లో నాటుకుపోయిన మూఢనమ్మకాలు; పాత భావాలు క్రమంగా తగ్గుతూ కొత్త ఆచారాలు ప్రారంభమయ్యాయి. దీని ప్రభావం ఆధునిక తెలుగు సాహిత్యంపై పడింది. 19వ శతాబ్దం చివరి భాగంలో సాహిత్యం కొత్త దారులు తొక్కింది. ఇంగ్లీషు విద్యను చదవడం వలన కవుల ఆలోచనా పరిధి విస్తరించింది. అనేక విప్లవాలతో, ఉద్యమాలతో సాంఘిక సంస్కరణలతో తెలుగు సాహిత్యంలో అనేక మార్పులు వచ్చాయి. ఫలితంగా సంఘ సంస్కరణ రచనలు ప్రారంభమయ్యాయి. ఇట్టి రచనలు చేపట్టిన మహాపురుషులు కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు. వాడుకభాషలో ఆధునిక తెలుగు సాహిత్యానికి మూలపురుషుడు గురజాడ.

**కందుకూరి వీరేశలింగం :**


కందుకూరి వీరేశలింగం

ఆంధ్రదేశంలో సంస్కరణోద్యమాలకు, తెలుగు సాహిత్య పునర్వికాసానికి ఆధునిక కాలంలో మూలవిరాట్టు కందుకూరి వీరేశలింగం పంతులు. స్త్రీ సమాజోద్ధరణ ప్రధాన లక్ష్యంగా సమాజంలోని మూఢవిశ్వాసాలు, దురాచారాలు, ఆడంబారాలు మొదలైన దుర్లక్షణాలను తొలగించేందుకు వారు తమ సర్వస్వాన్నీ, శక్తినీ, జీవితాన్ని ధారపోశారు.

ఈనాడు తెలుగులో కన్పించే నవల, నాటకం, ప్రహసనం మొదలగు నూతన ప్రక్రియలకు నూతన ఒరవడిని ప్రవేశపెట్టినవారు కందుకూరి. వారు రచించిన రాజశేఖర చరిత్ర తెలుగులో మొదటి నవలగా గుర్తింపబడింది. ఆచారము అనే ప్రహసనాన్ని రాశాడు. సత్యరాజా పూర్వదేశ యాత్రలు అనేది వ్యంగ్యరచన. సంస్కృతం-ఆంగ్ల నాటకాలనేకం తెలుగులోకి అనువదించడమే కాకుండా “దక్షిణ గోగ్రహణం” వంటి స్వతంత్ర నాటకాన్ని రాశాడు. ఆయన రాసిన ఆంధ్ర కవుల చరిత్ర, స్వీయచంద్రిక ఎనలేని కీర్తిని తెచ్చిపెట్టాయి. క్షీణయుగంలోని అశ్లీలతను హేళన చేస్తూ “అభాగ్యోపాఖ్యానం” రాశారు. నీతి కథామంజరి, నీతి దీనిక అనే బాలసాహిత్యానికి సంబంధించిన రచనలు, సంగ్రహ వ్యాకరణం, అలంకార సంగ్రహం అనే లక్షణ గ్రంథాలను రాశారు. కందుకూరి వారిని తెలుగు వారు గద్యతిక్కనగా కీర్తించారు. వీరి రచన సరళ గ్రాంథిక భాషలో సాగింది. స్పష్టంగా, శక్తిమంతంగా, తనకు సత్యమనిపించిన విషయాలు నిర్భయంగా వ్యక్తం చేయడం వీరి ప్రత్యేకత. హేతుబద్ధత, శాస్త్రీయ దృక్పథం వీరి సాహిత్యానికి గీటురాళ్లు!

**గురజాడ :**


గురజాడ అప్పారావు

‘అడుగు జాడ గురజాడది
అదియుగయుగాల బాట
మనలో వెధవాయత్వం
మరిపించే పాట” అన్నాడు ఆధునిక మహాకవి శ్రీశ్రీ.

గురజాడ ముందుచూపుతో తెలుగు కవిత్వం ముందడుగు వేసింది. ఆంధ్రకవితా వధూటి నుదట ఆధునిక కవితా సింధూరం దిద్దిన మహాకవి గురజాడ. ఆయన పూర్తి పేరు గురజాడ అప్పారావు. గురజాడ అడుగుజాడలలో ఆయన జన్మించి నడయాడిన విజయనగర వీధులు పునీతమయ్యాయి. ఒక్క విజయనగరమే కాదు. ఆయన కలంతో విశాలాంధ్ర దేశాన్ని విశాల భావాలకు విశ్వనగరంగా

మార్చాడు. తెలుగులో విశ్వమానవతను ప్రబోధించిన తొలికవి అతడు. భాషలో, భావుకతలో తొలిగీతం పాడి తెలుగుజాతిని మేల్కొల్పిన నవయుగ వైతాళికుడతడు. 1910లో తన "ముత్యాల సరాలు" గేయంతో ఆధునిక కవిత్వానికి శ్రీకారం చుట్టారు.

'ముత్యాల సరం' కావ్యంలో వాడబడిన ఛందస్సు గురజాడ వారి స్వకపోలకల్పితమైన నూతన మాత్రా ఛందస్సు. ముత్యాల సరాల సరళిలోనే ఈయన రాసిన కరుణరసాత్మక కావ్య ఖండికలు "పూర్ణమ్మ", "కన్యక" మొదలైనవి తెలుగు భారతికి ఆయన అలంకరించిన రమణీయ ఆభరణాలు.

గురజాడ వారి 'దేశభక్తి' గేయ కవితలో 'దేశభక్తి' అంటే ఏమిటో కొత్త కోణంలో బోధించాడు.

"దేశమును ప్రేమించుమన్నా
మంచియన్నది పెంచుమన్నా
వొట్టిమాటలు కట్టిపెట్టోయి
గట్టి మేల్ తలపెట్టవోయ్"

"దేశాభిమానం నాకు కద్దని
వట్టి గొప్పలు చెప్పుబోకోయ్
దేశమంటే మట్టి కాదోయ్
దేశమంటే మనుషులోయ్" అన్నాడు.

దేశభక్తి అంటే ఈ దేశంలోని మట్టి, రాయి, రప్పలను ప్రేమించడం కాదు, మనుషులను ప్రేమించడం అని ప్రబోధించాడు.

గురజాడ 'కన్యాశుల్కం" వాడుక భాషలో రాయబడిన తొలి నాటకం. తెలుగుభాషలో కన్యాశుల్కం వంటి గొప్ప నాటకం ఇంతవరకు రాలేదని చాలా మంది విజ్ఞుల అభిప్రాయం. ప్రజల్లో పేరుకుపోయిన మూఢత్వాన్ని, అంధ విశ్వాసాలన ఖండించడం అందలి ప్రధానాంశాల మహత్తర నాటకీయ శిల్పం 'కన్యాశుల్కాన్ని' అజరామరం చేశాయి. ఆనాటి వాడుక భాషా ఉద్యమకర్త గిడుగు రామ్మూర్తి పంతులు గారికి అండగా నిలిచి "కన్యాశుల్కాన్ని" తీర్చిదిద్దాడు. ప్రపంచంతో గొంతు కలిపి అంతర్జాతీయ భావనలకు అంకురార్పణ చేశాడు.

ఆధునిక యుగంలో వెలసిన అనేక ప్రక్రియలు గురజాడ కలం నుండి జాలువారాయి. ఆ బాలగోపాలం ఇష్టపడే మొట్టమొదటి ఆధునిక కథానిక "దిద్దుబాటు". ఒక చదువుకున్న స్త్రీ చెడు మార్గం పట్టిన తన భర్త నడవడిని తన తెలివితేటలతో ఎలా సరిదిద్దుకుందో ఇందలి కథా వస్తువు. 'కొండు భట్టీయం', 'బిల్హణీయం' అనే నాటకాలు రాశారు. హాస్యాన్నీ, కారుణ్యాన్నీ పండించడంలో అద్వితీయులు, సామాజిక పరిశీలన, సంస్కరణ, స్వేచ్ఛ, మానవత్వం ఆయన రచనా విశేషాలు.

"నాది ప్రజల ఉద్యమం. దానిని ఎవరిని సంతోషపెట్టడానికైనా వదులుకోలేను... నా ఆశయం ప్రజల ఆశయం. సంస్కారవంతుల సదభిప్రాయం నాకు అండగా ఉంది". – గురజాడ అప్పారావు

**గిడుగు రామ్మూర్తి పంతులు :**



గిడుగు రామ్మూర్తి

గురజాడ 'కన్యాశుల్కం' నాటకాన్ని వాడుకభాషలో రచించి మహా నాటకకర్తగా లబ్ధప్రతిష్ఠుడైనా, శ్రీశ్రీ మహాప్రస్థానం కావ్యంరాసి"కాదేది కవితకనర్హం" అంటూ దిక్కులు పిక్కటిల్లేలా కొత్త ప్రవచనం చేసినా, ఒక నార్ల, ఒక చలం, ఒక రా.వి.శాస్త్రి, ఒక కాళోజీ, ఒక గద్దర్, ఒక దేవరకొండ బాల గంగాధరతిలక్, ఒక రావూరి భరద్వాజ తను అనుదిన జీవితంలో వాళ్లు మాట్లాడుకునే సజీవమైన భాషలో కవిత్వాన్ని లయాత్మక గీతంగా, వచన గేయంగా, కథగా, నవలగా మలచి తెలుగు సాహిత్య వనంలో వేయి పువ్వులు పూయించి,

కోటి పరిమళాలు వెదజల్లారంటే అందుకు మూలపురుషుడు ఒకే ఒక్కడు! అతడే గిడుగు! పిడుగు! ఆధునిక సాహిత్యానికి తెలుగుతల్లి పట్టిన మేలి రతనాల గొడుగు! "ఆంధ్ర భిషగ్వరుల భాషా భేషజాలు" అనే గ్రంథం గ్రాంథిక వాదులపై అతడు విసిరిన వ్యంగ్యాస్త్రం. అందుకే గిడుగు తెలుగు ప్రజలకు ప్రాతఃస్మరణీయుడు. ఆయన పుట్టిన రోజు (ఆగస్టు 29) మాతృభాషా దినోత్సవంగా జరుపుకుంటున్నాం.

**శ్రీ శ్రీ :**

శ్రీ శ్రీ అనే రెండక్షరాల కలయిక తెలుగు సాహిత్యచరిత్రలో ఓ అద్భుతం. శ్రీశ్రీ పూర్తి పేరు శ్రీరంగం శ్రీనివాసరావు. విశాఖపట్నం మహాసాగరం తీరాన ఉవ్వెత్తున లేచిన ఉత్తుంగ కవితాతరంగం మహాకవి శ్రీశ్రీ. 'మహా ప్రస్థానం' కావ్యంలో ఆయన మ్రోగించిన జీవనాదం ఆధునిక తెలుగు కవితకు వేదంగా మారింది. ఆయన విశాఖపట్నంలో పుట్టడం వల్లే కాబోలు



శ్రీ శ్రీ

"తెలుగు దేశపు తూర్పు సముద్రం ముక్క
కేవలం నా కన్నీటి చుక్క" – అంటాడు.

ఒకనాడు గంగాజలంలా పవిత్ర హిమాలయాల నుండి గలగల జాలువారిన ఉన్నత తెలుగు కవితా ప్రవాహం క్షీణయుగం చివరి రోజుల నాటికి సైడు కాలువల వెంట ప్రవహించింది. గిడుగు రామ్మూర్తి పంతులు గారు తెచ్చిన వ్యవహారిక భాషా ప్రభంజనంతో తెలుగు భాషలో పాత నీరు కొట్టుకుపోయి కొత్త నీరు ప్రవేశించింది. కొత్త భావాలు పల్లవించాయి. సరికొత్త సాహితీ ప్రక్రియలు మొగ్గ తొడగడం మొదలుపెట్టాయి. వీటన్నంటికీ ఆద్యుడు గురజాడ.

"సుమారు వెయ్యేళ్లు అవ్యాహతంగా సాగుతూ నలిగిన క్లాసికల్ బండి దారి నుంచి గురజాడ తెలుగు కవిత్వానికి ఒక కొత్త మలుపు ఇచ్చాడు. రథాలు, పల్లకీలు, గుర్రబ్బళ్లూ వెళ్లే దారిని తప్పించి, మోటారు బళ్లూ, రైలుబళ్లూ తిరిగే ఆధునిక యుగానికి తెలుగు కవిత్వాన్ని మళ్లించాడు. – గురజాడ చూపిన మలుపును నేను మరింత వెడల్పు చేశాను" – శ్రీశ్రీ

గురజాడ శ్రీకారం చుట్టిన ఆధునిక కవిత్వం శ్రీశ్రీ రాకతో మరో 'శ్రీ' చేరి ద్విగుణీకృతంగా శోభిల్లింది. అందుకే ఆధునిక కవిత్వానికి గురజాడ ఆద్యుడైతే శ్రీశ్రీ ఆరాధ్యుడయ్యాడు.

శ్రీశ్రీ కవిత్వం ప్రజల్లోకి ప్రవహించింది. తెలుగు ప్రజల నరనరాలకు ఎక్కింది. ముఖ్యంగా ఆయన కవితారీతికి పులకించిపోయింది.

"మరో ప్రపంచం మరో ప్రపంచం
మరో ప్రపంచం పిలిచింది"

"ఎముకలు కుళ్లిన, వయసు మళ్లిన
సోమరులారా!చావండి!
నెత్తురు మండే, శక్తులు నిండే
సైనికులారా! రారండి!"

"ఏ దేశ చరిత్ర చూచినా
ఏమున్నది గర్వకారణం?
నరజాతి చరిత్ర సమస్తం
పరపీడన పరాయణత్వం"

"తాజ్‌మహల్ నిర్మాణానికి
రాళ్లెత్తిన కూలీలెవ్వరు?"

అంటూ శ్రీశ్రీ తన మహాప్రస్థానంలో కవిత్వాన్ని పరుగులు తీయించాడు. మహాప్రస్థానం తరువాత ఆయన రాసిన మరో కావ్యం "మరో ప్రస్థానం". 1970 దశకంలో శ్రీశ్రీ 'చరమరాత్రి' అనేక కథల సంపుటి కూడా రాశాడు. మొదట్లో ఆయన రాసిన ఛందోబద్ధకావ్యం 'ప్రభవ'. అటు తర్వాత మారిన ప్రాపంచిక సాహితీ దృక్పథాలతో, మార్క్సిస్టు భావాలతో ప్రభావితుడై పేద ప్రజల, శ్రమజీవుల పక్షం వహించి మహాప్రస్థానం, మరో ప్రస్థానం, ఖడ్గ సృష్టి వంటి విప్లవకావ్యాలు రాశాడు. "అనంతం" ఆయన రాసుకున్న అనంత జీవిత చరిత్ర., 'సిప్రాలి' ఆయన చివరి ఆధునిక కావ్యం. 'సి అంటే సిరిసిరిమువ్వలు, 'ప్రా' అంటే ప్రాసక్రీడలు, 'లి' అంటే లిమరుక్కులు. ఈ మూడింటి విచిత్ర సమ్మేళనమే 'సిప్రాలి'.

సినిమా పాటల్లో పైతం మహా కవిత్వ ధోరణులు చూపిన మహనీయుడాయన!! "పాడవోయి భారతీయుడా", "ఆడుతు, పాడుతు పని చేస్తూంటే", "ఉందిలే మంచికాలం ముందు ముందునా", "ఓ సజీవ శిల్ప సుందరీ! నా జీవన రాగమంజరి"! "తెలుగువీర లేవరా" వంటివి ఉదాహరణలు. 'ఖడ్గసృష్టి' కావ్యానికి 1966లో సోవియ్‌భూమి నెహ్రూ అవార్డు, 1973 కేంద్ర సాహిత్య అకడామీ అవార్డు లభించాయి. అయినా అవార్డులకు రివార్డులకు అతీతుడాయన! ఔను!! "ముగ్గేలా! తాజ్‌మహల్ మునివాకిటిలో!" తన మహాప్రస్థానం కావ్యంతో గురజాడ చూపిన ఆధునిక కవితా మార్గాన్ని జాతీయ రమాదారిగా మార్చాడు మహాకవి శ్రీశ్రీ.

ఆధునిక యుగంలో కూడా సాంప్రదాయబద్ధంగా రాస్తూ విశ్వజనీనమైన నూతన భావాలను, శాస్త్రీయ దృక్పథాన్ని సాహిత్యంలో పల్కించిన కవులలో గుర్రం జాషువా గారు ఒకరు.

**గుర్రం జాషువా :**


గుఱ్ఱం జాషువా

"కులమతాలు గీచుకున్న గీతల జొచ్చి
పంజరమున చిక్కువడను నేను!
నిఖిల లోకమెట్లు నిర్ణయించిననేమి?
తిరుగులేని విశ్వనరుడ నేను" – గుర్రం జాషువా

సమాజాన్ని జాగృతం చేస్తూ తనదైన ప్రత్యేక బాణీలో కమ్మని తెలుగు నుడికారంతో పద్యాలు రాసి ప్రజల నాల్కలపై నాట్యమాడించిన ప్రజ్ఞాశాలి గుర్రం జాషువా.

రాజు చేతి కత్తి రక్తమ్ము వర్షించు
సుకవి చేతి కలము సుధలు కురియు
రాజు జీవించు రాతి విగ్రహము లందు
సుకవి జీవించు ప్రజల నాలుకల యందు

జాషువా సుకవిగా ప్రజల గుండెల్లో ఇంకా జీవించి ఉన్నాడు. ఆయన రాసిన గబ్బిలం, పిరదౌసి, ముంతాజ్ మహల్, స్వప్నకథ, నాకథ, నేతాజీ, బాపూజీ, కీస్తు కథ, కొత్త లోకము, ఖండకావ్యాలు గొప్ప కవితా శిల్పాలు! ఆధునిక కాలంలో యువకులను వెన్నుతట్టి నడిపాడు. దళిత కవిత్వం అని ఆనాటికి ప్రత్యేకమైన పేరు లేకున్నా 'గబ్బిలం' కావ్యం ద్వారా దళిత కవిత్వ పితామహుడుగా పేరుగాంచాడు. కవికోకిల, నవయుగ కవిచక్రవర్తి ఈయన బిరుదులు. ప్రభుత్వం 'పద్మభూషణ్' అవార్డుతో సత్కరించింది.

ఆధునిక యుగానికి సంచలన కర్తలైన గిడుగు రామ్మూర్తి పంతులు; గురజాడ; శ్రీశ్రీ; జాషువాలను గురించి చెప్పుకున్నాం కదా! ఈ యుగంలోని మరి కొందరు కవులను, రచయితలను విహంగ వీక్షణం చేద్దాం!

**విశ్వనాథ సత్యనారాయణ :**

సాహిత్యంలో హిమాలయోత్తుంగ శిఖరం అనవచ్చు. ఆయన చేపట్టని ప్రక్రియ లేదు. భారతీయ ఆర్షసంస్కృతికి ప్రతినిధి. మొదటి జ్ఞానపీఠ అవార్డు గ్రహీత (శ్రీమద్రామాయణం కల్పవృక్షం కావ్యానికి). వేయి

పడగలు, ఏకవీర, చెలియలి కట్ట, వనిఉ శ్రీఃఋఖఉ నవలలు రాశారు. గ్రాంథికంలో రాసినా చక్కని వచన శైలి, కిన్నెరసాని పాటలు పేరు తెచ్చిన కావ్యం. పద్యరచన మాత్రం ఎంతో పండితులకు తప్ప మామూలు పాఠకులకు ఇసుమంతైనా కొరుకుడు పడదు. 'పాషాణ పాక ప్రభువులు'! చాలా ప్రాచీన కావ్యాలకు అంతరార్థంతో కూడిన పీఠికలు రాశారు. తానే చెప్పుకున్నట్లు ఈ కాలంలో పుట్టవలసిన కవి కాదు. వేనరాజు, నర్తనశాల మొదలైన నాటకాలు, ముగ్గురు బిచ్చగాళ్లు, మాక్సీదుర్గంలో కుక్క మొదలైన కథలు వీరి రచనల్లో ముఖ్యమైనవి. ప్రభుత్వం 'పద్మభూషణ్' అవార్డుతో సత్కరించింది. 'కవి సామ్రాట్'గా సుప్రసిద్ధులు.


విశ్వనాథ సత్యనారాయణ

**సి.నారాయణరెడ్డి :**

నిత్య కవితా శ్రామికుడు. తెలంగాణ జీవగడ్డ కడుపార కన్న ముద్దుబిడ్డ. జనరంజకమైన కావ్యాలు రాశారు. పండిత పామర జన రంజకమైన పాటలు రాశారు. "ఈ నల్లని రాళ్లలో ఏ కన్నులు దాగెనో ఈ బండల మాటున ఏ గుండెలు మోగెనో" అమరశిల్పి జక్కన సినిమాలో ఎంత చక్కని పాట!

'విశ్వంభర' కావ్యానికి జ్ఞానపీఠ అవార్డు పొందిన రెండో కవి! కర్పూర వసంతరాయులు; నాగర్జునసాగరం; జాతిరత్నం, విశ్వనాథ నాయకుడు మొదలైనవి వీరి ప్రసిద్ధ కావ్యాలు. సామాజిక స్పృహ, శాస్త్రీయ దృక్పథం కల్గిన ఆధునిక కవి.

"వచ్చిండన్నా వచ్చాడన్నా
వరాల తెలుగు ఒకటేనన్నా!"
అంటూ ఉగ్గడించిన ఉద్ధండ కవి.


సి.నారాయణరెడ్డి

**ఆరుద్ర :**

అత్యంత ఆధునిక కవి. సాంప్రదాయం – ఆధునికత ఈ రెండింటి అంచులు చూచిన కవి. 'త్వమేవాహం' ఇతని ఉత్తమ కావ్యం.

"నువ్వు ఎక్కవలసిన రైలు
ఒక జీవితకాలం లేటు!"
– ఎంత చక్కగా జీవితాన్ని వ్యాఖ్యానించారు!

సినీవాలి; ఆరుద్ర వ్యాస పీఠిక వీరి గ్రంథాలు. 12 సంపుటాల సమగ్ర ఆంధ్ర సాహిత్య చరిత్రను సామాన్యులు సైతం అర్థం చేసుకునేలా ఎంతో సరళంగా రాశారు. ఈ గ్రంథాన్ని ఏండ్ల తరబడి రాసి అందుకు తన యవ్వనకాలాన్ని ధారపోశారు.


ఆరుద్ర

వీరు రాసిన సినిమా పాటలు ముత్యాల మూటలు! సినిమా పాటల్ని సైతం సాహిత్య గుళికలుగా మార్చిన ఘనత వీరిది. ఈయన కథలు కూడా రాశారు.

"రాయినైనా కాకపోతిని రామ పాదము సోకగా" – సినిమా పాటైనా ఎంత భావుకత!

సాహితీ హృదయాలను నిద్ర లేపిన కవి ఆరుద్ర!

**దాశరథి :**

"కోటి రతనాల వీణ – నా తెలంగాణ అన్న మేటికవి!

'అగ్నిధార', 'గాలిబ్ గీతాలు' వీరి అభ్యుదయ కావ్యాలు. 'గాలిబ్ గీతాల' గ్రంథాన్ని సినిమా హీరో అక్కినేని అంకితం పొందారు. తెలంగాణా సాయుధ పోరాటంలో పాల్గొన్న కవి వీరుడు.

సినిమా పాటలు రాయడంలో అందెవేసిన చేయి!


దాశరథి

**రావూరి భరద్వాజ :-**


రావూరి భరద్వాజ

"రసమయ భావాలకు
తెరిచిన దర్వాజా
రావూరి భరద్వాజా
- కుందా

పేదరికంలో సామాన్యస్థితి నుండి అసామాన్య స్థితికి ఎదిగిన వ్యక్తి! గొప్ప కథకుడు. నవలాకారుడు. ఈయన నవల "పాకుడు రాళ్లు" నాలుగైదు సంవత్సరాల పాటు ఆనాటి జాతీయ వారపత్రిక "కృష్ణాపత్రిక"లో సీరియల్‌గా ప్రచురింపబడింది. పాకుడురాళ్లు నవల తెలుగులో మూడోసారి జ్ఞానపీఠ అవార్డుకు ఎంపికైంది. ప్రముఖ పత్రికా రచయిత, సినిమా పత్రికలకు జర్నలిస్ట్‌గా పనిచేశారు. "జీవన సమరం" అనే శీర్షికతో ఈనాడు పత్రికలో అభాగ్యులైన పేదవారి జీవితాలను చిత్రించారు. దాదాపు కొన్ని వంద కథలు రాశారు. దుర్భరమైన 'పేదరికం' చుట్టూ ఆయన రచనలు పరిభ్రమిస్తాయి.

**దేవరకొండ బాలగంగాధర్ తిలక్ :**


దేవరకొండ

"కవిత్వం ఒక ఆల్కెమీ
అగ్ని చల్లినా, అమృతం వర్షించినా
అందం, ఆనందం దాని పరమావధి"

అంటూ కవితాతత్వాన్ని వివరించిన కవి. ఈయన రాసిన "అమృతం కురిసినరాత్రి" తెలుగు వచన కవితా సాహిత్యంలో అజరామరం!

"నా అక్షరాలు వెన్నెల్లో ఆడుకునే అందమైన ఆడపిల్లలు"
"నా అక్షరాలు కన్నీటి జడులలో తడిసిన దయాపారావతాలు"

ఇలా అనడం తిలక్‌కే చెల్లింది! ఈయన 'తిలక్ కథలు' పేరుతో చక్కటి కథలు రాశారు! ఈయన మంచి కథకుడు కూడా!

'అమృతం కురిసిన రాత్రి' కావ్యం తెలుగు సాహిత్యంలో ఓ మైలురాయి.

దేవరకొండ బాలగంగాధర్ తిలక్ ఏభై ఏండ్లకే చనిపోయారు! అందుకే ఈ కవి చనిపోయినప్పుడు శ్రద్ధాంజలి ఘటిస్తూ శ్రీశ్రీ "సాహిత్య నభోమణి; కవితా శిరోమణి నడినింగిని మాయమయ్యాడా?" అన్నాడు.

**దేవులపల్లి కృష్ణశాస్త్రి :**


దేవులపల్లి కృష్ణశాస్త్రి

భావకవిత్వానికి మకుటం లేని మహరాజుగా చలామణి అయ్యారు. మహాకవి శ్రీశ్రీ సైతం ఒకానొక కాలంలో ఈయన భావ కవిత్వ ప్రవాహంలో కొట్టుకుపోక తప్పలేదు. అంత ప్రతిభావంతుడైన కవి. ఈయన కృష్ణపక్షం భావకవిత్వానికి భారతం వంటిది.

'మల్లీశ్వరి', 'మేఘసందేశం' మొదలైన సినిమాల్లో కావ్యగౌరవం సంతరించుకున్న శ్రావ్యమైన పాటలు రాశారు!

భావకవిగా "ఆకులో ఆకునై
పూవులో పూవునై
ఈ అడవి దాగిపోనా?
ఎటులైన ఇచటనే నిలిచిపోనా?"

అని పాడిన ఈ కవి గొప్ప భావకవిగా మన హృదయాల్లో నిలిచిపోయారు! ప్రవాసం, ఊర్వశి, పల్లకి మొదలైన ఖండకావ్యాలు రాశారు.

**గద్దర్ :**



గద్దర్

ఈయనను ప్రజాయుద్ధ నౌక అంటారు. తాను నమ్మిన సిద్ధాంతాలకు అనుగుణంగా గుండె ధైర్యంతో, తుపాకీ తూటాలకు కూడా వెరవకుండా ప్రజాకవిగా ప్రజల్లో నిండిపోయారు.

ప్రజా కవి మాత్రమేకాదు – మహాకవి కూడా! ఈయన తెలంగాణా కవి అయినా మేలుకొలిపే తన ఆటపాటలతో భారతదేశం అంతటా ప్రాచుర్యం పొందారు! శ్రీశ్రీ బాటలో నడిచి తన కవితను శ్రామిక జన కళ్యాణానికి ఉపయోగించి వెలుగు చూపే వేగుచుక్కగా మారారు.

గద్దర్ లేకుంటే తెలంగాణా పోరాటం ఇంత వేగవంతం అయ్యేది కాదేమో! ఈయనతో పోల్చాలంటే ప్రాచీన సాహిత్యంలో ఒక్కరే ఒక్కరు ఉన్నారు. అతడే మహాకవి క్షేత్రయ్య! క్షేత్రయ్యలాగే గద్దర్ రాయగలరు, పాడగలరు, ఆడగలరు. ఇలా మూడు ప్రజ్ఞలు ఒకే వ్యక్తిలో మూర్తీభవించి పరాకాష్ఠ పొందడం చరిత్రలో అరుదైన ఘట్టం. ఏది ఏమైనా ధనమదాంధులకు నిద్దుర లేకుండా చేసిన కవులలో గద్దర్ ఒకరు!

**రాచకొండ విశ్వనాథశాస్త్రి :**



రాచకొండ విశ్వనాథశాస్త్రి

విశాఖపట్నం కన్న విశిష్ట విప్లవ రచయిత. శ్రీశ్రీకి నిజమైన వారసుడు! గొప్ప నవలాకారుడు! కథకుడు!

అల్పజీవి; 'రాజు–మహిషి', రత్తాలు–రాంబాబు, గోవులొస్తున్నాయి జాగ్రత్త వీరి ప్రసిద్ధ నవలలు. రచనలో శ్రీకాకుళం మాండలికలను ప్రయోగించారు. 'ఆరు సారా; కథలు'; నవోదయ వారు ప్రచురించిన 'బాకీ కథలు' వీరికి మంచి పేరు తెచ్చాయి. వీరు రాసిన కొన్ని కథలు, నవలలు కావ్య రచనా స్థాయిని అందుకున్నాయి.

ఈయన రాసిన 'వెన్నెల' అది కథా? లేక కవిత్వమా? 'రాజు–మహిషి' నవలా లేక మహాప్రబంధమా? అయితే ఏ నవల రాసినా దానిని పూర్తి చేయకపోవడం ఆయన లోపం – తెలుగు సీమ చేసుకున్న పాపం!

**పుట్టపర్తి నారాయణాచార్యులు :**



పుట్టపర్తి నారాయణాచార్యులు

వీరిని సరస్వతీ పుత్రుడంటారు. రాయలసీమ అనర్ఘరత్నం. సంగీత సాహిత్యాల మధుర సమ్మేళనం ఈయన కవనం! గొప్ప పండిత కవి., 'శివతాండవం' అనే గొప్ప సంగీతబద్ధమైన కావ్యాన్ని రాశారు. ఈ కావ్యాన్ని సాక్షాత్తూ పుట్టపర్తి నారాయణాచార్యుల వారే ఆడుతూపాడుతూ లయాత్మకంగా చదువుతుంటే విన్న వారి జీవితం చరితార్థమైనట్లు భావిస్తారు.

**కాళోజీ :**

తెలంగాణా మాగాణంలో లభించిన కవితా కళల అపరంజి కాళోజీ! విలక్షణమైన కవి, ప్రజలను, తెలంగాణా చారిత్రక నేపథ్యాన్ని, సంస్కృతిని ప్రేమించిన మహాకవి. విప్లవం పల్లవించిన ప్రజాకవి. సామాన్య ప్రజలను ఉత్తేజితులను చేసే దీక్షతో ప్రభుత్వంతో సాహసవంతమైన పోరు సల్పిన సాహసకవి. పోరాటమే ఊపిరిగా గడిపిన విలక్షణ కవి. ప్రజల పక్షాన నిలబడ్డ విప్లవ కవి. 'నా గొడవ' కాళోజీ నడిపిన నవ్య కవిత్వపు నావ. అదే ఆయన భావితరాలకు చూపిన బంగారు త్రోవ!

కాళోజీ

**త్రిపురనేని గోపీచంద్ :**


త్రిపురనేని గోపీచంద్

గొప్పకథకుడు, నవలా కర్త. ఈయన కథల్లో, నవలల్లో అనంతమానవతావాదం అంతర్లీనంగా కనిపిస్తుంది. కథను సరళసుందరంగా రాసుకుపోతాడు. కథల్లో అభ్యుదయ భావాలను సున్నితంగా పలికిన సారస్వత రథికుడు. "అసమర్థుని జీవయాత్ర" వీరికి పేరు తెచ్చిన గొప్ప నవల. యమపాశం, మెరుపుల మరకులు, పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామా, చీకటి గదులు ఈయన ఇతర నవలలు. భార్యల్లోనే వుంది మొదలైన కథలు ఉత్తమమైనవిగా పరిగణించారు. 'మాకు ఉన్నాయి స్వగతాలు' – సరికొత్త ప్రక్రియ. ఇందులో బతుకుబండిలాగే బడుగు జీవులు తమ వెతలను చెప్పుకుంటారు. మనుషులే కాదు మానూ మాకులు సైతం! రిక్షావాడు, పసిపిల్ల తుమ్మచెట్టు, చెప్పులు కుట్టేవాడు. వీరు చెప్పుకునే స్వగతాలకు కళ్లు చెమర్చుతాయి.

**బుచ్చిబాబు :**


బుచ్చిబాబు

"బుచ్చిబాబు లేడు
మనసిచ్చు బాబు లేడు" – ఆయన చనిపోయినప్పుడు ఎవరో గొప్పకవి అన్నమాట. బుచ్చిబాబు అసలు పేరు శివరాజు వెంకట సుబ్బారావు. మహాకథకుడు, నవలాకారుడు. ఈయన రాసిన "చివరకు మిగిలేది" నవల గొప్పతాత్విక నవలగా తెలుగు సాహిత్యం వున్నంత వరకు తెలుగు ప్రజలకు మిగిలేది! కథా సాహిత్యంలో చైతన్య స్రవంతి ప్రక్రియలో; సిగ్మండ్ ఫ్రాయిడ్ మనోవిశ్లేషణ సిద్ధాంత నేపథ్యంలో చక్కని కథలు రాశారు. 'నిరంతరత్రయం' మొదలైన కథలు ఎంతో పేరు తెచ్చాయి.

**మునిమాణిక్యం నరసింహారావు :**


మునిమాణిక్యం

చక్కని తెలుగు పలుకుబడితో; సున్నితమైన హాస్యవరవడితో గిలిగింతలు పెట్టిన గొప్ప రచయిత. ఈయన 'కాంతం కథలు' సుప్రసిద్ధం. 'కాంతం' లాంటి భార్య కోసం ప్రతిపురుషుడు తపించే విధంగా ఆపాత్రను తీర్చిదిద్దారు. ఆమె చక్కదనం; మాటల్లో గడసరితనం; నడతలో చురుకుతనం; అప్పుడప్పుడూ తనకు అమాయకంగా కనిపించే భర్తపై ఆవిడ విసిరే చెణుకులు పాఠకులను అలరిస్తాయి. ఇంటింటా కాంతం లాంటి ఇల్లాలు వుంటే నవ్వుల పువ్వులే! సంసార వృక్షం పల్లవిస్తుంది, ఫలిస్తుంది. ఈయన కథలన్నీ తన భార్య కాంతం చుట్టే తిరుగుతాయి. కాంతం లాంటి మహిళా మాణిక్యాన్ని సృష్టించి ఆ పాత్రను అజరామరం చేసిన మునిమాణిక్యం ధన్యుడు.

**పానుగంటి లక్ష్మీనరసింహారావు :**


పానుగంటి

గ్రాంధికవాది అయినా ఈయన 'సాక్షి' వ్యాసాలకు చక్కటి ప్రాచుర్యం వుంది. ఇంగ్లీషు రచయిత ఎడిషన్ 'స్పెక్టేటర్' స్ఫూర్తితో ఈ వ్యాసాలు రాశారు. హాస్యధోరణిలో సమాజంలో కనిపించే కొందరు వ్యక్తుల విచిత్ర ధోరణులపై పెడదారి తొక్కుతున్న తెలుగు సంస్కృతి పై ఈయన సంధించిన విమర్శనాస్త్రాలే సాక్షి వ్యాసాలు!

**కొడవగంటి కుటుంబారావు :**



మార్క్సిస్ట్ భావాలను పూర్తిగా వంట పట్టించుకున్న మహారచయిత. సగటు మానవుడే ఇతివృత్తంగా అద్భుతమైన కథలు; నవలలు రాశారు. ఇతని రచనలు ఆలోచింపచేస్తాయి. వైజ్ఞానిక ధోరణిలో ఎన్నో గ్రంథాలు రాశారు. 'చదువు' నవల సమాజాన్ని ఎత్తి చూపుతుంది. కుటుంబరావు కథలు మధ్య తరగతి కుటుంబ వ్యవస్థను సరళంగా ప్రదర్శిస్తాయి. చాలా తేలికైన వాడుక

భాషలో, ఏమాత్రం భేషజం లేకుండా కథలు రాస్తారు. 'చందమామ' బాలల పత్రికకు మొదటి ఎడిటర్‌గా పేరొందిన కుటుంబరావు తెలుగు సాహిత్యాకాశంలో కథాశరత్‌చంద్రికలు వెలయించిన చందమామ!

**తాపీ ధర్మారావు :**


తాపీ ధర్మారావు

గొప్ప సాహిత్య పరిశోధకుడు, పదునైన వచన కర్త. అటు ప్రాచీన సాహిత్యంలోను, ఆధునిక సాహిత్యంతోను పరిచయమున్న సాహితీవేత్త.

అనేక ప్రాచీన కావ్యాలను కొత్త కోణంలో పరిశోధించాడు. నూతన అంశాలను ఆవిష్కరించాడు. ఈయనకు మహా అభిమానపాత్రుడు ప్రాచీన కవి చేమకూర వెంకటకవి. చేమకూర రాసిన "విజయవిలాసం" కావ్యంపై తాపీ ధర్మారావు రాసిన పరిశోధనా గ్రంథం 'విజయ విలాసం – హృదయోల్లాస వ్యాఖ్యానం' సాహిత్య పరిశోధనా రంగంలో గొప్ప విమర్శనాత్మక గ్రంథంగా పేర్కొంటారు విమర్శకులు.

తాపీ ధర్మారావు రచన హేతుబద్ధంగా, శాస్త్రీయ దృక్పథంతో పాఠకులను ఆలోచింపచేసే విధంగా ఉంటుంది. ఆయన రాసిన "దేవాలయాల మీద బూతు బొమ్మలెందుకు?" "కొత్తపాళీ" తదితర రచనలు చాలా ప్రామాణికమైనవి.

**రాయప్రోలు సుబ్బారావు :**


రాయప్రోలు సుబ్బారావు

భావకవి. ఆధునిక కాల్పనిక కవులలో ప్రథమగణ్యుడు. కాల్పనిక కవితకు ప్రణయం ప్రధానం. వీరు ప్రతిపాదించిన 'ప్రణయ సిద్ధాంతం','అమలిన శృంగారం'. ఈ సిద్ధాంతమునకు లక్ష్యముగా 'తృణకంకణము' అనే కావ్యాన్ని రాశారు. స్వచ్ఛ ప్రణయమునకు లక్ష్యభూతముగా రచింపబడిన కావ్యం 'తృణకంకణము'. వీరు రాసిన స్నేహలత, కష్టకమల కరుణ రసాత్మకములు

ఏ దేశమేగినా, ఎందుకాలిడినా
ఏ పీఠమెక్కినా ఎవ్వరెదురైనా
పొగడరా నీ తల్లి భూమి భారతినీ
నిలుపరా నీజాతి నిండు గౌరవము..

వంటి దేశభక్తి గేయాలు సుప్రసిద్ధాలు. వీరు ఆంధ్రావళి, జడకుచ్చులు, రమ్యాలోకం, మాధురీ దర్శనం రాశారు.

**భావకవులు :**


నాయని సుబ్బారావు

భావకవులలో ప్రసిద్ధులైన వారిలో శ్రీ వేదుల సత్యనారాయణ 'దీపావళి' ఖండకావ్యమును, అబ్బూరి రామకృష్ణారావు 'మల్లికాంబ', నాయని సుబ్బారావు 'సౌభద్రుని ప్రణయ యాత్ర', అడవి బాపిరాజు 'శశికళ', దువ్వూరి రామిరెడ్డి 'కడపటి వీడ్కోలు', తల్లావజ్ఝల శివశంకర శాస్త్రి 'హృదయేశ్వరి', విశ్వనాథ సత్యనారాయణ కిన్నెరసాని పాటలు, శశిదూతం, గిరి కుమారుని ప్రేమ గీతాలు, భావకవిత్వపు కావ్యాలలో ముఖ్యమైనవి.

**నయాగరా కవులు :**


బెల్లంకొండ రామదాసు

అభ్యుదయ రచయితలలో సంచలనాన్ని సృష్టించిన వారు నయాగరా కవులు. బెల్లకొండ రామదాసు, కుందుర్తి ఆంజనేయులు, ఏల్చూరి సుబ్రహ్మణ్యం వీరు ముగ్గురూ కలసి "నయాగరా" కవితా సంపుటిని రాశారు. వీరి కవితలో యుద్ధాలు, విప్లవాలు, కార్మిక, కర్షకుల కష్టాలు మొదలైనవి వస్తువులు.

**దిగంబర కవులు :**

ఆరుగురు రచయితలు కలసి విచిత్రమైన కలం పేర్లతో దిగంబర కవిత్వాన్ని వెలువరించారు. వారు నగ్నముని (కేశవరావు), నిఖిలేశ్వర్ (యాదగిరిరెడ్డి), చెరబండరాజు (బద్దం భాస్కరరెడ్డి), మహాస్వప్న (కమ్మిరెడ్డ వెంకటేశ్వరరావు), జ్వాలాముఖి (వీర రాఘవాచార్యులు), భైరవయ్య (మన్‌మోహన్‌సహాయ్) నిజాన్ని నగ్నంగా చెప్పడం వీరి ప్రత్యేకత.

**స్త్రీ వాద కవిత్వాన్ని రాసిన కవులు, కవయిత్రులు :**

స్త్రీ వాద కవిత్వాన్ని రాసి స్త్రీల చైతన్యానికి కృషి చేసిన వారు చలం, కుటుంబరావు, రంగనాయకమ్మ, లత మొదలైనవారు. పి.సత్యవతి, ఓల్గా, కుప్పిలి పద్మ, సుజాత మొదలైనవారు తమ నవలలు, కథల ద్వారా స్త్రీ సమస్యలను స్పృశించి స్త్రీల అభ్యున్నతికి పాటుపడ్డారు. రేవతీ దేవి, సావిత్రి, విమల, జయప్రభ, మహెజబీన్, కొండేపూడి నిర్మల, తమ కవితా సంకలనాల ద్వారా స్త్రీ వాద సాహిత్యాన్ని సృష్టించారు.

**దళితవాద రచయితలు :**


ఉన్నవ లక్ష్మీనారాయణ

దళితవాద రచనలలో మొట్టమొదటగా వచ్చిన నవల "అన్‌టచ్‌బుల్". దీని రచయిత ముల్క్‌రాజ్ ఆనంద్. తెలుగులో దళిత సమస్యలపై రాసిన నవలల్లో తల్లాప్రగడ సూర్యనారాయణ రాసిన "హేలావతి", వేంకట పార్వతీశ కవుల "మాతృమందిరం", ఉన్నవ లక్ష్మీనారాయణ "మాలపల్లి" ముఖ్యమైనవిగా పేర్కొనవచ్చు. దళిత కవిత్వం రాసిన మరోకవి ఎండ్లూరి సూధాకర్ 'పంచమవేదం' రాశాడు. బొజ్జాతారకం, కత్తి పద్మారావు, గుంటూరు ఏసుపాదం, గద్దర్, శివసాగర్, అంజయ్య వంటి కవులు పోరాట గీతాల ద్వారా దళిత కవితను ముందుకు తీసుకుపోతున్నారు.

**గుడిపాటి వెంకటచలం :**


గుడిపాటి వెంకటచలం

మహా కవి శ్రీశ్రీ చలం గారిని 'మహర్షి' అని సంబోధిస్తాడు. మహాప్రస్థానంలాంటి ఆధునిక మహాకావ్యానికి ముందు మాటలు రాయడం మాటలా?

చలం స్వేచ్ఛాజీవి. స్త్రీల స్వేచ్ఛ కోసం సామాజిక దురాచారాలను అంతం చేయడం కోసం కలం పట్టిన మహా రచయిత. వాడుక భాషను చాలా శక్తివంతంగా; అనితర సాధ్యంగా తీర్చిదిద్దిన భాషాశిల్పి! 'మైదానం' నవల సుప్రసిద్ధం. తెలుగు సాహిత్యానికి అది ఆయన చేసిన వరదానం! 'కర్మమిట్లా కాలంది!' 'పువ్వు పూసింది' మొదలైన కథలు స్త్రీ స్వేచ్ఛకు కరదీపికలు. 'స్త్రీ విద్య – బిడ్డల సంరక్షణ' వీరి మరో రచన. తెలుగు సారస్వతంలో చలం గారికి విశిష్టస్థానం ఉంది. బెంగాలీ నవలా సాహిత్యంలో శరత్‌చంద్ర ఎలాంటి వాడో చలం అలాంటివాడు. వీరి పూర్తి పేరు గుడిపాటి వెంకటచలం. ఈయన కలం స్వేచ్ఛ కోసం స్త్రీ జాతిపై చల్లిన అమృత జలం!

**కాళీపట్నం రామారావు :**


కాళీపట్నం రామారావు

ఈయనను కథకుల కథకుడు అనవచ్చు. చాలా తక్కువ కథలు రాసి ప్రజల్లో ఎక్కువ పేరు సంపాదించుకున్న రచయిత. 'యజ్ఞం–ఇతర కథలు' ఈయనకు ఎంతో పేరు తెచ్చాయి. ఈయన కథల్లో ప్రతి వాక్యం పాఠకులను ఆలోచింపచేస్తుంది. కష్టజీవులకు, సామాన్యులకు తన కథల్లో పట్టం కట్టిన మహారచయిత.

కథాశిల్పంలో సరికొత్త ధోరణికి కాళీపట్నం రామారావు గారు శ్రీకారం చుట్టారు. నడిచినంత మేర పేద ప్రజల గోడే విన్నాడు.రాసినంత మేర వారి బ్రతుకులు బాగు పడడానికి బాటలే వేశాడు!

తెలుగుదేశంలోని చిన్న పెద్ద కథకుల అందరి సంకలనాలు సేకరించి శ్రీకాకుళంలో 'కథానిలయం' పేరుతో గొప్ప సాహిత్య భవనం ప్రతిష్ఠించాడు. 'కథానిలయం' కాళీపట్నం వారి కలల ప్రతిరూపం! తెలుగు రచయితల కథా సంకలనాల సమగ్ర స్వరూపం!

**గోరేటి వెంకన్న :**


గోరేటి వెంకన్న

పల్లె పదాలు విలక్షణంగా రాసి పాడేటి గోరేటి వెంకన్న తెలంగాణా అన్న! ఆయన పాటల్లో పల్లెతనం వెల్లివిరిస్తుంది. పదునైన తెలంగాణా పదాలతో శ్రమజీవుల వేదనతో కూడిన వాణితో, ఆర్ద్రత పొంగే సంగీత బాణీతో మన గుండెల్లో కోటిరాగాల తెలంగాణా వీణ మిటాడు గోరేటి వెంకన్న!

గద్దర్ తర్వాత వచ్చిన ప్రజాగాయకుల్లో ఆయనది కొత్త వరవడి! పాటల్లో సరికొత్త తెలంగాణా పలుకుబడి!

ఈయన ఇటీవల పాడిన

"పల్లె కన్నీరు పెడుతుందో
కనిపించని కుట్రల
నా తల్లీ బందీయై పోయిందో
కనిపించని కుట్రల" అనే పాట ప్రపంచీకరణ నేపథ్యంలో బడుగు జీవుల జీవనవృత్తులు ఎలా ఛిద్రమైనయో చెబుతూనే; పర్యావరణం నేపథ్యంలో ప్రమాద ఘంటికలను వినిపిస్తుంది. ఆయనలోని కవితా శక్తికీ; కదిలించే శక్తికీ; ఉద్వేగాత్మకతకు; భావుకతకు – ఈ ఒక్క పాట చాలు. ఆయన మహాగాయకుడు మాత్రమే కాదు మహాకవి కూడా అని చెప్పడానికి!

**రాళ్ళపల్లి అనంతకృష్ణశాస్త్రి :**


రాళ్ళపల్లి

మరో రాయలసీమ రత్నం. గొప్ప సాహిత్య పరిశోధకుడు, గొప్ప భాషా విద్వాంసుడు. బ్రౌన్ దొర వెలుగులోకి తెచ్చిన వేమన కవిత్వం పై రాళ్ళపల్లి వారి పరిశోధన చాలా ప్రామాణికమైనది.

**కుందుర్తి ఆంజనేయులు :**

వచన కవితకు పట్టం కట్టిన మహాకవి. వచన కవిత్వంలో భారతం లాంటి సుదీర్ఘ కావ్యం రాయాలని ఈయన కమ్మని కల. ఈ కల తీరినా తీరకపోయినా ఈయన రాసిన వచన కవిత్వం ఇతరుల మీద తన ప్రభావం ప్రసరించింది. ఒక్క మాటలో – "కుందుర్తి వచన కవిత్వ యశోమూర్తి". 'నగరంలో వాన' ఈ వచన గేయ కావ్యం.

కుందుర్తి

**మొక్కపాటి నరసింహాశాస్త్రి :**

గొప్ప హాస్యరచయిత. ఈయన సృష్టించిన 'బారిష్టర్ పార్వతీశం' మనల్ని కడుపుబ్బ నవ్వించిన మరో గిరీశం!

**నార్ల వెంకటేశ్వరరావు :**


నార్ల వెంకటేశ్వరరావు

ప్రామాణిక వాడుక భాషకు వెన్నుదన్నుగా నిలిచిన మహనీయ సారస్వతమూర్తి. ఆంధ్రజ్యోతి దినపత్రికను దేదీప్యమానంగా వెలిగించిన తొలి సంపాదకుడు. కృష్ణాపత్రిక ఎడిటర్ ముట్నూరి

కృష్ణారావు తర్వాత ప్రామాణిక పత్రికా సంపాదకీయాలు రాసి ప్రసిద్ధి పొందారు. పత్రికా జర్నలిజంలో కొత్త వరవడి సృష్టించారు. శాస్త్రీయ ధృక్పధం; సంకుచిత కుల మతతత్వాలకు అతీతంగా తన భావాలు వ్యక్తీకరించడం నార్ల వారి ప్రత్యేకత.

పత్రికా రచనలు కొత్త పుంతలు తొక్కడానికి నారు వేసి నీరు పోసిన తొలి వ్యక్తి నార్ల వారే!


నార్ల వెంకటేశ్వరరావు

**తుమ్మల సీతారామమూర్తి :**

ఈయనను తెనుగులెంక అంటారు. అభినవ తిక్కన అని కూడా వీరికి బిరుదువుంది. వీరి 'రాష్ట్రగానం' జాతీయ భావాలకు పెన్నిధి. తాను గాంధీ కవినని చెప్పుకుంటారు.


జంధ్యాల పాపయ్యశాస్త్రి

**జంధ్యాల పాపయ్య శాస్త్రి :**

వీరిని కరుణ శ్రీ అంటారు. పద్యరచరన లలిత పద బంధురం, కరుణ రసాత్మకం ఈయన కావ్యాలు. ఉదయశ్రీ; విజయశ్రీ; కరుణశ్రీ మొదలైనవి. వీరి 'పుష్పవిలాపం' మధుర గాయకుడు ఘంటసాల నోట ఆంధ్ర దేశమంతటా మారుమోగింది.


నార్ల వెంకటేశ్వరరావు

**నండూరి సుబ్బారావు :**

వీరు రాసిన ఎంకి పాటలు శ్రీశ్రీ, చలం లాంటి వారి ప్రశంసలు పొందాయి. ఒకనాడు తెలుగు నాల్కులపై ఎంకి పాటలు పరవళ్లు తొక్కాయి. ఎంకి పాత్ర తెలుగు సాహిత్యంలో మరుపురాని శృంగార నాయికగా మారింది.

"వెన్నెలను మేసి
ఏరునెమ రేసింది" లాంటి వీరి ప్రయోగాలు నిత్యస్మరణీయాలు.

**ముళ్ళపూడి వెంకట రమణ :**


ముళ్ళపూడి

తెలుగు వచనానికి చలంతో పాటు కొత్త నడకలు నేర్పినవారిలో ముళ్లపూడి ఒకరు. కళాబ్రహ్మ బాపుతో జత కట్టి ఇద్దరూ కలిసి గొప్ప ప్రయోగాలు చేశారు. బాలసాహిత్యంలో "బుడుగు", "లచ్చిమీగాన పెసూనాంబ" లాంటి పాత్రలు సృష్టించారు. వీరి కథలు ఆధునికతకు, ఆనందానికి అద్దం పడతాయి. నవోదయ వారు ప్రచురించిన 'జనతా ఎక్స్‌ప్రెస్', 'రెండు జళ్ల సీత' మొదలైన గ్రంధాలు వీరికి పేరు తెచ్చాయి. బాపుతో కలిసి అనేక విజయవంతమైన సినిమాలకు కథలు, మాటలు సమకూర్చారు. వాటిలో 'ముత్యాలముగ్గు', 'అందాల రాముడు', 'మిస్టర్ పెళ్ళాం' ఎప్పటికీ గుర్తుండిపోతాయి. బాపుతో కలిసి చివరిగా ఈయన సాహిత్యం, స్క్రీన్‌ప్లే అందించిన సినిమా 'శ్రీరామరాజ్యం'.

**నండూరి రామమోహనరావు :**


నండూరి

సాహిత్యం, విజ్ఞానం – ఈ రెండింటి సమన్వయం నండూరి రామమోహనరావు. ఈయన వైజ్ఞానిక గ్రంధాలు – విశ్వరూపం, నరావతారం, విశ్వదర్శనం సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో ఆసక్తికరంగా రాశారు. వైజ్ఞానిక సాహిత్యంలో అవి మైలురాళ్లు. ఆంధ్రజ్యోతి ఎడిటర్‌గా నార్ల వారి తర్వాత వీరి కృషి అపూర్వం!

నండూరి వారు బాలసాహిత్యంలో కూడా కృషి చేశారు. పిల్లలకు అవసరమైన కథలు, కథా గేయాలు రచించారు. ఎడిటర్‌గా పత్రికా రచన కొత్త పుంతలు తొక్కింది. జర్నలిజంలో నూతనత్వాన్ని ప్రవేశపెట్టి నండూరి వారు ఆధునిక సాహిత్యంలో తనదైన ముద్రను వేశారు.

**పాలగుమ్మి పద్మరాజు :**


పాలగుమ్మి

తెలుగు కథ వైపు ప్రపంచం దృష్టి మరల్చిన గొప్ప కథారచయిత. ఈయన రాసిన 'గాలివాన' కథానిక ప్రపంచ కథల పోటీల్లో ఉత్తమ కథగా ఎంపిక కాబడింది. ఈ కథ చదవడం పాఠకుడికి మంచి అనుభవం కలిగిస్తుంది. పడవ ప్రయాణం వీరు రాసిన మరో మంచి కథ. పాలగుమ్మి పద్మరాజు కాదాయన! ప్రపంచ కథా పద్మరాజు!!

**రంగనాయకమ్మ :**


రంగనాయకమ్మ

కథానికలకు, నవలా రచనకు స్వర్ణయుగం అనతగిన 1960–80 దశాబ్దాలలో నవలా రచనను ఒక మలుపు తిప్పి, ప్రజాబాహుళ్యానికి దగ్గరైన రచయిత్రులలో రంగనాయకమ్మ ఒకరు. సామాజిక స్పృహ, మార్క్సిస్ట్ దృక్పథం, నిజాయితీ కలిగిన అరుదైన రచయిత్రి. 'బలి పీఠం' ఈమె రాసిన గొప్ప నవల. అసంఖ్యాకమైన కథలు రాసింది. ఈమె సాహిత్యంలో గొప్ప పరిణామక్రమ కన్పిస్తుంది. విశ్వనాథ 'రామాయణ కల్పవృక్షం' కావ్యానికి విరుగుడుగా 'రామాయణ విషవృక్షం' నిర్భయంగా రాసి వివాదానికి తెరలేపింది. మహిళలను మేల్కొల్పింది.

**కేతు విశ్వనాథరెడ్డి :**


కేతు విశ్వనాథరెడ్డి

రాయలసీమ సాహిత్య రత్నం. రాయలసీమ పల్లెసీమల సాంస్కృతిక సంఘర్షణ; సామాజిక నేపథ్యం ఇతివృత్తాలుగా అద్భుతమైన కథలు రాసిన ఉత్తమ కథకుడు.

రైతు కుటుంబ జీవన చిత్రణలో అందె వేసిన చేయి. గ్రామీణ జీవనం పట్ల మక్కువ; ప్రపంచీకరణ నేపథ్యంలో మారుతున్న పల్లె ప్రజల స్థితిగతులు; ఆధునిక భావాలు వీరి కథల్లో కన్నులకు కట్టినట్లు రాయబడ్డాయి.

కేతు విశ్వనాథరెడ్డి పేరుతో ప్రచురింపబడిన వీరి కథా సంకలనాలు తెలుగు సాహిత్య ప్రేమికులకు అపురూప కానుకలు. వీరు రాసిన కొన్ని కథలు అనేక భారతీయ భాషల్లోకి అనువందింపబడ్డాయి.

ఏది ఏమైనా తెలుగు కథారంగంలో విశ్వజయకేతనం ఎగురవేసిన కేతు విశ్వనాథ రెడ్డి తెలుగువారికి గర్వకారణం!

**కొలకలూరి ఇనాక్ :**

చేవ గలిగిన కథకుడు; నవలాకారుడు. గొప్ప రచయితై కూడా ఏమాత్రం భేషజం లేని వ్యక్తి.


కొలకలూరి ఇనాక్

ఆయన ఏనాడో రాసిన 'ఆకలి' కథ ఎందరినో ఆలోచింపచేసింది. కంటతడి పెట్టించింది. ఏమాత్రం సామాజిక ప్రయోజనం లేకుండా వీరు కథలు రాయరు.

దళితుల జీవితాల పట్ల; వారి కష్టానుభవాల పట్ల ఆలోచనలు రేకెత్తించే కథలూ, నవలలూ రాశాడు.

కొలికి పూసల్లాంటి కథలు రాసి అస్తవ్యస్తతల అసమ సమాజానికి బహుపరాక్ చెప్పారు కొలకలూరి ఇనాక్!

**కుందా భాస్కరరావు :**


కుందా భాస్కరరావు

పదిహేడేండ్ల వయస్సులోనే 'కృష్ణాపత్రిక'లో 'బంతిపువ్వు' కథ రాసి బహుమతి పొంది సంచలనం సృష్టించిన రచయిత కుందా. 1974లో నవోదయ పబ్లిషర్స్ విజయవాడ వారు ప్రచురించిన వీరి 'బంతిపువ్వు' కథల సంపుటి తెలుగులో వెలువడిన ఉత్తమ కథా సంకలనాలలో ఒకటిగా పేరుపొందింది. పదికాలల పాటు నిలిచే మంచి కథలుగా, సాహిత్యాన్ని సైన్సుతో సమ్మేళన పరచి కొత్త రసాయనం తయారు చేసిన రచయితగా ఆనాటి ఆంధ్రజ్యోతి ఎడిటర్ నండూరి

రామమోహనరావు కితాబిచ్చారు. 'బంతిపువ్వు'తో పాటు 'నందివర్ధనం', 'నీళ్లు', 'గోరంతదీపం' శిల్పరీత్యాఉన్నతమైనవి.

విశ్వజనీన విలువలు కలిగిన కథలు రాశారు. వీరు రాసిన ఇతర కథాసంపుటాలు 'సువర్ణం', 'మనసు వాకిళ్లు'. మనసు వాకిళ్ల సంపుటిలోని 'కథకుడి కథ' వీరి వాస్తవ బయోడేటా. దీనిని అద్భుతమైన కథా శిల్పంగా మలిచిన తీరు ప్రశంసనీయం. 'మనసు వాకిళ్లు' కథలోని ఇతివృత్తం ఇటీవల కాలంలో ప్రభుత్వం ప్రాథమిక విద్యలో ప్రవేశపెట్టబడిన కృత్యాధార బోధనా విధానం (Activity Based Method) శిశు కేంద్రీకృత బోధనకు ఈ కథ అద్దం పడుతుంది.

ప్రాథమిక పాఠ్యగ్రంథాల్లో వీరు రాసిన ఎవరు గొప్ప (కొండ–ఉదత గేయ సంభాషణ); చెట్లు (పర్యావరణ గేయం), పల్లెకు పోదాం, ముద్దబంతి పూలు, నా కథ (భూమితల్లి కథ) ఉత్తమ పాఠ్యాంశాలుగా గుర్తింపబడి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి చేతుల మీదుగా రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ పాఠ్యపుస్తక రచయితగా 1998లో అవార్డు పొందారు. 'అక్షర కోకిల' వీరు రాసిన మరో అభ్యుదయ కవితా సంకలనం!

**ఇరువెంటి కృష్ణమూర్తి :**

గొప్ప సాహిత్యారాధకుడు. యువభారతి సంస్థ ద్వారా తెలుగు సారస్వతానికి గొప్ప సేవ చేశాడు. మంచివ్యాస రచయిత.

**వానమామలై వరదాచార్యులు :**


వానమామలై వరదాచార్యులు

తెలంగాణా ఆణిముత్యం. అభినవ పోతన బిరుదాంకితుడు. పోతన చరిత్ర, జయధ్వజం వీరి గ్రంథాలు.

**చేతనా వర్త కవులు :**

కోవెల సుప్రసన్నాచార్యులు, వేణుముద్దల నరసింహారెడ్డి చేతనావర్త కవులుగా ప్రసిద్ధి చెందారు.

**దాశరథి రంగాచార్య :**

తెలంగాణ నవలాకారుడు 'చిల్లర దేవుళ్లు' రాశాడు. ఇతివృత్తం తెలంగాణా నేపథ్యం అయినా తెలంగాణా మాండలికంలో రాయలేదు. తెలంగాణా సాంస్కృతిక నేపథ్యాన్ని చిత్రించిన ఉత్తమ నవల.

**వట్టికోట అళ్వారు స్వామి :**

గొప్ప నవలా రచయిత. మంచి రచనా శైలి; పలుకుబడి కలవాడు. కథలు కూడా రాశాడు.

**ఎన్.గోపీ :**

ప్రస్తుతం ప్రాచుర్యం పొందుతున్న 'నానీల' సృష్టికర్త.

**సురవరం ప్రతాపరెడ్డి :**


సురవరం ప్రతాపరెడ్డి

గొప్ప తెలంగాణా చరిత్రకారుడు. 'గోల్కొండ' పత్రిక నడిపాడు. మన సంస్కృతి – మన పండుగలు వీరి ప్రసిద్ధ గ్రంథం. వీరి 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర' బహుళ ప్రాచుర్యం పొందింది.

**కాత్యాయినీ విద్మహే :**

చక్కని తెలంగాణా నవలా రచయిత్రి. మంచి కథలు కూడా రాసింది.

**దహగాం సాంబమూర్తి :**

గొప్ప భాషావేత్త, సాహిత్య విద్వాంసుడు. భాషాబోధనపై పట్టు కలిగిన వ్యక్తి. తెలుగు భాషా సాహిత్య దర్పణం; వ్యాసమంజూష, వ్యాకరణ మంజూష, విద్యార్థి మంజూష వీరి ప్రసిద్ధ గ్రంథాలు.

**వరవరరావు :**

ఈయన వరంగల్ వరపుత్రుడు. గొప్ప విప్లవ రచయిత. "భవిష్యత్ రాజకీయ చిత్ర పటం" ఇటీవల వీరు రాసిన గ్రంథం.

**ఖండవల్లి లక్ష్మీరంజనం :**



ఖండవల్లి

గొప్ప సాహిత్యకారుడు. "సంగ్రహాంధ్ర విజ్ఞానకోశం' వీరి ప్రసిద్ధ ప్రామాణిక గ్రంథం. సాహిత్య చరిత్ర పరిశోధనలో దిట్ట.

(ఆంధ్ర – తెలంగాణా కవులు, రచయితలు అందరినీ ప్రస్తావించడం ఈ చిన్న అధ్యాయంలో సాధ్యం కాకపోవచ్చు. తెలుగు భాషను ఐచ్ఛికంగా తీసుకునే ఛాత్రోపాధ్యాయులు తెలుగు సాహిత్య నేపథ్యం, కవుల పేర్లు, వారి రచనలు, సాహిత్యశైలి తెలుసుకోవాలని ఈ గ్రంథకర్తల ఆకాంక్ష).

**ముగింపు :**

తెలుగు భాషకున్న సుసంపన్నమైన సాహిత్యాన్ని, సాంస్కృతిక వారసత్వాన్ని భావితరం ఉపాధ్యాయులైన మీరు తెలుసుకోవలసి వుంది. మారుతున్న సమాజాన్ని బట్టి సాహిత్యం కూడా మార్పు చెందుతూ వచ్చింది. సాహిత్యం ఆవిర్భావం మొదలు ఆధునిక యుగం వరకు వెలిసిన వివిధ సాహిత్య ప్రక్రియలు. కవులు, కావ్యాలు, వారి శైలులు ఛాత్రోపాధ్యాయులు ఈ అధ్యాయం ద్వారా అవగాహన చేసుకుంటారని ఆశిస్తున్నాం. ఆదికవి నన్నయ మొదలు అష్టదిగ్గజ కవులు వరకు ముఖ్యమైన కవులు వారి కావ్యాలు, ఆధునిక కవులు, రచయితలు వారి రచనలు చదవడం ద్వారా సాహిత్య అధ్యయన ఆవశ్యకతను మీరు గ్రహించగల్గుతారు. సాహిత్య పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటారు. తద్వారా సాహితీ విలువలను పెంపొందింపచేసుకొని, సమాజ శ్రేయస్సును కోరే ఉత్తమ సాహిత్య రచనలు చేయడానికి ఈ అధ్యాయం దోహదపడుతుంది. ప్రాచీన ఆధునిక సాహిత్య పోకడలను అవగాహన చేసుకోవడానికి కూడా తోడ్పడుతుంది. వచన కవితలు, కథలు, మినీ కవితలు, సాహిత్య వ్యాసాలు రాయడానికి, ఉత్తమ భాషోపాధ్యాయులుగా రాణించడానికి ఈ అధ్యయం ఉపకరిస్తుందనడంలో సందేహం లేదు.

**మూల్యాంకనం :**

1. తెలుగు సాహిత్యం ఆవిర్భావం, వికాసాలను వివరించండి.
2. కవిత్రయం ఎవరు? వారి రచనలు, శైలులు వివరించండి.
3. శివకవులను గురించి రాయండి.
4. తెలుగు సాహిత్యంలో పోతన ప్రత్యేకతను వివరించండి.
5. శ్రీనాధుని రచనలు, కవితా విశేషాలు వివరించండి.
6. మొల్ల కవయిత్రిని గురించి మీకు తెలిసిన విశేషాలను సంగ్రహంగా రాయండి.
7. భావ కవిత్వమును నిర్వచించి, భావకవులను గురించి రాయండి.
8. అభ్యుదయ కవిత్వం అంటే ఏమిటి? అభ్యుదయ కవులను వారి రచనలు పేర్కొనండి.
9. దేవరకొండ బాలగంగాధర తిలక్‌ను గురించి రాయండి.
10. దిగంబర కవిత్వం అంటే ఏమిటి? దిగంబర కవులను పేర్కొనండి?
11. మీరు రాసిన లేక సేకరించిన ఏదైనా మినీ కవితను రాయండి.
12. రచయిత్రులలో రంగనాయకమ్మ స్థానం ఏమిటి?
13. దళితవాద కవిత్వం రాసిన కవులను, రచయితను పేర్కొనండి.
14. గిడుగు రామ్మూర్తి పంతులు సాహిత్య సేవను వివరించండి.
15. తెలుగు సాహిత్య చరిత్రలో శ్రీశ్రీ పోషించిన పాత్రను తెలపండి.

**ఆధార గ్రంథాలు :**

1. బి.ఎడ్.తెలుగు బోధనాపద్ధతులు - తెలుగు అకాడమీ-2015, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగుభాషాసంస్థ, హైదరాబాద్
2. బి.ఎడ్. అధ్యాపన శాస్త్రం - తెలుగు బోధనాపద్ధతులు, తెలుగు అకాడమి 2011, హైదరాబాదు
3. డి.ఎడ్. అధ్యాపన శాస్త్రం - తెలుగు బోధనాపద్ధతులు, తెలుగు అకాడమి 2001, హైదరాబాదు
4. డి.ఎడ్. తెలుగు బోధన పద్ధతులు - తెలుగు అకాడమి 2010, హైదరాబాదు
5. డిప్లొమా -ఇన్-ఎడ్యుకేషన్ (దూరవిద్యావిభాగం) - రాష్ట్ర విద్యాపరిశోధనా శిక్షణ సంస్థ, హైదరాబాదు
6. తెలుగు బోధన పద్ధతులు - డా॥ఎ.కొమరయ్య, డా॥ఎన్.సరోజ, నీల్‌కమల్ పబ్లికేషన్స్
7. తెలుగు బోధన పద్ధతులు - డా॥డి.సాంబమూర్తి, నీల్‌కమల్ పబ్లికేషన్స్
8. సాహిత్య శిల్ప సమీక్ష - ఆచార్య పింగళి లక్ష్మీకాంతం
9. సమగ్ర ఆంధ్ర సాహిత్యం (ప్రథమ సంపుటం) - ఆరుద్ర
10. ఆంధ్ర సాహిత్య చరిత్ర - ఆచార్య పింగళి లక్ష్మీకాంతం, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ
11. ఆధునికాంధ్ర కవితా సమీక్ష - ఆచార్య కాకర్ల వెంకటరామ నరసింహం, గంగాధర పబ్లికేషన్స్

# అధ్యాయం - 4
# పిల్లలు - భాష - అభ్యసనం


4.0. పరిచయం

4.1. లక్ష్యాలు

4.2. పిల్లలు భాషను ఎలా నేర్చుకుంటారు?

4.3. పిల్లల బహుభాషా సామర్థ్యం – ప్రత్యేక సందర్భాల్లో వ్యక్తీకరించే సామర్థ్యం

4.4. పిల్లలు భాషాసామర్థ్యం

4.5. పిల్లలు భాషను నేర్చుకోవడం గురించి అపోహలు – వాస్తవాలు

4.6. ఉపాధ్యాయుని పాత్ర

4.7. మూల్యాంకనం

4.8. ఆధార గ్రంథాలు


## 4.1. లక్ష్యాలు

ఈ అధ్యాయాన్ని అవగాహన చేసుకున్న ఛాత్రోపాధ్యాయులకు ఈ క్రింది అంశాలపై పూర్తి అవగాహన కల్గుతుంది.

- పిల్లల భాషాభ్యసనానికి అనువైన ఆధునిక, సంప్రదాయ బోధనాపద్ధతులను గురించి అవగాహన కల్గి ఉంటారు.
- పిల్లలు భాషను నేర్చుకునే విధానం, భాషను గురించి పిల్లల్లోని అంతర్గత శక్తులు
- భాష నేర్చుకోవడంలో చేసే తప్పులు – సరిదిద్దుకొనే మార్గం.
- పిల్లల్లోని బహుభాషా సామర్థ్యం – వివిధ సందర్భాల్లో వ్యక్తీకరించే సామర్థ్యం.
- పిల్లలకున్న భాషా సామర్థ్యం – సివిసివి పద్ధతి – వాక్యనిర్మాణ పద్ధతులు.
- పిల్లలు భాషాభ్యసనంలో ఉపాధ్యాయుని పాత్ర.

## పిల్లలు – భాష – అభ్యసనం

**4.0. పరిచయం :**

ఈ అధ్యాయంలో పిల్లలు భాషను నేర్చుకొనే విధానం; పిల్లల్లో ఉండే బహుభాషా సామర్థ్యం, పిల్లలు భాషను నేర్చుకోవడంలో ఉన్న అపోహలు – వాస్తవాలు, పిల్లల్లో భాషాభివృద్ధికి ఉపాధ్యాయుని పాత్ర గురించి విశ్లేషించబడతాయి.

**భాష :**

జీవకోటిలో మానవునికి స్థానం సమున్నతమన్నది నిర్వివాదం. కేవలం భాష వల్లనే మనిషి మనిషిగా పిలువబడుతున్నాడు. అందుకే "Man is man because of his speech" అన్నారు భాషాతత్త్వవేత్తలు. మానవుని మనుగడ భాషాభివృద్ధిపైనే ఆధారపడి ఉందన్నది అందరూ అంగీకరిస్తున్నారు. భాషను కేవలం పరస్పర భావ వినిమయ సాధనంగా మాత్రమే చూడకూడదు. భాష ఆలోచనలకు సాధనమే కాక వికాసానికి, సృజనాత్మకతకు దోహదకారి కూడ. భాష మూలంగానే ఆనాటి ఆదిమానవుడు నేటి ఆధునిక మానవుడుగా రూపుదిద్దుకున్నాడు.

"భావ వినిమయానికి భాష వాహిక" – అన్నప్పుడు వినిమయంలో సాధికారిత, సందర్భోచితం, ఆత్మవిశ్వాసం, స్పష్టత వంటి వివిధ అంశాలు ఇమిడి ఉంటాయి. అందుకే ఎస్.కె.వర్మ, ఎన్.కృష్ణస్వామి "భాష అంటే ఒకే ఒక్క అంశం లేదా లక్షణం గల వస్తువుగా పరిగణించకూడదు. అది సమాజంలో మానవ సంబంధాలు ఎంత క్లిష్టమైనవో అంతే సంక్లిష్టమైన మానవ దృగ్విషయంగా భావించవచ్చు" అన్నారు.

భాష మానవజాతిపై పెంపొందించుకున్న ఒక శక్తివంతమైన సాధనం.

**భాష ముఖ్య లక్షణాలు :**

1. భాష యాదృచ్ఛికం
2. భాష సామాజికం
3. భాష వ్యవస్థీకృతం
4. భాష మానవులకు మాత్రమే సొంతమైన సహజాతం కాని ప్రక్రియ
5. భాష అనుకరణీయం, అభ్యసనీయం
6. భాష సృజనాత్మకం, ఉత్పాదకం
7. భాష పరిణామశీలి

భాషద్వారానే జ్ఞానాభివృద్ధి కలుగుతుంది. అటువంటి భాషను పిల్లలకు చక్కనిరీతిలో అందించడం ఎంతైనా అవసరం. అలాగే పిల్లల్లో ఉంటే బహుభాషా సామర్థ్యాన్ని గుర్తించడం, అభివృద్ధి చేయడం ఉపాధ్యయుని కర్తవ్యం.

భాషాభ్యసనం :

పుట్టినప్పటి నుండి 15 సంవత్సరాల వయస్సు వరకు ఉన్నవారిని పిల్లలు అంటాం. అటువంటి పిల్లలు భాషను నేర్చుకునే విధానం గురించి భాషావేత్తలు పలురకాలుగా చెప్పారు.

1. పిల్లలు భాష నేర్చుకునే విధానం గురించి ఇటీవల కాలం వరకు ఉన్న సంప్రదాయ భావనలను ఛామ్‌స్కీ, పియాజీ, వైగోట్ స్కీలు వెల్లడించిన సిద్ధాంతాలు కదలించి వేశాయి. పాత సిద్ధాంతాలు పక్కనపెట్టి "పిల్లలు సహజ భాషావాతావరణంలో అలవోకగా భాషను అభ్యసిస్తారు'' అనే అభిప్రాయం నిరూపితమైనది.

దైనందిన జీవితంలోని సన్నివేశాలలో ఒక భాషలో సమర్థవంతంగా తన అభిప్రాయాలను స్పష్టంగా, నిర్దిష్టంగా, ఎటువంటి సందేహానికి తావివ్వకుండా ఇతరులకు తెలియజేసే సామర్థ్యాన్ని సంతరించుకోవడమే భాషాభ్యసనం అనవచ్చు.

**4.2. పిల్లలు భాషను ఎలా నేర్చుకొన్నారు :**

ఎలా నేర్చుకొన్నారు అనే అంశాన్ని తెలుసుకోవడానికి ముందు ఎప్పుడు నేర్చుకుంటారు అనే విషయాన్ని కూడా గుర్తించాలి.

తమ గురించి తమను ప్రోత్సహించే వాతావరణంలో మాత్రమే పిల్లలు భాషను నేర్చుకుంటారు. "నేర్పడం" సంతృప్తికరమైన ఒక అనుభవం కాకుండా భయంతో – క్రమశిక్షణతో – ఒత్తిడితో నేర్చుకోవడం అభ్యసన మౌలిక ప్రయోజనానికే ప్రమాదకరం!

పిల్లలు నిత్యజీవిత సన్నివేశాల్లో పాల్గొనడం ద్వారా భాషను నేర్చుకుంటున్నారు. భాషలో అనేక నియమాలు ఉండవచ్చు. కాని పిల్లలు అవేమీ పట్టించుకోకుండా తమకు అవసరమైన దానిని మాత్రమే నేర్చుకుంటారు. భాషను అత్యంత సహజంగా, తేలికగా నేర్చుకుంటారు. భాష వారికి కష్టమని అనిపించదు. భాష సంక్లిష్టమైనది. పరిణామశీలమైనది. భాషలో ఎన్నో నియమ నిబంధనలు ఉన్నప్పటికీ పిల్లలు ధారాళంగా మాట్లాడగలరు. సులభంగా సహజంగా నేర్చుకోగలరు.

పిల్లలు పాఠశాలకు రాకముందే తమదైన శైలిలో భాషను సొంతం చేసుకుంటారు. భయం లేకుండా,

జంకు గొంకు లేకుండా, తమ అభిప్రాయాన్ని వెల్లడి చేస్తూ ఉంటారు. తమకు తెలియని దాన్ని గురించి ఆత్రంగా ప్రశ్నించడమే ప్రజ్ఞకు మూలకారణం. పెద్దలను ప్రశ్నించి తెలుసుకుంటారు. వాళ్ల ప్రశ్నలను మానం అడ్డుచెప్పరాదు.

"బైబిలు కథయైన, భాగవతంబైన
ప్రశ్నవలన నిజమ ప్రజ్వరిల్లు
ప్రశ్న లేనిచోట ప్రజ్ఞకు చోటేది?
భాస్కరార్యునిమాట! ప్రగతి బాట!!" – కుందా

భాష సంస్కృతికి సంబంధించిన అంశం. తెలుగుభాషలో ఎంతో క్లిష్టమైన వ్యాకరణ సూత్రాలున్నప్పటికీ వాటిని సునాయాసంగా ఉపయోగించుకొని పిల్లలు భాషను గడగడ మాట్లాడేస్తున్నారంటే దానిని బట్టి పిల్లల్లో ఎంతటి సహజసామర్థ్యం ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రింట్, ఎలక్ట్రికల్ మాధ్యమాల ద్వారా పిల్లలు ఎన్నెన్నో పదాలు అలవోకగా వింటూ, నేర్చుకుంటూ నిత్య జీవనంలో వినియోస్తుంటారు. భాషావ్యవహార రూపాల ద్వారా భాష పిల్లలకు అత్యంత చేరువైంది. ఆ భాషను మరింత పరిపుష్టం చేయగలిగేవి పాఠశాలలే!

మనం ఊహించినట్లు పిల్లలు అనుకరణం ద్వారా ధ్వనులను (భాషను) నేర్చుకోరు, వారు సొంతంగానే ధ్వనులను సృష్టించుకుంటారు. అనంతరం పెద్దల మాటల్ని విని అనుకరిస్తారు. పిల్లలకు మాట్లాడడం నేర్పించాలంటే పెద్దలు పిల్లలతో సహజంగా ముచ్చట్లాడాలి. వారు చేసే ప్రతిధ్వనిలో అనుభూతులు, కోరికలు దాగి ఉంటాయి. ఇవిలేకపోతే పిల్లలు భాషను నేర్చుకోరు. అందుకే వారు భాషను తేలికగా నేర్చుకుంటున్నారు. మొదటి దశలో వాళ్ళు మాట్లాడుతున్నప్పుడు అనేక తప్పులు ఉండవచ్చు. ఆ తప్పుల్ని మనం ఎత్తి చూపకూడదు. కొంతకాలానికి వారు గ్రహిస్తారు. భాషాపరమైన కృత్యాలలో ఎన్ని తప్పులున్నా వాళ్ళను ప్రశంసించటమే మనపని!

పిల్లలు తెలియక తప్పులు మాట్లాడినా క్రమంగా ఆ దోషాలను సవరించుకొని తప్పులు లేకుండా మాట్లాడగల్గుతారు. అందుకే పసిపిల్లలు చేసే సంభాషణలోని తప్పులను, ఇతరుల మాటలను గ్రహించి ఆ తప్పుల్ని సరిదిద్దుకుంటారు. పెద్దలు కూడా పిల్లల స్థాయికి తగిన పదాలు, వాక్యాలు మాట్లాడాలి. వాళ్ళతో తాము కలిసిపోవాలి. పిల్లలకు భాష నేర్పుతున్నామనే ఆలోచన మనకుండకూడదు. అది సహజంగా జరిగిపోవాలి. సహజత్వం, భాష జీవలక్షణం! పెరుగుదల, ఉపయోగం ఇవన్నీ సందర్భాన్ని బట్టి ఉంటాయి. ప్రతిబిడ్డ మూడేళ్ళ వయస్సు వచ్చేటప్పటికి నేర్చుకోవడం జరుగుతుంది. పిల్లల మెదడు పసితనంలో స్పాంజిలా జ్ఞానాన్ని, నైపుణ్యాన్ని స్వీకరించి, నిల్వ చేసుకుని వీటికి తరువాత వుపయోగించుకొనేందుకు దాచి పెడతుందని 'ఎరిక్స్ మాడ్సిక్' అనే శాస్త్రవేత్త నిరూపించారు. చిన్నపిల్లల మెదడుకు అద్భుతమైన సంగ్రహణ శక్తి ఉంటుందని నిరూపించారు.

## పిల్లలు – తప్పులు

పిల్లలు మాట్లాడేటప్పుడు, చదివేటప్పుడు, రాసేటప్పుడు మరేదైనా పని చేసేటప్పుడు ఏ తప్పు దొర్లినా, వెంటనే దాన్ని సరిదిద్దాలని; సరి చేయాలని, లేకుంటే అది అలవాటుగా మారిపోతుందని మనలో చాలామంది పెద్దవాళ్లు అనుకుంటారు. ఈ సిద్ధాంతం పట్ల నాకు నమ్మకం లేదు. పిల్లలు నడవడం దగ్గర్నుంచి రాయడం దాకా ప్రతిపని తప్పులు చేస్తూనే నేర్చుకోడానికి ప్రయత్నం చేస్తారు. ఆ తప్పుల్ని ఒక క్రమంలో వాళ్ళే సరిదిద్దుకుంటారు.

తాము చేసే పనివల్ల తామనుకున్న ఫలితం రాకపోతేనో, పెద్దలు చేసే పనికీ తమ పనికీ పెద్ద తేడా వున్నట్లు అనిపిస్తేనో పిల్లలు దానికనుగుణంగా తమ తప్పుల్ని సరిదిద్దుకుంటారు. పిల్లలందరికీ ఇలా చెయ్యడం తెలుసు. ప్రతి తప్పును అదేపనిగా వెతికి పట్టుకునే పెద్దలుండే ఇళ్లల్లో సైతం – పెద్దలు సరిచేసే తప్పుల కన్నా, పిల్లలు తమంత తాము సరిదిద్దుకునే తప్పులు ఎక్కువ.

–జాన్ హోల్ట్

**పిల్లలు భాష నేర్చుకునే క్రమం :**

ప్రతి శిశువు సుమారు 3 సంవత్సరాల వయస్సు వచ్చేటప్పటికే భాష నేర్చుకుంటాడు. అది మాతృభాష అయితే మరింత ధారాళంగా వచ్చి తీరుతుంది. మొదట ప,బ,మ అనే ధ్వనులు నేర్చుకుని 'మామ' మొదలగు పదాలను పలకడం నేర్చుకుంటారు. ఆ తరువాత సరళ వాక్యాలు, వ్యతిరేక వాక్యాలు, ప్రశ్నార్థకాలు ఇలా ఒకదాని తర్వాత మరొక దానిని నేర్చుకుంటారు. భాషా నియమాలు పాటించడంలో ఏ మాత్రం గందరగోళం కన్పించదు. సందర్భాన్ని బట్టి అర్థాన్ని గ్రహిస్తారు. తమకు తెలిసిన పరిమిత పదజాలంతో అపరిమిత వాక్యాలను తయారు చేయగల్గుతారు.

**4.2. పిల్లలు భాషను ఎలా నేర్చుకుంటారు ?**

ప్రతిబిడ్డ మూడేళ్ళ వయసు వచ్చేసరికి భాష నేర్చుకుంటుంది. ఇదొక సార్వజనీన సూత్రం. అయితే అభ్యసన వేగంలో కొంత వైయుక్తిక భేదాలు ఉండవచ్చు. సుప్రసిద్ధ భాషావేత్త చామ్‌స్కీ పిల్లలు స్వతస్సిద్ధంగానే భాషను పొందే శక్తిని కల్గివుంటారని, ఈ శక్తి ఏభాషనైనా నేర్చుకోవడానికి సహాయ పడుతుందన్న అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. శిశువు పుట్టినప్పుడు మెదడు 'న్యూరాన్'లతో కూడిన నిర్మాణ దశతో ఉండి నాడీకణాల సంఖ్య తక్కువగా ఉంటుంది. నాడీకణాల సంఖ్య రోజురోజుకు పెరిగే కొద్దీ శిశువు కొత్త నైపుణ్యాలు సాధించడం మొదలు పెడతాడు. పిల్లలు వివిధ సన్నివేశాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నప్పుడు, వినియోగించుకునే సందర్భం ఎదురైనప్పుడు తనలోని గ్రాహ్యకశక్తిని ఉపయోగించుకొని భాషను అభివృద్ధి చేసుకుంటాడు. ఏకకాలంలో రెండు మూడు భాషలను కూడా నేర్చుకోగలుగుతాడు. వివిధ భాషలను మాట్లాడేవారి సాన్నిహిత్యం వల్ల కూడా భాషను సులభంగా గ్రహించ గలుగుతాడు.

**4.3. పిల్లలు నేర్చుకోవడం గురించి అపోహలు – వాస్తవాలు :**

పిల్లలు భాషను నేర్చుకోవడాన్ని గురించి అనేక అపోహలు ఉన్నాయి.

1. పిల్లల మెదళ్ళు ఏమీ రాయని పలకల వంటివని, బడికి వచ్చేముందు పిల్లలకు ఎలాంటి పరిజ్ఞానం వుండదనేదే పెద్ద అపప్రథ.
2. బోధన ద్వారానే పిల్లలు ఉపాధ్యాయుని నుండి అంతా నేర్చుకుంటారనేది కేవలం అపోహ మాత్రమే!
3. భాష పట్ల సరైన పరిజ్ఞానం లేకుండా పిల్లలు పాఠశాలకు వస్తారనేది కూడా అపోహే.
4. కఠిన క్రమశిక్షణను అమలు చేస్తూ పిల్లలకు తగినంత స్వేచ్ఛ ఇవ్వని వాడే ఉత్తమ ఉపాధ్యాయుడనేది కూడా అపోహే.
5. ఉపాధ్యాయుడే పిల్లల్లో జ్ఞాన నిర్మాణానికి మూలమని, ఉపాధ్యాయునివల్లనే పిల్లలకు పరిజ్ఞానం కల్గుతుందన్న నమ్మకం కూడా అపోహే. పిల్లలు భాష నేర్చుకోవడంలో ఉపాధ్యాయుని ముఖాన్నే పొద్దపొడవడం లేదు.

పిల్లలను కఠినమైన క్రమశిక్షణలో ఉంచాలని, స్వేచ్ఛ వారిని చెడగొడుతుందని, వారిని ఎప్పుడూ ఒకకంట కనిపెట్టుకొని ఉండాలనే ఒక నమ్మకం కూడా ఉంది. పిల్లల వారసత్వం కారణంగా కొందరు బాగా నేర్చుకోవచ్చు అనేది కూడా కేవలం అపోహమాత్రమే! పిల్లల అభ్యసనంలో వెనుకబాటుతనానికి ఉపాధ్యాయుని అసమర్ధతతే కారణం అనేది కూడా అపోహమాత్రమే! ఈ విద్యావ్యవస్థలో ఉపాధ్యాయుడు ఒక భాగం మాత్రమే. జ్ఞానం కేవలం ఉపాధ్యాయులు, పాఠ్యపుస్తకాలు మాత్రమే అందించడం జరగదు. జ్ఞానానికి అనేకమైన మూలాలు వుంటాయి!

పిల్లలు పుట్టుకతోనే అనేక నిగూఢ సామర్థ్యాలను కల్గి ఉంటారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, చుట్టుప్రక్కల సమాజం – ఇలా అందరూ కలిసి పాల్గొనేలా శ్రద్ధతో కూడిన అభ్యసన ప్రణాళికను అమలు చేయడం ద్వారా పిల్లలు చక్కని భాషను నేర్చుకుంటారు. 'రాముడు అన్నం తింటున్నది' అని మనం అంటే దాంట్లో తప్పేమిటో స్పష్టంగా తెలియకపోయినా పిల్లవాడు మాత్రం మనకేసి అదోలా చూస్తాడు. పిల్లలు తమకు తెలిసిన కొన్ని పదాలతోనే

వందల కొలది కొత్త వాక్యాలు సొంతంగా తయారు చేసుకోగల్గుతాడు. మరొక విషయమేమిటంటే పిల్లలు రెండు, మూడు భాషల నియమాలను సైతం గ్రహింపగల్గుతున్నాడు.

**పిల్లలు భాషను నేర్చుకునే క్రమం :**

పిల్లలకు గల ఈ అద్భుతశక్తిని మానసిక శాస్త్రవేత్తలు ఈవిధంగా విశ్లేషించారు.

1. పిల్లలు భాషను కేవలం ఆనందకరమైన ఆసక్తికరమైన వాతావరణంలోనే బాగా నేర్చుకుంటారు.
2. వారి అవసరాన్ని బట్టి, సందర్భాన్ని బట్టి తగిన పదాలను ఎంపిక చేసివాడతాడు.
3. భాషాభ్యసనంలో ముందు సులభమైనవి, తరువాత కఠినమైనవి నేర్చుకుంటారనేది వాస్తవం కాదు.
4. బాల్యంలో రెండు సంవత్సరాల వరకు ధ్వనులను వినడమే తప్ప ఉపయోగించే అవసరం వారికి వుండదు.
5. పిల్లలు భాషను గ్రహించే క్రమంలో వినడం, అర్థవంతంగా గ్రహించడం, వ్యక్తీకరించడం జరుగుతుంది. భాషను సొంత పద్ధతిలో ఉపయోగిస్తుంటారు.
6. అభ్యసన విషయంతో పోలిస్తే భాషకు ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది.
7. సందర్భానుసారంగా ఎదురైన ప్రత్యక్షానుభవాల నుండి భాషను గ్రహించే ప్రయత్నం చేస్తారు.
8. భాషలో ప్రతినియమాన్ని తమకు తాముగా రూపొందించుకుంటారు. సవరించుకుంటారు.

తరగతి గదిలో ఉపాధ్యాయుడి పాత్ర చాలా కీలకమైనది. తరగతి గది నిర్వహణ విషయంలో భాషాబోధన గురించి "జాతీయ విద్యాప్రణాళిక చట్రం – 2005" అనేక సూచనలు చేసింది.

**పిల్లల అంతర్గత శక్తులు :**

పుట్టుకతోనే పిల్లలకు అంతర్గతంగా భాషా సామర్థ్యం ఉంటుంది. ఎంతో క్లిష్టమైన నియమాలపై సైతం పిల్లలు బడికి రాకముందే ప్రావీణ్యం కల్గి ఉంటారని మనందరకీ తెలిసిందే.

పిల్లలు పుట్టుకతోనే సహజంగా భాషను నేర్చుకుంటారు. ప్రాథమిక స్థాయిలో ఈ భాషను అవగాహన చేసుకుంటారు. ప్రాథమికోన్నత స్థాయిలో అవగాహనతో కూడిన భాషను వివిధ పరిస్థితులకు సందర్భానుగుణంగా స్పందిస్తూ ఉపయోగించుకుంటారు.

పిల్లలు సహజంగా తమలో దాగి ఉన్న సామర్థ్యాలు అంటే నాటకీకరణం చేయడం, పాఠ్యాంశాలకు అనుగుణంగా బొమ్మలు గీయడం, కవితలు రాయడం, బుర్రకథగా చెప్పడం, కథగా చెప్పడానికి ప్రయత్నిస్తారు.

**4.3. పిల్లల బహుభాషా సామర్థ్యం :**

మానవుడు సంఘజీవి. జంతుజాలం నుంచి మానవుడు క్రమ పరిణామం పొందినా మానవుడు భావ వినిమయానికి అర్థవంతమైన శబ్దాలు అలవరచుకొని భాషాభివృద్ధి సాధించాడు. మానవులు వివిధ భాషలు నేర్చుకునే / సముపార్జించే / పొందే సామర్థ్యం జన్మతః కలిగి ఉన్నారు. భాషను గ్రహించే శక్తి అనగా ఒక భాషా వ్యవస్థ శిశువులకు జన్యుపరంగానే సంక్రమించింది. దానినే 'విశ్వవ్యాకరణం' (Universal Grammer) అన్నారు "నోయ్ చామ్‌స్కీ". ఆయన ప్రకారం భాషా సముపార్జన అంటే శిశువులోని ఈ అంతర్గత శక్తిని ఆవిష్కరించడమే!

భాషాభ్యసనం జైవిక, సామాజిక, వ్యక్తిగత కారకాల ఫలితం. శిశువులలో గల భాషను పొందే శక్తి, ఏ భాషనైనా నేర్చుకోవడానికి తోడ్పడుతుంది. దీనినే సార్వత్రిక భాషా విభాగంగా (Universal Language Faculty) గా గుర్తించవచ్చు. వివిధ సన్నివేశాలలో ప్రత్యక్షంగా పాల్గొనినపుడు వినియోగించుకునే సందర్భం ఎదురైనపుడు తనలోని గ్రాహ్యశక్తిని ఉపయోగించుకొని భాషను అభివృద్ధి చేసుకుంటారు. తమకు అందుబాటులో ఉన్న ఏ భాషలోనైనా పట్టు సాధించగలుగుతారు. ఏకకాలంలో రెండు, మూడు భాషలనైనా నేర్చుకోగల్గుతారు. పరిసరాలను బట్టి, వివిధ భాషలను మాట్లాడే వారి సాన్నిహిత్యం వల్ల కూడా బహుళ భాషలను సునాయాసంగా నేర్చుకుంటారని చెప్పడంలో ఎలాంటి సందేహంలేదు.

భాషా పాటవానికి, బహు భాషిత్వానికి మధ్య దగ్గరి సంబంధం ఉందని పలు పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. విద్యావిషయ ఉపలబ్ధి, జ్ఞాననిర్మాణం, సామాజికంగా సహనశీలతలు కూడా బహుభాషాతత్వాన్ని ప్రభావితం చేస్తాయి. అందువల్ల బహుళభాష అభ్యసనాన్ని ప్రోత్సహించవలసిన అవసరముంటుంది.

భాషలకు సరిహద్దులు అంటూ ఉండవు. అవి ఒకదాని నుండి మరో భాషలోకి చొచ్చుకొని పోతాయి. మనం తరచుగా పలు సందర్భాల్లో ఇతర భాషా పదాలను, వ్యక్తీకరణలను అరువు తెచ్చుకుంటూనే ఉంటాం. అందువల్ల జాతీయాలు, అనువాదం, రెండు భాషల పదాలను కలగలిపి వాడడం, మాతృభాష స్థానంలో ఇతర బాషలను వాడడం మున్నగు వాటిని సమర్ధంగా ఉపయోగించుకొని పిల్లలు భాషలను అభివృద్ధి పరచుకొంటారు.

ప్రపంచంలోని దాదాపు 200 దేశాల్లో 7000లకు పైగా భాషలు ఉన్నాయని భాషా పరిశోధకులు తెలియజేస్తున్నారు. ప్రపంచ జనాభాలో ఒక్క భాష మాట్లాడేవారి కంటే రెండు లేదా అంతకంటే ఎక్కువ భాషలు మాట్లాడే వారి సంఖ్యే ఎక్కువగా ఉంటుంది.

"ఒక వ్యక్తిగాని, వ్యక్తుల సమూహంగాని, ఒకటికంటే ఎక్కువ భాషలు మాట్లాడే స్థితిని "బహుభాషిత్వం"గా పేర్కొనవచ్చును.

బహుభాషిత్వ ప్రయోజనాల గురించి 'వి.వి.ఎన్.కుక్' ఇలా అన్నారు. "Multi lingualism is the natural potential available to every normal human beings rather than unusal exception. Given the appropriate environment, two languages are as normal as two lungs"

– బహుభాషిత్వం ప్రతి సామాన్య మానవునిలో ఉన్న సహజశక్తి తప్ప అసాధారణమైంది కాదు. తగిన వాతావరణం ఉంటే రెండు భాషలు వచ్చుట రెండు ఊపిరితిత్తులవలె సాధారణమైనవి.

ఒక వ్యక్తి రెండు భాషల్లోనూ నైపుణ్యాన్ని సంపాదిస్తేనే బహుభాషిత్వం అవుతుందని కొందరు అభిప్రాయం వెల్లడించారు. కాని రెండు భాషల్లోనూ సమానమైన ప్రావీణ్యం లేకపోయినా, తమ నిత్యజీవితంలో రెండింటినీ అవసరాలు తీర్చుకునే స్థితిని పొందగల్గినా 'బహుభాషిత్వం' అనవచ్చని భాషావేత్తలు బహుభాషాసమాజాలను అధ్యయనం చేసి చెప్పారు.

మన భారతదేశం బహుళ భాషల సంగమం. దేశవ్యాప్తంగా పరిశీలిస్తే ఖచ్చితంగా చెప్పలేముగాని, సుమారు 179 భాషలు, 544 మాండలీకాలు ఉన్నాయని చెప్పవచ్చు. వీటిలో ప్రభుత్వం 19 భాషలను గుర్తించింది. ఇవికాక మరెన్నో భాషలు అధికార గుర్తింపు కోసం రాజ్యాంగం 8వషెడ్యూల్‌లో చోటుకోసం వేచి ఉన్నాయి. బహుశా భారతదేశంలో ఉన్నంత బహుభాషాతత్త్వం ప్రపంచంలో ఇంకెక్కడా కన్పించదు. ఈ కారణంగా మన దేశంలోనే భాషా సమస్య తరచుగా ఉత్పన్నమవుతున్నది.

ప్రపంచంలో ఏ దేశంలో అయినా పాఠశాలస్థాయిలో విద్యార్థులు తమ మాతృభాషతో పాటు మరొకటి లేక రెండు భాషలను తప్పనిసరిగా నేర్చుకుంటారు. మన దేశంలో కూడా విద్యార్థులు పాఠశాల స్థాయిలో మూడు భాషలు నేర్చుకోవలసిందే! అయితే మన దేశంలో ఏ దేశంలో లేనివిధంగా అనేక భాషలుండడం వల్ల ఏ మూడు భాషలు బోధించాలనే సమస్య ఉత్పన్నమవుతున్నది. ఈ సమస్యను పరిష్కరించుటకు 1956 సం॥లో Central Advisory Board of Education కేంద్రీయ విద్యావిషయక సలహా పరిషత్తు 'త్రిభాషా సూత్రాన్ని' రూపొందించింది. దీని ప్రకారం పాఠశాల స్థాయిలో తప్పనిసరిగా మూడు భాషలు నేర్చుకోవాలని ఉంటుంది.

1. మాతృభాష లేక ప్రాంతీయ భాష.
2. ఇంగ్లీషు లేక ఏదైనా ఆధునిక యూరోపియన్ భాష.

(ఇంగ్లీషు ప్రపంచ భాష అనే విషయం మనం మరచిపోకూడదు)

3. మూడవ భాషగా హిందీయేతర ప్రాంతాల వారు హిందీ నేర్చుకోవాలి. హిందీ ప్రాంతాల వారు ఏదైనా ఒక ఆధునిక భారతీయ భాషను నేర్చుకోవాలి.

**4.4. పిల్లలు–భాషాసామర్థ్యం :**

పిల్లలు పుట్టుకతోనే భాషను నేర్చుకోవడానికి సిద్ధంగా ఉంటారు. భాషావేత్త చామ్‌స్కీ అభిప్రాయం ప్రకారం పిల్లలు స్వతస్సిద్ధంగా భాషను పొందే శక్తిని కల్గిఉంటారు. ఈశక్తి వారు ఏ భాషనైనా నేర్చుకోవడానికి తోడ్పడుతుంది. పిల్లలు పాఠశాలలో చేరేనాటికి వారిలో ఎటువంటి సామర్థ్యాలు ఉండవని అనుకోరాదు. వారి మనస్సు వెనుకటి తరంవాళ్ళు భావించినట్లుగా ఖాళీ పలక కాదు. పిల్లలు బడికి రాకముందే భాషాపరంగా అనేక సామర్థ్యాలు కలిగి ఉంటారు. ఆ సామర్థ్యాలను వినియోగించుకుంటూ పాఠశాలలో చదవడం, రాయడం అనే సామర్థ్యాలను నేర్పించాల్సి ఉంటుంది. పిల్లలు భాషాపరంగా ఈ క్రింది సామర్థ్యాలను కలిగి ఉంటారు.

1. ఎదుటివారి మాటలను గ్రహించడం.
2. సందర్భోచితంగా మాట్లాడడం
3. ఎదుటివారిని ప్రశ్నించడం
4. ఊహించి మాట్లాడడం
5. పోలికలు చెప్పడం
6. వర్ణించడం
7. స్వేచ్ఛగా మాట్లాడడం
8. సన్నివేశాలను వివరించి చెప్పడం
9. ప్రశంసించడం
10. వాక్య నిర్మాణం చేయగల్గడం.

ఈ సామర్థ్యాలు బాహ్యంగా కన్పించక అంతర్గతంగా ఉంటాయి. పిల్లలు వివిధ సన్నివేశాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నప్పుడు, వినియోగించుకునే సందర్భం ఎదురైనపుడు తమలోని గ్రాహ్యకశక్తిని ఉపయోగించుకుని భాషను అభివృద్ధి చేసుకుంటారు. ఏకకాలంలో రెండు మూడు భాషలను కూడా నేర్చుకోగలుగుతారు. వివిధ భాషలను మాట్లాడేవారి సాన్నిహిత్యం వల్ల కూడా భాషను సులభంగా గ్రహించగలుగుతారు. కాబట్టి ఉపాధ్యాయులు పిల్లల్లో ఉన్న పై సామర్థ్యాలను గుర్తించి – పాఠశాలలో సాధించాల్సిన సామర్థ్యాల మీద దృష్టి పెట్టాలి.

మానవుని గుర్తింపులో బహుభాషిత్వం ఒక అంతర్భాగం. సుదూరమైన గ్రామీణ ప్రాంతాలలో ఒకే భాష వచ్చినవాడైనా ఎక్కువసార్లు నూతన సందర్భాలను ఎదుర్కోవలసి వచ్చినపుడు, ఆయా భాషలకు చెందిన పదజాలాన్ని సులభంగా అర్థం చేసుకోగలడు.

మన తరగతి గదులు సహజంగా బహుభాషలకు నెలవైనవి. అందువల్ల తరగతిలోని ఈ బహుభాషా లక్షణాన్ని బోధనకు అభ్యసనకు ఒక ఆటంకంగా భావించకుండా ఈ లక్షణాన్ని ఒక వనరుగా గుర్తించి దీనికొక బోధనావ్యూహం రూపొందించుకోవాలి. అందువల్ల భాషా ప్రణాళిక రచనలో బహుభాషిత్వం కీలకాంశం కావాలి.

## 4.6. ఉపాధ్యాయుని పాత్ర :

పిల్లల భాషాభ్యసనంలో ఉపాధ్యాయుని పాత్ర ప్రముఖమైనది.

"భాషే నేను కట్టుకున్న గోపురం

భాషే నాకు దేవుడిచ్చిన వరం" – అంటాడు జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డా॥ సి. నారాయణరెడ్డి

భాషకు ఉపాధ్యాయునకు ఉన్న అవినాభావ సంబంధం అదే! ప్రతి ఉపాధ్యాయుడు భాషకు ఉన్న ప్రాధాన్యతను గుర్తించి, ఆ భాషలో వస్తున్న వివిధ మార్పులను, ఆధునిక పోకడలను ఆకళింపు చేసుకోవాలి. నిరంతరం విద్యార్థుల భాషాభివృద్ధికి తోడ్పడాలి. విద్యార్థులు సజీవమైన, ప్రామాణిక వాడుక భాషలో చక్కని నుడికారంతో తమ అభిప్రాయాలను చెప్పగలిగేలా తీర్చిదిద్దాలి. భాషా వినియోగంలో విద్యార్థులు సృజనాత్మకతను సంతరించుకోడానికి దోహదం చేయాలి.

**ఉపాధ్యాయుని ఉండవలసిన ముఖ్య లక్షణాలు :**

1. వృత్తిపై గౌరవం, ప్రేమ ఉండాలి. ఆత్మవిశ్వాసంతో పాటు భాషాజ్ఞానం మెండుగా ఉండాలి.
2. భాష పట్ల విద్యార్థుల్లో అభిరుచిని పెంచే నైపుణ్యం కల్గి ఉండాలి.
3. సహనం, సహృదయత, మృదుభాషణతో విద్యార్థులను ఆకట్టుకోవాలి. పిల్లలు భాషాభ్యసనంలో చురుకుగా పాల్గొనేటట్లు చూడాలి.
4. విద్యార్థుల పట్ల అనురాగం, ఆప్యాయతలతో మెలగాలి.
5. సాహిత్యం పట్ల ఆరాధన భావం కలిగి, పిల్లల్లో అలాంటి భావాన్ని కలిగించాలి.
6. అనుదినం బోధించే విషయాలలో వాడుకలో ఉండే సామెతలను, నానుడులను, పలుకు బడులను సందర్భోచితంగా ఉపయోగించాలి.
7. పద్య, గద్య గేయనాటకాల రచన-ప్రదర్శనల ద్వారా విద్యార్థులను ప్రభావితం చేయదగు నేర్పరితనం కలిగి ఉండాలి.
8. బోధనలో మధ్యమధ్య హాస్యోక్తులను మేళవించి  తెలుగు భాషామాధుర్యాన్ని విద్యార్థులుక అందించే నిపుణత కలిగి ఉండాలి.
9. లేఖనా నైపుణ్యాలను, పఠనాసక్తిని పెంపొందించడంలో నిర్దుష్ట ఉచ్చారణలతో మాట్లాడడానికి కావల్సిన బోధనాభ్యసన సామాగ్రిని తయారుచేసి, సేకరించి వినియోగించాలి.
10. విద్యార్థుల సమగ్ర వికాసానికి, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దటానికి నిరంతరంగా శ్రమించాలనే తపన కల్గి ఉండాలి.

**ముగింపు :**

విద్యార్థి నిర్దేశిత సామర్థ్యాలను సాధించడానికి, కావలసిన అవకాశాలను అందజేయడం ఉపాధ్యాయులుగా మన కర్తవ్యం. నూతన పాఠ్య పుస్తకములందలి లక్ష్యాలు సఫలీకృతమవటానికి అభ్యాసాలు అంటే "ఇవి చేయండి" అనేవి గుండెకాయలాంటివి. మనమంతా కలసి ఈ కర్తవ్య నిర్వహణలో విజయవంతమయ్యే పాత్ర పోషించి విద్యార్థులను భాషాజిజ్ఞాసువులుగా తీర్చిదిద్దగలమని ఆశిద్దాం.

**4.4. CVCV పద్ధతి :**

(ప్రొఫెసర్ రమాకాంత్ అగ్నిహోత్రి గారి అభిప్రాయం సంక్షిప్తంగా)

ప్రపంచంలో ఏ భాష అయినా ఒకే రకమైన మౌలిక నియమాలను పాటిస్తుంది. పదాలను ఉచ్చరించడంలో శబ్దాలకు ప్రాధాన్యత ఇస్తారు. అందువల్ల ఏ పదాన్ని ఎలా పలకాలో, ఏయే సందర్భాల్లో ఎలాంటి మార్పులకు అన్వయించుకోవాలో పిల్లలు నిర్ణయించుకోగలరు.

ఒక పదాన్ని అందులో గల శబ్దాలను బట్టి ఉచ్ఛరించడంలో అన్ని సందర్భాల్లో ఒకే రకమైన ఉచ్చారణ ఉండదు. సందర్భానుసారంగా ఉచ్చారణ మారుతుంది.

ఉదా : Sound of 'e' is different from 'elephant' to 'make'.

ప్రతిపదాన్ని మానవుడు తనకు సౌలభ్యమైన క్రమంలోనే ఉచ్ఛరించే ప్రయత్నం చేస్తాడు. అందుకోసం అచ్చు తర్వాత హల్లు రావడం (VC), హల్లు తర్వాత అచ్చురావడం (CV), రెండు లేదా మూడు హల్లుల తర్వాత 'అచ్చు' రావడం అనే క్రమంలో మాత్రమే పద ఉచ్చారణ ఉంటుంది.

ఉదా : పలక Palaka (c v c v c v) PALAKA

సాధారణంగా పదాల నిర్మాణం కింది క్రమాలలో ఉంటుంది.

CVCV

CCV

CCCV

ఇదే భాష యొక్క మూలరూపం CVCV నిర్మాణ ప్రక్రియ

C - Consonents, V = Vowels

| | | |
|---|---|---|
| ఉదా : బడి | తలుపు | పలక |
| BADI | CVCVCV | CVCVCV |

ఎక్కువసేపు పలికే ధ్వని రూపాలే అచ్చులు "V"

తక్కువ సమయంలో పలికే ధ్వని రూపాలే "C"

రెండు, మూడు హల్లు ధ్వనులు కలిసి అక్షరం ఏర్పడవచ్చు. కాని నాలుగు హల్లు ధ్వనులు వరుసగా వచ్చే పదాలు ఏ భాషలోను ఉండవు. ఏకమొత్తంగా పలకలేక పోవడమే దానికి గల కారణం.

- 3 సం॥ల పిల్లలు papa, baba, mama మొ॥ పదాలను సులభంగా పలకడానికి కారణం వాటి మధ్య ఒకేరకమైన ఉచ్ఛారణ ఉండడం.
- శరీరంలో మాట్లాడడానికి అవసరమని భావించే అవయవాలు మాట్లాడడానికి ఉద్దేశించినవి కావు. జంతువులలో కూడా ఈ అవయవాలన్నీ ఉన్నాయి. కాని అవి మాట్లాడవు. అంటే మాట్లాడడానికి / భాషకు సంబంధించిన శక్తి మానవ మెదడులో ఉంది.
- భాషలో చాలా శబ్ధాలు / వాక్యాలు హల్లు, అచ్చు క్రమంలోనే రూపొంది ఉంటాయి.
- 'స' శబ్దంతో వచ్చే పదాలు CCCV క్రమం ఉంటుంది. ఉదా : STRAW CCCVC
- 'ఐడియా'కు 'r' కలపడం వలన 'idear' అని పలకడానికి కారణం CVCV రూపంలోకి మార్చుకోవడమే.
- ఒకభాష విస్తరించాలంటే, సజీవంగా ఉండాలంటే వీలైనన్ని పరభాషా పదాలను మిళితం చేసుకోగలగాలి. అందువల్ల భాష కలకాలం నిలబడుతుంది.
- పిల్లలు ఎక్కువకాలం తినడం / ఆడుకోవడం / నిద్రపోవడంలోనే గడుపుతున్నప్పటికీ మిగిలిన స్వల్ప సమయంలో ఇంతటి సంక్లిష్ట భాషా నియమాలను Internalise చేసుకుంటారు. వాటిని నేర్చుకోవడం "సాధ్యపడదు" అని అనుకోరు.

## 4.7. మూల్యాంకనం :

1. ఈ క్రింది ప్రశ్నలకు 30 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.
   1. పిల్లలు భాషను ఎలా నేర్చుకుంటారు ?
   2. పిల్లల బహుభాషా సామర్థ్యం ఎలా ఉంటుంది? అవసరమేమిటి?
   3. CVCV పద్ధతిని వివరించండి ?
2. ఈ క్రింది ప్రశ్నలకు 15 పంక్తుల్లో సమాధానాలు వ్రాయండి.
   1. పిల్లలు భాష నేర్చుకోవడంలో అపోహలు – వాస్తవాలు.

2. పిల్లల అంతర్గత శక్తులు – వివరించండి
3. పిల్లల్లో భాషా సామర్థ్యం ఎలా ఉంటుంది?
4. పిల్లల భాషాభ్యసనంలో ఉపాధ్యాయుని పాత్ర ఏమిటి?

3. ఈ క్రింది వానికి సమాధానాలు రాయండి.
1. CVCV అక్షరాలను వివరించండి
2. ఎక్కువమంది దృష్టిలో ప్రతిబిడ్డ భాష నేర్చుకునే వయస్సు ఏది ?
3. 'తలుపు' పదంలో 'CV' లను తెల్పండి?
4. 'విశ్వ వ్యాకరణం' అని ఎవరు పేరు పెట్టారు?
5. అచ్చులు ఎలా పలుకబడతాయి?

4. ఈ క్రింది వానిని జతపరచండి.

| | |
|---|---|
| 1. తక్కువ సమయంలో పలికే ధ్వని రూపాలు | ఎ. నామ్‌ఛామ్‌స్కీ |
| 2. జ్ఞానాభివృద్ధికి సాధన | బి. ప్రొఫెసర్ రమాకాంత్ అగ్నిహోత్రి |
| 3. 'విశ్వ వ్యాకరణ' సిద్ధాంత కర్త | సి. ఏ భాషలోను ఉండవు |
| 4. CVCV విశ్లేషణ కర్త | డి. హల్లులు |
| 5. నాల్గు ధ్వనుల హల్లులు | ఇ. భాష |

## 4.9. ఆధార గ్రంథాలు :


| | | |
|---|---|---|
| 1. | డి.ఎడ్. భాషావిద్య – దూరవిద్యావిధానం | – యస్.సి.ఇ.ఆర్.టి. ఆంధ్రప్రదేశ్ ప్రచురణ |
| 2. | డి.ఎడ్ – తెలుగు బోధన పద్ధతులు | – తెలుగు అకాడమీ, హైదరాబాద్ |
| 3. | బి.ఎడ్., తెలుగు బోధన పద్ధతులు | – తెలుగు అకాడమీ, హైదరాబాద్ |
| 4. | తెలుగు బోధన పద్ధతులు | – డా॥ ఎ. కొమరయ్య, డా॥ ఎన్. సరోజ నీల్‌కమల్ పబ్లిషర్స్, హైదరాబాద్ |
| 5. | కొత్త భాస్కర శతకం | – కుందా భాస్కరరావు లవ్‌లీ పబ్లిషర్స్, బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా |
| 6. | పగటి కల | – గిజూబాయి |

## అధ్యాయం-5

# భాషాసామర్థ్యాలను అభివృద్ధిపరచడం

**విషయక్రమం**

5.0 పరిచయం

5.1 లక్ష్యాలు

5.2 మాట్లాడడం (భాషణం)

5.3 ధారాళంగా చదవడం (పఠనం)

5.4 రాయడం (స్వీయరచన) (లేఖనం)

5.5 సృజనాత్మక వ్యక్తీకరణ (వివిధరకాల సృజనాత్మక రచనలు)

5.6 పిల్లల్లో పదజాలాభివృద్ధి (పదజాల సంపన్నత)

5.7 వ్యాకరణాంశాలు (ప్రాయోగిక వ్యాకరణం)

5.8 మూల్యాంకనం

5.9 ఆధార గ్రంథాలు

## 5.0 పరిచయం

సమాజంలో ఫలవంతమైన జీవితాన్ని గడపడానికి అనేక విషయాల్లో సమర్థత కలిగియుండాలి. అలాగే విద్యార్థుల భావిజీవితం బాగుండాలంటే చక్కని మూర్తిమత్వ వికాసం అవసరం. దానికి భాషాసామర్థ్యాలు ప్రాతిపదిక సామర్థ్యాలుగా (Basic competencies) దోహదం చేస్తాయి.

ఇతరులు చెప్పేది అవగాహనతో వినడం (శ్రవణం); తన భావాలను అర్థవంతంగా స్పష్టంగా చెప్పగల్గడం (భాషణం/మాట్లాడడం); అవగాహనతో చదవడం (పఠనం); సృజనాత్మకంగా రాయడం (లేఖనం) – వీటి ద్వారా పిల్లలు తమ దైనందిన జీవిత వ్యవహారంలో ఎన్నో ప్రయోజనాలను పొందగల్గుతారు. భాషకు సంబంధించిన ఈ సామర్థ్యాలను "భాషాసామర్థ్యాలు" అంటారు. భాషకు మూలాధారాలైన ఈ సామర్థ్యాలలో విద్యార్థికి సమగ్రమైన శిక్షణ ఇవ్వడం చాల అవసరం. సహజాతంగానే కొందరికి ఇలాంటి సామర్థ్యాలు వుంటాయి. భగవద్దత్తమైన లేక జన్యుపరమైన ఈ సామర్థ్యాలు చక్కని పరిసరాలు, శిక్షణ తోడైతే అవి పరిపూర్ణంగా వికసిస్తాయి. ఉపాధ్యాయుని ప్రతిభ విద్యార్థుల్లోని సహజసామర్థ్యాలను గుర్తించడంలోనే వుంది. అతని నైపుణ్యం వాటిని వికసింపచేయడంలోనే వుంది.

"పిల్లల భాష వాళ్ళు చేసే పనులకు, వాళ్ళ పరిధిలోకి వచ్చే జీవిత సన్నివేశాలకు సన్నిహిత సంబంధాన్ని కలిగిఉంటుంది. బాల్యంలో పిల్లల మాటలూ, చేష్టలూ ఒకటిగా ఉంటాయి. చేష్టలూ, అనుభవాలు మాటల అవసరాన్ని సృష్టిస్తాయి. అనుభవం పూర్తిఅయిన తరువాత మాటలు ఆ అనుభవాన్ని అందుబాటులోకి తెస్తాయి. పిల్లలు తమ పరిధిలోనికి వచ్చిన వివిధ వస్తువులతో చక్కని మాటల సహాయంతో సంబంధాన్ని సుసంపన్నం చేసుకుంటారు.

**– ప్రొఫెసర్ కృష్ణకుమార్**

**భాషా సామర్థ్యాల అభివృద్ధి – ప్రయోజనాలు :**

1. పిల్లలు అర్థవంతమైన అవగాహనతో చదవగలుగుతారు.
2. సొంతంగా తమ అభిప్రాయాలను రాయగల్గుతారు, చెప్పగలుగుతారు.
3. చదవడం, రాయడం ఒక నిరంతర ప్రక్రియగా మారుతుంది.
4. ఇతర విషయాల అభ్యసనానికి ఎంతగానో దోహదపడుతుంది.
5. సృజనాత్మకతకు అవకాశం కల్పిస్తుంది.
6. ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.
7. పిల్లలు బడిఅంటే ఇష్టపడడానికి; మంచి అభ్యసనానికి వీలుపడుతుంది.
8. ప్రాచీన ఆధునిక సాహిత్యంలోని మహాకవులపట్ల; ప్రజాకవులపట్ల ఆరాధనాభావం పెంపొందిస్తుంది.
9. పుస్తక పఠనం పట్ల చక్కని అభిరుచి ఏర్పడుతుంది.
10. భాషాసామర్థ్యాల అభివృద్ధి మూర్తిమత్వ; ఉద్వేగ వికాసాలకు దారితీస్తుంది.

## 5.1 లక్ష్యాలు

ఈ అధ్యాయం చదవడం ద్వారా ఛాత్రోపాధ్యాయులకు కింది అంశాలపై అవగాహన కల్గుతుంది.

1. పిల్లలు ఎప్పుడు మాట్లాడుతారు; స్వీయభావప్రకటన, వాచికదోషాలు – నివారణలు, చర్చలు, అన్వేషణ – విశ్లేషించడం – పరిశీలన – కల్పన – సంబంధాలను కూర్చడం మొ။.
2. పిల్లలు చదవడానికి ఎందుకు ఇష్టపడరు? చదవడాన్ని ఆసక్తికరంగా మార్చే విధానం, ధారాళంగా ఏమేం చదవగలగాలి, చదివిన తర్వాత పిల్లలు ఏమేం చేయగలగాలి? పాఠ్యపుస్తకాలలోని అభ్యాసాల విశ్లేషణ.
3. పిల్లలు రాయడానికి గల కారణాలు, ఎలా రాయాలని కోరుకుంటాం, రాయడానికి ముందు ప్రక్రియలు, రాయడంలో దోషాలు, రాయడంలో ప్రాచీనపద్ధతి – ఆధునికపద్ధతి – లేఖనదోషాలను సరిదిద్దే విధానం.
4. విద్యార్థి వివిధరకాల దరఖాస్తులు, రచనలు, లేఖలు, వ్యాసాలు, నివేదికలు రాసే విధానాలు, పిల్లల్లోని సృజనాత్మకశక్తి పెంపొందించే మార్గాలు.
5. పిల్లలు పదాలకు అర్థాలు గ్రహించే విధం, పిల్లల్లో పదజాలాభివృద్ధి, దానికి ఉపాధ్యాయుని కృషి.
6. వ్యాకరణమంటే ఏమిటి ? భాష – వ్యాకరణాలలో ఏదిముందు ? బడికి రాకముందు పిల్లల్లో గల వ్యాకరణ జ్ఞానం, వ్యాకరణం గురించి అపోహలు – వాస్తవాలు, ప్రాయోగిక వ్యాకరణ విశేషాలు.

## 5.2 మాట్లాడడం (భాషణం)

భాషలో చక్కని సామర్థ్యాన్ని కల్గిఉండడాన్నే 'భాషాసామర్థ్యం' లేదా భాషానైపుణ్యం అంటారు. అంటే ఒక విద్యార్థి ఒక విషయాన్ని వినడంలో, మాట్లాడడంలో, చదవడంలో, రాయడంలో చూపే సామర్థ్యాన్ని లేదా నైపుణ్యాన్ని భాషాసామర్థ్యాలు (లేదా) భాషానైపుణ్యాలు అంటారు. అవి –

1. శ్రవణం / వినడం
2. భాషణం / మాట్లాడడం

3. పఠనం / చదవడం
4. లేఖనం / రాయడం.

వీనిని 'చతుర్విధ పరికర్మలు', 'భాషాచతుష్కం' అనికూడా అంటారు. ఈనాటి అసలైన నైపుణ్యాలు, మూలకాలు, మూలాకలు కొన్ని కలిసిపోయి మిశ్రమ లోహాలు ఏర్పడినట్లుగా – ఈ నైపుణ్యాలు కొన్ని కలిసిపోయి మిశ్రమ నైపుణ్యాలు ఏర్పడతాయి. భాషను నేర్చుకోవడానికి మొదటిమెట్టే 'శ్రవణం'. అందుకే ఉపాధ్యాయుడు ముందుగా విద్యార్థి శ్రవణనైపుణ్యాన్ని పెంపొందించాలి.

ప్రాథమికస్థాయిలో శిశుగీతాలు, అభినయగీతాలు, కథలు వినిపించడంద్వారా శ్రవణశక్తిని అభివృద్ధిచేయవచ్చు.

మాధ్యమికస్థాయిలో ప్రకాశపఠనం చేయించడం; పాటలు, పద్యాలను టేపురికార్డు ద్వారా వినిపించడం వల్ల ఈ నైపుణ్యాన్ని పెంపొందింపవచ్చు.

శ్రవణశక్తి వల్ల విద్యార్థి ఈకింది ప్రయోజనాలను పొందగల్గుతాడు.

1. శ్రవణం వల్ల విషయాన్ని బాగా అర్థం చేసికొంటాడు.
2. స్పష్టమైన ఉచ్చారణ అలవడుతుంది.
3. విద్యార్థిలో పదజాలాభివృద్ధి కల్గుతుంది.
4. ఆలోచనాశక్తి వృద్ధిచెందుతుంది.
5. ఆనందానుభూతి పొందుతాడు.
6. జ్ఞాపకశక్తి పెరుగుతుంది.

పుట్టుకతో వచ్చిన అవయవలోపం వల్ల; వ్యాధులవల్ల శ్రవణశక్తి లోపం కలుగవచ్చు. తరగతి ఉపాధ్యాయుడు పరిశీలనద్వారా విద్యార్థి శ్రవణశక్తి లోపాలను గుర్తించి నివారణ చర్యలను చేపట్టాలి.

భాషా సామర్థ్యాలలో 'మాట్లాడడం' రెండోదైనా భావవ్యక్తీకరణలో మాత్రం దానిది మొదటిస్థానమే! మాట్లాడడానికి (భాషణానికి) ఉచ్చారణ ప్రాణంలాంటిది. దీనిని 'వాచికచర్య' అనికూడా అంటారు. పిల్లలు భావ వినిమయం చేసుకోవడంలో మాట్లాడడం ఎంతో కీలకమైనది. సహజానుభవాల వ్యక్తీకరణకు ఈ భాషణం తోడ్పడుతుంది. ఈ మాట్లాడడాన్ని పిల్లలు మొదట తల్లిదండ్రులు – కుటుంబసభ్యులు – పరిసరాలలో ఉండేవారు – వీరి నుండి నేర్చుకొని పాఠశాలకు వచ్చి – ఉపాధ్యాయుడు, తోటి విద్యార్థుల ప్రభావం వల్ల అభివృద్ధిచేసికొంటాడు.

చక్కగా మాట్లాడడానికి 'వాచికచర్య' ముఖ్యం. నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుందని మన తెలుగు నానుడి. పిల్లలు తమ భావాలను ధారాళంగా మాటల్లో వ్యక్తం చేయడానికి శిక్షణ ఇచ్చే చర్యనే 'వాచికచర్య' అనిఅంటారు. మాట్లాడడంలో పొందిన నైపుణ్యం – తర్వాత పఠన లేఖన సామర్థ్యాలను ప్రభావితం చేస్తుంది. స్పష్టమైన ఉచ్చారణ, ధ్వనులపై సరియైన ఊనిక, హావభావాలు మొదలగునవి వాచికచర్యను ప్రభావితం చేస్తాయి. జాతీయాలు, సామెతలు, సూక్తులు, నుడికారాలు మున్నగువాటిని ఉపయోగిస్తూ మాట్లాడితే పిల్లవాడు 'మాట్లాడడం' అనే సామర్థ్యాన్ని పరిపూర్ణంగా సాధించినట్లు చెప్పవచ్చు. దానికి బాల్యంనుండి శిక్షణ అవసరం.

**D పిల్లలు ఎప్పుడు మాట్లాడతారు?**

పిల్లవాడు పాఠశాలలో చేరేటప్పటికే 'మాట్లాడడం' అనే సామర్థ్యంలోని కొన్ని మెలకువలు తెలిసికొనే ఉంటాడు. అయినా స్వేచ్ఛగా మాట్లాడడానికి భయపడుతూనే వుంటాడు. తోటి విద్యార్థులు, ఉపాధ్యాయుడు మాట్లాడే మాటలను, తీరును పరిశీలిస్తూ అనుకరించడానికి ప్రయత్నిస్తాడు. ఆ సమయంలో ఉపాధ్యాయుడు విద్యార్థికి సన్నిహితంగా ఉంటూ అతనిలోని భయాన్ని, సిగ్గును తొలగిస్తూ మాట్లాడేటట్లు చేయాలి. దోషాలను ఎత్తిచూపకుండా తన సరస సంభాషణతో వాటిని సరిచేయాలి. పిల్లవాని ఇంటిదగ్గర సంఘటనలను, పరిసరాలలో చూసిన వింతలు విశేషాలను, పిల్లవానికి అందుబాటులో ఉంటున్న చెట్లు, పశువులు; ఇంట్లోను, గ్రామంలోను జరిగిన పండుగలు మొదలగు వాటిని గురించి చక్కగా మాట్లాడిస్తే విద్యార్థి చురుగ్గా వాచికచర్యలో పాల్గొంటాడు. పిల్లలకు ప్రతిరోజు ఏదోఒక అంశాన్ని ఇచ్చి దానిపై మాట్లాడించాలి. ఈవిధంగా పిల్లలు సొంతంగా మాట్లాడే సన్నివేశాలు కల్పించాలి. కనీస అభ్యసన సామర్థ్యాలరీత్యా దీనినే భాషోపయోగం అంటారు. భాష బాగా రావాలంటే నిరంతరం అది ఉపయోగంలో వుండాలి.

పిల్లలకు పాటలంటే ఇష్టం కాబట్టి ఉపాధ్యాయుడు సంభాషణాత్మకతో కూడిన గేయాలను హావభావయుక్తంగా వాళ్లతో పలికించాలి. పిల్లల్లో బిడియం తొలగడానికి, భావప్రకటన అలవడడానికి అభినయగీతాలు నేర్పించాలి. ఉదాహరణకు లోగడ అయిదో తరగతి తెలుగు భారతిలోని కొండ–ఉడత (ఎవరుగొప్ప) సంభాషణాత్మక గేయం. పిల్లలకు చిత్రాలు చూపిస్తూ – ప్రశ్నలువేస్తూ సమాధానాలను రాబడితే మాట్లాడడం అనే సామర్థ్యాన్ని పొందగలుగుతాడు. అవకాశం చిక్కినప్పుడల్లా విద్యార్థులచే గతంలో తాము విన్న కథలను చిన్నచిన్న సొంతమాటల్లో చెప్పించాలి.

D స్వీయ భావప్రకటన

తనకు తెలిసిన విషయాలనుగూర్చి మాట్లాడినప్పుడు తోటిపిల్లలు, ఉపాధ్యాయుడు హేళనచేస్తారేమో అన్న భయంతో తన అభిప్రాయాన్ని వెల్లడించడానికి వెనకాడతాడు. దానిని ఉపాధ్యాయుడు నివారించకపోతే అది (భాషణానికి) మాట్లాడడానికి అవరోధమవుతుంది. అందువల్ల పిల్లలు తమ స్వీయఅనుభూతులను తరగతిగదిలో వెల్లడించే అవకాశాన్ని ఉపాధ్యాయుడు కలుగజేయాలి. చర్చలు, వాదనలు, ప్రశ్నించడం, వర్ణించడం, ఉపన్యసించడం మొదలగువాటి ద్వారా విద్యార్థికి అభ్యసనంలో భాగస్వామ్యం కల్పించాలి. దానిద్వారా స్వీయఅభిప్రాయాల వెల్లడికి చక్కని వాతావరణం లభిస్తుంది.

1. **చర్చలు :** "అచ్చా! స్వేచ్ఛాజీవీ! చర్చకు చోటిచ్చావు!" అంటాడు మహాకవి శ్రీశ్రీ. బోధనా సంవిధానంలో 'చర్చ' అనేది ఒక ముఖ్యమైన సాధనం. వీనిద్వారా నిర్దుష్టమైన విషయజ్ఞానం విద్యార్థులకు అందించబడుతుంది. అంతేకాక పిల్లల్లో తార్కికశక్తిని పెంపొందించడానికి, వాక్నైపుణ్యాన్ని వృద్ధిచేయడానికి ఈ చర్చలు ఎంతగానో ఉపయోగపడతాయి. విషయ విశ్లేషణ, భావవ్యక్తీకరణ సామర్థ్యాలు పెంపొందింపబడతాయి. పిల్లలు తమ జ్ఞానాన్ని పరస్పరం అందిపుచ్చుకుంటారు.

2. **వాదనలు :** 'వాదన' అంటే పోట్లాడుకోవడం అని చాలామంది అభిప్రాయపడుతూంటారు. కాని అది నిజంకాదు – పిల్లవాడు తాను దృఢంగా నమ్మిన అంశాన్ని హేతుబద్ధంగా, సంకోచంలేకుండా ఆవిష్కరించడమే. వాదించడంవల్ల పిల్లవాని అభిరుచులు వెల్లడి కావడంతోబాటు వాక్నైపుణ్యానికి పరిపూర్ణత సిద్ధిస్తుంది. భావనలో ఉన్న దోషాలను సరిచేసుకోవడానికి అవకాశం చిక్కుతుంది. విద్యార్థుల మధ్య చర్చ జరుగుతున్నప్పుడు ఉపాధ్యాయుడు ఆ వాదనలను పర్యవేక్షిస్తూ సక్రమమైన పద్ధతిలో చర్చ జరిగేటట్లు చూడాలి.

3. **ప్రశ్నించడం :** ఏమిటి? ఎందుకు? ఎలా ? – ఈ ప్రశ్నలు చిన్నవే కావచ్చు కాని అవి జ్ఞానానికి మూలాలు! విద్యార్థి జ్ఞానవంతుడు కావాలంటే "ఏమిటి? ఎందుకు? ఎలా?" అనే ప్రశ్నలకు సమాధానాలు అన్వేషించాలి. బాల్యంలో తనకు కొత్తగా, వింతగా తోచిన ప్రతి చిన్న విషయాన్ని తల్లిదండ్రులను, తోటి స్నేహితులను అడిగి తెలుసుకొంటాడు. ఈ ప్రశ్నించడమే పిల్లల్లో విషయజ్ఞానాభివృద్ధికి ఎక్కువ దోహదపడుతుంది.

   ఉదా : అటువేపు సూరీడు మటుమాయమైపోయి ఇటువేపు గుట్టుగా పుట్టుకొస్తాడు. ఈ వింత ఏమిటో ఎరిగింపవమ్మా?

అలాగే ఉపాధ్యాయుడు కూడా విద్యార్థులను ప్రశ్నించడం, విద్యార్థులకు సందేహాన్ని కలిగించవచ్చునన్న అంశాలపై తానే ప్రశ్నించుకుంటూ, సమాధానాలు చెప్పడం కూడా జరుగుతుంది. పిల్లలు పాఠ్యాంశాలను హేతుబద్ధంగా అర్థం చేసుకోవడానికి, సంభాషణా సామర్థ్యాన్ని పొందడానికి, తార్కికమైన – శాస్త్రీయమైన దృక్పథాలను అలవరచుకోవడానికి ఈ ప్రశ్నించడం అనే ప్రక్రియ ఎంతగానో దోహదపడుతుంది.

ఉదాహరణకు కుందా భాస్కరరావు రాసిన 'చిన్నారి ప్రశ్నలు' గేయంలోని రెండు చరణాలు :–

> రివ్వురివ్వున ఎగిరి పువ్వుపువ్వున వాలు అందాలకీటకం అది ఏమిటమ్మా? పూలతో దానికి పని ఏమిటమ్మా?

4. **ఉపన్యసించడం :** పాఠశాలల్లో స్వాతంత్ర్యదినోత్సవం, గణతంత్ర దినోత్సవం, మాతృభాషా దినోత్సవం, వార్షికోత్సవం వంటివి నిర్వహింపబడుతూ ఉంటాయి. చాలా పాఠశాలల్లో "సారస్వత సంఘాలు" కూడా ఏర్పాటుచేస్తున్నారు. ఆ కార్యక్రమాల్లో విద్యార్థులకు నిర్వహణ బాధ్యతను, ఉపన్యాస బాధ్యతను అప్పగిస్తే చక్కగా నిర్వహిస్తారు. దానివల్ల ఉపన్యాస పటిమ పెరుగుతుంది. బాగా ఉపన్యసించిన వారిని అభినందించడం, ప్రోత్సాహక బహుమతులు ఇవ్వడం వంటి చర్యలవల్ల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటారు. నలుగురిముందు మాట్లాడడానికి వారిలోని బిడియం తొలగిపోతుంది.

5. **వర్ణించడం :** విద్యార్థులచేత తమ గ్రామంలో జరిగిన పండుగలు, ఉత్సవాలు వర్ణింప జేయాలి. పిల్లవాడు ఆసక్తికరంగా, తనదైన శైలిలో వర్ణించి చెబితే పిల్లల్లో 'మాట్లాడడం' అనే సామర్థ్యం పెరుగుతుంది.

   ఇవికాక నాటకీకరణం, ఉక్తరచన (డిక్టేషన్) వక్తృత్వశిక్షణ (Debate), పొడుపుకథలు (Riddles), చిత్రాల (Illustrations) ఆధారంగా కథలు చెప్పించడం ద్వారా భాషణా సామర్థ్యాన్ని పెంపొందించవచ్చు.

6. **కథాపూరణం :** కథను కొంతవరకు చెప్పి మిగిలిన భాగాన్ని పిల్లలచే ఊహింపజేసి పూరింపజేయాలి. కొన్ని చిత్రాలను ప్రదర్శించి కథను వారిచే చెప్పించి (భాషణం) మాట్లాడడం అనే సామర్థ్యాన్ని పెంపొందింపవచ్చు. పిల్లలు బొమ్మలంటే ఎంతో ఇష్టపడతారు కనుక ఈ విధానం వాళ్లమీద మంచి ప్రభావం చూపుతుంది.

7. **సంక్షిప్తీకరణ చేసి చెప్పించడం :** పాఠ్యాంశాలనుగాని, లేదా ఒక కథనుగాని చదివించి – దాని సారాంశాన్ని అర్థభంగం – భావభంగం కలుగకుండా కుదించి చిన్నదిగా చెప్పించాలి. విద్యార్థి సృజనాత్మకతతో చేసే ఇలాంటి సంభాషణ భాషణ సామర్థ్యాన్ని తీర్చిదిద్దుతుంది. కథలపట్ల వారికి ఉండే ఉత్సుకత దీనిద్వారా తృప్తిపరచబడుతుంది.

**D వాచికదోషాలు – నివారణోపాయాలు**

మాట్లాడడంలో పిల్లలు కొన్ని దోషాలు చేస్తూ ఉంటారు. వాచికచర్యలో సంభవించే ఈ దోషాలను – ఎత్తిచూపి ఎవరూ సరిదిద్దవలసిన అవసరం లేదు. పిల్లలే పెద్దల సంభాషణలనుండి గ్రహించి – తమంత తాముగా సరిదిద్దుకుంటారు. ఈ విషయంలో ఉపాధ్యాయుడు అందుకు తగిన ప్రయత్నంచేసి శ్రద్ధ వహించాలి.

**దోషాలు**

1. ఎదుటివారు విని అర్థంచేసుకోలేనంత వేగంగా మాట్లాడడం ముమ్మాటికీ దోషమే! అయితే దానికి భయం, సందేహం, తొందరపాటు మొ॥వి కారణాలు కావచ్చు. ఉపాధ్యాయుడు ఆ కారణాలను అవగాహనచేసుకొని తగురీతిలో తర్ఫీదు ఇవ్వాలి.

2. ఎదుటివారికి వినబడనంత స్వరంతో మాట్లాడడం కూడా వాచికదోషమే. దానికి తన భాషణలో తప్పులున్నాయేమోనని భయపడడమేకాదు – కొంత న్యూనతాభావం వల్ల కూడా అలా జరుగుతుంది. ఉపాధ్యాయుడు ఆ విషయాన్ని గ్రహించి, అతనికి ధైర్యం చెప్పి ప్రోత్సహించాలి.

3. ధ్వనులను, అక్షరాలను తారుమారుచేసి పలుకుటకూడా వాచికదోషమే కావచ్చునేమో కాని, విద్యాగంధంలేని కొందరు నిరక్షరాస్యుల విషయంలో భాషాపరమైన ఆధునికత సిద్ధాంతాలరీత్యా అలా మాట్లాడడం తప్పుకాదేమో!

ఉదా :- విమానం – ఇమానం
వెంకన్న – ఎంకన్న
భాగవతం – బాగవతం / బాగోతం
కంగారు – ఖంగారు
జ్ఞానం – గ్యానం
కల – కళ మొ॥వి

విద్యార్థి చేస్తున్న ఇలాంటి దోషాలను ఉపాధ్యాయుడు గమనించి అవసరాన్నిబట్టి తరగతిలోగాని, విడిగాగాని అతనికి వివరించి నివారించడానికి ప్రయత్నించాలి! అలాగే భావదోషాలు, భాషాదోషాలు కూడ గమనించి ఉపాధ్యాయుడు తగు పరిజ్ఞానాన్ని విద్యార్థికి అందించాలి.

**D మాట్లాడడంలో మనం విద్యార్థులనుంచి ఏం ఆశిస్తున్నాం?**

1. స్పష్టంగా మాట్లాడడం
2. దోషాలు లేకుండా మాట్లాడడం
3. ధైర్యంగా మాట్లాడడం
4. ధారాళంగా మాట్లాడడం
5. భావానుగుణంగా మాట్లాడడం
6. ఊనిక, స్వరభేదం పాటిస్తూ మాట్లాడడం
7. సందర్భానికి తగినట్లు మాట్లాడడం
8. వాచికాభినయంతోపాటు, ఆంగికాభినయంతో మాట్లాడడం
9. జాతీయాలను, సామెతలను, లోకోక్తులను అవసరమైనచోట్ల ఉపయోగిస్తూ మాట్లాడడం
10. సొంత శైలిలో చక్కని భావుకతతో మాట్లాడడం

సందర్భోచితంగా మాట్లాడిన మాట బంగారుపళ్లెంలో మామిడిపండు వంటిది.

## 5.3 ధారాళంగా చదవడం (పఠనం)

చదవడమంటే లిఖితరూపంలో ఉన్న వర్ణాలు, పదాలు, వాక్యాలను వాగింద్రియాల సహాయంతో ఉచ్చరించి – అందులోని విషయాన్ని తెలుసుకోవడమని చెప్పవచ్చు. అయితే లిఖితరూపంలో ఉన్న ఆ విషయాన్ని దోషరహితంగా, సరియైన వేగంతో, అర్థవంతంగా, భావయుక్తంగా చదవడమే ధారాళపఠనం!

విద్యార్థి విశేషమైన జ్ఞానాన్ని పొందడానికి కేవలం శ్రవణ, భాషణ సామర్థ్యాలు సరిపోవు. జ్ఞానం అనంతమైనది కాబట్టి విస్తారమైన గ్రంథపఠనం (చదవడం) ద్వారా విద్యార్థి ఆ విజ్ఞానాన్ని సంతరించుకొంటాడు. శ్రవణంపై పట్టుఉంటే పఠనంపై (చదవడం) పట్టు కుదురుతుంది. లిపి బద్ధమైన ధ్వనిరూపమే చదవడానికి ప్రాతిపదిక, చక్కని పఠనం విద్యార్థులకు విస్తృత జ్ఞాన సముపార్జనతోబాటు వ్యవహార దక్షతను సాధించడానికి కూడా ఉపయోగపడుతుంది.

అటువంటి పఠనం సాంస్కృతిక వారసత్వ విలువలను, చైతన్యాన్ని, ఘనవిజయాలను సాధించి పెడుతుంది.

జాతీయ విద్యాపరిశోధన శిక్షణమండలి (NCERT) వారు ప్రచురించిన "Teaching Reading Challenges" అనే గ్రంథంలో 'పఠనం' ఈకింది విధంగా పేర్కొనబడింది.

"Reading is finding out what an author has said, trying to think what he ment by it, and deciding what sense it makes and how good it is to the reader". - అనగా ఒక రచయిత చెప్పింది తెలుసుకోవడం, ఆ చెప్పినదాని అర్థాన్ని గురించి ఆలోచించడం, అది తెలిపే భావాన్ని నిర్ధారించడం, అది పఠితకు ఏవిధంగా మేలు చేస్తుందో నిర్ణయించడం.

### D పఠనం – ఆవశ్యకత

ఓనమాలు దిద్దడం (అక్షరాభ్యాసం) మొదలు తన ఊపిరి ఆగేవరకు మనిషి చేయవలసిన ఒకానొక ముఖ్యమైన జ్ఞానసంబంధమైన కార్యక్రమం పఠనం. అందుకే "ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి" అనికూడా అంటారు. ఒకప్పటి మానవుల స్థితిగతులు, వారి క్రమవికాసం తెలుసుకోవాలంటే అందుకు సంబంధించిన గ్రంథపఠనం ఎంతైనా అవసరం. లోకజ్ఞానాన్ని పెంపొందించడానికి, భాషపై పట్టు సాధించడానికి, ఉచిత ప్రవర్తన – సత్ఫలితాల ఆర్జనకు పఠనం సాటిలేని ప్రాధాన్యతను సంతరించుకుంటుంది అనడం నిస్సందేహం. పఠనం పాఠశాల పిల్లల పఠనాభిరుచిని అభివృద్ధి చేయడానికి దోహదపడాలి. పఠనావగాహనను పెంపొందించాలి. విభిన్న ప్రక్రియలను పిల్లలకు పరిచయం చేస్తే వారు పాఠ్యపుస్తకాలకు అతీతమైన (పాఠ్యేతర) ప్రగతిని సాధిస్తారు. ఇలా చదవడంపై పట్టుకలిగితే తప్పుల్లేకుండా రాయగల్గడం, చక్కటి పదాలను మాట్లాడడంలోను రాయడంలోను ప్రావీణ్యత సంపాదిస్తారు.

### D పఠనం – అందులోని రకాలు

పఠనం విద్యార్థి జ్ఞానార్జనను పెంపొందించేదిగాను, శ్రోతలకు ఆసక్తికరంగాను ఉండాలిగాని – విసుగుపుట్టించేదిగాను, నిస్సారమైనదిగాను ఉండకూడదు. "విరామ సమయాన్ని సద్వినియోగ పరచేది"గా ఉండాలి. అసలు విద్యకు వున్న చక్కని నిర్వచనాల్లో ఇదొకటికదా!

### D పఠనం – భేదాలు

పఠనం జరిగే తీరునుబట్టి పఠనాన్ని ముఖ్యంగా రెండు రకాలుగా విభజించవచ్చు.

**1.** **ప్రకాశ పఠనం :** దీన్ని 'బాహ్యపఠనం' అనికూడా అంటారు. వాగింద్రియాల సహాయంతో ఇతరులకు స్పష్టంగా వినబడేటట్లు బిగ్గరగా చదవడమే ప్రకాశపఠనం. ప్రాథమికస్థాయిలో

ప్రకాశపఠనాన్ని ప్రోత్సహించాలి. ఉపాధ్యాయుడు ఆదర్శపఠనం చేసి, అదే రీతిలో విద్యార్థులను పఠింపజేస్తూ ప్రకాశపఠనాన్ని పెంపొందించాలి.

**ప్రకాశ పఠనం – ప్రయోజనాలు :**

1. ఉపాధ్యాయుని ప్రకాశపఠనం విద్యార్థికి ఆదర్శంగా ఉంటుంది.
2. విద్యార్థుల ప్రకాశ పఠనం వల్ల వారిలోని ఉచ్చారణదోషాలను వెంటనే సవరింపవచ్చు.
3. విద్యార్థులు భావయుక్తంగా చదవడానికి అలవాటుపడతారు.
4. వాగింద్రియాలకు మంచి అభ్యాసం కల్గుతుంది.
5. సభాకంపంతొలగి, సభల్లో మాట్లాడగల సామర్థ్యం పెరుగుతుంది.
6. భవిష్యత్తులో చక్కని ఉపన్యాసకులుగా రాణించగలరు.

**2.** **మౌన పఠనం :** పెదవులు కదల్చకుండా, కళ్ళతో చూసి మనస్సుతో వేగంగా చదువు కొనడాన్ని 'మౌనపఠనం' అంటారు. ఈ పఠనం వల్ల తక్కువకాలంలో ఎక్కువ విషయాలు చదివి గ్రహింపవచ్చు. మాధ్యమికస్థాయిలో ఈ పఠనానికి ప్రాముఖ్యత ఉంటుంది.

**మౌన పఠనం – ప్రయోజనాలు :**

1. వేగంగా – తక్కువ సమయంలో ఎక్కువ విషయాలు గ్రహింపవచ్చు.
2. చదివిన విషయాన్ని బాగా గ్రహించగల్గడం.
3. గ్రంథాలయాల్లో ఈ పద్ధతి తప్పనిసరి.
4. వాగింద్రియాలకు శ్రమ ఉండదు.
5. ఏకాగ్రత, అవధానత పెంపొందుతుంది.
6. చదివే విద్యార్థికి రసానుభూతి కల్గుతుంది.

ఇవిగాక పఠనంలో విస్తార పఠనం, క్షుణ్ణ పఠనం, వైయక్తిక పఠనం, సామూహిక పఠనం, ఆదర్శ పఠనం, అనుగుణ పఠనం – అనే భేదాలు కూడా ఉన్నాయి.

గంగలోన మునగ గంపెడు పుణ్యంబు
కలుగుననుట వట్టి కల్లమాట!
పఠనమందు మునుగ పరమజ్ఞానము కల్గు
భాస్కరార్యుమాట! ప్రగతిబాట!

– కుందా

ప్రపంచంలో కొన్ని రంగాల్లో అద్వితీయంగా రాణించిన ప్రముఖులు ఆ స్థాయికి చేరుకోడానికి ముఖ్యకారణం విస్తారమైన గ్రంథపఠనమే! చిరిగిన చొక్కా అయినా తొడుక్కో, ఒక మంచి పుస్తకాన్ని కొనుక్కో అంటాడు ఒకనాటి ఆంధ్రజ్యోతి ఎడిటర్ నార్ల వెంకటేశ్వర్రావుగారు. ఒకవేళ కొనుక్కోలేకపోయినా ఈనాడు గ్రంథాలయాల ద్వారా; ఇంటర్‌నెట్ సౌకర్యం ద్వారా ఎన్నో గ్రంథాలు లభిస్తున్నాయి. వీటిని చదవడం వారి భాషా వికాసానికి; వ్యక్తిత్వ వికాసానికి దారితీస్తుంది.

3. **విస్తార పఠనం :** వైవిధ్యభరితమైన గ్రంథాలను / పుస్తకాలను చదవడాన్నే విస్తారపఠనం విశేష జ్ఞాన సంపాదనమే విస్తార పఠనం యొక్క లక్ష్యం. విషయానికి ఈ పద్ధతిలో ప్రాధాన్యత ఉంటుంది. చక్కని విస్తార పఠనం మౌనపఠనానికి బాటలు వేస్తుంది.

H **విస్తార పఠనం – ప్రయోజనాలు :**

1. అనేక గ్రంథాలను చదవడం ద్వారా విజ్ఞానాన్ని, లోకజ్ఞానాన్ని పొందవచ్చు.
2. తక్కువ సమయంలో ఎక్కువ పుస్తకాలు చదవవచ్చు.
3. స్వయంకృషితో జ్ఞానసముపార్జన చేయవచ్చు.
4. పఠనశక్తి – పఠన ఆసక్తి పెంపొందుతుంది.
5. విద్యార్థి సంపూర్ణ మూర్తిమత్వానికి దోహదపడుతుంది.

4. **క్షుణ్ణ పఠనం :** ప్రతి అంశాన్ని వివరంగా చదవడాన్ని – అనగా ఒక్కొక్క పాఠ్యాంశంలోని భాషా, భావ విశేషాలు సమగ్రంగా తెలుసుకుంటూ చదవడాన్ని క్షుణ్ణ పఠనం అంటారు. ఈ పఠనానికి వాచకమే ఆధారం. ఈ పఠనం ద్వారా విద్యార్థులు భాషాసాహిత్యాలపై మంచి పట్టు సాధిస్తారు. భాషా సాహిత్యాల లోతులు తెలుసుకుంటారు.

D **క్షుణ్ణ పఠనం – ప్రయోజనాలు :**

1. విద్యార్థులు పాఠ్యవిషయాన్ని పరిపూర్ణంగా అర్థంచేసుకుంటారు.
2. ఆయా విషయాలపై వ్యాఖ్యానించగల్గుతారు.
3. సృజనాత్మకతను పెంపొందించుకుంటారు.
4. తార్కికశక్తి, ఆలోచనాభివృద్ధి జరుగుతుంది.
5. సాహిత్య సృష్టికి పూనుకుంటారు.

5. **వైయక్తిక పఠనం :** తరగతిలోని ప్రతి విద్యార్థిచేత వ్యక్తిగతంగా చదివించడాన్నే వైయక్తిక పఠనం అంటారు. దీనివల్ల కాలహరణం జరిగినా, ప్రతి విద్యార్థి పఠనం చేసేటప్పుడు

అప్పటికప్పుడే దోషసవరణ చేయవచ్చు. అలాంటి దోషాలను మిగిలిన విద్యార్థులు చేయకుండా ఉంటారు.

6. **సామూహిక పఠనం :** విద్యార్థులందరిచేత ముక్తకంఠంగా (కోరస్‌గా) ఒకేసారి పఠనం చేయించడాన్నే సామూహిక పఠనం అంటారు. అయితే దీనిద్వారా విద్యార్థుల పఠన దోషాలను సవరించడానికి అవకాశం ఉండదు. అయితే జాతి జీవనంలో కలిసిపోయిన పాటలు, గేయాలు, మహాకవుల రచనలు, వారి భావాలు అందరూ కలిసి చదవడం వల్ల ఒక చక్కని ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుంది. రసానందం పరవళ్లు తొక్కుతుంది.

7. **ఆదర్శ పఠనం :** విద్యార్థులకు ఆదర్శంగా ఉండేటట్లు ఉపాధ్యాయుడు చేసే పఠనాన్నే 'ఆదర్శ పఠనం' అంటారు. విద్యార్థులు ఉపాధ్యాయుల ఆదర్శపఠనాన్ని అనుకరిస్తూ అభ్యాసం చేయడం వల్ల మంచి పఠన నైపుణ్యాన్ని పెంపొందించుకుంటారు.

8. **అనుగుణ పఠనం :** ఉపాధ్యాయుడు పాఠ్యాంశాన్ని సమవేగంతో, సముచిత స్వరంతో, హావభావ వ్యక్తీకరణాలతో ఆయా సన్నివేశాలకు అనుగుణంగా ఆదర్శ పఠనం చేస్తాడు. విద్యార్థులు సులభంగా అర్థంచేసుకొని ఉపాధ్యాయుని అనుసరిస్తూ చేసే పఠనాన్ని అనుగుణ పఠనం అంటారు. విద్యార్థులు చేసే దోషాలను ఉపాధ్యాయుడు సరిచేయాలి.

**D పఠన సామర్థ్యంలో విద్యార్థులనుండి మనం ఆశించేవి**

1. స్పష్టంగా చదవడం
2. దోషాలు లేకుండా చదవడం
3. ధైర్యంగా చదవడం
4. ధారాళంగా చదవడం
5. అవగాహనతో చదవడం
6. భావానుగుణంగా చదవడం
7. ఊనిక, స్వరభేదం పాటిస్తూ చదవడం
8. సందర్భానికి తగిన అంశాన్నే చదవడం
9. ప్రక్రియానుగుణంగా చదవడం (ఉదాహరణకు కథ చదివే విధానం వేరు; గేయం, పద్యం చదివే పద్ధతి వేరు)
10. వాచికాభినయంతో చదవడం
11. అవసరమైనచోట్ల ఆంగికాభినయంతో చదవడం

12. అనుభూతిని ప్రస్తరిస్తూ చదవడం

13. చదివే విషయాన్నిబట్టి చక్కని శైలితో చదవడం

**D బడికి రాకముందు పిల్లల పఠనస్థాయి**

సాధారణంగా బడికి రాకముందు పిల్లల్లో పఠన సామర్థ్యం అతి తక్కువగా ఉంటుంది. అందువల్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అందుకు తగిన శ్రద్ధతీసుకుంటే బొమ్మలపుస్తకాలను, కథల పుస్తకాలను చూపించి చదవమంటే – చదవడం అనే సామర్థ్యం వారిలో ఇనుమడిస్తుంది. చదవడం అంటే కేవలం అక్షరాలు – పదాలు – వాక్యాలు చదవడానికే పరిమితమైన ప్రక్రియ అని భావించకూడదు. ఇది చాలా విస్తృతార్థంతో కూడిన అంశం.

**D ధారాళంగా చదవడం – తరగతిగది నిర్వహణ**

తప్పొప్పులను గుర్తించడం, జతపరచడం, ఎవరు ఎవరితో అన్నారు ? – వంటి అభ్యాసాలను పూర్తి తరగతిగదిలోనే నిర్వహించాలి. పిల్లలు చెప్పింది తప్పైనా, ఒప్పైనా బోర్డుపై ముందుగా రాసి, ఉపాధ్యాయుడు అది ఎందుకు తప్పో, ఒప్పు ఎట్లో విశ్లేషించాలి. వాటిని పుస్తకాలలో రాసుకోమనాలి. వాటిపై చర్చ నిర్వహించాలి. అనంతరం జట్టులోగాని, వ్యక్తిగతంగా గాని రాయించాలి.

**D పఠన నైపుణ్యం – ఆధునిక పోకడలు**

'పఠనం' సహజంగాకాక – ప్రయత్నపూర్వకంగా అలవడే సామర్థ్యం. ఈ పఠనం సమయం వృథా కాకుండాను, అర్థవంతంకాని పదాలు పలుకకుండాను ఉంటేనే విద్యార్థులకు లాభదాయకం. ఇలా ఉండాలంటే ఆధునిక విద్యావేత్తలు ఈకింది విధంగా అక్షర, నవీనాక్షర, పద, వాక్య, కథా ప్రాతిపదిక పోకడలను సూచించారు.

1. **అక్షర పద్ధతి :** వర్ణమాలలోని ప్రతి అక్షరాన్ని ఉపాధ్యాయుడు చూపిస్తూ ఆ అక్షరాన్ని తాను ఉచ్చరిస్తూ విద్యార్థులచే ఉచ్చరింపజేస్తాడు. ఇది ప్రాచీన పద్ధతి. మనోవిజ్ఞాన శాస్త్రవేత్తలు ఈ పద్ధతిని అంగీకరించడంలేదు. ఎందుకంటే అక్షరాలకు స్వతహాగా అర్థం లేదు. మూర్తభావాలనుండి అమూర్తభావాలు తెలియజేయడం శాస్త్రవిరుద్ధం అని వారి వాదన.

2. **నవీనాక్షర పద్ధతి :** సారూప్యమున్న అక్షరాలను ఒక వర్గంగా విభజించి నేర్పడాన్ని 'సారూప్య పద్ధతి' అంటారు. ఈ పద్ధతిని కూడా మనోవిజ్ఞానశాస్త్రజ్ఞులు మంచి పద్ధతిగా అంగీకరించడం లేదు.

H ఒక్కొక్క అక్షరాన్ని విడిగా చదివించి – దిద్దించడంవల్ల విద్యార్థుల్లో ఉత్సాహం సన్నగిల్లి చదువుపట్ల అనాసక్తి ఏర్పడుతుంది.

H ధ్వనికి – లిపికి సంబంధం లేకపోవడం వల్ల విద్యార్థికి విసుగుపుడుతుంది.

H అచ్చులు, హల్లులు – ఇలా అక్షరాలను విడివిడిగా నేర్పడం వల్ల కాలం వృధా అవుతుంది.

H నిత్యవ్యవహారంలో లేని ఋ, ఌ లాంటి అక్షరాలను చదివించడం వృధాప్రయాస.

H మనస్సుకు ఆహ్లాదం కలిగించే చిత్రాలద్వారా నేర్పకపోవడం వల్ల పిల్లలు ఇష్టపడరు.

ఈ కారణాలతో మనోవిజ్ఞానశాస్త్రవేత్తలు ఈ పద్ధతిని అంగీకరించలేదు.

**3. పదప్రాతిపదిక పద్ధతి :** అర్థవంతమైన, పరిచితమైన సన్నివేశాలలో పదాల ఆధారంగా భాషను నేర్పే పద్ధతిని "పదపద్ధతి" అంటారు. అంటే పదాల ద్వారా విద్యార్థికి భాషాజ్ఞానం అందించడమన్నమాట.

**ప్రయోజనాలు :**

1. పదాలు అర్థవంతంగా ఉంటాయి కాబట్టి దీనిద్వారా అక్షరాలు గుర్తించడం తేలిక అవుతుంది.
2. అర్థంలేని విడివిడి అక్షరాలు నేర్చుకునే శ్రమనుండి విద్యార్థులు బయటపడతారు.
3. ఒకేసారి 3, 4 అక్షరాల పరిచయంతో అభ్యసనప్రక్రియ వేగవంతమవుతుంది.
4. విద్యార్థులు తాముగా నేర్చుకొన్న కొద్ది అక్షరాలతో సొంతంగా కొత్తపదాలు తయారు చేసుకొని ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకుంటారు.

ఈ పద్ధతిలో పరిచితములైన పదాలను ఎన్నుకొని వాని చిత్రాలను మెరుపు అట్టలపై (Flash cards) గీసి పదాలను చదివించాలి. అట్టలపై పైన చిత్రము దానికింద దానికి సంబంధించిన పదం రాయబడాలి. చిత్రం చూసి పదాన్ని గుర్తించి పలుమార్లు ఆ పదాన్ని చదవడం వల్ల ఆ అక్షరాలు మానసిక ప్రతిమలుగా మారతాయి.

**4. వాక్యప్రాతిపదిక పద్ధతి / వాక్యపద్ధతి :** ఈ పద్ధతిలో వాక్యం ప్రాతిపదికగా తీసుకోబడుతుంది. దీనిద్వారా చిన్న చిన్న వాక్యాలు చదవడం నేర్పించాలి. ఈ పద్ధతిలో పఠనాన్ని బోధించడానికి "వాక్యపత్రాలు" ఉపకరణాలుగా ఉంటాయి. బోధనకు అనువైన సన్నివేశాలను ఎన్నుకొని సహజ పరిస్థితులలో వాక్యపఠనం నేర్పాలి.

ఇది గెస్టాల్ట్ (సమగ్రాకృతి) సిద్ధాంతానికి దగ్గరగా వుంటుంది. విద్యార్థులు మొత్తంగా చదువుతారు.

5. **కథా పద్ధతి :** విద్యార్థులకు తెలిసిన కథలను ఎన్నుకొని కథా సన్నివేశాన్ని చిత్రాలుగా తయారుచేసి ఆ సన్నివేశానికి సంబంధించిన వాక్యాన్ని చిత్రం క్రింద రాయాలి. చిత్రాలను చూస్తూ విద్యార్థి వాక్యాలను చదవాలి. దీనివల్ల కథను అర్థం చేసుకోవటమేగాక – పఠనం పట్ల ఆసక్తి పెరుగుతుంది. అయితే 'చిత్రాలు' – అందుకు సంబంధించిన వాక్యాలు పిల్లలకు ఆనందకరంగా వుండాలి.

D **పఠనం – అభివృద్ధి చర్యలు :**

1. సాహిత్యపరమైన పోటీలు నిర్వహించడం.
2. వార్తాపత్రికలు చదివించి, ఇతరులు వినేటట్లు చేయడం.
3. వ్యక్తిగతంగా పాఠాన్ని పేరాలుగా ఒకరి తర్వాత మరొకరు చదివేటట్లు చేయడం.
4. రేడియో, టేపురికార్డర్, టెలివిజన్ వంటి సాధనాలలో కొన్ని అంశాలను వినిపించి, తిరిగి ఆ విషయాలను విద్యార్థులచేత చెప్పించడం.

D **పఠన దోషాలు – నివారణ :**

1. దృష్టి దోషం వల్ల పదాలను సరిగా గుర్తించలేకపోవడం.
2. వాగింద్రియ లోపం వల్ల అస్పష్ట ఉచ్చారణ.
3. పదజాల లోపం వల్ల అర్థం గ్రహించకపోవడం.
4. పఠన విధానం తెలియక కొత్త పదాలను చదవలేకపోవడం.

పై దోషాలను గ్రహించి ఉపాధ్యాయుడు వారికి తగు సూచనలు ఇవ్వాలి.

## 5.4 రాయడం (స్వీయరచన)

మన భావాలను మాటలద్వారా కేవలం ఎదుట ఉన్నవారికి మాత్రమే తెలియజేయగల్గుతాం. కాని దూరప్రాంతంలో ఉన్నవారికి మన భావాలను తెలియజేయాలన్నా, లేదా వారి భావాలను మనం తెలుసుకోవాలన్నా మాటల రూపంలో ఉన్న భాష ఏమాత్రం ఉపయోగపడదు. దానికి ఒకే ఒక్క సాధనం లేఖనం! అంతేకాదు ప్రాచీనకాలం నుండి పరంపరగా వస్తున్న సంస్కృతీ సంప్రదాయాలకు – జ్ఞానానికీ ఒక స్థిరరూపం ఇవ్వాలంటే 'లేఖనం' ఎంతో అవసరం. ఒక్కమాటలో చెప్పాలంటే 'లేఖనం' లేకపోతే వాటిని మనం పొందే అవకాశమే లేదు! కవులు తమ భావాన్ని

భిన్న ప్రక్రియల్లో లేఖనం ద్వారానే సమాజానికి తెలియజేసి తాము అనుకున్న లక్ష్యాలను సాధించగల్గుతున్నారు. సమాజంలోని సమస్యలు – పరిష్కారమార్గాలు, సమాజంలో చోటుచేసుకొంటున్న పరిస్థితులు పత్రికలరూపంలో ప్రచారం చేయడానికి కూడా లేఖనమే ప్రధాన సాధనం.

లేఖనం ద్వారా విద్యార్థులు తమ మనస్సులో ఉన్న భావాలను లిఖితరూపంలో పొందుపరచి తమ నైపుణ్యాలను పెంపొందింపజేసుకోగలరు. కావున విద్యార్థులు లేఖన నైపుణ్యాన్ని తప్పక కల్గియుండాలి.

### D రాయడం – ఆవశ్యకత, ఉద్దేశాలు

భాషావేత్తల అభిప్రాయాలను అనుసరించి భాషాభ్యసనంలో, బోధనలో లేఖనం అత్యంత ప్రధానమైనది. ఇది వ్యక్తుల జీవనవిధానాన్ని తెలియజేస్తుంది. సమాజంలోని సమస్యలు – పరిష్కారాలను, వార్తావిశేషాలను ఈ లేఖనం ద్వారా తెలియజేయవచ్చు. ఉచ్చరించిన వెంటనే నశించిపోయే ధ్వనిని (మాటలను) పదికాలాలపాటు పదిలపరచడానికి అనగా శాశ్వతత్వాన్ని చేకూర్చడానికి లేఖనం ఎంతో దోహదపడుతుంది.

లేఖన సామర్థ్యంలోని ప్రధాన లక్ష్యాలుగా వీటిని పేర్కొనవచ్చు.

H భావాలకు ఆకృతిని కల్పించడం
H పదసంపదను అందంగా ప్రదర్శించడం
H సృజనాత్మక శక్తులను వృద్ధిపరచడం
H పఠనాసక్తిని పెంపొందించడం
H భావవిష్కరణ శక్తిని పెంపొందింపజేయడం

### D లేఖనంలో సాంప్రదాయకరీతి

సాంప్రదాయకరీతిలో మనం పాఠశాలల్లో అనుసరిస్తున్న రచనా విధానం, కేవలం పాఠ్యాంశాలలోని ప్రశ్నోత్తరాలు రాయడంతోనే సరిపడుతోంది తప్ప – వాచకాన్ని మించి అదనపు రచనకు ఏవిధంగానూ దోహదపడడం లేదు. రాయడం –

1. తాము అర్థంచేసుకున్న విషయాల ఆధారంగా భావాన్ని వ్యక్తం చేసేందుకు
2. తమ ఆలోచనలు, ఊహలను విశ్లేషించుకోవడానికి
3. తమకు కల్గిన అనుభవాలను, ఎదురైన సంఘటనలకు శాశ్వతరూపం కల్పించడానికి
4. తమ భావాన్ని ఇతరులతో పంచుకోడానికి

5. గతించిన కాలంనాటి, నేటి సంస్కృతీ సంప్రదాయాలను ముందు తరాలవారికి అందించడానికి

– ఉపయోగపడాలి. కేవలం పాఠ్యాంశాల్లోని విషయాలను ఉన్నది ఉన్నట్లుగా రాస్తే అది పరిపూర్ణమైన లేఖనం అని భావించకూడదు. ఇది పిల్లల్లో లేఖనా సామర్థ్యాలు పెంపొందించడానికి దోహదపడదు. సరైన వాక్యనిర్మాణంతో అక్షరదోషాలు లేకుండా, విరామచిహ్నాలు పాటిస్తూ, తనదైన శైలిలో సుమధుర భావాన్ని వ్యక్తీకరించినపుడే నిజమైన లేఖనం జరిగినట్లు భావించాలి.

పై అంశాలను గమనిస్తే తాము విన్న, చూసిన, చదివిన అంశం గురించి సొంతమాటల్లో అవగాహనా సహితంగా, వివరణాత్మకంగా, వర్ణనాత్మకంగా, తార్కిక క్రమబద్ధంగా రాయడాన్నే 'లేఖనం' అనాలి.

లేఖనప్రక్రియలో రెండు విభిన్న కోణాలున్నాయి.

1. ముత్యాలు పేర్చినట్లు అందంగా రాయడం
2. అమృత సమానమైన పదాలతో పాఠకులు స్పందించేలా రాయడం

## D రాయడం – ప్రాచీన నవీన పద్ధతులు

**ప్రాచీన పద్ధతి :** విద్యార్థి పాఠశాలలో చేరినవెంటనే ఉపాధ్యాయుడు వర్ణమాలలోని వర్ణాలను వరుసగా ఒకదానితరువాత మరొకదానిని పలకపై దిద్దిస్తాడు. తరువాత గుణింతాలు – చిన్న చిన్న పదాలు రాయించడం, చదివించడం చేస్తూ క్రమంగా వాచకాన్ని చదివిస్తాడు. ఈ పద్ధతి వల్ల లాభం లేకపోగా దానిద్వారా చోటుచేసుకొన్న అనేక లోపాలు మనకు స్పష్టమవుతున్నాయి.

1. అర్థంలేని అక్షరాలను బలవంతాన మళ్ళీ మళ్ళీ దిద్దించడం వల్ల పిల్లల్లో విసుగు కన్పిస్తుంది.
2. అక్షరాలలో కొన్ని ఈనాటి అవసరాలకు అక్కర్లేని అక్షరాలు ఉన్నాయి.
3. అక్షరాలు గుడ్డిగా దిద్దించడమే అవుతుంది.
4. పోలికలేని అక్షరాలను వరుసగా అనగా అచ్చుల, హల్లులు, గుణింతాలుగా దిద్దించడం ఎక్కువ కాలాన్ని తీసుకుంటుంది.
5. ఎక్కువసార్లు దిద్దించడం వల్ల చేతివ్రేళ్లు దెబ్బతింటాయి. అది శారీరక గ్లానికి దారితీస్తుంది.
6. బొమ్మలు లేకుండా కేవలం అక్షరాలు మాత్రమే దిద్దిస్తే పిల్లలకు ఉత్సాహం ఉండదు.

7. శిశు మనస్తత్వశాస్త్రంపై ఉపాధ్యాయుడికి ఎంత అవగాహనవుంటే అంత మంచిది. దాని ద్వారా లేఖనం నేర్పడంలో శిశు మనస్తత్వానికి అనుగుణమైన పద్ధతిని ఉపాధ్యాయుడు ఎంపిక చేసుకుంటాడు.

D **ఆధునిక పద్ధతి :**

1. సారూప్యత ఉన్న అక్షరాలను – 'సులభంనుండి కాఠిన్యత' అనే లక్షణాన్ని అనుసరించి ఇప్పుడున్న వర్ణమాలలోని అక్షరములకంటే భిన్నంగా అక్షరాకృతికి మార్పుచేయడం ద్వారా – అతితక్కువ కాలంలో విద్యార్థులు అక్షరాలు నేర్చుకుంటారని శిశమనస్తత్వ శాస్త్రజ్ఞులు చెబుతున్నారు.
2. ప్రాచీనపద్ధతిలోని లోపాన్ని గుర్తించి, ముందు పఠనాన్ని నేర్పి, ఆతరువాత విద్యార్థులను లేఖనానికి సంసిద్ధులను చేయాలి.
3. పిల్లల చేతికండరాలు గట్టిపడే విధంగా కొన్ని గీతల ద్వారా, గుండ్రని సున్నాల ద్వారా రాయడాన్ని నేర్పించాలి. అలాగే పిల్లలచేత వారికి ఇష్టమైన బొమ్మలను గీయించాలి. ఎందుకంటే బొమ్మలంటే పిల్లలు బాగా ఇష్టపడతారు గనుక!

D **పిల్లలు ఎలా రాయాలని కోరుకుంటాం** ?

1. స్పష్టంగాను, నిర్దుష్టంగాను రాయాలని,
2. విషయదోషాలు, భాషాదోషాలు, భావదోషాలు లేకుండా రాయాలని,
3. వేగంతోపాటు అందంగా కూడా రాయాలని,
4. సమాన పరిమాణంలో అక్షరాలను; పదములమధ్య, పంక్తులమధ్య సమతను పాటిస్తూ రాయాలని,
5. అంశానికి, భావానికి అనుగుణంగా పేరాలుగా విభజించి రాయాలని,
6. జాతీయాలను, తెలుగు పలుకుబడిని, లోకోక్తులను, సామెతలను సందర్భానుసారంగా ఉపయోగిస్తూ రాయాలని,
7. తమదైన సరికొత్త శైలిని ఏర్పాటుచేసికొని రాయాలని – కోరుకుంటాం.

కొందరు లేఖనాన్ని (దస్తూరి) గొలుసుకట్టుగా రాయడం చూస్తుంటాం. ఆవిధమైన లేఖనాన్ని చదవడానికి అందరికీ ఓపిక ఉండదు. విసుగెత్తి మధ్యలో చదవడం మానివేసే అవకాశం ఉంది. అందువల్ల అలాంటి అస్పష్టమైన రాతవల్ల ఏవిధంగానూ ప్రయోజనం ఉండదు. వాక్యం ముగిసిన తర్వాత మరోవాక్యం మొదలుపెట్టడానికి మధ్యలో తగిన విరామం ఉండాలి. కొందరు

తాము రాసినదానిని తామే చదవలేరు. మనం రాసింది ఇతరులకు స్పష్టంగా తెలియాలి, కంటికి ఇంపుగా ఉండాలి.

విద్యార్థుల్లో ఉన్న ఉచ్చారణ దోషాలను సవరించకపోతే – అవే లేఖనంలో చోటు చేసుకొంటాయి. అంతేకాక వాటితోబాటు మరికొన్ని దోషాలుకూడా చేరుతూంటాయి. ముఖ్యంగా ఒత్తులు, అచ్చులు ఉండవలసినచోట హల్లులు (ఉన్నది–వున్నది), వ్యాకరణజ్ఞానం తగుమాత్రం లేకపోవడం వల్ల శబ్దాలను తప్పుగా రాయడం వంటి దోషాలు దొర్లుతాయి. అవి లేకుండా రాయాలి.

భాషాలేఖనంలో వేగం చాలా ముఖ్యమైనది. వ్యక్తిగతంగా తొందరగా రాయడంవల్ల అనేక ప్రయోజనాలు కల్గుతాయి. ఈ దోషాల నివారణకు విద్యార్థులకు చూచిరాత (దృష్టలేఖనం) ఎంతో ఉపయోగపడుతుంది. కొందరు రాసేటప్పుడు ప్రారంభంలో సమతను పాటిస్తారు. కాని చివరికి వచ్చేసరికి ఒక అక్షరం పెద్దదిగాను, మరో అక్షరం చిన్నదిగాను – పంక్తులమధ్య సమతను పాటించకపోవడం వంటి దోషాలను మనం చూస్తూంటాం. అది అంత మంచి లక్షణం కాదు.

ఒక అంశాన్ని సుదీర్ఘంగా రాయడంవల్ల చదువరి విసుగుచెందే అవకాశం ఉంది. అందుకు అంశంలోని భావాలు మారినప్పుడల్లా ఒక్కొక్క పేరాగా రాస్తూ – పఠితలకు ఆ అంశంలోని విషయాలపై చక్కని అవగాహన కల్పించాలి.

ఒక్కొక్క భాషకు తనదంటూ ఒక ప్రత్యేకత ఉంటుంది. వాటిని పాటిస్తే ఆ రచనకు గుర్తింపు కల్గుతుంది. ఆవిధంగా చూస్తే మన భాషలో జాతీయాలు, నానుడులు, లోకోక్తులు, సామెతల వంటి కొన్ని విశిష్టాంశాలు ఉన్నాయి. వాటిని ఉపయోగించి రాస్తేనే ఆ రచనలు వ్యాసానికి పరిపూర్ణత సిద్ధిస్తుంది.

పాఠ్యాంశాలలోని పాత్రల గురించి, స్థలాల గురించి, సంఘటనల సారాంశాలు మొదలగు వాటిని సొంతమాటల్లో రాయగలగాలి. ఇచ్చిన అంశాన్ని వివరిస్తూ, సమర్థిస్తూ, లేదా విభేదిస్తూ తమ అభిప్రాయాలను తెల్పుతూ సొంత మాటల్లో రాయగలగాలి. ఊహించి లేదా ఆ స్థానంలో తానుంటే ఏం చేస్తారో రాయగలగాలి. వీటి అన్నింటిలో తనకంటూ ఒక శైలిని సాధించి, రచన సాగించాలి. తెలుగుభాష అజంత భాష కనుక దానిని విదేశీయులు సైతం Italian of the East అని కొనియాడారు. తెలుగు అజంత భాష మాత్రమే కాదు – అందమైన లిపి వున్న భాష! వెన్నెల్లో ఆడుకునే అందమైన ఆడపిల్లల్లా తెలుగు అక్షరాలు అందరినీ అలరిస్తాయి!

D లేఖనంలో దోషాలు - నివారణలు

పిల్లల్లోని వాగ్దోషాలే క్రమంగా లేఖనంలో దోషాలుగా మారతాయి. అక్షర, పద, వాక్య, విరామచిహ్నాలు, భావ-భావవ్యక్తీకరణలో దోషాలు చేస్తుంటారు. ఇవి కేవలం వాక్కులోనే కాదు లేఖనంలో కూడా కనబడతాయి.

ఉదా : విద్యార్థి - విధ్యార్ది
భేదం - బేధం

పదాలు ఉచ్చరించినపుడు ఒత్తులు లేనిచోట ఒత్తులు; ఉన్నచోట్ల తీసివేసి పలికితే అవే తప్పులు లేఖనంలో కూడా దొర్లుతాయి. అందువల్ల ఉపాధ్యాయుడు విద్యార్థుల భాషణాన్ని వింటూ, ఎప్పటికప్పుడు దోష సవరణ చేస్తే లేఖనంలో దోషాలు ఉండవు.

ఈకిందివానిని లేఖనంలో దోషాలకు కారణంగా భావించవచ్చు.

1. విద్యార్థుల వాగ్దోషాలను ఉపాధ్యాయుడు సవరించకపోవడం.
2. లేఖన దోషాలను ఎప్పటికప్పుడు కింద గీతగీసి ఒప్పులను రాసి చూపించకపోవడం.
3. తగినంత రాతపనిని ఇవ్వకపోవడం.
4. ఉపాధ్యాయుడు స్పష్టంగా, నిర్దుష్టంగా, విద్యార్థులందరికీ వినపడునట్లు భాషింపక పోవడం.
5. విద్యార్థులచే చూచిరాత (దృష్టలేఖనం, ఉక్తలేఖనం వంటి అభ్యాసాలను చేయింపక పోవడం.
6. ఎక్కువ విద్యార్థులు చేసే సాధారణ దోషాలను (ఉదా : విద్యార్థి - విధ్యార్ది) నల్లబల్లపై కాని, అట్ట (ఛార్టు) పై కాని రాసి చూపించకపోవడం.
7. దోషాలులేకుండా రాసిన పిల్లవానిని అభినందించి - మిగిలినవారు అలా రాయడానికి ప్రోత్సహించకపోవడం.
8. దోషాల సవరణను వ్యక్తిగతంగా చూపించకపోవడం.

## 5.5 సృజనాత్మక వ్యక్తీకరణ (వివిధ రకాల రచనలు)

పాతరూపాలకు కొత్త రూపాన్ని ఏర్పరచడం; కవితలు, కథలు, నాటికలు మొ॥ సాహిత్య ప్రక్రియల్ని తనదైన సొంత ఆలోచనలతో ఇతరులకంటే విభిన్న ధోరణిలో వ్యక్తపరచడమే సృజనాత్మకత! ఆలోచనతో కూడిన పదాల కూర్పును రచన అనిఅంటాం. విద్యార్థుల్లో వచ్చిన కొత్త భావాలు, ఊహలకు ఉపాధ్యాయుడు ఒక రూపకల్పన చేస్తే - ఆ విద్యార్థిలోని అంతర్గత

శక్తులు వెలికి వస్తాయి. సృజనాత్మక వ్యక్తీకరణ భౌతికరూపంలోను, రాతరూపంలోను, ప్రదర్శన రూపంలోను ఉంటుంది. మానవజాతి భవిష్యత్తు కొత్త విషయాలను ఆవిష్కరించగలిగిన సృజనాత్మకత గల వ్యక్తులపైనే ఆధారపడి ఉంటుందనడంలో ఏమాత్రం సందేహం లేదు.

ఈ రచన వాగ్రూపంలో, భాషణరూపంలో ఉంటుంది. విద్యార్థులు స్వీయనైపుణ్యంతో మాట్లాడితే వాగ్రూప రచన అని – అదే లిఖితరూపంలో వ్యక్తపరిస్తే దానిని లిఖితరచన అని అంటారు. ఈ లిఖిత రచనా నైపుణ్యాన్ని ఈకింది వివిధ ప్రక్రియల ద్వారా పెంపొందింపవచ్చు.

1. వ్యాస రచన
2. లేఖా రచన
3. సంభాషణా రచన
4. పుస్తకసమీక్షా రచన
5. సారాంశ రచన
6. సంక్షిప్త రచన
7. దినచర్య రచన
8. సంపాదకీయ రచన
9. వార్తా రచన
10. ఆహ్వానపత్రిక రచన
11. అనువాద రచన
12. ప్రకటన రచన
13. స్వాగత రచన
14. సన్మాన రచన
15. ప్రశంసా రచన
16. కృతజ్ఞతా రచన
17. వ్యాఖ్యా రచన
18. దస్తావేజుల రచన
19. ధృవపత్ర రచన

ఈ రచనలన్నీ విద్యార్థుల సృజనాత్మకతను ప్రదర్శించడానికి తోడ్పడతాయి. విద్యార్థులచేత రచనలు చేయించేటప్పుడు ఉపాధ్యాయుడు ఈకింది జాగ్రత్తలు తీసుకోవాలి.

1. పాఠ్యాంశాలను సంభాషణ రూపంలో, గేయరూపంలో రాయించడం.
2. లోకోక్తులను, జాతీయాలను వివరించి రాయమనడం.

3. చిత్రాలు ఆధారంగా రచన చేయించడం.
4. ఒక రచనను అనుకరించి తిరిగి రచన చేయించడం.
5. పాఠశాలల్లో నిర్వహించే వివిధ కార్యకలాపాలపై రచనలు చేయించడం.

వాగ్రూప రచనను 'ఉక్తరచన' అంటారు. ఏదేని ఒక అంశంపై కొద్ది నిమిషాలు తడబాటు లేకుండా మాట్లాడటాన్ని ఉక్తరచన అంటారు. ఇది శ్రోతలను ఆకట్టుకొనే విధంగా ఉండాలి. తాను చెప్పదలచుకొన్న విషయాన్ని ఉదాహరణలతో చెప్పాలి. సందర్భానికి తగినట్లు అంశాలను వివరిస్తూ వినేవారికి విసుగురాకుండా మాట్లాడాలి. ఈకింది చర్యల ద్వారా వాగ్రూప రచనను పెంపొందింపవచ్చు.

1. విద్యార్థులు తరగతిగదిలో కూర్చొన్న చోటునుండే మాట్లాడేటట్లు చేయడం.
2. ఉపాధ్యాయుని ముందుకు వచ్చి మాట్లాడేటట్లు చేయడం.
3. పాఠశాలల్లోగాని, పాఠశాల వెలుపలగాని జరిగే సమావేశాల్లో మాట్లాడించడం.

పై చర్యల ద్వారా విద్యార్థులలో భయం తొలగిపోయి, చక్కని వక్తలుగా రూపొందుతారు.

విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందించడానికి ఉపాధ్యాయుడు –

1. పాఠ్యాంశాన్ని అనుసరించి బొమ్మలు వేయించి, రంగులు దిద్దించడం.
2. పుట్టినరోజుకు శుభాకాంక్షలు తెలియజేస్తూ మిత్రునకు లేఖ రాయించడం.
3. ఇంటి ఆవరణలో, పాఠశాల స్థలంలో ఉన్న మొక్కలపేర్లు – పువ్వులు – రంగులు – కాయల పేర్లు రాయించడం.
4. తండ్రికి, తల్లికి, సోదరికి లేఖలు రాయించడం
5. పాఠ్యాంశాల సారాంశాన్ని రాయించడం

ఇలాంటి కృత్యాలను ఆధారంగా చేసికొని బోధనాభ్యసనం జరపడాన్ని కృత్యాధార పద్ధతి అంటారు.

కవితా రచన, కథా రచన, వర్ణనాత్మక రచన, పాఠశాల పత్రికలు కూడా విద్యార్థుల్లో సృజనాత్మకశక్తిని పెంపొందిస్తాయి. ఉపాధ్యాయుడు మౌఖికంగానూ, లిఖితరూపంలోనూ పిల్లల్లో సృజనాత్మక వ్యక్తీకరణకు పలు అవకాశాలు కల్పించాలి. విద్యార్థుల సృజనాత్మక స్థాయిని తెలుసుకోవడానికి "గిల్‌ఫర్డ్ & టొర్రెన్స్" రూపొందించిన నికషలు ఉపాధ్యాయునికి చక్కగా ఉపయోగపడతాయి.

## 5.6 పిల్లల్లో పదజాలాభివృద్ధి

శ్రవణ, భాషణ, పఠన, లేఖన సామర్థ్యాలను సాధించడమే భాషాభ్యసనమని భావించడం జరుగుతోంది. కాని ఈ సామర్థ్యాల సాధనకు మాత్రమే భాషాభ్యాసం పరిమితం కారాదు. ఈ నైపుణ్యాల మధ్యగల అంతర సంబంధాలను గుర్తించాలి. భాషాభ్యసనం, భాషా సంపాదన క్రమంలో పిల్లలు సాధించవలసిన ఇతర సామర్థ్యాలను కూడా పరిగణనలోనికి తీసికోవాలి. మాతృభాషలో ప్రావీణ్యాలను పెంచడం అనేది భాషాబోధనలో ప్రధానాంశం కావాలి.

అందుకే నూతన వాచకాలలో బోధనాభ్యసన ప్రక్రియల తర్వాత "ఇవి చేయండి" అను శీర్షిక కింద

1. వినడం – మాట్లాడడం
2. చదవడం – రాయడం
3. స్వీయరచన
4. పదజాల వినియోగం
5. సృజనాత్మకత
6. ప్రశంస
7. ప్రాజెక్టుపని
8. భాషను గురించి తెలుసుకుందాం (వ్యాకరణం) – అనే సామర్థ్యాలు

ఇవ్వబడ్డాయి.

**పదజాలాభివృద్ధి**

విద్యార్థుల్లో పదజాలాభివృద్ధి అనే సామర్థ్యసాధన తప్పక అమలుజరగాలి. విద్యార్థి స్థాయినిబట్టి ఇన్ని పదాలు తెలిసికొని ఉండాలని విద్యావేత్తలు సూచించారు. వాచకంతోపాటు కథలు, మ్యాగ్జైన్స్, కార్టూన్లు చదవడం వల్ల విద్యార్థుల్లో నూతనపదాల పరిచయం ఏర్పడుతుంది. పిల్లల్లో పదజాలాభివృద్ధికి కేవలం పదాలను మాత్రమే నేర్పడం – నేర్వడం కూడ సరియైన పద్ధతి కాదు. కేవలం నిఘంటువుల్లోని పదాలపైనే దృష్టి పెట్టకూడదు. పదాలు సందర్భోచిత వినియోగం ద్వారానే అర్థవంతమవుతాయన్న విషయాన్ని ఉపాధ్యాయుడు గుర్తించి, పదజాల బోధన జరగాలి. సంపన్నమైన పదజాల సంపాదన భాషాబోధన పరమావధి కావాలి. పదాల అర్థాలను ఊహింపజేయడం, తగిన విధంగా అభ్యాసాలు కలిగించడం ద్వారా మాత్రమే ఇది సాధ్యమవుతుందని ఉపాధ్యాయుడు గుర్తించాలి. పాఠశాల దశ పూర్తిఅయ్యేసరికి పిల్లలు వివిధ రంగాలు, సబ్జక్టులు, సన్నివేశాలకు అనుగుణంగా పదజాలాన్ని వినియోగించగలగాలి. అలా

చేయడం వల్ల పిల్లలు ఆ పదాలను ఈకింది విధంగా ఉపయోగిస్తారు.

1. నూతన పదజాలాన్ని సందర్భోచితంగా ఉపయోగిస్తారు.
2. సొంత వాక్యాలలో రాస్తారు.
3. చదువుతున్న అంశంలోని పదాలకు సమానార్థక పదాలను, వ్యతిరేక పదాలను, అర్థాలను గ్రహించి, వాటిని సందర్భోచితంగా వినియోగిస్తారు.
4. సందర్భాన్నిబట్టి అర్థాలకు, నానార్థాలకు, పర్యాయపదాలను గ్రహిస్తారు.
5. కవితలు, గేయాలు, పాటలు, కథలలోని కీలక పదాలను గుర్తిస్తారు.
6. పారిభాషిక పదజాలాన్ని అర్థం చేసుకోగల్గుతాడు. అభ్యసనను మెరుగుపర్చుకొంటాడు.
7. పదపట్టికలు, గళ్ళనుడికట్టు వంటి భాషాక్రీడల ద్వారా సందర్భోచితంగా పదాలను రాస్తారు.

పై అంశాలనుబట్టి "పదజాలాభివృద్ధి" అంటే కొత్త పదాలను తెలుసుకోవడం, వాటికి అర్థాలు గ్రహించడం, అలా తెలుసుకున్న పదాలను సందర్భోచితంగా ప్రయోగించడం అని తెలుస్తోంది. పిల్లలు వివిధ పదాలకు అర్థాలను సన్నివేశాన్నిబట్టి, సందర్భాన్నిబట్టి గ్రహిస్తారు. వివిధ సన్నివేశాల్లో ఒకపదాన్ని ఉపయోగించిన తీరునుబట్టి ఆ పదానికి అర్థం మారుతూ ఉ ంటుంది.

ఉదా : 'మాట' అనే పదాన్ని వివిధ సందర్భాల్లో ఉపయోగించిన తీరును పరిశీలిద్దాం.
"నామాట ఏం చేశావు!"
"మాటకు మాట పెరిగింది"
"మాటల్లేవు"
"మాటకు మాట చెప్పడం ఎక్కువైందే" – అంటే సందర్భాన్నిబట్టి పదం యొక్క అర్థం మారుతుందని పిల్లవానిచేత గ్రహింపజేయాలి.

సందర్భోచితంగా ప్రయోగించిన పదాల అర్థాలను కూడా ఆ సందర్భాన్నిబట్టి తెలుసు కుంటాడు.

ఉదా : రాము తథిగిణతోం తో రాస్తున్నాడు.
లత తథిగిణతోం తో ఊడుస్తున్నది – ఇక్కడ సందర్భాన్నిబట్టి తథిగిణతోం అంటే పెన్ను అని, చీపురు అని కూడా గ్రహిస్తాడు.

## 5.7 వ్యాకరణాంశాలు

**భాషావ్యాకరణాలలో ఏదిముందు ?**

భాష జీవనది లాంటిది. అది ప్రజల వ్యవహారంలో రకరకాల మార్పులు చెందుతూ ఉంటుంది. ఇలా వ్యవహారంలో ఉన్నభాష వందల సంవత్సరాలు అభివృద్ధి చెందిన తర్వాత, సమాజాన్ని అభివృద్ధి మార్గంలో నడిపించే సాహిత్యం వెలువడుతుంది. వ్యాకరణం ఆ భాషా మందిర ద్వారాన్ని తెరచే తాళం చెవిలాంటిది. అనేక గ్రంథాలలోని ప్రయోగాలను పరిశీలించి (వ్యాకరణ రచయితలు) వైయాకరణులు భాషకు వ్యాకరణం రాసారు.

వి + ఆకృతి > వ్యాక్రియంతే అనేన ఇతి వ్యాకరణం – వ్యాకరించి చెప్పేది వ్యాకరణం. అందుకే వ్యాకరణానికి మూలం భాషేగాని, భాషకు మూలం వ్యాకరణం కాదని పెద్దల వాక్యం. అందుకే "ప్రయోగశరణం వ్యాకరణం" అన్నారు. లేఖనంలో ఉన్న భాషారూపాల ఆధారంగానే వ్యాకరణం ఏర్పడింది. దానికి మహాకవుల ప్రయోగాలే శరణ్యం. వ్యాకరణం ఎప్పుడూ హద్దులు కల్గిఉండదు. భాష అభివృద్ధిచెందినకొద్దీ కొత్త ప్రయోగాలు వ్యాకరణంలో చేరుతాయి. వ్యాకరణం తోనే భాషకు స్థిరత్వం ఏర్పడుతుంది. శబ్దాలను శాసించేది వ్యాకరణమని 'పాణిని' తన అష్టాధ్యాయిలో వివరించాడు. ధ్వని, ఉచ్చారణ, పదం, అర్థాలమధ్యగల సంబంధాన్ని తెలుపడానికి వ్యాకరణం ఉపయోగపడుతుంది.

చిన్నయసూరి బాలవ్యాకరణం పేరుతో గ్రాంథికభాషకు వ్యాకరణం రాసినా, కొందరు వ్యావహారిక భాషకు కూడా వ్యాకరణం రాశారు. భాషను ఇష్టం వచ్చినట్లు మాట్లాడకుండా కొన్ని నియమాలు ఏర్పడ్డాయి. ఈ నియమాలను అతిక్రమించకుండా ఉండాలని భాషావేత్తలు స్పష్టం చేస్తున్నారు. ఆ నియమాలనే మనం 'వ్యాకరణం' అంటున్నాం. ఈ నియమాలు మానవుని కోసం ఏర్పడినవేగాని – నియమాల కోసం భాష ఏర్పడలేదు. వ్యాకరణం భాష 'ఇలా ఉండాలి, ప్రయోగింపబడాలి' అని కట్టడి చేసే పని కారాదు. అంటే వ్యాకరణం భాషకు ఆనుషంగికంగా ఉండాలి. అంటే వ్యాకరణం భాషకు ఒక ఆనకట్ట వంటిదేగాని – అడ్డుకట్ట కారాదు. భాష యొక్క నిర్దిష్ట ఆకారాన్ని అపభ్రంశం చేయకుండా నిలపడమే వ్యాకరణ ధర్మం.

ప్రతి మానవుడు చిన్నతనంలో ఊహరాగానే తన పరిసరాలలో మసలుతున్న మనుషులు మాటాడే మాటలను, చేసే చేష్టలను గమనిస్తూ ఉంటాడు. ఆ గమనికలో ఏ వస్తువును ఏ పదం సూచిస్తోంది, వాక్యాలు ఏయే పదాల కలయిక వల్ల ఏర్పడుతున్నాయి అని గ్రహించి ఆ పెద్దల మాటలను, చేష్టలను అనుకరిస్తాడు. ఇలా బాష నేర్చుకోవడంలో భాషలో ఉన్న నియమాలు లేదా సూత్రాలు అజ్ఞాతంగానే అతని మనస్సులో స్థిరపడతాయి.

భాష అభివృద్ధిచెందేకొద్దీ మాట్లాడే వారి సంఖ్య కూడా పెరుగుతూ ఉంటుంది. కొందరి ముఖయంత్రాలలో ఉండే వైవిధ్యంవల్ల, కొందరి అలసత్వం వల్ల కొన్ని పదాల ఉచ్చారణ ఒకరి నుంచి ఇంకొకరితో భేదిస్తుంది. ఈ విభేదాన్ని అలాగే పెరగనిస్తే కొంతకాలానికి ఆ భాషకు వికలత్వం ఏర్పడి, ఆ భాషను మాట్లాడేవారిలోనే ఒకరి భాష మరొకరికి అర్థంకాని పరిస్థితి ఏర్పడుతుంది. అటువంటి పరిస్థితిని తప్పించడం కోసం మేధావులు వ్యాకరణం కల్పిస్తారు.

## D వ్యాకరణం – ఆవశ్యకత

ప్రాచీనకాలంలో 'వ్యాకరణశాస్త్రా' నికి ఒక విశిష్ట / ప్రత్యేకస్థానం ఉండేది. నిజం చెప్పాలంటే వ్యాకరణ పండితుడు చదువుకొన్నవారిలో గొప్పవాడిగా / ప్రతిభావంతుడిగా పరిగణింపబడేవాడు. అందుకే వ్యాకరణాన్ని ప్రత్యేక శాస్త్రంగా చదువుకొనేవారు. కాని నేడు వ్యాకరణం పాఠశాల బోధనలో అంతర్భాగంగా బోధింపబడుతోంది. వ్యాకరణం బోధించడంలో ఈకింది అంశాలు ఉద్దేశాలుగా పరిగణింపబడుతున్నాయి.

1. విద్యార్థులకు భాషాస్వరూపాన్ని తెలియజేయడం.
2. ప్రాచీన గ్రంథాలను చదువగలిగేటట్లు చేయడం.
3. భాషలో అప్పుడప్పుడు కలిగే మార్పులు తెలియజెప్పడం.
4. పదాల స్వరూప స్వభావాలు తెలియజెప్పి, చిన్న చిన్న సూత్రాలు నిర్మింపజేయడం.
5. శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం.
6. చక్కని రీతిలో రచనలు చేయగల్గునట్లు చేయడం.
7. భాషానైపుణ్యాలను పెంపొందించడం.
8. సోదర భాషలలోని అవసరమైన పదాలను తన భాషలో చేర్చుకోవడం.
9. సరియైన భాషాజ్ఞానాన్ని పెంపొందింపజేయడం.

వ్యాకరణం భాషలోని సాధు–అసాధు రూపాలను తెలియజేస్తుంది. కాబట్టి మంచి (సాధు) రూపాలను తెలుసుకోదలచిన వారికి వ్యాకరణ జ్ఞానం తప్పనిసరి. అందువల్ల విద్యార్థులకు ప్రాథమిక దశనుండి పాఠశాలల్లో వ్యాకరణ జ్ఞానం కల్పించడం ముఖ్యం. వ్యాకరణం భాషకు చక్కని ఆకృతిని సమకూర్చుతుంది. కనుక వ్యాకరణ బోధన అత్యవసరం. భాషకు వ్యాకరణం పునాదిలాంటిది. క.అ.సా. భావన దృష్ట్యా ఈనాడు మనం అనుసరిస్తున్నది ప్రాయోగిక వ్యాకరణం. మరొకరకంగా చెప్పాలంటే దీనినే వాడుక భాషావ్యాకరణం అనవచ్చు.

## D వ్యాకరణం – బోధన పద్ధతులు

వ్యాకరణం యొక్క ఆవశ్యకత, వ్యాకరణం వల్ల కలిగే ప్రయోజనాలు తెలిసినప్పుడు – ఆ వ్యాకరణాన్ని ఎలా బోధించాలి? అను అంశాన్ని గూర్చి పరిశీలించాలి. వ్యాకరణ నియమాలను గ్రహించడానికి కొంత తార్కిక శక్తి అవసరం కనుక ప్రాథమిక దశలోని వారికి అర్థంచేసుకొనే శక్తి ఉండదు గావున, వారికి వ్యాకరణ బోధన మంచిది కాదు.

మాధ్యమిక దశలో కొంత తార్కికశక్తి జాగృతమవుతుంది. కనుక వ్యాకరణ బోధనకు క్రమపద్ధతిలో అప్పుడే ప్రారంభించాలి. ఇది విద్యార్థుల స్థాయినిబట్టి నాల్గు రకాలుగా బోధించాలి.

1. **నిగమోపపత్తి పద్ధతి :** దీనినే సంప్రదాయపద్ధతి, సూత్రపద్ధతి అనికూడా అంటారు. ఈ పద్ధతిలో మొదట సూత్రాన్ని చెప్పి వల్లె వేయించి దానికి తగిన ఉదాహరణలు చెప్పడం జరుగుతుంది. శాస్త్ర అధ్యయనం చేయాలనుకొనేవారికి ఇది ఉపయోగకరమైనా, విద్యార్థులకు ఈ పద్ధతిబోధన మనోవైజ్ఞానిక సిద్ధాంతానికి వ్యతిరేకమని మనోవైజ్ఞానిక శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వ్యాకరణ బోధనాలక్ష్యాలు ఈ పద్ధతి ద్వారా సాధించడం కష్టం కనుక ఇది యోగ్యం కాదు. ఆంగ్లంలో ఈ పద్ధతిని Deductive Method అంటారు.

2. **అనుమానోపపత్తి పద్ధతి :** దీనిని ఉదాహరణ పద్ధతి, ఆధునిక పద్ధతి అనికూడా అంటారు. ఆంగ్లంలో 'Inductive Method' అంటారు. తొలుత జర్మనీదేశంలో ఈ పద్ధతి ప్రవేశ పెట్టబడింది. ఈ పద్ధతిలో పాఠ్యాంశాలలోని వ్యాకరణాంశాలకు సంబంధించిన ఉదాహరణలను విద్యార్థులచే పరిశీలింపజేసి, వాటి ఆధారంగా సూత్రనిర్మాణం చేయడం జరుగుతుంది. ఈ పద్ధతి మనోవైజ్ఞానిక శాస్త్రానుగుణమైనది. తెలిసిన దానినుండి తెలియనిదానిని గ్రహించడం ఇందులో ముఖ్యవిషయం. ఇది విద్యార్థి కేంద్రీకృతంగా వుండి వారిలోని ఆలోచన, తార్కిక, హేతువాద, సృజనాది అంతర్గత శక్తుల్ని బహిర్గతం చేస్తుంది. ఇందులో ఊహ ప్రధానం గనుక అనుమానోపపద్ధతి అనే పేరు తగి ఉంది.

3. **అనుసంధాన పద్ధతి :** ఈ పద్ధతిలో వ్యాకరణ గ్రంథాలను సంప్రదాయపద్ధతిలో చదివి, ఆ జ్ఞానాన్ని వాచకంలోని రూపాలతో అనుసంధానం చేయడం ద్వారా, వ్యాకరణ నియమాలను అభ్యసించడం జరుగుతుంది.

4. **ప్రయోగ పద్ధతి :** పాఠ్యాంశాల్లో ఉండే వ్యాకరణాన్ని బోధించాలన్నది ఈ పద్ధతిలో ప్రధాన ఉద్దేశం. దీనిని ఆంగ్లంలో 'Functional Grammar' అంటారు.

ఇవికాక చర్చాపద్ధతి, ప్రశ్నోత్తర పద్ధతి, ఉదాహరణ పద్ధతి, విశ్లేషణ పద్ధతుల ద్వారా కూడా వ్యాకరణాన్ని బోధించవచ్చు.

మాధ్యమిక తరగతులు 6, 7, 8 తరగతుల వాచకాలను పరిశీలిస్తే ఆ వాచకాల్లో 'భాషను గురించి తెలుసుకుందాం' అనే శీర్షికతో ఈకింది అంశాలు గమనింపవచ్చును.

1. సంధులు – పదాలు కలిపి రాయండి, పదాలను విడదీయండి.
2. విగ్రహ వాక్యాలను సమాస పదాలుగా మార్చుట.
3. సమాస పదాలను విడదీసి విగ్రహవాక్యాలు చెప్పుట.
4. పదాలకు ప్రకృతి వికృతి రూపాలు మొ॥వి.

భాషాభివృద్ధిని సాధించడానికి భాషాసామర్థ్యాలు, వ్యాకరణం ఒక క్రమపద్ధతిలో బోధించాలి. భాషా వ్యాకరణాల సంబంధం తెలియజేయాలి. తెలుగు భాషాసాహిత్యాలు ఎక్కువభాగం సంస్కృతాన్ని ఆశ్రయించి అభివృద్ధిచెందాయి కాబట్టి ప్రకృతి వికృతి పదాల ద్వారా తత్సమ–తద్భవ పదాల స్వరూప స్వభావాలను కూడా తెలియజేయాలి. నానార్థాలు, పర్యాయపదాలు పదజాలాభివృద్ధికి దోహదపడతాయి కాబట్టి వాటిపై పిల్లవానికి అవగాహన కల్పించాలి.

మొత్తంమీద వ్యాకరణాభ్యాసం విషయావగాహనకీ, భాషాభివృద్ధికి కూడా ఉపకరిస్తుంది.

## 5.8 మూల్యాంకనం

**I. ఈకింది ప్రశ్నలకు 30 పంక్తులు మించకుండా సమాధానాలు రాయండి.**

1. భాషా సామర్థ్యాలంటే ఏమిటి? వాటిలో 'మాట్లాడడానికి' గల స్థానాన్ని వివరించండి.
2. వ్యాకరణం ఆవశ్యకతను వివరిస్తూ తరగతిగదిలో వ్యాకరణాన్ని ఏ పద్ధతిలో బోధించడం మంచిదో చర్చించండి.
3. 'రాయడం' (లేఖనం) లో ప్రాచీన నవీన పద్ధతులను తెల్పుతూ, నేటి విద్యార్థులకు 'రాయడం' సామర్థ్యం పెంపొందించడంలో మెలకువలు సూచించండి.

**II. ఈకింది ప్రశ్నలకు 15 పంక్తుల్లో సమాధానాలు రాయండి.**

1. 'పఠనం' ఆవశ్యకతను వివరిస్తూ – భేదాలను తెల్పండి ?
2. పిల్లలు ఎలా రాయాలని మనం కోరుకుంటాం ?
3. పఠన నైపుణ్యంలో ఆధునిక పోకడలు వివరించండి.

4. 'సృజనాత్మక' సామర్థ్యాన్ని ఎలా పెంపొందించవచ్చు?

5. పిల్లల్లో భాషాసామర్థ్యాల అభివృద్ధి వల్ల లాభాలేమిటి ?

6. పిల్లల్లో పదజాలాభివృద్ధికి మార్గాలు తెల్పండి.

**III. ఈకింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

1. 'చదవడం' అంటే ఏమిటి ?

2. 'ప్రకాశ పఠనం' అని దేనిని అనవచ్చు ?

3. 'నిగమోపపద్ధతి' అంటే ఏమిటి ?

4. 'అక్షర పద్ధతి' అని దేనినంటారు ?

5. 'వాదనలు' అంటే ఏమిటి ? వివరించండి.

6. 'క్షుణ్ణ పఠనం' గురించి వివరించండి.

**IV. ఈకింది అంశాలను జతపరచండి.**

| | |
|---|---|
| 1. కథాపద్ధతి | 1. వాచికదోషం |
| 2. నిగమోపపత్తి పద్ధతి | 2. భాషణం |
| 3. పదాది హల్లుకు అచ్చుపల్కడం | 3. తక్కువ సమయంలో ఎక్కువ విషయాలు గ్రహించవచ్చు |
| 4. భాషాసామర్థ్యాలలో రెండోది | 4. పఠననైపుణ్యంలో ఆధునిక పోకడ |
| 5. మౌనపఠనం | 5. వ్యాకరణ బోధనా పద్ధతి |

## 5.9 ఆధారగ్రంథాలు


1. భాష – ఆధునిక దృక్పథం, ఉపాధ్యాయుల కరదీపిక, సర్వశిక్షాఅభియాన్, 2006.

2. ప్రాథమిక స్థాయి – ఉపాధ్యాయుల శిక్షణ కరదీపిక, తెలుగు, ఆం.ప్ర. రా.వి.ప. శిక్షణసంస్థ, హైదరాబాద్.

3. డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్ (దూర విద్యావిధానం) భాషావిద్య – తెలుగు, ఆం.ప్ర.రా.వి.ప. శిక్షణాసంస్థ, హైదరాబాద్.

4. తెలుగు బోధన పద్ధతులు, డి.ఎడ్. అధ్యాపనశాస్త్రం – తెలుగు అకాడమి.
5. తెలుగు బోధనా పద్ధతులు, డా॥ ఎస్.శ్రీలక్ష్మి, డా॥ జె.సాయి, కె. రామకృష్ణ.
6. తెలుగు బోధనా పద్ధతులు, డి.ఎడ్ డా॥ సాయిలీల.
7. 'బోధనా కరదీపిక' – కుందా భాస్కరరావు, ప్రచురణ : పి.వి.ఏజన్సీస్, గుంటూరు.
8. తెలుగు బోధనా పద్ధతులు, డా॥ సాయిలీల; డా॥ జి. ప్రభావతి.
9. డి.ఎడ్. తెలుగు బోధనా పద్ధతులు – తెలుగు అకాడమి – 2010.
10. "రాతలో రామణీయకత" – కుందా భాస్కరరావు 'చదువు విజ్ఞానం' పత్రిక, ప్రభుత్వ ప్రచురణ.
11. తెలుగు బోధనా పద్ధతులు, డా॥ ఎ. కొమరయ్య, డా॥ ఎన్. సరోజ.
12. బి.ఎడ్. అధ్యాపనశాస్త్రం – తెలుగు బోధనాపద్ధతులు, తెలుగు అకాడమి – 2011.
13. తెలుగు బోధన అభ్యసన శాస్త్రం, తెలుగు అకాడమి, హైదరాబాద్.

# అధ్యాయం : 6
# భాషా వనరులు :
# వాటి వినియోగం, భాషాభివృద్ధి కార్యక్రమాలు

**పరిచయం :-**

భాష మానవులకు జన్మతః లభించిన ఒక వరం. ఈ వరం పుట్టుకతో అలవడినప్పటికీ, పరిసరరాల్లోని వివిధ వనరుల ద్వారా అభ్యసన మూలకంగా అభివృద్ధి చేసుకుంటున్నదే! అభ్యసన ప్రక్రియలో భాషా వనరులకు అత్యంత ప్రాధాన్యం ఉంది. పిల్లలు మాట్లాడే తీరునే ఒక వనరుగా ఉపయోగించుకున్న ఉపాధ్యాయుడు వారి భాషణారీతులను సుసంపన్నం చేయగలుగుతాడు. తద్వారా తరగతిలో భాషాభ్యసనానికి అనుకూల వాతావరణాన్ని కల్పించవచ్చు. ప్రపంచం పట్ల అవగాహనను, సామాజిక పరిణామాల పట్ల ఆసక్తిని పెంచుతూ నిత్యజీవన గమనానికి అవసరమైన సామర్థ్యాలను, విలువలను, వైఖరులను 'భాష' అనే బలమైన శక్తి ద్వారా పెంపొందించవచ్చు. ఇందుకు అందుబాటులోని భాషా వనరులను ఎంత ఉపయోగించుకుంటే అంత మంచిది.

ఇందుకు పాఠ్యపుస్తకంలోని ఇతివృత్తాలు, పాఠ్యాంశాల ఎంపిక, అమరిక, అభ్యాసాల తీరుతెన్నులను ఆకళింపు చేసుకోవాలి. అభ్యసనాభివృద్ధి కార్యక్రమంలో ఇమిడివున్న ప్రధానాంశాలను దృష్టిలో ఉంచుకోవాలి. పిల్లల్లోని అంతర్గత శక్తులు, సృజనాత్మకత, అభిరుచులను, వైఖరులను, వెలికితీయడానికి, వారి భాషోత్పన్నత ఆధునిక డిజిటల్ సదుపాయాలను పెంచడానికి కృషిచేయాలి. ఇందుకోసం దృశ్య, శ్రవణ సామగ్రిని, వార్తాపత్రికలను, గ్రంథాలయాలను, బాలసాహిత్యాన్ని, అందుబాటులోవున్న స్థానిక కవుల; కళాకారుల, పండితుల సేవలను ఉపయోగించుకోవచ్చు. భాషాభివృద్ధికి సర్వశిక్షా అభియాన్ చేపడుతున్న వినూత్న కార్యక్రమాలయిన భాషామేళాలు, గోడపత్రికలు, దినచర్య రాయడం, బాలకవి సమ్మేళనాలు, సంచికల రూపకల్పన, పుస్తక సమీక్ష మొదలగు అనేక కార్యక్రమాలు ప్రతి పాఠశాలలో నిర్వహించాలి.

**లక్ష్యాలు :-**

ఈ అధ్యాయం చదవడం ద్వారా

1. భాషావనరులు, వాటి వినియోగం గురించి తెలుసుకుంటారు.
2. పాఠ్యపుస్తకాల నిర్మాణంలోని కీలక సూత్రాలు గ్రహిస్తారు.
3. పాఠ్యాంశాల ఇతివృత్తాలు, వాటి ఎంపిక, విషయాల అమరిక అభ్యాసాలను గురించి అవగాహన చేసుకుంటారు.
4. దృశ్య, శ్రవణ సామగ్రిని, వార్తాపత్రికలను, గ్రంథాలయాలను తరగతి గదిలో ఎలా వినియోగించుకునే అనుభవాన్ని పొందుతారు.
5. బాలసాహిత్యం, అదనపు పఠన సామగ్రిని తరగతి గదిలో ఎలా వినియోగించుకునే మెళుకువలు తెలుసుకుంటారు.
6. స్థానిక కవుల, కళాకారుల, రచయితల సేవలను పాఠశాలలో వినియోగించుకుంటారు.
7. అభ్యసనాభివృద్ధి కార్యక్రమం యొక్క ఆవశ్యకతను అవగాహన చేసుకుంటారు.
8. భాషాభివృద్ధికి అమలవుతున్న వినూత్న కార్యక్రమాలను గురించి అవగాహన చేసుకుంటారు.

## 6.1. పాఠ్యపుస్తకాలు




భాషావనరుల్లో పాఠ్య పుస్తకం ముఖ్య వనరు, బోధనా సహాయకారి అయినప్పటికీ (Text book is the only tool in the hands of a teacher) పిల్లలను అభ్యసింపచేయటానికి పాఠ్యపుస్తకం ఒక సాధనం మాత్రమే!, నిజమైన పాఠ్యపుస్తకం సృజనాత్మకత కలిగిన ఉపాధ్యాయుడే! మంచి ఉపాధ్యాయుడు కేవలం పాఠ్య పుస్తకానికే పరిమితం కాడు. పాఠ్యపుస్తకంలోని విషయాలకు అనేక జీవితానుభవాలు, నిజజీవిత సన్నివేశాలు, సమకాలీన పరిస్థితులు జోడించి చెబుతాడు. తరగతి గదిని ప్రపంచంలోనికి, ప్రపంచాన్ని తరగతి గదిలోనికి తీసుకువస్తాడు. పాఠ్యాంశంలో అనేక ప్రాపంచిక విషయాలను, స్థానిక పరిసరాలను అనుసంధానం చేస్తాడు. పావ్‌లోవ్ కుక్క మీద చేసిన శాస్త్రీయ నిబంధన సిద్ధాంతంలోని మౌలికాంశం ఇదే. దీనినే సహసంబంధ పరచడం అంటారు.

పిల్లల జ్ఞాన నిర్మాణమే ప్రధానలక్ష్యంగా విద్యావిధానం ఉండాలని ఎన్.సి.ఎఫ్. 2005 చెబుతుంది. దీని ఆధారంగానే ఆర్.టి.ఇ. 2009 చట్టం రూపుదిద్దుకుంది. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని ఎస్.సి.ఇ.ఆర్.టి. ఒక వినూత్న విధానంలో పాఠ్యపుస్తకాలను రూపొందించింది.

విజ్ఞానశాస్త్రం, సాంఘికశాస్త్రం వంటి భాషేతర సబ్జెక్టులు (Non Language Subjects) విషయ ప్రధానమైనవి కాబట్టి ప్రణాళికలో ఉన్న విషయం అధ్యాపకునికి గుర్తుంటుంది. కాబట్టి వాచకాన్ని తెరవకుండా అధ్యాపకుడు, విద్యార్థులు కూడా బోధనాభ్యసనలు కొనసాగిస్తారు. కాని భాష (Language Subject) కేవలం విషయ ప్రధానమైనదే! కాక భాషా జ్ఞానం, భాషా నైపుణ్యాలు, సాహిత్య వివేచన, ఆనందానుభూతికి చెందిన సమగ్ర స్వరూపం! కాబట్టి అధ్యాపకుడు పాఠ్యపుస్తకాన్ని తెరచి బోధనాభ్యసనాన్ని కొనసాగిస్తాడు. భాషలో ముఖ్యమైన శ్రవణ, భాషణ, పఠన, లేఖన నైపుణ్యాలను బోధించడానికి వాచకాన్ని చాలా వరకు ఎదురుగా ఉంచుకుని బోధించాల్సిన అవసరం ఉంది. భాషేతరమైన సబ్జెక్టుకుఈ అవసరం ఉండదు. ఉండకూడదు కూడా!

### 6.1. పాఠ్య పుస్తక లక్షణాలు (వాచకం లక్షణాలు) :

ఉత్తమమైన పాఠ్యపుస్తకం బాహ్యలక్షణాలు, అంతర్లక్షణాలు అనే రెండు లక్షణాలను కలిగి ఉంటుంది. బాహ్య లక్షణాలు విద్యార్థికి గ్రంథంపై ఆకర్షణ కలిగిస్తే, అంతర్లక్షణాలు బోధనా లక్ష్యాల సాధనను నెరవేర్చేవిగా ఉంటాయి.

### 6.1. బాహ్యలక్షణాలు :

పాఠ్య పుస్తకాన్ని చూడగానే చదవాలనిపించేలా ఆకర్షణీయంగా ఉండే లక్షణాలివి. భాష తెలియనివారు కూడా ఈ లక్షణాలు తేలిగ్గా గ్రహించగలుగుతారు. అందంగా ఉండి వాళ్ళకు బాగా నచ్చిన పుస్తకాలను పిల్లలు ప్రేమిస్తారు.

**అ) ముఖచిత్రం :**

పఠనాసక్తిని కలిగించడానికి రంగులలో ఆకర్షణీయంగా ముద్రించిన ముఖచిత్రం ఉండాలి. పుస్తకాన్ని చూసీ చూడగానే వారికి ముచ్చట కలిగించాలి.

**ఆ) మన్నిక గల అట్ట :**

పాఠ్యపుస్తకాన్ని మంచి అట్టతో తయారు చేయాలి. అట్ట సరైనది లేనట్లయితే పుస్తకం తొందరగా పాడవుతుంది.

పైగా పిల్లలకు పుస్తకాన్ని ఎలా చూసుకోవాలో తెలియకపోవచ్చు. అందువల్ల మంచి అట్ట ఉన్న పాఠ్యపుస్తకం మన్నిక కలిగి, చాలారోజులు పాడవకుండా వుంటుంది.

**ఇ) ముద్రణ :**

వాచకాల ముద్రణ ఆకర్షణీయంగా ఉండాలి. తరగతి స్థాయిని అనుసరించి ముద్రణ ఉండాలి. ప్రాథమిక స్థాయి పిల్లల పాఠ్య పుస్తకాలలో అక్షరాలు కొంచెం పెద్దవిగా ముద్రించబడాలి. తరువాత దశల వారీగా క్రమమైన పరిమాణంలో ఉండాలి. ముద్రణ స్పష్టంగా తప్పులు లేకుండా ఉండాలి.

**ఈ) కాగితం :**

పాఠ్య పుస్తకాల ముద్రణకు ఉపయోగించే కాగితం తెల్లగా, సముచితమైన మందంతో, మన్నిక కలిగి వుండాలి. కాగితం మంచిదైతే చిత్రాలు, అక్షరాలు చాలా చక్కగా ఉంటాయి. స్పష్టత ఉంటుంది.

**ఉ) పరిమాణం :**

పాఠ్యపుస్తక పరిమాణం మరీ పెద్దదిగానూ ఉండకూడదు, చిన్నదిగానూ ఉండకూడదు. విద్యార్థులకు సౌలభ్యంగా ఉండాలి. ప్రాథమికోన్నత స్థాయిలో పాఠ్యపుస్తకాల పరిమాణం ప్రాథమిక స్థాయి కంటే చిన్నదిగా ఉండాలి.

**ఊ) ధర (వెల) :**

పాఠ్య పుస్తకాల వెల అన్నివర్గాలవారికి అందుబాటులో ఉండేవిధంగా ఉండాలి. పాఠ్యపుస్తకాలను ముద్రించే బాధ్యత రాష్ట్రప్రభుత్వం స్వీకరించినప్పటి నుంచి పాఠ్య పుస్తకాలు చాలా తక్కువ ధరకే విద్యార్థులకు దొరుకుతున్నాయి. ఇది శుభసూచకం.

**ఎ) ఆకర్షణీయమైన ముఖచిత్రం :**

పాఠ్యపుస్తకం అట్ట ముందు వెనుక చిత్రాలతో ఆకర్షణీయంగా ఉండాలి. రంగురంగుల ముఖచిత్రం ఉంటే మరింత బాగుంటుంది. ఇవి ఉపాధ్యాయులను విద్యార్థులను ఆకర్షిస్తాయి. పిల్లలు అట్టపై ఉన్న చిత్రాన్ని చూసి మురిసిపోతారు. ఉదాహరణకు జిల్లా ప్రాథమిక విద్యాపథకంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం రూపొందించిన అందమైన పాఠ్యపుస్తకాలు మిగిలిన రాష్ట్రాలకు ఆదర్శప్రాయంగా నిలిచాయి. ప్రస్తుత 6,7,8 తరగతుల పాఠ్యపుస్తకాలు నవవసంతం 1,2 మరియు 3 వసంతకాలపు కోయిల పాటలా ఎంతో ఆసక్తిదాయకంగా ఆస్వాదించే రీతిలో వున్నాయి.

## 6.1.2. అంతర్లక్షణాలు

వాచకం లోపల ఉండే లక్షణాలు అంతర్లక్షణాలు. ఇవి మనం సాధించవలసిన బోధనా లక్ష్యాలకు చెందినవి. వీటిని రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. 1. భాషాలక్షణాలు, 2. విషయలక్షణాలు.

**(i) భాషాలక్షణాలు :**

**అ) వ్యావహారిక భాష :**

వాచకాలలోని భాష సరళంగా పిల్లలకు అర్థమయ్యేరీతిలో పిల్లలస్థాయికి తగినట్లుగా ఉండాలి. వ్యావహారిక భాషలో ఉండాలని కొందరు, గ్రాంధిక భాషలోనే ఉండాలని మరికొందరు అభిప్రాయ పడుతున్నారు. బాలగేయాలు, చిన్నచిన్న నీతి పద్యాలు, సరళగ్రాంధిక భాషలో ఉన్నా మిగిలిన పాఠాలు ఈ దశలో సరళ వ్యావహారికంలో ఉండాలి.

ఈ దశలో శ్రవణం, భాషణం, పఠనం, లేఖనం అనే నైపుణ్యాలను నేర్పడానికి సరళ వ్యావహారికమే అవసరం. మాధ్యమిక దశలో వ్యావహారిక గద్య పాఠాలతో పాటు స్థాయికి తగిన గ్రాంధిక గద్యపద పాఠాలు

కొన్ని ఉండవచ్చు. ఉన్నతదశలో వ్యావహారిక భాషలో సగం పాఠాలు, గ్రాంథిక భాషలో సగం పాఠాలు వుంచవచ్చు. ఇలా మాధ్యమికోన్నత దశలలో గ్రాంథిక భాషను ప్రవేశపెట్టడం వలన ప్రాచీన సారస్వతాన్ని చదివి అర్థం చేసుకోగల శక్తియుక్తులు అబ్బుతాయి.

**ఆ) శైలీవైవిధ్యం :**

ప్రాథమిక దశలో ఒక్కొక్క తరగతికి చెందిన వాచకం ఒక్కొక్క రచయిత మాత్రమే కూర్చినదై ఉంటే రచనాశైలి ఒకేవిధంగా ఉంటుంది. ఈ దశలో పిల్లలు ప్రాథమిక భాషా నైపుణ్యాలు నేర్చుకోవాలి. కాబట్టి రచనా విధానంలో ఒరూ విధమైన నడక ఉండడం మంచిది.

మాధ్యమికోన్నత దశలలో వివిధ రచయితలు రాసిన పాఠాలుండటం అవసరం. ఈ దశలలోని విద్యార్థులకు వివిధ రచయితల శైలి వైవిధ్యాన్ని పరిచయం చేసి స్వీయశైలి ఏర్పరచుకునేలా చేయడం కోసం ఈ మార్పు అవసరం. మాధ్యమిక దశలో శైలీ వైవిధ్యమున్న కొందరు రచయితల పాఠాలుంటే చాలు. ఉన్నత దశలో శైలీ వైవిధ్యమున్న రచనలు ఎంత ఎక్కువ ఉంటే అంత మంచిది. అన్ని రకాల శైలులకు ఉన్నతదశ వాచకాలలో స్థానం ఇవ్వడం అవసరం.

**ఇ) ప్రణాళికను అనుసరించండం :**

విద్యాప్రణాళికలో నిర్ణయించినవిధంగా పాఠ్యాంశాలుండాలి. ఆయా తరగతులలో సాధించవలసిన లక్ష్యాలను దృష్టిలో ఉంచుకొని విద్యాప్రణాళికను రూపొందిస్తారు. ప్రాచీన, ఆధునిక, సాహిత్య పరిచయాన్ని విద్యార్థులకు తప్పనిసరిగా చేయాలి. పద్య, గద్య, రచనలు, వ్యాసాలు, గేయాలు, లేఖలు, వ్యాకరణాంశాలు, పాఠ్యపుస్తకం ద్వారా బోధించాలి. ప్రాథమిక దశలో భాషా సామర్థ్యాలను అభివృద్ధి పరిస్తే మాధ్యమికోన్నత స్థాయి విద్యార్థులకు సాహిత్యప్రక్రియలపై సంపూర్ణ అవగాహన కలిగే విధంగా పాఠాలను ఎంపిక చేసుకోవాలి. తేలిక నుండి కాఠిన్యానికి పాఠాల అమరిక చేసి వాచకాల ద్వారా ఆశించిన లక్ష్యాలను సాధించాలి.

**ఈ) వివిధ ప్రక్రియలు :**

ప్రాథమిక దశలో విద్యార్థులకు నైపుణ్యాలతో బాటు శబ్ద మాధ్యుర్యంలోని ఆనందానుభూతిని కూడా అందించడానికి గద్య పాఠాలతో పాటుగా బాలగేయాలు, శబ్ధ మాధుర్యం తొణికిసలాడే పద్యాలు కూడా కొన్ని ఉండడం అవసరం, అలాగే కొన్ని పొడుపు కథలు కూడా ఉండవచ్చు.

మాధ్యమిక దశలో పద్యగద్య పాఠాలతో పాటు గేయాలు, లేఖలు, సంభాషణ పాఠాలు మొదలైన ప్రక్రియలకు కూడా స్థానం ఇవ్వాలి.

ఉన్నత దశలో పద్యగద్య పాఠాలతో పాటు ఉదాత్తమైన గేయాలు, సంభాషణ పాఠాలు, వచన కవితలు, మినీ కవితలు, కథానికలు మొదలైన అన్ని సాహిత్య ప్రక్రియలకూ స్థానం ఉండాలి. ఈ దశలోని విద్యార్థులకు అన్ని ప్రక్రియలు తెలియాలి.

**ఈ) విషయ లక్షణాలు :**

ప్రాథమిక దశ పాఠ్యపుస్తకాలలో పదాలు, వాక్యాలు పరిచయం చేసేవి, మంచి అలవాట్లు నేర్పు పాటలు, గేయాలు, భావప్రధానమైన శిశు గీతాలు, శబ్ద ప్రధానమైన అభినయ గేయాలు, చిన్నచిన్న పద్యాలు, కథలు, భాషా నైపుణ్యాలు అభివృద్ధి పరిచే పాఠాలతో ఉండాలి. మాధ్యమిక దశలో (ఎలిమెంటరీ) పాఠ్యపుస్తకాలలో రసవత్తరమైన కథలు ప్రధానంగా హాస్య, కరుణ, వీర, శాంత రసాలకు సంబంధించిన గద్య పద్య పాఠాలుండవచ్చు. మహనీయుల ఆత్మకథలు, జీవితచరిత్రలు, ధర్మరాజు, గౌతమబుద్ధునివంటి శాంతికాముకుల సందేశాలు, సమానత్వం, స్వేచ్ఛ భావనలు పెంపొందించే కవితలు, వచన గేయాలువంటి ప్రక్రియలతో నున్న పాఠాలు పొందుపరచాలి. ఉన్నత దశలోని వాచకాలు రసాత్మకు ప్రతీకలు కావాలి. నవరసాలతోనున్న పాఠాలుండాలి. సంస్కృతీ సంప్రదాయాలు

వెల్లివిరిసే పాఠాలు, మతసామరస్యం, జాతీయ సమైక్యత ప్రపంచశాంతి, విశ్వమానవ సౌభ్రాతృత్వం మొదలైన అంశాలతో విషయ ప్రాధాన్యం గల పాఠాలుండాలి. పిల్లల్లో పఠనాభిరుచిని పెంపొందించేవిగా ఉండాలి. సాహిత్య విషయాలే కాకుండా సాహిత్యేతర విషయ ప్రాధాన్యం గల పర్యావరణ పరిరక్షణ, విజ్ఞాన శాస్త్రవిషయాలు, చారిత్రక విషయాలు, కథనాత్మక శైలిలోనో, వర్ణనాత్మక శైలిలోనో రచించి పాఠాలుగా పెట్టాలి. విద్యార్థులలో భాషా ప్రయోజనాలతో పాటు, విజ్ఞాన ప్రయోజనాలు కూడా నేర్చుకోవాలనే ఉత్సాహం పెరుగుతుంది. కాబట్టి పైన పేర్కొన్న బాహ్య లక్షణాలతో పాటు, అంతర్లక్షణాలు కూడా పొందుపరచి పాఠ్యపుస్తకాలు రూపొందించాలి.

**ఉ) అధ్యయన వేదికలు :**

పాఠాల చివర అధ్యాపకుడికి, విద్యార్థులకు బోధనాభ్యసన కార్యకలాపాలు సులభం కావడానికి సహకరించే 'అధ్యయన వేదికలు' ఉండాలి. మూల్యాంకన ప్రశ్నలు, కఠిన పదాల అర్థాలు, వ్యుత్పత్త్యర్థాలు, ప్రకృతి వికృతులు, నానార్థాలు, పర్యాయపదాలు, సంధులు, సమాసాలు, అలంకారాలు, ఛందస్సు మొదలైన విశేషలన్నీ ఇవ్వాలి. పాఠాలలో కొత్త ప్రక్రియలు కూర్చినపుడు వాటికి బోధనా విధానాలు కూడా రాయాలి. అవసరాన్ని బట్టి పరిశీలన గ్రంథాలు (Reference Books) సూచించాలి.

**ఊ) పాఠాల పూర్వరంగం :**

పాఠాల ప్రారంభంలో విద్యార్థులకు తెలియటానికి, ఆ పాఠాలు రాసిన కవులు, రచయితల వివరాలు, పాఠాల సందర్భం ఉండాలి. ఇందువలన నేర్చుకొనబోయే పాఠం పూర్వరంగం కూడా తెలుస్తుంది.

**ఋ) ముందుమాటలు :**

వాచకాలు కూర్చిన రచయితల ముందుమాటలు కూడా మొదటి పేజీలలో ఉండటం అవసరం. ప్రణాళికను గురించి, బోధనా పద్ధతులను గురించి, ఇంకా ఇలాంటి బోధనాభ్యసన విషయాలను గురించి ఉపాధ్యాయులకు ఇందులో సూచనలియ్యవచ్చు.

**ౠ) విరామ చిహ్నాలు :**

వాచకాలలో విరామచిహ్నాలుండాలి. రెండు, మూడు తరగతుల వాచకాలలో వాక్యాంత బిందువులు (ఫుల్‌స్టాప్) ఉండాలి. 4, 5 తరగతుల వాచకాలలో వీటికితోడు కామాలు, ప్రశ్నార్థక గుర్తులు, ఆశ్చర్యార్థకాలు, సందర్భ చిహ్నాలు మొదలైనవి వినియోగించబడాలి.

**ఎ) పేరాలు :**

ప్రాథమిక దశ నుండి పేరాలు పరిమాణం క్రమంగా పెరుగుతూ ఉండాలి. 2, 3 తరగతులలో ఒకటి రెండు వాక్యాలున్న పేరాలుంటే నాల్గవ తరగతిలో మూడు నాలుగు వాక్యాలున్న పేరాలుండవచ్చు. 5వ తరగతి నుండి పాఠాల నిడివితో పాటు ఈ పేరాలలోని వాక్యాల సంఖ్య కూడా క్రమంగా పెరుగుతూ ఉండవచ్చు.

**ఏ) సంధి రూపాలు :**

ప్రాథమిక దశలోని వాచకాలలో పదస్వరూపం బాగా తెలియడానికి వీలుగా విసంధి (సంధి చేయని రూపం)నే పాటించడం మంచిది. ఆరవతరగతి నుండి సంధి పాఠించవచ్చు. ఒకేసారి ఒకే పాఠంలో అన్ని సంధులు పరిచయం చేయరాదు. ఉదాహరణకు 6వ తరగతిలో ఉకారసంధి, సవర్ణదీర్ఘసంధి, గుణసంధి బోధించాలని ప్రణాళికలో ఉంటే మొదటి ఒకటి, రెండు పాఠాల్లో ఉకారసంధితో పాటు సువర్ణ దీర్గసంధితో బాటు గుణసంధి జరిగే రూపాలు కూడా ఉండవచ్చు. ఇలా క్రమంగా ఆయా వాచకాలలో ప్రణాళికను అనుసరించి సంధిరూపాలు పరిచయం చేయాలి.

**(ii) విషయ లక్షణాలు :**

**అ) ప్రాథమిక విద్య :**

ప్రాథమిక దశ వాచకాలలోని విషయం పిల్లలకు ఆసక్తికరమైన ఉండాలి. 1వ తరగతిలో ఉన్న పదాలు, వాక్యాలు పిల్లలకు పరిచయమైనవై ఉండాలి. పిల్లలకు నచ్చేటట్లు అమ్మను గురించి, ఇల్లును గురించి, రకరకాల పక్షులను గురించి, పెంపుడు జంతువులను గురించి, మాటలు, వాక్యాలు ఉంటే బాగుంటుంది. మంచి అలవాట్లు నేర్పే పాటలు, చిన్న చిన్న పద్యాలు ఉండవచ్చు. పిల్లలలో ఆలోచనను పెంపొందింపజేసే భావ ప్రధానమైన అభినయ గేయాలు కూడా ఉండాలి. అంకెలు, వారాలు, రంగులు, వింత ధ్వనులు ఉండవచ్చు. 2వ తరగతి నుండి వాచకాలలో సత్ప్రవర్తన పెంపొందించే పద్యాలుండాలి. నీతిని బోధించే కథలుండాలి.

**ఆ) మాధ్యమిక దశ :**

మాధ్యమికదశలోని వాచకాలలో రసవత్తరమైన కథలను ప్రవేశపెట్టవచ్చు. హాస్య, కరుణ, వీర, శాంత రసాలకు సంబంధించిన గద్య పద్య పాఠాలుండవచ్చు. మహనీయుల ఆత్మకథలు, జీవిత చరిత్రలు, ప్రసిద్ధి చెందిన చారిత్రక ప్రదేశాల వర్ణనలు, పౌరాణిక గ్రథాలలోని బాలవీరుల సాహసకార్యాలు, ధర్మరాజు, గౌతమ బుద్ధుడు వంటి శాంతికాముకుల సందేశాలుండవచ్చు. పేద–గొప్ప కులమతాల తారతమ్యం లేకుండా మానవులందరినీ ఆదరించే వైఖరి పెంపొందించడానికి తోడ్పడే అభ్యుదయ కవుల కవితలుండాలి. మానవత్వాన్ని, హృదయ స్పందనను పెంపొందించే భావుకత నిండిన వచన గేయాలు, మినీ కవితలు మొదలైన ప్రక్రియలుండవచ్చు. ఒక్కొక్క పాఠం నాలుగైదు పీరియడ్లలో బోధించడానికి అనువుగా చిన్నదిగా ఉంటే ఎక్కువ పాఠాలను విషయ వైవిధ్యంతో కూర్చవచ్చు.

**ఉన్నత దశ :**

ఉన్నత దశలోని వాచకాలలో అన్ని రసాలకు సంబంధించిన రచనలుండవచ్చు. అద్భుత, హాస్య, కరుణ, వీర, రౌద్ర, అద్భుత, శాంత రసాలకు చెందిన పద్యభాగాలు, గద్యభాగాలు ప్రాచీన రచయితలతో పాటు ఆధునిక రచయితలవి కూడా స్వీకరించాలి. మనదేశ సంస్కృతి, సాంప్రదాయాలను తెలియజేసే శివాజీ, శిబి చక్రవర్తి, పురుషోత్తముడు మొదలైన పాఠలుండాలి. మతసామరస్యం, జాతీయ సమైక్యతా దృష్టి, ప్రపంచశాంతి, విశ్వమానవ సోదర భావాలకు సంబంధించిన భావాలున్న సాహిత్య ప్రక్రియలతో బాటు అలాంటి భావాలున్న వ్యాసాలు కూడా వాచకాలలో ఉండవచ్చు. ఆలోచనా శక్తిని, హేతువాదాన్ని పెంపొందింపజేసే సిద్ధాంత వ్యాసాలు కూడా క్రమంగా చోటు చేసుకోవచ్చు.

**(iii) సాహిత్యేతర విషయాలు :**

కేవలం సాహిత్య విషయాలే కాక, ఇతర సబ్జెక్టులకు చెందిన విషయాలున్న పాఠాలు కూడా కొన్ని ఉండడం అవసరమని విద్యావేత్తల అభిప్రాయం. ప్లాస్టిక్కులు, నదులు, అడవులు, పర్యావరణం మొదలైన విజ్ఞానాత్మక విషయాలను మన తెలుగు వాచకాల్లో అందుకే చేరుస్తున్నారు. ఇలాంటి పాఠాలు కూడా విజ్ఞాన శాస్త్ర విషయాలను సాంకేతిక శైలిలో కూర్చి పెడుతున్నట్లు రాసినవి కాకుండా కథనాత్మక శైలిలోనో, సంభాషణా శైలిలోనో, వర్ణనాత్మక శైలిలోనో రచించినపుడు విజ్ఞాన ప్రయోజనాలతో బాటు భాషా ప్రయోజనాలు కూడా నెరవేరి విజ్ఞానాత్మక విషయాలు నేర్చుకోవాలనే ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తాయి. జ్ఞానం పెంపొందించుకోవడం చాలా ముఖ్యమని ఎంచి ఉన్నత దశలో విజ్ఞాన పాఠాలు ఎక్కువ ఉండవచ్చునని భావించడం సరికాదు. విజ్ఞానాత్మక విషయాలు నేర్పడానికి విజ్ఞానాత్మక సబ్జెక్టులు వేరే ఉన్నాయని మరచిపోకూడదు. విద్యాబోధన ఉద్దేశాలు ప్రతి సబ్జెక్టులోను పరిమితంగానే ఉంటాయి. మాతృభాష వాచకాలలో విజ్ఞానాత్మక విషయాలకంటే హృదయవికాసం పెంపొందించే విషయాలుండడం ముఖ్యం. ఒక్కమాటలో చెప్పాలంటే ఉన్నతదశలోని వాచకాలు మాతృభాషా ప్రయోజనాలు సాధించే విషయాలన్నింటినీ కలిగి ఉండడం అత్యవసరం.

### 6.1.2. పాఠ్య పుస్తకాల నిర్మాణంలోని కీలక సూత్రాలు :

విద్యాప్రణాళిక ననుసరించి రాష్ట్రప్రభుత్వం పాఠ్యపుస్తకాలు రూపొందిస్తుంది. దీనికై ప్రతిభావంతులైన అధ్యాపకులు సంకలన కర్తలు సంపాదక మండలి కలిసి పాఠ్యపుస్తకాల మౌలిక నిర్మాణ సూత్రాల ఆధారంగా పాఠ్యపుస్తకాలు రూపొందిస్తారు. రాష్ట్ర విద్యాప్రణాళిక పరిధి పత్రం 2011, భాష ఆధారపత్రం సిఫారసుల మేరకురాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ వారి ఆధ్వర్యంలో పాఠ్యపుస్తకాలు సిద్ధం చేస్తారు. పాఠ్యపుస్తకాల రచనలో కింది అంశాలను దృష్టిలో ఉంచుకోవాలి.

- జాతీయ విద్యా విధానంలో (1986) సూచించిన పది మౌలిక అంశాలకు అనుగుణంగా ఉండాలి.
- విషయ ప్రణాళికలో సాధించాల్సిన బోధనా లక్ష్యాలు, ఉద్దేశాలు దృష్టియందుంచుకోవాలి. సాధించేదిగా ఉండాలి.
- భారతీయతను పెంపొందించే అంశాలతో ఉండాలి.
- సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే పాఠాలు ఉండాలి.
- వైవిధ్యం కలిగిన రచనా శైలులతో ఉండాలి.
- తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియలను పరిచయం చేసేటట్లు ఉండాలి.
- విద్యార్థుల స్థాయి మానసిక స్థితిని బట్టి పాఠ్యగ్రంథాల నిర్మాణం జరగాలి.
- నైతిక విలువలను పెంపొందించేవిధంగా ఉండాలి.
- ఆధునిక ప్రామాణిక భాషతో పాటు ప్రాచీన, మధ్యకాల భాషారూపాల పరిచయం చేయాలి.
- సమకాలీన అంశాలతో పాటు సామాజిక స్పృహను కలిగించాలి.
- భాషా నైపుణ్యాలను పెంపొందించేవి రూపొందించాలి.
- వ్యాకరణాంశాలు, ఛందస్సు, అలంకారాల విద్యార్థుల స్థాయిని బట్టి పరిచయం చేయాలి.
- తమశక్తి సామర్థ్యాల ఆధారంగా పిల్లలు నేర్చుకోవడానికి అవకాశం కలిగించాలి.
- తాము పొందిన జ్ఞానాన్ని పిల్లలు దైనందిన జీవితంలో ఉపయోగించగలిగే విధంగా రూపొందించబడాలి.
- పిల్లలు అర్థవంతమైన రీతిలో పర్సపర ప్రతిచర్యలు, కృత్యాలు, అన్వేషణల ద్వారా నేర్చుకునే విధంగా వుండాలి.
- ఆలోచనలకు, వ్యక్తీకరణలకు ప్రాధాన్యం ఉండేలా, సృజనాత్మకత, కాల్పనికత తావిచ్చేవిగా ఉండాలి.
- పాఠ్యపుస్తకం విద్యాప్రమాణాల సాధనకు దోహదపడేలా ఉండాలి.
- పాఠ్యపుస్తకంలోని పాఠ్యాంశాలు విద్యార్థికి ఆసక్తిని కలిగించే విధంగా ఉండడమే కాకుండా భాషా వినిమయానికి అధిక ప్రాధాన్యం ఇచ్చేలా ఉండాలి.

విద్యార్థులలో జ్ఞాననిర్మాణమే ప్రధానలక్ష్యంగా విద్యావిధానం ఉండడం అవసరమని NCF 2005 మనకు చెప్తున్నది. దీని ఆధారంగానే ఆర్.టి.ఇ. 2009 చట్టం రూపుదిద్దుకుంది. వీటిని దృష్టిలో పెట్టుకుని ఉన్నత ప్రమాణాలు గల విద్యను విద్యార్థులకు అందించి తద్వారా విద్యార్థులలో జ్ఞాననిర్మాణం చేయడమే రాష్ట్ర దృక్పథం. దీని కొరకై రాష్ట్ర విద్యా పరిశోధనా శిక్షణాసంస్థ పిల్లలలో ఉండే సహజ శక్తి సామర్థ్యాలు వెలుగులోకి తీసుకువచ్చేలా వాళ్ళ ఆలోచనలు స్పష్టంగా వ్యక్తమయ్యేవిధంగా నూతన తెలుగు వాచకాలను రూపొందించింది. ఈ పాఠ్యపుస్తకాలు APSCF 2011 మార్గదర్శకాలను అనుసరించి రూపొందించడం జరిగింది. సంస్కృతీ సాంప్రదాయాలు, వారసత్వ ప్రశంస, సామాజిక మార్పుకు దోహదపడే విధంగా, బాధ్యతాయుతమైన పౌరులుగా తయారవడానికి అనుగుణంగా కొన్ని కీలకసూత్రాల ఆధారంగా పాఠ్యపుస్తకాల రూపకల్పన జరగాలి. వాటిని ఇప్పుడు చూద్దాం...

**అ) తమకున్న శక్తి సామర్థ్యాల ఆధారంగా పిల్లలు నేర్చుకోడానికి అవకాశం :**

ఇందుకోసం తెలుగు పాఠ్యపుస్తకాలలో పిల్లలు తమ అనుభవాలను చెప్పేలా, తమ భాషను వినియోగించు కునేలా ఉన్ముఖీకరణ చిత్రం ఉండాలి. తమ ఆసక్తులను ప్రదర్శించేలా అభ్యాసాలు ఉండాలి. ఇందుకోసం ముఖ్యంగా సృజనాత్మక అభ్యాసాలు తోడ్పడతాయి. పిల్లలందరూ మాట్లాడడం, పాడగల్గడం, అభినయం చేయగలగడం, ప్రశ్నించడం, చర్చించడం, చిత్రాలు గీయడం వంటి సామర్థ్యాలను కొంతమేరకు కలిగి ఉంటారు. వీటిని కొనసాగించేలా అభ్యాసాలు ఉండాలి.

**ఆ) తాము పొందిన జ్ఞానాన్ని పిల్లలు దైనందిన జీవితంలో ఉపయోగించడం :**

పిల్లలు మాట్లాడం, చదవడం, రాయడం వంటి పనులను లేదా చేయగలిగిన సామర్థ్యాలను సందర్భోచితంగా అవసరం మేరకు వినియోగించగలగాలి. అంటే తమకు అవసరమైన లేఖలు రాయడం, పుస్తకాలు చదివి అర్థం చేసుకోవడం, ప్రశ్నించడం, సమాచారాన్ని తెలుసుకోవడం, తెలిసినవాటిని రాసుకోవడం వంటివి చేయగలగాలి. ఇందుకు అనుగుణంగా అభ్యాసాలు ఉండాలి. ఇందులో ముఖ్యంగా పదజాలం, భాషకు గురించి తెలుసుకుందాం, ప్రశంస మొదలైన అభ్యాసాలు తోడ్పడతాయి.

**ఇ) పిల్లలు పాఠ్యపుస్తకానికే పరిమితం కాకుండా సమాజం ద్వారా, పరిసరాల ద్వారా, పఠన సామాగ్రి ద్వారా నేర్చుకోవడం :**

సామెతలు, సూక్తులు, వార్తా సేకరణలు చేయడం, శతక పద్యాలు / గీతాలు / గేయాలు, కథలను, ప్రసిద్ధుల చరిత్రలు సేకరించడం, బాలసాహిత్యం చదవడం, తెలిసిన కవుల గురించి సమాచారాన్ని, రచనల గురించి చదవడం, ప్రశంసాత్మక కృత్యాలు పూర్తి చేయడం, ప్రాజెక్టు పనులు చేయడం వంటివి చేయాలి. వీటన్నింటికీ అవకాశాలు కల్పిస్తూ అనేక అభ్యాసాలు పుస్తకాలలో ఉండాలి.

**ఈ) బట్టీ విధానలకు బదులు అర్థవంతమైన రీతిలో ప్రతిచర్యలు, కృత్యాలు, అన్వేషణల ద్వారా పిల్లలు నేర్చుకోవడం:**

నేర్చుకోవడమంటే పాఠ్యపుస్తకంలోని విషయాలను మక్కికి మక్కిగా జ్ఞాపకం ఉంచుకోవడం మాత్రమే కాదు. తాను విన్న, చదివిన అనేక అంశాలను విద్యార్థి సొంతంగా విశ్లేషించగలగాలి. ఏ విషయం చదివినా, అందులోని అర్థాన్ని, అంతరార్థాన్ని చక్కటి శైలిలో వ్యక్తీకరించగలగాలి. పాఠ్యపుస్తకాలలో పిల్లలను ఆలోచింపజేసే రీతిలో బహుళ సమాధానాలు వచ్చేలా ప్రశ్నలు, అభ్యాసాలు ఉండాలి. అందువల్ల పాఠ్య పుస్తకాలు బట్టీ విధానానికి పూర్తి వ్యతిరేకం. అయితే పిల్లల్లో సాహిత్య వికాసానికి మాత్రం పద్యాలు, గేయాలు అర్థవంతమైన అవగాహనతో కంఠస్తం చేయలి.

ఆలోచించే రీతిలో పాఠ్య పుస్తకాలలో వ్యక్తిగత, జట్టు, పూర్తి తరగతి కృత్యాలు వివిధ సామర్థ్యాల ఆధారంగా ఉన్నాయి. ఆలోచించి రాయడం, చదవడం, అవగాహన చేసుకోవడం, సృజనాత్మక వ్యక్తీకరణ, పఠన కృత్యాలు, అర్థ సంగ్రహణం, పదజాల కృత్యాలు అనే సామర్థ్యాలు పిల్లలు నేర్చుకునే విధంగానే ఉండాలి.

**ఉ) స్వీయ భాషను, తమ స్థానిక కళలు, సంస్కృతీ సంప్రదాయాలు, ఉత్పత్తుల ఆధారంగా ప్రశ్నలు నేర్చుకోవడం:**

పాఠ్యపుస్తకంలో వివిధ భాషా రూపాలు ఉంటాయి. అయితే ప్రతి అభ్యాసంలో పిల్లలు సొంతంగా వారి మాటల్లో రాయడానికి, చెప్పడానికి వీలుగా అభ్యాసాలు ఉండాలి. వివిధ పండుగలు, సామెతలు, సూక్తులు, వివిధ సాహిత్య రూపాలు, సంస్కృతీ సంప్రదాయాలు వంటివి పిల్లలే తెలుసుకునేలా పాఠ్యాంశాలు, అభ్యాసాలు ఉండాలి. స్థానిక కళలకు సంబంధించిన అంశాలు ఉండాలి. సంస్కృతీ సంప్రదాయాలకు సంబంధించిన అంశాలు ఉండాలి.

**ఊ) ఆలోచనలకు, వ్యక్తీకరణలకు ప్రాధాన్యం :**

పాఠ్యపుస్తకాలు విద్యార్థుల ఆలోచనలను పెంపొందించేందుకు వీలుగా, వారివారి ఆలోచనలను స్పష్టంగా

వ్యక్తీకరించటానికి వీలుగా ఉండాలి. ఉమ్మడీకరణ చిత్రాలు, పాఠ్యాంశ చిత్రాలు పిల్లలను ఆలోచింపజేసి స్వేచ్ఛగా భావ వ్యక్తీకరణకు తోడ్పడేలా ఉండాలి. వీటిలో పిల్లలు కథను ఊహించడం, పాత్రల మధ్య సంభాషణలను ఊహించడం, పాత్రల స్వభావాలను చెప్పడం వంటివి చేయాలి. అభ్యాసాలతో వినడం, ఆలోచించి సొంతమాటల్లో చెప్పడానికి సంబంధించిన ప్రశ్నలు, స్వీయరచన ప్రశ్నలు, సృజనాత్మకత, ప్రశంసకు చెందిన అభ్యాసాలు ఆలోచింప జేసేవిగా, స్వేచ్ఛగా వ్యక్తీకరించేందుకు అవకాశమిచ్చేవిగా ఉండాలి.

**ఋ) సృజనాత్మకత, కాల్పనికత, భాషాభిరుచి పెంపొందించడం :**

పిల్లల్లో సృజనాత్మకత, కాల్పనికత, భాషాభిరుచి పెంపొందించడానికి పాఠాలు ఉండాలి. గేయాలను పొడిగించడం, కథలను ఊహించడం, బొమ్మలు తయారు చేయడం, మాస్కులు తయారు చేయడం, సంభాషణలు రాయడం, నాటకీకరణ చేయడం వంటి సృజనాత్మక అభ్యాసాలు పాఠ్యపుస్తకంలో పొందుపరచాలి. భాషాభివృద్ధిని పెంపొందింప చేయడానికిగాను వివిధ వ్యవహారరూపాలలో పాఠాలను పొందుపరచాలి. ప్రాజెక్టు పనులు భాషాభిరుచికి తోడ్పడేవిధంగా ఉండాలి.

**ౠ) భాషా వినియోగానికి అధిక ప్రాధాన్యం :**

భావ వ్యక్తీకరణకు, భావ గ్రహణమునకు భాష సాధనమయినా, భాషా వినియోగం అనేది వివిధ రూపాలలో ఉంటుందనే విషయం మనం గ్రహించాలి. పిల్లలు తాము ఇంటివద్ద నేర్చుకున్న భాషను, జ్ఞానాన్ని ఆధారంగా చేసుకుని వాళ్ళను ఆలోచింపజేయడానికి, అభిప్రాయాలను వ్యక్తీకరణ చేయడానికి, సృజనాత్మకతతో వ్యక్తీకరింప జేయడానికి, వివిధ వ్యవహార రూపాలను వినియోగించడానికి పాఠ్యపుస్తకాలు మార్గదర్శకాలు కావాలి. భాషలో ఉండే పదజాలం, నిత్యవ్యవహారం లోని భాషా నిర్మాణ సంబంధ అంశాలు అంటే వ్యాకరణం ఎలా ఉంటుందో, ఎలా వినియోగించాలో తెలుసుకోవడానికి భూమికగా పాఠ్యపుస్తకాలను రూపొందించాలి. ఇవి చేయండి శీర్షికలోని వినడం – మాట్లాడడం, స్వీచరచన, సృజనాత్మకత, పదజాలం, భాషాంశాలు అనేవి భాషా వినియోగ సంబంధాన్ని సూచించేవిగా ఉండాలి. కీలక పదాలు, కీలక వాక్యాలు, నిత్యజీవితంలో భాషా వినియోగానికి ఉపయోగపడాలి.

**ఎ) మొత్తం పాఠ్యపుస్తకం విద్యాప్రమాణాలు సాధనకు దోహదపడడం :**

మనం చేసే ప్రతి పనికి ఒక ప్రయోజనం ఆశిస్తాం. అలానే మనం పాఠ్య పుస్తకాన్ని బోధించడం కూడా ఓ ప్రయోజనాన్ని ఆశించాలి. అదే విద్యాప్రమాణాల సాధన. పాఠ్యపుస్తకాలు ఏడు రకాల విద్యాప్రమాణాల సాధనకు తయారు కావాలి.

**అ) వినడం – మాట్లాడడం :**

విద్యార్థి అవగాహనతో వినగలగాలి, విన్న విషయాన్ని అవగాహనతో అర్థం చేసుకుని స్పష్టంగా చెప్పగలగాలి.

**ఆ) చదవడం – రాయడం :**

ఇచ్చిన విషయాన్ని అవగాహనతో చదువుతూ, అర్థం చేసుకుని అడిగిన విషయాన్ని గురించి స్పష్టంగా రాయగలగాలి.

**ఇ) స్వీయరచన :**

అడిగిన విషయం గురించి తన సొంత ఆలోచనలతో తన అభిప్రాయాలను, విమర్శల వశ్లేషణలను ఆధారంగా చేసుకుని జవాబులు రాయగలగాలి.

**iv) పదజాలం :**

భాషా వినియోగానికి ఉపయోగపడే జాతీయాలు, సామెతలు, అర్థాలు, పర్యాయపదాలు, నానార్థాలు, ప్రకృతి వికృతులు, వ్యుత్పత్యర్థాలు మొదలైనవాటిని సాధించడానికి అవసరమైన అభ్యాసాలు ఉండాలి.

**v) సృజనాత్మకత :**

తెలుగు భాషా వ్యవహార రూపాలను పిల్లలు వాళ్ళ శక్తి సామర్థ్యాల మేరకు సృష్టించగలగాలి. ఒక కథ, గేయం, కరప్రతం, లేఖ, సంభాషణ మొదలైన ప్రక్రియలను సృష్టించేందుకు అనువుగా అభ్యాసాలు ఉండాలి.

**vi) ప్రశంస :**

విద్యార్థులలో ద్వేషభావాన్ని రూపుమాపి, ఉత్తమ పౌరులుగా రూపొందించడానికి 'ప్రశంస' అనే సామర్థ్యం ఉండాలి.

**vii) వ్యాకరణాంశాలు :**

భాషా నిర్మాణానికి సంబంధించిన వ్యాకరణాంశాలు, భాషాభాగాలు, వాక్యభేదాలు, వాక్యనిర్మాణలు, సంధులు, సమాసాలు, అలంకారాలు, ఛందుస్సు మొదలైన అంశాలు ఉండాలి. వీటికి పాఠ్యపుస్తకాలు ఉపయోగ పడాలి.

ఇవే కాకుండా సామర్థ్యాల సమాహారంగా ప్రాజెక్టు పనిని కల్పించే విధంగా పాఠ్యపుస్తకాలుండాలి.

**ఏ) పరస్పర ప్రతిచర్యలకు కేంద్రంగా ఉండడం :**

పాఠ్యపుస్తకంలోని అర్థ సంగ్రహణం, వినడం – మాట్లాడడం, స్వీయరచన, ప్రాజెక్టు పనులు, పరస్పర ప్రతిచర్యలకు కేంద్రంగా ఉండాలి. ఉదాహరణకు అర్థసంగ్రహణంలో తన మిత్రలతోను, ఉపాధ్యాయునితోను చర్చిస్తారు. వినడం – మాట్లాడడంలో మిత్రులతో జట్లుగా చర్చించే అవకాశం ఉంది. స్వీయరచనలో కూడా జట్లుగా ఏర్పడి సమాధానాలను కూర్చాల్సి ఉంటుంది. ప్రాజెక్టు పనులలో కొన్ని సామూహిక కృత్యాలుగా వుండాలి.

**ఐ) తోటివారి ద్వారా, అదనపు సామాగ్రి ద్వారా, సమాజ సభ్యుల ద్వారా నేర్చుకోవడానికి దోహదపడడం :**

తోటి విద్యార్థులతో చర్చించిగాని, పాఠ్యపుస్తకేతర సామాగ్రి సంపాదించడం ద్వారా సమాజంలో ప్రముఖులను కలవడం వల్ల, వివిధ సంస్థలతో సంపర్కం ఏర్పడడం వల్ల, విద్యార్థులు అదనపు జ్ఞానం పొందే అవకాశం ఉంటుంది. అందుకు అనుగుణమైన అభ్యాసాలుండాలి. పిల్లలు తోటి విద్యార్థులతో నేర్చుకునేలా పఠన కృత్యాలు, జట్టు కృత్యాలు, ప్రాజెక్టు పనులను పాఠ్యపుస్తకంలో పొందుపరచాలి. ప్రాజెక్టు పనులలో సమాజ సభ్యులను కలవడం, విషయాలను సేకరించడం, అదనపు సామాగ్రిని సేకరించుకోవడం అనేవి నేర్చుకోవడానికి దోహదపడతాయి.

**ఒ) ఉన్నత వైఖరులు, మానవత్వపు విలువలు, సంబంధాలు పెంపొందించడానికి ఉద్దేశించినవిగా ఉండడం :**

పిల్లలలో ఉన్నత వైఖరులు, మానవత్వపు విలువలు, మానవ సంబంధాలు పెంపొందించేలా పాఠాలను ఎంపిక చేయాలి. ఉన్నత వైఖరులను పెంపొందింపజేయడానికి ప్రత్యేకంగా 'ప్రశంస' పేరుతో అభ్యాసాలను చేర్చాలి.

**ఓ) సోపానక్రమంలో బోధించడానికి వీలుగా పాఠాల అమరిక ఉండడం :**

ఒకపాఠం బోధించడమంటే పాఠంలోని విషయాన్ని వివరించడమే కాక 'ఉన్ముఖీకరణ' నుండి 'నేనివి చేయగలనా?' వరకు చెప్పడం – చేయించడం జరగాలి. అందుకు అనుగుణంగా పాఠాన్ని అమర్చాలి. అదెలా వుందో చూద్దాం....

**ఎ) ఉన్ముఖీకరణ :**

'ఆలోచించండి – చెప్పండి' శీర్షికతో చిత్రాలు, ఆలోచింపజేసే ప్రశ్నలు ఉండాలి. ఇది పూర్వభావనల నిర్మాణానికి (Pre text) సంబంధించినది.

**బి) ఇవి చేయండి (అర్థ సంగ్రహణం) :**

ఈ అంశం పిల్లలు పాఠ్యాంశాన్ని చదివి భావాన్ని గ్రహించడం, ఊహించడం, చర్చించడం తద్వారా

జ్ఞాన నిర్మాణానికి విక్షణ పొందడానికి ఉద్దేశించినది. ప్రతి పాఠం ప్రారంభపేజీలో సూచనలు ఉండాలి. ఇది జ్ఞానాత్మక శిక్షణకు ఉద్దేశించబడినది.

**సి) విషయావగాహన – చర్చ :**

పాఠ్యాంశం వివిధ వ్యవహారరూపాల్లో ఉంటుంది.

**డి) పిల్లల అవగాహన – పరిశీలన :**

పిల్లలను ఆలోచింపజేయడం, బహుళ ప్రతిస్పందనలను రాబట్టడానికి, చర్చలు జరగటానికి ఉద్దేశించినది. 'ఇవి చేయండి' శీర్షికతో సామర్థ్యాల సాధనకై అభ్యాసాలు పిల్లల జ్ఞాన నిర్మాణానికి ఉద్దేశించిన ప్రశ్నలు, కృత్యాలు, ప్రాజెక్టులు ఉండాలి. వీటిలో పాల్గొనడం వలన విద్యార్థికి భాగస్వామ్య అభ్యసనం జరుగుతుది.

**5) స్వీయ మూల్యాంకనం :**

'నేనవి చేయగలనా?' అనేది స్వీయ మూల్యాంకనానికి ఉద్దేశించినది. పిల్లల అభ్యసనం నిర్ధారణకు రావటానికి ఇది తోడ్పడుతుంది.

**ఔ) బహుముఖ విశ్లేషణ, విమర్శన సామర్థ్యాన్ని పెంపొందించేలా చేయడం :**

విద్యార్థులు ఒక విషయం గురించి, సమస్యను గురించి, అనేక కోణాల్లో ఆలోచించడం, వాటిని విశ్లేషణ చేసుకోవడం లేదా విమర్శన చేయగలగడం లేదా సమీక్ష చేయగలగడం లాంటి సామర్థ్యాలు పెంపొందించడానికి అనువుగా అభ్యాసాలుండాలి.

**అం) సమకాలీన సామాజిక అంశాలపట్ల ఆసక్తి కలిగించడం :**

పిల్లలు తమ పరిసరాలను, సమాజాన్ని, కాలాన్ని పరిశీలిస్తూంటారు. ఆ పరిశీలనతో వారి జ్ఞానాన్ని పెంచుకుంటారు. అలా పెంచుకోవడలో పాఠ్యపుస్తకం కూడా ప్రముఖ పాత్ర పోషించేవిధంగా పాఠ్యపుస్తకాలుండాలి. వారికి సమకాలీన, సామాజిక అంశాలపట్ల ఆసక్తిని రేకెత్తించే విధంగా పాఠాలు, అభ్యాసాలు ఉండాలి. పాఠాలలోని విషయాలను సమకాలీన అంశాలకు, పరిస్థితులకు అన్వయించగలగాలి, ఆలోచించగలగాలి, సమాజాన్ని అర్థం చేసుకోగలగాలి, తద్వారా జ్ఞానాన్ని వృద్ధి పరచుకోవాలి.

**అః) విద్యార్థుల స్వీయ మూల్యాంకనానికి, స్వయం అధ్యయనానికి అవకాశం కల్పించడం :**

- దీనికొరకు ప్రతిపాఠంలో 'నేనివి చేయగలనా?' అనే శీర్షిక ఉండాలి.
- పాఠ్యపుస్తకం తాత్వికతను తెలిపేలా 'ముందుమాట' ఉండాలి
- పాఠ్యపుస్తక వినియోగం ఎలా ఉండాలనే విషయం గురించి 'ఉపాధ్యాయులకు సూచనలు' ఉండాలి.
- పాఠ్యపుస్తకం ఉపయోగం గురించి తెలుసుకోవడానికి 'విద్యార్థులకు సూచనలు' ఉండాలి.
- పాఠ్యపుస్తకం పూర్తయ్యే సరికి పిల్లలు ఏ సామర్థ్యాలను సాధించారో తెలుసుకోవడానికి ఈ పాఠ్యపుస్తకం ద్వారా 'విద్యార్థులు సాధించాల్సిన సామర్థ్యాలు అనే శీర్షికన సామర్థ్యాల జాబితా ఇవ్వడం జరగాలి. అందుకు అనుగుణంగా సామర్థ్యాల వారీగా పాఠాల్లో అభ్యాసాలు 'ఇవి చేయండి' శీర్షికన ఇవ్వడం జరగాలి.
- 'పదాలు – అర్థాలు' శీర్షికన పాఠ్యపుస్తకం చివర ఇవ్వాలి. ఇది నిఘంటువు చూసే అలవాటు పెంపొందించడానికి, స్వయం అధ్యయనానికి అలవాటు పడేలా చేయడానికి దోహదపడుతుది.

## 6.1.3. పాఠాల ఇతివృత్తాలు

రాష్ట్ర విద్యాప్రణాళికా చట్రం 2011 మరియు భాష బోధన ఆధారపత్రం ఆధారంగా, పిల్లల భాషాభివృద్ధితో పాటు సమాజ అవసరాలకు అనుగుణంగా ఇతివృత్తాలను ఎంపిక చేయాలి. పాఠ్యపుస్తకంలోని పాఠాలు ఆధునిక ప్రామాణిక భాషరూపంలో ఉండాలి. పాఠాలలోని విషయాలు ఆనందింప చేసేవిధంగా, ఆలోచింపచేసేవిగా వుండాలి. మాధ్యమిక దశలోని పాఠ్యపుస్తకాలలో ఇతివృత్తాలు తరగతి స్థాయిని బట్టి ఈ విధంగా ఉండాలి.

దేశభక్తి, జాతీయ సమైక్యత, సంస్కృతీ సంప్రదాయాలు, కుటుంబ విలువలు, నైతిక విలువలు, వృద్ధుల పట్ల సానుకూల వైఖరి, సర్వమానవ సమానత్వం, పర్యావరణ పరిరక్షణ, ప్రపంచశాంతి, జీవవైవిధ్యం, కళాదృష్టి, శ్రమసౌందర్యం, సామాజిక చైతన్యం, సాహిత్యాభిరుచి, వ్యక్తిత్వ విలువలు, క్రీడాస్ఫూర్తి, దర్శనీయ స్థలాలు, వర్ణన ప్రధానమైనవి వంటి ఇతివృత్తాలు గల పాఠాలు పొందుపరచాలి. ఇవి కథ, కథానిక గేయం, పద్యం, వ్యాసం, మున్నగు ప్రక్రియల రూపంలో ఉండాలి. భాషాభిరుచి పెంపొందించేవిధంగా ఉండాలి.

## 6.1.4. పాఠ్యాంశాల ఎంపిక :

రాష్ట్ర విద్యా ప్రణాళికా చట్రం 2011 మరియు భాషా ఆధారపత్రం మార్గదర్శకాలను అనుసరించి పాఠ్యాంశాల ఎంపిక జరగాలి.

- ఎంపికచేసిన పాఠ్యాంశాలు పిల్లల జ్ఞానాత్మక, సామాజిక సాంస్కృతిక నేపథ్యాలకు అనుగుణంగా వుండాలి.
- తరగతి వారీగా ఆశిస్తున్న విద్యావిషయ ప్రమాణాలను, అభ్యసన ఫలితాలను భాషా సామర్థ్యాలను సాధించడానికి అనువుగా పాఠ్యాంశాలుండాలి.
- ఎలిమెంటరీ స్థాయిలోని పాఠాలను ప్రాచీన, ఆధునిక సాహిత్యం నుండి ఎంపిక చేయాలి.
- ఈ పాఠాలు రాజ్యాంగంలో పొందుపరచిన కీలక భావనలకు భిన్నం కాకూడదు. ఇవి మన లౌకిక భావనను రాజ్యాంగ విలువలను గౌరవించేవిధంగా ఉండాలి.
- 'పియాజె' సంజ్ఞాత్మక వికాస సిద్ధాంతం ప్రకారం ఏ వయస్సు పిల్లలు ఎలాంటి జ్ఞానాన్ని ఆర్జించగలరో అందుకు తగినట్లు పాఠ్యాంశాల ఎంపిక ఉండాలి.
- పాఠాలు అన్నిప్రాంతాలు వర్గాలు అన్ని భాషాప్రక్రియలకు చెందినవై ఉండాలి. ఇవి పిల్లల్లో ఆసక్తిని, వుత్సుకతను,ఆలోచనలను పెంపొందించి భాషాభివృద్ధికి తోడ్పడతాయి.
- పిల్లలకు విసుగు కల్పించకుండా, మూసపద్ధతిలో లేని ఆలోచనలు రేకెత్తించే ప్రశ్నలతో కూడిన పాఠ్యాంశాలు ఉండాలి.
- ప్రతి పాఠానికి ముందు ఉన్ముఖీకరణ చిత్రం ప్రశ్నలు, నేపథ్యం, కవి పరిచయం, విద్యార్థులకు సూచనలు, పాఠ్యాంశానికి తగినట్లుగా రెండు, మూడు చిత్రాలు ఉండాలి.
- పాఠాలను కొన్ని అధ్యాయాలుగా విభజించి ప్రతి అధ్యాయంలో గద్యం, పద్యం, ఉపవాచక పాఠాలు పొందుపరచాలి.
- ప్రతి పాఠం చివర విద్యార్థి స్వీయ మూల్యాంకనం చేసుకునే విధంగా కొన్ని ప్రశ్నలు ఇవ్వాలి.
- పాఠంలోని కఠిన పదాలకు అర్థాలు పాఠం చివర కాకుండా అన్ని పాఠాలకు కలిపి పాఠ్యపుసతకం చివర నిఘంటువు పొందుపరచాలి.

రాష్ట్ర విద్యాప్రణాళికా చట్రం 2011 ఆధారంగా ఆధునిక సమాజ అవసరాలకు అనుగుణంగా పాఠ్యాంశాల ఎంపికలో కొన్ని ప్రత్యేకతలు పాటించాలి. నిరంతర సమగ్ర మూల్యాంకనాన్ని దృష్టిలో ఉంచుకొని పాఠాల విభజన జరిగింది. ప్రస్తుత పాఠ్యాంశాలుగా పద్య, గద్య, ఉపవాచక పాఠాలు కలిపి నాలుగు యూనిట్లుగా విభజించారు. పనిదినాలను, పాఠ్యాంశాల నడివిని స్థాయిని దృష్టిలో ఉంచుకుని యూనిట్లను విభజించడం జరిగింది.

మాధ్యమిక స్థాయి విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని 18 పాఠాలను ఎంపిక చేయడం జరిగింది. ఈ పాఠాలలో పద్యభాగం 7, గద్యభాగం 7, ఉపవాచకం 4 పాఠాలున్నాయి. ఈ పాఠాలు ఆధునిక ప్రాచీన రచనల సమ్మిళితాలు. పాఠశాల పనిదినాలను, ఉపాధ్యాయుల సేవాకాలన్ని, విద్యార్థుల స్థాయిని దృష్టిలో ఉంచుకుని పాఠాల సంఖ్యను నిర్ధారించడం జరుగుతుంది.

పాఠ్యపుస్తకం మారుతున్న సామాజిక అవసరాలకు, కొత్తగా చోటు చేసుకున్న ఆధునిక భావాలకు తగినట్లుగా ఉండాలి. పాఠ్యపుస్తకంలోని పాఠాలు పిల్లల అవగాహనాస్థాయి తగినట్లు ఉండాలి. 'పియాజె' సంజ్ఞానాత్మక వికాస సిద్ధాంతం ప్రకారం ఏ వయస్సు పిల్లలు ఎలాంటి జ్ఞానాన్ని అర్జించగలరో అందుకు తగినట్లు పాఠ్యపుస్తకాలు ఉండాలి. ఆలోచింపజేయడం, వ్యక్తీకరించడం, సృజనాత్మక విలువలు, వైఖరులు పెంపొందింపచేయడానికి, విమర్శనాత్మకంగా హేతుబద్ధ చింతనతో విచక్షణా జ్ఞానంతో వ్యవహరించడానికి పాఠ్యాంశాలు దోహదపడతాయి.

పాఠాలను వివిధ ప్రక్రియల్లో ఎంపిక చేయాలి. కథ, గేయకథ, కథానిక, గేయం, సంభాషణ, ఆత్మకథ, వ్యాసం, లేఖ, పద్యం, శతకం మొదలైన ప్రక్రియలలో పాఠాలుండాలి.

ఉపాధ్యాయులు తరగతిగదిలో సోపానక్రమం ప్రకారం పాఠ్యబోధన చేయడానికి వీలుగా పాఠాలను అమర్చాలి. ప్రతిపాఠాన్ని ప్రారంభించేందుకు ముందు పిల్లలకు పాఠం పట్ల ఆసక్తిని పెంపొందించటానికి చర్చ, ప్రశ్నించడం, ఆలోచింపజేయడం కోసం పద్యాలు, కవితలు, గేయాలు, కార్టూన్లు, చిత్రాలు, ప్రశ్నలు, సంఘటనలు, చిన్నకథలు మొదలైనవి చేర్చాలి. అదేవిధంగా ప్రక్రియ, కవి పరిచయం, విశేషాంశాలు ప్రత్యేకంగా పొందుపరచాలి. ఉపాధ్యాయులు పాఠ్యాంశాలలోని విషయాన్ని ఉన్నదున్నట్లుగా వివరించడం కన్న, ఆ విషయంలోని అంతరార్థాన్ని, విశేషాంశాలను, విలువలను, కవి హృదయాన్ని అర్థం చేసుకోవడానికి వీలుగా తరగతిగదిలో చర్చలు జరపాలి. జట్టు కృత్యాలు వంటి భాగస్వామ్య పద్ధతులద్వారా బోధనాభ్యసన ప్రక్రియను నిర్వహించాలి. పాఠాలలోని విషయాలలో అక్కడక్కడ ప్రత్యేకమైన పదప్రయోగాలు, జాతీయాలు, సందేశాత్మక వాక్యాలు, ఆలోచింపజేసే సంఘటనలు పిల్లల్లో సాహిత్యంపట్ల ప్రాథమిక అవగాహన పెంపొందటానికి దోహదపడాలి. పాఠాలతో సంబంధమున్న గ్రంథాలను కూడా పిల్లలకు పరిచయం చేయాలి. నిరంతరం మార్పు చెందుతున్న సమాజంలో మారుతున్న విలువల ఆధారంగా సజీవమైన వాడుకభాషలో పాఠ్యపుస్తకాల ద్వారా తెలుగు తీయదనాన్ని పిల్లలకు పంచిపెట్టాలి. కమ్మని తెలుగు పలుకుబడిలో వారు మాట్లాడేటట్లు చెయ్యాలి. ప్రగతిశీల భావాలకు మన పాఠ్యపుస్తకం అద్దం పట్టాలి.

## 6.1.5. విషయ అమరిక

రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేసిన భాష – బోధన ఆధారపత్రం (2011) లోని అంశాలకు అనుగుణంగా భాష విషయ అమరికలో కింది అంశాలు దృష్టిలో ఉంచుకోవాలి.

విషయ ప్రణాళికలో భాగంగా సిద్ధంచేసిన పాఠ్యపుస్తకాలు సమాచారంతో బరువెక్కకుండా పిల్లలే సమాచారాన్ని సేకరించేలా ఆ సమాచారాన్ని విశ్లేషించేలా, నిర్ధారణకు వచ్చేలా అవకాశం కల్పించాలి. పాఠ్యపుస్తకాలు జ్ఞానాన్ని నిర్మించుకోవడానికి తోడ్పడాలి. అందుకు విషయ ప్రణాళికలో ప్రాజెక్టులు, అన్వేషణలు, ప్రయోగాలు, భాషా క్రీడలు, గళ్ల నుడికట్టు వంటివి ఉండాలి. నైతిక విలువలు పెంపొందించేటట్లు, పెంపొందించేవిధంగా విషయ

అమరిక ఉండాలి. ప్రాథమిక దశలోని విషయ ప్రణాళికలో గేయాలు, కథలు, నీతి పద్యాలు, చిత్రకథనాలు వుండాలి. మాధ్యమిక స్థాయిలో ఆధునిక ప్రామాణిక భాషలో దేశభక్తి – సమైక్యత, సామాజిక స్పృహ, పర్యావరణం, జీవవైవిధ్యంనకు సంబంధించిన అంశాలు వివిధ ప్రక్రియలతో ఉండాలి. విద్యార్థుల విస్తార పఠనానికి వీలుగా ఉ పవాచకాంశాలు ఉండాలి. పాఠ్యవిషయ ప్రణాళికల్లో విస్తారమైన అభ్యాస వేదికలను పొందుపరచాలని భాష–బోధన ఆధారపత్రం నొక్కి వక్కాణించింది.

## 6.1.6. అభ్యాసాలు :

పిల్లలకు పాఠాన్ని బోధించడమంటే కేవలం పాఠం సారాంశాన్ని అందించటం మాత్రమే కాదు. నిర్దేశించిన ప్రతి సామర్థ్యంపై విద్యార్థికి అవగాహన, అధికారం కలిగేటట్లు చేయాలి. ఇందుకు తరగతివారీగా నిర్దేశించిన సామర్థ్యాల సాధనకు పలు కృత్యాల్లో పాల్గొనడానికి వీలుగా అభ్యాసాలుండాలి.

- అభ్యాసాలు స్వీయ అభ్యసనాన్ని ప్రోత్సహించేవిధంగా ఉండాలి.
- పాఠ్యపుస్తకంలోని అభ్యాసాలు పిల్లల తరగతి కృత్యాలు, జట్టుకృత్యాలు, వ్యక్తిగత కృత్యాలు నిర్వహించడానికి వీలుగా రూపొందించాలి.
- అభ్యాసాలు, పరిశీలనకు, పరిశోధనకు, అన్వేషణకు తోడ్పడాలి.
- అభ్యాసాలు ఆలోచనలు రేకెత్తించేవిగా ఉండాలి. యాంత్రికమైన సమాధానాలు ఆశించే కృత్యాలుగా అభ్యాసాలు ఉండకూడదు. ఒకేరకమైన సమాధానాలు వచ్చేలా ఉండకూడదు.
- పిల్లల అదనపు పఠన సామాగ్రిని ఉపయోగించుకోవడానికి వీలుగా పాఠ్యపుస్తకాలలో అభ్యాసాలుండాలి.
- పాఠ్య సందర్భానికి అనుగుణంగా పిల్లల పదాలను, అర్థాలను గ్రహించాలి. ఈ అంశంకు సంబంధించి పదజాలాన్ని అభ్యాసాల్లో చేర్చాలి.
- పిల్లల స్థాయికి అనుగుణంగా, తరగతివారీగా, సందర్భానుగుణమైన వ్యాకరణాంశాలపై అభ్యాసాలుండాలి. ఇవి పిల్లలు స్వయంగా వ్యాకరణనియమాలను ఏర్పరచుకోవడానికి తోడ్పడాలి.

అభ్యాసాలలో క్రింది రూపాలను చేర్చవచ్చు.

పద్యపురాణం, కథాపురాణం, కథలకు ముగింపు చెప్పడపం, సంభాషణలు రాయడం, ఏకపాత్రాభినయం, సమీక్షలు, వర్ణనలు, వివరణలు, అనువాదాలు, ప్రాజక్టు పనులు, పొడుపుకథలు, సాంస్కృతిక గేయాలు, సామెతలు, జాతీయాలు మొదలైనవి.

ఒక పాఠానికి కేటాయించిన మొత్తం కాలాంశంలో పాఠంలోని విషయాన్ని బోధించడానికి గరిష్టంగా నాలుగు కాలాంశాలను ఉపయోగించాలి. మిగిలిన కాలాంశాలను అభ్యాసాల సాధనకై వెచ్చించాలి. పాఠ్యబోధన ఒక ఎత్తైతే, పిల్లలతో అభ్యాసాలు చేయించడం ఒక ఎత్తు. పాఠ్యపుస్తకాలలో ఈ అభ్యాసాలను 'ఇవి చేయండి' అనే శీర్షికతో సూచించడం జరిగింది. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ పెట్టి వీటిని నిర్వహించాలి. అభ్యాసాలపై అవగాహన కల్పించి సొంతంగా చేసేలా అభ్యాసం కల్పించాలి. ఒక్కో అభ్యాసానికి ఒక్కో పిరియడ్ కేటాయించుకోవాలి. పాఠ్యపుస్తకాలలోని వివిధ అభ్యాసాలను, నిర్వహణ విధానాన్ని చూద్దాం...

**(1) వినడం – ఆలోచించడం, ప్రతిస్పందించడం :**

ఈ సామర్థ్యం కోసం ఇచ్చే స్వభావం

- ఉన్ముఖీకరణ చిత్రాలు ఆలోచింపజేసి మాట్లాడింపజేసేలా ఉండాలి.
- పిల్లల ఊహలకు, ఆలోచనలకు, సృజనాత్మకతకు పదును పెట్టే ప్రశ్నలుండాలి.

- సొంత అభిప్రాయాలు ప్రకటించే అవకాశం కల్పించాలి.
- పరిశీలనకు, విశ్లేషణకు తావు కల్పించేలా ఉండాలి.

**నిర్వహణ :-**

- పిల్లలందరితో మాట్లాడించాలి.
- మధ్యమధ్యలో అనుబంధ ప్రశ్నలు వేయాలి.
- కొందరు పిల్లలు నిశ్శబ్దంగా ఉండిపోతారు. వారినే ఎక్కువగా ప్రశ్నించాలి.
- పిల్లలను గుండ్రంగా కూర్చోబెట్టి, ఉపాధ్యాయుడు కూడా వారిలో ఒకడుగా మెలగాలి.
- పిల్లల అభిప్రాయాలతో లోపాలున్నా వెంటనే ఖండించకూడదు.
- విద్యార్థులను జట్లుగా విభజించి పని కల్పించాలి. వాళ్ళు చర్చించుకుని ఇచ్చిన అంశాన్ని గురించి ప్రతి ఒక్కరూ అవగాహనతో మాట్లాడేలా చేయాలి.
- తరగతి గది పిల్లలు ఏ అడ్డంకులూ లేకండా అన్ని విషయాలు మాట్లాడుకునేలా ఉండాలి.

**(2) చదవడం – రాయడం :**

ఈ సామర్థ్యం కోసం ఇచ్చే అభ్యాసాల స్వభావం :

- చదివి అర్థం చేసుకున్న విషయాన్ని వాగ్రూపంగా, లిఖితరూపంగా వ్యక్తీకరించగలిగే ప్రశ్నలుండాలి.
- చదివిన అంశంపై స్పందించగలిగేలా ఉండాలి.
- చదివిన విషయాన్ని విశ్లేషించగలిగే విధమైన ప్రశ్నలుండాలి.
- ఈ అభ్యాసంలో ప్రదానంగా మూడు రకాల ప్రశ్నలు అడగడం ఉంటుంది.

(ఎ) మొదటి రకం : పాఠ్యాంశం చదివి జవాబులు రాసే విధంగా ఉండేవి.

ఉదా : పద్యంలో ప్రసా పదాలను గుర్తించండి.

(బి) రెండవరకం : విద్యార్థులు పాఠ్యాంశంపై అవగాహన స్థూలంగా కలిగిందా లేదా అనేవిషయం తెలుసుకోవడానికి ఉండే ప్రశ్నలు.

ఉదా : క్రింది వాక్యాలు ఎవరు ఎవరి అనుమతితో అన్నారో తెలపండి.

(సి) మూడవరకం : విద్యార్థులకు పాఠ్యాంశాలపై పూర్తి అవగాహన కలిగిందో లేదో తెలుసుకోడానికి ఉండే ప్రశ్నలు. ఇవి పూర్తిగా విషయావగాహనకు సంబంధించి ఉంటాయి.

ఉదా : ఇంద్రియజ్ఞానానికి పరిమితం కాకపోవడం వల్ల ఏం జరిగింది?

**నిర్వహణ :**

- అభ్యాసాలు సాధించడానికి ముందు పాఠం పట్ల పిల్లలకు పూర్తి అవగాహన కలిగేటట్లు చేయాలి.
- పిల్లలు వ్యక్తిగతంగా చదివి, జట్లుగా చర్చించుకునే అవకాశాలు కల్పించాలి.
- జట్టుపని జట్టులోని పిల్లలందరూ వ్యక్తిగతంగా కూడా పూర్తి చేసేటట్లు ఉండాలి.
- పిల్లల జవాబులు ఒకేవిధంగా కాక వైవిధ్యంగా / భిన్న శైలులతో ఉండేటట్లు చూడాలి.
- ప్రకాశపఠనం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి.
- చదవడంలో కొందరు పిల్లలు తడబడుతుంటారు. దీనిని నివారించడానికి తగు అభ్యాసాలను కల్పించాలి.
- చదవడం మెరుగుపడాలంటే చదివించాలి. వాళ్ళు మళ్ళీ మళ్ళీ చదివేలా చేయాలి.
- అక్షరాలు గుర్తుపట్టలేని పిల్లలకు అక్షరాలు గుర్తుపట్టేలా, గుణింతాలను నేర్పేటప్పుడు స్పష్టంగా చదివేలా అక్షరాలు, గుణింతాలు, ఒత్తులపై అభ్యాసాలు కల్పించాలి.

**(ఇ) స్వీయరచన :**

ఈ సామర్థ్యం ఇచ్చే అభ్యాసాల స్వభావం.

- పాఠ్యభాగం రచయిత ఉద్దేశ్యం రాయగలగాలి.
- కవి హృదయాన్ని అర్థం చేసుకున్న విధానం రాయగలగాలి.
- పాఠానికి, శీర్షికకు ఉన్న సంబంధం రాయగలగాలి.
- పాఠం భావం లేదా సారాంశం సొంతమాటల్లో చెప్పగలగాలి, రాయగలగాలి.
- పాఠంలోని పాత్రల స్థానంలో తానుంటే ఏం చేస్తాడో చెప్పగలగాలి.
- పాఠంలోని పాత్రలను సొంతమాటల్లో పరిచయం చేయగలగాలి.
- పాఠంలోని ముఖ్యభావాన్ని చెప్పగలగాలి.

**నిర్వహణ :**

- పిల్లలను స్వేచ్ఛగా మాట్లాడించాలి. మాట్లాడిన అంశాలు కొన్నింటిని నల్లబల్లపై రాయాలి. ఆ అంశాల ఆధారంగా సొంతంగా ఒక కథని గాని, వ్యాసం గాని రాయించాలి.
- ఉత్తమంగా ఉన్న రచనను ప్రదర్శింపజేయాలి.
- మంచి పదాలు, భావక్రమాన్ని, వాక్య నిర్మాణాన్ని గుర్తించేటట్లు విద్యార్థులలో అవగాహన కల్పించాలి.
- భాషాదోషాలను ప్రత్యేకంగా ప్రస్తావించాలి.
- పాఠం ఆధారంగా విభిన్నమైన ఆలోచనలను, ఊహలను, విశ్లేషణలను, పరిష్కారాలను సొంతంగా రాయగలగాలి. విద్యార్థులు ఈ దశనుంచే స్వయంగా రచనా నైపుణ్యాలను అలవరచుకోవాలి.

**(4) పదజాలం :**

**అభ్యాసాల స్వభావం :**

- పాఠంలోని ప్రకృతి వికృతి పదాలను గుర్తించడం
- పాఠంలోని జాతీయాలను గుర్తించడం
- అపరిచిత పదాలకు అర్థాలను నిఘంటువు ద్వారా తెలుసుకోవడం.
- స్వయం అధ్యయనం ద్వారా పదాలకు అర్థాలను గ్రహించడం.
- జంట పదాలను వెతికి రాయడం.
- ప్రాస పదాలను వెతికి రాయడం.
- సమానార్థక పదాలను తెలుసుకోవడం.
- నానార్థాలను రాయడం.
- వ్యతిరేకార్థక పదాలను రాయడం.
- శబ్దపల్లవాలను గుర్తించడం.
- ఇతర భాషాపదాలను గుర్తించడం.
- జతపరచడం.

**నిర్వహణ :**

- పాఠాన్ని బోధిస్తున్నప్పుడు ఎప్పటికప్పుడు అభ్యాసాలను మౌఖికంగా ఉపాధ్యాయుడు చెబుతూ ఉండాలి.
- కొన్ని అభ్యాసాలను జట్టు పనులుగా కూడా ఇవ్వవచ్చు.
  ఉదా : ప్రాస పదాలు, అంత్యాక్షరి మొ॥
- పాఠానికి సంబంధించి వచ్చే పదజాలంపై ఏరోజుకారోజు అభ్యాసాలను మౌఖికంగాగాని, లేఖనంగాగాని పిల్లలకు ఇవ్వవచ్చు.

**(5) సృజనాత్మకత :**

**అభ్యాసాల స్వభావం :**

- తమంత తాముగా పిల్లలు కథలు అల్లడం, కథను పొడిగించడం.
- ఇచ్చిన ఇతివృత్తం లేదా పదాల ఆధారంగా కథలు అల్లడం.
- గేయాలు కూర్చడం, పొడిగించడం.
- స్వీయ అనుభవాలను సృజనాత్మకంగా వ్యక్తపరచడం.
- తెలిసిన, చూసిన, విన్న, చదివిన అంశాన్ని వర్ణించి చెప్పడం.
- పాత్రపోషణ, ఏకపాత్రాభినయం చేయడం.
- లేఖలు, ప్రతిలేఖలు వ్రాయడం.
- ప్రకటనలు, నోటీసులు, పోస్టర్లు, ఆహ్వానపత్రికలు, కరపత్రాలు, శుభాకాంక్షలు తెలిపే కార్డులు తయారు చేయడం.
- ప్రాసపదాలు, తెలిసిన పదాలను ఉపయోగించి చిన్న చిన్న గేయాలు, కవితలు రాయడం.
- సంభాషణలు చెప్పడం, రాయడం, నాటకీకరణ చేయడం.
- తనగురించి తాను (ఆత్మకథలు) రాయడం.
- పాఠాల్లో వచ్చే పాత్రలు తానే అని భావించుకుని ఆత్మకథ మాదిరిగా రాయడం.
- దరఖాస్తులు, నివేదికలు, నినాదాలు రాయడం.
- సూచిత అంశానికి అనుగుణంగా భావాత్మక చిత్రాలు గీయడం.
- ఆ సందర్భంలో, సన్నివేశంలో విద్యార్థులుంటే ఏం చేసేవారో చెప్పమనడం.

**నిర్వహణ :**

- ఆయా పాఠ్యాంశాలలో ఉన్న సృజనాత్మక కృత్యాలను పాఠ్యాంశ బోధన ప్రారంభానికి ముందే గుర్తించాలి.
- చేయించవలసిన కృత్యానికి, పాఠ్యాంశంతో గల సంబంధాన్ని అవగాహన చేసుకోవాలి.
- పాఠ్యాంశం ప్రారంభమయ్యాక సందర్భానుసారంగా ఆయా కృత్యాలను విద్యార్థులకివ్వాలి.
- కృత్యాన్ని బట్టి వ్యక్తిగతంగా, జట్లుగా ఇయ్యాలి.
- వనరులను సూచించి, కృత్య నిర్వహణకు తగిన సూచనలియ్యాలి.
- జట్టు కృత్యాలను ప్రదర్శింపజేసి, వాటిని ఆ జట్టులోని వారందరూ రాసుకునేటట్లు చూడాలి.
- పూర్తి చేసిన కృత్యాలు ప్రదర్శించేందుకు అవకాశం కల్పించాలి.
- బాగా కృషిచేసిన విద్యార్థులను ప్రశంసించాలి.
- సృజనాత్మకత అనేది పిల్లల ఆలోచనకు, ఊహకు సంబంధించినది. కాబట్టి ఫలితాలు వైవిధ్యంగా రావచ్చు. పిల్లలు చేసిన కృత్యాలు తప్పు, ఒప్పు అనడానికి అవకాశం లేదు. భాషాపరంగా పిల్లల్లో ఏదో ఒక అంశం పట్ల ఆసక్తిని రేకెత్తించి ఆ అంశంపై పట్టు సాధించేటట్లు చేయడమే సృజనాత్మకత ముఖ్య ఉద్దేశం అని గ్రహించుకోవాలి. ఆయా ప్రత్యేక అంశాలపై పిల్లలందరికీ ఆసక్తి కల్పించాల్సి ఉంటుంది.

**(6) ప్రశంస :**

**అభ్యాసాల స్వభావం :**

- ఇతర భాషలలోని దేశభక్తి గేయాలను పాడడం.
- మంచి లక్షణాలను గల వాళ్ళను గురించి చెప్పమనడం, అభినందించడం.
- లలితకళలలో ప్రవేశం ఉన్న వాళ్ళను గుర్తించి, అభినందించడం.

- ప్రాంతీయ / స్థానిక కళాకారులను గురించి తెలుసుకుని, వారి గొప్పదనాన్ని వివరించడం.
- పాఠంలో నచ్చిన అంశాన్ని వివరించమని, ఎందుకు నచ్చిందో వివరింపమనడం.
- ఇతర భాషలలోని గొప్పదనాన్ని, ఇతర భాషాకవుల గొప్పదనాన్ని చెప్పడం.
- ఆడపిల్లల్లోని మంచి లక్షణాలను గురించి జాబితా రాయించడం.
- పిల్లలకు తల్లిదండ్రులు చెప్పే మంచి బుద్ధులను చెప్పమనడం.
- ప్లిలలకు ఉపాధ్యాయుడు చెప్పే మంచి బుద్ధులను చెప్పించడం.

**నిర్వహణ :**

- తరగతిలోని పిల్లలను పేరుతో గౌరవంగా, ఆదరంగా సంబోధించాలి.
- అందరినీ సమానత్వ భావనతో చూడాలి.
- వివిధ కవులను, వారి రచనలను ప్రశంసింపజేయాలి.
- ప్రత్యేక అవసరాలు గల పిల్లలను అర్థం చేసుకుని వారికి సహాయ సహకారాలు అందించాలి.
- పిల్లలు వివిధ భాషలు, మతాలు, వర్గాల వారితో కలిసిమెలిసి మెలిగేలా చూడాలి.
- పిల్లలంతా ఒకరిపట్ల మరొకరు ప్రేమాభిమానాలు కలిగి ఉండేలా చూడాలి.

**(7) ప్రాజెక్టు పనులు :**

**స్వభావం :**

- దేశనాయకుల చిత్రాలను, దేశభక్తి గేయాలను సేకరించడం, ప్రదర్శించడం.
- వృద్ధులతో మాట్లాడడం, వారి గురించి సమాచారాన్ని సేకరించడం.
- సామెతలు, జాతీయాల సేకరణ, ప్రదర్శన.
- కథలు, చిత్రాల సేకరణ, ఆల్బం చేయడం.
- ప్రముఖుల లేఖల సేకరణ.
- సూచించిన అంశాన్ని తెలిపే కథలు, చిత్రాల సేకరణ.
- పత్రికల నుంచి సూచించిన సమాచారం, వార్తలు గల చిత్రాల సేకరణ
- స్ఫూర్తిప్రదాతల బొమ్మలు, వివరాల సేకరణ.
- కవుల గురించిన వివరాల సేకరణ.
- కరపత్రాలు, పోస్టర్ల సేకరణ.
- ప్రసిద్ధ పద్యాల సేకరణ.
- శతక పద్యాల సేకరణ.

**నిర్వహణ :**

- ఉపాధ్యాయులకు ప్రాజెక్టులపై స్పష్టమైన అవగాహన ఉండాలి.
- ప్రాజెక్టులకు సంబంధించిన సరైన సూచనలను ఇవ్వాలి.
- తగిన వనరులను సూచించాలి.
- ప్రణాళికలను, సోపాన క్రమాన్ని వివరించాలి.
- విద్యార్థులంతా పాల్గొనేటట్లు చూడాలి.
- పాఠ్యాంశం ప్రారంభం నుంచే ప్రాజెక్టుపని ఇవ్వవచ్చు.
- పాఠ్యాంశం, అభ్యాసాలు పూర్తయ్యాక చివరి పీరియడ్‌లో ప్రాజెక్టులు ప్రదర్శింపజేయాలి.
- ప్రాజెక్టు నివేదికను తయారు చేయించి విశ్లేషణాంశాలను చర్చించాలి.

- ఉపాధ్యాయుడు మార్గదర్శకుడుగా వ్యవహరిస్తూ విద్యార్థులకు తగిన సహకారాన్ని అందించడం ద్వారా ప్రాజెక్టు పనులు ఫలప్రదమౌతాయి.

**(8) భాషాంశాలు :**

**స్వభావం :**

- "భాషను గురించి తెలుసుకుందాం" అనే శీర్షికతో ఈ అభ్యాసాలు ఉంటాయి.
- సంధులను గుర్తించడం, పదాలను అర్థవంతంగా విడదీయడం.
- విగ్రహ వాక్యాలను రాయడం, ఏ సమాసమో తెలపడం.
- అలంకారా పరిచయం.
- ఛందస్సు పరిచయం.

**నిర్వహణ :**

- పిల్లలకు వ్యాకరణం పరిసరాల వల్ల, నిరంతర సంభాషణల వల్ల సాధ్యమౌతుంది. అందువల్ల పిల్లలకు వ్యాకరణం తెలియదనే అపోహను ఉపాధ్యాయులు విడనాడాలి.
- శైలి, పదాలు, పదాల్లో మార్పులు, అలంకారాలు, ఛందస్సు మొదలైన అంశాలపై పిల్లలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

**(9) నేనివి చేయగలనా?**

**స్వభావం :**

- పాఠం గురించి మాట్లాడగలగడం.
- పాఠం పద్య / గేయ రూపంలో ఉంటే రాగయుక్తంగా చదవగలగడం, భావాలను సొంతమాటల్లో చెప్పగలగడం.
- కవి / రచయిత ఉద్దేశాన్ని, సారాంశాన్ని సొంతమాటల్లో చెప్పగలగడం.

**నిర్వహణ :**

- ఈ శీర్షికను విద్యార్థులతో విధిగా చేయించడానికి ఒక పీరియడ్‌ను కేటాయించాలి.
- సాధించాల్సిన సామర్థ్యాలలో విద్యార్థి ఎంతవరకు కృతకృత్యుడయ్యాడో తెలుసుకునేందుకు ఉపాధ్యాయుడికిది తోడ్పడుతుంది. 80 శాతం మంది విద్యార్థులు దీనిలో సఫలీకృతులైతే ఉపాధ్యాయుడు మరో పాఠ్యాంశంలోకి వెళ్ళవలసి ఉంటుంది.
- ఎక్కువమంది పిల్లలు ఈ సామర్థ్యాలను సాధించలేకపోయినట్లయితే ఉపాధ్యాయులు ఆయా అంశాలు బోధించడానికి అనుగుణంగా ఈ పీరియడ్‌ను ఉపయోగించుకోవాలి.
- ఈ అంశాన్ని ఖచ్చితంగా సాధన చేయిస్తేనే ఈ కృషి, ఈ నూతన ప్రయోగం సఫలమవుతుంది. ఆచరణ శూన్యమైన ఆలోచనలు ఎన్నటికీ సత్ఫలితాలనివ్వవు కదా!

## 6.2. దృశ్య శ్రవణ సామగ్రి

జ్ఞాన సముపార్జన పంచేంద్రియాల ద్వారా జరగుతుది. వీటిలో కన్ను, చెవి అతిముఖ్యమైనవి. అందువల్ల దృశ్య శ్రవణ పరికరాలను ఉపయోగించి చెప్పిన అంశం పిల్లల మనసులో చెరగని ముద్ర వేస్తుంది. వారి ఆలోచన, అవగాహన, పరిశీలన మొదలైనవి వృద్ధి చేయడానికి దృశ్య శ్రవణ ఉపకరణాలు ఉపయోగించి బోధించాలి. ఉపాధ్యాయులు వాడే బోధనా సామగ్రిని ప్రధానంగా దృశ్య ఉపకరణాలు, శ్రవణ ఉపకరణాలు, దృశ్య శ్రవణ ఉ

పకరణాలుగా వర్గీకరిస్తారు. వీటి ద్వారా ఉపాధ్యాయుడు బోధనాంశాన్ని పిల్లల హృదయాలకు హత్తుకునేటట్లు విశదీకరిస్తాడు. విద్యార్థులకున్న సందేహాలు కూడా బోధనాభ్యసన ఉపకరణాల ద్వారా తీరుతాయి. విద్యార్థులకు పలు అంశాలను నేర్చుకోవడం పట్ల ఆసక్తి పెరుగుతుంది. పాఠ్యాంశానికి సంబంధించిన అదనపు సమాచారం పిల్లలకు అందుతుంది.

**6.2.1. దృశ్య సామగ్రి :**

చూపడం ద్వారా బోధనాంశం పిల్లల మనస్సులలో హత్తుకునేటట్లు చేసేవి దృశ్యసామగ్రి. సాధారణంగా విన్న విషయం కన్న చూసిన విషయం మనస్సులో స్థిరంగా ఉంటుంది. అందువల్ల దృశ్య ఉపకరణాలకు బోధనలో చాలా ప్రాధాన్యత ఉంది.

**పాఠశాలలో ఉపయోగించే ప్రధానమైన దృశ్యసామగ్రి :**

నల్లబల్ల, ఫ్లానల్‌బోర్డు, బులెటిన్ బోర్డు, అయస్కాంతపు బల్ల (Magnetic Board), మెరుపు అట్టలు, చార్టులు, ప్రకటన పత్రాలు, గోడపత్రికలు, ఛాయాచిత్రాలు, పటాలు, కార్టూన్లు, తోలుబొమ్మలు, కాగితపు తొడుగులు, పత్రికలు, కంప్యూటర్లు మొదలైనవి దృశ్యసామగ్రిగా బోధనకు ఉపయోగిస్తారు.

చిత్రాలు విద్యార్థులకు విషయం అర్థమయ్యేలా చేస్తాయి. వివిధ చిత్రాలు తరగతి గదిలో వ్రేలాడదీయడం వలన తరగతిలో చూసిన అంశం పిల్లలకు ఎక్కువకాలం జ్ఞాపకముంటుంది. ప్లాస్టిక్, మట్టి, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారుచేసిన బొమ్మలు, థర్మాకోల్‌తో చేసిన నమూనాలు, ఫొటోలు, ఆయా సన్నివేశాలను, పాఠ్యాంశభావాన్ని విద్యార్థులు గుర్తించుకునేలా చేస్తాయి. పాఠంలోని ముఖ్య విషయాలు, విశేషాంశాలు చార్టులో రాసి విద్యార్థులచేత చదివిస్తే విద్యార్థులకు పాఠానికి సంబంధించిన సమగ్ర సమాచారం లభిస్తుంది. వ్యాకరణాంశాల బోధనకు కూడా ఇది ఉపయోగిస్తుంది. కొన్ని కొన్ని సందర్భాల్లో క్లిష్టమైన పాఠ్యాంశాన్ని తోలుబొమ్మలు మొదలైన వాటి సహాయంతో సులువుగా అర్థమయ్యే విధంగా బోధించవచ్చు.

ఉదాహరణలు, సూత్రాలు దళసరి అట్టముక్కల మీద రాసి వాటిని ఫ్లానెల్ బోర్డుపై అతికించి ప్రదర్శించడం ద్వారా ఆయా అంశాలు సులువుగా బోధించవచ్చు.

విద్యార్థులకు అధిక సమాచారాన్ని అందించడానికి బులెటిన్ బోర్డులు ఉపయోగిస్తాయి. వివిధ పత్రికలలోని ఉపయుక్త సమాచారం, ఫొటోలు మొదలైనవి కూడా ప్రదర్శించవచ్చు.

కంప్యూటర్ ద్వారా బోధనాభ్యసన కార్యక్రమం మరింత వేగవంతమవుతుంది. ఇది ఈనాడు ఎంతో ఉపయుక్తంగా ఉంది. వివిధ రకాల స్లైడులు, సన్నివేశాలు ప్రదర్శించడానికి ఇవి సహాయపడతాయి.

**6.2.2. శ్రవణ సామగ్రి :**

వినడం ద్వారా బోధనాంశం పిల్లలు అర్థం చేసుకునేటట్లు చేసేది శ్రవణ సామగ్రి. రేడియో, టేప్‌రికార్డర్, గ్రామ్‌ఫోను, హార్మోనియం, తబలా మొదలైన సంగీత పరికరాలు, ప్రముఖుల ఉపన్యాసాలు, సాహిత్య కార్యక్రమాలు మొదలైనవి శ్రవణ సామగ్రి.

పాఠ్యాంశాన్ని శ్రవణ సామగ్రి ద్వారా విద్యార్థులు ఆయా అంశాల గురించి విస్తృత సమాచారాన్ని గ్రహిస్తారు. విషయావగాహన పెంపొందించుకోవచ్చు. వివిధ పద్యాలు వినడం వల్ల పద్యపఠనం ఎలాగో, గేయం లయబద్ధంగా ఎలా పాడాలో తెలుసుకుంటారు. భాషాభిరుచి, రసానుభూతి కలుగుతుంది. విద్యార్థులు పద్యాలు చదువుతుండగా రికార్డుచేసి వారికి వినిపిస్తే వారి ఉచ్చారణ దోషాలు వారే తెలుకుని దిద్దుకుంటారు. సాహిత్య ఉపన్యాసాలు, దేశభక్తి గీతాలు, పాటలు రికార్డు చేసి వినిపిస్తే, ఆసక్తిగల పిల్లలు వాటిని నేర్చుకుంటారు.

**6.2.3. దృశ్యశ్రవణ సామగ్రి :**

చూడడం, వినడం ఏకకాలంలో జరగడం వల్ల దృశ్యశ్రవణ సామగ్రికి బోధనోపకరణాల్లో ప్రత్యేకస్థానం

ఉంది. సినిమా, టెలివిజన్, స్లయిడ్స్ మొదలైనవి దృశ్యశ్రవణ సామగ్రి. నాటకాలు, కథలు టెలివిజన్ ద్వారా చూడవచ్చు. వీటిని బోధనాసామగ్రిగా వినియోగించుకుంటే విద్యార్థులు మరింత జ్ఞానాన్ని గడిస్తారు. టెలివిజన్ విద్యార్థులకు ఉపయోగించే మంచి నాటకలు, కథలు, నాటకాలు చూపిస్తూ వినిపించవచ్చు. పండుగరోజుల్లో టి.వి.లో ప్రసారమయ్యే కవిసమ్మేళనాలు, అవధానాలు, గోష్ఠులు చూపించవచ్చు. వీటిని రికార్డు చేసి సందర్భానికి అనుగునంగా చూపడం వల్ల పిల్లలు మంచి జ్ఞానాన్ని గడిస్తారు. ప్రత్యక్ష ప్రసారాల ద్వారా టెలిస్కూలు కార్యక్రమాలు వివిధ విషయాలపై ప్రసారమవుతున్నాయి.

## 6.3. వార్తాపత్రికలు, మేగజైనులు

పత్రికొక్కటున్న పదివేల సైన్యంబు
పత్రి కొక్కటున్న మిత్రకోటి
ప్రజకు రక్షలేదు పత్రిక లేకున్న
వాస్తవమ్ము నార్లవారి మాట !

– నార్ల వెంకటేశ్వరరావు

పత్రికల ఆవశ్యకత, ప్రాధాన్యతల గురించి చెప్పిన ఈ పద్యం ఎంతో హృద్యంగా ఉందికదూ! పత్రిక, ప్రసార మాధ్యమాల ద్వారా వర్తమానకాలంలోని అన్ని విషయాలు జనబాహుళ్యానికి తెలుస్తాయి. దూరదర్శన ప్రసార మాధ్యమానికి వినడం, చూడడం కూడా ఉన్నప్పటికీ పత్రికారచనల ప్రాధాన్యత తగ్గలేదు. దూరదర్శన ప్రసారమాధ్యమం, దాని కాలనిబద్ధత మన శ్రవణాన్ని నిర్ణయిస్తుంది. ముద్రణా వార్తాపత్రిక మన కాలానుగుణంగా ఉపయోగపడుతుంది. అందువల్ల పిల్లలచేత వార్తాపత్రిక చదివించడం మంచి ప్రయోజనాన్నిస్తుంది.

పత్రికలలో దినపత్రికలు, వారపత్రికలు, పక్షపత్రికలు, మాసపత్రికలు, త్రైమాసిక పత్రికలు మొదలైన అనేక పత్రికలున్నాయి. వీటిలోని విషయాన్నిబట్టి సాహిత్య పత్రికలు, రాజకీయ పత్రికలు, సామాజిక పత్రికలు, భక్తి పత్రికలు, బాలల పత్రికలు, క్రీడా పత్రికలు ఇలా విభజించుకోవచ్చు. అయితే వార్తా పత్రిక మాత్రం పై విషయాలన్నింటి సమాహారంగా వెలువడుతుంది.

**6.3.1. పాఠశాల పత్రిక :**

విద్యార్థులలో స్వీయ రచనను, సృజనాత్మకతను పెంపొందించడానికి పాఠశాల పత్రిక ఉపయోగిస్తుంది. ఇది ముద్రిత రూపంలోగాని, లిఖిత రూపంలోగాని ఉండవచ్చు. ముద్రణా రూపం కొంత ఖర్చుతో కూడిన పని. లిఖిత రూప పత్రికలో విద్యార్థులు వివిధ వ్యవహార రూపాలలో సొంత దస్తూరీతో ఉంటాయి. ఈ పత్రికకు భాషోపాధ్యాయుడు సంపాదకుడు. భాషా సాహిత్యాలలో పరిచయం ఉన్న ఇతర ఉపాధ్యాయ సేవలు, సహకారం కూడా తీసుకోవచ్చు. విద్యార్థులలో రచనా వ్యాసాంగాన్ని ప్రోత్సహిస్తే బాలసాహిత్యాన్ని సృష్టించగలరు. విజ్ఞాన విషయాలు, వింతలు–విశేషాలు, కథలు, గేయాలు, సంభాషణలు, హాస్యోక్తులు, పద్యాలు ఇలా వివిధ అంశాలు వీటిలో చోటు చేసుకుంటాయి. రచనలు చేసేవారు కాగితం పరిమాణం, చక్కని చేతిరాత, వ్యావహారిక భాష, తప్పులు లేకుండా ఉండడం అనే అంశాలను గురించి జాగ్రత్త తీసుకోవాలి.

విద్యాలక్ష్యాలకు, మానవ విలువలకు, సామాజిక స్పృహకు, మానవాభ్యుదయానికి, సమసమాజ నిర్మాణానికి, సహకారానికి, నైతిక విలువలకు తోడ్పడే రచనలు చేసేలా ఉపాధ్యాయుడు విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించాలి. మంచి రచనలు చేసినవారు భవిష్యత్తులో మంచి కవులు, రచయితలు అవుతారు.

**ప్రయోజనాలు :**

- సృజనాత్మకత వెలికి తీయబడుతుంది.
- లేఖన నైపుణ్యం అభివృద్ధి చెందుతుంది.
- పదజాల సంపద పెరుగుతుంది.
- చక్కని వాక్యనిర్మాణం, ప్రత్యేకశైలి విద్యార్థి దశలోనే అలవడతాయి.
- భావవ్యక్తీకరణకు దోహదపడుతుంది.
- భాషాభిరుచి, సాహిత్యాభిరుచి పెరుగుతాయి.
- పిల్లల్లో అంతర్గత శక్తులు వెలికితీయబడతాయి.
- మానసిక వికాసం పెరుగుతుంది.

**6.3.2. వార్తాపత్రికలు, మేగజైన్లు భాషా బోధనా వనరులు :**

వార్తాపత్రికలు, మేగజైన్లు నుంచి వివిధ కృత్యాలు నిర్వహించడం ద్వారా పిల్లల భాషాభివృద్ధిని పెంపొందింప జేయడానికి బోధనా వనరులుగా ఉపయోగించుకోవచ్చు.

- పత్రికలోని ఒక పేరా ఇచ్చి అందులోని భాషాభాగాలను విడదీయించి, పట్టికగా రాయించవచ్చు.
- ఒక పేరా ఇచ్చి సంక్షిప్తీకరణ చేయించవచ్చు.
- పిల్లలచేత క్రీడా విశేషాలు చదివించి వివరించమనవచ్చు.
- సూక్తులు, పొడుపు కథలు, కథలు, గేయాలు సేకరించవచ్చు.
- మహనీయుల జయంతులు, వర్ధంతులు ఆయా సందర్భాలలో ప్రచురించిన విశేష ప్రత్యేక విషయాలు సేకరింపజేయవచ్చు.
- ఒక పేరా నుంచి ప్రశ్నలు తయారు చేయించవచ్చు.
- ఒక పేరా నుంచి ప్రశ్నలిచ్చి, జవాబులు వ్రాయించవచ్చు.
- భాషా క్రీడలు, గళ్ళనుడికట్టు, పద చదరంగం మొ॥ పూర్తిచేయించవచ్చు.
- వింతలు – విశేషాలు సేకరింపజేయవచ్చు.
- పేరా నుంచి సంధులు, సమాసాలు గుర్తింపచేయవచ్చు.

ఈ విధంగా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి వార్తాపత్రికలు, మేగజైన్లు ప్రముఖపాత్రను నిర్వహిస్తాయి.

"వార్తయందు జగము వర్ధిల్లుచున్నది
అదియులేనినాడు అఖిలజనులు
అంధకారమయ మగ్నులగుదురుగావున
వార్త నిర్వహింపవలయు పతికి!"

– నన్నయ

## 6.4. గ్రంథాలయాలు – వాని వినియోగం :

విద్యకు ఒక చక్కని నిర్వచనం ఉంది.

"Education is the utilization of leizure time property" విద్య అంటే విరామకాలాన్ని సద్వినియోగం చేసుకోవడమే. వ్యక్తులు తమ విరామకాలాన్ని సద్వినియోగం చేసుకోవడంలో గ్రంథాలయ పఠనాన్ని మించింది లేదు. చదువుకోవటానికి వివిధరకాలైన పుస్తకాలను ఒకచోట ఉంచే ప్రదేశాన్ని గ్రంథాలయం అంటారు. దీనికే

“పుస్తక భాండాగారం” అనే నామాంతరం కూడా ఉంది. గ్రంథాలయాన్ని ఆంగ్లంలోLibrary అంటారు. ఇది Liber అనే లాటిన్ పదం నుంచి ఏర్పడింది. Liber అంటే పుస్తకం అని అర్థం. అందుకే పుస్తకాలుండే చోటను Library అంటారు.

గ్రంథం అంటే కుట్టుబడింది అని అర్థం ఉంది. ఆలయం అనేమాటకు దేవాలయం, గుడి, కోవెల, పవిత్ర ప్రదేశం అనే సమానార్థాలున్నాయి. దేవుడున్న ఆలయం దేవాలయం! అలాగే గ్రంథాలున్న ఆలయం గ్రంథాలయం! గ్రంథాలయాలు ప్రజలందరికీ ఉపయోగించే విధంగా జాతీయ, రాష్ట్ర, జిల్లా, గ్రామ స్థాయిల్లో అందుబాటులో ఉంటాయి. వాటిని ప్రజాగ్రంథాలయాలు (Pubicl Libraries) అంటారు.

**పాఠశాల గ్రంథాలయాలు :**

డా॥కె. రంగనాధన్ గారు “పాఠశాల గ్రంథాలయాలు విద్యార్థులకు ఒక ప్రయోగశాలలాగా ఉపయోగ పడాలి” అన్నారు. విస్తృత పఠనాభ్యాసం విద్యార్థుల్లో కలిగించడానికి గ్రంథాలయాలు ప్రముఖపాత్ర వహిస్తాయి. పాఠశాల గ్రంథాలయాల్లో ఉపాధ్యాయులకు అవసరమయ్యే మూలగ్రంథాలు (Source Books) పరామర్శ గ్రంథాలు (Reference Books) ఉంటాయి. వాటి సహాయంతో విద్యార్థులు స్వయం అధ్యయనం చేయవచ్చు. పాఠ్యపుస్తకంలోని విషయాలకు అనుగుణంగా, నిత్యం మారే విజ్ఞానాన్ని పొంది, సమకాలీనాంశాలతో జోడించి సమర్థవంతంగా బోధించడానికి ఉపాధ్యాయునికి గ్రంథాలయం ఉపయోగిస్తుంది. గ్రంథాలు ప్రాపంచిక పరిణామాన్ని వీక్షించే గవాక్షాలు.

విద్యార్థుల్లో చదువు అలవాటును పెంచడానికి, మంచి విజ్ఞానం పెంచడానికి గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడతాయి. విద్యార్థులు తమకు కావలసిన అన్ని పుస్తకాలు కొనలేరు. గ్రంథాలయం నుంచి తాము చదవాలనుకున్న పుస్తకం చదువుకోవచ్చు. తరగతి పుస్తకాలకు తోడుగా, ఆధునిక విజ్ఞానం పొందడానికి, ఎన్నో విషయాలు తెలుసుకోవడానికి గ్రంథాలయాలు ఉపకరిస్తాయి. పాఠశాల గ్రంథాలయం పాఠశాల అవసరాలు తీర్చగలగాలి. పాఠశాలలోని సంబంధించిన అన్ని తరగతుల బోధనాంశాలకు

మూలగ్రంథాలు (Source Books)

పరామర్శ గ్రంథాలు (Reference Books)

నిఘంటువులు (Dictionaries)

పూర్వగాధలహరి

విజ్ఞాన సర్వస్వాలు (Encyclopaedias)

కథలు (Stories)

బాల సాహిత్యం (Children's Literature)

ప్రాచీన సాహిత్యం – ఆధునిక సాహిత్యం (Literature Old & New)

సామాజిక శాస్త్రాలు (Social Sciences)

భౌతిక రసాయన జీవ శాస్త్రాలు (Physical & Bio-Sciences)

వాచకాలు (Text Books)

ఉపాధ్యాయ కరదీపికలు (Teacher Hand Books)

మొదలుగా గల అనేక పుస్తకాలు ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఉభయతారకంగా పనిచేస్తాయి.

**తరగతి గ్రంథాలయాలు :**

తరగతి గ్రంథాలయాలను ప్రతి తరగతికి ఒక్కొక్కటి చొప్పున ఏర్పాటు చేసినట్లయితే విద్యార్థులకు

సౌకర్యవంతంగా ఉంటుంది. తరగతి గ్రంథాలయం విద్యార్థి స్థాయికి తగిన పుస్తకాలతో నిండి ఉండాలి. పుస్తక పరిమాణం కూడా తరగతి వాచకంతో సమానంగా గాని, అంతకన్న కొంచెం చిన్నదిగా గాని ఉండాలి. పుస్తకంలోని విషయం పిల్లల స్వయం అభ్యసనానికి తగినట్లుగా సులభశైలిలో ఉండాలి. అప్పుడు విద్యార్థి చదువుకునేందుకు, అర్థం చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. సన్నివేశానికి తగిన చిత్రం కూడా పుస్తకాలలో ఉంటే విద్యార్థులకు ఆకర్షణీయంగా ఉంటుంది. విద్యార్థులు తీరిక సమయాల్లో తమ తరగతిగదిలో కూర్చుని పుస్తకపఠనం చేసి సమయాన్ని సద్వినియోగం చేసుకుంటారు. పుస్తకపఠనం చక్కని అభిరుచి. అది విజ్ఞాన ప్రగతికి సోపానం. గ్రంథ పఠనం మానవుణ్ణి ఉన్నత శిఖరాలకు చేరుస్తుంది. ఉత్తమ వ్యక్తిత్వం గలవానిగా తీర్చిదిద్దుతుంది.

**తరగతి గ్రంథాలయం ఏర్పాటులో ఉపాధ్యాయులు గమనించవలసిన అంశాలు :**

1. పిల్లలకు ఆనందం కలిగించే ఆటపాటలకు సంబంధించిన పుస్తకాలు ఏర్పాటు చేయాలి.
2. తరగతి గది పిల్లలందరికీ సరిపోయే సంఖ్యలో పుస్తకాలుండాలి.
3. బాలల మాసపత్రికలుండాలి. బాలభారతం, చందమామ, బుజ్జాయి మొదలైనవి ఉండాలి.
4. చక్కని వాడుకభాషలో పిల్లలకు అర్థమయ్యే శైలిలో బాలల బొమ్మల రామాయణం, భారతం, భాగవతం, దశావతార కథలు, బైబిలు కథలు, జానపద కథలు, అరేబియన్ నైట్స్ కథలు, వివిధ భాషల అనువాద కథలు ఉండాలి.
5. సత్ప్రవర్తన, పరోపకారం, దేశభక్తి, నాయకత్వ లక్షణాలను పెంచే గ్రంథాలుండాలి.
6. హాస్యం, వినోదం, అద్భుతం, సాహసం మొదలైనవి ప్రతిబింబించే రంగురంగుల బొమ్మలతో పిల్లలు ఇష్టపడే అంశాలున్న పుస్తకాలుండాలి.
7. గ్రంథాలయ పుస్తకాలను చదివించే తత్వం ఉడాలి.
8. గాంధీ, నెహ్రూ, అంబేద్కర్, రాణి రుద్రమదేవి, ఝాన్సీరాణి, మదర్‌థెరిస్సా మొదలైనవారికి సంబంధించిన కథలు, నాటికలు ఉండాలి.
9. పిల్లల మానసిక స్థాయికి తగినట్లుండాలి.
10. ఆకర్షణీయంగా, రాయబడిన భాష సరళంగా ఉండాలి.
11. అక్షరాలు పెద్దవిగా, ముద్రణ చక్కగా ఉండి, అట్టమీద అందమైన చిత్రాలుండాలి.

**గ్రంథాలయాల వినియోగం :**

ప్రభుత్వ నిధుల నుంచి, పాఠశాల నిధుల నుంచి, దాతల నుంచి సేకరించిన పుస్తకాలు విద్యార్థులకు అందుబాటులో ఉండాలి. గ్రంథాలయంలోని పుస్తకాలన్నిటిని ఒక కేటలాగ్ రూపంలో రాసుకోవాలి. వరుససంఖ్య, పుస్తకం పేరు, వెల మొదలయిన వివరాలు కేటలాగ్‌లో ఉండాలి. కేటలాగ్ ద్వారా విద్యార్థులు తమకు కావలసిన పుస్తకం ఎంపిక చేసుకునేందుకు అవకాశముంటుంది. పుస్తకాలు వెతుక్కోకుండా విద్యార్థులే నేరుగా, స్వయంగా తీసుకునేలా వాటిని అందుబాటులో ఉంచాలి. చదివిన పుస్తకంలోని విశేషాంశాలు, ముఖ్యాంశాలు తమ రాతపుస్తకంలో రాసుకునేవిధంగా శిక్షణనివ్వాలి. పుస్తక సమీక్షలు చేయించాలి.

గ్రంథాలయాలలో నిఘంటువును ఉపయోగించే అలవాటు పిల్లలకు తప్పనిసరిగా అలవరచాలి. ఏదైనా విషయం చదువుతున్నపుడు తమకు తెలియని కొత్తపదానికి అక్కడికక్కడే నిఘంటువు చూసి ఆ పదానికి అర్థం తెలుసుకుంటాడు.

పాఠశాల గ్రంథాలయానికి పుస్తక పఠనం పట్ల అభిరుచి కలిగిన ఉపాధ్యాయుడే అధికారి అయితే పసిడికి పరిమళం అబ్బినట్లే. గ్రంథాలయ కమిటీని ఏర్పాటు చేసి, నియమించవచ్చు. మూడవ తరగతి నుంచి ఈవిధానంలో తరగతి గ్రంథాలయం చాలా చక్కగా నిర్వహించవచ్చు. ఒక ఇష్యూ రిజిష్టరు (Issue Register)

ఏర్పాటు చేయాలి. ఒక్కొక్క విద్యార్థికి ఒక్కొక్క పేజీ చొప్పున కేటాయించాలి. ఉపాధ్యాయుని పర్యవేక్షణలో విద్యార్థులు తరగతి గ్రంథాలయం చక్కగా నిర్వహిస్తారు.

గ్రంథాలయం ఆహ్లాదకరంగా, నిశ్శబ్దంగా ఉండాలి. గోడలమీద విద్యార్థులను ప్రేరేపించే మంచి మంచి సూక్తులు, గొప్పగొప్ప కవుల చిత్రపటాలు ఉండాలి. తరచు గ్రంథాలయ వినియోగంపై ఉపన్యాసాలు, పుస్తక సమీక్షలు, పద్యపఠనం మొదలైనవి చేయించవచ్చు. చదివిన పుస్తకం గురించి ప్రార్థన సమయంలో పిల్లలచేత చెప్పించాలి. ఎక్కువ పుస్తకాలు చదివిన విద్యార్థులకు బహుమతులిచ్చి ప్రోత్సహించాలి.

**గ్రంథాలయాలు – ప్రయోజనాలు :**

1. విరామకాలాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు.
2. ఆలోచనాశక్తి పెరుగుతుంది.
3. విస్తారపఠనం అలవడుతుంది. అది జ్ఞానవికాసానికి దోహదపడుతుంది.
4. సృజనాత్మకశక్తి పెరుగుతుంది.
5. విస్తృతమైన భాషా పరిజ్ఞానం అలవడుతుంది.
6. సాంఘిక వైఖరులు పెంపొందుతాయి.
7. సమగ్ర మూర్తిమత్వం అలవడుతుంది.
8. పుస్తక సమీక్ష చేయగలుగుతారు.
9. జ్ఞానాభివృద్ధి కలుగుతుంది.
10. వ్యక్తిత్వ, సామాజిక వికాసానికి దారితీస్తాయి.
11. తెలుసుకున్న విషయం గురించి సొంతమాటల్లో రాయగలుగుతారు.
12. పఠనం, భాషణం, లేఖనం ఏకకాలంలో సాధించవచ్చు.

**"గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు"**

## 6.5. బాలసాహిత్యం, అదనపు పఠన సామగ్రి

బాలలకు హితాన్ని కూర్చేది బాలసాహిత్యం. బాలసాహిత్యం అంటే బాలలు తమంతట తాము ఉపాధ్యాయుడి అవసరం లేకుండా స్వయం అధ్యయనం ద్వారా చదువదగిన పుస్తకాలు. ఇది బాలల వ్యక్తిత్వ వికాసాలను పెంచి వారు సర్వతోముఖంగా ఎదగడానికి ఉపయోగిస్తుంది. బాలసాహిత్యానికి చెందిన పుస్తకాలు మధురాతి మధురంగా ఉంటూనే చెప్పవలసిన విషయాన్ని సూటిగా చెబుతాయి. భాష సరళంగా, లలితంగా వుండాలి. బాలసాహిత్యం పట్ల వ్యక్తిత్వ వికాసానికి దారితీయాలి.

జోలపాటలు, పొడుపుకథలు, జానపద కథలు, బాలగేయాలు, చిన్నచిన్న పద్యాలు, నీతికథలు, సంభాషణలు, నాటకాలు, గేయకథలు మొదలైన సాహిత్యరూపాలలో బాలసాహిత్యం పిల్లల్ని అలరిస్తోంది. మనోవిజ్ఞాన శాస్త్రవేత్తలు పిల్లల ఆలోచనాశక్తి పెరగటానికి కథలు ఎంతో ఉపకరిస్తాయి. అక్బర్ బీర్బల్ కథలు, ఆలీబాబా 40 దొంగలు, అల్లాఉదీన్ అద్భుతదీపం, మర్యాదరామన్న కథలు, పేదరాశి పెద్దమ్మ కథలు, జానపద కథలు, భట్టివిక్రమార్క కథలు, తెనాలి రామకృష్ణ కథలు, పరమానందయ్య శిష్యుల కథలు, బేతాళ కథలు, కాశీమజిలీ కథలు మొదలుగా గల కథాసాహిత్యం పిల్లలకోసం తయారు చేయబడింది. బాలసాహిత్యంలో బాపు – ముళ్ళపూడి వెంకటరమణల

అపూర్వసృష్టి బుడుగు పాత్ర.

బాలసాహిత్యరంగంలో విశేష కృషి చేసిన ప్రముఖులు చింతా దీక్షితులు, నాళం కృష్ణారావు, దేవులపల్లి కృష్ణశాస్త్రి, నండూరి రామమోహనరావు, టేకుమళ్ళ కామేశ్వరరావు, మిరియాల రామకృష్ణ, ఏడిద కామేశ్వరరావు, గిడుగు వెంకట సీతాపతి, వెంకట పార్వతీశ్వరకవులు, ఏటుకూరి వెంకట నరసయ్య, నార్ల చిరంజీవి, మహీధర నళినీ మోహన్, వెలగా వెంకటప్పయ్య, తురగా జానకీరాణి, వసుంధర, రెడ్డి రాఘవయ్య, శారదా అశోకవర్ధన్ మొదలయినవారు.

మహీధర నళీనీమోహన్, కొడవటిగంటి కుటుబరావు, వసంతరావు వెంకటరావు మొదలైనవారు పిల్లలకోసం విజ్ఞానశాస్త్ర విశేషాలను సరళమైన భాషలో అందించారు.

బాలలకోసం తెలుగులో ఎన్నో పత్రికలు వచ్చాయి. 1940లో మేడిచర్ల ఆంజనేయమూర్తి గారు 'బాలకేసరి' అనే మాసపత్రికను మొట్టమొదట ప్రారంభించారు. చందమామ, బాలమిత్ర, బాలవినోదం, బాలప్రభ, బాలబంధు, బాలరాజ్యం, చంద్రభాను మొదలైన బాలసాహిత్య పత్రికలు ఆరోజుల్లో ఆబాలగోపాలాన్ని అలరించాయి. ప్రస్తుతం ఈనాడు పత్రిక వెలువరిస్తున 'బాలభారతం' అనే మాసపత్రిక విశేష ప్రజాదరణ పొందుతోంది.

**బాలసాహిత్యం ఆవశ్యకత :**

1. పిల్లలు పుస్తక పఠనంపై అభిరుచి పెంపొందించుకుని వారు చక్కటి పాఠకులుగా తయారౌతారు.
2. పిల్లలోని సృజనాత్మకశక్తి బయటకు వస్తుంది.
3. చక్కని భావుకత, ఆలోచనాశక్తి పెంపొందుతుంది.
4. కవులను, కథారచయితలను అభిమానిస్తారు.
5. పఠన లేఖన సామర్థ్యాలు అభివృద్ధి అవుతాయి.
6. సొంతంగా రచనలు చేస్తారు.
7. పిల్లలకు సంబంధించిన దేశదేశాల కథలతో పరిచయం కలుగుతుంది.
8. భాష, సాహిత్యల పట్ల మక్కువ కలుగుతుంది.
9. ఊహాశక్తి, పరిశీలనాశక్తి వృద్ధి అవుతాయి.
10. పిల్లలు సందర్భోచితంగా మాట్లాడడం, చదివిన అంశం అవసరానికి చక్కగా ఉపయోగించడం చేస్తారు.
11. విరామకాలాన్ని సద్వినియోగం చేసుకుంటారు.

**తరగతి గదిలో బాలసాహిత్యం పట్ల పిల్లల అభిరుచులను ఎలా పెంపొందించుకోవాలి?**

- బాలసాహిత్య గ్రంథాలు, పిల్లలకు అందుబాటులో ఉంచాలి.
- తమంతట తాముగా బాహ్యపఠనం, మౌనపఠనం చేసేలా చూడాలి.
- చదివిన విషయం పిల్లలచేత చెప్పించాలి.
- కథలు, గేయాలు, సంభాషణలు మొదలైనవాటిలో పాత్ర స్వభావాలు చెప్పించాలి.
- కథలకు పిల్లలచేత కొత్తపేర్లు పెట్టించాలి.
- కథలు పొడిగింపజేయడం, ముగింపు వేరేవిధంగా ఊహింపజేయాలి.
- పుస్తక సమీక్షలు చేయించాలి.
- సాహిత్యపరమైన అభిరుచిగల బాలబాలికలచేత ఒక లిఖిత పత్రిక నడిపించాలి.
- మంచి రచనలు చేసినవారిని మెచ్చుకోవాలి.

## 6.6. అభ్యసనాభివృద్ధి కార్యక్రమం
**(Learning Enhansement Programme)**

అభ్యసనాభివృద్ధి కార్యక్రమం దీర్ఘకాలిక ప్రయోజనాలను ఆశించి సమగ్రంగా రూపొందించి అమలు పరచే కార్యక్రమం. పిల్లలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సబ్జెక్టు ఫోరం సభ్యులు, విద్యావేత్తలు, విషయ నిపుణులు, జాతీయస్థాయి సర్వేలు, జాతీయ పాఠ్యప్రణాళికా చట్టం–2005 మార్గదర్శకాలను ఆధారంగా చేసుకుని రూపొందించబడిన కార్యక్రమం. 2009–10 సంవత్సరం నుండి అభ్యసనాభివృద్ధి కార్యక్రమం అమలు పరుస్తున్నారు. కార్యక్రమంలో భాషా సామర్థ్యాలు నిర్ధారించారు. ప్రధానంగా ఆలోచించడం, వ్యక్తపరచడం, సృజనాత్మకత, కల్పనాశక్తి మొదలైన వాటికి కీలక అంశాలుగా గుర్తించి భాషా సామర్థ్యాలు నిర్ధారించారు. పిల్లల్లో భాషాభివృద్ధి సాధించడానికి సామర్థ్యాల సాధనపై దృష్టి మరియు ఆయా సామర్థ్యాల సాధనకు దోహదపడే రీతిలో బోధనాభ్యసన ప్రక్రియలకు అన్వయించి బోధించాలి.

పిల్లల సమగ్రాభివృద్ధి కోసం నిర్ధారించిన సామర్థ్యాలను సాధించడానికి పిల్లలంతా నిమగ్నమయ్యేలా అర్థవంతమైన రీతిలో బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించడం మరియు ఆధునిక, సరళీకృత మూల్యాంకన విధానాల ద్వారా పిల్లల స్థాయిని అంచనావేయడం, ఉపాధ్యాయులతో బాటు వ్యవస్థలోని వారందరూ జవాబుదారీతనం వహించేలా అమలు పరచే కార్యక్రమం అభ్యసనాభివృద్ధి కార్యక్రమం.

ప్రధానాంశాలు :

1. సబ్జెక్టు ఆధారిత సామర్థ్యాలతో ఆశించిన ఫలితాలు.
2. బోధనాభ్యసన ప్రక్రియలు
3. మూల్యాంకన విధానాలు
4. జవాబుదారీతనం
5. తల్లిదండ్రుల భాగస్వామ్యం




**1. సబ్జెక్టు ఆధారిత సామర్థ్యాలతో ఆశించిన ఫలితాలు :**

సబ్జెక్టువారీగా, తరగతివారీగా నిర్ధారించిన సామర్థ్యాల సాధన అతి ప్రధానమైనది. సబ్జెక్టు స్వభావం, తరగతిలోని పాఠ్యాంశాలు, బోధనాల లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని నాణ్యతను, సృజనాత్మకతను పెంచేలా సామర్థ్యాలను నిర్ధారించడం జరిగింది. నిర్ధారించిన సామర్థ్యాలను సాధించడం ద్వారా పిల్లలు నాణ్యమైన విద్యను పొందుతారు.

**2. బోధనాభ్యసన ప్రక్రియలు :**

పిల్లల సామర్థ్యాల సాధనకోసం బోధనాభ్యసన ప్రక్రియలను నిర్వహించాలి. అభ్యసనకు కేటాయించిన సమయం పూర్తిగా వినియోగమవ్వాలి. బట్టీ విధానాలు కాకుండా అర్థవంతమైన విధానాలతో ఈ ప్రక్రియ నిర్వహింపబడాలి. కృత్యాలు, ప్రాజెక్టులు, ప్రయోగాలు, జట్టు పనులు మొదలైనవి ఉండాలి.

**3. మూల్యాంకన విధానాలు :**

మూల్యాంకన విధానాలు అర్థవంతంగా, ఆరోగ్యకరమైన రీతిలో అమలు పరచాలి. మౌఖిక, రాత పరీక్షలతో బాటుగా ప్రదర్శనలు, ప్రాజెక్టు పనులు, ప్రయోగాలు, పోర్టుఫోలియోలు మొదలైనవి మూల్యాంకనంలో సాధనాలుగా ఉండాలి.

**4. జవాబుదారీతనం :**

విద్యార్థి ప్రగతి సూచికలను సాధించడానికి ఉపాధ్యాయులతో బాటు ప్రధానోపాధ్యాయుడు, కాంప్లెక్సు ప్రధానోపాధ్యాయుడు, ఎం.ఆర్.పి., ఎం.ఇ.ఓ., జిల్లాస్థాయి అధికారులు, డైట్... ఇలా అందరూ బాధ్యత వహించాలి. ప్రతి ఒక్కరూ తమ పనితీరుకు నిర్ధారించిన ప్రగతి సూచికల ప్రకారం విధులు నిర్వహించాలి. ఆయా అంశాల పట్ల జవాబుదారీతనం వహించాలి.

**5. తల్లిదండ్రుల భాగస్వామ్యం :**

తల్లిదండ్రులు తమ పిల్లలను సక్రమంగా బడికి పంపినపుడే పిల్లలు చక్కగా చదువుకోగలుగుతారు. అంతేకాక తమ పిల్లలు ఏయే అంశాలు నేర్చుకోగల్గుతున్నారో, ఏయే అంశాలు నేర్చుకోలేక పోతున్నారో తెలుసుకోవాలి. ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులతో మాట్లాడి విషయాలు తెలుసుకోవాలి. మాసవారీ తల్లిదండ్రుల సమావేశానికి పాఠశాలకు తప్పక హాజరై తమ పిల్లల గురించిన విషయాలు తెలుసుకోవాలి.

**అభ్యసనాభివృద్ధి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన కొన్ని అదనపు కార్యక్రమాలు :**

1. శిక్షణా కార్యక్రమాలు అర్థవంతంగా, బోధనాభ్యసన అవసరాలు తీర్చేలా నిర్వహించడం..
2. ఉపాధ్యాయుల వృత్తిపర నైపుణ్యాలు, సామర్థ్యాలు పెంపొందింపజేసేలా శిక్షణలు, స్కూలు కాంప్లెక్సులు, వర్కుషాపులు (కార్యశాలలు) నిర్వహించడం జరిగింది.
3. ఉపాధ్యాయుల వృత్తిపర సమస్యలు పరిష్కరించేలా సబ్జెక్టు ఫోరాలు.
4. పాఠశాలలో వివిధ స్థాయిలలోని సమస్యలను గుర్తించి, పరిష్కరించేలా అర్థవంతమైన రీతిలో సమీక్షా సమావేశాలు నిర్వహించారు.
5. వివిధ కార్యక్రమాల్లో దూరవిద్య కార్యక్రమాలు, సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకోవడం.
6. పిల్లల అభ్యసనాన్ని ప్రభావితం చేసేలా సహపాఠ్య వినూత్న కార్యక్రమాలు నిర్వహించడం.
7. పిల్లలకు ఉపయోగించే పఠన సామాగ్రిని రూపొందించడం.
8. గ్రంథాలయ వార్షికోత్సవాలు, పఠనోత్సవాలు, భాషోత్సవాలు, వార్షికోత్సవాలు మొదలైనవాటిని నిర్వహించడం.
9. తల్లిదండ్రుల భాగస్వామ్యం పెంచారు.
10. విద్యాసంవత్సరం చివరన మూల్యాంకనం చేపట్టడం.

## 6.7. భాషాభివృద్ధికి వినూత్న కార్యక్రమాలు

పాఠశాల సమాజం యొక్క సంక్షిప్త రూపం. ప్రపంచ పోకడలకు అనుగుణంగా తరగతి గదులు, పాఠశాలలు విద్యార్థులకు నిర్దేశనం చేస్తాయి. విద్యార్థుల ఆలోచనలు, వారి స్వీయ రచనా శక్తులను మన్నించి వాటిని వెలుగులోనికి తేవడానికి ఉపాధ్యాయుడు తగు కార్యక్రమాలు చేపట్టాలి. ఆచరణయే ధ్యేయంగా, పిల్లల వ్యక్తిత్వ వికాసమే

లక్ష్యంగా విద్యాశాఖ పాఠశాలల్లో కొన్ని వినూత్న కార్యక్రమాలను చేపట్టింది. విద్యార్థి మాట్లాడటం, రాయడం వంటివాటికే పరిమితం కాకుండా తులనాత్మకంగా, చైతన్యంతో ఆలోచించగలగాలి. వినూత్న కార్యక్రమాల ద్వారా విద్యార్థులు సమర్థవంతంగా, చైతన్యవంతంగా, శక్తివంతంగా తయారౌతారు. అంతేకాక విద్యార్థికి ఆసక్తి పెరుగుతంది. విద్యావిలువలు, సాంఘిక విలువలు, సాంస్కృతిక విలువలు కలిగిన పిల్లలు మంచి రచనాశక్తిని, వాదనా పటిమను పెంచుకుంటారు. వీటి సాధనకు భాషాభివృద్ధికి వినూత్న కార్యక్రమాలు చేపట్టారు.

**6.7.1. భాషామేళాలు :**

పాఠశాలలో తయారుచేసుకున్న భాషకు సంబంధించిన బోధనాసామగ్రిని ప్రదర్శన చేయడమే భాషామేళా. విద్యార్థులు తయారు చేసిన వివిధ భాషోపకరణాలు, సేకరణలు, ఉపాధ్యాయులు తయారుచేసిన వివిధ అంశాలు ఈ మేళాలో వుంటాయి. పాఠశాలలో బాగా తయారు చేసిన విద్యార్థులకు తరగతివారీగా బహుమతులిస్తే పిల్లలు మరింత ఉత్సాహంతో మరిన్ని కార్యక్రమాలకు ముందుకు వస్తారు. పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం రోజున భాషామేళా నిర్వహించి నట్లయితే, పిల్లలు తయారుచేసిన, సేకరించిన ఎన్నో అంశాలను తల్లిదండ్రులు కూడా చూసి ఆనందిస్తారు. ప్రదర్శనలో ఉంచిన అంశం పిల్లలే వివరించేలా వారికి ముందునుంచీ తర్ఫీదు ఇవ్వాలి. ఇలా భాషా మేళాలు మండలస్థాయిలో, డివిజన్‌స్థాయిలో, జిల్లాస్థాయిలో నిర్వహించి ప్రదర్శనలోని అంశాలను గురించి పిల్లలు తెలుసుకుంటారు. వారిలోని సృజనాత్మకశక్తి పెరుగుతుంది. (Low Cost / No Cost) తక్కువ వెల / వెల లేని పరికరాలను తయారుచేయడంలో పిల్లలు ఉత్సాహంగా పాల్గొంటారు. పిల్లల్లో సహకార భావన, ఆలోచనాశక్తి, కలుపుగోలు ధోరణి పెరుగుతాయి. నాయకత్వ లక్షణాలు అలవడతాయి. అందుకుగాను భాషామేళాలు దోహదపడతాయి.

**6.7.2. గోడపత్రికలు :**

పిల్లల ఆలోచనలు, అనుభూతులు, అభిప్రాయాలు, స్పందనలు, ప్రతిస్పందనలు వెలిబుచ్చేందుకు పాఠశాల పరంగా ఒక చక్కని వేదిక గోడపత్రిక. విద్యార్థులు చేతిరాతతో రాసినవిగాని, సేకరించిన విశేషాలుగాని గోడపై అంటించడం ('Limited space creates unlimited creativity') పరిమిత ప్రదేశంలో అపరిమిత సృజనాత్మకతకు వేదిక కుడ్యపత్రిక లేదా గోడపత్రిక. పిల్లలు తమ ఆలోచనలు, అభిప్రాయాలను రాతరూపంలో వ్యక్తం చేయడానికి గోడపత్రిక ఒక మంచి అవకాశాన్ని కలిగిస్తుంది. విద్యార్థులు తమకు నచ్చిన కవితలు, గేయాలు, సూక్తులు, వార్తలు, కార్టూన్లు, వ్యాసాలు, ఛలోక్తులు, బొమ్మలు, సమాచారం, వివిధ కవుల, రచయిత చిత్రపటాలు మొదలైనవి గోడపత్రిక ద్వారా పదిమందికీ తెలియజేయవచ్చు. ఉపాధ్యాయులు కూడా పిల్లల ఆలోచనలు, ఇష్టా యిష్టాలు తెలుసుకునేందుకు, అవసరమైన చోట్ల సవరించేందుకు అవకాశం ఉంటుంది. అన్ని పాఠశాలలో గోడపత్రిక నిర్వహిస్తున్నారు.

నిర్వహణ :

సరియైన స్థలాన్ని ఎంచుకుని గోడపత్రికను ఏర్పాటు చేయాలి. గోడపత్రిక నిర్వహణకు విద్యార్థుల నుంచి తరగతుల వారీగా కమిటీలను ఏర్పాటు చేయాలి. ఉపాధ్యాయులు మార్గదర్శకత్వం వహిస్తూ పిల్లలే గోడపత్రికను నిర్వహించే విధంగా తగిన మార్గదర్శకత్వం వహించాలి. సందర్శకుల, పర్యవేక్షకుల సూచనలు, సలహాలు, అభిప్రాయాలు సందర్శకుల పుస్తకం (Visiters Book)లో రాయించాలి. నెలకొకసారి జరిగే తల్లిదండ్రుల సమావేశంలో గోడపత్రికలోని ప్రధానాంశాలను గురించి చర్చించాలి. నచ్చిన, ప్రత్యేక, మంచి అంశాలను ఒక పుస్తకంలో భద్రపరచాలి. ప్రాథమికోన్నత పాఠశాలల్లో 1 నుండి 5 తరగతుల వరకు ఒకటి, 6,7,8 తరగతులకు ఒకటి చొప్పున రెండు గోడపత్రికలు నిర్వహించాలి. విద్యార్థులు తమకు నచ్చిన వాటిని ప్రదర్శించినా, ఉత్తమమైనవి భద్రపరచి వివిధ స్థాయి ప్రదర్శనలకు, పోటీలకు పంపాలి. మంచి ప్రదర్శనను అభినందించాలి.

**గోడపత్రిక నిర్వహించడం వలన ప్రయోజనాలు :**

1 పిల్లలకు తమ సృజనాత్మక నైపుణ్యాలను ప్రదర్శించే అవకాశం ఉంటుంది.

2. బడి పట్ల ఆసక్తి, ఇష్టం కలుగుతాయి.

3. విషయసేకరణ, ప్రదర్శన, భద్రపరడం వీటన్నింటివల్ల పిల్లలు భాషాభివృద్ధిని గడిస్తారు.

4. విద్యార్థుల మధ్య ఆలోచనలు, అనుభవాల పంపిణీ జరుగుతుంది.

5. నాయకత్వ లక్షణాలు అలవడుతాయి.

**6.7.3. దినచర్య రాయడం :**

పిల్లలు వారి ఆలోచనలు, ఇష్టాలు, ఆనందాలు అనుభూతులు, దైనందిన జీవితానుభవాలను ఒక క్రమపద్ధతిలో పుస్తకంలో రాస్తే దానిని 'పిల్లల దినచర్య' లేదా 'పిల్లల డైరీ' అంటారు. మరోరకంగా చెప్పాలంటే మన చుట్టూ ఉన్న పరిసరాలతో వారు జరిపే చర్య, ప్రతిచర్యల సంకలనమే దినచర్య అనవచ్చు. మూడవ తరగతి నుండి పిల్లలచేత డైరీని రాయించాలి. దినచర్య రాయడం వల్ల అనుకోకుండానే లేఖన ప్రక్రియలోని మెళకువలను గ్రహిస్తారు. వివిధ సందర్భాలలో, సన్నివేశాలలో పిల్లలు పొందిన ఉద్వేగాలు, ఆనందానుభూతులకు దినచర్య అద్దం పడుతుంది.

**నిర్వహణ :**

దినచర్య మొదటిపేజీలో విద్యార్థిపేరు, ఫోను నెంబరు, ఇంటి చిరునామా, తల్లిదండ్రుల వివరాలు మొదలైన విషయాలు పిల్లలచేత తప్పనిసరిగా పేర్తిచేయించాలి. పాఠశాలలో నిర్వహించే రోజువారీ కార్యక్రమాలలో వారి మనసుకు హత్తుకున్న సన్నివేశాలను, ప్రత్యేకంగా జరిగిన సంఘటనలను, పరిసరాల మధ్య వారు పొందిన చర్య, ప్రతిచర్యలను డైరీలో రాసేవిధంగా పిల్లలకు శిక్షణ నివ్వాలి. పిల్లలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా రాసేలా వారిని ప్రోత్సహించాలి. నెలకోసారి పిల్లల డైరీని పర్యవేక్షించాలి. పిల్లలు రాయడంలో తప్పులు దొర్లినా వాటిని భూతద్దాల్లో చూడకుండా, తమ తప్పులు తాము సరిదిద్దుకునేలా చూడాలి. బాగా రాసిన పిల్లలను అభినందించాలి. వారానికోసారి తల్లిదండ్రులకు చూపించి సంతకం చేయించమని పిల్లలకు చెప్పాలి. ఉపాధ్యాయుడు ఎప్పటికప్పుడు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలి. బాగా రాసిన పిల్లల డైరీలను మంచి నమూనాలుగా ఎంపిక చేసి ఇతర విద్యార్థుల చేత చదివించాలి. అది వారి రచనా పాటవానికి ప్రోత్సాహకరంగా ఉంటుంది. పిల్లల డైరీ అన్ని పాఠశాలల్లో అభ్యసనాభివృద్ధి కార్యక్రమం చేపట్టిన నాటి నుండి నిర్వహిస్తున్నారు.

**ప్రయోజనాలు :**

1. పిల్లల ఆలోచనావిధానం తెలుస్తుంది.

2. స్వీయ రచనాశక్తి అలవడుతుంది.

3. పిల్లల అభిప్రాయాలను తాము ధైర్యంగా వ్యక్తపరచగలుగుతారు.

4. ఆత్మవిశ్వాసం పెంచుకుంటారు.

5. క్రమబద్ధంగా దినచర్య రాయడం చక్కని వ్యక్తిత్వ వికాసానికి దారి తీస్తుంది.

6. భవిష్యత్తులో చక్కని రచయితలుగా రాణించడానికి దోహదపడుతుంది.

7. తమ తప్పులు తాము తెలుసుకుని సరిదిద్దుకుంటారు.

8. తమచుట్టూ ఉన్న సమాజాన్ని అర్థం చేసుకుంటారు.

**6.7.4. పుస్తక సమీక్ష :**

విద్యార్థులు తమకున్న పరిజ్ఞానంతో పుస్తకంలోని విషయాన్ని గ్రహించి వారి సొంత ఆలోచనలు, అభిప్రాయాలతో సమీక్షరాయడమే పుస్తక సమీక్ష. ఈవిధంగా తమకుతాము చదివి సొంతంగా రాయడం వల్ల

పిల్లల్లో భాషాభివృద్ధి జరుగుతుంది.

**నిర్వహణ :**

విద్యార్థులకు వేర్వేరు పుస్తకాలు ఇచ్చి సమీక్ష రాయించాలి. తరగతికి సరిపడే పుస్తకాలు పిల్లలందరికీ ఇవ్వాలి. పిల్లలు తమ అభిరుచికి తగిన పుస్తకాన్ని ఎంచుకుని ఇచ్చిన గడువులోగా సమీక్ష రాస్తారు. సమీక్ష ఎలా రాయాలో తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలి. విద్యార్థి రాసిన సమీక్ష ఒక పేజీకి తగ్గకుండా, రెండు పేజీలకు మించకుండా ఉండాలి.

**ప్రయోజనాలు :**

1. స్వీయ రచనాశక్తి అలవడుతుంది.
2. ప్రతి విద్యార్థి వేరువేరు పుస్తకానికి సమీక్షరాయడం చేత ఒకరిదాంట్లో ఒకరు చూసే అవకాశం వుండదు.
3. ఒకే పుస్తకం గురించి వేర్వేరు విద్యార్థులు సమీక్షలు రాసినా సమీక్షలు ఖచ్చితంగా వేర్వేరుగా వుంటాయి.
4. పుస్తకం వ్యక్తిగతంగా చదవడమే కాక, సొంత ఆలోచనలతో సృజనాత్మకంగా సమీక్షలు రాసిన విద్యార్థి చక్కగా మూర్తిమత్వాన్ని అలవరచుకుంటాడు.

### 6.7.5. సంచికల రూపకల్పన

విద్యార్థులలోని సృజనాత్మకతకు పదునుపెట్టి ప్రోత్సహించడానికి ఉపకరించే మేలైన సాధనం పాఠశాల సంచిక. పాఠశాలలో కనీసం సంవత్సరానికి ఒక సంచిక విడుదల చేయాలి. పాఠశాల సంచికనే వార్షికోత్సవ సంచికగా ప్రకటించవచ్చు. విద్యార్థులకున్న సృజనాత్మకతకు పదునుపెట్టి ప్రోత్సహించడానికి ఉపకరించే మేలైన సాధనం పాఠశాల సంచిక. పిల్లల రచనలు, చిత్రాలు, కల్పనలు, సేకరణలు, ఆలోచనలు, కథలు, ఆశయాలు, సూక్తులు, పద్యాలు, వ్యాసాలు, లేఖలు మొదలైన వాటిల్లో పిల్లల మనస్సును అద్దంలో చూపినట్లు ఉండాలి. గోడపత్రికలో వచ్చిన మంచి మంచి అంశాలు కూడా ఈ సంచికలో ఉంచాలి. సంవత్సరం పొడవునా పాఠశాలలో జరుపుకున్న ప్రత్యేక కార్యక్రమాలు ప్రకటించే విధంగా చక్కని ఫొటోలు, ఆ సందర్భంలో వార్తాపత్రికలలో వచ్చిన వార్తలు మొదలైనవి కూడా సంచికలో ప్రచురింపజేయాలి. సంపాదక బాధ్యతను చేపట్టిన ఉపాధ్యాయులు ఎంతో నేర్పు, విజ్ఞత ప్రదర్శించాలి. సంచిక ముద్రణ విషయంలో చాలా శ్రద్ధ అవసరం. ఇది పిల్లలలో స్ఫూర్తిని నింపుతుంది. ముద్రణకు కావలసినంత ఆర్థిక వనరు లేనపుడు చేతిరాత బాగున్న నలుగురైదుగురు పిల్లలను ఎంపికచేసి వారి చేత రాయించి ప్రతులు తయారు చేయించి, చక్కని బైండింగ్ చేయించవచ్చును. ఇందువల్ల విద్యార్థులు తమ భాషా సామర్థ్యాలను అభివృద్ధి పరచుకుంటారు. సృజనాత్మకతకు మెరుగులు దిద్దుకుంటారు.

### 6.7.6. ఉత్సవాలు, సమ్మేళనాలు, యాత్రలు :

పాఠశాలలో నిర్వహించే ఉత్సవాల ద్వారా విద్యార్థులలో భాషా సామర్థ్యాలను పెంపొందించడంతో పాటుగా వారి మూర్తిమత్వానికి చక్కని బాటలు వేయవచ్చు. విద్యార్థులను కార్యక్రమ పథకరచనలో, నిర్వహణలో భాగస్వాములను చేయవచ్చు. భాషా సంబంధమైన రకరకాల పోటీలు పద్యపఠనం, వక్తృత్వం, వ్యాసరచన, క్విజ్, ఏకపాత్రాభినయం మొదలైనవి న్విహించి విద్యార్థుల ప్రతిభకు పదును పెట్టవచ్చు.

పాఠశాల పరిసర ప్రాంతాల్లోని ప్రసిద్ధ కళాకారులను, కవులను, రచయితలను, పాఠశాలకు రప్పించి ఉపన్యాసాలిప్పించవచ్చును. కళాకారులచేత ప్రదర్శనలిప్పించవచ్చును. వివిధ రకాల భాషా సంబంధ పోటీలు నిర్వహించి గెలిచినవారికి వారి చేతుల మీదుగా బహుమతులిప్పించవచ్చును. వారి ఆధ్వర్యంలో పిల్లలచేత 'బాలకవి సమ్మేళనాలు' ఏర్పాటు చేయించవచ్చును. ఏకపాత్రాభినయం చేయించవచ్చును. చిన్నచిన్న సాహిత్య రూపకాలు పిల్లలచేత ప్రదర్శింపజేయవచ్చును.

ప్రతియేటా పాఠశాల చేపట్టే కార్యక్రమాల్లో విద్యావిజ్ఞాన విహారయాత్రలు, పుణ్యక్షేత్రాల సందర్శనలు,

వనభోజనాలు చోటుచేసుకోవాలి. యాత్రల ప్రాథమిక లక్ష్యం విజ్ఞాన సముపార్జనే అయినా, భాషాసంబంధమైన సామర్థ్యాల సాధనలోనూ ఇవి ప్రముఖమైన పాత్ర వహిస్తాయి. తాము చూసిన ప్రదేశాలను వర్ణించడం, ప్రతిస్పందించడం, దర్శించిన వాటిని రికార్డు చేయడం, బొమ్మలు గీయడం, అనుభవాలను అక్షరబద్ధం చేయడం, కథలు, కవితలు, గేయాలు రాయడం వంటి సామర్థ్యాలను ఇవి పెంపొందిస్తాయి. విభిన్న సంస్కృతీ సంప్రదాయాల అధ్యయనానికి ఇవి బాటలు వేస్తాయి. ప్రకృతి ఆరాధన, కళారాధన, సున్నితత్వం, సృజనాత్మకత మొదలగు అనేక భావసామర్థ్యాలు సహజంగా వికసించడానికి ఇవి ఉపకరిస్తాయి.

**ముగింపు :**

పాఠ్యపుస్తక నిర్మాణంలోని కీలకసూత్రాలను తెలుసుకుని పాఠాల ఇతివృత్తాలు పాఠ్యాశాల ఎంపిక, విషయ అమరిక, అభ్యాసాలను అవగాహన చేసుకోవాలి. అభ్యసనాభివృద్ధి కార్యక్రమం యొక్క ప్రాధాన్యతను అవగతం చేసుకోవాలి. అందుబాటులో ఉన్న భాషా వనరులను ఉపయోగించుకుని, స్థానిక కవుల, కళాకారుల రచయితల సేవలను వినియోగించుకోవాలి. పాఠశాలలో వినూత్న కార్యక్రమాలను చేపట్టాలి. పిల్లలల భాషాభివృద్ధికి మనవంతు తోడ్పాటునివ్వాలి.

వీటన్నిటి చక్కటి సమేళనమే ఆసక్తికరమైన తరగతి గది.

## మూల్యాంకనము

1. పాఠ్యపుస్తక నిర్మాణంలోని కీలక సూత్రాలేవి?
2. పాఠాల ఇతివృత్తాలను గురించి తెలపండి ?
3. పాఠ్యాంశాల ఎంపిక, విషయ అమరిక, అభ్యాసాలను గురించి వివరించండి ?
4. దృశ్య శ్రవణ సామగ్రిని గురించి తెలపండి ?
5. వార్తాపత్రికలను తరగతి గదిలో ఎలా వినియోగించుకుంటావు ?
6. గ్రంథాలయాల వినియోగం గురించి తెలపండి ?
7. బాలసాహిత్యాన్ని అదనపు పఠన సామాగ్రిగా ఎలా ఉపయోగించుకుంటారు ?
8. అభ్యసనాభివృద్ధి కార్యక్రమాన్ని గురించి చర్చించండి ?
9. పాఠశాలలో చేపట్టే వినూత్న కార్యక్రమాలు ఏవి ?

## ఉపయుక్త గ్రంథ సూచి :


1. అభినవాచార్యకము – గొడవర్తి సూర్యనారాయణ
2. భాషా శిక్షణ – కొంపెల్ల ఆంజనేయశాస్త్రి
3. తెలుగు బోధన పద్ధతులు బి.ఇడి – తెలుగు అకాడమీ, హైదరాబాదు
4. తెలుగు బోధన పద్ధతులు డి.ఎడ్ – తెలుగు అకాడమీ, హైదరాబాదు
5. ప్రాథమికస్థాయిలో భాష – భాషాభివృద్ధి – అవగాహన – తెలుగు అకాడమీ, హైదరాబాద్
6. 6,7 తరగతుల ఉపాధ్యాయుల కరదీపిక – SCERT, హైదరాబాద్
7. 6,7,8, తరగతుల తెలుగు వాచకాలు – SCERT, హైదరాబాద్
8. అభ్యసనాభివృద్ధి కార్యక్రమం 2009–10 ఉపాధ్యాయుల కరదీపిక – రాజీవ్ విద్యామిషన్, ఆంధ్రప్రదేశ్
9. తెలుగు బోధనా ప్రదీపిక – రావి రంగారావు
10. ఆంధ్రభాషాబోధన సర్వస్వము – రామచంద్రుని వేంకట శేషయ్య

# యూనిట్ - 7
# భాషాభ్యసనం - ఆశించిన ఫలితాలు - వ్యూహాలు

**పరిచయం :-**

తెలుగులో మాట్లాడడం, వినడం, నిత్యవ్యవహారాలు చక్కబెట్టుకోవడం ప్రతి విద్యార్థికీ తెలుసు. అయినప్పటికీ ఆర్.టి.ఇ.-2009, ఎస్.సి.ఎఫ్-2011 ప్రకారం ఎస్.సి.ఇ.ఆర్.టి. నిర్దేశించిన సామర్థ్యాలు విద్యార్థిలో సాధించేందుకు ఏర్పాటు చేసుకున్న వ్యవస్థ బోధన. బోధన సరళంగా విద్యార్థుల చతుర్విధ భాషా నైపుణ్యాల వికాసంతో పాటుగా భాషాభిరుచి, స్వీయరచన, సృజనాత్మకత, సంస్కృతీ సంప్రదాయాలు, ఆనందానుభూతి (రసానుభూతి) పొందగల్గాలి. విద్యార్థులు తమ తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా ప్రకటించగలగడం, తరగతి గది అందంగా, ఆహ్లాదకరంగా మలచడం, ప్రశంస, పరిశోధనాత్మక దృక్పథం అలవరచడం మొదలుగా గల అనేక అంశాల సాధన తెలుగు బోధనతో ముడిపడి వున్నాయి.

నిరంతరం వస్తున్న మార్పులను సరైన విధంగా ఆకళింపు చేసుకుని బోధన సజీవంగా సాగడానికి బోధనకు ఆధునిక వ్యూహాలను అనుసంధానం చేసి సరికొత్త రీతిలో రూపొందించుకోవాలి. పాఠ్యపుస్తకం ఎంత గొప్పగా వున్నా, దాని ఉద్దేశాలను నెరవేర్చేది ఉపాధ్యాయులే కదా!

అందుకే భోధ, బోధనా వ్యూహాలను అనుకున్న విధంగా సమర్థంగా నెరవేర్చిననాడే ఈ ప్రయత్నం సఫలీకృతమౌతుంది. ఈ బాధ్యతను ఇష్టంగా స్వీకరించి, అంకితభావంతో ఆచరించి, భావితరానికి ప్రేరణ కలిగించడం ఉపాధ్యాయుల కర్తవ్యం, వారి విద్యుక్తధర్మం!!

**లక్ష్యాలు :-**

ఈ అధ్యయనం చదవడం ద్వారా

1. భాషాభ్యసనం - ఆశించిన ఫలితాలను గురించి తెలుసుకుంటారు.
2. ఆర్.టి.ఇ.-2009 ఆధారంగా భాషాభ్యసనం - ప్రమాణాలను గురించి తెలుసుకుంటారు.
3. భాషాబోధన ఉద్దేశాలను గురించి తెలుసుకుంటారు.
4. తరగతి వారీగా విద్యార్థులు సాధించవలసిన సామర్థ్యాలను గురించి తెలుసుకుంటారు.
5. సాంప్రదాయక, ఆధునిక భాషాబోధన వ్యూహాలను గురించి తెలుసుకుంటారు.
6. చర్చలు, జట్టు పనులు, పుస్తక సమీక్షలు, సంభాషణలు, నాటకీకరణం మొదలయినవి భాషాబోధనలో వినియోగించడం గురించి తెలుసుకుంటారు.

## 7.1. భాషాభ్యసనం - ఉపయోగాలు :

### 7.1.1. నేపథ్యం :

అనాది నుండి పాఠశాల విద్యలో భాషాభ్యసనం అనేది నిర్దిష్ట ఫలితాలను ఆశించి నిర్వహించ బడుతోంది. అభ్యసన ఫలితాలు విద్యార్థిపరంగా సాధింపబడతాయి. బోధన పద్ధతులను, బోధన వ్యూహాలను ఎంపిక చేసుకోవడానికి, వనరులను సమీకరించుకోవడానికి, అభ్యసన కృత్యాలను విజయవంతంగా నిర్వహించడానికి ఉపాధ్యాయులకు భాషాబోధన ఉద్దేశాలను గురించిన అవగాహన ఉండాలి. శాస్త్ర సాంకేతిక పరంగా, సమాజంలో మార్పులకు, సమకాలీన పరిస్థితులకు అనుగుణంగా విద్యాప్రణాళిక చట్టం-2005 వ్యక్తీకరించిన అభిప్రాయాలను, భారతీయ భాషల బోధన ఆధారపత్రం - ఎన్.సి.ఇ.ఆర్.టి సూచనలను ఆధారం చేసుకుని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాప్రణాళికా చట్టం - 2011, భాషాబోధన ఆధారపత్రం 2011 మొదలైనవాటి ఆధారంగా భాషా విద్యా ప్రమాణాలను

రూపొందించింది. వీటి ఆధారంగా పాఠశాల విద్యలో అన్ని స్థాయిలలలో విద్యార్థులు సాధించవలసిన అభ్యసన ప్రమాణాలను నిర్ధారించారు. ఈ ప్రమాణాలను, వాటియందలి వివరణలను గూర్చి ఈ అధ్యాయంలో చదువుకుందాం.

**7.2. భాషాభ్యసనం – ప్రమాణాలు :**

అభ్యసనం అంటే జ్ఞాన నిర్మాణం జరగడం. అవసరమైనపుడు సందర్భోచితంగా జ్ఞానాన్ని వినియోగించుకోగలగడం, విద్యార్థి తాను విన్నది అవగాహన చేసుకోవడం, అర్థవంతంగా మాట్లాడడం, అవగాహనతో చదివి సొంతమాటల్లో వ్యక్తీకరించడం, విన్నది చూసినది సొంతంగా రాయగలగడం, రాసేదానికి సృజనాత్మకతను జోడించడం, కొత్తపదాలకు అర్థాలు తెలుసుకుని వివిధ సందర్భాలలో ఉపయోగించగలగడం, భాషలోని మార్పులను, వివిధ ప్రక్రియలను అర్థం చేసుకోవడం మొదలైనవి చేయగలగాలి. అందుబాటులో ఉన్న సమాచారానికి పూర్వానుభవాన్ని కలుపుకుని, తమ సామర్థ్యానికి పదును పెట్టి సందర్భానుసారంగా వినియోగించే శక్తిని పెంపొందించుకోవడమే భాషాభ్యసనం.

పిల్లలందరిని బాధ్యతాయుతమైన, హేతుబద్ధమైన, శాస్త్రీయ దృక్పథం కలిగిన, సృజనశీలురైన పౌరులుగా తీర్చిదిద్దడమే విద్యయొక్క ప్రాథమిక ఉద్దేశం. విద్యను పొందడంలో భాషమీద పట్టు సాధించడంలో విద్యార్థికి వుపయోగపడే ప్రధాన ఉపకరణం పాఠ్యపుస్తకం. పాఠ్యపుస్తకాలు రాష్ట్ర విద్యాప్రణాళికా చట్టం, విద్యాహక్కు చట్టం ఆధారంగా విద్యార్థులు సాధించవలసిన అభ్యసన ప్రమాణాలను (Learning Standards) విద్యావిషయక ప్రమాణాలను (Academic Standards) నిర్ణయించాయి. ఈ ప్రమాణాలు అత్యంత ప్రాచీనకాలం నుండి నేటి వరకు విద్యాలక్ష్యాలను, కనిష్ఠ అభ్యసన స్థాయిలను మొదలైన వాటిని దృష్టియందుంచుకుని రూపొందింపబడ్డాయి.

విద్యాప్రమాణాలను (Academic Standards) అభ్యసన ప్రమాణాలు (Learning Standards) అని, అభ్యసన సామర్థ్యాలు (Learning Competencies) అని వ్యవహరిస్తారు. పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన జరగాలని, తత్ఫలితంగా ఉన్నతశ్రేణి అభ్యసనం విద్యార్థులకు అందాలని ఈ ప్రమాణాలు రూపొందించబడ్డాయి.

**7.1.3 ప్రాథమికోన్నత స్థాయి విద్యార్థులు సాధించాల్సిన విద్యా ప్రమాణాలు.**

**ఎ) వినడం, అర్థం చేసుకోవడం, ప్రతిస్పందించడం :**

- ఉపన్యాసాలు, వక్తృత్వాలు, వార్తలు, చర్చలు, ఇంటర్వ్యూలు మొదలైనవి విని అర్థం చేసుకోవాలి. వారి అభిప్రాయాలను స్వేచ్ఛగా, స్పష్టంగా వ్యక్తీకరించగలగాలి.
- స్థానిక కళారూపాలను చూసి, విని అర్థం చేసుకోవాలి.
- ప్రసారమాధ్యమాలలోని అంశాలపై తార్కికంగా ప్రతిస్పందించాలి.
- పాత్రల మనోభావాలను గ్రహించి తారతమ్యాలను గుర్తించాలి.
- పాత్రల స్వభావాలను గురించి విచక్షణతో ఆలోచించాలి.
- సాహిత్య ప్రక్రియలోని బేధాలను గుర్తించి అవగాహనతో అభిప్రాయాలను వ్యక్తీకరించగలగాలి.
- ప్రాచీన సాహిత్యానికి చెందిన సులభమైన పద్యాలను, సరళ గ్రాంధిక భాషలోని వచనాన్ని చదివి, విని అవగాహన చేసుకోవాలి.

**బి) మాట్లాడడం :**

- పరిచిత సాహిత్య ప్రక్రియలపై తమ అభిప్రాయాలను చెప్పగలగాలి.
- ప్రసారమాధ్యమాల్లోని వార్తలు, కార్యక్రమాలపై ప్రతిస్పందించాలి.
- చర్చలలో పాల్గొనాలి.
- సంఘటనలను సంక్షిప్తంగా వివరించగలగాలి.
- స్వేచ్ఛగా ఎదుటివారిని ప్రశ్నించడం ద్వారా కావలసిన సమాచారాన్ని సేకరించగలగాలి.

- తమ ఆలోచనలు, అనుభవాలను ఎదుటివారికి చెప్పగలగాలి.
- కథలను సొంతమాటలలో వినిపించాలి.
- వక్తృత్వ కార్యక్రమాలలో పాల్గొనాలి.

**సి) చదవడం – రాయడం :**

- ప్రాచీన సాహిత్యానికి ఆధునిక సాహిత్యానికీ చెందిన పద్యాలను, గేయాలను, కథలను, గ్రాంథిక వాడుక భాషలోని రచనలను చదివి అవగాహన
చేసుకోవాలి.
- లేఖలు, వ్యాసాలు మొదలైన అంశాలను చదివి అర్థం చేసుకోవాలి.
- చదివిన అంశాలు విశ్లేషించగలగాలి.
- చదివిన విషయంలోని కీలక అంశాలను గ్రహించాలి. తగిన శీర్షికలను సూచించాలి.
- పత్రికలోని స్థానిక వార్తలతో పాటు, వివిధ సంఘటనలకు చెందిన వార్తలను చదివి అర్థం చేసుకోవాలి.

**డి) స్వీయరచన :**

- పాఠ్యాంశంలోని సూచిత అంశాలకు సారాంశాలు రాయగలగాలి.
- పద్యాలకు భావాలు రాయగలగాలి.
- చిన్నచిన్న వాక్యాలను భాషాంతరీకరణ చేయగలగాలి.
- దృశ్య, శ్రవ్య, ప్రసారమాధ్యమాలకు చెందిన కార్యక్రమాలపై అభిప్రాయాలను లిఖితరూపంలో వ్యక్తపరచ గలగాలి.
- చదివిన, విన్న, చూసిన, తెలిసిన అంశాల గురించి సంక్షిప్తంగా / వివరంగా రాయగలగాలి.

**ఇ) పదజాలం :**

- చదువుతున్న అంశాల్లో ప్రకృతి – వికృతి పదాలు గుర్తించగలుగుతారు.
- చదువుతున్న అంశాల్లో జాతీయాలు, సామెతలు గుర్తించి, వాటిని అర్థం చేసుకుని తిరిగి సందర్భోచితంగా ప్రయోగించగలగాలి.
- కఠిన పదాలకు, నూతన పదాలకు అర్థాలను నిఘంటువుద్వారా తెలుసుకోగలగాలి.
- వార్తాపత్రికల్లోని పదజాలానికి చెందిన భాషాక్రీడలు మొదలైనవి చేయగలగాలి.

**ఎఫ్) ప్రశంస :**

- ఇతర మతాలు, భాషలు, సంస్కృతులు సక్రమంగా అర్థం చేసుకోవాలి. వాటిలోని మంచిని గుర్తించాలి.
- ప్రత్యేక అవసరాలు గల పిల్లలు తమతో సమానమని గ్రహించి, వారిలోని ప్రత్యేక సామర్థ్యాలను ప్రశంసించి వారిని ప్రోత్సహించాలి.
- చదివిన, విన్న అంశాలలో నచ్చిన పదాలు, పంక్తులు ఎంపికచేసి అవి ఎందుకు నచ్చాయో చెప్పగలగాలి.
- లింగ, మత, వర్ణ బేధాలను పాటించకుండా సామర్థ్యాలను ప్రశంసించగలగాలి.
- కవులను, కవుల భావాలను ప్రశంసించగలగాలి.
- ప్రాంతాలకతీతంగా వ్యక్తులను, సంస్థలను ప్రశంసించగలగాలి.
- ఇతర భాషల్లోని గొప్పదనాన్ని గ్రహించి ప్రశంసించాలి.

**జి) సృజనాత్మకత :**

- విద్యార్థి తాను చదివిన, విన్న, చూసిన అంశాన్ని వర్ణించి చెప్పగలగాలి.
- కథలను, గేయాలను పొడిగించగలగాలి, కొత్త ముగింపును ఇవ్వగలగాలి.

- పాత్రల, లక్షణాలను, హావభావాలను వర్ణించగలగాలి.
- ప్రకటనలు, ఆహ్వాన పత్రికలు, కరపత్రికలు మొదలైనవి తయారు చేయగలగాలి.
- బొమ్మలు గీయడం, నినాదాలు రాయడం మొదలైనవి చేయగలగాలి.
- ఆత్మకథ, దినచర్య (డైరీ) మొదలైన వాటిలో స్వీయ అనుభవాలు స్పష్టంగా, వర్ణనాత్మకంగా రాయగలగాలి.
- పాఠ్యాంశాలను వివిధ సాహిత్య ప్రక్రియల్లోకి అంటే గేయం, కథ, సంభాషణ, లేఖ, పద్యం మొదలైన రూపాల్లోకి మార్చగలగాలి.
- భావనల ఆధారంగా చిత్రాలను గీయగలగాలి, వర్ణనలు రాయగలగాలి.
- గ్రాంథిక భాషారూపాలను వాడుక బాషలోకి మార్చగలగాలి.

**హెచ్) భాషాంశాలు :**

- వర్ణమాలలోని అచ్చులు, హల్లులు, దిత్వ, సంయుక్త అక్షరాలు, పరుష సరళాలు, అల్పప్రాణ, మహాప్రాణాలు, అనునాసికలు, అంతస్థాలు, ఊష్మాలు మొదలైన వాటి గురించి అవగాహన చేసుకోవాలి.
- భాషాభాగాలు, సమాపక – అసమాపక క్రియలు మొదలైన వాటి గురించి అవగాహన చేసుకోవాలి.
- వాక్యభేదాలను గుర్తించి సందర్భోచితంగా వాక్యప్రయోగాలు చేయగలగాలి.
- సంధులు, సమాసాలు గుర్తించగలగాలి. సూత్రాలను సొంతమాటలలో అర్థవంతంగా రాయగలగాలి.
- అలంకారాలపై అవగాహన పెంచుకుని, గుర్తించగలగాలి.
- ఛందస్సు తెలుసుకుని లక్ష్య లక్షణ సమన్వితం చేయగలగాలి.

ఉపాధ్యాయుడు ఈ ప్రమాణాలను దృష్టిలో ఉంచుకుని పాఠ్యాంశాల ద్వారా భాషాభ్యసనం చేయించవలసి ఉంటుంది. భాషాభ్యసన సామర్థ్యాలను, అభ్యసన సూచికలను ప్రతి పాఠానికి అన్వయించి రాసుకోవాలి. అప్పుడే సాధించవలసిన స్పష్టీకరణల గురించిన స్పష్టత వస్తుంది. తద్వారా వాటిని సాధించడానికి అనువైన బోధనావ్యూహాలను తయారు చేసుకోవడానికి, కావలసిన వనరులను సమీకరించుకోవడానికి ఉపాధ్యాయునికి అవకాశం ఉంటుంది.

## 7.2. ఆర్.టి.ఇ. 2009 :

భిన్నత్వంలో ఏకత్వం గల భారతదేశం ఉత్కృష్టమైన సంస్కృతి, సంప్రదాయాలతో విరాజిల్లుతోంది. మనదేశం అతి ప్రాచీన కాలంలోనే నలంద, తక్షశిల వంటి ప్రపంచ ప్రసిద్ధి గాంచిన విశ్వవిద్యాలయాలతో ప్రపంచానికే జ్ఞానభిక్ష పెట్టింది. స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగ నిర్మాతలు దూరదృష్టితో దేశభవిష్యత్తు విద్యారంగంపైనే ఆధారపడి ఉంటుందని విశ్వసించి పిల్లలందరూ విద్యను పొందాలని ఆదేశిక సూత్రాలలో పొందుపరిచారు. ఆ తరువాత మనదేశంలో అక్షరాస్యతా కార్యక్రమాలు విరివిగా నిర్వహించడం వల్ల అక్షరాస్యతలో కలిగిన అభివృద్ధిని గమనించవచ్చు. అయినప్పటికీ పిల్లలు ఆనందంగా, అర్థవంతంగా విద్య నేర్చుకోవడానికి అనువైన, ప్రోత్సాహకరమైన, స్వేచ్ఛాపూరిత వాతావరణం పాఠశాలల్లో లోపించింది. అధిక పాఠ్య ప్రణాళికతో బరువెక్కిన పాఠ్యపుస్తకాలు, ఒత్తిడి, ఆందోళనలకు గురిచేసే పరీక్షావిధానాలు, పాఠశాలను సమాజం నుంచి వేరు చేసే వైఖరులు, పిల్లలకు లేదా సమాజానికి జవాబుదారీతనం వహించే లక్షణం కొరవడటం వంటి అంశాలు విద్యావ్యవస్థను అపహాస్యం చేస్తున్నాయి.

ఈ నేపథ్యంలో విద్యావ్యవస్థలోని అపసవ్య, అశాస్త్రీయ విధానాలను చాలా సున్నితంగా విమర్శిస్తూ రావలసిన మార్పు చేర్పులను గురించి ప్రొఫెసర్ యశపాల్ 2003లో "భారం లేని విద్య" అనే నివేదికను భారత ప్రభుత్వానికి సమర్పించారు.దీని ఆధారంగా ఎస్.సి.ఇ.ఆర్.టి. జాతీయ విద్యా ప్రణాళికా చట్టం – 2005

రూపొందింది. 1986 తరువాత మనదేశంలో అమలైన మంచికార్యక్రమాలు వాటి ఫలితాలు (OBB, APPEP, DPEP, SSA మొదలైన కార్యక్రమాలు) అధికార పూర్వకంగా ఒక నివేదిక రూపంలో జాతీయ విద్యాప్రణాళికా చట్టం-2005 ద్వారా వ్యక్తమయ్యాయి. విద్యావ్యవస్థలో మౌలికమైన మార్పులు చోటు చేసుకోవాలని, సమాజ భాగస్వామ్యంతో పాఠశాల విద్య అభివృద్ధి చెందాలని ఈ నివేదిక తెలిపింది.

ఎన్.సి.ఎఫ్ 2005 సూచించిన పలు అంశాలతో పాటు సమాజంలో కొంతమంది పిల్లలు బాలకార్మికులుగా ఉండటం, పాఠశాలల్లో వారి ప్రవేశానికి నియమ నిబంధనలు అడ్డంకిగా ఉండడం మొదలైన అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రాథమిక హక్కుగా మారిన విద్యను పిల్లలందరూ పొందడానికి ఉద్దేశించి మనదేశంలో 2009 ఆగస్టు నెలలో ఒక చట్టం పార్లమెంటులో ప్రవేశపెట్టబడింది. ఈ చట్టం 26 ఆగస్టు 2009న భారత రాష్ట్రపతిచే ఆమోదం పొందింది. భారతప్రభుత్వం ఈ చట్టాన్ని బాలల ఉచిత, నిర్బంధ విద్యాహక్కు చట్టం – 2009 (Right to Education Act - 2009) అని పేర్కొని 27 ఆగస్టు 2009న గెజిట్‌లో ప్రచురించింది.

ఆర్.టి.ఇ.-2009 చట్టం ఏప్రిల్ 1, 2010 నాటి నుంచి అమలులోకి వచ్చింది. మనదేశ ప్రధానమంత్రి జాతినుద్దేశించి ఇచ్చిన ఉపన్యాసం ద్వారా ఈ చట్టం అమలులోకి వచ్చింది. జాతి, మత, కులాలకు అతీతంగా ఈ దేశపు బాలలందరూ బడిలో చేరి నాణ్యమైన విద్యను పొందడానికి ఈచట్టం ద్వారా ప్రాథమిక హక్కు కల్పించబడిందని బాధ్యతాయుతమైన మంచి పౌరులుగా ఎదగడానికి కావలసిన జ్ఞానం, నైపుణ్యాలు, వైఖరులు, విలువలు నాణ్యమైన విద్య ద్వారా వారికి అందించబడతాయని ప్రధానమంత్రి తమ సందేశంలో పేర్కొన్నారు. ఇది గొప్ప చారిత్రాత్మక ఘట్టం. విద్యను ప్రాథమిక హక్కుగా పరిగణించి చట్టాలు చేసిన దేశాల జాబితాలో మన దేశం కూడా చేరింది.

**7.2.1. చట్టంలోని అధ్యాయాలు, వాటి వివరాలు** (Sections in the act and its details) :

- ఈ చట్టంలో 7 అధ్యాయాలు, 38 సెక్షన్లు, ఒక షెడ్యూలు ఉన్నాయి.
- ప్రారంభంలో ఈ చట్టం పార్లమెంటులో ప్రవేశపెట్టిన తేది, రాష్ట్రపతిచే అమోదం పొందిన తేది, అమలు పరిధి మొదలైన వివరాలున్నాయి.
- ఒకటవ అధ్యాయంలో చట్టం పేరు, పరిధి, అమలు, వివిధ పదాలకు సంబంధించిన అర్థాలు, నిర్వచనాలు ఉన్నాయి. ఈ వివరాలు ఒకటినుండి మూడు సెక్షన్లలో తెలిపారు.
- రెండవ అధ్యాయంలో ఉచితవిద్యకు బాలలహక్కు, బడిలో ప్రవేశం, బదలీ ధ్రువీకరణ పత్రం మొదలైన అంశాల గురించి 4, 5 సెక్షన్లలో తెలిపారు.
- మూడవ అధ్యాయంలో విద్యావిషయాల్లో కేంద్రప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక ప్రభుత్వం, తల్లిదండ్రుల బాధ్యతలను గురించి, పూర్వ ప్రాథమిక విద్యా కేంద్రాల ఏర్పాటును గురించిన వివరాలు 6 నుండి 11 సెక్షన్లలో తెలిపారు.
- నాల్గవ అధ్యాయంలో బడులు, ఉపాధ్యాయుల బాధ్యతలకు సంబంధించిన వివరాలు సెక్షన్ 12 నుండి 28లలో పొందుపరిచారు. ప్రధానంగా పిల్లలను బడిలో చేర్చినపుడు ఎంపిక విధానానికి గురి చేయరాదని, ఎటువంటి క్యాపిటేషన్ రుసుము వసూలు చేయరాదని తెలిపారు. ఎటువంటి ధ్రువీకరణ పత్రాలు లేకున్నా పిల్లలను బడిలో చేర్చుకోవాలని, ఒకే తరగతిలో పిల్లలను కొనసాగించడం లేదా పాఠశాల నుంచి తొలగించడం చేయరాదని, పిల్లలను శారీరకంగా గాని, మానసికంగా గాని వేధించడం, హింసించడం, శిక్షించడం చేయరాదన్న అంశాలను గురించి స్పష్టంగా పేర్కొన్నారు. బళ్లను స్థాపించడం, అవి పాటించాల్సిన ప్రమాణాలు, నియమాలు, ఉపాధ్యాయ నియామకం, వారి విధులు, బాధ్యతలు మొదలైన అంశాల గురిచి వివరించారు.
- ఐదవ అధ్యాయంలో నాణ్యమైన విద్యకు అవసరమైన విద్యాప్రణాళికలు, పాఠ్యప్రణాళికలు, మూల్యాంకన

విదానాలు మొదలైన వాటి గురించి సవివరంగా సెక్షన్ 29, 30లలో తెలిపారు. విద్యాప్రణాళికలను రూపొందించేటపుడు, మూల్యాంకన విధానాలను నిర్ధారించేటప్పుడు, పిల్లల సమగ్ర అభివృద్ధిని, రాజ్యాంగ విలువలను తప్పనిసరిగా దృష్టిలో పెట్టుకోవాలని చట్టంలో పేర్కొన్నారు. వీటితో పాటు బోధనాభ్యసన ప్రక్రియలు, మూల్యాంకన విధానాలు, బోధనా మాధ్యమం, అభ్యసన వాతావరణం వంటి అంశాలను గురించి ప్రస్తావించారు.

- ఆరవ అధ్యాయంలో బాలల హక్కుల సంరక్షణ, పర్యవేక్షణ, ఫిర్యాదుల పరిష్కారం, జాతీయస్థాయి, రాష్ట్రస్థాయిలలో సలహాసంఘాల ఏర్పాటు గురించి సెక్షన్ 31 నుండి 34 లలో వివరించారు.
- ఏడవ అధ్యాయంలో చట్టం అమలుకు జారీ చేసే అధికారాలు, చేపట్టవలసిన చర్యలు, ప్రాసిక్యూషన్, నియమ నిబంధనలు రూపొందించడం గురించిన వివరాలను సెక్షన్ 35 నుండి 38 లలో వివరించారు.
- చట్టం చివర అనుబంధంలో పేర్కొన్న షెడ్యూలులో పాఠశాలకు ప్రమాణాలు, నియమాలను గురించి సెక్షన్ 19, 25లను దృష్టిలో ఉంచుకుని వాటి వివరాలను పొందుపరచారు. వీటిలో పిల్లల సంఖ్యను బట్టి ఉండవలసిన ఉపాధ్యాయుల సంఖ్య, పాఠశాల భవనం, గదులు, వసతి సౌకర్యాలు, సామగ్రి, విద్యాసంవత్సరంలో పాఠశాల పనిదినాలు, బోధనా గంటల సంఖ్య, ఉపాధ్యాయులు వారానికి పనిచేయవలసిన పనిగంటల సంఖ్య మొదలైన వివరాలను చేర్చారు.

ఎన్నో దశాబ్దాల నుండి ఆశిస్తున్న విద్య అందరు పిల్లలు పొందటానికి అవసరమైన అంశాలన్నీ ఆర్.టి.ఇ.2009 చట్టం రూపంలో మనముందకు వచ్చాయి. ఇవి ప్రాధమిక విద్యను ప్రాధమిక హక్కుగా అందరికీ అందుబాటలోకి వచ్చేలా చేయడానికి సహాయపడతాయి. ఈ అంశాలను అమలుపరచి పిల్లలందరికి నాణ్యమైన విద్యను అందించేలా చేయడం మన బాధ్యత. బహుబాషలు, బహుళ సంస్కృతులు గల పిల్లలను పాఠశాలలో చేర్చి వారికి విద్యాబోధన జరపడానికి వ్యూహాలను సిద్ధం చేసుకోవాలి. బహుభాషా తరగతిని ఉన్నత ప్రమాణాలు గల విద్యా ప్రయోజనానికి ఒక వనరుగా ఉపయోగించుకోవచ్చును.

## 7.3. ఎలిమెంటరీ స్థాయి భాషా బోధనోద్దేశాలు

బోధన యొక్క ప్రధాన ఉద్దేశ్యం విద్యార్థి మూర్తిమత్వ వికాసం. విద్యార్థుల మూర్తిమత్వ వికాసాన్ని దృష్టిలో ఉంచుకుని పాఠశాలలో బోధనాభ్యసన కృత్యాలు నిర్వహించాలి. అభ్యసన ఫలితాలు విద్యార్థిపరంగా సాధించబడతాయి. వాటిని దృష్టిలో ఉంచుకుని ఉపాధ్యాయులు బోధన కృత్యాలను నిర్వహించాలి. ఉత్తమ ఫలితాల సాధనకు దోహదం చేయాలి. బోధన పద్ధతులను; బోధన వ్యూహాలను ఎంపిక చేసుకోవటానికి, అవసరమైన వనరులను సమీకరించుకోవటానికి, అభ్యసన కృత్యాలను విజయవంతంగా నిర్వహించటానికి ఉపాధ్యాయులకు భాషాబోధన ఉద్దేశాలను గురించిన అవగాహన ఉండాలి. ఈ నేపథ్యంలో విద్యారంగంలో గమ్యాలు, ఉద్దేశ్యాలు, లక్ష్యాలు అనే పదాలను పర్యాయ పదాలుగా ఉపయోగించడం జరుగుతోంది.

### 7.3.1. గమ్యాలు, ఉద్దేశాలు, లక్ష్యాలు, స్పష్టీకరణలు :

**గమ్యాలు** (Goals):

ఆశయాల విశదీకరణలే గమ్యాలు. ఇవి విద్యా ప్రణాళికల రూపకల్పనకు సహాయపడతాయి. సుదీర్ఘకాలంలో మొత్తం విద్యాప్రణాళిక అధ్యయనం ద్వారా విద్యార్థుల ప్రవర్తనలో కనబరచవలసిన మార్పులే గమ్యాలు. ఇవి దీర్ఘకాలికలు.

**ఉద్దేశాలు** (Aims):

ఇవి విషయ ప్రణాళికల రూపకల్పనకు, పాఠ్యాంశాల ఎంపికకు దోహదపడి, ఆయా పాఠ్యాంశాల ద్వారా విద్యార్థులు కనబరచవలసిన స్థూలమైన ప్రవర్తనా మార్పులను తెలుపుతాయి. ఇవి సంవత్సరాంతానికి విషయ ప్రణాళికల ద్వారా సాధించవలసిన ప్రవర్తనా మార్పుల మొత్తాలు. ఇవి సామాన్య ఉద్దేశాలు (General Aims), ప్రత్యేక ఉద్దేశాలు (Specific Aims) అని రెండు రకాలుగా ఉంటాయి. సామాన్య ఉద్దేశాలు బోధన విషయాలకు సంబంధించిన స్థూల ప్రయోజనాలు. ఇవి విషయ ప్రణాళికలోని అన్ని విషయాలకు వర్తిస్తాయి. ప్రత్యేక ఉద్దేశాలు ఒక్కో బోధనాంశం ద్వారా సాధించవలసిన పరిమిత ప్రయోజనాలు. ఇవి కేవలం ఒకే ఒక విషయానికి పరిమితం.

**లక్ష్యాలు** (Objectives):

గమ్యాల నుండి ఉద్దేశ్యాలు, ఉద్దేశ్యాల నుండి లక్ష్యాలు ఆవిర్భవిస్తాయి. ఇవి విషయ ప్రణాళిక భాగాలైన ఆయా విషయాల్లోని పాఠ్యాంశాల ద్వారా విద్యార్థులకు కల్గించాల్సిన ప్రయోజనాలను సూచిస్తాయి. వీటిని బోధనాలక్ష్యాలు (Instructional Objectives) అంటారు. ఇవి రెండు రకాలు.

అ) సంవృత లక్ష్యాలు – ఇవి ఏ విధంగాను వ్యాఖ్యానానికి లోబడనివి.

ఆ) వివృత లక్ష్యాలు – ఇవి వ్యాఖ్యానానికి లోబడేవి.

**స్పష్టీకరణలు** (Specifications):

బోధనాలక్ష్యాల సూక్ష్మరూపాలు స్పష్టీకరణలు. అంటే విద్యార్థుల్లో వెంటనే ఆశించే ప్రవర్తనా మార్పులనే స్పష్టీకరణాలని చెప్పవచ్చు. వీటినే ఇంకోరకంగా ఆశించే అభ్యసన ఫలితాలు అనికూడా అంటారు. ఒక పాఠ్యాంశం పిల్లలకు బోధిస్తే దానిద్వారా పిల్లల నుండి మనం నిర్ధిష్టంగా ఏమి కోరుకుంటామో వాటినే స్పష్టీకరణలు అంటారు. స్పష్టీకరణలనే సామర్థ్యాలని కూడా పిలుస్తారు.

జి.కె.సూద్ ప్రకారం గమ్యాలు దీర్ఘకాలికమైనవి. ఒక రకంగా అంతిమ ప్రయోజనం కోసం ఉద్దేశించ బడినవి. ఉద్దేశాలు నియమితమైనవి. లక్ష్యాలు ఉద్దేశాల కంటె మరీ నిర్ధిష్టమైనవి. ఉద్దేశాలు విద్యకు మార్గదర్శకాలు కానీ చేరుకోగల అంతిమ దృక్పథం లక్ష్యమే! లక్ష్యసాధన ఉద్దేశాల సాధనకు చేరుస్తుంది.

**7.3.2. లక్ష్యాల లక్షణాలు :**

- విద్యావిషయకంగా ప్రాముఖ్యం కలిగి ఉంటాయి.
- విద్యార్థులు సాధించగలిగేవిగా ఉంటాయి.
- పరిశీలించదగినవిగానూ, కొలవదగినవిగానూ ఉంటాయి.
- నిర్ణయించిన కాలపరిమితిలో సాధించడానికి వీలుగా ఉంటాయి.
- విద్యార్థి ప్రవర్తన ద్వారా వివరించగలిగేవిగా ఉంటాయి.
- మూల్యాంకనం చేయడానికి వీలుగా ఉంటాయి.
- లక్ష్యాలకు స్పష్టీకరణలు ఉంటాయి.

**7.3.3. లక్ష్యాల ఆవశ్యకత :**

లక్ష్యాల నిర్ణయం ప్రక్రియలకు మొదటిమెట్టు. లక్ష్యాల ఆధారంగా పిల్లలు నేర్చుకోవడానికి లేదా ఈ లక్ష్యాలు సాధింపబడడానికి అవసరమైన కృత్యాలను నిర్వహించాలి. అంటే ఒక లక్ష్యాన్ని రూపొందించాక దానిని సాధించడానికి అభ్యసనానుభవాలు కల్పించాలి. అభ్యసనానుభవాలు బోధనాల లక్ష్యాలు సాధించడానికి ఉపయోగపడే సాధనాలు. ఇవి సాధింపబడ్డాయో లేదో తెలుసుకునే ప్రక్రియ మూల్యాంకనం. అంటే లక్ష్యాలు బోధనాభ్యసన ప్రక్రియలకు, మూల్యాంకనానికి ఆధారం. ఈ మూడు ఒకదానితో ఒకటి విడదీయరాని సంబంధాన్ని కలిగి ఉండటమే కాదు, ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉంటాయి.

**7.3.4. లక్ష్యాల ప్రయోజనాలు :**

- విద్యార్థుల అభివృద్ధి మార్గాన్ని తెలుపుతాయి.
- భాషాపరంగా పిల్లల్లో కోరుకునే మార్పులను తెలుపుతాయి.
- మాతృభాషాపరంగా పిల్లల్లో ఏమి కోరుకుంటున్నామో, అందుకు ఉపయోగపడే బోధనా పద్ధతులను, కృత్యాలను, సామాగ్రిని ఎంపిక చేసుకునేందుకు దోహదపడతాయి.
- పిల్లలు భాషాపరంగా ఏమేమి సాధించారో తెలుసుకోడానికి ఉపయోగపడతాయి.

**7.3.5. బ్లూమ్స్ లక్ష్యాలు :**

బోధనాలక్ష్యాలను కూలంకషంగా విశ్లేషించిన మొట్టమొదటి విద్యావేత్త డా॥ బెంజిమన్ బ్లూమ్స్. ఇతడు ప్రచురించిన విద్యాలక్ష్యాల వర్గీకరణ (Texonomy of Educational Objectives, The Classification of Educational Goals Hand Boook) ఈనాటికీ ప్రామాణికంగా నిలిచింది. బ్లూమ్స్ ప్రతిపాదించిన బోధనాభ్యసన లక్ష్యాలు మూడు రంగాలలో వ్యక్తమవుతాయని ప్రతిపాదించారు. ఒక్కొక్క రంగంలో ఉండే అనేక అంశాలే లక్ష్యాలు – స్పష్టీకరణలు.

లక్ష్యాల వర్గీకరణ

| జ్ఞానాత్మక రంగం (Congnitive Domain) | భావావేశరంగం (Affective Domain) | మానసిక చలనాత్మక రంగం (Psychomotor Domain) |
|---|---|---|
| ↓ జ్ఞానం (Knowledge) | ↓ గ్రహించడం (Receiving) | ↓ ప్రేరేపణ (Impulsion) |
| ↓ అవగాహన (Understanding) | ↓ ప్రతిస్పందించడం (Responding) | ↓ అనువర్తించడం (Manipulating) |
| ↓ వినియోగం (Application) | ↓ విలువలు ఏర్పడడం (Valuing) | ↓ నియంత్రణ (Control) |
| ↓ సంశ్లేషణ (Synthesis) | ↓ నిర్వహించడం (Organising) | ↓ సమన్వయీకరణం (Co ordination) |
| ↓ మూల్యాంకనం (Evaluation) | ↓ శీల నిర్మాణం (Characterising) | ↓ స్వాభావీకరణం (Naturalisation) |
| | | ↓ సృజనాత్మకత (Creativity) |

**7.3.5.1. జ్ఞానాత్మక రంగం** (Cognitive Domain) :

బోధనాభ్యసన ప్రక్రియలో జ్ఞానరంగానికి విశిష్టస్థానం ఉంది. ఆలోచించడం, తెలుసుకోవడం, సమస్యలను పరిష్కరించుకోవడం మొదలైన ప్రక్రియలకు సంబంధించినదిగా జ్ఞానరంగం ఉంటుంది. జ్ఞానం, అవగాహన, వినియోగం, సంశ్లేషణ, మూల్యాంకనం అనేవి బ్లూమ్స్ ప్రతిపాదించిన జ్ఞానరంగంలోని అంశాలు. భాషాపరంగా భాషాజ్ఞానం, విషయజ్ఞానం, సాహిత్యజ్ఞానం దీనికి వర్తిస్తాయి.

**(అ) విషయజ్ఞానం :**

పాఠ్యవిషయానికి సంబంధించిన విషయజ్ఞానం. విషయజ్ఞానంలో పాఠ్యాంశం, కవి జీవితాదులు, పాఠానికి సంబంధించిన పూర్వకథలు ఉంటాయి.

**(ఆ) భాషాజ్ఞానం :**

భాషాబోధనలో విషయం కంటె భాషకే ఎక్కువ ప్రాధానత్య ఉంటుంది. భాషకు సంబంధించిన జ్ఞానం భాషాజ్ఞానం. పాఠంలోని కఠినపదాల అర్థాలు, సంధులు, సమాసాలు, ప్రకృతి వికృతులు, నానార్థాలు, పర్యాయపదాలు, వ్యుత్పత్యర్థాలు, ఇతర వచనాలు, ఇతర లింగాలు, వ్యతిరేక పదాలు, జాతీయాలు, సామెతలు మొదలైనవి ఉంటాయి.

**(ఇ) సాహిత్యజ్ఞానం :**

సాహిత్యానికి సంబంధించిన జ్ఞానం సాహిత్యజ్ఞానం. శైలి, అలంకారాలు, ఛందస్సు, రసాలు, రీతులు, కవికాలం, కవి ఆత్మీయత, సమకాలికులు, కవివ్రాసిన ఇతర గ్రంథాలు మొదలైన వాటికి సంబంధించిన జ్ఞానం సాహిత్యజ్ఞానం.

**7.3.5.2. భావావేశ రంగం** (Affective Domain) :

ఇది మానవ ప్రవృత్తి, ప్రవర్తన, ప్రతిస్పందనలకు చెందినది. వ్యక్తుల అలవాట్లు, ఆసక్తులు, అభిరుచులు, వైఖరులు, విలువలు, అనుభూతులు, ఉద్వేగాలు, ప్రశంసలు మొదలైన వాటిని వివరిస్తుంది. విద్యార్థికి ఏ భావావేశ లక్ష్యం ఎపుడు కలుగుతుందో ఊహించలేము. కొత్తభావాలు గ్రహించి అవగాహన చేసుకున్నపుడు విద్యార్థిలో కొన్ని అభిరుచులు, అనుభూతులు, వైఖరులు, నాయకత్వ లక్షణాలు, ప్రశంసాగుణం ఏర్పడవచ్చు. ఈ మూర్తిమత్వ లక్షణాలను అభివృద్ధి చేయడం ఈ రంగంలోని ముఖ్య విద్యాలక్ష్యం.

**7.3.5.3. మానసిక చలనాత్మక రంగం** (Psycho motor domain) :

ఈ రంగం యాంత్రిక (Mechanical), అనువర్తిత (Manipulative), సృజనాత్మకత (Creativity) నైపుణ్యాలకు సంబంధించినది. చేతిరాత, బొమ్మలు గీయడం, భాషణం, వ్యాయామం, ప్రయోగశాల, కృత్యాలు, సాంకేతిక విద్య మొదలైనవి మానసిక చలనాత్మక రంగానికి ఉదాహరణలు. పిల్లల్లోని సృజనాత్మక రచన, లేఖన నైపుణ్యాలను దీనికి ఉదాహరణగా చెప్పవచ్చు.

**7.3.5.4. పై మూడు రంగాల మధ్య సంబంధం :**

మానసికశాస్త్రం ప్రకారం జ్ఞానాత్మక, మానసిక చలనాత్మక, భావావేశ రంగాలకు మధ్య పరస్పర సంబంధం ఉంటుంది. ఉదాహరణకు జ్ఞానరంగం లక్ష్యమైన జ్ఞానం కలిగినపుడు భావావేశరంగంలోని అనుభూతి కలుగుతుంది. మానసిక చలనాత్మక నైపుణ్యాలు, సృజనాత్మకతకు దోహదపడతాయి. అందువల్ల ఏ విషయబోధనలోనైనా లక్ష్యాలను విశ్లేషించేటపుడు ఈ మూడు రంగాలకు సంబంధించిన లక్ష్యాలుగా వివరించాలి.

అభ్యసనానికి, అనుభవానికి ప్రతిఫలంగా విద్యార్థులలో కలిగే వివిధ ప్రవర్తనా మార్పులను అవగాహన చేసుకోవడానికి, జ్ఞానాత్మక, భావావేశ, మానసిక చలనాత్మక రంగాలుగా వేరుచేసి చెప్పుకుంటున్నామే కాని ఆయా రంగాల అబేద్యమైన గోడలున్నట్లు భావింపకూడదు. ఒకే అనుభవం విద్యార్థిజ్ఞానంలోను, భావాలలోను,

నైపుణ్యాలలోను ఏకకాలంలో మార్పును తీసుకురాగలదన్న విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలి. ఉదాహరణకు జ్ఞానరంగంలోని ధారణలో ఉంచుకోవడం, అవగాహన కలిగినపుడు భావావేశరంగంలోని ప్రతిస్పందన, అనుభూతి కలగడం వీటిని వేరువేరుగా చూడలేము.

బ్లూమ్స్ ప్రతిపాదించిన బోధనాలక్ష్యాల వర్గీకరణను అనుసరించి నూతన మూల్యాంకన విధానానికి అనుగుణంగా తెలుగు భాషాబోధన లక్ష్యాలను, స్పష్టీకరణలను నిర్ణయిస్తారు. ఉపాధ్యాయులు తాము బోధించే పాఠ్యాంశాల ఆధారంగా ఆయా లక్ష్యాలను సాధించాలి.

## 7.4. తరగతి వారీగా సాధించాల్సిన సామర్థ్యాలు

విద్యాహక్కుచట్టం 2009 వచ్చిన తర్వాత విద్యార్థి ఫలితాల సాధన పూర్తిగా మారిందని చెప్పవచ్చు. అప్పటివరకు కేవలం జ్ఞాపకశక్తి లేదా బట్టీవిధానం ఆధారంగా నడుస్తున్న విద్యావిధానంలో సమూల మార్పులు చోటు చేసుకున్నాయి. విద్యార్థి ఆలోచనావిదానం, తార్కికశక్తి, స్వేచ్ఛాయుత అభిప్రాయ వ్యక్తీకరణ, శాస్త్రీయ పరిశీలనా దృక్పథం నూతనత్వానికి పట్టం కట్టింది.

విద్యార్థి ఒక తరగతిని పూర్తి చేయడమంటే ఆ తరగతికి నిర్దేశించిన సామర్థ్యాలను సాధించడమని అర్థం. ఆయా తరగతులకు సంబంధించిన సామర్థ్యాల సాధన గురించి APSCF 2011 స్పష్టంగా నిర్దేశించింది. ఇందులో భాగంగానే విద్యార్థులు నిర్దేశిత సామర్థ్యాలను సాధించవలసి వుంటుంది. విద్యార్థి అభ్యసన ద్వారా ఆశించిన ఫలితమే సామర్థ్యం. నిర్ణీత సమయంలో సాధించాల్సిన సామర్థ్యాల అనుక్రమమే స్థాయి. ఉపాధ్యాయుడు పాఠ్యపుస్తకాలను కనీస అభ్యసన స్థాయిలను సాధించడానికి వినియోగించుకోవాలి. మూల్యాంకనం కూడా కనీస అభ్యసన స్థాయిని దృష్టిలో ఉంచుకుని నిర్వహించాలి. సామర్థ్యాధార ప్రతిపాదిక బోధను (Competency based teaching) చేపట్టాలి. భాషను బోధించేటపుడు అభ్యసన కృత్యాల ద్వారా విద్యార్థుల సామర్థ్యాలు అభివృద్ధి చెందుతాయి.

సాంప్రదాయకంగా భాషాభ్యసన ఫలితాలను కేవలం శ్రవణ, భాషణ, పఠన, లేఖన నైపుణ్యాల సాధనంగా పరిగణించారు. మరింత సమగ్ర దృక్పథంతో భాషా వినియోగ సందర్భాల్లో ఈ నాలుగు నైపుణ్యాలే కాక సన్నివేశానికి, సందర్భానికి అనుగుణమైన భాషోపయోగం అవసరమని గుర్తించారు. వీటి దృష్ట్యా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 2011లో విద్యా ప్రణాళికా చట్టం – భాష ఆధారపత్రం రూపొందించింది. దీనిలో పాఠశాలవిద్యలో విద్యార్థులు సాధించవలసిన అభ్యసన విద్యాప్రమాణాలు పొందుపరిచారు. వీటి ఆధారంగా విద్యార్థులు సాధించాల్సిన అభ్యసన ప్రమాణాలను నిర్ధారించారు. వీటినే అభ్యసనా సామర్థ్యాలు అని పేర్కొన్నారు.

పాఠ్య పుస్తకంలో ఒక పాఠం బోధించడం అంటే ఆయా సామర్థ్యాల సాధన పూర్తవడం అని అర్థం. ప్రతి పాఠంలో ఉండే అభ్యాసాలు, 'ఇవి చేయండి' అనే శీర్షికలో ఉంటాయి. ఈ అభ్యాసాలు వివిధ సామర్థ్యాల సాధనకు అనుకూలంగా ఉంటాయి. ఉపాధ్యాయుడు పాఠ్యబోధనలో ఎక్కువ సమయం సామర్థ్యాల సాధనకే వినియోగించ వలసి ఉంటుంది. విద్యార్థి తన సామర్థ్యాలను సాధించడంలో ఉపాధ్యాయుడు మార్గదర్శి కావాలి.

**7.4.1. ప్రాథమికోన్నత స్థాయిలో నిర్ధారించిన సామర్థ్యాలు :**

**(అ) వినడం – మాట్లాడడం :**

ఉపన్యాసాలు, వక్తృత్వాలు, వార్తలు మొదలైనవి విని, కళారూపాలను, చిన్న చిన్న సంఘటనలను చూసి అర్థం చేసుకోవడం, గ్రహించిన అంశం విచక్షణతో ఆలోచించడం, వర్ణించగలగడం అభిరుచిని పెంచుకోవడం.

**(ఆ) చదవడం – రాయడం :**

పద్యం, వచనం, గేయం, కవిత, వచన కవిత, కథ, ప్రాచీన గద్యం ఆధునిక వచనం మొదలైన ప్రక్రియలలోని

శైలీభేదాలను అవగాహనతో చదవడం, వ్యాసరూప అంశాలలోని కీలకాంశాలను, లేఖలను ప్రక్రియలలో ప్రచురితమైన వివిధ విషయాలను గుర్తించడం, చదవడం, అర్థంచేసుకుని ప్రతిస్పందించడం, విశ్లేషించడం, శీర్షికలను సూచించడం మొదలైనవి.

**(ఇ) స్వీయరచన :**

పాఠ్యాంశాలలోని సూచిత అంశాలకు సారాంశాలు, భావాలు రాయడం, అర్థం చేసుకున్న విషయాలను, తెలిసిన విషయాలను, లిఖిత రూపంలో చూపించడం, విరామ చిహ్నాలను, సంశ్లిష్ట, సంయుక్త వాక్యాలను సందర్భోచితంగా ఉపయోగించగలగడం, చిన్న చిన్న వాక్యాలను భాషాంతరీకరణ చేయగలగడం మొదలైనవి.

**(ఈ) పదజాలం :**

ప్రకృతి వికృతులను, జాతీయాలను, సామెతలను, మాండలిక భాష రూపాలను, గుర్తించడం, అవగాహన చేసుకోవడం, వినియోగించడం, నిఘంటువును ఉపయోగించగలగడం మొదలైనవి.

**(ఉ) ప్రశంస :**

ఇతర మతాలు, భాషలు, సంస్కృతులు సక్రమంగా అర్థం చేసుకోవడం, వాటిలోని మంచిని గుర్తించి అవగాహన చేసుకోవడం, గౌరవించడం, ప్రత్యేకావసరాలు గల పిల్లలు తమతో సమానమని గుర్తించి, వాళ్ళలోని గొప్ప అంశాలను ప్రశంసించి వారిని ప్రోత్సహించడం, నచ్చిన పదాలను, పంక్తులను ఎంపిక చేసి అవి ఎందుకు నచ్చాయో చెప్పగలగడం మొదలైనవి.

**(ఊ) సృజనాత్మకత :**

చదివిన, విన్న, చూపిన అంశాలను వర్ణించి చెప్పగలగడం, కథలను, గేయాలను పొడిగించడం, చిన్నచిన్న కవితలు, కథలు రాయడం, పాత్ర లక్షణాలను, హావభావాలను వర్ణించడం, ప్రకటనలు, నోటీసులు, ఆహ్వానపత్రికలు, శుభాకాంక్షలు తెలిపే కార్డులు మొదలైనవి తయారు చేయడం, బొమ్మలు గీయడం, నినాదాలు రాయడం మొదలైనవి.

**(ఋ) భాషాంశాలు :**

వర్ణమాలలోని అచ్చులు, హల్లులు, దిత్వ సంయుక్తాక్షరాలు, పరుష సరళాలు, అల్పప్రాణ మహాప్రాణులు, అనునాసికలు, అంతస్థాలు, ఊష్మాలు, భాషాభాగాలు, సమాపక అసమాపక క్రియలు, సంక్లిష్ట వాక్యాలు, సంధులు, సమాసాలు, ఛందో విశేషాలు, విభక్తులు, అలంకారిక విశేషాలు మొదలైన వాటిపట్ల అవగాహన కలిగించడం.

**7.4.2. ఆయా తరగతులు పూర్తయ్యేసరికి విద్యార్థులు సాధించవలసిన సామర్థ్యాలు :**

**7.4.2.1 వినడం – మాట్లాడడం :**

**6వ తరగతి :**

- ఉపన్యాసాలు, చర్చలు మొదలైన వాటిని విని అర్థం చేసుకోవాలి. చక్కగా చెప్పగలగాలి.
- ప్రసారమాధ్యమాలలోని వార్తలు, వివిధ కార్యక్రమాలపై మాట్లాడగలగాలి.
- వివిధ అంశాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించగలగాలి, చెప్పగలగాలి.

**7వ తరగతి :**

- పాత్రల మనోభావాలను గురించి, వాటిలోని భేదాలను గురించి చెప్పగలగాలి.
- చర్చలలో పాల్గొనాలి.
- ఉపన్యాసాలు ఇవ్వగలగాలి.
- వివిధ అంశాలపై తమ అభిప్రాయాన్ని స్పష్టంగా, స్వేచ్ఛగా చెప్పగలగాలి.

**9వ తరగతి :**

- వివిధ అంశాలపై వచ్చే ప్రసంగాలు విని అభిప్రాయం చెప్పగలగాలి.

- ప్రసారమాధ్యమాలలోని అంశాలపై ప్రతిస్పందించగలగాలి, అభిప్రాయం చెప్పగలగాలి.
- సంఘటలను సంక్షిప్తంగా చెప్పగలగాలి.
- చర్చలలో పాల్గొనాలి.
- పరిచిత సాహిత్య ప్రక్రియలపై తమ అభిప్రాయాలను చెప్పగలగాలి.

**7.4.2.2. చదడం – రాయడం :**

**6వ తరగతి :**

- ప్రాచీన ఆధునిక సాహిత్యానికి చెందిన పద్యాలు, గేయాలు, కథలు, గ్రాంథిక వాడుక భాషల్లోని రచనలను చదవగలగాలి.
- చక్కని వాడుక భాషలో లేఖలను రాయగలగాలి.
- పరిచితమైన సాహితీ ప్రక్రియలను ఆయా విధానాల్లో చదవగలగాలి.
- పత్రికలలోని వార్తలను ధారాళంగా చదవగలగాలి.
- తాత్పర్యాలు, సారాంశాలు, చూసిన, తెలిసిన విషయాలను గురించి రాయగలగాలి.
- విరామ చిహ్నాలను పాటిస్తూ రాయగలగాలి.

**7వ తరగతి :**

- ప్రాచీన భాషారూపాలను ఆధునిక వ్యవహారంతో రాయగలగాలి.
- వ్యాసాలు నిర్దేశిత లేదా పరిచిత సాహిత్య ప్రక్రియలను చదవగలగాలి. చదివిన వాటిపై తమ అభిప్రాయాలను రాయగలగాలి.
- ప్రసార మాధ్యమాలు పాఠ్యాంశాలపై అందజేసే కార్యక్రమాలపై అభిప్రాయాలను రాయగలగాలి.

**8వ తరగతి :**

- సంఘటనలను చక్కని శైలితో వర్ణనాత్మకంగా రాయగలగాలి.
- పత్రికలలో వచ్చిన వార్తలపై అభిప్రాయాలను, తార్కికతను వివరిస్తూ రాయగలగాలి.
- కవుల, పాత్రల, రచయితలను గురించి వ్యాసరూపంగా రాయగలగాలి.
- వివిధ లేఖారూపాలను రాయగలగాలి.

**7.4.2.3. స్వీయరచన :**

**6వ తరగతి :**

- పరిసరాల్లో జరిగిన సంఘటన, సన్నివేశాలను గురించి రాయగలగాలి.
- పాఠ్యాంశాలలో నచ్చిన అంశాలను గురించి రాయగలగాలి.
- ప్రసార సాధనాల్లో తనకు నచ్చిన కార్యక్రమాలను గురించి వివరిస్తూ రాయగలగాలి.

**7వ తరగతి :**

- పాఠ్యపుస్తకేతర గ్రాంథిక లేదా ఆధునిక వ్యవహారేతర రచనలను వ్యవహార రూపంలో రాయగలగాలి.
- ఇచ్చిన అంశాలపై వ్యాసాలు రాయగలగాలి.
- స్థానిక కళారూపాలను చూసి లేదా పండుగ విధానాలను గురించి తమ అభిప్రాయాలను రాయగలగాలి.

**8వ తరగతి :**

- పాఠశాల వాతావరణాన్ని వివరిస్తూ వర్ణనాత్మకంగా రాయగలగడం.
- సమాజంలో తమకు నచ్చిన లేదా నచ్చని అంశాల గురించి తార్కికతతో రాయగలగాలి.
- వివిధ అంశాలను సంక్షిప్తం చేసి రాయగలగాలి.

–	స్వీయ ఆలోచనలతో కూడిన అంశాలను వివరిస్తూ రాయగలగాలి.

**7.4.2.4. పదజాలం :**

6,7,8 తరగతులకు గాను పదజాలాన్ని ఆయా పాఠ్య పుస్తకాలలోని పదజాలాలను సంపూర్ణంగా అభ్యసనం చేయాలి. ఆయా సందర్భాన్ని, సన్నివేశాన్ని బట్టి ఆయా పదజాల వినియోగాన్ని విద్యార్థులు సమర్ధవంతంగా చేయగలగాలి.

–	ప్రకృతి వికృతులను గుర్తించగలగడం.
–	జాతీయాలు, సామెతలను దైనందిన వ్యవహారంలో వినియోగించగలగాలి.
–	పదాల అర్థాలను తెలుసుకోవడం, అవసరమైన చోట నిఘంటువును ఉపయోగించగలగాలి.
–	పర్యాయపదాలు, నానార్థాలు, వ్యతిరేకపదాలు గుర్తించగలగడం, వినియోగించగలగాలి.
–	సంధి, సమాస పదాలను గుర్తించడం, సమయోచితంగా వాడగలగాలి.
–	మాండలికాలను గుర్తించగలగడం, సమానార్థక పదాలను తెలుసుకోగలగాలి. సమయోచితంగా వినియోగించగలగాలి.
–	పదజాలానికి చెందిన పజిల్స్, భాషాక్రీడలను సాధించగలగాలి.
–	పదాలను సొంతవాక్యాల్లో ఉపయోగించగలగాలి.

**7.4.2.5. సృజనాత్మకత :**

**6వ తరగతి :**

–	తెలిసిన, చదివిన, విన్న అంశాన్ని వర్ణించి చెప్పగలగాలి.
–	పాత్రపోషణ చేయడం, ఏకపాత్రాభినయం చేయగలగాలి.
–	స్వీయ అనుభవాలను చెప్పగలగడం / రాయగలగాలి.
–	లేఖలు / ప్రతిలేఖలు రాయగలగాలి.

**7వ తరగతి :**

–	అనుభవాలను వర్ణిస్తూ చెప్పగలగాలి, రాయగలగాలి.
–	సూచిత పదాల ఆధారంగా కథలు అల్లగలగాలి.
–	చిన్న చిన్న ప్రకటనలు, నోటీసులు, శుభాకాంక్షలు తెలిపే కార్డులు తయారు చేయగలగాలి.

**8వ తరగతి :**

–	ప్రాస పదాలు, తెలిసిన పదాలు ఉపయోగించి చిన్నచిన్న కవితలు రాయగలగాలి.
–	చదివిన అంశానికి అనుభవాత్మక చిత్రాన్ని గీయగలగాలి.
–	చిన్నచిన్న నాటికలు, సంభాషణలు రాయగలగాలి.
–	దినచర్య (డైరీ) చక్కగా రాయగలగాలి.
–	ఆత్మకథలను రాయగలగాలి.
–	చదివిన, చూసిన, విన్న సన్నివేశాన్ని వర్ణనాత్మకంగా మలచగలగాలి.
–	మహనీయుల సేవలను గురించి వివిధ ప్రక్రియలలో రాయగలగాలి.

**7.4.2.6 ప్రశంస :**

6,7,8 తరగతుల విద్యార్థులు వారివారి పాఠ్యాంశాలలోని ప్రశంసాకృతులను సమర్ధవంతంగా చేయగలగాలి. ప్రశంస అనేది కుల, మత, జాతి, వర్ణ బేధాలకు తావులేకుండా ఉండాలి.

–	ఇతర భాషలకు చెందిన గేయాలు, పాటలు విని అర్థం చేసుకుని ప్రశంసించగలగాలి.

- ఇతర మతాలు పండుగలు / ఉత్సవాలలో పాల్గొనడం, వాటిని ప్రశంసించగలగాలి.
- పద్యాలు, గేయాలు మొదలైనవి చదివి రసానుభూతిని పొంది ప్రశంసించగలగాలి.
- ప్రత్యేక అవసరాలు గల పిల్లల్లోని గొప్పదనాన్ని, బాలికల్లోని నైపుణ్యాలను గుర్తించగలగాలి.
- ఇతరుల అవసరాలను గుర్తించి సహాయ సహకారాలను అందించగలగాలి.

**7.4.2.7. భాషాంశాలు :**

6,7,8 తరగతులు పూర్తయ్యేసరికి విద్యార్థులకు భాషాంశాలపై చక్కని అవగాహన కలిగిఉండాలి.

- వాక్య రకాలు తెలిసిఉండాలి.
- వాక్యాల్లో విభక్తులు, ఉపవిభక్తులు గుర్తించగలగాలి.
- బహువచన పదాలు, బహువచన రూపాలు ఏర్పడే విధానాలను గుర్తించగలగాలి.
- సంధులు, సమాసాలు గుర్తించగలగాలి, సూత్రాలను అన్వయించ గలగాలి.
- వ్యతిరేకార్థక పదాలు ఏర్పడే విధానాలను సందర్భోచితంగా గుర్తించగలగాలి.
- అలంకారిక వర్ణనలను గుర్తించగలగాలి.
- ఛందో విశేషాలను గుర్తించడం, మాత్రాగుణాలను ఉపయోగించి రాయగలగడం చేయడాలి.

విద్యార్థి నిర్దేశిత సామర్థ్యాలను సాధించడానికి కావలసిన అవకాశాలను అందజేయడం ఉపాధ్యాయులుగా మన కర్తవ్యం. మనమంతా ఈ కర్తవ్య నిర్వహణలో విజయవంతమయ్యే పాత్ర పోషించి విద్యార్థులను భాషా జిజ్ఞాసులుగా తీర్చిదిద్దగలమని ఆశిద్దాం...!

## 7.5 భాషా బోధన వ్యూహాలు

ఒకప్పుడు బోధనాపద్ధతులు అనేవాళ్ళం. ఇప్పుడు బోధనావ్యూహాలని ఉపయోగిస్తున్నాం. బోధనాశాస్త్ర పరంగా వీటిమధ్య వ్యత్యాసాలున్నాయి. ఆశించిన ఫలితాలను ఖచ్చితంగా, సమర్థవంతంగా సాధించడానికి ఒక క్రమంలో నిర్మాణాత్మకంగా అమలు జరిపే విధానాలను, కృత్యాలను కలిపితే పద్ధతి అవుతుంది. పద్ధతి అంటే కాలితాకిడి అని అర్థం. అంటే మెట్లు ఎక్కుతున్నవారు ఒక్కోమెట్టు మీద కాలుపెట్టి పై మెట్టు ఎక్కడానికి ఏవిధంగా ప్రయత్నిస్తారో అలాగే విద్యార్థుల అభ్యసనాన్ని సమర్థం చేసి వారు పై మెట్టుకు చేరడానికి ఉపాధ్యాయులు అనుసరించేది పద్ధతి. పద్ధతిని ఆగ్లంలో Method అని, Approach అని, Strategy అని పిలుస్తారు. అయితే Strategy అనే పదానికి వ్యూహం అని అర్థం ఉంది. వ్యూహం గతిశీలకమయినది. అవసరాన్ని బట్టి మార్పు చేసుకునే అవకాశం కలిగిస్తుంది. బోధన, అభ్యసనం అనే భావనలు విద్యాప్రక్రియకు ప్రతిపాదికలు. ఉపాధ్యాయుడు పాఠ్యపుస్తకంలోని వివిధ అంశాలను పిల్లలకు నేర్పే బోధనా విధానాలే పద్ధతులు లేదా వ్యూహాలు. ఈ పద్ధతులు, వ్యూహాల్లో కాలానుగుణంగా మార్పులు, చేర్పులు జరుగుతున్నాయి.

**7.5.1. ప్రాచీన భారతీయ విద్యాపద్ధతి :**

ప్రాచీన భారతీయ సంస్కృతిని రక్షిస్తూ, తరువాతి తరాలవారికి దానిని అందిస్తూ మనిషికి ఇహలోకంలో జీవయాత్రకు తగిన శిక్షణను ఇవ్వడం, పారలౌకికమైన మోక్షప్రాప్తికి మార్గం చూపడం అనేవి ప్రాచీన భారతీయ విద్యావిధాన ఉద్దేశాలు.

ప్రాచీనకాలంలో వైదిక పురాణ యుగాలలో విద్య అందరికీ అందుబాటులో లేదు. ఆరోజుల్లో ఆధ్యాత్మిక విద్యకు ప్రాధాన్యత ఎక్కువ. వైదిక విద్యను బ్రాహ్మణులకే బోధించేవారు. రాజకుమారులను ధర్మశాస్త్రాలతో బాటు రాజనీతి, విలువిద్య మొదలైన క్షత్రియోచితమైన విద్యలను నేర్పేవారు. మిగిలిన ఎవరికీ విద్య నేర్చుకునే

అవకాశాలు ఉండేవి కావు. 5 సం॥ నిండిన తర్వాత గురుకులాలలో చేరిన విద్యార్థులు విద్యాభ్యాసం పూర్తయ్యేదాకా బ్రహ్మచర్యం పాటించేవారు. వారికి గురువే సర్వం. గురువే నిర్ణయాధికారి. గురువు మాటకు తిరుగుండేది కాదు. గురుముఖతః విద్యాభ్యాసం కొనసాగేది. ప్రాచీనవిద్య పండితులైన ఉపాధ్యాయుల ఆధీనంలో ఉండేది. వారు వేదాలు, వ్యాకరణం, సాహిత్యం, దర్శనాలు, ధర్మశాస్త్ర పురాణాదులను విద్యార్థులకు ఉచితంగా అన్నవస్త్రాదులను ఇస్తూ బోధించేవారు. చక్రవర్తులు దానమిచ్చిన భూములు వారికి తోడ్పడేవి.

గురువు తాను అందుబాటులో లేనపుడు తాను నిర్వహించవలసిన బాధ్యతలు కొనసాగటానికి గాను సమర్థులైన శిష్యులను ఉపగురువులుగా (Monitary System) నియమించేవారు. అతివృష్టి, గ్రహణం, పౌర్ణమి, అమావాస్య, పండుగలు, యుద్ధాలు మొదలైన కారణాలుంటేనే పిల్లలు సెలవులను అనుభవించేవారు. విద్య పూర్తయ్యాక 'గురుదక్షిణ' చెల్లించుకోవాల్సిన సాంప్రదాయాన్ని శిష్యులు పాటించేవారు.

ప్రాచీనకాలంలోని బోధనాభాష సంస్కృతం. ఉన్నత విద్యాప్రమాణ గ్రంథాలు సంస్కృత భాషలోనే వుండేవి. మొదట విద్య మౌఖికంగా అభ్యసించేవారు. గురువునోట విని శిష్యులు రెండు లేదా మూడుసార్లు ఉచ్చరించి ధారణ చేసేవారు. విద్యార్థుల అభిరుచిని, వారి పాత్రను పట్టించుకోకుండా విద్యాబోధన జరుగుతుండేది. క్రమశిక్షణ నియమాలు చాలా కఠినంగా ఉండేవి. గురుశిష్య సంబంధం ఆదర్శవంతంగా ఉండేది. అక్షరాలు నేర్చుకునే విద్యార్థులు ఇసుకలోను, మట్టిలోను వ్రేళ్ళతో గీసేవారు. తర్వాత కాలానికి పుల్లలను రంగులో ముంచి చెక్కముక్కలపై రాసేవారు.

అనంతర కాలంలో బౌద్ధ, జైన మతాల వ్యాప్తితో వర్ణ వ్యవస్థ సడలింది. సాంఘిక జీవన దృక్పథంలో మార్పు వచ్చింది. విద్య అందరికీ అందుబాటులోకి వచ్చింది. బౌద్ధ ఆరామాలు,దేవాలయాలు, మఠాలు, వీధి బడులు, మసీదులు, విద్యావ్యాప్తికి దోహదం చేశాయి. పురోహితులు, ముల్లాలు అధ్యాపక బాధ్యతను స్వీకరించారు. భాషలు గణితం నేర్పించడం, కావ్య పురాణాల్లోని కొన్ని అంశాలను కంఠస్థం చేయించడంతో విద్య పూర్తయ్యేది.

బ్రిటీష్ వారి పాలన నాటికి వీధిబడుల రూపం మారింది. ప్రభుత్వ గ్రాంటు బడులు, పాఠశాలలు వచ్చాయి. అచ్చుయంత్రం వాడుకలోకి వచ్చింది. పలక, పాఠ్యపుస్తకాలు, పరీక్షలు, తనిఖీ అధికారులతో సరికొత్త విద్యావ్యవస్థ రూపుదిద్దుకుంది. కాలక్రమేణా రేఖాగణితం, ఖగోళం, సాహిత్యం, లలితకళలు, వివిధ భాషలు నేర్పడం ప్రారంభించారు. బోధన ఉపాధ్యాయ కేంద్రంగా ఉండేది.

**7.5.2. ఆధునిక భాషాబోధన పద్ధతులు :**

విద్యాతాత్విక భావాలను, మనో వైజ్ఞానిక సిద్ధాంతాలను, సామాజిక అవసరాలను, విద్యార్థి అవసరాలను పరిగణనలోకి తీసుకుని విద్యావేత్తలు బోధనకు కొన్ని ముఖ్యసూత్రాలను రూపొందించారు. అవి.

1. తెలిసిన విషయం నుండి తెలియని విషయానికి బోధన సాగాలి. (Known to Unknown)
2. బోధన తేలికైన విషయం నుండి కఠినమైన విషయానికి దారి తీయాలి. (Easy to difficult)
3. బోధన మూర్త విషయం నుండి అమూర్త విషయానికి పయనించాలి. (Concrete to abstract)
4. బోధన ఆసక్తికరమైన విషయాల నుండి శాస్త్రీయ దృక్పథం దిశగా ఆలోచింపచేయాలి. (Psychological to logical)
5. బోధన విశ్లేషణాంశాల నుంచి సమన్వయాంశాల వైపు దృష్టి సారించాలి. (Analysis to Synthesis)
6. బోధన సంపూర్ణత్వం నుండి వివిధ భాగాలవైపు ఆలోచింపజేయాలి. (Whole to parts)
7. పైసూత్రాల ఆధారంగా ఎన్నో బోధనా పద్ధతులు రూపుదిద్దుకున్నాయి.

**7.5.2.1. క్రీడాపద్ధతి :**

క్రీడ అంటే ఆట. పిల్లలకు ఆటలంటే చాలా ఇష్టం. క్రీడలలో బహిర్గతమయ్యే విద్యార్థుల మానసికశక్తిని

వినియోగించుకుని విద్యను బోధించే పద్ధతి క్రీడాపద్ధతి. కాల్డ్‌వెల్‌కుక్ అనే విద్యావేత్త ఈ పద్ధతిని ప్రతిపాదించాడు. ఆయన అనుభవాల ఆధారంగా పెర్సినన్, గ్రిఫిత్, ఫ్రెడరిక్ ప్రొబెల్, మాంటిసోరి మొదలైనవారు విద్యారంగంలో క్రీడాపద్ధతికి విశేష ప్రాచుర్యాన్ని కల్పించారు. గల్లిక్ అభిప్రాయం ప్రకారం వ్యక్తి ఎలాంటి ఒత్తిడి లేకుండా, ఇష్టపూర్వకంగా, ఉల్లాసంగా నిర్వహించే ఏ కృత్యమైనా క్రీడ అవుతుంది.

**క్రీడాపద్ధతి వినియోగం :**

- భాషాబోధనలో నైపుణ్యాల సాధనకోసం క్రీడాపద్ధతిని 34 వినియోగించుకోవచ్చు. నిజానికి భాషాభ్యసమే ఒక క్రీడ.
- సంభాషణా వ్యాసాంగాలు, నాటకీకరణ పాఠాలు, వాక్య భేదాలు మొదలైనవి క్రీడాపద్ధతిలో చేయించవచ్చు. సహపాఠ్య కార్యక్రమాల నిర్వహణలో పద్య, గేయ పఠనాలు, వక్తృత్వం, వ్యాసరచన, అంత్యాక్షరి, క్విజ్ మొదలైనవి నిర్వహించడంలో ఈ పద్ధతిని వినియోగించవచ్చు.
- పదనిర్మాణం, పద సేకరణ, అంత్యాక్షరి, పద్యపూరణ మొదలైనవి చేయించవచ్చు.
- వాక్యనిర్మాణం, ఖాళీలు పూరించడం, వాక్య పరివర్తనం, పొడుపుకథలు, జాతీయాలు, సామెతలు, సంభాషణ రచనలు, లేఖా రచనలు, కథారచనలు, ఏకపాత్రాభినయాలు, కథలు చెప్పడం, వక్తృత్వం, ఉపన్యాసం, క్విజ్ మొదలైనవి నిర్వహించేటపుడు క్రీడాపద్ధతిని వినియోగించుకోవచ్చు.

**ప్రయోజనాలు :**

1. ఆటలు శారీరక, మానసిక వికాసానికి దోహదపడతాయి.
2. సంపూర్ణ మూర్తిమత్వ వికాసానికి దోహదపడతాయి.
3. విద్యార్థులలో సృజనాత్మకత పెరుగుతుంది.
4. అవధానం, గ్రహణశక్తి, వివేచన, సహనం, సమయస్ఫూర్తి పెంపొందుతాయి.
5. సహృదయత, సానుభూతి, సహకార భావన, ఆత్మవిశ్వాసం, ఆత్మనిగ్రహం పెంపొందుతాయి.
6. హాస్యపూరిత ప్రసంగధోరణి, సంభాషణా చాతుర్యం, నటనాకౌశలం అలవడతాయి.

**పరిమితులు :**

1. అన్ని విషయాలను ఈ పద్ధతిలో బోధించడానికి వీలుపడదు.
2. నేర్చుకోవడం కంటే ఆనందానికే ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది.
3. తరగతిగదిలో క్రమశిక్షణ కొరవడే అవకాశం ఉంది.

**7.5.2.2. మాంటిసోరి పద్ధతి :**

ఇటలీదేశంలోని మేరియా మాంటిస్సోరి అనే మానసిక వైద్యురాలు ప్రారంభించిన పద్ధతి ఇది. పిల్లలకు స్వేచ్ఛాపూరిత వాతావరణంలో తగిన శిక్షణ నివ్వడం, వారి శారీరక అభివృద్ధితో పాటు సాంఘిక జీవనానికి తగిన విజ్ఞానాన్ని కల్పించడం ఈ పద్ధతి ఉద్దేశాలు. ఈ పద్ధతిలో రకరకాల ఉపకరణాలు విద్యార్థులకు అందుబాటులో ఉంచుతారు. పిల్లలు ఎవరికి నచ్చిన వస్తువులు వారు వినియోగించుకోవచ్చు. ఉపకరణాలను వినియోగించు కునేటప్పుడు పొరపాటు జరిగితే పిల్లలు తమంతట తాము సరిదిద్దుకునే వీలు కలిగి ఉంటాయి. దీనిని నిర్వహించడానికి ఒక దర్శకురాలు, డాక్టరు, పర్యవేక్షకురాలు ఉంటారు. ప్రపంచవ్యాప్తంగా మాంటిస్సోరి పద్ధతిలో దాదాపు 8000 పాఠశాలలు నడుస్తున్నాయి. 'అసోసియేషన్ మాంటిస్సోరి ఇంటర్నేషనల్ (AMI)' విశ్వవ్యాప్తంగా ఆమె భావనలను ఈనాటికి వ్యాప్తి చేస్తోంది.

**మాంటిస్సోరి పద్ధతి వినియోగం :**

1. వస్తువుల పేర్లు, స్వభావం, వినియోగం గురించి చెప్పేటప్పుడు ఈ పద్ధతిని ఉపయోగించవచ్చు.

2. శరీర శుభ్రత, దుస్తులు, పుస్తకాలను సక్రమంగా ఉంచుకోవడం అలవాటవుతుంది.

3. పాఠశాల ఆవరణలో రకరకాల మొక్కలు పెంచడానికి, ఆవరణ పరిశుభ్రతకు ఈ పద్ధతి సహాయపడుతుంది.

4. ఈ పద్ధతి క్రీడాపద్ధతిలోని క్రీడాసూత్రం ప్రాదిపదికగా రూపొందించిన పద్ధతి.

**ప్రయోజనాలు :**

1. పిల్లల్లో జ్ఞానం పెరుగుతుంది.
2. స్వయంకృషి అలవాటవుతుంది.
3. ఆత్మవిశ్వాసం పెంపొందుతుంది.
4. తమదోషాలు తెలుసుకుని తామే సవరించుకునే అవకాశం ఉంటుంది.
5. నేర్చిన విషయం ఎక్కువకాలం గుర్తుంటుంది.
6. మూర్తిమత్వం వికసిస్తుంది.

**పరిమితులు :**

1. కాలపరిమితి ఉండదు
2. ఉపకరణాలు ఎక్కువగా అవసరమౌతాయి.
3. కాలం, ధనం విపరీతంగా ఖర్చు అవుతుంది.

**7.5.2.3. కిండర్ గార్డెన్ పద్ధతి :**

కిండర్, గార్డెన్ అనే రెండు జర్మన్ పదాలు కలిసి 'కిండర్ గార్డెన్' అనే పదం ఏర్పడింది. దీనికి శిశువుల తోట అని అర్థం. దీన్నే బాలోద్యాన పద్ధతి అని కూడా అంటారు. ఈ పద్ధతిని ప్రతిపాదించి అమలు చేసిన విద్యావేత్త ఫ్రొబెల్. తోటలో లేత మొక్కలను పెంచినట్లే శిశువులను కూడా జాగ్రత్తగా తీర్చిదిద్దాలనే సిద్ధాంతం ఈ పద్ధతికి ఆధారం. తోటమాలి మొక్కల పెరుగుదలకు నిరంతరం ఎలా శ్రమిస్తాడో అదేవిధంగా ఉపాధ్యాయుడు తన సమగ్రకృషి ద్వారా, సున్నితమైన పద్ధతుల ద్వారా సుకుమారమైన పిల్లలకు అనుకూలమైన రీతిలో ఆటపాటల ద్వారా, కృత్యాల ద్వారా విద్యనందించి వారి అభివృద్ధికి దోహదం చేయడమే ఈ పద్ధతి ముఖ్యఉద్దేశం. దీని నిర్వహణ విధానం మాంటిస్సోరి పద్ధతి మాదిరిగానే ఉన్నా ఈ పద్ధతిలో కాలవ్యయం, ధనవ్యయం తక్కువ. క్రీడాపద్ధతిలోని క్రీడాసూత్రం ప్రాతిపదికగా రూపకల్పన చేయబడ్డదే ఈ పద్ధతి. అందువల్ల పాఠశాలలో సమిష్టిగా చేసే కొన్ని కార్యక్రమాలలో ఈ పద్ధతిని వినియోగించవచ్చు.

**7.5.2.4. నియోజన పద్ధతి :**

'మిస్ హెలెన్ పార్క్ హార్స్ట్' నియోజన పద్ధతిని ప్రతిపాదించింది. అమెరికాలోని డాల్టన్ నగరంలో తొలిసారిగా ఈ పద్ధతిని అమలు చేయడం వలన దీనికి 'డాల్టన్ పద్ధతి' అని పేరు వచ్చింది. ఈ పద్ధతిలో నియోజనాలివ్వడం (Assignment) అతిముఖ్యమైన అంశం. ఈ నియోజనాలు పూర్తి చేయడం ద్వారా పిల్లలు నేర్చుకుంటారు. విద్యార్థుల స్వయం అభ్యసనం (Self Learning). ఇందులో మూలసూత్రం. ఉపాధ్యాయుడు పాఠ్యపుస్తకంలోని పాఠాలన్నింటిని నియోజనాలుగా సిద్ధం చేసి విద్యార్థులకు ఇస్తాడు. ఏ విద్యార్థి ఎప్పుడు నియోజనం పూర్తి చేసి చూపిస్తాడో అప్పుడు ఉపాధ్యాయుడు ఆ విద్యార్థికి రెండో నియోజనం ఇస్తాడు. విద్యార్థుల సామర్థ్యాన్ని (వైయుక్తిక భేదాన్ని) అనుసరించి అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులు వారికి నియోజనాలు ఇస్తారు. పిల్లలు వారివారి అభ్యసన వేగానికి (Rate of Learing) తగినట్లు నియోజనాలను పూర్తి చేస్తారు.

**వినియోగం :**

భాషలో లేఖన నైపుణ్యాన్ని పెంపొందించటానికి, వ్యాసరచన నేర్పడానికి, విస్తార పఠనాన్ని, మౌన పఠనాన్ని పెంపొందించటానికి నియోజనాలు తోడ్పడతాయి. ఈ నియోజనాలను విద్యార్థుల స్థాయిని బట్టి ఇవ్వాలి.

**ప్రయోజనాలు :**

1. విద్యార్థుల స్వయం అభ్యసనానికి ఉపయోగపడుతుంది.
2. వైయుక్తిక భేదాలకు, విద్యార్థుల అభ్యసన వేగానికి తగిన గుర్తింపు లభిస్తుంది.
3. పఠన సామర్థ్యం పెరుగుతుంది.
4. భాషానైపుణ్యాలు వృద్ధి చెందుతాయి.
5. చదవడం అలవాటుగా మారుతుంది.

**7.5.2.5. పర్యవేక్షణాధ్యయన పద్ధతి :**

విద్యార్థులు ఉపాధ్యాయుని పర్యవేక్షణలో అధ్యయనం చేసే విధానాన్ని పర్యవేక్షణాధ్యయన పద్ధతి అంటారు. విద్యార్థులకు కలిగిన అనుమానాలను గుర్తించిన ఉపాధ్యాయుడు తగిన సూచనలు చేస్తాడు. నేర్చుకోవడంలో వారికి సహకరిస్తాడు. విద్యార్థులు వెనుకబడియున్న అంశాలను దృష్టిలో పెట్టుకుని ఆయా బలహీనతలను తొలగించడానికి ఈ పద్ధతి బాగా ఉపయోగిస్తుంది. ఈ అధ్యయనం వాస్తవానికి ఒక బోధన పద్ధతి కాదు. స్వయం అధ్యయనాన్ని ప్రోత్సహించే విధానం.

**ప్రయోజనాలు :**

1. ఇంటిదగ్గర చదువుకోవడానికి సరైన పరిస్థితులు లేని విద్యార్థులకు ఈ పద్ధతి ఉపయోగిస్తుంది.
2. నియోజనాలను ఉపాధ్యాయుని పర్యవేక్షణలో పూర్తి చేయించవచ్చును.
3. చదువుతున్నప్పుడు కలిగే అనుమానాలను విద్యార్థులు ఎప్పటికప్పుడు తీర్చుకోవచ్చు.
4. విద్యార్థులచేత ఈ పద్ధతిలో గద్యభాగాన్ని చదివించి స్వయం అధ్యయనాన్ని అలవాటు చేయవచ్చు.
5. కథల పుస్తకాలు, వ్యాసాలు చదించవచ్చు.

**7.5.2.6. లోపనివారణ బోధన :**

విద్యార్థులు తమ అభ్యసనంతో మౌఖిక రూపంలో కాని, లిఖిత రూపంలోకాని చేసిన దోషాలను ఉపాధ్యాయుడు గుర్తించి, ఆ దోషాల నివారణకు చేసే బోధననే లోపనివారణ బోధన, దోషనివారణ బోధన లేదా “రెమిడియల్ టీచింగ్” అంటారు.

**వినియోగం :**

విద్యార్థులు తరచుగా చేసే అభ్యసన దోషాలను గుర్తించి, ఆ దోషాలను ఎప్పటికప్పుడు సవరించాలి.

నికషలు నిర్వహించిన అనంతరంగాని, బోధనలో భాగంగాగాని ఈ బోధన నిర్వహించవచ్చు. పర్యవేక్షణాత్మక అధ్యయనంలో భాగంగా కూడా ఈ బోధన నిర్వహించవచ్చు.

**ప్రయోజనాలు :**

1. విద్యార్థులు తమ అభ్యసన దోషాలను సవరించుకోగలుగుతారు.
2. మెరుగైన అభ్యసనాన్ని పొందుతారు.

**7.5.2.7. కృత్యాధార పద్ధతి :**

కృత్యం అంటే పని. పిల్లలు నేర్చుకోవడానికి ఆలోచిస్తూ చేసే పనినే కృత్యంగా చెప్పవచ్చు. విద్యార్థుల చేత వివిధ కృత్యాలు చేయిస్తూ వివిధ అంశాలు నేర్చుకునేలా చేయడాన్ని కృత్యాధార పద్ధతి అంటారు.

**మంచి కృత్యాల లక్షణాలు :**

- ఆనందదాయకంగా వుండాలి.
- లక్ష్యాత్మకమై ఉండాలి.
- ఆలోచింపజేసేలా ఉండాలి.

- ఆసక్తికరంగా ఉండాలి
- తమంతటతాము పాల్గొనేలా ఉండాలి.
- ఒత్తిడి, భయం లేకుండా ఉండాలి.
- పిల్లల స్థాయికి తగినవిగా ఉండాలి.
- కొనసాగించటానికి వీలైనవిగా ఉండాలి.
- వివిధ విషయాల్లో ఉపయోగపడేవిగా ఉండాలి.
- బహుళ తరగతి బోధనలో ఉపయోగపడేలా ఉండాలి.
- భాషా నైపుణ్యాల సాధనకు తోడ్పడేలా ఉండాలి.
- మార్పు చేర్పులకు వీలుగా ఉండాలి.
- పిల్లలందరూ పాల్గొనేలా ఉండాలి.

ఈ పద్ధతి శిశు కేంద్రీకృత విధానానికి అద్దం పడుతుంది. విద్యామనోవైజ్ఞానిక సూత్రాలకు అనుగుణంగా ఈ పద్ధతి రూపొందించబడింది. ఈ పద్ధతిలో కృత్యకోశాలు (Activity Packs) తయారుచేయడం చాలా ముఖ్యమైన ప్రక్రియ. ఉపాధ్యాయుడు తాను చెప్పబోయే పాఠానికి ముందుగానే తయారుచేసుకున్న సరంజామానంతటినీ (చార్టులు, నమూనాలు మొదలైనవి) కృత్యకోశం అంటారు. దీనిని ప్రతి సంవత్సరం ఆ పాఠం చెప్పినప్పుడల్లా అవసరమైన మార్పు చేర్పులతో ఉపయోగించుకోవచ్చు.

**7.5.3. ప్రక్రియలు :**

పద్య, గద్య ప్రక్రియలకు ఉపయోగించే వివిధ బోధనా పద్ధతులను గురించి తెలుసుకుందాం. విద్యార్థి రసానుభూతిని పొందడం పద్య లక్ష్యమయితే, విస్తృతమైన భాషా పరిజ్ఞానాన్ని అందించడం గద్య లక్ష్యం.

**7.5.3.1. పద్యబోధన :**

ప్రపంచంలో ఏ సాహిత్యంలోనయినా గద్యం కన్న పద్యం/పాట ముందు పుట్టింది. ముద్రణా సౌకర్యం లేని కాలంలో భావితరాలకు మౌఖికంగా భావాలను, అనుభూతులను, అనుభవాలను అందించడానికి పద్యం/పాట అనుకూలం కావడం చేత ఇది చాలా ప్రజాదరణ పొందింది. భావాలను ప్రభావవంతంగా వ్యక్తం చేయడానికి, లయాత్మకంగా పొందడానికి, జ్ఞాపకం పెట్టుకోవడానికి, రసానుభూతిని పొందడానికి పద్యం/పాట వీలు కల్పించడమే దానికి కారణం. విద్యార్థులందరూ వాటిని విని ఆనందం పొందాలి. విషయంపట్ల అవగాహన పొందాలి. సొంతమాటల్లో వ్యక్తీకరించగలగాలి. సాహిత్యం పట్ల అభిరుచి కలిగించడం, సొంతంగా పద్యాలు రాయడాన్ని ప్రోత్సహించడం, విమర్శ చేయించడం మొదలైనవి విద్యార్థులలో పెంపొందింపజేయాలి. పద్యం/పాట/గేయం ఈ పద్ధతిలోనే బోధించాలి అనే నియమం లేదు. తరగతిగదిలోని పిల్లల మానసిక స్థాయిని బట్టి బోధించడం మంచిది. పద్యబోధనకు ప్రతిపదార్థ పద్ధతి, తాత్పర్య పద్ధతి, పూర్ణపద్ధతి, ఖండ పద్ధతి, పఠనపద్ధతి, ప్రశ్నోత్తర పద్ధతి, ప్రశంసా పద్ధతి మొదలైన పద్ధతులున్నా ప్రధానంగా రెండు పద్దతులను ఉపయోగించి బోధించవచ్చు. అవి (1)పూర్ణపద్ధతి (2) ఖండ పద్ధతి.

**7.5.3.1.1. పూర్ణపద్ధతి :**

పద్యాన్ని మొత్తంగా గ్రహించి బోధించడమే పూర్ణపద్ధతి. అంటే మొత్తం పద్యాన్ని ఏకాంశంగా తీసుకుని దాని భావాన్ని తెలియజేస్తూ, పద్యంలోని ప్రతి చిన్న విషయాన్ని సంపూర్ణంగా బోధించాలి. కథా ప్రాధాన్యం గల పద్యాలు బోధించేటప్పుడు భావాన్ని ఒక యూనిట్‌గా తీసుకోవడ సమంజసం. అన్ని పద్యాలను ఒకసారి శ్రావ్యంగా చదివి విన్పించి సారాంశాన్ని విద్యార్థుల దృష్టికి తెచ్చి తర్వాత ఒక్కొక్క పద్యంలోని అంశాన్ని వివరించడం చేయాలి.

పూర్ణ పద్ధతిలో ప్రతిపదానికి అర్థం చెప్పడం కాకుండా భావానికి, సౌందర్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి.

అయితే కఠిన పదాలకు అర్థాలను పాఠ్యపుస్తకం చివరన ఉన్న అర్థాలనుంచి కాని, నిఘంటువు ద్వారా కాని తెలియజేయాలి. వీటిని ప్రత్యక్షంగా చెప్పకుండా సొంతవాక్యాలద్వారా విద్యార్థుల నుంచే రాబట్టాలి.

పద్యం/గేయం/పాటలోని శబ్ద చమత్కారాన్ని, అర్థ చమత్కారాన్ని సాధ్యమైనంత వరకు విద్యార్థులే గ్రహించేందుకు, తిరిగి సొంతమాటలలో సారాంశాన్ని చెప్పేందుకు తగిన సన్నివేశాలను కల్పించాలి. తద్వారా వారిలో రసానుభూతి, భావానుభూతి కలిగించవచ్చు.

**7.5.3.1.2. ఖండ పద్ధతి :**

ఈ పద్ధతి పూర్ణపద్ధతికి పూర్తిగా భిన్నమైనది. పదవిభజన, ప్రతివిద్యార్థికి అధిక ప్రాధాన్యతనిస్తూ బోధించే పద్ధతి ఇది. ఈపద్ధతి ప్రకారం ఒక్కో పాదంలోని ప్రతి పాదానికి లేదా క్లిష్ట పదాలకు అర్థాలు చెబుతూ అన్ని పాదాలు పూర్తిచేసి చివరభావం చెప్పాలి. ఈ పద్ధతిలో బోధన జరుగుతున్నపుడు విద్యార్థులు శ్రోతల్లాగానే ఉంటారు. ఈ పద్ధతి సంప్రదాయ పద్ధతి. ఇది విద్యార్థులకు రసానుభూతికి ఆటంకం కలిగించే తీరున సాగుతుంది. ఇది అనుసరణీయం కాదు.

**7.5.3.2. గద్యబోధన :**

సాహిత్యంలో గద్యానికి ఒక విశిష్టస్థానం ఉంది. పద్యం తర్వాత గద్యం పుట్టినా ప్రపంచ జ్ఞానమంతా గద్యరూపంలో వెలువడుతుంది. చంపూ వాక్యాల్లో అక్కడక్కడ దర్శనమిచ్చిన గద్యం స్వతంత్ర ప్రతిపత్తిని పొంది దినదిన ప్రవర్ధమానమౌతోంది. 'గద్యం కవీనాం నికషం వదన్తి' గద్యం కవీశ్వరులకు గీటురాయి వంటిది. ఈ గద్యాన్నే వచనం అని కూడా అంటారు. పాఠ్యపుస్తకంలోని పాఠాలు, కథ, వ్యాసం, లేఖ, జీవితకథ, ఆత్మకథ, ఏకాంకిక, నవల, నాటిక, యాత్రా రచన, పీఠిక మొదలుగా గల ప్రక్రియలలో ఉంటాయి. ఇవి వ్యావహారిక, మాండలిక, గ్రాంథిక భాషారూపాల్లో ఉంటాయి. ఆధునిక యుగంలో మారుతున్న కాలాన్ని బట్టి వ్యవహారిక భాషే రాజ్యమేలుతుంది. ఈనాటి అవసరాలకు వ్యహారిక భాషే తగిన భాష! తరగతి గదిలో ఈ గద్యబోధన ద్వారా భాషాజ్ఞానాభివృద్ధి, విషయ పరిజ్ఞానాభివృద్ధి, బాహ్య పఠన నైపుణ్యాల అభివృద్ధి, అనందానుభూతిని కలిగించడం, సాహిత్యాభిరుచిని కలిగించడం, సంభాషణాశక్తిని పెంపొందించడం మొదలైనవి సాధించవచ్చు. గద్యాన్ని చర్యాపద్ధతి, ప్రశ్నోత్తరపద్ధతి, వివరణ పద్ధతి, కథాకథన పద్ధతి, నాటకీకరణ పద్ధతి, ఉదాహరణ పద్ధతులలో సందర్భానుసారం విషయానుసారం అనువైన పద్దతిని ఉపయోగించి బోధనాలక్ష్యాలను సాధించవచ్చు.

**7.5.3.2.1. చర్చా పద్ధతి :**

పాఠ్యాంశముపై విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసిగాని, విద్యార్థులు తమలో తాముగాని జట్లలో సమగ్రంగా మాట్లాడుకోవడం ఈపద్ధతిలో ప్రధానం. జట్లలో చర్చించి చర్చల సారాంశాన్ని చివర సాధారణీకరించాలి. చర్చలో విద్యార్థులందరూ ఆసక్తిగా పాల్గొనేటట్లు, స్వేచ్ఛగా అభిప్రాయాలు వ్యక్తీకరించేలా చూడాలి. ఈ పద్ధతి విద్యార్థి ఆలోచనలకు, ప్రతిస్పందనలకు అవకాశం కల్పించి, వాటిని క్రోడీకరించి, క్రమీకరించే అవకాశం కల్పిస్తుంది. విద్యార్థులు తమ భావాలను, అభిప్రాయాలను చక్కని భాషలో వ్యక్తీకరింపజేయటానికి ఈ పద్ధతి మంచిసాధనం.

**ప్రయోజనలు :**

1. విద్యార్థుల భావవ్యక్తీకరణ నైపుణ్యం పెరుగుతుంది.
2. విద్యార్థుల్లోని బిడియం, భయం తొలగిపోతాయి.
3. విద్యార్థులు తమ హావభావాలను స్వేచ్ఛగా వ్యక్తీకరిస్తారు.
4. ఇతరుల అభిప్రాయాలను గౌరవిస్తారు.
5. పిల్లల ఆలోచనాపరిధి విస్తరిస్తుంది.
6. విశాలదృక్పథం అలవడుతుంది.

7. తమ భాషలో పొరపాట్లు ఉంటే చక్కదిద్దుకుంటారు.

8. చర్చించిన పాఠాలు బాగా గుర్తుంటాయి.

**7.5.3.2.2. ప్రశ్నోత్తర పద్ధతి :**

ఈ పద్ధతిలో గద్యబోధన ప్రశ్న, సమాధానం, ఆ సమాధానంపై తిరిగి ప్రశ్న ఇలా కొనసాగుతుంది. ఈ పద్ధతి వల్ల విద్యార్థులలో భాషణాశక్తి మెరుగుపడుతుంది. దీనిద్వారా నూతన విషయానికి విద్యార్థులను ఉన్ముఖులను చేయవచ్చు. ఎలా? ఎందుకు, ఎవరు, ఎపుడు, ఎక్కడ మొదలైన ప్రశ్నా పదాలతో కూడిన వివిధ ప్రశ్నలు విద్యార్థులలో ఆలోచనలను రేకెత్తిస్తాయి. పాఠశాలస్థాయిలో ఈ పద్ధతి అత్యంత ప్రయోజనకారి.

**7.5.3.2.3. వివరణ పద్ధతి :**

పాఠ్యాంశ విషయాన్ని వివరించి చెప్పడమే వివరణ పద్ధతి. ఈ పద్ధతిలో రచయిత పేరు, రచనలు, కాలం, అతని రచనా విశేషాలు, పాఠ్యాంశ సంబంధమైన పూర్వకథ సంబంధమైన విశేషాలను విద్యార్థులకు అర్థమయ్యేటట్లు చిన్నచిన్న మాటలతో వివరించి చెప్పాలి.

**7.5.3.2.4. కథాకథన పద్ధతి :**

కథాపాఠాలు బోధిస్తున్నపుడు ఈ పద్ధతిని ఉపయోగించవచ్చు. విద్యార్థులు కథలంటే, కథనమంటే చాలా ఇష్టపడతారు. విద్యార్థులలో ఏకాగ్రతను, అవధానాన్ని, ఆసక్తిని కలిగించి వారిలో వినే నైపుణ్యాన్ని పెంపొందించడానికి ఈ పద్ధతి సాయపడుతుంది. విద్యార్థిచేత కథలు తిరిగి చెప్పించడానికి వారి భావ వ్యక్తీకరణలో స్పష్టతను అభివృద్ధి చేయించవచ్చు.

**7.5.3.2.5. సాంకేతిక వినియోగం :**

పాఠ్యాంశ విశదీకరణలో రేడియో, టేప్‌రికార్డర్ ప్రాధన్యం క్రమక్రమంగా తగ్గింది. ఆస్థానాన్ని సిడి (కాంపాక్ట్ డిస్క్), డి.వి.డి. (డిజిటల్ వెర్సటైల్ డిస్క్) ఆక్రమించాయి. ప్రస్తుతం 'ఐపాడ్లు', సెల్‌ఫోన్లు, కంప్యూటర్లు బోధనలో ఉపాధ్యాయులు వినియోగించి విద్యార్థులకు అనేక విషయాలను అవగతం చేయించవచ్చు. కాలక్రమేణా ఇపుడు మరింత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వలన ఐఫోన్‌ల ప్రాధాన్యత పెరిగింది.

**7.5.3.2.6. సంభాషణ పద్ధతి :**

వాచకాలంలో ఇవ్వబడ్డ సంభాషణ పాఠాన్ని బోధించేటప్పుడు విద్యార్థుల చేత పాఠ్యాంశాన్ని చదివించాలి. పాఠంలో ఎన్ని పాత్రలున్నాయో అందరు విద్యార్థులను ఎన్నుకుని, ఒక్కోపాత్ర ఒక్కో విద్యార్థికి ఇచ్చి, ఆయా పాత్రల సంభాషణలు చదివించాలి. విద్యార్థుల పఠన దోషాలను ఉపాధ్యాయుడు ఎప్పటికప్పుడు సవరించాలి. పాఠ్యాంశాన్ని విద్యార్థులు చదువుతుండగానే పాఠ్యాంశ వివరణ చేయాలి.

**7.5.3.2.7. నాటకీకరణ పద్ధతి :**

పాఠాన్ని సంభాషణ రూపంలోకి మార్చి పాత్రలను విద్యార్థుల చేత అభినయింపజేస్తూ నేర్పే పద్ధతి నాటకీకరణ పద్ధతి. విద్యార్థులు ఇందులో చాలా ఆసక్తిగా పాల్గొంటారు. సరైన ఆంగికాభినయం, వాచికాభినయం నాటకీకరణ పద్ధతికి చాలా ముఖ్యమైనవి. ఆంగికాభినయం అంటే శరీరంలోని అంగాలను సందర్భాన్ని బట్టి కదిలిస్తూ, చక్కని హావభావాలతో నటించడం, వాచికాభినయం అంటే ఏ సంభాషణను ఏ సందర్భంలో ఎలా భావస్ఫోరకంగా పలకాలో తెలిసి పలుకుతూ నటించడం.

**ప్రయోజనాలు :**

1. శ్రవణ భాషణ పఠన నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయి.

2. పాఠం విద్యార్థులకు బాగా అర్థమవుతుంది.

3. సామాజిక ప్రయోజనం నెరవేరుతుంది.

4. పాఠం బాగా గుర్తుంటుంది.

5. బడి అంటే ఆసక్తి కలుగుతుంది.

6. ఉపాధ్యాయునితో సాన్నిహిత్యం పెరుగుతుంది.

**7.5.3.2.8. చర్చ** (Discussion) :

పాఠంలోని కొన్ని భావనలను గురించి విద్యార్థులను వివిధ రకాలుగా ప్రశ్నించాలి. విద్యార్థుల సమాధానాల ఆధారంగా మరికొన్ని ప్రశ్నలు వేస్తూ వారిలో స్వయంగా ఆలోచించి, స్వేచ్ఛగా తమ భావాలను వ్యక్తం చేసేటట్లు చేయాలి. విద్యార్థులు తప్పు అభిప్రాయాలను వ్యక్తపరిస్తే తగిన కారణాలను వివరిస్తూ వాటిని సరిచేయాలి. విద్యార్థులందరినీ చర్చలో పాల్గొనేలా అవకాశం కల్పించాలి. చివరగా ముఖ్య భావనలు ప్రస్తావించి, విద్యార్థుల అభిప్రాయాలకు సమీక్షగా ముగింపునివ్వాలి. చర్చను ప్రారంభించడం, కొనసాగించడం, అవసరమైనచోట్ల సమయస్ఫూర్తితో మలుపుతిప్పడం, విద్యార్థులు పరిధి దాటకుండా చూడడం మొదలైనవి చేయడంలో ఉపాధ్యాయునికి చాలా నేర్పు ఉండాలి.

**7.5.3.2.9. జట్టు పనులు :**

పాఠాలకు సంబంధించిన కొన్ని అంశాలను జట్టులో నిర్వహించడం ద్వారా తోటివారితో కలిసి పనిచేయడం, అభిప్రాయాలను పంచుకోవడం, నివేదిక రాయడం, అర్థాలు గ్రహించడం మొదలైనవి చేయవచ్చు. జట్టుపని అనంతరం జట్టుచేత ప్రదర్శింపజేయాలి. వివిధ జట్లవారు రాసినవాటిని ప్రదర్శించినపుడు చర్చించడం ద్వారా వారివారి జట్టు పనులను సరిచేసుకోవడం జరుగుతుంది. వ్యక్తీకరణ–సృజనాత్మకత అభ్యాసాలలోని సృజనాత్మక అంశాలను జట్టుపనులుగా ఇయ్యవచ్చు. ప్రాజెక్టు పనులు, ప్రశంసాత్మక పనులను కూడా జట్టు పనులుగా ఇయ్యవచ్చు.

**7.5.3.2.10. పుస్తక సమీక్షలు :**

పిల్లల పఠనాభిలాషను పెంపొందింపజేయడానికి పాఠశాలలకు సరఫరా చేసిన గ్రంథాలయ పుస్తకాలను వినియోగించుకోవాలి. పిల్లలచేత వివిధ సాహిత్య రూపాలలో ఉన్న పుస్తకాలను చదవమనాలి. చదివిన పుస్తకంపై సమీక్ష రాయించాలి. సమీక్షలో వాళ్ళు చదివిన పుస్తకం, చదివిన అంశంపై అభిప్రాయం, చదువుతున్నప్పుడు వాళ్లు పొందిన అనుభూతులు, చదివిన అంశంలోని పాత్రల, సంఘటనల వివరణ, పుస్తకం రాసిన కవి ఏ వుద్దేశ్యంతో ఆ పుస్తకం రాశాడో తెలిపే వివరణ మొదలైన అంశాల ఆధారంగా సమీక్ష రాయించాలి.

**ముగింపు :**

పైన వివరించిన విషయాలు దృష్టిలో ఉంచుకుని ఉపాధ్యాయులు అభ్యసన వ్యూహాల నిర్వహణకు అవసరమైన వనరులు, అనువైన అభ్యసన వాతావరణం, తరగతిగదిలో ఉండేవిదంగా చూడాలి. పిల్లల అభిప్రాయాలు, వ్యక్తీకరణలోని వైవిధ్యాన్ని సహృదయంతో తరగతి పిల్లలందరూ స్వీకరించేలా చూడాలి. పిల్లల అభిప్రాయాలకు విలువనిస్తూ, స్వీయరచనలకు, సృజనాత్మక వ్యక్తీకరణల ప్రదర్శనలకు అవకాశం ఇవ్వాలి. తరగతి గదిలో చక్కని ప్రజాస్వామిక అభ్యసన వాతావరణాన్ని సృష్టించాలి!

**మూల్యాంకనం :**

1. భాషాభ్యసనంలో ప్రమాణాలను వివరించండి.
2. 6వ తరగతి పూర్తయ్యేసరికి విద్యార్థి తెలుగులో ఏయే సామర్థ్యాలను సాధించగలగాలి ?
3. ఆధునిక భాషా బోధనా వ్యూహాలను వివరింపుము.
4. క్రీడాపద్ధతిని భాషాబోధనలో ఏవిధంగా వినియోగించుకోవచ్చు ?
5. కృత్యాధార పద్ధతిని గురించి వ్రాయండి.
6. నాటకీకరణ పద్ధతిని చర్చించండి.
7. పద్యబోధనా పద్ధతులు ఏవి ?
8. గద్యబోధనా పద్ధతుల్లో ఏవైనా రెండింటిని సమగ్రంగా వివరించండి?

## ఉపయుక్త గ్రంథ సూచి :


| | | |
|---|---|---|
| 1. | డి.ఎడ్. తెలుగు బోధనా పద్ధతులు | – తెలుగు అకాడమీ, హైదరాబాద్ |
| 2. | బి.ఎడ్. తెలుగు బోధన అభ్యసన శాస్త్రం | – తెలుగు అకాడమీ, హైదరాబాద్ |
| 3. | బి.ఎడ్. తెలుగు బోధనా పద్ధతులు | – తెలుగు అకాడమీ, హైదరాబాద్ |
| 4. | తెలుగు బోధనా ప్రదీపిక | – రావి రంగారావు |
| 5. | 6,7 తరగతుల తెలుగు ఉపాధ్యాయ కరదీపిక | – ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాద్ |
| 6. | అభ్యసనాభివృద్ధి కార్యక్రమం–ఎల్.యి.పి. ఉపాధ్యాయుల కరదీపిక | – రాజజీవ్ విద్యా మిషన్, ఎస్.ఎస్.ఎ. |
| 7. | పిల్లల భాషాభివృద్ధి | – రాజీవ్ విద్యామిషన్ |
| 8. | పిల్లల అభ్యనసాభివృద్ధి | – రాజీవ్ విద్యామిషన్ |
| 9. | విజ్ఞాన మేళా ఉపాధ్యాయుల కరదీపిక | – రాజీవ్ విద్యామిషన్ |
| 10. | దూరవిద్యావిధానం భాషావిద్య తెలుగు ఉపాధ్యాయుల కరదీపిక | – డి.ఎడ్. ఉపాధ్యాయుల కరదీపిక |
| 11. | బాలలహక్కుచట్టం–2009, నాణ్యత అంశాలు ఉపాధ్యాయుల కరదీపిక | – రాజీవ్ విద్యామిషన్, హైదరాబాద్ |
| 12. | ప్రాథమికోన్నత విద్య–తాత్విక మానసిక ఆధారాలు | – రాజీవ్ విద్యామిషన్, హైదరాబాద్ |
| 13. | టీచర్స్ హేండ్‌బుక్ (బోధనాకరదీపిక) | – కుందా భాస్కరరావు ప్రచురణ : పి.వి. ఏజన్సీస్, గుంటూరు |

అధ్యాయం-8

# భాష - బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణ ప్రణాళికలు ఎలిమెంటరీస్థాయి

## 8.1 ఉపోద్ఘాతం

మానవుని మేధస్సు అభివృద్ధి చెందడానికి ప్రధాన కారణం భాష. భాషలేని మానవ జీవితాన్నే ఊహించలేం. భాష సజీవ స్రవంతి వంటిది. అది గతిశీలమైనది. ప్రగతిశీలమైనది. భాషలో వస్తున్న వివిధ మార్పులను ఆధునిక పోకడలను ఉపాధ్యాయులు ఆకళింపు చేసుకోవాలి. తరగతి గదిలో బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణ ద్వారా భాషాభివృద్ధి సాధించాలి. ప్రాథమిక స్థాయిలోని విద్యార్థులు ఏ భాషా సామర్థ్యాలు ఏమేరకు సాధించారు ? ఎలిమెంటరీస్థాయిలో విద్యార్థులు సాధించవలసిన భాషాసామర్థ్యాలు ఏమిటి? వాటిని సాధించడంలో ఉపాధ్యాయుడు బోధనాభ్యసన ప్రక్రియలరీత్యా ఎలాంటి సన్నద్ధత కలిగి యుండాలి? అందుకు అనుగుణంగా బోధనావ్యూహాలు ఎలా సిద్ధపరచుకోవాలి? వార్షిక ప్రణాళిక, పాఠ్యప్రణాళికలు, పీరియడు ప్రణాళికలు ఏవిధంగా సిద్ధపరచుకోవాలి? భాషాసామర్థ్యాలు సమర్థంగా నిర్వహించడానికి తగిన వాతావరణాన్ని తరగతిగదిలో ఎలా ఏర్పాటుచేసుకోవాలి? ఎలిమెంటరీస్థాయి విద్యార్థులలో సృజనాత్మకత, ఉన్నతమైన వైఖరులు, వ్యక్తిత్వనిర్మాణం, సాహిత్యాభిలాష సామాజిక స్పృహ, మానవతా విలువలు పెంపొందించేవిధంగా బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణకు సంసిద్ధుడు కావాలి. దీనికి అనుగుణమైన ప్రణాళికలు రూపొందించుకొని విద్యార్థుల మూర్తిమత్వాన్ని వికసింపచేయవలసిన బాధ్యత భాషోపాధ్యాయులపై ఉంది.

**లక్ష్యాలు**

- H పాఠశాలస్థాయి ప్రణాళికల ప్రాధాన్యతను గుర్తిస్తారు.
- H తరగతి గదికి ఎలా సన్నద్ధత కావాలో తెలుసుకుంటారు.
- H వార్షిక ప్రణాళిక ఎలా రూపొందించుకోవాలో గ్రహిస్తారు.
- H నమూనా వార్షిక ప్రణాళిక రూపొందించుకో గలుగుతారు.
- H పాఠ్యప్రణాళికను సరియైన బోధనా వ్యూహాలతో తయారుచేసుకోగల్గుతారు.
- H పీరియడు ప్రణాళికను రూపొందించుకో గల్గుతారు.
- H పాఠ్యబోధనా సోపానాల ఆధారంగా బోధనాభ్యసన కృత్యాలను నిర్వహించగల్గుతారు.
- H పాఠశాలలో పిల్లల భాషాభివృద్ధికి నిర్వహించవలసిన కార్యక్రమాలపట్ల నిర్దిష్టమైన అభిప్రాయాలు ఏర్పరచుకుంటారు.

## 8.2 ఉపాధ్యాయునికి ప్రణాళిక అవసరమా ?

ఉపాధ్యాయుడు విద్యార్థులలో ఆశించిన సామర్థ్యాలు సాధించడానికి ప్రణాళికా రచన అవసరం ఎంతైనా ఉంది. బోధనాభ్యసన ప్రక్రియల్లో బోధనాపరంగా, అభ్యసనపరంగా ఎదురయ్యే ఇబ్బందులను అధిగమించడానికి ప్రణాళికా రచన అవసరం. ప్రణాళికా రచన వలన బోధనాభ్యసన ప్రక్రియ వేగంగా ముందుకు సాగుతుంది. బోధనా కార్యక్రమం సులభమవుతుంది. విద్యా సంవత్సరంలో నెలవారీగా, కాలానుగుణంగా పాఠ్యకార్యక్రమాలు, సహపాఠ్య కార్యక్రమాలు ఒక క్రమపద్ధతిలో నిర్వహించడానికి వీలుపడుతుంది. బోధనకు అవసరమైన వనరులను సమకూర్చుకో వచ్చు. గుణాత్మకవిద్య అందించడానికి, అభ్యసన ఫలితాలను ఎప్పటికప్పుడు మదింపు చేయడానికి ప్రణాళికా రచన తోడ్పడుతుంది. అభ్యసనంలో వెనుకబడిన పిల్లల్లో ప్రత్యామ్నాయ బోధన ద్వారా సామర్థ్యాల అభివృద్ధికి తోడ్పడుతుంది. బోధనావ్యూహాలు రచించడానికి అవసరాన్నిబట్టి మార్పులు చేసుకోవడానికి దోహదపడుతుంది. ఉపాధ్యాయుడు వృత్తి నైపుణ్యాలు పెంపొందించు కోవడానికి, తన ప్రతిభను నిర్ణీత సమయంలో ప్రదర్శించడం, అనుకున్నది సాధించడం, ప్రణాళిక వల్లే సాధ్యమవుతుంది.

## 8.3 వార్షిక ప్రణాళిక అంటే ఏమిటి ? ఎలా రూపొందించాలి ? నమూనా వార్షిక ప్రణాళిక

ఒక విద్యాసంవత్సరంలో ఒక తరగతికి తెలుగు భాషను బోధించడానికి తయారుచేసుకునే ప్రణాళికను వార్షిక ప్రణాళిక అంటారు. విద్యాప్రణాళికలోని లక్ష్యాలను దృష్టిలో పెట్టుకొని,

పాఠ్యప్రణాళికలో నిర్దేశించిన అంశాలను కార్యక్రమాలను వార్షిక ప్రణాళికలో పొందుపరచి తదనుగుణంగా బోధించడానికి వార్షిక ప్రణాళిక తప్పనిసరి. పాఠశాల పనిదినాలు 220. తెలుగుభాష బోధించడానికి మొత్తం పీరియడ్లు 220. పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించే నాలుగు నిర్మాణాత్మక మూల్యాంకనాలు, మూడు సంగ్రహణాత్మక మూల్యాంకనాలు, ఉపాధ్యాయుని సెలవులు, పునఃశ్చరణ తరగతులు మినహాయించగా తెలుగుభాష బోధనకు సుమారు 170 పీరియడ్లు (కాలాంశాలు) లభిస్తాయి. వీటిలో ఉపాధ్యాయుడు తరగతికి నిర్దేశించిన వాచకాన్ని బోధించడానికి, పుస్తక సమీక్షలు, ప్రాజెక్టుపనులు, లేఖారచన, వ్యాసరచన నిర్వహించడానికి పీరియడ్లు కేటాయించవలసి ఉంటుంది. విద్యాసంవత్సరంలో కొన్ని నెలల్లో ఎక్కువ పనిదినాలు, కొన్ని నెలల్లో తక్కువ పనిదినాలు వస్తాయి. కారణం ఆయా నెలల్లో పరీక్షలు, సెలవులు మొదలైనవి రావడం. కాబట్టి నెలలో వచ్చే పనిదినాలు లెక్కించుకొని నెలలో చేపట్టబోయే బోధన, కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకొని నెలవారీగా వార్షికప్రణాళిక రూపొందించుకోవాలి.

మన రాష్ట్రంలో ఎలిమెంటరీస్థాయి పాఠశాలలన్నింటికీ జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు ద్వారా వార్షిక ప్రణాళిక రూపొందించి అందచేస్తున్నారు. అయినప్పటికీ ఉపాధ్యాయుడు పాఠ్యప్రణాళికలోని అంశాలు, ప్రాజెక్టుపనులు, పుస్తక సమీక్షలు, దృష్టిలో ఉంచుకొని స్వయంగా వార్షిక ప్రణాళికను వేసవి సెలవుల్లో పాఠశాలలు తెరిచేనాటికి తయారుచేసుకోవాలి. పాఠాలకు సంబంధించిన మూలగ్రంథాలు చదివి పూర్వగాథలను, నేపథ్యాలను, పాఠ్యఉద్దేశ్యాలను ఆకళింపు చేసుకుని తదనుగుణంగా వార్షిక ప్రణాళిక రూపొందించాలి. ప్రస్తుతం నిర్మాణాత్మక మూల్యాంకనం లఘుపరీక్ష ప్రశ్నపత్రాన్ని సామర్థ్యాల ఆధారంగా ఉపాధ్యాయులే తయారుచేసుకుంటున్నారు.

ఉదాహరణకు 7వ తరగతి పాఠ్యపుస్తకం ఆధారంగా వార్షిక ప్రణాళిక పరిశీలిద్దాం. దీనిలో 11 గద్య, పద్య పాఠాలు, 6 ఉపవాచక పాఠాలతో మొత్తం 17 పాఠాలు ఉన్నాయి. వీటిని నాలుగు (4) విభాగాలు చేసి ఏయే పాఠాలను ఏయే నెలల్లో ఏ విభాగంలో (యూనిట్) బోధించాలో పాఠ్యపుస్తకంలోని విషయసూచికలో సూచించారు. ఉపవాచక పాఠాలు పిల్లలు చదివించడానికి ఇవ్వబడినవి. బోధించడానికి కాదు. పిల్లలతో చదివించి, మాట్లాడించి వారి సొంతమాటల్లో రాయించాలి. సగటున ఒక్కొక్క పాఠానికి 12 పీరియడ్లు అవసరమవుతాయి. పాఠం పద్య గద్యాలతో కూడివుంటుంది. కాబట్టి పాఠంలోని విషయాన్నిబట్టి 10 నుండి 15 పీరియడ్లు కేటాయించుకోవచ్చు. దీనిలో తరగతిలో పాఠ్యబోధనకు బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించడానికి 4 నుండి 6 పీరియడ్లు, బోధనాభ్యసన ప్రక్రియల తరువాత "పాఠం వెనుక ఇవి చేయండి" శీర్షిక కింద సామర్థ్యాలవారీగా ఇచ్చిన కృత్యాలు నిర్వహించడానికి 6 నుండి 9 పీరియడ్లు కేటాయించుకోవచ్చు. ఉపవాచకమునకు 3 పీరియడ్లు కేటాయించుకోవచ్చు.

ఈవిధంగా 7వ తరగతి పాఠ్యపుస్తకంలోని మొత్తం 17 పాఠాల బోధనకు – 147 పీరియడ్లు, పుస్తక సమీక్షకు 4 పీరియడ్లు, ప్రాజెక్టుపనులకు 10 పీరియడ్లు, లేఖారచనకు 3 పీరియడ్లు, వ్యాసం, కరపత్రం ప్రకటన మున్నగు వాటికి 3 పీరియడ్లు కేటాయించుకోవచ్చు – ఈవిధంగా మొత్తం 170 పీరియడ్లను విభజించుకొని వార్షిక ప్రణాళికను రూపొందించుకోవాలి. స్థానిక అవసరాలు, విద్యార్థుల అభ్యసనాన్నిబట్టి ఉపాధ్యాయుడు మార్పులు చేసుకోవచ్చు.

## నమూనా వార్షిక ప్రణాళిక

1. తరగతి : 7
2. విషయం : తెలుగు
3. మొత్తం పీరియడ్లు : 220
4. బోధనాభ్యసనకు అవసరమయ్యే పీరియడ్ల సంఖ్య : 170
5. విద్యాసంవత్సరం పూర్తయ్యేసరికి సాధించవలసిన సామర్థ్యాలు : 7వ తరగతి పాఠ్యపుస్తకంలో ఇచ్చిన విద్యార్థులు సాధించవలసిన సామర్థ్యాలు రాయాలి.

## నమూనా వార్షిక ప్రణాళిక

1. తరగతి : 7 2. విషయం : తెలుగు 3. మొత్తం కాలాంశాలు (పీరియడ్లు) : 220

4. అవసరమైన కాలాంశాల (పీరియడ్ల సంఖ్య) : 170

పాఠ్యబోధనకు : 147, పుస్తక సమీక్ష : 4 కాలాంశాలు, ప్రాజెక్టుపనులు : 10 కాలాంశాలు, లేఖారచన : 3, వ్యాసం, కరపత్రం, ప్రకటన మొ॥నవి : 6

5. విద్యాసంవత్సరం పూర్తయ్యేసరికి సాధించాల్సిన సామర్థ్యాలు

**1. వినడం, ఆలోచించడం, ప్రతిస్పందించడం**

- ఉపన్యాసాలు, వక్తృత్వాలు, వార్తలు విని అర్థంచేసుకోవడం, ప్రతిస్పందించడం
- చర్చల్లో పాల్గొనడం, అభిప్రాయాలు వ్యక్తీకరించడం
- కళారూపాలు చూసి; విని అర్థం చేసుకోవడం, ఆసక్తిని, అభిరుచిని పెంచుకోవడం
- పాత్రల స్వభావాలను తారతమ్యాలను గ్రహించడం, విచక్షణతో ఆలోచించడం
- వివిధ సాహిత్య ప్రక్రియా భేదాలను గమనించడం
- చిన్న చిన్న సంఘటనలను వర్ణించడం (వర్ణనాత్మకంగా వివరించడం)

**2. చదవడం - రాయడం**

H పద్యం, గేయం, వచనకవిత, ప్రాచీనగద్యం తదితర అంశాలను శైలీభేదంతో అవగాహనతో చదవడం.

H వ్యాసరూప అంశాలను, లేఖలను చదివి అర్థం చేసుకోవడం.

H చదువుతున్న అంశాల్లోని కీలకాంశాలు గుర్తించడం, రాయడం, శీర్షికలను సూచించడం.

H పత్రికల్లోని అంశాలు చదివి, అర్థం చేసుకొని ప్రతిస్పందించడం.

H చదివిన అంశాలను విశ్లేషించడం, అభిప్రాయాలను చెప్పడం.

**3. స్వీయరచన**

H పాఠాలనుండి సూచిత అంశాలకు సారాంశాలు, భావాలు రాయడం.

H తాము అర్థం చేసుకున్న విషయాలు, తెలిసిన విషయాలు స్పష్టంగా ఒక క్రమపద్ధతిలో సరైన పదజాలాన్ని ఉపయోగించి దోషరహితంగా రాయగలగడం.

H విరామచిహ్నాలు, సంయుక్త, సంశ్లిష్ట వాక్యాలను సందర్భోచితంగా ఉపయోగించడం, రాయగలగడం.

H భావాలను క్రమపద్ధతిలో సరైన పదజాలాన్ని ఉపయోగించి దోషరహితంగా రాయగలగడం.

**4. పదజాలం**

H అర్థాలు, వ్యతిరేక పదాలు, పర్యాయపదాలు, ప్రకృతి వికృతులు, జాతీయాలు, సామెతలు గుర్తించడం, అవగాహన చేసుకోవడం, కొత్త పదాలతోపాటు సొంత వాక్యాల్లో రాయగలగడం.

H నిఘంటువును ఉపయోగిస్తూ, స్వీయ అధ్యయనం చేయడం.

H మాండలిక భాషారూపాలను గుర్తించడం, వినియోగించడం.

**5. ప్రశంస, సృజనాత్మకత, భాషాంశాలు, ప్రాజెక్టుపనులు**

H తను చదివిన, అనుభవంలో ఉన్న, విన్న, చూసిన అంశాలు వర్ణించిచెప్పడం.

H కథలు, కవితలు అల్లడం, నాటకంలో పాత్రలు పోషించడం.

H గేయాలను పాడటం, కథలను గేయాలను పొడిగించడం, పాత్ర లక్షణాలు (స్వభావం, దోషం, కారణం, సమర్థన...) వివరించడం.

H ప్రకటనలు, నోటీసులు, ఆహ్వానపత్రికలు, శుభాకాంక్షలు తెలిపే కార్డులను తయారు చేయడం.

- H లేఖలు, వ్యాసాలు, దరఖాస్తులు రాయడం.
- H ఆత్మకథ, డైరీ, స్వీయ అనుభవాలు స్పష్టంగా, వర్ణనాత్మకంగా రాయడం.
- H బొమ్మలు గీయడం, నినాదాలు రాయడం, నాటకీకరణ చేయడం.
- H ఇతర భాషలు, మతాలు, సంస్కృతులను సవ్యంగా అర్థంచేసుకోవడం, మంచిని గ్రహించడం, గౌరవించడం.
- H బాలికలు, ప్రత్యేకావసరాలు గల పిల్లలు మనతో సమానమని గుర్తించి, వాళ్ళలోని గొప్పతనాన్ని ప్రశంసించడం.
- H వ్యాకరణాంశాలపట్ల అవగాహన పెంచుకోవడం. (వర్ణమాల–విభాగాలు, భాషాభాగాలు, విభక్తులు, సంధులు, సమాసాలు, ఛందస్సు, అలంకారాలు, క్రియల్లో భేదాలు, వాక్యాల్లో భేదాలు స్పష్టంగా గుర్తించగలగడం)
- H వ్యతిరేకార్థక రూపాలపట్ల అవగాహన పెంచుకోవడం.

## వార్షిక ప్రణాళిక - 7వ తరగతి

| మాసం పేరు | బోధించే పాఠం పేరు/అంశం | అవసరమైన కాలాంశాలు | అవసరమైన వనరులు - సామగ్రి | నిర్వహించాల్సిన కార్యక్రమాలు |
|---|---|---|---|---|
| జూన్ | 1. శ్రీలుపొంగిన జీవగడ్డ<br>ప్రాజెక్టుపని | 13<br>1 | భారతదేశ చిత్రపటం, కవుల చిత్ర పటాలు, బొమ్మల భారతం (పుస్తకం), వివిధ సంగీతవాయిద్యాల బొమ్మలు. | దేశభక్తి గేయాలు పాడించడం, జూన్ 30వ తేది రాయప్రోలు వర్ధంతిసభ నిర్వహించడం. |
| జూలై | 2. అతిథి మర్యాద<br>ప్రాజెక్టుపని<br>3. ఆనందం (ఉపవాచకం)<br>పుస్తక సమీక్ష | 12<br>1<br>3<br>1 | బొమ్మల భారతం (కథల పుస్తకం) - దాతల చిత్రాలు | 26వ తేదీ కార్గిల్ విజయోత్సవ దినాన్ని నిర్వహించుట.<br>భారతంలో కథలు నిర్వహించడం<br>పుస్తక సమీక్ష నిర్వహణ; నిర్మాణాత్మక మూల్యాంకనం-1 నిర్వహించుట.<br>విస్తారపఠనం చేయించడం. |
| ఆగస్టు | 4. మేలిమి ముత్యాలు<br>6. నిజం - నిజం<br>ప్రాజెక్టుపని | 15<br>11<br>1 | పద్యకవుల చిత్రపటాలు, వజ్రం చిత్రం,<br>మునిమాణిక్యం నరసింహారావు చిత్రపటం, తెలుగు హాస్యం (పుస్తకం) బుడుగు (బాపు పుస్తకం) | పద్యాల పోటీ నిర్వహించుట - చర్చించుట.<br>బాపురచన బుడుగు చదివేలా ప్రోత్సహించుట<br>ఆగస్టు 29వ తేది తెలుగు భాషాదినోత్సవం (గిడుగు రామ్మూర్తి జయంతి) నిర్వహించుట |

| మాసం పేరు | బోధించే పాఠం పేరు/అంశం | అవసరమైన కాలాంశాలు | అవసరమైన వనరులు - సామగ్రి | నిర్వహించాల్సిన కార్యక్రమాలు |
|---|---|---|---|---|
| సెప్టెంబర్ | 5. శిల్పి<br>ప్రాజెక్టుపని<br>7. ఎందుకు పారేస్తానాన్నా (ఉపవాచకం)<br>8. కూచిపూడి నాట్యం (ఉపవాచకం)<br>పుస్తక సమీక్ష | 15<br>1<br>3<br>3<br>1 | గుర్రం జాషువా చిత్రపటం, లేపాక్షి, అజంతా, ఎల్లోరాలలో శిల్పాలు, మహాబలిపురం, ఏకశిలా రథం చిత్రాలు, లలితకళాకారుల చిత్రాలు, కథాస్రవంతి (చాగంటిసోమయాజులు) వివిధ నృత్యరీతులకు సంబంధించిన చిత్రాలు;<br>కూచిపూడి కళాకారుల చిత్రాలు<br>ఆంధ్రప్రదేశ్ చిత్రపటం | సెప్టెంబర్ 28న గుర్రం జాషువా జయంతి నిర్వహణ; దగ్గర్లో శిల్పసంపద గల క్షేత్రపర్యటన<br>విస్తారపఠనం చేయించడం.<br>కూచిపూడిగ్రామం ఆంధ్రప్రదేశ్ చిత్రపటంలో గుర్తింపచేయుట.<br>విస్తారపఠనం చేయించడం.<br>పుస్తక సమీక్ష<br>నిర్మాణాత్మక మూల్యాంకనం-2 నిర్వహణ |
| అక్టోబర్ | 9. ప్రకటన<br>ప్రాజెక్టుపని | 10<br>1 | అమృతం కురిసిన రాత్రి పుస్తకం, దేవరకొండ బాలగంగాధర, తిలక్ చిత్రం, వివిధ ప్రకటనలు | వార్తాపత్రికలలో వచ్చిన కవితల సేకరణ - ప్రదర్శన,<br>ప్రకటనల తయారీ - ప్రదర్శన |
| నవంబర్ | 10. ఆలోచనం (?)<br>ప్రాజెక్టుపని | 10<br>1 | దాశరథి చిత్రం, అగ్నిపర్వతం చిత్రం, కరవుపీడిత ప్రాంతాల చిత్రాలు. | గేయం అర్థ, భావయుక్తంగా పాడటం నేర్పించడం<br>నవంబర్ 11వ తేది జాతీయ విద్యాదినోత్సవం నిర్వహణ,<br>నవంబర్ 14 నుండి 21 లోపు గ్రంథాలయ వారోత్సవాల పోటీల నిర్వహణలో విద్యార్థు లను భాగస్వాములుగా చేయడం, పుస్తక ప్రదర్శన ఏర్పాటు. |

| మాసం పేరు | బోధించే పాఠం పేరు/అంశం | అవసరమైన కాలాంశాలు | అవసరమైన వనరులు - సామగ్రి | నిర్వహించాల్సిన కార్యక్రమాలు |
|---|---|---|---|---|
| | 11. తెలుగు వెలుగు<br>ప్రాజెక్టుపని<br>12. అసామాన్యులు<br>(ఉపవాచకం)<br>పుస్తక సమీక్ష | 10<br>1<br>3<br><br>1 | జాతీయాలు, శబ్దపల్లవాల నిర్వచనం; ఉదాహరణలు తెలిపే ఛార్టులు<br>వివిధ కులవృత్తుల చిత్రాల ప్రదర్శన | విద్యార్థులను గ్రూపులుగా చేసి సంభాషణలు చెప్పించడం. విద్యార్థులచే సంభాషణల తయారీ<br>అన్నిరకాల కులవృత్తులను పరిశీలించడం, శ్రమైక జీవనం గుర్తింపచేయడం; పుస్తకసమీక్ష<br>నిర్మాణాత్మక మూల్యాంకనం-3 నిర్వహణ |
| డిసెంబర్ | 13. బాల్యక్రీడలు<br>ప్రాజెక్టుపని | 14<br>1 | పోతన చిత్రం, భాగవతగ్రంథం (దశమస్కంధం)<br>పూర్వకాలంలో ఆడిన ఆటలు - చిత్రాలు | పాఠాన్ని నాటకీకరణ చేయించడం<br>పద్యపఠనం పోటీ నిర్వహణ |
| జనవరి | 14. సీత ఇష్టాలు<br>ప్రాజెక్టుపని | 10<br>1 | బుర్రకథ కళాకారుల చిత్రాలు, ప్రఖ్యాత స్త్రీమూర్తులు రుద్రమదేవి, సరోజినీనాయుడు, కల్పనాచావ్లా చిత్రాలు | బుర్రకథ ప్రదర్శన ఏర్పాటు<br>పాఠాన్ని విద్యార్థులచే బుర్రకథగా ప్రదర్శింప జేయడం. |
| ఫిబ్రవరి | 15. కరపత్రం<br>ప్రాజెక్టుపని | 9<br>1 | వివిధరకాల కరపత్రాల ప్రదర్శన | విద్యార్థులకు అంశాలనిచ్చి కరపత్రాలు తయారు చేయించడం. |

| మాసం పేరు | బోధించే పాఠం పేరు/అంశం | అవసరమైన కాలాంశాలు | అవసరమైన వనరులు - సామగ్రి | నిర్వహించాల్సిన కార్యక్రమాలు |
|---|---|---|---|---|
| | 16. వేసవిసెలవుల్లో (ఉపవాచకం)<br>పుస్తకసమీక్ష | 3<br>1 | పల్లెటూరి అందాలు చూపే చిత్రాలు. నేటికాలంలో ఆడే ఆటల చిత్రాలు | విస్తారపఠనం.<br>సెలవుల్లో విద్యార్థులు ఆడే ఇష్టమైన ఆట గురించి రాయించడం.<br>పుస్తకసమీక్ష.<br>నిర్మాణాత్మక మూల్యాంకనం-4 నిర్వహణ. |
| మార్చి | 17. జానపద కళలు (ఉపవాచకం)<br>లేఖారచన<br>వ్యాసం, కరపత్రం, ప్రకటన, పునశ్చరణ | 3<br>3<br>6<br>170 | జనపద కళల చిత్రాలు | విస్తార పఠనం<br>ప్రశ్నావళి తయారుచేసి గ్రామంలో నున్న జానపద కళాకారుల ఇంటర్వ్యూ తీసుకోమనడం. |

6. **ఉపాధ్యాయుని ప్రతిస్పందనలు :** (ఇందులో వార్షిక ప్రణాళిక అమలులో గల సౌలభ్యాలు, ఇబ్బందులు మరియు ప్రణాళికలో తాను చేసిన మార్పులు రాయాలి.)

7. **ప్రధానోపాధ్యాయుని సూచనలు, సలహాలు :** (వార్షిక ప్రణాళిక అమలు, మార్పులు, చేర్పుల గురించి సూచనలు రాయాలి.)

ఉపాధ్యాయుని సంతకం ప్రధానోపాధ్యాయుని సంతకం

## 8.4 పాఠ్యప్రణాళిక తయారీ - మార్గదర్శకాలు - నమూనా పాఠ్యప్రణాళిక

ఒక పాఠాన్ని బోధించడానికి అవసరమైన పీరియడ్లతో ప్రణాళిక తయారుచేయడాన్ని పాఠ్యప్రణాళిక అంటారు. భాషాబోధనలో ఒక పాఠాన్ని ఒక యూనిట్‌గా పరిగణిస్తారు. కాబట్టి దీనినే యూనిట్ ప్రణాళిక అనికూడా అంటారు. పాఠంలోని ప్రధానమైన అంశాలు తీసుకొని ఒక్కొక్క అంశాన్ని ఒక పీరియడ్‌లో బోధించే విధంగా పాఠ్యప్రణాళిక రూపొందించుకోవాలి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రచురించిన కొత్త పాఠ్యపుస్తకాలలో పాఠాలను 4 అధ్యయన విభాగాలు (యూనిట్) గా విభజించారు. ఒక్కొక్క యూనిట్ (అధ్యయన విభాగంతో) 4 లేద 5 పాఠాలున్నాయి. ప్రతి యూనిట్‌లో వివిధ ప్రక్రియలతోనున్న పాఠాలను పొందుపరిచారు. ఈ అధ్యయన విభాగాలకు (యూనిట్) యూనిట్ ప్రణాళికకు సంబంధం లేదు. యూనిట్ ప్రణాళిక లేదా పాఠ్యప్రణాళిక అంటే ఒక పాఠానికి సంబంధించిన ప్రణాళిక. ఒక్కొక్క పాఠాన్ని పాఠం నిడివినిబట్టి 12 పీరియడ్లు బోధించేవిధంగా రూపొందించారు. ప్రతి పాఠానికి ముందు పిల్లలను ఆలోచింప చేయడానికి, దృష్టిని పాఠంవైపు మరల్చడానికి ఉన్ముఖీకరణ చిత్రాన్ని ఇచ్చారు. దీనికి ఒక పీరియడ్ కేటాయించాలి. అలాగే ప్రతి పాఠానికి ముందు విద్యార్థులకు సూచనలు ఇచ్చారు. దీని నిర్వహణకు ఒక పీరియడ్ కేటాయించాలి. పాఠం స్వభావాన్నిబట్టి బోధనా వ్యూహాలను ఎంపిక చేసుకోవాలి. పాఠంలోని విషయాన్ని అవగాహనపరచడానికి పాఠం నిడివినిబట్టి నాలుగు లేదా ఐదు పీరియడ్లుగా కేటాయించుకోవాలి. వివిధ సామర్థ్యాలకు సంబంధించిన అభ్యాసాలు నిర్వహించడానికి 6 నుండి 8 పీరియడ్లు కేటాయించుకోవాలి. పాఠంద్వారా సాధించే సామర్థ్యాలు దృష్టియందు ఉంచుకొని పాఠాన్ని పీరియడ్లుగా విభజించుకొని ఒక్కొక్క పీరియడులోని బోధనాంశమును బోధించడానికి, బోధనా వ్యూహాలతో బోధనాభ్యసన సామగ్రితో పాఠ్యప్రణాళిక తయారుచేసుకోవాలి.

> ఉపాధ్యాయుని విజయానికి సోపానం బోధనా వ్యూహం
> ఏ వ్యూహం లేకుండా బోధించడం వృత్తిపరమైన ద్రోహం

### పాఠ్యప్రణాళిక

1. పాఠం పేరు : శిల్పి (పద్యం)
2. తరగతి : 7వ
3. మాసం పేరు : సెప్టెంబర్
4. అవసరమైన కాలాంశాల సంఖ్య : 15
5. పాఠం ఆధారంగా సాధించాల్సిన సామర్థ్యాలు

1. **వినడం - మాట్లాడడం (I)**

H పాఠంలో పద్యాలు రాగ భావ యుక్తంగా పాడటం

H శిల్పి గొప్పదనాన్ని సొంత మాటలలో చెప్పించడం

2. **చదవడం - రాయడం (II)**

H పద్యపాదాలు ఏ సందర్భంలోనివో గుర్తించి రాయడం

H పద్యాలలో కవి-శిల్పికి మధ్య పోలికలు గుర్తించి రాయడం

3. **స్వీయరచన (III)**

H శిలకు శిల్పానికి మధ్య భేదాలు గుర్తించడం, సొంతమాటల్లో రాయడం.

H కవి చిత్రకారునికి మధ్య పోలికలు, భేదాలు సొంతమాటల్లో రాయడం.

H శిల్పి గొప్పదనం, శిల్పకళాసంపద గురించి రాయడం.

4. **పదజాలం (IV)**

H అర్థాలు తెలుసుకోవడం, ప్రకృతి వికృతులు గుర్తించడం, వాటిని ఉపయోగిస్తూ వాక్య ప్రయోగం చెయ్యడం.

H పాఠం ఆధారంగా పట్టిక గళ్లు నింపడం.

5. **సృజనాత్మకత, ప్రశంస (V, VI)**

H శిల్పి ఆత్మకథ రాయగలగడం.

H తమ తరగతి విద్యార్థులలో ఉన్న కళాకారుల గురించి వివరించడం.

**VII. ప్రాజెక్టుపని**

H లలిత కళలకు సంబంధించిన చిత్రాల సేకరణ (పాఠం పూర్తయ్యాక ఇవ్వాలి)

**VIII. భాషను గురించి తెలుసుకుందాం!**

H పదాలను విడదీయడం, గుణసంధి సూత్రసాధన.

## పీరియడ్లవారీగా విభజన - ప్రణాళిక

| కాలాంశం సంఖ్య | బోధనాంశం | బోధన వ్యూహాలు | బోధనాభ్యసన సామగ్రి |
|---|---|---|---|
| 1వ కాలాంశం | ఉన్ముఖీకరణ - చిత్రం గురించి మాట్లాడించడం (నేపథ్యం) ఉద్దేశం, కవి పరిచయం | **I. ఉపోద్ఘాతం :**<br>**1. పలకరింపు :** విద్యార్థులను పలకరించడం. పిల్లలూ! చిత్రాన్ని చూడండి.<br>**2. ఉన్ముఖీకరణ :** "శిల్పి" పాఠంలో "ఆలోచించండి-మాట్లాడించండి" చిత్రాన్ని విద్యార్థులను చూడమనడం. విద్యార్థులను కింది ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టాలి. (పూర్తి తరగతి కృత్యంగా నిర్వహించాలి)<br>1. చిత్రంలోని బొమ్మలు వేటితో తయారయ్యాయి?<br>2. ఈ చిత్రాలు ఏ కళకు సంబంధించినవి?<br>3. శిల్పాలను తయారుచేసేవారిని ఏమంటారు?<br>**3. శీర్షికా ప్రకటన :** "శిల్పి" పాఠంపేరును నల్లబల్లపై రాయాలి.<br>**4. నేపథ్యం :** మనిషికి మానసిక ఆనందాన్నిచ్చే కళలు, లలితకళల గురించి తెలియజేయడం. శిల్పి గొప్పతనాన్ని, ఔన్నత్యాన్ని తెలియజేయుట పూర్తి తరగతి కృత్యంగా నిర్వహించాలి. విద్యార్థులచే చదివించి, చర్చింపజేయడం.<br>**II. పాఠ్యాంశ బోధన చర్చ - అవగాహన :**<br>**1. కవి పరిచయం :** (వ్యక్తిగతంగా నిర్వహించాలి)<br>1. శిల్పి పాఠ్యభాగ కవి ఎవరు?<br>2. గుర్రం జాషువా రచనలు తెల్పండి. | ఉన్ముఖీకరణ చిత్రం చార్టు 134వ పేజీ |

| కాలాంశం సంఖ్య | బోధనాంశం | బోధన వ్యూహాలు | బోధనాభ్యసన సామగ్రి |
|---|---|---|---|
| | | 3. గుర్రం జాషువా బిరుదులు ఏవి?<br>పై ప్రశ్నలకు విద్యార్థులు సమాధానాలు తెలుసుకుంటారు.<br>**2. క్రోడీకరణ :** విద్యార్థులు చెప్పిన విషయాలను క్రోడీకరించి కవిపరిచయం చెప్పాలి.<br>**III. పిల్లల అవగాహన - పరిశీలన :**<br>విద్యార్థుల అవగాహనను పరిశీలించేలా ప్రశ్నించడం (వ్యక్తిగత కృత్యం)<br>1. లలితకళలు ఏవి ?<br>2. శిల్పి పాఠ్యభాగ నేపథ్యం చెప్పండి.<br>**IV. ఇంటిపని :**<br>1. శిల్పి పాఠ్యభాగం రాసిన కవిని గురించి మీకు తెలిసిన విషయాలు రాయండి.<br>2. శిల్పి పాఠ్యభాగ నేపథ్యం రాయండి. | కవి చిత్రపటం |
| 2వ కాలాంశం | పాఠ్యాంశ వివరణ: | **I. ఉపోద్ఘాతం :**<br>**1. పలకరింపు :** తరగతిగదిలో ఆహ్లాదపూరిత వాతావరణం కల్పించేలా విద్యార్థులను పలకరించాలి. విద్యార్థులను పాఠోన్ముఖులుగా చేయడం కోసం ప్రశ్నించాలి.<br>నిన్న ఇచ్చిన ఇంటిపనిని పూర్తిచేశారా?<br>విద్యార్థులు సమాధానమిస్తారు. ఇంటిపనిని పరిశీలించాలి. (5 నిముషాలు తీసుకోవాలి)<br>**2. పునశ్చరణ (వ్యక్తిగత కృత్యం) :**<br>1. గుర్రం జాషువా గురించి మీకు తెలిసిన విషయాలు చెప్పండి. | |

| కాలాంశం సంఖ్య | బోధనాంశం | బోధన వ్యూహాలు | బోధనాభ్యసన సామగ్రి |
|---|---|---|---|
| | పాఠ్యాంశ వివరణ:<br>1. చేతమిగురొత్త.....<br>......నీవు.<br>2. సున్నితంబైన......<br>...గుంకాలపూజ | 2. శిల్పి పాఠ్యభాగ నేపధ్యం రాయండి.<br>పై ప్రశ్నలకు విద్యార్థులు సమాధానమిచ్చాక పాఠంలోకి ప్రవేశం.<br>**II. పాఠ్యాంశ బోధన – చర్చ – అవగాహన:**<br>**1. విద్యార్థుల బాహ్యపఠనం :** చేతమిగురొత్త, సున్నితంబైన రెండు పద్యాలు విద్యార్థులచే బాహ్యపఠనం చేయించడం.<br>2. ఉపాధ్యాయుడు, దోషరహితంగా, రాగ, భావయుక్తంగా పద్యాల్యను ఆదర్శపఠనం చెయ్యాలి. విద్యార్థులు తాము చేసిన బాహ్యపఠనంలో దోషాలు గ్రహిస్తారు.<br>3. విద్యార్థులచే మౌనపఠనం చేయిస్తూ, కఠిన పదాల క్రింద గీత గీయమనాలి.<br>**4. అర్థసంగ్రహణం :** భయద, వసుధ, పాషాణము పై పదాలకు విద్యార్థులు వాచక నిఘంటువు సహాయంతో అర్థాలు తెలుసుకుంటారు.<br>భయద = భయంగొలిపే; వసుధ = భూమి; పాషాణము = రాయి.<br>తెలియని పదాలకు వాక్యప్రయోగ పద్ధతి ద్వారా అర్థాలను తెలుసుకొంటారు.<br>**5. పాఠ్యాంశ వివరణ – చర్చ (పూర్తితరగతి కృత్యం :** విద్యార్థులకు పద్యభావాలను చర్చల ద్వారా గ్రహింపజేయాలి.<br>చర్చనీయాంశాలు :<br>1. భూమిమీద ఉన్న కొండలల్లోని రూపాలను ఎవరు చూస్తారు? | లేపాక్షి, ఎల్లోరా శిల్పాల చిత్రప్రదర్శన<br><br>శబ్దరత్నాకరం నిఘంటువు |

| కాలాంశం సంఖ్య | బోధనాంశం | బోధన వ్యూహాలు | బోధనాభ్యసన సామగ్రి |
|---|---|---|---|
| | | 2. శిల్పి బండరాళ్ళను శిల్పాలుగా మార్చడం వలన ఏం జరిగింది? శిల్పి నల్లరాతిలో భయంకరమైన సింహాల తలలు చెక్కుతాడని, భూమిమీద కనిపించే కొండల్లోని ఎన్నో రూపాలను చూస్తాడన్న భావాన్ని విద్యార్థులచే చెప్పించాలి.<br>శిల్పియొక్క సుత్తిదెబ్బలతో ఎన్నో దేవాలయాలు బయటపడ్డాయని, నిరుపయోగంగా పడిఉన్న ఎన్నో శిలలకు శిల్పి వలన పూజలు పొందే భాగ్యం లభించిందన్న భావాన్ని విద్యార్థులచే చెప్పించాలి.<br>**III. విద్యార్థుల అవగాహన-పరిశీలన :**<br>భావాలను విద్యార్థులు గ్రహించినతర్వాత విద్యార్థుల భాగస్వామ్యాన్ని, అవగాహనను పరిశీలించడం.<br>1. శిల్పి నల్లరాతితో వేటికి చెక్కగలడు?<br>2. శిల్పి వేటికి పసుపు కుంకాల పూజ జరిగేలా అర్హత కల్పించాడు?<br>**IV. ఇంటిపని :**<br>1. చేతమిగురొత్త... పద్యభావాన్ని సొంత మాటలలో రాయండి. (ఇంటిపని పుస్తకం)<br>2. సున్నితంబైన... పద్యభావాన్ని సొంత మాటలతో రాయండి. (ఇంటిపని పుస్తకం)<br>3. కఠిన పదాలకు అర్థాలు నోట్సులో రాయండి. | |

| కాలాంశం సంఖ్య | బోధనాంశం | బోధన వ్యూహాలు | బోధనాభ్యసన సామగ్రి |
|---|---|---|---|
| 3వ కాలాంశం | పాఠ్యాంశ వివరణ:<br><br>పాఠ్యాంశ వివరణ:<br>3. కవికలంబునగల...<br>లేరీతి గ్రుచ్చినావు<br>4. ప్రతిమలు రచించి..<br>...లేదబద్ధంబుగాదు. | **I. ఉపోద్ఘాతం :**<br>**1. పలకరింపు (తరగతి కృత్యం) :** తరగతి గదిలో ఆహ్లాదకర వాతావరణం ఏర్పడేలా విద్యార్థులను పలకరించాలి. విద్యార్థులను పాఠోన్ముఖులుగా చేయడానికి ప్రశ్నించడం.<br>1. విద్యార్థులు ఇంటిపని చేశారో లేదో ప్రశ్నించి, దోషసవరణ చేయడం.<br>**2. పునశ్చరణ (వ్యక్తిగత కృత్యం) :**<br>1. మనసుకు హత్తుకొనేలా రాళ్ళను శిల్పాలుగా ఎవరు చెక్కుతారు? అతను కొండలను చూసినప్పుడు ఎటువంటి ఆలోచన కలిగిఉంటాడు?<br>2. శిల్పి సుత్తిదెబ్బలు తిన్న బండలు దేవతామూర్తులుగా మారడం వలన ఏం జరిగింది?<br>**II. పాఠ్యాంశబోధన - చర్చ - అవగాహన**<br>1. కవి కలంబునగల..., రెండు పద్యాలు విద్యార్థులచే బాహ్యపఠనం చేయించాలి. (వ్యక్తిగత కృత్యం)<br>2. ఉపాధ్యాయుడు దోషరహితంగా, రాగ, భావ యుక్తంగా పద్యాలను <u>ఆదర్శపఠనం</u> చెయ్యాలి. (విద్యార్థులు తాము బాహ్యపఠనం చేసినప్పటి దోషాలను గ్రహిస్తారు.)<br>3. విద్యార్థులచే రెండు పద్యాలను <u>మౌనపఠనం</u> చేయిస్తూ, కఠిన పదాలకింద గీత గీయమనాలి.<br>4. **అర్థసంగ్రహణం :** కంబము, పెను, కుసుమ, వల్లరులు, ప్రతిమ, వల్లెవేయించు, తారతమ్యం ఈ పదాలకు వాచకంలో ఉన్న వాచక నిఘంటువు నుంచి అర్థాలను సేకరిస్తారు. | నిఘంటువు |

| కాలాంశం సంఖ్య | బోధనాంశం | బోధన వ్యూహాలు | బోధనాభ్యసన సామగ్రి |
|---|---|---|---|
| | | కంబము = స్తంభము; కుసుమ = పూలు; వల్లరులు = తీగలు; తారతమ్యం = తేడా<br>విద్యార్థులు అర్థం దొరకని పదాలకు వాక్య ప్రయోగ పద్ధతి ద్వారా అర్థాలు తెలుసుకుంటారు. ఉదాహరణ :<br>1. గత సంవత్సరం <u>పెనుతుఫాను</u> వచ్చి విశాఖపట్టణాన్ని సర్వనాశనం చేసింది.<br>2. ప్రతి విద్యార్థి పాఠాన్ని <u>వల్లెవేయాలి</u>.<br>3. విద్యార్థులు పదాలను అవగాహన చేసుకొని పెద్ద, చెప్పడం అని సమాధానమిస్తారు.<br>5. **పాఠ్యాంశ వివరణ–చర్చ** (పూర్తితరగతి కృత్యం) విద్యార్థులకు పద్యభావాలను చర్చలద్వారా అవగాహన కల్గించాలి.<br>1. కవికి, శిల్పికి మధ్యగల సారూప్యం ఏమిటి? కవి కలానికి ఉండే అలంకార రచనాశక్తి, శిల్పిఉలికి కూడా ఉందని, అందుకే కఠినమైన రాతిస్తంభాలలో శిల్పి పూలతీగెలను చెక్కగలిగాడు అన్న భావాన్ని విద్యార్థులచే చెప్పించగలగాలి.<br>2. కవి, శిల్పి కథలు ఎలా చెప్పగలరు?<br>శిల్పాలు చూసే వాళ్ళచేత మహారాజు కథను శిల్పి చెప్పగలడు. అలాగే కవి కావ్యంలో తన రచనాశక్తి ద్వారా చూప గలడు.<br>**III. విద్యార్థుల అవగాహన–పరిశీలన**<br>విద్యార్థులు పద్యభావాలను గ్రహించాక అవగాహనను పరిశీలించడం.<br>1. కవికి, శిల్పికి మధ్య సామ్యాలు ఏమిటి? | |

| కాలాంశం సంఖ్య | బోధనాంశం | బోధన వ్యూహాలు | బోధనాభ్యసన సామగ్రి |
|---|---|---|---|
| | | **IV. ఇంటిపని :**<br>1. కవి కలంబున, ప్రతిమలు రచించి సొంత మాటలలో ఇంటిపనిపుస్తకంలో రాయండి.<br>2. కఠిన పదాలకు అర్థాలు నోట్సులో రాయండి, చదవండి. | |
| 4వ కాలాంశం | పాఠ్యాంశ వివరణ:<br>5. ఊలనిద్రించు..... ...నీవు నిశ్చయము గాను<br>6. తలయెత్తెన్గద.... ....శిల్పి కంఠీరవా! | **I. ఉపోద్ఘాతం :**<br>**1. పలకరింపు (పూర్తితరగతి కృత్యం) :** తరగతిగదిలో ఆహ్లాదకర వాతావరణం ఏర్పడేలా విద్యార్థులను పలకరించడం. పాఠోన్ముఖులుగా చేయడానికి ప్రశ్నించడం. విద్యార్థులు ఇంటిపని చేశారో లేదో ప్రశ్నించి, దోషసవరణ చేయడం.<br>**2. పునశ్చరణ (వ్యక్తిగత కృత్యం) :** కవికి, శిల్పికి మధ్యగల సామ్యాలు ఏమిటి? వారిద్దరూ తాము చెప్పదలుచుకున్న కథను ఎలా చెప్పగలరు?<br>**II. పాఠ్యాంశ బోధన – చర్చ – అవగాహన**<br>1. ఊల నిద్రించు...; తలయెత్తెన్గద... పద్యాలు విద్యార్థులచే <u>బాహ్యపఠనం</u> చేయించాలి (వ్యక్తిగతకృత్యం).<br>2. ఉపాధ్యాయుడు దోషరహితంగా, రాగ భావయుక్తంగా <u>ఆదర్శపఠనం</u> చేయడం. (విద్యార్థులు తాము బాహ్యపఠనం చేసి నప్పటి దోషాలను గ్రహిస్తారు)<br>3. విద్యార్థులచే రెండుపద్యాలను మౌనపఠనం చేయిస్తూ, కఠినపదాల కింద గీతగీయమనాలి. | అజంతా చిత్రాలు |

| కాలాంశం సంఖ్య | బోధనాంశం | బోధన వ్యూహాలు | బోధనాభ్యసన సామగ్రి |
| --- | --- | --- | --- |
| | | 4. **అర్థసంగ్రహణం :** చతురత్వం, గహ్వరం, శ్రేణి, హరిత్తులు, ముగ్ధ, శిల్పి కంఠీరవా! ఈ పదాలకు వాచక నిఘంటువు నుండి అర్థాలను సేకరిస్తారు.<br>1. చతురత్వం = నేర్పు, 2. గహ్వరం = గుహ, 3. శ్రేణి = వరుస<br>4. హరిత్తులు = సింహాలు, 5. శిల్పికంఠీరవా = శిల్పులలో గొప్పవాడా!<br>6. శ్రేణి = వరుస<br>విద్యార్థులు అర్థం దొరకని పదాలకు వాక్యపద్ధతి ద్వారా అర్థాలు తెలుసుకుంటారు.<br>1. అజంతా శిల్పాలు <u>ముగ్ధ</u>గతిలో ఉంటాయి.<br>"అందాన్ని పొందడం" అనే అర్థాన్ని విద్యార్థులు అవగాహన చేసుకొని సమాధాన మిస్తారు.<br>5. **పాఠ్యాంశ వివరణ – చర్చ (పూర్తి తరగతి కృత్యం) :** విద్యార్థులకు భావాన్ని చర్చద్వారా అవగాహన కల్గించుట.<br>1. శిల్పికి శాశ్వతుడు అనే పేరు ఎందుకు వస్తుంది?<br>శిల్పి నిద్రపోతున్న బొమ్మలకు ఉలిని తాకించి మేల్కొలిపి బయటకు పిలిచాడు (చెక్కాడు) అవి కవిపేరును శాశ్వతునిగా చేస్తాయి.<br>2. శిల్పి గొప్పదనం ఏమిటి?<br>అజంతా గుహల్లో శిల్పి నైపుణ్యాన్ని చూడవచ్చు. శిల్పి సుత్తి బండరాళ్ళలో జీవకళను నింపగలడు. "అతని సుత్తె నుండే మానవ విగ్రహాలు పుడతాయి. సింహాలు నీ బొమ్మల దగ్గర అందాన్ని పొందుతాయనే" భావాలను విద్యార్థులచే చెప్పించాలి. | నిఘంటువు |

| కాలాంశం సంఖ్య | బోధనాంశం | బోధన వ్యూహాలు | బోధనాభ్యసన సామగ్రి |
|---|---|---|---|
| | | **III. విద్యార్థుల అవగాహన-పరిశీలన :**<br>విద్యార్థులు పద్యభావాలను గ్రహించాక అవగాహనను పరిశీలించడం.<br>1. కవి శిల్పిని శాశ్వతుడవని ఎందుకన్నాడు?<br>2. శిల్పి కంఠీరవా! అన్న పదం శిల్పికి ఏవిధంగా వర్తిస్తుందో చెప్పగలవా?<br>**IV. ఇంటిపని :**<br>1. శిల్పి ఉలికి ఎటువంటి శక్తి ఉంది? (ఇప.పు)<br>2. తలయెత్తెన్ గదా! ... పద్యభావాన్ని సొంత మాటలలో రాయండి. (ఇ.ప.పు)<br>3. కఠినపదాల అర్థాలు నోట్సులో రాయండి. | |
| 5వ కాలాంశం | పాఠ్యాంశ వివరణ:<br>7. నునుపుల్‌దీర్చి.<br>...శిల్పవిద్యానిధీ<br>8. తెలిబాతిన్....<br>...నీప్రజ్ఞకున్ | **I. ఉపోద్ఘాతం :**<br>**1. పలకరింపు (పూర్తితరగతి కృత్యం) :** తరగతిగదిలో ఆహ్లాదకర వాతావరణం ఏర్పడేలా విద్యార్థులను పలకరించాలి. పాఠోన్ముఖులుగా చేయడానికి ప్రశ్నించడం, విద్యార్థులు ఇంటిపని చేశారో లేదో ప్రశ్నించి, దోషసవరణ చేయడం.<br>**2. పునశ్చరణ (వ్యక్తిగత కృత్యం) :**<br>1. అలనిద్రించు... పద్యభావాన్ని సొంత మాటలలో చెప్పండి.<br>2. కవి శిల్పిని "శిల్పికంఠీరవా!" అని సంభోదించడానికి కారణం ఏమైఉంటుంది? | మహాబలిపురం ఏకశిలారథం చిత్రం |

| కాలాంశం సంఖ్య | బోధనాంశం | బోధన వ్యూహాలు | బోధనాభ్యసన సామగ్రి |
|---|---|---|---|
| | | **II. పాఠ్యాంశ బోధన చర్చ - అవగాహన :**<br>1. నునుపుల్‌దీర్చి... శిల్పవిద్యానిధీ, తెలిజాతిన్...<br>నీ ప్రజ్ఞకున్ పద్యాలు విద్యార్థులచే బాహ్యపఠనం చేయించుట.<br>2. ఉపాధ్యాయుడు పద్యాన్ని అర్థవంతంగా, దోషరహితంగా, రాగ భావయుక్తంగా ఆదర్శ పఠనం చేయాలి. (విద్యార్థులు తాము బాహ్యపఠనం చేసినప్పటి దోషాలను గ్రహిస్తారు)<br>3. విద్యార్థులచే రెండు పద్యాలను మౌన పఠనం చేయిస్తూ కఠినపదాల కింద గీత గీయమనాలి.<br>4. **అర్థసంగ్రహణం :** గున్నఏనుగు, శిరోగ్రం, లేమి, శిల్పవిద్యానిధీ, తెలిరాయి, అచ్చర పజ్జ జగము, ప్రజ్ఞ ఈ కఠినపదాలకు విద్యార్థులు వాచక నిఘంటువులోని అర్థాలను సేకరిస్తారు.<br>1. గున్నఏనుగు = పిల్లఏనుగు, 2. శిల్పవిద్యానిధీ = శిల్పవిద్యలో ఆరితేరినవాడు,<br>3. తెలిరాయి = తెల్లరాయి, 4. అచ్చర = అప్సరస, 5. పజ్జ = దగ్గర,<br>6. జగము = ప్రపచము, 7. ప్రజ్ఞ = ప్రతిభ, నేర్పు<br>విద్యార్థులు అర్థందొరకని పదాలకు వాక్యపద్ధతి ద్వారా అర్థాలు తెలుసుకుంటారు.<br>1. రాజుకు శిరోగ్రమున కిరీటం ఉంటుంది.<br>2. బీదవారు లేమి వలన బాధలు పడుతుంటారు.<br>తలపై దారిద్ర్యం అనే అర్థాలను విద్యార్థులు అవగాహనచేసుకొని సమాధానమిస్తారు. | |

| కాలాంశం సంఖ్య | బోధనాంశం | బోధన వ్యూహాలు | బోధనాభ్యసన సామగ్రి |
|---|---|---|---|
| | | 5. **పాఠ్యాంశ వివరణ - చర్చ** (పూర్తి తరగతి కృత్యం) : విద్యార్థులకు పద్యభావాలను చర్చల ద్వారా అవగాహన కల్గించడం.<br>1. శిల్పికి ఎటువంటి నేర్పు కిరీటమై వెలుగొందుతుంది?<br>"మదజలం కారుతున్న ఏనుగులను, వాటి పిల్లలను నున్నగా చెక్కిన నేర్పు శిల్పి కిరీటమై వెలుగుతుంది. మన తెలుగునేల నీవంటి శిల్పుల గొప్పదనాన్ని చూసి ఉప్పొంగినా, కవి దారిద్ర్యాన్ని చూసి కన్నీరు కారుస్తున్నది" అన్న భావాన్ని విద్యార్థులచే చెప్పించగలగాలి.<br>2. కవి శిల్పియొక్క ప్రతిభకు ఎందుకు నమస్కరించాడు?<br>"తెల్లరాతిలో అప్సరసను సృష్టించి, ఆమె విశాలనేత్రాలకు పక్కగా కవి తనను మలచుకొని సంతోషపడుతున్నాడని, శిల్పి ప్రపంచంలో శాశ్వతత్వాన్ని కల్పించుకో గలిగినవాడు" అన్నభావాన్ని విద్యార్థులచే చెప్పించగలగాలి.<br>**III. విద్యార్థుల అవగాహన-పరిశీలన :** విద్యార్థులు పద్యభావాలను గ్రహించాక వారి అవగాహనను పరిశీలించాలి.<br>1. తెలుగునేల ఎవరిని చూసి ఉప్పొంగుతుంది? ఎందుకు?<br>2. శిల్పి ప్రపంచంలో శాశ్వతత్వాన్ని కల్పించుకోగలడని ఎట్లు చెప్పగలవు?<br>**IV. ఇంటిపని :**<br>1. కవి శిల్పిని "శిల్పవిద్యానిధీ" అని పిలవడంలో ఔచిత్యం ఏమిటి? (ఇప.పు) | |

| కాలాంశం సంఖ్య | బోధనాంశం | బోధన వ్యూహాలు | బోధనాభ్యసన సామగ్రి |
|---|---|---|---|
| | | 2. శిల్పి యొక్క ప్రతిభ ఎలాంటిది ? (ఇప.పు)<br>3. కఠిన పదాల అర్థాలు నోట్సులో రాసి, చదవమనుట. | |
| 6వ కాలాంశం | ఇవి చేయండి "వినడం-మాట్లాడడం". ప్రశ్నలపై అభ్యాసం. | **I. ఉపోద్ఘాతం :**<br>**1. పలకరింపు** (పూర్తి తరగతి కృత్యం) : తరగతిగదిలో ఆహ్లాదకర వాతావరణం ఏర్పడేలా విద్యార్థులను పలకరించడం. విద్యార్థులు ఇంటిపని చేశారో లేదో ప్రశ్నించి, దోషసవరణ చేయడం.<br>**2. పునశ్చరణ** (వ్యక్తిగత కృత్యం) :<br>1. తెలుగునేల ఎవరి గొప్పదనాన్ని చూసి ఉప్పొంగుతుంది? ఎందుకు (సమాధానం రాబట్టాక)<br>**II. సామర్థ్యాల సాధన - అభ్యాసం :**<br>ప్రశ్నలు నల్లబల్లపై రాయాలి.<br>1. పాఠంలో ఉండే పద్యాలను రాగయుక్తంగా, భావయుక్తంగా పాడండి.<br>2. కవి శిల్పి శాశ్వతుడని, ఆయన ప్రజ్ఞకు నమస్కారం చేయమని చెప్పాడు. దీనిమీద మీ అభిప్రాయం ఏమిటి?<br>3. శిల్పి రాతిని శిల్పంగా మార్చడంలో పడే శ్రమను గురించి మీరేమనుకుంటున్నారు?<br>H పూర్తితరగతిలో ఒక్కొక్కరితో మాట్లాడించాలి. చర్చలో పాల్గొనేటట్లు చెయ్యాలి.<br>విద్యార్థుల చర్చ సారాంశాన్ని క్రోడీకరించాలి. ముగింపునివ్వాలి. | |

| కాలాంశం సంఖ్య | బోధనాంశం | బోధన వ్యూహాలు | బోధనాభ్యసన సామగ్రి |
|---|---|---|---|
| | | **III. విద్యార్థుల అవగాహన-పరిశీలన :**<br>విద్యార్థుల అవగాహనను పరిశీలించడానికి 2, 3 ప్రశ్నలను వ్యక్తిగతంగా ప్రశ్నించాలి.<br>**IV. ఇంటిపని :** అర్థాలు చదవమనడం. | |
| 7వ కాలాంశం | ఇవి చేయండి చదవడం-రాయడం ప్రశ్నలపై అభ్యాసం | **I. ఉపోద్ఘాతం :**<br>**1. పలకరింపు :** తరగతిగదిలో ఆహ్లాదకర వాతావరణం ఏర్పడేలా విద్యార్థులను పలకరించాలి. విద్యార్థులు ఇంటిపని చేశారో లేదో పరిశీలించడం.<br>**2. పునశ్చరణ** (వ్యక్తిగత కృత్యం) :<br>1. సున్నితంబైన నీచేతి సుత్తెనుండి పద్యాన్ని<br>2. ప్రతిమలు రచించె యొకమహారాజు చరిత పద్యాన్ని భావయుక్తంగా రాగయుక్తంగా పాడించడం.<br>**II. సామర్థ్యాల సాధన - అభ్యాసం :** 'ఇవి చేయండి' లో చదవడం-రాయడం ప్రశ్నలు నల్లబల్లపై రాయాలి.<br>1. కింది పద్యపాదాలు పాఠంలోని ఏయే పద్యాల్లో ఉన్నాయి. వాటి సందర్భమేమిటి?<br>అ) బయలుపడెవెన్నియెన్ని దేవస్థలములు<br>ఆ) తారతమ్యంబు లేదబద్ధంబగాదు...<br>ఇ) .................<br>ఈ)................. | |

| కాలాంశం సంఖ్య | బోధనాంశం | బోధన వ్యూహాలు | బోధనాభ్యసన సామగ్రి |
|---|---|---|---|
| | | 2. కవి శిల్పి శాశ్వతుడని, ఆయన ప్రజ్ఞకు నమస్కారం చేయమని చెప్పాడు. దీనిమీద మీ అభిప్రాయం ఏమిటి?<br>3. కింది గద్యాన్ని చదవండి - ప్రశ్నలు రాయండి.<br>వీటిని పూర్తి తరగతి కృత్యంగా ఒక్కొక్కరితో చదివించడం - ప్రశ్నలకు సమాధానాలు రాయించడం.<br>**III. విద్యార్థుల అవగాహన-పరిశీలన :**<br>విద్యార్థుల అవగాహనను పరిశీలించడానికి చదవడం-రాయడం అభ్యాసాలపై 2, 3 ప్రశ్నలను వ్యక్తిగతంగా ప్రశ్నించాలి!<br>**IV. ఇంటిపని :** పై ప్రశ్నలను చదవమనడం. | |
| 8వ కాలాంశం | ఇవి చేయండి స్వీయరచన ప్రశ్నలపై అభ్యాసం | **I. ఉపోద్ఘాతం :**<br>**1. పలకరింపు :** తరగతిగదిలో ఆహ్లాదకర వాతావరణం ఏర్పడేలా విద్యార్థులను పలకరించడం.<br>**2. పునశ్చరణ** : 7వ పీరియడులో అభ్యాసాలపై ప్రశ్నించడం, ఇంటిపనిపై సూచనలు. (అదనపు సమయంలో పరిశీలించి దోషాలు సవరించాలి.)<br>**II. సామర్థ్యాల సాధన - అభ్యాసం :** శిల్పి పాఠంలోని స్వీయరచన అభ్యాసం కింద ఇచ్చిన ప్రశ్నలు నల్లబల్లపై రాయాలి. సొంతమాటల్లో జవాబులు రాయించాలి.<br>1. శిల్పి రాళ్లలో ఏయే రూపాలను చూసి ఉంటాడు?<br>2. నల్లని రాళ్లకు శిల్పిమీద కృతజ్ఞత ఎందుకుండాలి? | |

| కాలాంశం సంఖ్య | బోధనాంశం | బోధన వ్యూహాలు | బోధనాభ్యసన సామగ్రి |
|---|---|---|---|
| | | 3. శిలకు శిల్పానికి ఉండే భేదం ఏమిటి?<br>4. కవికి చిత్రకారుడికీ ఉండే పోలికలు - భేదాలు - ఏమిటి?<br>ఈ ప్రశ్నలకు విద్యార్థులతో చర్చించి జవాబులు రాబట్టడం. సొంతంగా జవాబులు రాయించండి.<br>**III. విద్యార్థుల అవగాహన-పరిశీలన :**<br>విద్యార్థుల అవగాహనను పరిశీలించడానికి "స్వీయరచన" అభ్యాసంలో 2, 3 ప్రశ్నలను విద్యార్థులను ప్రశ్నించాలి. (వ్యక్తిగత)<br>**IV. ఇంటిపని :** చూసేవాళ్లకు శిల్పాలు మహారాజుల కథలు చెప్పగలవని కవి అంటున్నాడు కవి ఎందుకు అన్నాడు?<br>(అదనపు సమయంలో పరిశీలించాలి. దోషాలు సవరించాలి) | |
| 9వ కాలాంశం | ఇవి చేయండి స్వీయరచన ప్రశ్నలపై అభ్యాసం | **I. ఉపోద్ఘాతం :**<br>**1. పలకరింపు :** తరగతిగదిలో ఆహ్లాదకర వాతావరణం ఏర్పడేలా విద్యార్థులను పలకరించాలి.<br>**2. పునశ్చరణ** : 8వ పీరియడులో అభ్యాసాలపై ప్రశ్నలు వేయడం.<br>**II. సామర్థ్యాల సాధన - అభ్యాసం :** శిల్పి పాఠంలోని స్వీయరచన అభ్యాసం కింద ఇచ్చిన మిగిలిన ప్రశ్నలు నల్లబల్లపై రాయాలి. జవాబులు సొంతమాటల్లో రాయించాలి. (తరగతి కృత్యం) | |

| కాలాంశం సంఖ్య | బోధనాంశం | బోధన వ్యూహాలు | బోధనాభ్యసన సామగ్రి |
|---|---|---|---|
| | | క్రింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాల్లో సమాధానాలు రాయండి.<br>1. మనరాష్ట్రంలోని శిల్పకళా సంపదను గూర్చి వ్యాసం రాయండి.<br>2. శిల్పి పదాన్ని వివరిస్తూ వ్యాసం రాయండి.<br>విద్యార్థులతో చర్చించడం – జవాబులు రాబట్టడం, సొంత మాటల్లో పైప్రశ్నలకు వ్యాసాలు రాయించడం.<br>ఇంటి పనిగా ఇచ్చిన ప్రశ్నకు సమాధానం ఎలా రాయాలో తగు సూచనలు ఇవ్వడం.<br>**III. విద్యార్థుల అవగాహన–పరిశీలన :** విద్యార్థులను ప్రశ్నించడం పైప్రశ్నలు ఎలారాశారో పరిశీలించడం.<br>**IV. ఇంటిపని :** ఈ పాఠంలో ఒకచోట "శిల్పి దారిద్ర్యాన్ని చూసి తెలుగుదేశం కంటతడి పెడుతుంది" దీనిపై మీ అభిప్రాయం రాయండి.<br>(అదనపు సమయంలో ఇంటిపని పరిశీలించాలి.) | |
| 10వ కాలాంశం | ఇవి చేయండి "పదజాలం" శీర్షికలో అభ్యాసం | **I. ఉపోద్ఘాతం :**<br>**1. పలకరింపు :** తరగతిగదిలో ఆహ్లాదకర వాతావరణం ఉండేలా విద్యార్థులను పలకరించాలి.<br>**2. పునశ్చరణ** : 9వ పీరియడు అభ్యాసంపై ప్రశ్నలు వేయడం, ఇంటిపనిపై సూచనలు.<br>**II. సామర్థ్యాల సాధన – అభ్యాసం :**<br>1. శిల్పి పాఠంలో పదజాలంలో ఉన్న 1, 2, 3 ప్రశ్నలు నల్లబల్లపై రాయడం. | పదాలు, అర్థాలు రాసిన చార్టు. |

| కాలాంశం సంఖ్య | బోధనాంశం | బోధన వ్యూహాలు | బోధనాభ్యసన సామగ్రి |
|---|---|---|---|
| | | 2. గీతగీసిన పదాలకు మరో సందర్భాన్ని ఉపయోగించి విద్యార్థులతో వాక్యాలు చెప్పించి జవాబులు చెప్పించడం, రాయించడం.<br>3. వాక్యాలలో ఉన్న ప్రకృతి-వికృతి పదాలను గుర్తింపచేసి వాటిని ఉపయోగించి సొంత వాక్యాలు రాయించడం.<br>4. ఇచ్చిన సూచనల ఆధారంగా పాఠంలోని పదాలతో గళ్లు నింపించడం.<br>**III. విద్యార్థుల అవగాహన పరిశీలన :** పైన చేసిన అభ్యాసంపై వ్యక్తిగతంగా, ఇద్దరు, ముగ్గురు విద్యార్థులను ప్రశ్నించడం.<br>**IV. ఇంటిపని :** మీ ఇంటి దగ్గరున్న పత్రికలోని పదకేళి (గళ్ల నుడికట్టు) ని పూరించండి. (ఇంటి పనిని అదనపు సమయంలో పరిశీలించాలి.) | గళ్ల నుడికట్టు చార్టు. |
| 11వ కాలాంశం | "ఇవి చేయండి" శీర్షికలో "సృజనాత్మకత" & ప్రశంస | **I. ఉపోద్ఘాతం :**<br>**1. పలకరింపు :** తరగతిగదిలో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడేలా విద్యార్థులను పలకరించడం.<br>**2. పునశ్చరణ** : 10వ పీరియడు అభ్యాసాలపై ప్రశ్నలువేయడం, ఇంటిపనిపై సూచనలు ఇవ్వడం.<br>**II. సామర్థ్యాల సాధన - అభ్యాసం :**<br>1. శిల్పి పాఠంలోని సృజనాత్మకతకు సంబంధించిన అభ్యాసంపై ఇచ్చిన ప్రశ్నలు నల్లబల్లపై రాయడం. | |

| కాలాంశం సంఖ్య | బోధనాంశం | బోధన వ్యూహాలు | బోధనాభ్యసన సామగ్రి |
|---|---|---|---|
| | | 2. శిల్పి ఆత్మకథను రాయడానికి సూచనలు ఇవ్వడం, చెప్పించడం, రాయించడం.<br>3. చురుకైన విద్యార్థులతో రాసినదానిని ఏకపాత్రాభినయానికి సంసిద్ధులను చేయడం.<br>**III. విద్యార్థుల అవగాహన పరిశీలన :** శిల్పి ఆత్మకథపై ప్రశ్నలు వేయడం.<br>**IV. ఇంటిపని :** చెట్టు, కుక్క, కాగితం వంటి వాటిపై ఆత్మకథను రాయండి? – ఏకపాత్రను చదవడం. (ఇంటిపనిని అదనపు సమయంలో పరిశీలించాలి, దోషాలు సవరించాలి.) | |
| 12వ కాలాంశం | ఇవి చేయండి శీర్షికలో 'ప్రశంస' & ప్రాజెక్టుపని | **I. ఉపోద్ఘాతం :**<br>**1. పలకరింపు :** తరగతిగదిలో ఆహ్లాదకర వాతావరణం ఏర్పడేలా విద్యార్థులను పలకరించాలి.<br>**2. పునశ్చరణ** : విద్యార్థులచే ఏకపాత్రాభినయ ప్రదర్శన.<br>**II. సామర్థ్యాల సాధన – అభ్యాసం :**<br>1. ప్రశంస ప్రశ్నలను నల్లబల్లపై రాయడం.<br>2. పాఠశాలల విద్యార్థులలో లలితకళలో నైపుణ్యమున్న వారిని గురించి విద్యార్థులతో చెప్పించడం.<br>3. లలితకళల్లో నైపుణ్యమున్న విద్యార్థులతో వారి నైపుణ్యాన్ని ప్రదర్శింపచేయడం.<br>4. శిల్పం–సంగీతం వంటి వాటి సంబంధించినవి సేకరించుటకు సూచనలు ఇవ్వడం. | లలితకళల్లో ప్రసిద్ధులైన కళాకారుల చిత్రాలు |

| కాలాంశం సంఖ్య | బోధనాంశం | బోధన వ్యూహాలు | బోధనాభ్యసన సామగ్రి |
|---|---|---|---|
| | | **III. విద్యార్థుల అవగాహన పరిశీలన :** కళాకారులకు సంబంధించి, లలితకళల్లో నైపుణ్యమున్న వారిని గురించి ప్రశ్నించడం.<br>**IV. ఇంటిపని :** ప్రాజెక్టుపని ఇవ్వడం. దినపత్రికలు, పుస్తకాలనుండి శిల్పకళ, సంగీతానికి సంబంధించిన చిత్రాలు సేకరించండి. | |
| 13వ కాలాంశం | ప్రాజెక్టుపని | **I. ఉపోద్ఘాతం :**<br>**1. పలకరింపు :** తరగతిగదిలో ఆహ్లాదకర వాతావరణం ఏర్పడేలా విద్యార్థులను పలకరించడం.<br>**2. పునశ్చరణ :** ప్రాజెక్టుపనికి సంబంధించి పిల్లలు సేకరించినవాటిని గురించి అడగడం.<br>**II. సామర్థ్యాల సాధన – అభ్యాసం :**<br>1. ప్రాజెక్టుపనికి సంబంధించిన సూచనలు నల్లబల్లపై రాయడం.<br>2. ప్రాజెక్టుపనిలో విద్యార్థులు సేకరించి తెచ్చిన చిత్రాలు ప్రదర్శించడం.<br>3. ఒకే కళకు సంబంధించిన వాటిని నమోదుచేయడం – క్రోడీకరించడం – విద్యార్థులతో చెప్పించడం.<br>4. ప్రదర్శించిన వాటిపై చర్చించడం – నివేదికను విద్యార్థులతో రాయించడం. (నివేదిక రాయడానికి తగిన సూచనలు ఇవ్వాలి)<br>**III. విద్యార్థుల అవగాహన పరిశీలన :** ప్రాజెక్టుపనికి సంబంధించిన ప్రశ్నలు వేయడం.<br>**IV. ఇంటిపని :** మీరు నిర్వహించిన ప్రాజెక్టుపని గూర్చి నివేదికను రాసుకురండి. (అదనపు సమయంలో పరిశీలించి – దోషాలు సవరించాలి) | |

| కాలాంశం సంఖ్య | బోధనాంశం | బోధన వ్యూహాలు | బోధనాభ్యసన సామగ్రి |
|---|---|---|---|
| 14వ కాలాంశం | ఇవి చేయండి శీర్షికలో భాషను గురించి తెలుసుకుందాం | **I. ఉపోద్ఘాతం :**<br>**1. పలకరింపు :** తరగతిగదిలో ఆహ్లాదకర వాతావరణం ఏర్పడేలా విద్యార్థులను పలకరించాలి.<br>**2. పునశ్చరణ** : ప్రాజెక్టుపని నివేదిక చదవడం.<br>**II. సామర్థ్యాల సాధన – అభ్యాసం :**<br>భాషను గురించి తెలుసుకుందాంలోని, కింది పదాలను<br>1. విడదీయండి పదాలను నల్లబల్లపై రాయడం – ఉదాహరణ ద్వారా విద్యార్థులతో పదాలను విడదీయించాలి.<br>2. పదాలను విద్యార్థులు విడదీసిన తరువాత, సంధి జరగడానికి ముందు, సంధి జరిగిన తరువాత మార్పులను విద్యార్థులతో గుర్తింపచేయాలి.<br>3. అనుమానోపపత్తి పద్ధతి ద్వారా విద్యార్థులతో గుణసంధి సూత్రాన్ని రాబట్టడం.<br>**III. విద్యార్థుల అవగాహన పరిశీలన :** గుణసంధి పదాలపై, సంధిసూత్రంపై ప్రశ్నలు వేయాలి.<br>**IV. ఇంటిపని :** మీ పాఠ్యపుస్తకంలోని ముందున్న పాఠాలలో గుణసంధిని తెలిపే పదాలను రాయండి. (ఇంటిపని పుస్తకాన్ని అదనపు సమయంలో పరిశీలించాలి, దోషాలు సవరించాలి.) | గుణసంధి సూత్రం చార్టు |

| కాలాంశం సంఖ్య | బోధనాంశం | బోధన వ్యూహాలు | బోధనాభ్యసన సామగ్రి |
|---|---|---|---|
| 15వ కాలాంశం | "నేనివి చేయగలనా" శీర్షిక (స్వీయమూల్యాంకనం) | **I. ఉపోద్ఘాతం :**<br>**1. పలకరింపు :** తరగతిగదిలో ఆహ్లాదకర వాతావరణం ఏర్పడేలా విద్యార్థులను పలకరించడం.<br>**2. పునశ్చరణ :** గుణసంధి సూత్రముపై ప్రశ్నలు అడగాలి. (14వ పీరియడుకు సంబంధించి)<br>**II. సామర్థ్యాల సాధన (స్వీయమూల్యాంకనం) అభ్యాసం :**<br>పై సామర్థ్యాలు విద్యార్థులు సాధించారో లేదో వ్యక్తిగతంగా అడగాలి.<br>1. "నేనివి చేయగలనా" లో ఇచ్చిన ఔను/కాదు ఒక్కొక్క అంశంను విద్యార్థులతో (వ్యక్తిగతకృత్యం) చెప్పించాలి.<br>2. అంశాలను నల్లబల్లపై రాయాలి.<br>3. అంశం పూర్తిచేయగలమన్న వారితో చేతులు ఎత్తించడం.<br>4. ఏయే సామర్థ్యాలలో ఏ విద్యార్థులు వెనుకబడిఉన్నారో గుర్తించాలి.<br>5. ఆయా సామర్థ్యాల పునర్బలనానికి కృత్యాలను రూపొందించుకొని అభ్యాసాలు సాధన చేయించాలి.<br>**III. విద్యార్థుల అవగాహన పరిశీలన :** పునర్బలనానికి నిర్వహించిన కృత్యాలపై ప్రశ్నలు అడగాలి. | |

**5. ఉపాధ్యాయుల తయారీ అదనపు సమాచార సేకరణ**

- H పాఠ్యప్రణాళిక అమలుచేసిన తరువాత సౌలభ్యాలు – ఇబ్బందులు రాయాలి.
- H తదుపరి సంవత్సరం మార్పులు చేయదలస్తే అవి రాయాలి.
- H వెనుకబడిన విద్యార్థులకు, అదనపు కృత్యాలు రాయాలి.
- H అదనపు బోధనాభ్యసన సామగ్రిని సేకరించాలి – రాయాలి.

**6. ఉపాధ్యాయుల ప్రతిస్పందన**

- H విద్యార్థుల భాగస్వామ్యం – ప్రతిస్పందన సంతృప్తికరంగా ఉందో, లేదో రాయాలి.

## 8.5 పిరియడు ప్రణాళిక (కాలాంశ ప్రణాళిక)

ఉపాధ్యాయుడు తాను బోధించబోయే పాఠానికి పాఠ్యప్రణాళికలో బోధనాంశము, బోధనా వ్యూహాలు పీరియడువారీగా తయారుచేసుకుంటాడు. పాఠ్యప్రణాళికలో మొదటి పీరియడులో చూపించిన బోధనాంశమునకు ప్రణాళిక తయారుచేసుకోవాలి. అంటే ఒక పీరియడులో ఒక నిర్ణీత బోధనాంశాన్ని 45 ని॥లలో బోధించడానికి తయారుచేసుకొనే ప్రణాళికనే పీరియడు ప్రణాళిక అంటారు. బోధించదలచిన పీరియడులో ఏ సామర్థ్యాలు విద్యార్థులలో సాధించాలో ప్రణాళికలో పొందుపరచాలి. బోధనాంశమునకు తరగతిగదిలో సోపానాలవారీగా బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించాలి. దీని నిర్వహణకు అవసరమైన బోధనాభ్యసన సామగ్రిని ప్రణాళికలో పొందుపరచాలి. బోధించిన పీరియడులో నిర్వహించిన బోధనాభ్యసన కృత్యములు, బోధనాంశము పిల్లల అవగాహన ఎలాఉందో పరిశీలించాలి. వీటన్నింటిని పొందుపరచి ప్రణాళిక తయారు చేయడమే పీరియడు ప్రణాళిక. ఉపాధ్యాయ జిల్లా విద్యా శిక్షణాసంస్థలలో శిక్షణ పొందుచున్న ఛాత్రోపాధ్యాయులు ఉపాధ్యాయ శిక్షకుల మార్గదర్శకత్వంలో టీచింగ్ ప్రాక్టీసు కొరకు పాఠశాలలకు వెళ్లి ఎలిమెంటరీస్థాయి తరగతులు బోధించాలి. ఒకే పీరియడులో 45 నిమిషాల పాటు బోధనాభ్యసన కృత్యాల నిర్వహణకు సిద్ధపడాలి. దానికి ఈ పీరియడు పథకము ఉపయోగ పడుతుంది.

## మాదిరి పీరియడు ప్రణాళిక - 2

1. విషయం : తెలుగు
2. తరగతి : 7వ తరగతి
3. పాఠం పేరు : శిల్పి
4. సమయం : 45 ని॥లు
5. పీరియడు సంఖ్య : 1
6. బోధనాంశం : ఉన్ముఖీకరణ చిత్రం గురించి మాట్లాడించడం
7. సాధించాల్సిన సామర్థ్యాలు :
   - వినడం, ఆలోచించడం - మాట్లాడడం
   - చిత్రాన్ని చూచి ఆలోచిస్తారు. తమ అభిప్రాయములను స్పష్టంగా వ్యక్తపరుస్తారు.
   - చిత్రం ఏకళకు సంబంధించిందో చెప్పగలుగుతారు.
   - కళారూపాలను గురించి వింటారు. చూసి అర్థం చేసుకుంటారు. ఆసక్తిని, అభిరుచిని పెంచుకుంటారు.
   - శిల్పకళను గురించి వర్ణనాత్మకంగా వివరించగల్గుతారు.
8. బోధనా సోపానాలు :

| సోపానం | బోధనాభ్యసన ప్రక్రియలు | నల్లబల్ల పని | బోధనాభ్యసన సామగ్రి/ వనరులు |
|---|---|---|---|
| I. ఉపోద్ఘాతం<br>1. పలకరింపు<br>2. ఉన్ముఖీకరణ చిత్రం గురించి మాట్లాడించడం | పిల్లలూ! శుభోదయం, బాగున్నారా! సంతోషంగా ఉన్నారా?<br>(ఆప్యాయంగా పలకరించాలి)<br>చార్టులోని చిత్రాన్ని చూపిస్తూ,<br>1. చిత్రంతో ఏమున్నాయి? - ఎద్దు, నంది, స్తంభం పిల్లల సమాధానాలు -<br>2. అలాంటివి ఎక్కడైనా చూచారా?<br>3. ఎక్కడ చూశారు? - దేవాలయం<br>4. మీ ఊరిలో ఎన్ని దేవాలయాలు ఉన్నాయి?<br>5. ఏయే దేవాలయాలు ఉన్నాయి?<br>6. దేవాలయాలు దేనితో కట్టారు?<br>7. గోడలపై ఏమున్నాయి?<br>8. ఎలాంటి బొమ్మలున్నాయి?<br>9. స్తంభాలపై బొమ్మలు ఉన్నాయా? ఉంటే ఎలాంటి బొమ్మలున్నాయి?<br>10. చెక్కతో వస్తువులను తయారుచేసేవారిని ఏమంటారు?<br>11. కుండలు దేనితో చేస్తారు?<br>12. కుండలు చేసేవారిని ఏమంటారు?<br>13. ఇలా సందర్భాన్నిబట్టి ఒక్కొక్కరిని ప్రశ్నలువేస్తూ మాట్లాడించాలి. ఎన్ని ఎక్కువ ప్రశ్నలు వేయగలమో అన్ని వేయాలి. | పిల్లల సమాధానాలలో కీలక పదాలు నల్లబల్లపై రాస్తారు.<br>సిమెంటు, ఇటుక, రాతితో<br>బొమ్మలు<br>నాట్యం<br>మట్టితో<br>కుమ్మరి | 34వ పేజీ నందు గల చిత్రం చార్టు |

| సోపానం | బోధనాభ్యసన ప్రక్రియలు | నల్లబల్ల పని | బోధనాభ్యసన సామగ్రి/ వనరులు |
|---|---|---|---|
| 3. శీర్షికా ప్రకటన | చిత్రాలు ఏ కళకు సంబంధించినవి ?<br>రాతిని బొమ్మగా చెక్కితే ఏమంటారు?<br>ఈరోజు శిల్పి అనే పాఠాన్ని చెప్పుకుందాం. (పాఠం శీర్షికను) | శిల్పకళ - శిల్పి (శీర్షికను నల్లబల్లపై రాయాలి) | చిన్న శిల్పం |
| 4. నేపథ్యం | మనిషికి మానసిక అందాన్నిచ్చేవి కళలు. లలితకళలు సంగీతం, సాహిత్యం, నాట్యం, చిత్రలేఖనం, శిల్పం అనేవి. శిల్పకళ ఔన్నత్యాన్ని శిల్పి గొప్పతనాన్ని వివరించడం ద్వారా గ్రహిస్తారు. | లలితకళలు : సంగీతం, సాహిత్యం, నాట్యం, చిత్రలేఖనం, శిల్పం | లలితకళల చిత్రాల చార్టులు |
| 5. కవి పరిచయం | శిల్పి అనే పద్యభాగాన్ని రాసింది గుఱ్ఱం జాషువా. | గుఱ్ఱం జాషువా | గుఱ్ఱం జాషువాగారి చిత్రం |
| II. బోధనాంశంపై చర్చ, అవగాహన | లలితకళలను గురించి చార్టులను చూపిస్తూ పిల్లలను మాట్లాడించాలి. పిల్లలతోనే సంగీతం, సాహిత్యం, నాట్యం, చిత్రలేఖనంకు సంబంధించి ప్రశ్నలువేస్తూ సమాధానాలు రాబట్టాలి. శిల్పకళను గురించి, పిల్లలతో చెప్పించాలి. లలితకళలను గూర్చి అవగాహనపరచాలి. | (పిల్లల సమాధానాలలో కీలకమైన వాటిని రాయాలి.) | |
| III. పిల్లల అవగాహన పరిశీలన | 1. శిల్పాలను తయారుచేసేవారిని ఏమంటారు?<br>2. లలితకళలు ఏవి?<br>3. శిల్పకళనుగూర్చి సొంతమాటల్లో చెప్పండి.<br>4. (పిల్లల అవగాహనను పరిశీలించాలి) | | |

| సోపానం | బోధనాభ్యసన ప్రక్రియలు | నల్లబల్ల పని | బోధనాభ్యసన సామగ్రి/ వనరులు |
|---|---|---|---|
| ఇంటిపని | మీ గ్రామములోని శిల్పాల గురించి రాయండి.<br>మీ గ్రామంలోని దేవాలయాలలో ఏయే శిల్పాలున్నాయో రాయండి.<br>తల్లిదండ్రులనడిగి శిల్పి పేరు తెలపండి. | | |

H H H ఉపాధ్యాయుడు అవసరమైన మార్పులు–చేర్పులు చేసుకోవచ్చును. ఇది మాదిరి మాత్రమే. పాఠ్యపథక రచన కేవలం ఒక సోపానక్రమంలో పాఠాన్ని చెప్పడం కోసమే! అంతేకాని పాఠ్యపథకం తప్పనిసరిగా ఇలానే వుండాలని లేదు. నిజమైన పాఠ్యపథకం ఒక మంచి ఉపాధ్యాయుడికి మనస్సులోనే వుంటుంది. Lesson plan is always flexible. నమ్యతతో కూడివుంటుంది. It should not be regid. బోధన అంతర్లీనంగా వుంటూనే సందర్భానుసారంగా మార్పులు చేర్పులు చేసుకోవచ్చు!

## 8.6 ముగింపు

ఉపాధ్యాయుడు బోధనాభ్యసన ప్రక్రియ క్రమంలో సమర్థవంతంగా నిర్వహించాలంటే ప్రణాళికలు స్థిరపరచుకోవడం తప్పనిసరి. ఉపాధ్యాయుని పరంగా తయారుచేసుకోవలసినవి వార్షిక ప్రణాళిక, పాఠ్యప్రణాళిక, పీరియడు (కాలాంశ) ప్రణాళిక. వీటిని ముందుగానే తయారు చేసుకుంటే బోధన సులభతరమవుతుంది. వేగవంతమవుతుంది. ఫలవంతమవుతుంది. విద్యార్థులలో ఆశించిన సామర్థ్యాలు సాధించడానికి దోహదపడుతుంది. అభ్యసన ఫలితాలను మూల్యాంకనం చేసుకోవడానికి వీలవుతుంది. వెనుకబడిన విద్యార్థులను గుర్తించడానికి సహాయపడుతుంది. తన విద్యార్థులు ఏయే సామర్థ్యాలలో వెనుకబడియున్నారో గ్రహించి ప్రత్యామ్నాయ బోధన చేపట్టి సామర్థ్యములు అభివృద్ధిపరచవచ్చు. జాతీయ విద్యాప్రణాళిక చట్రం 2005, నిర్బంధ ఉచిత విద్యాహక్కు చట్టం 2009, ఆంధ్రప్రదేశ్ విద్యాప్రణాళిక పరిధిపత్రం-2011 నిర్దేశించిన నిబంధనలు, మార్గదర్శకాలు, నిర్దిష్టసూత్రాలను అనుసరించి పిల్లల్లో భాషాభివృద్ధి సాధించవచ్చు. భవిష్యత్తులో ఉత్తమ వ్యక్తులుగా తీర్చిదిద్దవచ్చు.

## 8.7 మూల్యాంకనం

1. ఉపాధ్యాయునికి ప్రణాళిక అవసరమా? వివరించండి?
2. వార్షిక ప్రణాళిక అంటే ఏమిటి? ఎలా రూపొందించాలి?
3. వార్షిక ప్రణాళికను రూపొందించడానికి మార్గదర్శకాలు వ్రాయండి?
4. నమూనా వార్షిక ప్రణాళికను ఎలిమెంటరీస్థాయి తరగతికి రూపొందించండి.
5. పాఠ్యప్రణాళిక అంటే ఏమిటి? ఎలా రూపొందించాలి?
6. 6వ తరగతిలోని ఒక పాఠానికి పాఠ్యప్రణాళిక తయారుచేయండి!
7. పీరియడు ప్రణాళిక అంటే ఏమిటి? సోపానాలు రాయండి.
8. ఒక బోధనాంశమునకు పిరియడు ప్రణాళిక తయారుచేయండి.

## 8.8 ఆధారగ్రంథాలు / పరిశీలించిన గ్రంథాలు

1. బి.ఎడ్ తెలుగు బోధనాపద్ధతులు, తెలుగు అకాడమి - 2014, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగు భాషా సంస్థ, హైదరాబాద్.
2. డి.ఎడ్. తెలుగు బోధనా పద్ధతులు, తెలుగు అకాడమి - 2010, హైదరాబాద్.

3. డిప్లొమో ఇన్ ఎడ్యుకేషన్ (దూరవిద్యా విధానం), రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణాసంస్థ, హైదరాబాద్.

4. డి.ఎడ్. తెలుగు బోధనా పద్ధతులు అధ్యాపనశాస్త్రం, తెలుగు అకాడమి - 2001, హైదరాబాద్.

5. నవవసంతం-1, తెలుగు వాచకం, 6వ తరగతి - 2015, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రచురణ, హైదరాబాద్.

6. నవవసంతం-2, తెలుగు వాచకం, 7వ తరగతి - 2016, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రచురణ, హైదరాబాద్.

# 9. భాషా మూల్యాంకనం

**పరిచయం :-**

పూర్వం విద్యార్థులు గురుకులాల్లో గురువు దగ్గరకు వెళ్ళి విద్యాభ్యాసం చేసేవారు. విద్యాభ్యాసం పూర్తయిన తరువాత వారి సామర్థ్యాలను పరిశీలించే వారు. అందువల్ల విద్యార్థి సామర్థ్యాలను సమగ్రంగా తెలుసుకోవడానికి వీలయ్యేది కాదు. కాలక్రమేణ విద్యావ్యవస్థలో ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయి. నూతన మూల్యాంకనా విధానాలకు దారి తీశాయి. ఫలితంగా నిరంతర సమగ్ర మూల్యాంకనం అనే సరికొత్త భావన అంకురించింది. ఇందుకు అనుగుణంగా ఉపాధ్యాయుడు సామర్థ్యాధార, కృత్యాధార బోధనా పద్ధతిని తప్పని సరిగా అనుసరించి బోధనాభ్యసన ప్రక్రియలను చేపట్టవలసి వచ్చింది. అందుకేఈనాటి మూల్యాంకనం మరో విధంగా చెప్పాలంటే సామర్థ్యాధార, కృత్యాధార నిరంతర, సమగ్ర మూల్యాంకనం. అలా చేస్తేనే ఉపాధ్యాయుడు తరగతి గదిలో తాను ఆశించిన లక్ష్యాలు సాధించడానికి మార్గం సుగమం అవుతుంది. తన గమ్యాన్ని చేరతాడు. ఉపాధ్యాయుడు తాను ఆశించిన ఫలితాలు లభించాయో లేదో తెలుసుకోవాలంటే మూల్యాంకనం తప్పనిసరి. ఇది ఎప్పటికప్పుడు జరగాలి, సమగ్రంగా జరగాలి. విద్యార్థుల నుండి తాను రాబట్టవలసిన ఫలితాలు సామర్థ్యాల ఆధారంగా జరగాలి. ఆ సామర్థ్యాలను కృత్యాల ద్వారా రాబట్టాలి. కావున తాను ఆశించిన లక్ష్యాలు మరియు అభ్యసనా ఫలితాలు తెలుసుకోవడానికి ఉపయోగపడే సాధనమే మూల్యాంకనం. అదే నిరంతర సమగ్ర మూల్యాంకనం.

**<u>భాష్యా మూల్యాంకనం - అందలి భావనలు</u> :-**

- మూల్యాంకనం బోధనాభ్యసన ప్రక్రియలో అంతర్భాగం.
- బోధన అభ్యసన ప్రక్రియల ద్వారా లభించే ఫలితాలను అంచనా వేయడమే మూల్యాంకనం.
- విద్యార్థుల సమగ్ర అభివృద్ధిని అంచనా వేయడమే మూల్యాంకనం.
- శాస్త్రీయ పద్ధతులు, వివిధ సాధనాల ద్వారా విద్యార్థుల విద్యార్జనా స్థాయిని తెలిపేది మూల్యాంకనం.
- బోధనా లక్ష్యాలు సాధించిందీ లేనిదీ తెలిపే ప్రక్రియ మూల్యాంకనం.
- విద్యార్థి ప్రవర్తనలో వచ్చిన పరివర్తన తెలిపేదే మూల్యాంకనం.

  మూల్యాంకనం అనేది ఒక అవిరళ ప్రక్రియ - కొఠారి కమీషన్

**<u>లక్ష్యాలు</u> :-**

**ఈ అధ్యాయం చదివిన తరువాత ఛాత్రోపాధ్యాయులు...**

- మూల్యాంకనం అంటే ఏమిటో అవగాహన చేసుకుంటారు. మూల్యాంకనా భావనలను గ్రహించగల్గుతారు.
- భాషా మూల్యాంకనాన్ని చేయగల్గుతారు.
- విద్యార్థుల అభ్యసన ఫలితాల ఆవశ్యకతను గుర్తించగల్గుతారు.
- విద్యార్థుల అభ్యసన ఫలితాలను తెలుసుకోవడానికి మార్గాలు, సంప్రదాయక, ఆధునిక విధానాల మూల్యాంకనాలలో నైపుణ్యాలను పొందుతారు.
- అభ్యసన ఫలితాలు (మూల్యాంకనం) సంప్రదాయ విధానాలపై, అభ్యసన ఫలితాలు (మూల్యాంకనం) ఆధునిక విధానాలపై అవగాహన పెంపొందించుకుంటారు.
- నిరంతర సమగ్ర మూల్యాంకనం భావనలను అవగాహన చేసుకుంటారు.
- నిరంతర సమగ్ర మూల్యాంకనా సాధనాల నిర్వహణ విధానాన్ని తెలుసుకుంటారు.
- నిర్మాణాత్మక మూల్యాంకనం సాధనాలను వాటి నిర్వహణను గురించి తెలుసుకుంటారు.
- సంగ్రహణాత్మక మూల్యాంకనాన్ని నిర్వచించగల్గుతారు.
- నిర్మాణాత్మక మూల్యాంకనానికి లఘు పరీక్ష ప్రశ్నపత్రాన్ని తయారు చేసుకోగలుగతారు.
- సంగ్రహణాత్మక మూల్యాంకనం నిర్వహించగల్గుతారు.
- సంగ్రహణాత్మక మూల్యాంకనానికి ప్రశ్నపత్రాన్ని తయారు చేయగలరు.
- ప్రశ్నపత్రం తయారీలో సామర్థ్యాల వారీగా భారత్వాన్ని, ప్రశ్నల భారత్వాన్ని ఇవ్వడంలో నైపుణ్యాన్ని పొందుతారు.
- అభ్యసనా ఫలితాల నివేదికలు రూపొందించగలుగుతారు.
- సి.సి.ఇ. రికార్డు రాయగల్గుతారు.

**9.1 విద్యార్థి అభ్యసనా ఫలితాల ఆవశ్యకత :-**

తరగతికి నిర్దేశించిన భాషా సామర్థ్యాలను ఉపాధ్యాయుడు బోధనాభ్యసన ప్రక్రియల ద్వారా సాధించవలసి ఉంది. ఉపాధ్యాయుడు ఆశించిన లక్ష్యాలు సాధించాడా? విద్యార్థి అభ్యసన ఫలితాలు సాధించాడా? లేకపోతే కారణాలేంటి? తిరిగి సాధించడానికి బోధనాభ్యసన కార్యక్రమాలు సమీక్షించి భవిష్యత్ ప్రణాళికలు రూపొందించుకోవడానికి మూల్యాంకనం తోడ్పడుతుంది.

**విద్యార్థి అభ్యసనా ఫలితాలు తెలుసుకోవడం వలన............**

- బోధన, అభ్యసనంలోని లోపాలు గుర్తించి సవరించవచ్చు,
- విద్యార్థులను వర్గాలుగా గ్రేడింగ్ చేయడానికి,
- ప్రణాళికాబద్ధంగా వెలువడిన వారి సామర్థ్యాలు అభివృద్ధిపరచడానికి,
- విద్యార్థుల అభిరుచులు, ఆసక్తులు, వైఖరులు, సామర్థ్యాలు, ప్రజ్ఞ మొదలైన వాటిని గుర్తించి తగిన అభివృద్ధికి సూచనలివ్వడానికి...
- విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు, విద్యాశాఖకు తగిన సమాచారం అందించి మార్గ నిర్దేశనం చేయడానికి.,
- బోధనా వ్యూహాలు రూపొందించడానికి బోధనాభ్యసన కృత్యాల రూపకల్పనకు, పరీక్షా విధానాలలో పరిశోధనలు నిర్వహించడానికి..,
- క్షేత్ర పర్యటనలు, ప్రాజెక్టు పనులు, సహపాఠ్య కార్యక్రమాలు సమర్థవంతంగా నిర్వహించడానికి..,
- బోధనా పద్ధతులు సమీక్షించి సవరించడానికి .....
- విద్యార్థుల సమగ్ర మూర్తిమత్వ అభివృద్ధిని అంచనా వేయడానికి..,
- పాఠ్య గ్రంథాలు పరిశీలించి, సవరించి, సరిచేయడానికి, దోహదపడతాయి

**9.2 పిల్లల అభ్యసన ఫలితాలు తెలుసుకోవడానికి మార్గాలు :-**

**సంప్రదాయక, ఆధునిక విధానాలు :-**

తరగతి గదిలో బోధనాభ్యసన కార్యక్రమం పూర్తయిన తర్వాత పిల్లల అభ్యసనా ఫలితాలు తెలుసుకోవడానికి చేపట్టే కార్యక్రమం మూల్యాంకనం – బోధనాభ్యసన ప్రక్రియలో నిర్వహించే నికష, పరీక్ష, మాపనం కలిపి మూల్యాంకనం అంటారు. వీటిని గురించి క్లుప్తంగా తెలుసుకుందాం.

**నికష :-** (Test) Test అనే లాటిన్ పదం Testum నుండి గ్రహించడం జరిగింది. దీని అర్థం ఒక విధమైన మూస (Some Special type of earthen pot) పూర్వకాలం ప్రత్యేకమైన మట్టి పాత్రలో ధాతు మిశ్రమాలను కరింగేవారు. (నేడు కూడా బంగారాన్ని కరిగించడానికి మట్టి మూసలను వాడుచున్నారు) కొంతసేపటి తరువాత కరిగిన పదార్ధాన్ని కరిగించేవారు. అలాగే తరగతిలో బోధించిన అంశాన్ని విద్యార్థి అర్థం చేసుకున్నాడో లేదో గ్రహించడానికి ఉపాధ్యాయుడికి నికష ఉపయోగపడుతుంది. నికష అనేది సంస్కృత పదం నికషలు రెండు రకాలు. 1.ప్రామాణిక నికషలు.
2. అప్రామాణిక నికషలు.

**1.ప్రామాణిక నికషలు :-** ఒక నిర్ణీత క్షేత్రంలో విద్యార్థికి గల ప్రావీణ్యతను మదింపు చేయడానికి ఉపయోగపడుతుంది. వీటిలో మనోవైజ్ఞానిక నికష, ఉపాధ్యాయనిర్మిత నికష ఉంటాయి. విద్యార్థి ఆసక్తులను, అభిరుచులను, వైఖరులను, సృజనాత్మకతను పరిశీలించడానికి ఉపయోగపడతాయి. వీటినే ప్రామాణిక నికషలు అంటారు.

**2. అప్రామాణిక నికషలు :-** ఇవి విద్యార్థి అభ్యసనంలో ఎంత ఉపలబ్ధి పొందగలడో ఈ నికష ఉపయోగపడుతుంది. భాషా పరమైన సామర్థ్యాలను పరిశీలించవచ్చు. ఛాత్రోపాధ్యాయుని స్వీయ మూల్యాంకనం, బోధనా మూల్యాంకనం ఇందులోని భాగాలు. వీటినే అప్రామాణిక నికషలు అంటారు.

**పరీక్ష :-** Examination అనే పదం Examine అనే లాటిన్ పదం నుండి వచ్చింది. దీనికి మూలం Examen అంటే త్రాసు లోని ముల్లు (The Pointer of balance) అని అర్థం. అంటే విద్యార్థులకు కొన్ని ప్రమాణాలు నిర్ణయించి వారి విద్యాసముపార్జన స్థాయి నిర్ణయించిన విద్యాప్రమాణాలతో సరితూగుతున్నదా, లేదా అని తెలిపేది పరీక్ష. ఒక విద్యార్థి కోర్సు పూర్తి చేసిన తరువాత అతని స్థాయిని తెలుసుకోవడానికి వివిధ అంశాలపై వేరు వేరు ప్రశ్నాపత్రాలతో ఆ విద్యార్థిని పరీక్షిస్తారు. అతడు సాధించిన మార్కులను బట్టి గ్రేడు, స్థాయి, తరగతి నిర్ణయిస్తారు. కోర్సు పూర్తి చేసినట్లు సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుంది. విద్యాసంవత్సరం మధ్యలో కొంత కాల వ్యవధి తర్వాత మూడు నెలలకు, ఆరు నెలలకు, సంవత్సరాంతంలో విద్యార్థి

విద్యార్జనకు తెలుసుకోవడానికి ఇలాంటి పరీక్షలు నిర్వహిస్తారు.

<u>**మాపనం :-**</u> మాపనం అంటే కొలవడం. ఒక వస్తువు గుణాన్ని, రూపాన్ని, పరిమాణాన్ని, స్వభావాన్ని (భౌతిక, బాహ్యరూపాన్ని) ఒక ప్రామాణిక సూత్రం ద్వారా అంకెలలో జతపరచి పోల్చగలిగే విధానాన్ని మాపనం అంటారు. విద్యార్థి సాధనకు మార్కుల రూపంలో కొలవడం పరిమాణాత్మకం. మాపనం అనేది కనబడే పరిమాణాత్మక వర్ణశ్రీలకే పరిమితం.

**మూల్యాంకన రకాలు :-**

**1. లోప నిర్ధారణ మూల్యాంకనం** (Diagnostic Evalution)

విద్యార్థి వెనుకబాటు తనాన్ని తొలగించి అభివృద్ధి సాధించడానికే ఈ మూల్యాంకనా విధానం తోడ్పడుతుంది. విద్యార్థి ఏ సామర్థ్యాలలో వెనుకబడియున్నాడో దానికి గల కారణాలు కనుగొని వాటిని నివారించడానికి బోధనా వ్యూహాలు నిర్మించుకొని విద్యార్థుల సామర్థ్యాలను అభివృద్ధి పరచాలి.

**2. ప్రాగుక్తిక మూల్యాంకనం** (Prognostic Evaluation)

విద్యార్థి భవిష్యత్తులో ఏ సబ్జెక్టులను విజయవంతంగా అధ్యయనం చేయగలడో నిర్ణయించే మూల్యాంకనాన్ని ప్రాగుక్తిక మూల్యాంకనం అంటారు. ఈ మూల్యాంకనం ద్వారా రాబోయే కాలంలో, ఒక జ్ఞానక్షేత్ర అభ్యసన విధానంలో సాధించిన ప్రగతిని అంచనా వేయవచ్చు. విద్యార్ధి భవిష్యత్ విద్యాజ్ఞాన ప్రగతిని సూచించగల పద్ధతిని ప్రాగుక్తిక మూల్యాంకనంగా పేర్కొనవచ్చు. ఈ పద్ధతిలో విద్యార్థికి తెలిపిన పూర్వజ్ఞానాన్ని పునాదిగా తీసుకొని ఒక కొత్త పాఠ్యాంశ పరిధిలోని మౌలిక భావనలు మూల్యాంకనం చేసి విద్యార్థి సహజ సామర్థ్యాలను అన్వేషించడం జరుగుతుంది.

**9.2.1. సంప్రదాయక విధానాలు :-** ప్రాచీన కాలంలో శిష్యులు తమ భక్తి శ్రద్ధలతో, వినయవిధేయతలతో గురువు మనస్సును రంజింపజేసి విద్యను పొందేవారు. నాటి నుండి ఏదో ఒక పద్ధతిలో విద్యార్థులు పొందిన జ్ఞానాన్ని (ఉపలబ్ధి) పరీక్షించేవారు. ప్రతిరోజు అంతకుముందు రోజు చెప్పిన పాఠాన్ని అప్పగించినప్పుడే కొత్తపాఠం నేర్పే విధానం గురుకులాల్లో ఉండేది. కొన్ని సంవత్సరాలు (పది, పన్నెండు) విద్యార్జన చేసిన తరువాత పండిత పరిషత్తుల్లోనో, రాజు స్థానాలలోనో విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించి (నేటి స్నాతకోత్సవం వంటిది) గుర్తింపు పొందేవారు. తరువాత కాలంలో పరీక్షలు నిర్వహించడం ద్వారా విద్యార్థులకు సంవత్సరాంతంలో కృతార్థుడైనట్లు ధృవీకరించేవారు. లఘుపరీక్ష, త్రైమాసిక, అర్ధ సంవత్సర, వార్షిక పరీక్షలు, సంవత్సరాంత పరీక్ష నిర్వహించి ప్రతి సబ్జెక్టులో (హిందీతప్ప) 35శాతం మార్కులు వస్తే ఉత్తీర్ణతను ప్రకటించే వారు. ఏ ఒక్క సబ్జెక్టులోనైనా 35 శాతం మార్కులు రాకపోతే మరల అదే తరగతి చదివేవారు. ఉపాధ్యాయులు కూడా పాఠ్యపుస్తకాన్ని పూర్తిచేసి ప్రశ్నలకు సమాధానాలు రాయించడమే తమ కర్తవ్యంగా భావించేవారు. ఈ పరీక్షలు విద్యార్థుల ధారణశక్తిని మాత్రమే పరీక్షించడానికి, పాఠ్యపుస్తకంలోని విషయానికి ప్రాధాన్యతనిచ్చేవిగా ఉండేవి. విద్యార్థులు కూడా ఏదైనా ఒక తరగతి తప్పితే బడి మానేసేవారు. పరీక్షలు ప్రాధాన్యాన్ని తగ్గించాలని ప్రభుత్వం భావించి జి.వో.యమ్.యస్.నెం. 1781 విద్య తేది :21.11.1971 ద్వారా నిలుపుదల విధానాన్ని రద్దు చేసింది. ఏడో తరగతి, (10) పదో తరగతి చివర్లో మాత్రమే పబ్లిక్ పరీక్షలు నిర్వహించేవారు. మిగిలిన తరగతులలో పరీక్షలున్నా నిలుపుదల ఉండదు. 80శాతం హాజరు ఉంటే చాలు తరువాత తరగతికి పంపించేవారు. తరువాత కాలంలో 7వ తరగతి పరీక్షలు కూడా రద్దు చేశారు. చాలా కాలం అమలులో ఉన్న పరీక్షలలోని లోపాలను నివారించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ నిర్ణయం కొన్ని మనోవైజ్ఞానిక, సూత్రాలకు సంబంధించింది. విద్యార్థులలో పరీక్షల భయాన్ని తొలగించి ఆత్మవిశ్వాసం కలిగించడానికి, లక్ష్యాధార/సామర్థ్యాధార బోధనా విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో సామర్థ్యాలు, బోధనాభ్యసన కృత్యాలు, మూల్యాంకనం సమాన ప్రాధాన్యత గల అంశాలు.

**9.2.2. ఆధునిక విధానాలు :-**

విద్యార్థుల సమగ్ర వికాసాన్ని అంచనా వేసే సాధనంగా మూల్యాంకనాన్ని భావించవచ్చు. ఇది పరీక్ష అనే భావన కన్నా కొంత విస్తృతమైనది. పాఠ్యవిషయాలు అవగాహనతో పాటు విద్యార్థులు కనబరిచిన ఆసక్తులు, అభిరుచులు, వైఖరులు, మౌఖిక పరీక్షలు, ప్రయోగ పరీక్షలు, నియోజనాలు, మొదలైన వాటినన్నింటిని దృష్టిలో పెట్టుకుని మూల్యాంకనం చేయాలని నూతన మూల్యాంకనా విధానమైన నిరంతర సమగ్ర మూల్యాంకనంలో నిర్దేశించారు. మన రాష్ట్రంలో నిలుపుదల విధానం తొలగించిన నాటి నుండి ఇది అమలులో ఉంది. మూడు నెలలు, ఆరు నెలలు, సాంవత్సరిక పరీక్షలను మొదటి సంగ్రహణాత్మక మూల్యాంకనం, రెండవ సంగ్రహణాత్మక మూల్యాంకనం, మూడవ సంగ్రహణాత్మక మూల్యాంకనంగా నిర్వహించాలని అలాగే నాలుగు నిర్మాణాత్మక మూల్యాంకనాలు నిర్వహించాలని సూచించారు. వీటి నిర్వహణ ద్వారా విద్యార్థులు సాధించిన ప్రగతి క్యుములేటివ్ రికార్డు నందు నమోదు చేయాలని పేర్కొన్నారు. ఎలిమెంటరీ స్థాయిలోని భాషాసామర్థ్యాలను సాధించడానికి

అనువైన బోధనా విధానంతో విద్యార్థులలో సాధించాలి. మూల్యాంకనం వలన విద్యార్థులలో ఆశించిన సామర్థ్యాలు రాలేదని తెలిసినపుడు ఉపాధ్యాయుడు తన బోధనావ్యూహాలను మార్చుకొని, సవరణాత్మక బోధన ద్వారా తిరిగి ఆయా సామర్థ్యాలను సాధించాలి. ఆధునిక మూల్యాంకనా సాధనలతో విద్యార్థుల ప్రగతి, ప్రవర్తనా మార్పులు పరిశీలించడం అనేది నూతన మూల్యాంకనం విధానం.

**మూల్యాంకనం – లక్షణాలు :–**

పరీక్ష, మూల్యాంకనం, పరిగణనం లేదా మదింపు, ఒకే మూస నుండి తీయబడినా, అర్ధపరంగా ఒక దానికంటే ఒకటి విస్తృత పరిధి కలది. మూల్యాంకనం ఒక ఆధునిక భావన. విద్యార్థుల అభ్యసనానికి ప్రాధాన్యత ఇస్తుంది. మూల్యాంకనం విద్యా సముపార్జనను మాపనం చేయడమే కాకుండా వ్యక్తి సర్వతోముఖాభివృద్ధికి కావలసిన అన్ని సామర్థ్యాలను మదింపు చేస్తుంది. మూల్యాంకనం నిర్వహించడానికి ఉపాధ్యాయుడు బోధనా విషయం, బోధనా పద్ధతులు, వ్యూహాలు, అభ్యసన అనుభవాలు, అభ్యసన కృత్యాలు, మూల్యాంకనా క్రమంపై సమగ్ర అవగాహన కలిగినప్పుడే సత్ఫలితాలనిస్తుంది. మూల్యాంకనం ఈ క్రింది ప్రధాన లక్షణాలు కలిగి ఉండాలి.

- **వస్తు నిష్ఠత** Objectivity **:** సార్వ జనీన లక్షణం కలిగి ఉండడమే కాకుండా వ్యక్తిగత అపేక్షలకు, నిరపేక్షలకు అతీతమై ఉండాలి. మదింపు చేసే దానిపై ఇతర ప్రభావాలేమీ పడకుండా జాగ్రత్త వహించడమే వస్తు నిష్ఠత.
- **ప్రామాణికత** Validity : ఏ అంశాన్నైతే మదింపు చేయాలని భావిస్తామో ఆ అంశాన్ని మాత్రమే మదింపు చేసే లక్షణమే ప్రామాణికత.
- **ఔపయోగిత** (Utility) : విద్యా వ్యవస్థలో భాగస్వాములైన అందరూ ఈ మూల్యాంకనా సాధనాలు సులభంగా వినియోగించుకోగలిగినప్పుడే వీటికి ఔపయోగిత అనే లక్షణం ఉంటుంది. అంతేగాకుండా ఫలితాలను అందరూ తేలికగా వ్యాఖ్యానించగలగాలి.
- **నిరంతరత** (Continueous) **:** మూల్యాంకనం ఏదో ఒక సమయంలో కాకుండా బోధనాభ్యసన ప్రక్రియలో నిరంతరం కొనసాగాలి. అభ్యసనం జరుగుతున్నంత సేపు జరగాలి. విద్యార్థుల ప్రగతిని ఉపాధ్యాయులు సులభంగా మదింపు చేయగలగాలి.
- **బోధనాభ్యసన ప్రక్రియలో అంతర్భాగం** (Past of Teaching Learning Process) **:** మూల్యాంకనాన్ని బోధన పూర్తయిన తరువాత గాక బోధనాభ్యసన ప్రక్రియలో భాగంగా నిర్వహిస్తూనే ఉండాలి.
- **సమగ్రత** (Comprehensineness): మూల్యాంకనాన్ని కేవలం పాఠ్య విషయాలకే పరిమితం కాకుండా సహపాఠ్య కార్యక్రమాలు కూడా పాఠ్య కార్యక్రమాలలో భాగంగా మూల్యాంకనం చేయాలి. అన్ని అంశాలకు ప్రాధాన్యత ఉండాలి. అప్పుడే విద్యార్థి సమగ్ర వికాసాన్ని అంచనా వేయవచ్చు. ఈనాడు విద్య అంటే “సర్వతోముఖ వికాసం” అని కదా అర్థం!

**మూల్యాంకన సాధనాలు :–**

1. **రాత పరీక్షలు :** వ్యాసరూప ప్రశ్నలు (Essay type) లఘూత్తర, అతి లఘూత్తర ప్రశ్నలు (short Answers & Very short answers type, questions) లక్ష్యాత్మక ప్రశ్నలు (Objective type Questions).
2. **మౌఖిక పరీక్షలు :** మౌఖిక పరీక్షల ద్వారా విద్యార్థి భాష, ఉచ్చారణ, భాషణం, భావాలను పరీక్షించవచ్చు. వెనువెంటనే మార్కులు కేటాయించవచ్చు.
3. **ప్రాయోగిక పరీక్షలు :** భౌతిక, రసాయనిక, వృక్ష, జంతు, వ్యవసాయ శాస్త్రాలకు సంబంధించిన విషయాలలో ప్రాయోగిక పరీక్షలు నిర్వహించవచ్చు.
4. **పరిశీలన :** ఉపాధ్యాయుడు విద్యార్థిని నిరంతరం పరిశీలిస్తూనే వుండాలి. ఇది విద్యార్థి ప్రవర్తనను గురించి తెలుసుకోవడానికి ఉపయోగపడే సాధనం. ఉపాధ్యాయుడు విద్యార్థిని తరగతి గదిలోనూ, తరగతి గది బయట అన్నికోణాల్లో పరిశీలించి మూల్యాంకనం చేస్తాడు.
5. **ఇంటర్వ్యూ లేదా పరిపృచ్ఛ :** ఇందుతో ఉపాధ్యాయుడు విద్యార్థి ముఖాముఖిగా ఉంటారు. పృచ్ఛించడం అంటే ప్రశ్నించడం అని అర్థం. విద్యార్థి అలవాట్లను, ప్రవర్తనను, భావప్రకటనను పృచ్ఛించడం ద్వారా మూల్యాంకనం చేస్తారు.
6. **ప్రశ్నావళి :** ఇది మూర్తిమత్వ శోధనకు సంబంధించినది. వేరు వేరు ప్రశ్నావళులను ఉపయోగించి సమాచారము సేకరించవచ్చు. తరగతిలో విద్యార్థుల పరిజ్ఞానాన్ని తెలుసుకోవడానికి, ఉపాధ్యాయుని బోధనా పద్ధతులు తెలుసుకోవడానికి ప్రశ్నావళి తోడ్పడుతుంది. మరో రకంగా చెప్పాలంటే బోధన అంటే ప్రశ్నించడమే.
7. **ఎనక్డోటల్ రికార్డు** (Anectodal Record) : విద్యార్జనా సమయంలో విద్యార్థి వైఖరులను, ప్రవర్తనలను

సందర్భానుసారంగా నమోదు చేసే సంఘటనా సంచికనే ఎనక్‌డోటల్ రికార్డు అంటారు. ఈ రికార్డు తయారు చేయడంలో విద్యార్థి మూర్తిమత్వ లక్షణానికి ప్రాధాన్యత ఇవ్వాలి. రికార్డులో జరిగిన ప్రతి సంఘటనను తేదీతో సహా నమోదు చేయాలి. సందర్భాన్ని తెలపాలి అని పాఠశాలలోని వివిధ కార్యక్రమాలకు సంబంధించిన సన్నివేశాల సంఘటనలైనా కావచ్చు. లేక అతని నిజ జీవితానికి సంబంధించిన సంఘటనలైనా కావచ్చు. "అనెక్డోట్" అంటే అసాధారణ సంఘటన అని అర్థం.

8. **సంచిత రికార్డు** (Cumulative Record) : విద్యార్థి ప్రాథమికోన్నత, ఉన్నత స్థాయిలో ఆరు నుండి పదో తరగతి వరకు వివిధ సబ్జెక్టులలో వివిధ అంశాలలో, వివిధ రంగాలలో సాధించిన ప్రగతిని ఈ రికార్డు తెలియజేస్తుంది. విద్యార్థి ఉనికి, కుటుంబ పరిస్థితి, సామాజిక పరిస్థితులు, శరీర ఆరోగ్య లక్షణాలు, విద్యార్థి దశలో సాధించిన ప్రగతి, ప్రజ్ఞా పరిజ్ఞానానికి సంబంధించిన విజయాలు, వివరణలు, అభిరుచులు, వైఖరులు ఇందులో నమోదు చేస్తారు.

9. **చెక్ లిస్టులు** (Check Lists) **శోధన సూచికలు :** విద్యార్థి ఏదైనా ఒక పనిని చేసేటప్పుడు, దానిని అతడు ఏ విధంగా చేస్తున్నాడో తెలుసుకోవడానికి ఉపయోగపడే సాధనాన్ని చెక్‌లిస్టు అంటారు.
   **ఉదా :** వ్యాస రచనకుండవలసిన లక్షణాలు తెలిపి, విద్యార్థుల వ్యాస రచనలో ఆ లక్షణాలు ఉన్నాయో, లేవో పరీక్షించడం.

10. **నిర్ధారణ మాపనులు** (Rating Scale) : ఇవి వ్యక్తి వైఖరిని తెలుసుకోవడానికి ఉపయోగపడతాయి. వ్యక్తి ఇష్టతను, అయిష్టతను తటస్థ స్వభావాన్ని తెలుసుకోవచ్చు.

11. **అభిరుచి పరీక్షలు** (Aptitude Tests) : ఇవి విద్యార్థికి ఏ విషయంలో ప్రతిభ ఉందో తెలుసుకోవడానికి తోడ్పడతాయి. ఏ వృత్తిలో రాణించగలడో తెలుపుతాయి.

12. **మనోవైఖరి పరీక్షలు** (Attitude Tests) : వీటి ద్వారా విద్యార్థి ఒక వస్తువు పట్ల గాని, ఒక మనిషి పట్ల గాని, ఒక విషయము పట్ల గాని ఎలాంటి వైఖరిని (ఆలోచనా విధానాన్ని) కలిగి ఉన్నాడో తెలుసుకోవచ్చు.

13. **కేస్ స్టడీ** (Case Study) : ఏదో ఒక తరగతిలోని విద్యార్థిని తీసుకొని అతని కుటుంబ చరిత్ర, అతని అభిరుచులు, ఆసక్తులు, వ్యాపకాలు వివిధ పాఠ్యాంశాలలో అతని అభివృద్ధి మొదలగు విషయాలు ఒక పుస్తకంలో నమోదు చేసుకొనే రికార్డునే కేస్ స్టడీ అంటారు.

14. **ప్రోజెక్టివ్ టెక్నిక్** (Projective Technique): ఈ పద్ధతిలో విద్యార్థులకు కొన్ని వస్తువులు గాని, బొమ్మలు గానీ చూపించి వాటి యెడల విద్యార్థి ప్రవర్తనను పరిశీలించడం ద్వారా విద్యార్థి మానసిక సమస్యలను తెలుసుకోవచ్చు.

15. **సోషియోమెట్రిక్ పద్ధతి** (Sociometric Method) : ఈ పద్ధతిలో విద్యార్థి సాంఘిక ప్రవర్తనను తెలుసుకోవచ్చు. ఒక తరగతిలో ఒక విద్యార్థిని అదే తరగతిలోని ఎందరు విద్యార్థులు ఇష్టపడతారో, ఎందరు అయిష్టత చూపుతారో తెలుసుకోవడానికి ఇది తోడ్పడుతుంది.

– ఉపాధ్యాయుడు సందర్భానుసారంగా పై మూల్యాంకనా సాధనాలు ద్వారా విద్యార్థి ప్రగతిని అంచనా వేయవచ్చు.

## 9.3 నిరంతర సమగ్ర మూల్యాంకనం – భావనల అవగాహన సాధనాలు – నిర్వహణ

విద్యాహక్కు చట్టం 2009 అధ్యాయం 5 సెక్షన్ 'బీ' సబ్ సెక్షన్ 2 ప్రకారం పిల్లల ప్రగతిని నిరంతరం సమగ్రంగా మూల్యాంకనం చేయాలని నిర్దేశించింది. రాష్ట్ర విద్యా ప్రణాళికా పరిధి పత్రం 2011లోని అంశాలు మూల్యాంకనం సామర్ధ్యాధారితంగా, విద్యాప్రమాణాల సాధనను పరిశీలించేదిగా ఉండాలి. పిల్లవానికి సంబంధించిన సమగ్ర సమాచారంతో కూడినదిగా ఉండాలి. అంటే శారీరక, మానసిక, సాంఘీక, ఉద్వేగ వికాసాలన్నింటినీ ఎప్పటికప్పుడు నిరంతరం సమగ్రంగా మదింపు చేయాలి. మూల్యాంకనంలో మౌఖిక పరీక్షకు కూడా స్థానం కల్పించాలి. విద్యార్థి తన ఆలోచనలను, భావాలను వ్యక్తీకరించడానికి సొంతంగా రాయడానికి అవకాశం కల్పించేదిగా ఉండాలి. పిల్లల నైపుణ్యాలను, విశ్లేషణా శక్తిని, సృజనాత్మకతను మదింపు చేసేందుకు అనువుగా ఉండాలని సూచించింది. పాఠశాలలో నిర్వహించే మూల్యాంకనం పిల్లల జ్ఞాన నిర్మాణంతో పాటు వ్యక్తిత్వ వికాసాన్ని కూడా పరిశీలించేదిగా ఉండాలి. సహపాఠ్యాంశాలను విడిగా కాకుండా, పాఠ్యాంశాలుగా సమిష్టిగా పరిశీలించేదిగా ఉండడమే నిరంతర సమగ్ర మూల్యాంకనం దీనిలోని ఒక్కొక్క పదాన్ని అవగాహన కొరకు క్రింది ఇవ్వడం జరిగింది.

**నిరంతరం** (Continuous) :

బోధనాభ్యసన ప్రక్రియలను ఏదో ఒక సంఘటనకో, సందర్భానికో పరిమితం కాకుండా అభ్యసనాలన్నింటిని నిరంతరం పరిశీలించడం. పాఠశాల లోపల, వెలుపల పిల్లల శారీరక, మానసిక వికాసాలను క్రమ పద్ధతిలో పరిశీలిస్తున్నామని వారికి తెలియకుండానే పరిశీలించాలి. అభ్యసన లోపాలను గుర్తించి సవరణాత్మక చర్యలు చేపట్టడం ద్వారా ఉపాధ్యాయుడు, విద్యార్థి ఇద్దరూ స్వీయమూల్యాంకనం చేసుకోగలగాలి.

**సమగ్రం** (Comprehensive) :

సమగ్రం అంటే పిల్లల సర్వతోముఖాభివృద్ధి. పిల్లలు శారీరక, మానసిక, నైతిక, సాంఘిక, భావోద్వేగ, జ్ఞానాత్మక రంగాలలో అభివృద్ధి. దీని అర్థం విద్యాప్రణాళికలోనే పాఠ్య, పాఠ్యేతర అంశాలను విడివిడిగా చూడకుండా సమప్రాధాన్యతను ఇవ్వడమే. భాష, గణితం, సైన్స్, ఆరోగ్య వ్యాయామ విద్య, కళలు, సాంస్కృతిక విద్య, పని, కంప్యూటర్ విద్య, విలువలు, జీవన నైపుణ్యాలు పాఠ్యాంశాలుగా బోధించాలి. మూల్యాంకనం చేయాలి. వీటితో పాటు సృజనాత్మక, విశ్లేషణాత్మక, తార్కిక అంశాలకు కూడా మూల్యాంకనం సమాన ప్రాధాన్యతనిస్తుంది. అందుకనే ప్రస్తుతం మనం Co Currientar Activitites అనే పదం వాడడం లేదు. అంతా కరిక్యులమే.

**మూల్యాంకనం :**

వివిధ మదింపు సాధనాలను ఉపయోగించి పిల్లలు సాధించిన ప్రగతిని పరిశీలించి ఒక నిర్ధారణకు రావడం. అంటే పిల్లల జ్ఞానాత్మక, భావావేశ, మానసిక, చలనాత్మక రంగాలకు చెందిన అన్ని అంశాలను పాఠ్య, పాఠ్యేతర అంశాలకు సమప్రాధాన్యతనిస్తూ నిరంతరం సమగ్రంగా మూల్యాంకనం చేయడమే నిరంతర సమగ్ర మూల్యాంకనం.

**నిరంతర సమగ్ర మూల్యాంకనం లక్షణాలు :-**

- పిల్లల జ్ఞానాత్మక, మానసిక, చలనాత్మక, భావావేశ నైపుణ్యాలను పెంపొందించడం, మూల్యాంకనం చేయడం.
- బట్టీ పట్టడాన్ని, సమాచారాన్ని గుర్తు పెట్టుకోవడమనే తరగతి గది ప్రక్రియల స్థానంలో విశ్లేషణాత్మక ఆలోచనలతో సొంతంగా జ్ఞాన నిర్మాణం చేసుకోవడాన్ని ప్రోత్సహించడం. సొంతంగా తమ ఆలోచనలను, భావాలను వ్యక్తపరిచేటట్లు చేయడం.
- మూల్యాంకనాన్ని బోధనాభ్యసన ప్రక్రియలో భాగంగా పరిగణించడం.
- మూల్యాంకనం ద్వారా పిల్లల అభ్యసన సామర్థ్యాలను, బోధనాభ్యసన విధానాలను మెరుగుపరచడం, నిరంతరం వారిని పరిశీలిస్తూ సవరణాత్మక బోధన చేయడం.
- మూల్యాంకనం ద్వారా పిల్లలు ఎక్కడ నేర్చుకోలేకపోతున్నారో తెలుసుకుని తగు విధంగా బోధించడం.
- బోధనాభ్యసన ప్రక్రియ విద్యార్థి కేంద్రీకృతంగా సాగేందుకు తోడ్పడడం.
- పిల్లల్లో ఆశించిన నిర్ధారిత సామర్థ్యాలను ప్రదర్శించడానికి తగిన కార్యక్రమాలను చేపట్టడం.

**9.3.1. నిరంతర సమగ్ర మూల్యాంకనం - సాధనాలు - నిర్వహణ :-**

నిరంతరం సమగ్ర మూల్యాంకనం ప్రకారం పిల్లల్ని రెండు రకాలుగా మూల్యాంకనం చేస్తారు. 1.నిర్మాణాత్మక మూల్యాంకనం 2.సంగ్రహణాత్మక మూల్యాంకనం. నిరంతర సమగ్ర మూల్యాంకనంలో భాగంగా మొదటగా ప్రారంభ పరీక్షను నిర్వహించాలి. ఇది ఎంతో అవసరం. విద్యా సంవత్సర ప్రారంభంలో నిర్వహించాలి. ఇది తరగతికి నిర్దేశించిన విద్యాప్రమాణాలు సాధించడానికి కావలసిన ప్రాథమిక సామర్థ్యాలు పిల్లలు కలిగి ఉన్నారో లేదో గుర్తించే పరీక్ష. అన్ని విద్యాప్రమాణాలలో నిర్వహించవలసిన అవసరం లేదు. ప్రారంభ పరీక్ష ఫలితాలను క్యుములేటివ్ రికార్డులో నమోదు చేయవలసిన అవసరం లేదు.

**9.4.1. నిర్మాణాత్మక మూల్యాంకనం - సాధనాలు - అమలు :**

నిరంతర సమగ్ర మూల్యాంకనంలో నిర్మాణాత్మక మూల్యాంకనం అత్యంత కీలకమైనది. ఇది సాంప్రదాయపద్ధతిలో నిర్వహించే పరీక్ష కాదు. ఇది పిల్లలకు తెలియకుండానే బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించే క్రమంలో పిల్లల ప్రగతిని ఎప్పటికప్పుడు పరిశీలించే పద్ధతి. అభ్యసనం జరిగేటప్పుడు విద్యార్థి ఎలా నేర్చుకుంటున్నాడు? ఎక్కడ తప్పులు చేస్తున్నాడు? తెలుసుకుని తన బోధనావ్యూహాలను మార్చుకుని విద్యార్థికి సహాయ సహకారాలు అందించి మెరుగుపరచాలి. పరిశీలించిన ప్రగతిని గ్రేడుల రూపంలో నమోదు చేసి విద్యార్థి సామర్థ్యాలను అభివృద్ధి పరచడానికి ఉపయోగపడుతుంది.

నిర్మాణాత్మక మూల్యాంకనం - సాధనాలు - అమలు

(అ) పిల్లల భాగస్వామ్యం - ప్రతిస్పందనలు (పుస్తక సమీక్ష)

(ఆ) రాత అంశాలు

(ఇ) ప్రాజెక్టు పనులు

(ఈ) లఘు పరీక్ష

(అ) **పిల్లల భాగస్వామ్యం - ప్రతిస్పందనలు :-**

బోధనాభ్యసన ప్రక్రియలో పిల్లలు పాల్గొనే విధానం, ప్రతిస్పదించే రీతిని ఉపాధ్యాయుడు పరిశీలించడం ద్వారా పిల్లల ప్రగతిని మూల్యాంకనం చేయడానికి వీలు కలుగుతుంది. "పిల్లల భాగస్వామ్యం – ప్రతిస్పందన"లో పరిశీలించాల్సిన అంశాలు.

- తరగతి గదిలో తరగతి బయట పిల్లల భాష, మాట్లాడే తీరును పరిశీలించాలి.
- పిల్లలకు బోధనా సమయంలో సందేహం వచ్చినప్పుడు ప్రశ్నిస్తున్నారా? లేదా? ప్రశ్నించే విధానం పరిశీలించాలి.
- చర్చల్లో పాల్గొంటూ వారి భావాలు వ్యక్తీకరించే విధానం పరిశీలించాలి. ఉపాధ్యాయులు అడిగిన ప్రశ్నలకు జవాబులు ఇచ్చేతీరు.
- జట్టు పనుల్లో పాల్గొనేటపుడు, పాఠ్యాంశాలకు సంబంధించిన చర్చల్లో పాల్గొంటున్నప్పుడు పరిశీలించాలి.
  **ఉదా :- మైండ్ మాపింగ్**
- పాఠంలోని "విద్యార్థులకు సూచనలు" అంశం నిర్వహించే సందర్భంలో పాఠం చివర "ఇవి చేయండి" లోని అభ్యాసాలకు సమాధానాలు ఇచ్చే తీరు.
- నాటకీకరణ, ఏకపాత్రాభినయం, మూకాభినయం, పద్యాల పోటీలు, వక్తృత్వపు పోటీలు, వివిధ భాషా కార్యకలాపాల్లో పాల్గొనే సందర్భంలో పరిశీలించాలి.
- ప్రస్తుతం పాఠశాలల్లో పుస్తక సమీక్ష ఆధారంగా మార్కులు కేటాయించడం అమలులో ఉంది.
- పుస్తక సమీక్షల్లో పాల్గొనే విధానం, దానిని గురించి మాట్లాడడం వంటి వాటిని పరిశీలించాలి. పుస్తక సమీక్ష పాఠ్యేతర పుస్తకాలపై చేయించాలి. పుస్తకం పేరా రచయిత వివరాలు తెలపాలి. పుస్తకంలోని కథాంశం పై సంక్షిప్తంగా ఒకటి, రెండు పేరాలు ముగింపులో స్వీయ అభిప్రాయాలు రాయాలి.
- ఉపాధ్యాయుడు పిల్లల భాగస్వామ్యం, ప్రతిస్పందనలో భాగంగా పుస్తక సమీక్షకు, పుస్తకం ఎంపిక, సమీక్ష, ప్రదర్శన, చర్చకు మార్కులు కేటాయించాలి.
- పుస్తక సమీక్షకు సంబంధించి ఉపాధ్యాయుడు డైరీలో నమోదు చేసుకుని విద్యార్థులు రాసిన దాని ఆధారంగా మార్కులు కేటాయించాలి.

**(ఆ) రాత అంశాలు :-**

- పాఠంలోని "ఇవి చేయండి" శీర్షికలో పిల్లలు రాతకు సంబంధించిన సామర్థ్యాలు, "స్వీయరచన", "సృజనాత్మకత" సంబంధించి నోటు పుస్తకాలలో, ఇంటి పని పుస్తకాలలో రాసిన అంశాలను పరిశీలించాలి. సొంతంగా రాశారా? గైడ్లు, మెటీరియల్ వంటి వాటిలో చూచి రాశారో? పరిశీలించాలి.
- పిల్లలు డైరీ రాసిన విధానం, డైరీలో రాసిన వివిధ అంశాలు, అనుభవాలు, నీతి వాక్యాలు పరిశీలించాలి.
- ప్రశంసకు సంబంధించిన అభ్యాసాలు రాయడం, గోడ పత్రికకు ప్రదర్శనకు రాసిన అంశాలు పరిశీలించాలి.
- పాఠ్యపుస్తకంలో రాయడానికి సంబంధించిన అంశాలను నోటు పుస్తకాలలో పరిశీలించాలి.
- గోడ పత్రికలో కథలు, కవితలు, గేయాలు పరిశీలించాలి.
- పోర్ట్ ఫోలియోలో భద్రపరిచిన విద్యార్థి రాత కృత్యాలు, వివిధ స్థాయిల్లో వారి ప్రతిభను తెలిపే ఆధార పత్రాలను పరిశీలించాలి.
- విద్యార్థి తన అనుభవాల్లో ఎదుర్కొన్న సంఘటనకు సంబంధించి రాయడానికి ఉద్దేశించిన అనక్డోటల్ రికార్డును పరిశీలించాలి.

  **ఇవన్నీ ప్రస్తుతం పాఠశాలలో నిర్వహించబడుతున్నాయి. వీటికి మార్కులు కేటాయించాలి.**

**ప్రాజెక్టు పనులు :-**

పాఠ్యపుస్తకంలో పాఠాలు వెనుక "పాజెక్టు పని" శీర్షికలో ఇచ్చి పనులు పిల్లలతో చేయించాలి. ప్రాజెక్టు పనిపై ఉపాధ్యాయుడు విద్యార్థులతో చర్చింపజేయాలి. తగిన సూచనలివ్వాలి. ఇచ్చిన అంశంపై సమాచారాన్ని సేకరించడం ప్రదర్శన చేయించి, వివిధ కోణాల్లో విశ్లేషించి, అవగాహన కల్పించి నివేదికను రాయించాలి. ప్రాజెక్టు పని నిర్వహించిన తీరును పరిశీలించి మార్కులు కేటాయించాలి.

**లఘు పరీక్ష :-**

"విద్యార్థి విద్యాప్రమాణాలు సాధించినదీ, లేనిదీ తెలుసుకునే రాత పరీక్ష" ఉపాధ్యాయుడు తాను బోధించిన పాఠంపై ఎంపిక చేసుకున్న సామర్థ్యాలను పరిశీలించడానికి 20 మార్కులకు నిర్వహించే పరీక్ష. దీని నిర్వహణకు ప్రశ్నపత్రాన్ని ఉపాధ్యాయుడే తయారు చేసుకుంటాడు. ప్రశ్నలను నల్లబల్లపై గాని, చార్టుపై గాని రాయాలి. పిల్లల సమాధానాలను ఒక నోటు పుస్తకంలో రాయాలి. వ్యాసరూప, సంక్షిప్త, లఘు సమాధాన ప్రశ్నలు ఉండవచ్చు. బట్టీ తరహా ప్రశ్నలు ఉండకూడదు.

పిల్లలు సొంతంగా రాసేలా ఉండాలి. వ్యాసరూప ప్రశ్నలు 4/8 మార్కులు, సంక్షిప్త సమాధాన ప్రశ్నలకు 2/4 మార్కులు, లఘు సమాధాన ప్రశ్నలకు 1 లేదా 1/2 మార్కులు కేటాయించే విధంగా ఉండాలి.

ప్రశ్నపత్రం 45 నిముషాలు మించకుండా ఉండాలి. ఒక విధంగా ఇది విద్యార్జనా నికష వంటిది నిర్మాణాత్మక మూల్యాంకనంలోని నాలుగు సాధనాలైన, పిల్లల భాగస్వామ్యం ప్రతిస్పందనకు (పుస్తక సమీక్ష) 10 మార్కులు, రాత అంశాలకు 10 మార్కులు, ప్రాజెక్టు పనులకు 10 మార్కులు, లఘు పరీక్షకు 20 మార్కులు, మొత్తం 50 మార్కులకు నిర్వహించాలి. ఒక విద్యా సంవత్సరంలో జూలై, ఆగష్టు, నవంబరు, ఫిబ్రవరి నెలల్లో నాలుగు సార్లు నిర్వహించాలి. విద్యార్థి సాధించిన మార్కుల ఆధారంగా గ్రేడును ఇవ్వాలి. ఉదాహరణకు రాజు అనే 7వ తరగతి విద్యార్థి మార్కులు, గ్రేడును ఆగష్టు నెలలో నిర్వహించిన రెండవ నిర్మాణాత్మక మూల్యాంకనంలో పొందినవి ఈ విధంగా ఉన్నాయి.

**విషయం : తెలుగు** **తరగతి :............................**

| నిర్మాణాత్మక మూల్యాంకనం 2 | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| వ.నెం | విద్యార్థి పేరు | పిల్లల భాగస్వామ్యం ప్రతిస్పందన (పుస్తక సమీక్ష) (10మా) | రాత అంశాలు (10మా) | ప్రాజెక్టు పనులు (10 మా) | లఘు పరీక్ష (20మా) | మొత్తం పొందిన మార్కులు 50 | గ్రేడు |
| 1 | రాజు | 6 C2 | 8 B1 | 7 B2 | 16 B1 | 37 B1 | B1 |
| 2 | | | | | | | |

**మార్కుల ఆధారంగా ఇవ్వవలసిన గ్రేడు వివరాలు**

| | | | |
|---|---|---|---|
| 91 నుండి 100 శాతం | - A1 | 51 నుండి 60 శాతం | - C1 |
| 81 నుండి 90 శాతం | - A2 | 41 నుండి 50 శాతం | - C2 |
| 71 నుండి 80 శాతం | - B1 | 35 నుండి 40 శాతం | - D1 |
| 61 నుండి 70 శాతం | - B2 | 0 నుండి 34 శాతం | - D2 |

ఈ మార్కులను గ్రేడులను సి.సి.ఇ. రికార్డు నందు, నమోదు చేయాలి. ప్రస్తుతం ఎలిమెంటరీ స్థాయిలో ఈ విధానం అమలులో ఉంది.

### 9.4.1. సంగ్రహణాత్మక మూల్యాంకనం - సాధనాలు - అమలు

విద్యార్థి బోధనాభ్యసన ప్రక్రియల ద్వారా నేర్చుకున్న అంశాలను మొత్తంగా మూల్యాంకనం చేయడాన్ని సంగ్రహణాత్మక మూల్యాంకనం అంటారు. నిర్ధారిత పాఠ్యప్రణాళికలు పూర్తయిన తరువాత నిర్వహించే మూల్యాంకనం. పిల్లల అభ్యసనాన్ని మూల్యాంకనం చేసే అంశాలు పరిశీలించడం జరుగుతుంది. టర్మినల్ పరీక్ష, వార్షిక పరీక్ష పేరిట ఈ సంగ్రహణాత్మక మూల్యాంకనం నిర్వహిస్తారు. విద్యాప్రమాణాల ఆధారంగా నిర్దేశిత పాఠ్యంశాలలో ఉపాధ్యాయుడు స్వయంగా ప్రశ్నపత్రాన్ని తయారు చేసుకుని రాత పరీక్ష నిర్వహించాలి. పిల్లల జవాబు పత్రాలను పరిశీలించి వాటి ఆధారంగా పిల్లల ప్రగతిని మూల్యాంకనం చేయాలి. ఒక విద్యా సంవత్సర కాలంలో మూడుసార్లు నిర్వహించాలి. మొదటి సంగ్రహణాత్మక మూల్యాంకనం సెప్టెంబరు/అక్టోబరు మాసంలో, రెండవ సంగ్రహణాత్మక మూల్యాంకనం డిసెంబరు/జనవరి మాసంలో మూడవది మార్చి/ఏప్రిల్ మాసంలో నిర్వహించాలి. మూల్యాంకనం చేయవలసిన అంశాలు పరిశీలించినట్లయితే పాఠ్యవిషయాలైన, (1) తెలుగు, (2) హిందీ, (3) ఇంగ్లీషు, (4) గణితం, (5) సామాన్య శాస్త్రం, (6) సాంఘిక శాస్త్రం, (7) కళలు, సాంస్కృతిక విద్య, (8) ఆరోగ్య, వ్యాయామ విద్య, యోగ, ధ్యానం, (9) పని - కంప్యూటర్ విద్య, (10) విలువల విద్య. జీవన నైపుణ్యాలు మొత్తం 10 అంశాలలో ఎలిమెంటరీ స్థాయిలో విద్యాప్రమాణాల ఆధారంగా మూల్యాంకనం చేయాలి.

### 9.4.2. సంగ్రహణ మూల్యాంకనం - సాధనం - అమలు :

సంగ్రహణాత్మక మూల్యాంకనాన్ని నిర్వహించడాన్కి సాధనం రాత పరీక్ష, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని

మూల్యాంకనం చేసే ప్రక్రియల్లో రాత పరీక్ష అత్యంత ప్రధానమైంది. రాత పరీక్ష విద్యార్థుల ఆలోచనలు, భావాలను ఏ మేరకు వ్యక్తం చేశారో తెలియచేయడానికి అవకాశం కల్పించే సాధనం. రాత పరీక్ష ద్వారా అంచనా వేసి నిర్ణయించవచ్చు. విద్యార్థుల చేతిరాత నైపుణ్యాన్ని రాతలోని మెళుకువలను, పదజాలం, విశ్లేషణాత్మకంగా రాయడం, సృజనాత్మకంగా రాయడం, మొదలగు అంశాలను ఈ రాత పరీక్షలు నిర్ధారిస్తాయి. ఈ పరీక్ష విద్యార్థి ఆలోచించి సొంతంగా తమ అభిప్రాయాన్ని జోడించి రాసేందుకు అవకాశం కలిగించేదిగా ఉండాలి. సొంతంగా రాసినప్పుడు కొన్ని తప్పులు సహజం. కాలక్రమేణా పిల్లలు స్వయంగా తప్పులను సవరించుకుంటూ స్పష్టంగా రాయగలుగుతారు. ఉపాధ్యాయుడు దీన్ని ప్రోత్సాహించినప్పుడు సహజ ప్రతిభా పాటవాలు బయటకి వస్తాయి. రాత పరీక్షను (2.45) రెండు గంటల నలభై ఐదు నిమిషాలలో నిర్వహించాలి. 80 మార్కులుకు ఇవ్వాలి.

- పరీక్ష నిర్వహణ కోసం భాషోపాధ్యాయుడు ఎలిమెంటరీ స్థాయికి తరగతి వారీగా నిర్దేశించిన సామర్థ్యాల ఆధారంగా, నిర్ధారించిన భారత్వాల ప్రకారం ప్రశ్నపత్రాన్ని రూపొందించుకోవాలి.
- ఒక సామర్థ్యానికి చెందిన ప్రశ్నలన్నీ ప్రశ్నపత్రంలో ఒకో విభాగంలో ఇవ్వాలి. ప్రాజెక్టు పనులను ప్రశ్నాప్రతంలో ఇవ్వకూడదు.
- సంగ్రహణాత్మక మూల్యాంకనం ప్రశ్నపత్రంలో స్వభావ రీత్యా సొంతంగా రాయడానికి, విశ్లేషణాత్మకంగా రాయడానికి వీలుగా ఉంటాయి. కాబట్టి పిల్లలు ఒకే రకమైన సమాధానం రాస్తారని భావించకూడదు.
- పాఠ్యాంశాలతో పాటు మూల్యాంకనం చేస్తున్న కళలు, సాంస్కృతిక విద్య, ఆరోగ్య వ్యాయామ విద్య, యోగా, ధ్యానం, పని, కంప్యూటర్ విద్య, విలువల విద్య, జీవన నైపుణ్యాలు, పిల్లల మానసిక, సాంఘిక, శారీరక వికాసాలను అంచనా వేసి 50 మార్కులకు ఇవ్వాలి. ఇది సంగ్రహణాత్మక మూల్యాంకనంకు మాత్రమే వేయాలి. వీటికి నిర్ధారిత రాత పరీక్ష ఉండదు. వివిధ కార్యక్రమాలలో పిల్లలు పాల్గొంటున్న తీరును, ఆచరిస్తున్న విధానాలను, ప్రదర్శిస్తున్న నైపుణ్యాలను పరిశీలించి మార్కులు, గ్రేడులు ఇవ్వాలి.
- విద్యార్థి పొందిన మార్కులశాతం ఆధారంగా గ్రేడులు ఇవ్వాలి. (91 నుండి 100 శాతం A1, 81 నుండి 90 శాతం A2, 71 నుండి 80 శాతం B1, 61 నుండి 70 శాతం B2, 51 నుండి 60 శాతం C1, 41 నుండి 50 శాతం C2, 35 నుండి 40 శాతం D1, 0 నుండి 34 శాతం D2.
- ప్రస్తుత అమలులో ఉన్న విధానం ప్రకారం సంగ్రహణాత్మక మూల్యాంకన ప్రశ్నపత్రాన్ని SCERT రాష్ట్ర విద్యశిక్షణ పరిశోధన సంస్థ ఆంధ్రప్రదేశ్ వారు తయారు చేసి జిల్లాకు పంపిస్తున్నారు. జిల్లాలోని ఉమ్మడి పరీక్షల బోర్డు ప్రశ్నపత్రాలను ముద్రించి ఉన్నత పాఠశాలలకు పంపిస్తున్నారు. 6 నుండి 8 తరగతుల పిల్లల సమాధాన పత్రములలో ఐదు శాతాన్ని యాదృచ్ఛికంగా ఎంపిక చేసి బాహ్యమూల్యాంకనం చేయించుచున్నారు. 2017 మార్చిలో నిర్వహించిన సంగ్రహణాత్మక మూల్యాంకనం, సమాధాన పత్రాలలో, 6,7, తరగతులలో 5 శాతాన్ని యాదృచ్ఛిక విధానంలో, బాహ్య మూల్యాంకనం చేయిస్తున్నారు. 8వ తరగతి విద్యార్థుల జవాబు పత్రాలను 100శాతం బాహ్యమూల్యాంకనం చేసి మార్కులు సి.సి.ఇ. రికార్డులో నమోదు చేయిస్తున్నారు.

### 9.4.3 వార్షిక ఫలితం :-

నాలుగు నిర్మాణాత్మక మూల్యాంకనంలలోని 200(4×50) మార్కులు, రెండు సంగ్రహణాత్మక మూల్యాంకనాలలోని 160 (2×80) మార్కులను మొత్తం 360 మార్కులను 20 మార్కులకు తగ్గిస్తారు. ఈ 20 మార్కులను ఇంటర్నల్ మార్కులుగా తీసుకుంటారు. సంవత్సరాంతంలో జరిగే మూడవ సంగ్రహణాత్మక మూల్యాంకనం 80 మార్కులను కలిపి మొత్తం 100 మార్కులను విద్యార్థి పొందిన మార్కులను బట్టి వార్షిక ఫలితాన్ని గ్రేడుల రూపంలో ప్రకటిస్తారు. వీటిని సి.సి.ఇ. నందు క్యుములేటివ్ రికార్డు నందు నమోదు చేయాలి.

## 9.5 ప్రశ్నాపత్రాల తయారీ – సామర్థ్యాల భారత్వ పట్టికలు నమూనా ప్రశ్న పత్రాలు:-

### ప్రశ్నపత్రాల తయారీ :

నిర్మాణాత్మక మూల్యాంకనం :- నిర్మాణాత్మక మూల్యాంకనం ప్రశ్నాపత్రాన్ని ఉపాధ్యాయుడే తయారు చేసుకోవాలి. నిరంతర సమగ్ర మూల్యాంనం ప్రకారం నిర్మాణాత్మక మూల్యాంకనా సాధనాలైన పిల్లల భాగస్వామ్యం ప్రతిస్పందన (పుస్తక సమీక్ష) రాత అంశాలు, ప్రాజెక్టు పనులను యూనిట్‌ను పాఠాన్ని బోధించే సమయంలో విద్యార్థులు నిర్వహించిన కృత్యాల ఆధారంగా, సామర్థ్యాల ఆధారంగా వీటికి మార్కులను కేటాయించాలి. ఒక్కొక్క దానికి 10 మార్కుల చొప్పున 30 మార్కులకు ఇవి సంబంధించి ఉంటాయి. మిగిలిన 20 మార్కులకు లిఖిత పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రాన్ని ఉపాధ్యాయుడు తయారు చేసుకోవాలి. నిర్మాణాత్మక మూల్యాంకనం ఆ సమయానికి పూర్తయిన పాఠాలపై నిర్వహించాలి. పాఠం వారీగా

నిర్వహిస్తే సగటు మార్కులు తీసుకోవాలి. ఉదాహరణకు మొదటి నిర్మాణాత్మక మూల్యాంకనం కోసం జూలై వరకు రెండు పాఠాలు పూర్తవుతాయి. వీటిలో నిర్వహించాలి.

**ప్రశ్న పత్రాన్ని తయారు చేసేటప్పుడు దృష్టిలో ఉంచుకోవలసిన అంశాలు.**

- సామర్థ్యాలను దృష్టిలో పెట్టుకుని ప్రశ్న పత్రం తయారు చేయాలి.
- వ్యాసరూప, లఘూత్తర, అతి లఘూత్తర ప్రశ్నలుండాలి.
- పాఠ్యాంశంలోని అన్ని విభాగాలపై ప్రశ్నలుండేటట్లు చూడాలి.
- సామాన్య స్థాయి ప్రశ్నలు ఎక్కువగా ఉండాలి. కఠినం, సులభం స్థాయి ప్రశ్నలు తక్కువగా ఉండాలి.
- ప్రశ్న పత్రంలోని ప్రశ్నలన్నింటికి సమాధానాలు రాయడానికి అవసరమైన సమయ పరిమితి దృష్టిలో పెట్టుకోవాలి.

**నిర్మాణాత్మక మూల్యాంకనం – I – సామర్థ్యాల భారత్వ పట్టికలు**

విషయం : తెలుగు
ఉపాధ్యాయుని పేరు :
బోధించిన తరగతి: 8వ తరగతి
బోధించిన పాఠాలు : 1) అమ్మకోసం (పద్యం)
2) ఇల్లు ఆనందాల హరివిల్లు
మార్కులు : 50

**భారత్వ పట్టిక**

| అంశం | పిల్లల భాగస్వామ్యం, ప్రతిస్పందన పుస్తక సమీక్ష | రాత అంశాలు | ప్రాజెక్టు పనులు | లఘు పరీక్ష | మొత్తం |
|---|---|---|---|---|---|
| భారత్వం | 20 % | 20% | 20% | 40% | 100% |
| మార్కులు | 10 | 10 | 10 | 20 | 50 |

**విషయ భారత్వ పట్టిక**

| క్రమ సంఖ్య | పాఠం పేరు | నిర్మాణాత్మక మూల్యాంకన సాధనాలు | | | |
|---|---|---|---|---|---|
| | | పిల్లల భాగస్వామ్యం, ప్రతిస్పందన పుస్తక సమీక్ష | రాత అంశాలు 10మా | ప్రాజెక్టు పనులు 10 మా | లఘు పరీక్ష 20మా |
| 1 | అమ్మ కోసం(పద్యం) | 5 | 5 | 5 | 20 |
| 2 | ఇల్లు ఆనందాల హరివిల్లు (వ్యాసం) | 5 | 5 | 5 | |
| | మొత్తం | 10 | 10 | 10 | |

1. **భాగస్వామ్యం – ప్రతిస్పందన – పుస్తక సమీక్ష – (10 మార్కులు)**
పాఠ్యబోధనా సమయంలో విద్యార్థి ప్రశ్నించే విధానం, చర్చల్లో పాల్గొనడం, సమాధానాలు చెప్పేతీరు, పుస్తక సమీక్షలో భాగంగా పుస్తకం ఎంపిక, సమీక్ష, చర్చ ఆధారంగా మార్కులు కేటాయించాలి.

**2. రాత అంశాలు : (10 మార్కులు)**
(నోటు పుస్తకాలు, పిల్లల దినచర్య, గోడ పత్రికలోని అంశాలు, అనెక్టోడోట్సు, పోర్టు ఫోలియోలు ఆధారంగా మార్కులు కేటాయించాలి.)

**3. ప్రాజెక్టు పనులు (10 మార్కులు)**

(అమ్మకోసం, ఇల్లు ఆనందాల హరివిల్లు పాఠాలలో ఇచ్చిన ప్రాజెక్టులను పిల్లలు నిర్వహించిన విధం ఆధారంగా మార్కులు కేటాయించాలి)

4. **లఘు పరీక్ష :- (20 మార్కులు)**

అమ్మ కోసం, ఇల్లు ఆనందాల హరివిల్లు పాఠాల ద్వారా సాధించిన సామర్థ్యాలపై నిర్వహించే రాతపరీక్ష

1. చదవడం - రాయడం - అవగాహన చేసుకోవడం - 5 మార్కులు
2. స్వీయ రచన - 8 మార్కులు
3. పదజాలం - 4 మార్కులు
4. భాషాంశాలు - 3 మార్కులు

**సామర్థ్యాల భారత్వ పట్టిక**

| క్రమ సంఖ్య | సామర్థ్యం | కేటాయించిన మార్కులు | శాతం |
|---|---|---|---|
| 1 | చదవడం - రాయడం - అవగాహన చేసుకోవడం | 5 | 25 |
| 2 | స్వీయ రచన | 8 | 40 |
| 3 | పదజాలం | 4 | 20 |
| 4 | భాషాంశాలు | 3 | 15 |
| | **మొత్తం** | 20 | 100 |

**ప్రశ్నానురూప భారత్వ పట్టిక**

| క్రమ సంఖ | ప్రశ్నల రూపం | ప్రశ్నల సంఖ్య | ఒక్కొక్క ప్రశ్నకు కేటాయించిన మార్కులు | మొత్తం | శాతం |
|---|---|---|---|---|---|
| 1 | వ్యాసరూప | 2 | 4 మార్కులు | 8 | 40 |
| 2 | లఘూత్తర | 5 | 1 మార్కులు | 5 | 25 |
| 3 | అతి లఘూత్తర | 14 | 1/2 మార్కులు | 7 | 35 |
| | **మొత్తం** | | | 20 | 100% |

**9.5.1. నిర్మాణాత్మక మూల్యాంకనం – నమూనా ప్రశ్నపత్రం**

**విషయం : తెలుగు** **తరగతి : 8** **మార్కులు : 20**

| సామర్థ్యం | I | II | III | IV | మొత్తం |
|---|---|---|---|---|---|
| పొందిన మార్కులు | | | | | |
| గ్రేడు | | | | | |

**విద్యార్థి పేరు** ______________________ **నెం.** ______________

**I. చదవడం – రాయడం – అవగాహన చేసుకోడవం**

**(అ) ఈ కింది పద్యాన్ని చదివి 5 ప్రశ్నలు తయారు చేయండి?** 5మా (1×5)

అమిత పరాక్రమంబును, రయంబును, లావును గల్గు ఖేచరో
త్తముడవు నీవు, నీదయిన దాస్యము వాపి కొనగ నీకు జి
త్తము గలదేని, భూరి భుజ దర్పము శక్తియు నేర్పడంగమా
కమృతము, దెచ్చియిమ్మనిన నవ్విహగేంద్రుడు సంతసంబునన్

1.
2.
3.
4.
5.

**II స్వీయ రచన :-**

**ఈ కింది ప్రశ్నలకు జవాబులు రాయండి?** 2 × 4 = 8మా

(అ) మీరు మీ తల్లిదండ్రులకు ఏ విధంగా సహాయపడుతున్నారు? ఇంకా వాళ్ళకు ఏ విధంగా సహకారం అందించాలని అనుకుంటున్నారు?

(ఆ) "కలిసి ఉంటే కలదు సుఖం" పాఠం (ఇల్లు ఆనందాల హరివిల్లు) ఆధారంగా వివరించండి?

**III పదజాలం :-**

**(అ) ఈ కింది వాక్యాల్లో గీత గీచిన పదాలకు అర్థాలు రాయండి?** 4 × 1/2 = 2మా

1. రాము పన్నిదంలో ఓడిపోయాడు
2. రామయ్య కుటుంబం ఇడుముల బారి నుండి తొలగింది.
3. లక్ష్మీ పయోరుహాసన
4. అనిమిషులు దేవలోకంలో ఉంటారు.

**(ఆ) ఈ కింది పదాలకు వ్యతిరేక అర్థాన్నిచ్చే పదాలు రాయండి?** 2 × 1/2 = 1 మా

1) ఐక్యత : ______________ 2) ఉత్సాహం ______________

(ఇ) కింది పదాలను ఉపయోగించి సొంత వాక్యాలు రాయండి? 2 × 1/2 = 1 మా

1. పునాది : ______________________________
2. కనుమరుగవడం : ______________________________

**IV భాషాంశాలు :**

**(అ) కింది పదాలు విడదీయండి? సంధి పేరు రాయండి?** 2 × 1/2 = 1 మా

1. మొట్టమొదట = ______________ ______________
2. ప్రథమైక = ______________ ______________

**(ఆ) కింది సంశ్లిష్ట వాక్యాలను సామాన్య వాక్యాలుగా మార&ండి?** 2 × 1/2 = 1 మా

1. కందుకూరి రచనలు చేసి సంఘ సంస్కరణ చేశాడు.

జ) ______________________________

2. శివాని కళాశాలకు వెళ్ళి పాటపోటీలో పాల్గొన్నది.

జ) ______________________________

**(ఇ) కింది వాక్యాలు చదవండి. అసమాపక క్రియా పదాల కింద గీత గీయండి?** 2 ×1/2 = 1మా

1. రాజు అన్నం తిని బడికి వెళ్ళాడు
2. గీత వంట చేసి అందరికి వడ్డించింది.

**నిర్మాణాత్మక మూల్యాంకనా సాధనాలైన :-** (1) పిల్లల భాగస్వామ్యం – ప్రతి స్పందన – పుస్తక సమీక్ష (2) రాత అంశాలు, (3) ప్రాజెక్టు పనులను పాఠాన్ని బోధించే సమయంలో పరిశీలించి మార్కులు నమోదు చేయాలి. లఘు పరీక్షను లిఖిత రూపంలో నిర్వహించి మొత్తం 50 మార్కులకు విద్యార్థి పొందిన మార్కులను సి.సి.ఇ. రికార్డులో నమోదు చేయాలి.

## 9.5 సంగ్రహణాత్మక మూల్యాంకనం, ప్రశ్నాపత్రం తయారీ (Summative Assessment) :

సంగ్రహణాత్మక మూల్యంకనాన్ని రాత పరీక్ష ద్వారా నిర్వహిస్తారు. (సమ్మేటివ్) సంగ్రహణాత్మక మూల్యంకనం నిర్వహించే సమయానికి పూర్తయిన అన్ని పాఠ్యాంశాలను గణనలోకి తీసుకొని ప్రశ్నపత్రం రూపొందించుకోవాలి. సమ్మేటివ్ ప్రశ్నాపత్రాన్ని రూపొందించినప్పుడు అన్ని రకాల ప్రశ్నలకు ప్రాధాన్యత ఇవ్వాలి. అనగా వ్యాసరూప ప్రశ్నలు, లఘు సమాధాన ప్రశ్నలు, సంక్షిప్త సమాధాన ప్రశ్నలు, లక్ష్యాత్మక ప్రశ్నలు మొదలగునవి. రాత పరీక్ష కోసం తరగతికి నిర్ధారించిన భారత్వం ప్రకారం విద్యా ప్రమాణాల ఆధారంగా ప్రశ్నాపత్రం రూపొందించుకోవాలి. పిల్లలు సొంతంగా సమాధానాలు రాయడానికి ప్రశ్నపత్రం తోడ్పడాలి. పిల్లల సృజనాత్మకత, భావవ్యక్తీకరణ, విశ్లేషణ, రాసిన తీరు గమనించి ప్రగతి నమోదు చేయాలి. ఒక విద్యా ప్రమాణంలోని అన్ని ప్రశ్నలు ఒక విభాగంలో ఉంటాయి. కాబట్టి ఆ విద్యా ప్రమాణానికి ఎన్ని మార్కులు ఇచ్చారు? ఎన్ని మార్కులు సాధించారు సులభంగా తెలుసుకోవడానికి వీలుగా ఉండాలి. పిల్లలు సొంతంగా సమాధానాలు రాయడానికి ప్రశ్నపత్రం తోడ్పడాలి.

**ప్రశ్నపత్రాన్ని రూపొందించేటప్పుడు దృష్టిలో ఉంచుకోవల్సిన అంశాలు :-**

- ఒక విద్యా ప్రమాణంలోని ప్రశ్నలన్నీ ఒక విభాగంలో ఉండాలి.
  ఉదా :- వ్యాసరూప ప్రశ్నలు, లఘు సమాధాన ప్రశ్నలు, సంక్షిప్త సమాధాన ప్రశ్నలు
- ప్రాజెక్టు పనులు ప్రశ్న పత్రంలో ఇవ్వరాదు.
- అన్ని బోధనాంశాలకు, పాఠ్యాంశాలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలి.
- ప్రశ్నలో శబ్దాడంబరత, కఠిన పదాల వినియోగం ఉండరాదు. వాక్య నిర్మాణం సరళంగా అర్థవంతంగా ఉండాలి.
- కఠిన, సామాన్య, సరళ స్థాయిలో ప్రశ్నలుండాలి.
- విద్యార్థుల సొంత వివేచనానికి, భావ ప్రకటనకు అవకాశం ఇచ్చే ప్రశ్నలుండాలి.
- ప్రశ్నాపత్రంలో సూచనలు స్పష్టంగా, సూటిగా ఉండాలి.
- విశ్వసనీయత, ప్రామాణికత, వ్యాపకత, ఔపయోగికత, కొనసాగింపు వంటి లక్షణాలతో ప్రశ్నాపత్రం ఉండాలి.

**సంగ్రహణాత్మక మూల్యాంకనం – భారత్వ పట్టికలు**

**విద్యా ప్రమాణాల భారత్వ పట్టిక**

| క్రమ సంఖ్య | విద్యా ప్రమాణం పేరు | మార్కులు | శాతం |
|---|---|---|---|
| 1 | అవగాహన – ప్రతిస్పందన | 24 | 30 |
| 2 | వ్యక్తీకరణ – సృజనాత్మకత | 36 | 45 |
| 3 | భాషాంశాలు | 20 | 25 |
| మొత్తం | | 80 | 100 |

**ప్రశ్నానురూప భారత్వ పట్టిక**

| క్రమ సంఖ్య | ప్రశ్నల రూపం | ప్రశ్నల సంఖ్య | కేటాయించిన మార్కులు | మొత్తం మార్కులు | శాతం |
|---|---|---|---|---|---|
| 1 | వ్యాసరూప | 5 | 8 | 40 | 50 |
| 2 | లఘు సమాధాన | 2 | 2 | 4 | 5 |
| 3 | అతి లఘూత్తర సమాధాన | 16 | 1 | 46 | 20 |
| 4 | లక్ష్యాత్మక | 20 | 1 | 20 | 25 |
| మొత్తం | | 265 | | 80 | 100 |

## విద్యా ప్రమాణాల ఆధారంగా ప్రశ్నల విశ్లేషణ భారత్వం

| క్రమ సంఖ్య | విద్యా ప్రమాణం | అంశం | ప్రశ్న స్వభావం | ప్రశ్నల సంఖ్య | ఒక్కొక్క దానికి మార్కు | మొత్తం మార్కులు | శాతం |
|---|---|---|---|---|---|---|---|
| 1 | అవగాహన – ప్రతి స్పందన | పరిచిత పద్యపూరణ భావం | వ్యాసం | 1 | 8 | 8 | |
| | | పరిచిత గద్యం | అతి లఘు | 4 | 1 | 4 | |
| | | అపరిచిత గద్యం | అతి లఘు | 4 | 1 | 4 | |
| | | పరిచిత గద్యం | అతి లఘు | 4 | 1 | 4 | |
| | | అపరిచిత గద్యం | అతి లఘు | 4 | 1 | 4=24 | 30 |
| 2 | వ్యక్తీకరణ సృజనాత్మకత | పద్యం | లఘు సమాధాన | 1 | 2 | 2 | |
| | | గద్యం | లఘు సమాధాన | 1 | 2 | 2 | |
| | | పరిచిత గద్యం | వ్యాసరూప | 1 | 8 | 8 | |
| | | పరిచిత గద్యం | వ్యాసరూప | 1 | 8 | 8 | |
| | | ఉపవాచకం | వ్యాసరూప | 1 | 8 | 8 | |
| | | సృజనాత్మకత | వ్యాసరూప | 1 | 8 | 8 =36 | 45 |
| 3 | భాషాంశాలు | పదజాలం (అర్థాలు, నానార్థాలు, పద్యాలు, పదాలు) | లక్ష్యాత్మక (బహుళైచ్ఛిక) | 10 | 1 | 10 | |
| | | భాషాంశాలు (సందులు, సమాసం, ఛందస్సు, అలంకారం, భాషాభాగం) | లక్ష్యాత్మక (బహుళైచ్ఛిక) | 8 | 1 | 8 | |
| | | సొంత వాక్య ప్రయోగం | వాక్య ప్రయోగం | 2 | 1 | 2=20 | 25 |
| మొత్తం | | | | | | 80 | 100 |

## ప్రశ్నల కఠిన స్థాయి విశ్లేషణ భారత్వ పట్టిక

| క్రమ సంఖ్య | ప్రశ్నల స్థాయి | మార్కులు | శాతం |
|---|---|---|---|
| 1 | సులభం | 24 | 30 |
| 2 | సాధారణం | 36 | 45 |
| 3 | కఠినం | 20 | 25 |
| మొత్తం | | 80 | 100 |

## నిర్దిష్ట ప్రశ్నపత్ర ప్రణాళిక – (Blue Print)

| క్రమ సంఖ్య | అంశం | అవగాహన – ప్రతి స్పందన | | | | వ్యక్తీకరణ – సృజనాత్మకత | | | | భాషాంశాలు | | | | మొత్తం | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | వ్యాసరూప | లఘు | అతి లఘు | లక్ష్యాత్మక | వ్యాసరూప | లఘు | అతి లఘు | లక్ష్యాత్మక | వ్యాసరూప | లఘు | అతి లఘు | లక్ష్యాత్మక | వ్యాసరూప | లఘు | అతి లఘు |
| 1 | పద్యం | 1(8) | - | 8(1) | - | 1(8) | 1(2) | - | - | - | - | - | - | 2(8) | 1(2) | 8(1) |
| 2 | గద్యం | - | - | 8(1) | - | 2(8) | 1(2) | - | - | - | - | - | - | 2(8) | 1(2) | 8(1) |
| 3 | ఉపవాచకం | - | - | - | - | 1(8) | - | - | - | - | - | - | - | 1(8) | - | - |
| 4 | భాషాంశాలు | - | - | - | - | - | - | - | - | - | - | - | 20(1) | - | - | - |
| మొత్తం | | 24 | | | | 36 | | | | 20 | | | | 80 | | |

## సంగ్రహణాత్మక మదింపు
## ప్రథమ భాష – తెలుగు
## పార్ట్ – ఎ & బి

**తరగతి : 8** **(మార్కులు : 80)** **సమయం : 2 .45 గం॥**

**విద్యార్థులకు సూచనలు :-**

1. విభాగం ఎ,బి రెండూ ఒకేసారి ఇవ్వబడతాయి. విద్యార్థులు ప్రశ్నాపత్రం చదువుకోవడానికి 15 ని॥లు సమయం ఇవ్వాలి.
2. విద్యార్థి విభాగం – ఎ కి సంబంధించిన జవాబులు నిర్దేశించిన సమాధాన పత్రంలో రాయాలి.
3. విభాగం – బి కి సంబంధించిన జవాబులు అదే సమాధాన పత్రంలోనే రాసి, విభాగం –ఎ సమాధాన పత్రానికి జతచేసి ఇవ్వాలి.

---

### పార్టు –ఎ

**మార్కులు : 60**

**I. అవగాహన – ప్రతి స్పందన :- (24 మార్కులు)**

**ఈ క్రింది పద్యాలలో ఒకదానిని పూరించి, భావాన్ని రాయండి.** **8×1=8**

1. ఊరూర జనులెల్ల............................................ శ్రీ కాళహస్తీశ్వరా!

(లేదా)

ఆయతపక్ష తుండహతి ......................................... దీని బయోరుహాననా!

**ఈ క్రింది పరిచిత గద్యం చదివి, నాలుగు ప్రశ్నలు తయారు చేయండి.** **4×1=4**

దృష్టి, వినికిడి, వాసనలను పసిగట్టే విషయంలో జంతువులు మానవుని కన్నా ఎంతో ముందున్నాయి. గబ్బిలాల వినికిడిశక్తి మనకెంతో ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. గాలిలోకి విసిరిన వస్తువులలో పురుగో, బంతో, కర్రో సులువుగా చీకట్లో గుర్తించే శక్తి గబ్బిలాలకుంది. ఒకే పరిమాణంలో ఉన్న ఆకుల, పురుగుల వంటి వాటిని ఆకారాలను బట్టి గుర్తించగలదు. ప్రతిధ్వనులను సెకండ్ ఉన్నా తక్కువ కాలంలో విశ్లేషించగలదు. తిమింగలాలు, డాల్ఫిన్‌లకు ఉన్న ఇకోలొకేషన్ శక్తి, విశ్లేషణ శక్తి గబ్బిలాల కన్నా ఎక్కువ. ప్రకృతి వైపరీత్యాలను ముందే పసిగట్టి గల అద్భుత ప్రాణులు ఈ విశ్వంలో ఎన్నో ఉన్నాయి. సమాచార రంగంలో మనకన్నా జంతువులే ముందున్నాయి. భూకంపాలను ముందే పసిగట్టేవని పూర్వీకులు చెబుతున్నారు.

1.
2.
3.
4.

**ఈ క్రింది అపరిచిత గద్యం చదివి, ప్రశ్నలకు సమాధానాలు రాయండి.** **4×1=4**

పరభాషల ద్వారాకాక మాతృభాష ద్వారా విద్యాబోధన చేయడమే సహజమైన పద్ధతి అని వాదించి వంగభాషలో బాలురకు ఉపయుక్తమగు వాచకములను, శాస్త్ర గ్రంథములను రచించిన విద్యావేత్త ఈశ్వర చంద్రుడు. అతనివలె ఒకవైపు సంఘ సంస్కరణ చేయుచూ, మరొకవైపు భాషాసేవ చేసిన మహానీయుడు మన వీరేశలింగం పంతులు. పంతులు గారికి దక్షిణదేశ విద్యాసాగరుడను బిరుదు కలదు. విద్యాసాగరుడును, పంతులు గారును పరస్పరము ఉత్తరముల వ్రాసుకొనుచుండెడివాడు. ఈశ్వరచంద్రుని వలన వంగదేశమును, పంతులు గారి వలన తెలుగు దేశమును వాసిగాంచినవి.

ప్రశ్నలు :-

6. విద్యాబోధన చేయుటకు సహజమైన పద్ధతి ఏది?
7. ఈశ్వర చంద్రుడు ఏ భాషలో వాచకములు రాశాడు?
8. వీరేశలింగం పంతులు గారు ఏ ఏ కార్యక్రమాలను చేపట్టి మహనీయుడయ్యారు?
9. పై పేరా ఆధారంగా ఒక ప్రశ్న తయారు చేయండి?

**కింది పరిచిత పద్యం చదవండి. ప్రశ్నలకు సరైన సమాధానాలు రాయండి.** **4×1=4**

పొలాలనన్నీ
హలాలదున్నీ
ఇలాతలంలో హేమం పిండగ
జగానికంతా సౌఖ్యం నిండగ
విరామమెరుగక పరిశ్రమించే
బలం ధరిత్రీకి బలికావించే
కర్షక వీరుల కాయం నిండా
కాలువ కట్టే ఘర్మ జలానికి
ఘర్మజలానికి
ధర్మజలానికి
ఘర్మజలానికి ఖరీదు కట్టే షరాబు లేడోయ్

**ప్రశ్నలు :-**

10. పొలాలు వేటితో దున్నుతారు ?
11. తమ బలాన్ని ధరిత్రికి బలికాపించేది ఎవరు?
12. దేనికి ఖరీదు కట్టలేమని కవి అన్నాడు?
13. పై గేయం ఆధారంగా ప్రశ్న తయారు చేయండి?

**కింది అపరిచిత పద్యం చదవండి. ప్రశ్నలకు సరైన సమాధానాలు రాయండి.**

రాజు చేతి కత్తి రక్తంబు వర్షించు
సుకవి చేతి కలము సుధలు గురియు
ఆతడేల గలుగు యావత్ప్రపంచంబు
నీతడేల గలుగు ఇహము పరము

**ప్రశ్నలు :**

14. రక్తాన్ని కురిపించేది ఏది?
15. యావత్ప్రపంచాన్ని పాలించగలిగేదెవరు?
16. ఇహమును, పరమును పాలించగలవాడెవడు?
17. పై పద్యం ఆధారంగా ఒక ప్రశ్న తయారు చేయండి?

## II. వ్యక్తీకరణ – సృజనాత్మకత : (36 మార్కులు)

**ఈ కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాల్లో సమాధానాలు రాయండి** **2×2=4**

18. అజంతా చిత్రాలు పాఠ్యభాగ రచయిత గురించి తెలపండి?
19. ఎలాంటి చదువు వ్యర్థమని కవి ఉద్దేశం?

**కింది వానిలో ప్రతి భాగంలో కనీసం ఒక ప్రశ్నకు 10 లేక 12 వాక్యాల్లో సమాధానాలు రాయండి.**

**4×8=32**

20. సత్యసంధుడు, వివేక సంపన్నుడైన హరిశ్చంద్రుని గుణగణాలు రాయండి.

**(లేదా)**

సి.నా.రె. తన గజల్‌లో తల్లి గొప్పదనాన్ని గురించి ఏమని చెప్పాడు?

21. సాధారణ దృష్టి, శాస్త్ర దృష్టి రెండూ ఒకటేనా?కాదా? ఎందుకో వివరించండి.

**(లేదా)**

కుటుంబ వ్యవస్థ బాగా కొనసాగలంటే మనం ఏమి చేయాలి.

22. పెద్దాపురం ప్రభువు ఎవరు? ఆయన గురించి రాయండి.

**(లేదా)**

"మధుపర్కాలు" పాఠంలోని అల్లుడు గారి పాత్ర ద్వారా ఎలాంటి ఆదర్శాన్ని గ్రహించారు?

23. మీ పాఠశాలలో పిల్లలకు "పద్యాల తోరణం" అనే పోటీ పెట్టారు. ఈ పోటీలో పిల్లలందరూ పాల్గొనడానికి ప్రకటన రాయండి. ప్రకటన నిర్వహించే తేదీ, స్థలం, సమయం మొదలగున్నవి ఉండేలా రాయండి.

**(లేదా)**

సూర్యోదయం కాగానే పక్షుల కిలకిలా రావాలు అప్పుడే విరిసిన పూవ్వుల సువాసనలు, సూర్యుని అరుణకాంతులతో ప్రకృతి అందంగా ఉంటుంది కదా! అలాగే మీకు నచ్చిన ప్రకృతి దృశ్యాన్ని వర్ణనాత్మకంగా రాయండి.

Regd. No : [ ] Marks [ ]

సంగ్రహణాత్మక మదింపు
ప్రథమ భాష – తెలుగు
పార్ట్ – బి

**తరగతి : 8** **(మార్కులు : 20)**

| విద్యా ప్రమాణాలు | అవగాహన ప్రతి స్పందన | వ్యక్తీకరణ సృజనాత్మకత | భాషాంశాలు | మొత్తం | గ్రేడు |
|---|---|---|---|---|---|
| ప్రశ్నల సంఖ్య | 1-17 | 18 - 23 | 24 - 43 | | |
| కేటాయించిన మార్కులు | 24 | 36 | 20 | 80 | |
| పొందిన మార్కులు | | | | | |

**విద్యార్థి పేరు :** **క్రమ సంఖ్య :**

**విద్యార్థులకు సూచనలు :-**

1. ఇవ్వబడిన ప్రశ్నలకు తగు సమాధానాలు బ్రాకెట్లలో గుర్తించండి.
2. విభాగం – బి కి సంబంధించిన సమాధానాలు ఈ ప్రశ్న పత్రంనందే రాసి, విభాగం – ఎ సమాధాన పత్రానికి జతచేసి ఇవ్వండి.

పార్ట్ – బి

**భాషాంశాలు :- (20 మార్కులు)**

**ఈ కింది వాక్యాలలో గీత గీసిన పదాలకు తగిన జవాబు గుర్తించండి.**

24. శరీరంలో శిరస్సు ప్రధానమైనది (అర్థం గుర్తించండి) ( )
(ఎ) తల (బి) నాలుక (సి) కళ్ళు (డి) చరణం

25. ఆయన విజ్ఞానానికి నిధి (అర్థం గుర్తించండి) ( )
(ఎ) కొలను (బి) కోవెల (సి) నిలయం (డి) ఉదకం

26. విద్యార్థులు ఎల్లప్పుడు సత్యం పలకాలి. ఆ యదార్థమే వారిని తీర్చిదిద్దుతుంది. (సమానార్థక పదాన్ని గుర్తించండి) ( )
(ఎ)న్యాయం (బి) నిజం (సి) సమానత్వం (డి) అనృతం

27. సముద్రంలో కెరటం భయానకంగా ఉంటుంది. (సమానార్థక పదాన్ని గుర్తించుము ( )
(ఎ) వర్చస్సు–మేధస్సు (బి) అల – గోల (సి) తరంగం –అల (డి) సరస్సు – శిరస్సు

28. చట్టమును అందరూ గౌరవించాలి. (వికృతి పదం గుర్తించండి) ( )
(ఎ) శాస్త్రం (బి) శాసనం (సి) విధి (డి) శాస్త్రి

29. అడవికి రారాజు సింగం. (వికృతి పదం గుర్తించండి) ( )
(ఎ) సింగం (బి) చిరుత (సి) సింహం (డి) చీమ

30. దేవతలు సుధను త్రాగారు. ఆవు సుధ పిల్లకు శ్రేష్టం ( )
(ఎ) నీరు, నాలుక (బి) వారి, జలం (సి) క్షీరం, సున్నం(డి) అమృతం, పాలు

31. చంద్రుడు కువలయానందకరుడు, నృపతి ధరణికి అధిపతి ( )
(ఎ) రాజు (బి)శుక్రుడు (సి) అంబుధి (డి) వాచస్పతి

32. సమస్త ప్రాణులయందు సమభావన కలవాడు. (వ్యుత్పత్తిపదాన్ని గుర్తించండి) ( )
(ఎ) పగతుడు (బి) కృతఙ్ఞుడు (సి) మిత్రుడు (డి) వైరి

33. అయ్యయ్యో మదన్ ఇంట్లో దొంగలు పడ్డారు. (సంధిని గుర్తించండి) ( )
(ఎ) అకార సంధి(బి) ఆమ్రేడిత సంధి (సి) యడాగమ సంధి (డి) ఇకార సంధి

34. అ,ఇ,ఉ, ఋ లకు సవర్ణములైన అచ్చులు పరమైతే వాని దీర్ఘములు ఏకాదేశమగును. (ఇది ఏ సంధి సూత్రము) ( )
(ఎ) సవర్ణదీర్ఘ సంధి (బి) గుణ సంధి (సి) యణాదేశ సంధి (డి) వృద్ధి సంధి

35. దొంగభయం చేత ఆభరణాలు లాకర్‌లో పెట్టాము. ( )
(ఎ) దొంగ యందు భయం (బి) దొంగ చేత భయం (సి) దొంగ వలన భయం (డి) దొంగకు భయం

36. చిలకమర్తికి దేశభక్తి మెండు. (సమాసాన్ని గుర్తించండి) ( )
(ఎ) సప్తమీ తత్పురుషం (బి) విశేషణ పూర్వపద కర్మధారయం
(సి) ద్వితీయా తత్పురుషం (డి) చతుర్థీ తత్పురుషం

37. మా అన్న చేసే వంట నలభీమపాకం లా భలే రుచిగా ఉంటుంది. (అలంకారాన్ని గుర్తించండి) ( )
(ఎ) ఉపమాలంకారం (బి) ఉత్ప్రేక్షాలంకారం (సి) రూపకాలంకారం (డి) శ్లేషాలంకారం

38. ప్రజలు శాంతిని కోరుతున్నారు.(ఈ కర్తరీ వాక్యానికి సరైన కర్మణి వాక్యాన్ని గుర్తించండి) ( )
(ఎ) ప్రజల కోసం శాంతిని కోరుతున్నారు (బి) శాంతి ప్రజలకు అవసరమని కోరుతున్నారు.
(సి) ప్రజలు శాంతిని కోరుకోవడం లేదు. (డి) శాంతి ప్రజల చేత కోరబడుచున్నది.

39. రమ అందమైనది. రమ తెలివైనది. (ఈ సామాన్య వాక్యాలను సరైన సంయుక్త వాక్యాన్ని గుర్తించండి) ( )
(ఎ) రమ తెలివైనది కావడంతో అందమైనది (బి) రమ అందమైనది, తెలివైనది.
(సి) రమ తెలివైనది మరియు అందమైనది (డి) రమ అందమైనది కావడంతో తెలివైనది.

40. పుష్ప అన్నం తిని, నిద్రపోయింది (ఇది ఏ రకమైన వాక్యమో గుర్తించండి. ( )
(ఎ) క్త్వార్థం (బి) శత్రర్థకం (సి) చేదర్థకం (డి) సంశ్లిష్ట

41. శత్రర్థం ఏ కాలపు అసమాపక క్రియ ( )
(ఎ) వర్తమాన కాలం (బి) భూతకాలం (సి) భవిష్యత్ కాలం (డి) తద్ధర్మకాలం

**ఈ క్రింది పదాలతో సొంత వాక్య ప్రయోగం చేయండి.**

42. హక్కులు – బాధ్యతలు

43. పెనుభూతం :

## గణన సూచి పత్రం

| క్రమ సంఖ్య | విద్యా ప్రమాణాలు | ప్రశ్న సంఖ్య | ప్రశ్న రూపం | ఆశించిన జవాబులు | కేటాయించిన మార్కులు | మొత్తం మార్కులు |
|---|---|---|---|---|---|---|
| | | | | | | |
| | | | | | | |
| | | | | | | |
| | | | | | | |
| | | | | | | |
| | | | | | | |
| | | | | | | |
| | | | | | | |
| | | | | | | |
| | | | | | | |
| | | | | | | |
| | | | | | | |
| | | | | | | |
| | | | | | | |
| | | | | | | |
| | | | | | | |
| | | | | | | |

### విద్యాప్రమాణాల వారీగా విద్యార్థులు సాధించిన మార్కులు

| క్రమ సంఖ్య | విద్యార్థి పేరు | విద్యా ప్రమాణాల వారీగా పొందిన మార్కులు | | | |
|---|---|---|---|---|---|
| | | ప్రతిస్పందన మార్కులు = 24 | సృజనాత్మకత మార్కులు = 36 | భాషాంశాలు మార్కులు = 20 | మొత్తం మార్కులు 80 |
| 1 | | | | | |
| 2 | | | | | |
| 3 | | | | | |

| ప్రశ్నల వారీగా విశ్లేషణ పట్టిక | | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| విద్య ప్రమాణాలు | | | | | | | | | | | | | | |
| విద్యార్థి సంఖ్య | ప్రశ్నల రూపం | అవగాహన – ప్రతిస్పందన –24– | | | | వ్యక్తీకరణ – సృజనాత్మకత –36– | | | | భాషాంశాలు–20 | | | | మొత్తం మార్కులు |
| | | వ్యాసరూప 0 | లఘు సమాధాన | అతి లఘు సమాధాన 0 మా | లక్ష్యాత్మక | వ్యాసరూప 0 మా | లఘు సమాధాన | అతి లఘు సమాధాన 0 వ | లక్ష్యాత్మక | వ్యాసరూప –8– | లఘు సమాధాన | అతి లఘు సమాధాన –6– | లక్ష్యాత్మక 0 మా | |
| 1 | పొందిన మార్కులు | 1 | - | 2-17 | | 20,21,22,23 | 18-19 | - | - | - | - | - | 24-43 | |
| 2 | | | | | | | | | | | | | | |
| 3 | | | | | | | | | | | | | | |
| 4 | | | | | | | | | | | | | | |
| 5 | | | | | | | | | | | | | | |

**<u>ఫలితాల విశ్లేషణ</u> :–**

పై పట్టికలలో విద్యార్థుల మార్కులు నమోదు చేయాలి. మార్కుల ఆధారంగా విద్యార్థి వ్యక్తిగత స్థాయి, పూర్తి తరగతి ప్రగతిని అంచనా వేయవచ్చు. లోతుగా పరిశీలిస్తే విద్యార్థి ఏయే సామర్థ్యాలలో, ఏయే అంశాలలో ఏ ప్రశ్నలకు జవాబులు రాయలేదో గ్రహించవచ్చు. ఫలితాలు విశ్లేషణకు సాంఖ్యాకశాస్త్రం వినియోగించుకొని ప్రగతిని గ్రాఫ్ రూపంలో దిమ్మరేఖా చిత్రాలు, పై దయాగ్రంలలో (వృత్త రేఖా చిత్రం) చూపించవచ్చు. ఇలా విద్యార్థుల స్థాయి, సామర్థ్యాల సాధన, విద్యార్థుల ప్రగతి, మొత్తం తరగతి అభివృద్ధి తెలుస్తుంది. వీటి ఆధారంగా, కొత్త ప్రణాళికలు, వ్యూహాలు నిర్మించుకొని విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి సాధించవచ్చు.

### 9.6 నివేదికలు రూపొందించడం – సి.సి.ఇ. రికార్డు రాయడం :–

నిర్మాణాత్మక, సంగ్రహణాత్మక మూల్యాంకనాలను నిర్వహించిన తరువాత సమాధానాలు దిద్దడం, గ్రేడులు లెక్కించడం ఎంత ప్రధానమో వాటి వివరాలు నమోదు చేసి నివేదిక రిజిష్టరులో నమోదు చేయాలి. అదే విధంగా పిల్లల ప్రగతిని క్యుములేటివ్ రికార్డులో నమోదు చేయాలి.

**<u>సంవత్సరాంత సమగ్ర ప్రగతి నమోదు నివేదిక</u> :–**

విద్యాసంవత్సరం చివర అనగా ఏప్రిల్ మాసంలో తరగతి వారీగా ప్రగతి నివేదికను నిర్ధారిత పట్టికలో నమోదు చేసి సమాచారము నిమిత్తం పర్యవేక్షణాధికారికి ( ప్రాథమికోన్నత పాఠశాలలు మండల విద్యాశాఖాధికారికి, ఉన్నత పాఠశాలలు ఉపవిద్యాశాఖాధికారికి) పంపించాలి. దీనిలో తరగతి వారీగా మూల్యాంకనం జరిగిన తరువాత పై తరగతికి వెళ్ళే విద్యార్థుల, వెళ్ళని విద్యార్థుల వివరాలు ఉండాలి. వెళ్ళని విద్యార్థుల విషయంలో కారణాలు రాయాలి.

### 9.6.1. <u>సి.సి.ఇ. రిజిష్టరు</u> :–

రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ ఆంధ్రప్రదేశ్ వారి నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యార్థి విద్యావిషయక పెర్‌ఫారేన్స్ రిజిష్టరు (Stuolents Academic Performance Register) ను రూపొందించి రాష్ట్రంలోని అన్ని పాఠశాలలకు పంపించారు. ప్రస్తుతం విద్యార్థుల విద్యా సంబంధమైన ప్రగతి ఈ రిజిష్టరులో నమోదు చేయుచున్నారు. ఈ రిజిష్టరులో విద్యార్థి తరగతికి సంబంధించి నాలుగు నిర్మాణాత్మక మూల్యాంకనంలలో పొందిన మార్కులు, గ్రేడులు, మూడు సంగ్రహణాత్మక మూల్యాంకనంలలో పొందిన మార్కులు, గ్రేడులు మరియు తుది ఫలితము. గ్రేడును నమోదు చేయవలసి ఉంటుంది. దీని ఆధారంగా సి.సి.ఇ. కన్‌సాలిడేటెడ్ గ్రేడింగ్ ప్రమోషన్ రిజిష్టరు తయారు చేసి పాఠశాలల తనిఖీ అధికారికి పంపించాలి.

## 9.6.2. **2.విద్యార్థి సంచిత సమగ్ర ప్రగతి నివేదిక**

ఆరు నుండి పదవ తరగతి వరకు విద్యార్థులు వివిధ అంశాలలో, అన్ని రంగాలలో అన్ని సబ్జెక్టులలో సాధించిన ప్రగతిని ఈ రికార్డు తెలియజేస్తుంది. ప్రతి ఉపాధ్యాయుడు తాను బోధించిన సబ్జెక్టులకు సంబంధించి మార్కులు, గ్రేడులు సి.సి.ఇ. రిజిష్టరులో నమోదు చేయాలి. ఆ సి.సి.ఇ. రిజిష్టరు ఆధారంగా క్యుములేటివ్ రికార్డులో గ్రేడులు నమోదు చేయాలి. విద్యార్థుల ప్రగతిని గ్రేడుల రూపంలో మాత్రమే ఈ రికార్డులో నమోదు చేయాలి. రికార్డులోని ప్రతి గడిని పూర్తి వివరాలతో భర్తీ చేయాలి. ఈ రికార్డు ఆధారంగా పాఠశాల కమిటీ సమావేశంలో విద్యార్థుల స్థాయి, ప్రగతి గురించి కమిటీ సభ్యులతో, తల్లిదండ్రులతో చర్చించాలి. అలాగే పిల్లల స్థాయి ఆధారంగా ఉపాధ్యాయుల సమీక్షా సమావేశాలలో చర్చించాలి. నిర్మాణాత్మక, సంగ్రహణాత్మక మూల్యాంకనాలు నిర్వహించిన ప్రతిసారీ విద్యార్థుల స్థాయిని ఎప్పటికప్పుడు ఈ రికార్డులో నమోదు చేసి తల్లిదండ్రులకు పంపించాలి. వారి సంతకాలు, అభిప్రాయాలు తీసుకోవాలి. విద్యార్థులు ఒక పాఠశాల నుండి వేరొక పాఠశాలకు బదలీ అయినపుడు ఈ రికార్డును వారికి అందజేయాలి.

ఈ క్యుములేటివ్ రికార్డు నందు విద్యార్థి వ్యక్తిగత వివరాలు, ఫోటో, కుటుంబ వివరాలు, శరీర సంబంధ వివరాలు ఉంటాయి. విద్యార్థి విద్యా విషయక సమాచారంలో విద్యార్థి సబ్జెక్టుల వారీగా నాలుగు నిర్మాణాత్మక మూల్యాంకనాలలో పొందిన గ్రేడులు, మూడు సంగ్రహణాత్మక మూల్యాంకనాలలో అన్ని సబ్జెక్టులలో విద్యా ప్రమాణాలు వారీగా పొందిన గ్రేడులు, ఆరోగ్య సమాచారం, విద్యార్థి పొందిన గ్రేడు వివరాలు, హాజరు సమాచారం, వార్షిక ఫలితం పొందుపరచి ఉంటాయి. వీటితోపాటు విద్యార్థి చదివిన పాఠశాలల సమాచారం, ఎలిమెంటరీ స్కూల్ సర్టిఫికెట్ ఉంటాయి.
వీటికి సంబంధించిన పట్టికలు ప్రథమ సంవత్సరం డి.ఎల్.ఇడి పాఠ్య పుస్తకం "ప్రాథమిక స్థాయిలో భాషాభివృద్ధి మరియు అవగాహనలో ఇవ్వబడ్డాయి. ఆ పట్టికలను 6 నుండి 10వ తరగతి వరకు చూపించి నమోదు చేసుకోవాలి.

## 9.6.3 **సి.సి.ఇ. రికార్డు రాయడం :-**

నిరంతర సమగ్ర మూల్యాంకనం, వాటి భావనలపై అవగాహన, నిర్మాణాత్మక, సంగ్రహణాత్మక మూల్యాంకనాల నిర్వహణ వాటి అమలు, ప్రశ్నపత్రాల తయారీలపై అవగాహన కలిగించిన తరువాత టీచింగ్ ప్రాక్టీస్ కమ్ ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహించాలి. ఈ సమయంలో ఛాత్రోపాధ్యాయులు వారు బోధించిన పాఠ్యాంశాలలో నిర్మాణాత్మక మూల్యాంకనం, సంగ్రహణాత్మక మూల్యాంకనం నిర్వహించి విద్యార్థి పొందిన మార్కులు గ్రేడులు నమోదు చేయాలి. దీని ఆధారంగా సి.సి.ఇ. రికార్డును రాయాలి.

**సి.సి.ఇ. రికార్డులోని అంశాలు :-**

**1. ప్రాథమిక సమాచారం**

(అ) : ఛాత్రోపాధ్యాయుని పేరు :
(ఆ) : బోధించిన తరగతి :
(ఇ) : విషయం :
(ఈ) : పాఠం / పాఠాలు :
(ఉ) : పాఠశాల పేరు :
(ఊ) : మార్గనిర్దేశన ఉపాధ్యాయుని / అధ్యాపకుని పేరు :

**2. పరిచయం :** (మూల్యాంకనం – మదింపు – నిరంతర సమగ్ర మూల్యాంకనం, భావనలు వివరించాలి)

3. (అ) మూల్యాంకనం ఆవశ్యకత :
(ఆ) మూల్యాంకనం ఎందుకు? :

**4. మూల్యాంకనం రకాలు :-**
(అ) నిర్మాణాత్మక మూల్యాంకనం – ప్రాముఖ్యత
(ఆ) సంగ్రహణాత్మక మూల్యాంకనం – ప్రాముఖ్యత

5. **మూల్యాంకనం సాధనాలు**
   (అ) నిర్మాణాత్మక మూల్యాంకనం సాధనాలు
   (ఆ) సంగ్రహణాత్మక మూల్యాంకన సాధనాలు

6. తరగతి వారీగా నిర్ధేశించిన సామర్ధ్యాలు / విద్యాప్రమాణాలు బోధించిన తరగతికి రాయాలి.

7. సంగ్రహణాత్మక మూల్యాంకనం ప్రశ్నపత్రం తయారి
   (అ) నిర్ధిష్ట ప్రశ్నపత్ర ప్రణాళిక (Blue Print)
   (ఆ) విద్యా ప్రమాణాల వారీగా భారత్వ పట్టికలు.

8. మూల్యాంకనా సూత్రాలు
   సాధారణ సూచనలు: అన్ని ప్రశ్నలకు సమాధానాలు, రాయాలి.

9. **ఫలితాల విశ్లేషణ :** విద్యార్థి పొందిన మార్కులు, గ్రేడులను బట్టి విద్యార్జనాస్థాయి, విద్యాప్రమాణాల సాధన, విద్యార్థుల ప్రగతి, మొత్తం తరగతి అభివృద్ధి, బోధనాకృషి – రాయాలి. సాంఖ్యాకశాస్త్రం వినియోగించాలి. దీని ఆధారంగా గ్రాఫ్ (దిమ్మచిత్రం, వృత్తరేఖా చిత్రం)లో చూపించాలి.

10. **ప్రతి స్పందనలు :** ఫలితాలను బట్టి కొత్త ప్రణాళికలు, బోధనా వ్యూహాలు, సవరణాత్మక బోధన వంటివి రాయాలి.

**ముగింపు :**

ఎలిమెంటరీ స్థాయి చదువు పూర్తయ్యేనాటికి పిల్లల అభ్యసన ఫలితాలను తెలుసుకోవాలి. దీనికి ఏకైక మార్గము మూల్యాంకనం. ఆధునిక మూల్యాంకనా విధానలలో చట్టబద్దమైనది, విద్యార్థుల సర్వతోముఖాభివృద్దిని అంచనా వేయగల్గినది. నిరంతర సమగ్ర మూల్యాంకనం పిల్లవాడి అభ్యసనాన్ని నిరంతర శారీరక, మానసిక, నైతిక, జ్ఞానాత్మక రంగాలలో మదింపు చేయడం ప్రస్తుతం పాఠశాల స్థాయిలో నిరంతర సమగ్ర మూల్యాంకనాన్ని నిర్వహిస్తున్నారు. ఇది బట్టీ విధానానికి స్వస్తి చెప్పి బోధనాభ్యసనంలో విద్యా ప్రణాళికలోని అంశాలన్నింటిని అమలు పరచి దీని ద్వారా వచ్చే ఫలితాలను విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమాజం అంతా అర్ధవంతంగా ప్రతిభావంతంగా వినియోగించుకోవడానికి తోడ్పడుతుంది. ఉపాధ్యాయులు మరింత సృజనాత్మకంగా బోధన చేయడానికి లోపనిర్ధారణ మాపములు రూపొందించుకోవడానికి సవరణాత్మక బోధనావ్యూహాలు రచించుకోవడానికి విద్యార్థులను నిపుణులైన అభ్యాసకులుగా మార్చడానికి నిరంతర సమగ్ర మూల్యాంకనం దోహదపడుతుంది. కాబట్టి ఉపాధ్యాయుడు మరింత శ్రద్ధతో, ఆసక్తితో పిల్లల అవసరాలును గుర్తించి ఈ నిరంతర సమగ్ర మూల్యాంకనాన్ని బోధనాభ్యసన ప్రక్రియల్లో భాగంగా నిర్వహించి, విద్యార్థులను భావిపౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషిచేయాలి.

**మూల్యాంకనం :–**

1. విద్యార్థి అభ్యసన ఫలితాల ఆవశ్యకతను తెలపండి?
2. నికష, పరీక్ష, మాపనం గురించి రాయండి?
3. మూల్యాంకనాన్ని నిర్వచించి, మూల్యాంకన ప్రయోజనాలు రాయండి?
4. మూల్యాంకన రకాలను వివరించండి?
5. మూల్యాంకనం లక్షణాలను వివరించండి?
6. నిరంతర సమగ్ర మూల్యాంకనం నిర్వచించండి?
7. లఘు పరీక్ష నిర్వహణకు గురించి రాయండి?
8. సంగ్రహణాత్మక మూల్యాంకనం అంటే ఏమిటి? దీని నిర్వహణను గురించి వివరించండి?
9. సంగ్రహణాత్మక మూల్యాంకనం భారత్వ పట్టికలు తెలపండి?
10. సంగ్రహణాత్మక మూల్యాంకనం నమూనా ప్రశ్నాపత్రాన్ని తయారుజేయండి?
11. విద్యార్థి సంచిత సమగ్ర ప్రగతి నివేదిక (క్యుములేటివ్ రికార్డు) లోని అంశాలను పేర్కొనండి?
12. సి.సి.ఇ. రికార్డు ఎలా రాయాలో వివరించండి?

**సంప్రదింపు గ్రంథాలు :-**


1. డి.ఎడ్. తెలుగ బోధన పద్దతులు – సంపాదకులు (1) డా॥ రామరాజు వెంకటేశ్వరరావు, (2) డా॥దహనం సాంబమూర్తి – తెలుగు అకాడమి – హైదరాబాదు

2. బి.ఎడ్. తెలుగు బోధన పద్దతులు – సంపాదకులు (1) ఎం. శివరత్నం రెడ్డి (2) డి.సాంబమూర్తి – తెలుగు అకాడమి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగు భాషా సంస్థ, హైదరాబాదు.

3. నిరంతర సమగ్ర మూల్యాంకనం – రాష్ట్ర, విద్య పరిశోధన శిక్షణ సంస్థ, హైదరాబాదు.

4. తెలుగు బోధన పద్దతులు – డా.డి. సాంబమూర్తి, నీల్ కమల్ పబ్లికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ – హైదరాబాదు.

5. తెలుగు బోధన పద్దతులు – డా.ఎ. కొమరయ్య, డా॥ ఎన్.సరోజ నీల్ కమల్ పబ్లికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాదు.

6. "బోధనాకర దీపిక" – కుందా భాస్కరరావు సైకాలజీ, మెథడాలజీ సమన్వయం గ్రంథం ప్రచురణ పి.వి.ఏజన్సీస్ గుంటూరు.

7. బి.ఎడ్.అధ్యాపన శాస్త్రం<br>తెలుగు బోధన పద్దతులు – సంపాదకులు డా.బి.సరోజన తెలుగు అకాడమి, హైదరాబాదు.

8. డి.ఎడ్. అధ్యాపన శాస్త్రం<br>తెలుగు బోధన పద్దతులు – సంపాదకులు, వై.కె.బ్రహ్మానందం. తెలుగు అకాడమి, హైదరాబాదు.

9. నవ వసంతం – 1 : తెలుగువాచకం – ఆరవ తరగతి (ప్రథమ భాష ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రచురణ)

10. నవ వసంతం – 2 : తెలుగువాచకం, ఏడో తరగతి (ప్రథమ భాష)

11. నవ వసంతం –3: తెలుగువాచకం – ఎనిమిదో తరగతి (ప్రథమ భాష) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రచురణ.

# 10 భాషోపాధ్యాయుల వృత్తిపరమైన అభివృద్ధి

## పరిచయం:

"భగవంతుని సృష్టిలోని లోపాలనుసైతం సరిచేసేవాడు ఉపాధ్యాయుడే" అంటాడు **గురజాడ** తన కన్యాశుల్కం నాటకంలో!

వృత్తిపరంగా ఉపాధ్యాయుని స్థానం అన్నింటిలో ఉన్నతమైనది. తనను భారతదేశ రాష్ట్రపతి అనడం కంటే మంచి ఉపాధ్యాయుడని పిలుపించుకోవడమే తనకెంతో ఇష్టమంటాడు డా. అబ్దుల్ కలామ్ అజాద్. ఉపాధ్యాయుడు ఆ స్థానాన్ని అందుకోవాలంటే వృత్తిపరంగా ఎంత అభివృద్ధిచెందాలో ఆలోచించవలసి ఉంది.

ఉపాధ్యాయుల నిరంతర వృత్తిపర అభివృద్ధి విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి, నవసమాజ నిర్మాణానికి బాటలువేస్తుంది. ఉపాధ్యాయులు నిరంతర అభ్యాసకులైతేనే విద్యలో గుణాత్మకత సాధ్యంకాదు. ఏ విషయమైనా విద్యార్థులు సమర్థవంతంగా అవగాహన చేసుకోవడానికి భాషోపాధ్యాయుల పాత్ర కీలకం. భాషా వికాసమే అన్ని వికాసాలకు పట్టుగొమ్మ అని మళ్లీ మళ్లీ చెప్పవలసిన పనిలేదు. భాషలో చక్కటి పట్టు, అభినివేశం లేనిదే ఏ ఉపాధ్యాయుడైనా రాణించలేడు. సృజనాత్మకతకు, రసాత్మకతకు భాషే మూలస్తంభం.

భాషోపాధ్యాయుల వృత్తిపర నైపుణ్యాల ఎదుగుదల విద్యార్థుల నాణ్యమైన విజ్ఞాన సముపార్జనకు, రసాస్వాదనకు దోహదం చేస్తుంది. భాషోపాధ్యాయుడు కేవలం భాషాబోధకుడేగాదు, సాంస్కృతిక వారసత్వ రథసారథికూడా! ఈ విషయంలో అతని పాత్ర అద్వితీయం. ఉపాధ్యాయుల

సమర్థవంతమైన బోధనకు వృత్తిపూర్వ, వృత్యంతర శిక్షణలు దోహదంచేస్తాయి. "ప్రతిది సులభమ్ముగా సాధ్యపడదు లెమ్ము, నరుడు నరుడగుట ఎంతో దుష్కరము సుమ్ము" అని గాలిబ్ గీతాల్లో దాశరథి అన్నట్లు ఉపాధ్యాయుడు తన శిష్యులను ప్రభావితం చేసే ఉత్తమ ఉపాధ్యాయుడుగా మారడం అతడు పొందే నిరంతర శిక్షణపైనే ఆధారపడి ఉంది.

ముఖ్యంగా భాషోపాధ్యాయులు తమ బోధనాపద్ధతులు ఎప్పటికప్పుడు నవీనీకరించుకోవడానికి విద్యాశాఖ నిర్వహించే దీర్ఘకాలిక, స్వల్పకాలిక, పునఃశ్చరణ తరగతులకు హాజరవ్వాలి. నిరంతరం ప్రతిస్పందించాలి. ఉపాధ్యాయులు తమకు తాము వికసింపచేసుకోవడమంటే విద్యార్థుల సంపూర్ణ సామర్థ్యాల పెంపుదలకు, సుస్థిరతకు దోహదం చేసినట్లే!

పరిపూర్ణంగా వికసించే ప్రసూనమే చక్కటి పండుగా మారుతుంది. ఫలప్రదమైన బీజాలు వెదజల్లుతుంది. మరో పది మొక్కలు మొలిపించి వంద పూవులు పూయిస్తుంది. ఉపాధ్యాయుడు అలాంటి జ్ఞానఫలంగా మారాలి. అలాంటి మార్పుకు దోహదంచేసే సోపానాలను గురించి ఈ అధ్యాయంలో చర్చిద్దాం.

## లక్ష్యాలు:

ఈ అధ్యాయం చదివిన తరువాత ఛాత్రోపాధ్యాయులు

- ఉపాధ్యాయులు నిరంతర అభ్యాసకులని అర్థంచేసుకుంటారు.
- ఉపాధ్యాయుల వృత్తిపూర్వ, వృత్యంతర శిక్షణల స్వరూప స్వభావాలను గురించి తెలుసుకుంటారు.
- ఉపాధ్యాయులకిచ్చే స్వల్పకాలిక, దీర్ఘకాలిక శిక్షణలు పునఃశ్చరణ తరగతుల ఆవశ్యకత, ప్రాముఖ్యతల గురించి అవగాహన పొందుతారు.
- ఉపాధ్యాయుల జ్ఞానాభివృద్ధిలో భాగంగా ఉన్నత విద్యాభ్యాసం ఆవశ్యకతను గుర్తిస్తారు.
- భాషోపాధ్యాయులు చిట్టిపరిశోధనలు, చర్యాత్మక పరిశోధనలు చేపట్టవలసిన ఆవశ్యకతను గుర్తిస్తారు.
- భాషోపాధ్యాయులు తమ వృత్తిపర నైపుణ్యాల పెంపుదలకొరకు ఉపాధ్యాయల సదస్సులు, సమావేశాలు, కార్యశాలల్లో పాల్గొనవలసిన అవసరాన్ని గుర్తిస్తారు.
- కవులు, రచయితలు, కళాకారులు, విద్యావేత్తలు, భాషావేత్తలతో చర్చలలో పాల్గొని అనుమానాలు, సందేహాలు నివృత్తిచేసుకుంటారు.

- సమాచార సాంకేతిక పరిజ్ఞానాన్ని సమగ్రంగా వినియోగించుకొని స్వయం అభ్యసనాభివృద్ధి సాధిస్తారు.
- విషయాధారిత సంఘాల్లో పాల్గొనవలసిన ఆవశ్యకత ద్వారా కలిగే ప్రయోజనాలు గుర్తిస్తారు.

## 10.1 ఉపాధ్యాయులు నిరంతర అభ్యాసకులే!

ఉపాధ్యాయుడు తన వృత్తినిర్వహణలో భాగంగా తాను బోధించే విషయాల పరిజ్ఞానాన్ని నిరంతర పఠన అభ్యసనం ద్వారా పెంపొందించుకోవాలి. ఉపాధ్యాయుడు తన బోధనలో మూర్తిమత్వ సాధనలో ఉన్నత శిఖరాలు చేరాలంటే విస్తార పుస్తకపఠనాన్ని మించిన నిరంతర శిక్షణ లేదు. ఈ విధంగా చేసినప్పుడే ఉపాధ్యాయుడు తన రోజువారీ బోధనా కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించుకోగలుగుతాడు. వృత్తిపరమైన సంతృప్తి పొందగలుగుతాడు. నిరంతర సాధనపై దృష్టి నిలపని ఉపాధ్యాయులు తమ విధి నిర్వహణను సమర్థవంతంగా నిర్వహించలేరు. అందువలన ఉపాధ్యాయుడు తమ వృత్తిపర్యంతం నిత్యఅభ్యాసకునిగా ఉండాలి. "A Teacher is a permanent Student" ఉపాధ్యాయుడు నిరంతర అభ్యాసకునిగా ఉండాలంటే కింది చర్యలు చేపట్టాలి.

- విద్య ఆధారాలను గుర్తించి పరిశీలనద్వారా వివిధ నూతన విషయాలను తెలుసుకోవాలి.
- అంతర్జాలం, గ్రంథాలయ వనరులద్వారా లభించే నూతన జ్ఞానాన్ని అందుకోవాలి.
- నిరంతర ప్రయోగశీలి, అన్వేషణాశీలిగా ఉండాలి.
- ప్రభుత్వ సౌజన్యంతో విద్యాశాఖ నిర్వహించే వృత్యంతర ఉపాధ్యాయ శిక్షణలకు తప్పనిసరిగా హాజరుకావాలి. శిక్షణపట్ల అనుకూల దృక్పథం కలిగియుండాలి.
- విద్యార్థుల విద్యాసాధనను పెంపొందించడానికి నిత్యనూతన బోధనాపద్ధతులను, వ్యూహాలను ఉపాధ్యాయుడు వినియోగించుకోవాలి.
- హేతుబద్ధమైన ఆలోచనలతో, ప్రగతిశీల భావాలతో కొత్తదనానికి స్వాగతం పట్టేవాడై ఉండాలి.
- వృత్యంతర శిక్షణలను అంతర్జాలం ద్వారా పొందగలిగే నైపుణ్యాలను సంతరించుకోవాలి.
- స్వీయ ప్రేరేపిత వృత్యంతర శిక్షణలు పొంది వాటిని అమలుపరిచి విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందిస్తున్న ఉపాధ్యాయులకు ప్రభుత్వం పదోన్నతిలో బదిలీలలో ప్రాధాన్యత కల్పించి ప్రోత్సహించాలి.

- భాషోపాధ్యాయులు నిరంతర వృత్తిపర అభివృద్ధిలో భాగంగా నియామకంనాటి వృత్తిపరమైన సాధారణ కనీస అర్హతలేకాకుండా దూరవిద్య ద్వారా, స్వయం అధ్యయనం ద్వారా అదనపు విద్యార్హతలు ఆర్జించాలి.
- ఉపాధ్యాయులు తమ విషయ వేదికలు (Subject Forums) స్థాపించి వాటిద్వారా పరస్పర జ్ఞాన వినిమయాన్ని చేసుకోవాలి. అందులో భాగంగా Blogs, Website లను ఏర్పాటుచేసుకోవచ్చు.

## 10.2.1 వృత్తిపూర్వ శిక్షణలు:

వృత్తి పూర్వక ఉపాధ్యాయవిద్య అనగా ఉపాధ్యాయులకు వృత్తిలో చేరకముందు ఇవ్వబడే శిక్షణ లేదా విద్య. ఉదాహరణకు ఇంటర్మీడియట్ తరువాత అర్హులైన విద్యార్థులకు "డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్"లో శిక్షణ. భాషోపాధ్యాయులకు పండిత శిక్షణ కళాశాలలు, సమగ్ర విద్యాశిక్షణ కళాశాలల్లో పండిత శిక్షణ కోర్సులలో భాషాబోధన పద్ధతుల్లో శిక్షణ ఇస్తారు. భాషలో పట్టభద్ర స్థాయి విద్య మరియు భాషాబోధనా పద్ధతుల్లో బి.ఇడి. లేదా పండిత శిక్షణ పొందిన ఉపాధ్యాయులను భాషోపాధ్యాయులుగా నియమిస్తారు. వృత్తిపూర్వక ఉపాధ్యాయ శిక్షణను పూర్తిచేసుకున్న వారికి ఉపాధ్యాయ వృత్తిని చేపట్టే సన్నద్ధతను కల్పించడమే అంతిమ లక్ష్యం. ఉపాధ్యాయడికి వృత్తి, ప్రవృత్తి ఒకటే కావాలి.

## 10.2.2 వృత్యంతర శిక్షణా కార్యక్రమం:

వృత్తిలో చేరిన తరువాత ఉపాధ్యాయులు పొందే శిక్షణను వృత్యంతర శిక్షణ అంటారు. ఉదాహరణకు జాతీయ విద్యావిధానం సాధనకు (1986) రూపకల్పన చేయబడిన APPEP, DPEP, SOPT, UEE, CLIP, CLAP, LEP మొదలైనవన్నీ వృత్యంతర శిక్షణ కార్యక్రమాలే. (వీటిని వివరంగా మీ అధ్యాపకులను అడిగి తెలుసుకోండి) ఉపాధ్యాయుడు ఒక నిరంతర అభ్యాసకునిగా ఉన్నప్పుడే అతని వృత్తిపర వికాసం సాధ్యమవుతుంది.

విద్యాబోధన నిరంతర పరిణామ శీలం. ఎప్పటికప్పుడు వచ్చే సాంకేతిక విద్యాపరమైన మార్పులను అవలోకనం చేసుకొని ఉపాధ్యాయుడు తన జ్ఞానాన్ని, నైపుణ్యాలను నవీనీకరించుకోవాలి. ఇందుకు దోహదపడేదే వృత్యంతర శిక్షణ. ఈ శిక్షణలు నియతంగా ప్రభుత్వ పథకాలైన సర్వశిక్షా అభియాన్, రాష్ట్ర మాధ్యమిక శిక్షా అభియాన్‌లు. ఈ పథకాలు జిల్లా స్థాయి సంస్థలు డైట్‌లు, ప్రాంతీయ స్థాయి సంస్థలు సి.టి.ఇ., ఐ.ఎ.ఎస్.ఇ.,లు రాష్ట్రస్థాయి సంస్థలైన ఎస్.సి.ఇ.ఆర్.టి., ఎస్.ఐ.ఇ.టి. మరియు జాతీయ స్థాయి సంస్థలైన ఎన్.సి.ఇ.ఆర్.టి., ఎన్.యు.ఇ.పి.ఎ. వారిచే

శిక్షణలు ఇవ్వబడతాయి. అనియతంగా కూడా ఉపాధ్యాయుడు తనంతట తాను గ్రంథాలయ, అంతర్జాల వనరుల ద్వారా స్వయం శిక్షణ పొందవచ్చు. విద్యార్థులను స్వయం అధ్యాపకులుగా మార్చవచ్చు.

## 10.2.3 వృత్యంతర శిక్షణ - వివిధ కమీషన్‌ల సూచనలు - వాటి ఆచరణ

స్వాతంత్ర్యం పూర్వం నుండి స్వాతంత్ర్యానంతరం వరకు వివిధ కమీషన్‌లు, కమిటీలు ఇచ్చిన సూచనల మేరకు ఉపాధ్యాయ విద్యలో ముఖ్యంగా వృత్యంతర శిక్షణలో ఈ కింది మార్పులు అవసరమైనవి.

- వృత్యంతర శిక్షణను ఉపాధ్యాయుల నిరంతర వృత్తిపర వికాసంలో భాగంగా గుర్తించి ప్రాధాన్యతనివ్వాలి.
- వృత్యంతర శిక్షణా కార్యక్రమాలు మూస పద్ధతిలో కాకుండా కృత్యాధార (Activity Oriented) మరియు భాగస్వామ్య విధానం (Participatory Approach) లో జరగాలి.
- ఉపాధ్యాయులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే విధంగా వృత్యంతర శిక్షణ విధానాలు రూపొందించబడాలి.
- వృత్యంతర శిక్షణ ఉపాధ్యాయుల వృత్తిపర స్థాయి (Professional Standard)లను పెంచేదిగా ఉండాలి.
- ఉపాధ్యాయులు వృత్యంతర శిక్షణలో భాగంగా స్వల్పకాలిక, దీర్ఘకాలిక, పునఃశ్చరణ తరగతులద్వారా మారుతున్న గతిశీలక బోధనా విధానాలు (Dynamic Teaching Methods) అవగాహన చేసుకొని నిరంతరంగా వృత్తిపర నైపుణ్యాలను పెంపొందించుకోవాలి.

## 10.2.4 అధ్యయనం:

"జీవితం ఒక కల కాదు - ఒక కళ". అలాగే అధ్యయనం కూడా ఒక కళ. అది పాఠ్యపుస్తకం కావచ్చు, కవిత్వం కావచ్చు, నవల కావచ్చు. కథల సంకలనం కావచ్చు. దేనిని చదవడానికైనా ఒక నిర్ణీతమైన పద్ధతి, ఒక క్రమం ఉంటుంది. చదవడం కేవలం చదవడం కోసమే కాకుండా చదివిన దానిని అవగాహన చేసుకొని సంగ్రహించి ప్రతిబింబించాలి. "The Teacher

should be a reflective Teacher" అధ్యయనం అంటే కేవలం ఒకటి రెండు పేజీలు చదివి వదిలివేయడం కాదు. చివరిదాకా లోతుగా విశ్లేషిస్తూ, ఆస్వాదిస్తూ చదవాలి. కాబట్టి ఉపాధ్యాయుడు కాలానుగుణంగా వస్తున్న మార్పులను అవగాహన చేసుకుంటూ నిత్య అధ్యయనశీలిగా మార్పులకు అనుగుణమైన బోధనా విధానాలు అమలుచేసి విద్యార్థులను నిష్ణాతులుగా తయారుచేయాలి.

## 10.2.5 భాషోపాధ్యాయులు - సాహిత్య గ్రంథాల అధ్యయనం:

ఉపాధ్యాయ వృత్తిపూర్వక శిక్షణలో భాగంగా విద్యార్థులు విద్యా మనోవిజ్ఞానశాస్త్రం, విద్యాపోకడలు, విద్యానిర్వహణ, ఇతర బోధనా విషయాలతోపాటు సాహిత్య గ్రంథాల పఠనం కూడా ఎంతో అవసరం. దీనిని భాషాసంబంధ అధ్యాపకులు తమ తరగతి గది బోధనాభ్యసన ప్రక్రియలో భాగంగా అమలుపరచవచ్చు. సాహిత్య పఠనంలో భాగంగా ఛాత్రోపాధ్యాయులచేత చిన్న కథలు, నవలలు, జీవిత చరిత్రలు, నాటకాలు, వివరణాత్మక పాఠాలను చదివించి వారి భావాలను వివరణలను ప్రతిబింబాత్మక ఆలోచనలను ఇతర ఛాత్రోపాధ్యాయులతో పంచుకునే వీలుకల్పించాలి. ఇందుకు ప్రతి సాహిత్య అంశాన్ని ఏ విధంగా చదివించాలో ఈ కింద వివరించడమైనది.

సాధారణంగా ఉపాధ్యాయులు సాహిత్యం గురించి తరగతి గదిలో చర్చించడానికి అంతగా ఇష్టపడరు. అందుకు ప్రబల కారణం వారిలో సాహిత్యపరమైన అభిరుచి, సౌందర్యరసాస్వాదన, విస్తార పుస్తకపఠనం లేకపోవడమే. పది జాషువా పద్యాలు రాని వాడు జాషువా కవిని గురించి ఏమి చెప్పగలడు? తరగతి గదిలో అల్లసానిని వల్లించలేని భాషోపాధ్యాయుడు ఆ మహాకవి అల్లికలోని జిగిబిగిని గురించి ఏం వర్ణించగలడు? గురజాడ కన్యాశుల్కం నాటకాన్ని ఆస్వాదింపలేని అధ్యాపకుడు ఆ నాటకం గొప్పతనాన్ని ఎలా ఉగ్గడించగలడు? శ్రీశ్రీ కవితాత్మను అభిమానించలేని వ్యక్తి ఆయన 'దేశ చరిత్రలు' గేయ ఖండికను ఎలా బోధించగలడు. సాహిత్యంపట్ల, కవులపట్ల ఆరాధనాభావం కలిగిన అధ్యాపకులకే అది సాధ్యం. ఎక్కువమంది భాషోపాధ్యాయులు వృత్తికోసం తప్ప సాహిత్యంపట్ల సరైన అభిరుచి లేకనే వివిధ కవులను గురించి చర్చించడానికి ఇష్టపడరని ఒక భాషాపరమైన పరిశీలనలో తేలింది.

అందులోనూ సాహిత్యంలో ఆధునిక ప్రక్రియగా అవతరించి పరాకాష్ఠకు చేరుకున్న గొప్ప తెలుగు కథలను గురించి ఎక్కువగా చర్చించడం జరగదు. కాని నిశితంగా పరిశీలిస్తే చిన్న కథలలో "కొండ అద్దంలో కొంచమై కనిపించినట్లు" ఎన్నో సామాజిక, సాహిత్య విలువలు దాగివున్నాయి. వీటిని చదివించి, చర్చించడంద్వారా క్లిష్టమైన ఆలోచనా నైపుణ్యాలను పెంపొందించవచ్చు. మంచి కథానికలు నైతిక వ్యక్తిత్వ వికాసానికి కరదీపికలు! అవి ఉపాధ్యాయులను,

విద్యార్థులను పఠనంలో మునిగేటట్లు చేస్తాయి. విద్యార్థులలో ఊహాత్మక ఆలోచనా నైపుణ్యాలను పెంపొందిస్తాయి. కుందా బాస్కరరావు ఇటీవల ప్రచురించిన 'మనసు వాకిళ్ళు' కథ కృత్యాధార బోధనకు ఆనందదాయక అభ్యసనానికి అద్దం పడుతుంది. స్వేచ్ఛ అనే అమూర్త విషయాన్ని ప్రతీకాత్మకంగా జ్ఞానేశ్వరి అనే ఉపాధ్యాయిని చిన్నారులకు ఎలా బోధించిందో గమనించవచ్చు.

## 10.2.6 ఉన్నత విద్యాభ్యాసం:

భాషోపాధ్యాయులు భాషలో స్నాతకోత్తర విద్య మరియు భాషాశాస్త్రంలో డిప్లమో మరియు పి.హెచ్‌డి. కూడా చేసి ఉన్నత విద్యను పొంది, నూతన బోధనా విధానాలు తరగతిగదిలో అమలుచేసి విద్యార్థులలో ఆశించిన అభ్యసన ఫలితాలు సాధించాలి. ముఖ్యంగా ఎమ్.ఇడి. మరియు విద్యా మనోవిజ్ఞానశాస్త్రం, సామాజిక భాషాశాస్త్రాలకు అర్హతలు కూడా పొందాలి. బహుబాషిత్వం (Multilingualism) భాషా విద్యాప్రణాళిక (Language across Curriculum) లాంటి నూతన భాషాబోధన అంశాలపై విస్తృత పరిశోధనలు చేపట్టాలి. విద్యార్థులను ఆ దిశగా ప్రోత్సహించి బహుభాషలలో విద్యార్థులను నిష్ణాతులనుచేసి వివిద రంగాల్లో విద్యార్థులు రాణించేట్లు కృషిచేయాలి. భాష ఒక మహాసముద్రమైతే దానిపై సురక్షితంగా ప్రయాణించే మరఓడలవంటివి వివిధ బోధనా విషయాలు.

## 10.2.7 పరిశోధనలు చేపట్టడం - చర్యాత్మక పరిశోధన

ఉపాధ్యాయుల వృత్తిపర వికాసానికి తోడ్పడే మరొక అంశం చర్యాత్మక పరిశోధన (Action Research). ఉపాధ్యాయుడు తరగతిగదిలో తాము నిత్యం ఎదుర్కొనే బోధనాభ్యసన సమస్యలకు పరిష్కార మార్గాలను కనుక్కోవాలి.

చిన్న పిల్లలు భాషను ఎలా నేర్చుకుంటారు?, సహజ అభ్యసన సన్నివేశాల ద్వారా భాషను ఎలా నేర్పాలి?, భాషలో కృత్రిమత్వం లేకుండా ఎలాంటి చర్యలు చేపట్టాలి?, పిల్లల్లో భాషపట్ల మక్కువ ఎలా పెంచాలి? వంటి అంశాలపై చర్యాత్మక పరిశోధనలు చేపట్టాలి.

## 10.2.8 సభలు, సమావేశాలు - కార్యశాలల్లో పాల్గొనడం:

సాహిత్య సభలు, సమావేశాలు, భాషాబోధనకు సంబంధించిన కార్యశాలల్లో పాల్గొని వారి అభిప్రాయాలను క్రోడీకరించి రోజువారీ తరగతి బోధనాభ్యసన వ్యూహాలను వృద్ధిచేసుకోవడానికి తమ వృత్తిపరమైన నైపుణ్యాల ఆధునీకరణకు ఉపయోగించుకోవచ్చు. ఉపాధ్యాయులు విద్యా సదస్సులకు హాజరై తమ అభిప్రాయాలను వెలిబుచ్చడం ద్వారా ఇతరుల అభిప్రాయాలను స్వీకరించడం ద్వారా  జ్ఞానవినిమయం ఇచ్చిపుచ్చుకునే అలవాటు అభివృద్ధి చెందుతుంది. చర్చకు చోటివ్వడం

వలన ఉపాధ్యాయుడు భాషాపరంగా విశాల భావాలను పెంపొందించుకుంటాడు. కాలానుగుణంగా మానవుడు వివిధ ప్రాంతాలకు విస్తరించేకొద్దీ మూల భాషనుండి అనేక కొత్త భాషలు పరిణామం చెందాయని, అందుకే ప్రపంచంలోని వేల భాషల్లోని పదజాలంలో కొంతమేర సామ్యత కనిపిస్తుందని ప్రాపంచిక వికాసానికి, మానవ ప్రగతికి అన్ని భాషలు తోడ్పడ్డాయనే విశ్వజనీన సత్యాన్ని గ్రహిస్తాడు.

## 10.2.9 విద్యాగోష్ఠులు - సాహిత్య చర్చలు:

ఉపాధ్యాయులకు తమ తమ వృత్తిపరమైన కౌశలాలను మరియు వారి వికాసం కొరకు నిర్వహించబడే వివిధ రకాల విద్యాగోష్ఠులు, సెమినార్‌లు, సదస్సులు ఎంతగానో ఉపకరిస్తాయి. వీటి ద్వారా ఉపాధ్యాయులు తమ భాషాపరమైన పరిజ్ఞానాన్ని, బుద్ధికుశలతను పెంపొందించుకోవచ్చు.

విద్యాగోష్ఠులు లేదా సెమినార్లలో పాల్గొనడం ద్వారా ఉపాధ్యాయుడు తమ జ్ఞానాన్ని ఎప్పటికప్పుడు నూతన విషయాలతో పరిపుష్టి చేసుకుంటూ విద్యార్థుల్లో జ్ఞాన నిర్మాణం కల్పించడానికి దోహదపడతారు. గోష్ఠులలో అనేకమంది విద్యావేత్తలు తమ అనుభవాలనుపరస్పరం పంచుకోవడం ద్వారా వృత్తిపర సామర్థ్యాలను అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంది. విద్యార్థుల్లో ఆశించిన స్థాయిలో అభ్యసనం జరగాలంటే ఉపాధ్యాయుడు నిరంతర విద్యార్థిగా ఉండాలి. విద్యాగోష్ఠులు, సాహిత్య సమావేశాలు, చర్చల్లో పాల్గొనడం ద్వార ఆయా విషయాలపట్ల సంపూర్ణ అవగాహన విశ్లేషణాత్మక దృష్టి, హేతువాద దృక్పథం, సృజనాత్మక కల్పనాశక్తి ఏర్పడతాయి. విద్యార్థుల జ్ఞానసముపార్జనకు నిచ్చెనలు వేయగలుగుతారు.

అదేవిధంగా విద్యాభివృద్ధికిగాను ప్రభుత్వాలు అనేక ఉద్యమాలు, కార్యక్రమాలు చేపడుతుంది. ఈ మధ్యకాలంలో జాతీయ విద్యా విధానం 1986 నేపథ్యంలో ఎన్.సి.ఎఫ్-2005 సిఫార్సుల ప్రకారం కృత్యాధార బోధనా విధానం, ఆనందదాయక అభ్యసనం, తదితర అభ్యసన ప్రక్రియలపై ఎక్కువ దృష్టిసారించి ఉద్యమంలాగా విద్యారంగంలో ఒక విప్లవాన్ని తీసుకొచ్చింది. శిశుకేంద్రీకృత విద్యకు పట్టం కట్టింది. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు సమ భాగస్వామ్యంతో గుణాత్మక విద్యను సాధించే దిశగా అడుగులు వేస్తున్నారు.

నూతన మూల్యాంకనా విధానాలు, సమాజ పరిస్థితులకు అనుకూలమైన ఆయా ప్రాంతాల సాహిత్య, సాంస్కృతిక, సామాజిక నేపథ్యాలకు అనుగుణంగా పాఠ్యప్రణాళికలు, సిలబస్‌లు రూపొందించే ఉద్యమంలో ఉపాధ్యాయులు కూడా తమ వంతు పాత్రను పోషించవలసి ఉంటుంది. ఉపాధ్యాయులకు స్వయం అధ్యయనం, స్వీయ విశ్లేషణ, అనుకూల దృక్పథం,వృత్తిపట్ల నిబద్ధత, గౌరవం మరియు వృత్తిపరమైన నియమావళి పెంపొందింపజేయడానికి విద్యాగోష్ఠులు, సదస్సులు మరియు విద్యా ఉద్యమాలు దోహదం చేస్తాయి. వీటన్నిటిని మించి ఉపాధ్యాయునిలో స్వీయప్రేరణ,

సాహిత్యాభిరుచులు ఉన్నప్పుడే విద్యాగోష్ఠులు సఫలీకృతం అవుతాయి.

## 10.2.10 విషయ నిపుణులు, కవులు, కళాకారులతో చర్చలు:

భాషోపాధ్యాయులు స్థానికంగా అందుబాటులోనున్న భాషావిషయ నిపుణులకు వివిధ సాహితీ ప్రక్రియల సృష్టికర్తలైన కవులతో, రచయితలతో తరచు చర్చిస్తూ నూతన అంశాలను తెలుసుకొని తరగతిగది బోధనలో వినియోగించి విద్యార్థులకు అర్థవంతమైన అభ్యసన వాతావరణాన్ని కల్పించాలి. వారిని పాఠశాలకు కూడా ఆహ్వానించి మాట్లాడించవచ్చు. పాడించవచ్చు. సాహిత్య సృజనశీలి, సంగీత కళానేర్పరి, చిత్రకళా నేర్పరి, నాట్యకళా నేర్పరి కావడమే కాకుండా ఈనాటి మనోవిజ్ఞానశాస్త్రంలో గార్డెనర్ తన "బహుళ ప్రజ్ఞాసిద్ధాంతం" లో చెప్పినట్లు అష్టప్రజ్ఞల సమాహారంగా ఉపాధ్యాయుడు మారితే ఇక ఆ పాఠశాల పూవులతోటే. అష్టప్రజ్ఞలు అంటే ఏమిటో తెలుసుకోవడానికి మీ సైకాలజి పాఠ్యగ్రంథాన్ని పరిశీలించండి. ముఖ్యంగా ఇటీవల ప్రత్యేకంగా, ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ చర్చనీయాంశంగా ఉన్న ప్రారంభ అక్షరాస్యత (Early literacy) గురించి బహుభాషిత్వం గురించి (Multilingualism) గురించి విద్యాప్రణాళికలో విస్తరించిన భాష గురించి భాషావేత్తలతో చర్చల్లో పాల్గొని భాషోపాధ్యాయులు తమ బోధనా వ్యూహాలుగా, వనరులుగా పై అంశాలను వినియోగించి విద్యార్థులను బహుభాషావేత్తలుగా, సాహిత్యాభిమానులుగా, సృజనశీలురుగా రూపొందించవచ్చు. నేటి బాలలే రేపటి పౌరులు అన్నట్లుగా ఈనాటి పిల్లలే రేపటి గురజాడలు, శ్రీశ్రీలు, జాషువాలు! వారిలోని సృజనాత్మకతను వెలికితీయవలసిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉంది.

మన ఆలోచనలను, అనుభవాలను, పరిశీలనలను లిఖితపూర్వకంగా వ్యక్తీకరించడం, చక్కని పదాలను, చక్కని క్రమంలో పెట్టడమే రచన. ఉపాధ్యాయులు, కాబోయే ఉపాధ్యాయులు పర్యాలోచక పత్రికలు (Reflective Journals) రాయడం వల్ల వారి తీపి జ్ఞాపకాలు సంరక్షింపబడతాయి. రచనా సామర్థ్యం మెరుగవుతుంది. జ్ఞానేంద్రియాలకు పదును పెట్టినట్లు అవుతుంది. అందుచేత పిల్లల దైనందిన అనుభవాలను వారి మధుర స్మృతులను డైరీలుగా రాయడం అలవాటుచేస్తే వారు భవిష్యత్తులో చక్కటి కవులుగా, కథకులుగా తయారుకావచ్చు. ఏ పుట్టలో ఏ పాముందో అన్నట్లుగా, ఏ బాలుడిలో ఏ కవి 'భాస్కరుడు' ఉదయిస్తాడో, ఏ బాలికలో ఏ 'మొల్ల' కవయిత్రి మొగ్గతొడుగుతుందో!

## 10.2.11 సాంకేతిక పరిజ్ఞాన వినియోగం (అంతర్జాల దృశ్యశ్రవణ సామగ్రి డిజిటల్ సామగ్రి):

నేడు ప్రపంచ సాంకేతిక పరిజ్ఞానం ఆకాశపు అంచులు తాకింది. మానవ మేథ ప్రపంచ

సరిహద్దులు చెరిపేసుకుంటూ అభివృద్ధి చెందుతోంది. ఇప్పటి ఆధునిక సాంకేతికతను వినియోగించుకొని అద్భుత విజయాలు సాధించిన సంస్థలు, దేశాలు మన ముందున్నాయి. ఈనాటి సాంకేతిక విప్లవ ఫలితాలకు అనుగుణంగా అంతర్జాలాన్ని ఉపాధ్యాయులు ఉపయోగించుకున్నప్పుడు తమ జ్ఞానాన్ని బోధనా కౌశలాన్ని అత్యంత వేగవంతంగా స్వీయ అభ్యసన పద్ధతిలో మెరుగుపరుచుకోవచ్చు. అంతర్జాలం ఒక విజ్ఞానఖని. బహుశా ఇందులో ఉపాధ్యాయలకు అవసరమైన విషయాలు, తమ సమస్యలకు సమాధానాలు సులువుగా దొరుకుతున్నాయి. అంతే కాకుండా తమ బోధనా పద్ధతులను మెరుగుపరచుకునే అంశాలు కూడా ఇందులో లభిస్తాయి.

నేడు అనేక పుస్తక భాండాగారాలు డిజిటల్ లైబ్రెరీలుగా మారుతున్నాయి. ఇంట్లోనో, స్కూల్లోనో కూర్చుని ఆన్‌లైన్ ద్వారానే మనకవసరమైన అనేక గ్రంథాలు చదువుకోవచ్చు. అందుకే ఎలక్ట్రానిక్ యుగంలో మారుతున్న పరిస్థితుల దృష్ట్యా భాషోపాధ్యాయుడు అంతర్జాలాన్ని కూడా తరగతి గదిలో వినియోగించుకోగల అవసరం ఎంతైనా ఉంది.

## 10.2.12 విషయాధారిత సంఘం (Subject Forum):

ఉపాధ్యాయులు తమ వృత్తిపర వికాసం కొరకు విషయాధారిత సంఘాలలో తప్పనిసరిగా సభ్యులై వృత్తిపరంగా తాము ఎదుర్కొంటున్న విద్యాపరమైన సమస్యలపై చర్చించాలి. తమ అనుభవాలు, అభిప్రాయాలను పంచుకొని తరగతి గదిలో అమలుచేసి విద్యార్థులకు నాణ్యమైన అభ్యసన ప్రక్రియలు కల్పించాలి.

భాషోపాధ్యాయులు నేడు అందుబాటులో ఉన్న సమాచార సాంకేతిక విప్లవం ద్వారా ఆవిర్భవించిన వాట్సప్, ఫేస్‌బుక్‌ల్లాంటివి, సామాజిక మాధ్యమాలను వినియోగించుకొని వృత్తిపర అభివృద్ధికి చక్కని ప్రణాళికలు తయారుచేసుకోవాలి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలో అన్ని సబ్జెక్టుల ఉపాధ్యాయులను ఆంధ్రప్రదేశ్ ఈ-నాలెడ్జ్ ఎక్స్చేంజ్‌లో సభ్యులుగా స్వచ్ఛందంగా చేర్పించి వివిధ విద్యా విషయక అంశాలపై అందరు ఉపాధ్యాయులు అవగాహన పొందే వేదిక APeKX రూపకల్పన చేసింది.

## ముగింపు:

'పురాణమిత్యేవన సాధుసర్వం' అన్నది ఆర్యోక్తి. అంటే ప్రాచీనదైనంత మాత్రాన ప్రతిది మంచిదని కాదు. అలాగని ఆధునికమైనంత మాత్రాన అంతా చెడ్డదని కాదు. వృత్తిపరంగా గాని, ప్రవృత్తిపరంగా గాని ఉపాధ్యాయుడి ఆలోచనా విధానం 'కొత్త పాతల మేలుకయిక క్రొమ్మెరుంగులు

చిమ్మగా' అన్నట్లుగా ఉండాలి.

మారుతున్న కాలంలో,మారుతున్న సాహిత్య,సామాజిక అవసరాలను అర్థంచేసుకొని భాషోపాధ్యాయుడు తనకు తాను ఆధునికీకరణ చెందుతూ, ప్రాచీనతలోని మంచిసాంప్రదాయాలను కాపాడుకుంటూ, ఎప్పటికప్పు పరిణామం చెందుతన్న ప్రపంలో ప్రగతివాద దృక్పథంలోని కొత్త విలువలను సంతరించుకొంటూ ముందడుగు వేయాలి. జ్ఞానాత్మక, భావావేశ మానసిక చలనాత్మక రంగాల నేపథ్యంలో విద్యార్థులను పరిపూర్ణులుగా చేయాలి.

మనోవిజ్ఞానవేత్త పియాజే చెప్పినట్లు "ఏ రంగంలోనైనా వెనుకటివారు చెప్పిందే వేదమని గుడ్డిగా నమ్మకుండా ప్రయోగాలద్వారా, అన్వేషణద్వారా, సరికొత్త విషయాలను కనిపెట్టి నవసమాజాన్ని నిర్మించే సృజనశీలురుగా మన బిడ్డలను మార్చాలి". వృత్తిపరంగా ఉపాధ్యాయుడిపై మోపబడిన ఈ గురుతర బాధ్యతను ప్రతివారు గుర్తించి తమ బోధనాభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచుకోవాలి.

## మూల్యాంకనం

1. "ఉపాధ్యాయులు నిరంతర అభ్యాసకులే" ఎందువల్ల?
2. వృత్తిపూర్వక శిక్షణ ప్రాముఖ్యతను తెలపండి.
3. వృత్యంతర శిక్షణా కార్యక్రమాల ప్రయోజనాలు ఏవి? కొన్ని కార్యక్రమాల పేర్లు రాయండి.
4. "Teacher should be a reflective teacher" వివరించండి?
5. భాషోపాధ్యాయులకు సాహిత్య గ్రంథాల అధ్యయనం ఆవశ్యకత ఏమిటి?
6. కవులు, కళాకారులతో చర్చలవలన కలిగే ప్రయోజనం తెల్పండి?
7. ఆధునిక యుగంలో భాషోపాధ్యాయుడికి సాంకేతిక పరిజ్ఞానం ఎలా ఉపకరిస్తుంది?

## పరామర్శ గ్రంథాలు


1. పగటికల (దివాస్వప్న) – గిజూబాయి
2. డి.ఇడి. అధ్యాపకుల కరదీపిక – ఎ.పి.ఎస్.సి.ఇ.ఆర్.టి.
3. భాష – ఆధునిక దృక్పథం – ఉపాధ్యాయుల కరదీపిక – సర్వశిక్షా అభియాన్–2007
4. అభ్యసనాభివృద్ధి కార్యక్రమం –ఉపాధ్యాయుల కరదీపిక – సర్వశిక్షా అభియాన్–2009
5. బి.ఇడి. ఛాత్రోపాధ్యాయుల కరదీపిక – తెలుగు – ఎ.పి.ఎస్.సి.ఇ.ఆర్.టి. 2015
6. "Wings of Fire" Dr. A.P.J. Abdul Kalam